


# సందర్భ

## (వ్యాస సంపుటి)

## సుధామ



# సందర్భ

## (వ్యాస సంపుటి)

## సుధామ

**స్నేహిత స్రవంతి**
జి. 12, సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాదు-500 036

# SANDARBHA

(A COLLECTION OF ESSAYS)

by

**SUDHAMA**

**© SUDHAMA**
98492 97958
sudhama60@yahoo.com

FIRST EDITION : 25.11.2020

Title Cover :
**Snehith Allamraju**

For Copies :
**A.USHA RANI**
Snehith Sravanti
G.12, Sadath Towers
Padmavathi Apartments
Saleemnagar Colony, Malakpet
Hyderabad-500 036 (Telangana)
Cell : 98482 76927 / 98492 97958
&
All leading Book Shops

DTP & Layout :
MANU GRAPHICS
Chikkadpally, Hyderabad
Cell: 93938 34050

Printed at :
SATISH GRAPHICS
Chikkadpally, Hyderabad-20
Cell: 88851 44422

PRICE : **Rs. 300/-**



చిరకాల కుటుంబ స్నేహితులు

అత్యంత ప్రియతములు

డాక్టర్ భట్టిప్రోలు సీతారామ సత్య ఆంజనేయశర్మ

డాక్టర్ భట్టిప్రోలు దుర్గాలక్ష్మీ ప్రసన్న

దంపతులకు

ఆత్మీయంగా -

# సాహిత్య చరిత్రకు ఒక వెలలేని చేర్పు...

**సు**ధామ గారి 'సందర్భ'కు స్వాగతం!

ఐదు దశాబ్దాల సాహిత్య ప్రస్థానంలో గడించుకొన్న సంస్కృతీ సంప్రదాయ సంస్కార విజ్ఞతలు – సుధామ గారి ఉన్నత వ్యక్తిత్వానికి రూపరేఖల్ని కూర్చాయి, వన్నెలూ కూర్చాయి. బహుముఖీనమైన ప్రతిభ అనగానే ఒక పడికట్టు పొగడ్తని సంకేతించుకొనే దుఃస్థితి(!) వచ్చేసింది కానీ, సుధామగారికి ఇది అలా అన్వయించరాదు! ఆయన అధ్యయన పటిమ, అనుభవశాలీనత్వం వంటి విశేషగుణగణం – 'బహుముఖీన ప్రతిభ' – అనే పదప్రయోగం (స) (అ) సార్థకమైన ప్రయోగమని ఋజువు చేసుకుంటుంది. ముందుమాటకు ఉన్న పరిమితి వలన ఒక్క మనవి. ఈ పుస్తకం చివరన ఉన్న సుధామ గారి Bio-data ని ముందుగానే చదవండి. ఈ జాతీయకవి, బహుపురస్కారగ్రహీత – బహుపార్శ్వయుత ప్రతిభని అద్దంలో కొండలా దర్శించండి. అందులో లిఖితం కాని వ్యక్తిత్వ కోణాల్ని తెలుసుకున్న వారికి – 'సుధా(మ)యోక్తి' ప్లస్ స్నేహశీలం ప్లస్ వారిలోని సమాదర చిత్తప్రవృత్తీ బాగా తెలుసు. అలాంటి అదృష్టం పొందినవారిలో నేనూ ఒకణ్ణి కనుక ఈ విన్నపం. ఇప్పటికిది ముందుమాటకి వెనుకనున్నమాట!

* * * *

ఈ 'సందర్భ' 76 సాహిత్య వ్యాసాల బృహత్గ్రంథం. ఇక్కడ 'బృహత్' పదం రాశికి మాత్రమే కాక వాసికీ అన్వయించేది. అంతకంత అన్వర్థమైనదీనూ! కాల్పనిక సాహిత్య సృజనకారునికంటే వ్యాసకర్త అచ్చమైన కష్టజీవి. ఒక విషయాన్నో, గ్రంథాన్నో, రచననో ఆసాంతం చదవటంతో ఈ కష్టం మొదలు. దాన్ని ఆకళించుకోవటం, జీర్ణించుకోవటం, ఆపైన ఆకర గ్రంథాల్ని సంప్రదించటం, ఉద్దిష్ట అంశాలకు తనవైన అభిప్రాయాల్నీ, ప్రతిపాదనల్నీ చెప్పటానికి

మేధోమథనం చేయటం – ఇలా ఆ ప్రక్రియ అంతా కష్టభూయిష్టమే. ఇంత శ్రమనీ, నిబద్ధతతో బాధ్యతగా చేసి తన వ్యాసాన్ని ఒక authentic దర్శనంగా అందించే చింతకుడు సుధామగారు.

'సందర్భ'లో కొన్ని పరిచయస్పర్శలూ, కొన్ని పరామర్శహాసాలు, కొన్ని సమీక్షా సంభాషలూ, కొన్ని విమర్శావిశ్లేషణల పాఠాలూ, ఇంకా కొన్ని మనఃపూర్వక నివాళులూ ఉన్నాయి. వెరసి ఇవన్నీ ఒక సారస్వతానుగామి 'పద'కదలికలు!

'మరువకూడని బంగారిమామ' అన్నారు కొనకళ్లని. పరిచయ పునశ్చరణ వ్యాసం. 'కదిలేదీ, కదిలించేదీ' – కవిత్వమేకదా! దాని ప్రేరకశక్తినీ, చోదకశక్తినీ ఉగ్గడిస్తూ – పి.వి.నరసింహారావు, కాళోజీల ఉదాహరణల్ని ఇచ్చారు. మంచి 'లో' చూపునందించేవ్యాసం. తానుగా ఒక అభిప్రాయాన్ని ప్రకటించే పట్టుల్లో సుధామగారి రచనా విధానం నిష్కర్షగా ఉంటుంది.

"తమ కవిత్వం సామాజిక స్పృహగలదనీ, సమాజంలో మార్పు తెచ్చేదనీ, సామాన్య మానవుడికి పట్టంకట్టి సమసమాజ స్థాపనకీ, సోషలిజానికీ సోపానాలు వేసేదనీ డంబాలు కొట్టుకునే ఎందరో కవిపుంగవుల కవిత్వపంక్తులు సామాన్యుడి మాట ఎందుకు? సాటికవికే సూటిగా అర్థంకాని బుకాయింపు కవిత్వమే ఇవాళ టన్నులుగా చెలామణిలో ఉంది. కవి హృదయం వేరనీ, వారి స్థాయి వేరనీ పాఠకుడు కవిత్వాన్ని అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలే తప్ప, పాఠకుడికి అర్థమయ్యే స్థాయికి తాము దిగితే – అది కవిత్వమే కాదనీ సంభావించే కవిత్వావరణం, సాహిత్యావరణం ఇవాళ పెరిగిపోతోంది కనుకే– శ్రేయోదాయకమైన, ప్రయోజనదాయకమైన సాహిత్యానికి జనం దూరమైపోతున్నారు..." (కదిలేది కదిలించేది పేజీ:80)

చెప్పవలసింది చెప్పే తీరాలన్న వాంఛనీయమైన నిబద్ధత సుధామగారి వ్యాసరచనలో చాలా చోట్ల గమనిస్తాము. ఈ నిరపేక్ష దృష్టి వారి విమర్శకు వివేచనని ప్రోదిచేస్తున్నది. ఇంకా ... 'రసవాయువు ద్రవించే ఘనకవిత్వ కుమారుడు' అంటూ బి.ఎస్.ఎమ్.కుమార్ గ్రంథ సమీక్షలో, 'అశ్రద్ధ శ్రాద్ధకవితావార్షికలు' అంటూ ఆ వార్షికల్లో నెరసుల్ని చెప్పిన వ్యాసంలో, 'తెలుగుకు వెలుగేది'

వంటి సంవేదనాత్మక రచనల్లో, 'కవితాత్మలోకంలో హీనమైన పాపం' అంటూ దేశభక్తి Vs సాహిత్యం ఆనుపానుల్ని తవ్విచూపిన వ్యాసంలో... ఇంకా ఇందులోని ఇలాంటి పరిశీలనాత్మక రచనల్లో నిఖార్సయిన, నిష్పాక్షికమైన, ఆరోగ్యకరమైన, సాహిత్యావసరమైన–సుధామగారి ప్రతిపాదనల్నీ, అభిప్రాయాల్నీ చూస్తాము.

'కవిత్వం ఒక ఆత్మఘోష ; విమర్శ ఒక అన్వేషణ' అన్నారు డా॥సుమనశ్రీ. 'సందర్భ'లోని – కవిత్వంలో భావచిత్రవాదాన్ని గురించి రాసిన 'పాట నావ సాగిపోయింది' వ్యాసం, 'మో' కవిత్వం గురించి చెప్పిన 'పరిణత ప్రయాణం నిషాదం' వ్యాసం, 'అక్షరాలలో కవిత్వం మాటలకందని వ్యక్తిత్వం' అని మాదిరాజు రంగారావు గారి కవిత్వం పైని వ్యాసం వంటివి – సుధామలోని పరిశీలనాదృష్టికీ, అధ్యయన గాఢతకీ, విశ్లేషణా సమర్థతకీ దృష్టాంతాలుగా నిలుస్తాయి.

శతక సాహిత్యం మీద, శ్రీ పదచిత్రరామాయణంపైని, సామయిక కవిత్వం గురించీ, అభిలాషలో సాహిత్య అస్తిత్వంమీద – సుధామగారి వ్యాసాలు విషయపరంగా విలువైనవి, ఆలోచనీయమైనవి.

గురజాడ, పానుగంటి, శ్రీశ్రీ, మధునాపంతుల, కుందుర్తి, అవసరాల రామకృష్ణ రావు, బాపు, వేటూరి, ఆత్రేయ, పోతుకూచి, శ్రీకాంతశర్మ, కె.బి.లక్ష్మి వంటి ప్రముఖుల సాహితీవరివస్యని సమీక్షాపూర్వకంగా అంచనావేస్తూ రాసిన వ్యాసాలు ముప్పైకి పైనే ఉన్నాయి – ఈ 'సందర్భ'లో. ఆయా ప్రముఖుల వ్యక్తిత్వం, సాహిత్య వ్యక్తిత్వం – ఈ రెంటినీ సమన్వయించి, వారి వారి ప్రత్యేకతల్ని, వారు సాహిత్యానికి అందించిన సొంత 'ముద్ర'ని పాఠకునికి చేరవేయటం సుధామగారి రచనాశిల్పానికి గల ఒక మెరుపు! శిల్పంలో ఒక భాగంగా ఎత్తుగడని చెబుతాము. కొన్ని వ్యాసాల ఎత్తుగడ ఉత్కంఠస్ఫోరకంగా ఉండి ఆలోచనాత్మకంగా ఉంది. 'రసవాయువు ద్రవించే ఘన కవిత్వ కుమారుడు' శీర్షికలోనే ఒక సొబగు ఆకర్షిస్తుంటే, ఈ వ్యాసం ఎత్తుగడ ఇంకా భావభరితంగా మొదలైంది...

" 'బ్రహ్మపదార్థం' అనే మాట ఒకటుంది. సృష్టికర్త బ్రహ్మ అనుకుంటున్నప్పుడు, ఆ బ్రహ్మ సృష్టించిన గొప్ప పదార్థం 'మనిషి' తప్ప మరేదీ కాదు. మనిషి పూర్తిగా అర్థమవుతాడా? ఎదుటివాడికే

కాదు, తనకు తాను కూడాను! అందుకే 'నిన్ను నువ్వు తెలుసుకో' అనేదే గొప్ప అన్వేషణ! అది నిరంతర క్రియ...! ".

'కవిత్వం ఓ జ్వర చికిత్సాలయం', 'సూర్యదీప్తుల కవిరాజు' వంటి వ్యాసాల్లో కూడా ఈ పరిణత రచనా శైలిని చూస్తాము.

'సందర్భ'లోని కొన్ని వ్యాసాలు అపూర్వమైనవీ, అపురూపమైనవీ. ఆకాశవాణి గురించి రాసిన మూడు వ్యాసాలూ, తెలుగుభాషా పరిరక్షణ గురించి రాసిన వ్యాసాలు, కూచిపూడి నృత్యం కమనీయతని చెప్పిన వ్యాసం – ఈ కోవకి చెందినవి. బాల సాహిత్య పరిమళమూ వీచింది ఒక వ్యాసంలో.

'సందర్భ'లోని స్మృతికృత వ్యాసాల్లో కొన్నిట వెలువడిన జ్ఞాపకాలూ, సమయసందర్భాలూ, విలక్షణ సన్నివేశ విశేషాలూ– సాహిత్యపరంగా, సామాజికంగా చాలా ఆవశ్యకమైనవి. వీటిని ఎంతో ఉచితజ్ఞతతో 'రికార్డ్' చేసి మంచి పనిచేశారు సుధామగారు. పోతుకూచి సాంబశివరావుగారిపై రాసిన వ్యాసం, గాయకుడు రామకృష్ణ స్మృతిధార వంటివి ఈ కోవకి చెందిన రచనలు.

సుధామగారు విలువలతో రాజీపడని వ్యాసకర్త అని నిక్కచ్చిగా తెలుపుతోంది 'సందర్భ'. సంఘంలాగానే, సాహిత్యమూ ఇవ్వాళ కల్లోల సుడిగుండంలాగానే ఉన్నది. వెలువడుతున్న గ్రంథాల్ని సమీక్షించాలన్నా సారస్వత విషయికమైన మౌలికరచన చేయాలన్నా–వ్యాసకర్త అసిధారావ్రతానికి పూనుకున్నట్లే అవుతోంది. ఈ వాతావరణంలో – సాహిత్య ప్రాంగణాన్ని శాస్త్రీయ దృక్పథంతో వీక్షించి, సంయమనంతో, సమాజానికి ఆరోగ్య ప్రోత్థితమైన రచనల్ని అందిస్తున్న 'పొద్దుచాలని సారస్వతీయుడు' – సుధామ గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

'సందర్భ'ని చదవటం–ఉత్తమాభిరుచి గల సాహితీపరులు కొత్త వెలుగు వెంట పయనించటమేననే హామీనిస్తూ,

శుభాకాంక్షలతో...

**– విహారి**

# నా మాట

నా సాహిత్య రచనలను సంపుటీకరించే సంకల్పంలో భాగమే ఈ వ్యాససంపుటి. నా పధ్నాలుగవ ఏట అచ్చులో తొలిరచన చూసుకోవడం మొదలుగా, నేను అర్ధశతాబ్దికి పైగా రాసిన వ్యాసాలను–'సందర్భ', 'కాలం వెంట కలం' అనే రెండు సంపుటాలుగా భద్రపరుచుకునే క్రమంలోని – ఈ సంపుటిలోని వ్యాసాలన్నీ అధికశాతం వివిధ సందర్భాలలో పత్రికలవారు నా చేత అడిగి రాయించుకున్నవే. ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ప్రజాశక్తి, వార్త, చుక్కాని, ప్రజాతంత్ర, ఉదయం, చినుకు, ఈనాడు, తెలుగువెలుగు, పాలపిట్ట వంటి పత్రికల వారందరికీ ఇందుకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. కొన్ని వ్యాసాలు ప్రత్యేక సంచికలకై ఆయా వ్యక్తులు, సంస్థలు కోరగా రచించినవి. ఇలా ఈ వ్యాసాలు అనేక సామయిక సందర్భాలలో రూపొందినవే. ఆయా రచనా కాలాలు వ్యాసాల చివరలో పొందుపరచడమైంది.

ఒకే అంశంపై పలుసందర్భాల్లో అవసరార్థం ఒకటి రెండు వ్యాసాలు రాయవలసి వచ్చినపుడు కొన్ని సంగతులు చర్వితచర్వణం కావడం అనివార్యమే! అలాగే పునరుక్తంగా అన్పించే కొన్ని భావాలు – ఆ అంశంపట్లా, ఉదాహృతమయ్యే కొటేషన్ల పట్లా గల స్వీయ అనురక్తికీ, గాఢతకూ నిదర్శనాలుగా మాత్రమే గ్రహించగలరని భావిస్తున్నాను. ఆయా అంశాలను సహృదయ విమర్శకులు గణించి, మన్నన చేయగలరని కోరుతున్నాను. వృత్తిరీత్యా నేను ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారి నైనా, నేనొక పత్రికారచయితగా తెలుగుసాహితీ జగత్తులో గుర్తింప బడడానికి నన్నొక కాలమిస్టుగా సమాదరించడం మాత్రమే కాక, ప్రత్యేకించి ఈ సామయిక వ్యాసాలను రాసే అవకాశాలను నాకు కల్పించిన పత్రికా సంపాదకులకు నా నమస్సుమాలు. శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రి, శ్రీ పి.విజయబాబు, శ్రీ గుడిపాటి, శ్రీ కె.పి.అశోక్‌కుమార్, శ్రీమతి ఎ.ఎన్.లక్ష్మి, శ్రీమతి జె.శ్యామల, శ్రీమతి అంజన వీరంతా సంపాదకులుగా వుండి నాచేత సంతరింపచేసిన వ్యాసాలు ఈ సంపుటిలో

చేర్చడం నాకు ఆనందదాయకం. అలాగే తొలిరోజులలో నా వ్యాసరచనలను ప్రోత్సహించిన కీర్తిశేషులు గోపాలచక్రవర్తి, కాశీనాథుని సుబ్రహ్మణ్యం, పోతుకూచి సాంబశివరావు గార్లు నాకు స్మరణీయులు.

నా సాహిత్యవ్యాసాలు గ్రంథరూపేణా వెలువరించమని సూచించి, ఎంతగానో ప్రోత్సహించినవారు, ప్రేరకులయినవారు ప్రముఖ కవి, కథకులు, విమర్శకులు, సాహితీవేత్త శ్రీ విహారి (జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి) గారు. వారి ప్రోద్బలమే లేకుంటే ఈ యత్నం సాధ్యమయ్యేదే కాదు. నాపట్ల ఎంతో ఆదరాభిమానాలతో తమ అమూల్యమైన పీఠికను సంతరించి ఇచ్చినందుకు శ్రీ జె.ఎస్.మూర్తి (విహారి) గారికి నా మనఃపూర్వక ధన్యవాదాలు.

'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అన్నారు. మా కుటుంబ మిత్రులు, అత్యంత ఆత్మీయులు అయిన డాక్టర్ దంపతులు-శ్రీ భట్టిప్రోలు సీతారామ సత్య ఆంజనేయశర్మ, శ్రీమతి దుర్గాలక్ష్మీప్రసన్నగారు. ప్రముఖ చారిత్రకులు, కవి, రచయిత అయిన కీ।శే। బి.ఎస్.ఎల్ హనుమంతరావు గారి తమ్ముడు మాత్రమే కాక, స్వయంగా సాహిత్యాభిలాషి, అన్నగారి రచనలకు ముద్రిత గ్రంథాలుగా ప్రాచుర్యం కల్పించిన సౌజన్యమూర్తి, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సి.జి.హెచ్.ఎస్ డాక్టర్‌గా పేరొందినవారు ఆంజనేయశర్మ గారు. వారి శ్రీమతి దుర్గాలక్ష్మీప్రసన్న హిందీసాహిత్యంలో డాక్టరేట్ పొందిన సృజనశీలి మాత్రమే కాక ఆకాశవాణిలో మా సహోద్యోగి. నా శ్రీమతి ఉషకు ప్రాణస్నేహితురాలు. వారిరువురూ ఆకాశవాణిలో శిక్షణాసంస్థ అసిస్టెంట్ డైరెక్టర్లుగా వన్నెవాసికెక్కారు. డా॥ఆంజనేయశర్మ గారు, ప్రసన్నగారు మాపట్ల చూపే ప్రేముడికి కృతజ్ఞతా చిహ్నంగా 'సందర్భ' వ్యాససంపుటి వారికి నా కూరిమి ఉపాయనం.

ఇక బాల్యంలోనే నా సాహిత్యాభిరుచికీ, రచనా వ్యాసంగానికీ ప్రేరణ కల్పించింది అన్నయ్య శ్రీ అల్లంరాజు రాధాకుమార్. 'రాధాయి' అన్నపేరున తను రచనలు చేస్తూండేవాడు. సిండికేట్‌బ్యాంక్ ఉద్యోగిగా, రాధాస్వామీ సత్సంగసేవాతత్పరునిగా తలమునకలయిన బాధ్యతలతో

తన రచనావ్యాసంగం కొంత మందగించినా, ఇప్పటికీ గొప్ప సాహిత్యాభిలాషి, అడపాదడపా కలంసారించే అగ్రజుడు. శ్రీ అల్లంరాజు రాధాకుమార్ (రాధాయి) అన్నయ్యకూ, మా ప్రియమైన వదిన అల్లంరాజు (ఆకొండి) వసంతకూ నా 'కాలంవెంట కలం'– కానుకనిచ్చే అవకాశం కలిగినందుకు ఆనందిస్తున్నాను. మా వదిన వసంత సోవియట్‌యూనియన్ పత్రికా సంపాదకులుగా చేసిన కీ।శే। ఆకొండి రామకృష్ణగారి రెండో అమ్మాయి. విద్యారంగంలో మాంటిసరీ పాఠశాల వనస్థలి ప్రిన్సిపాల్‌గా మా వదిన ఎందరి పిల్లల భవిష్యత్తుకో బాటలువేసిన విదుషి. ఇలా 'కాలం వెంట కలం' నా అన్నావదినలకు ఆత్మీయ అక్షర కానుక.

నా రచనలను సంకలనం చేయడం గురించీ, పుస్తకాలుగా ముద్రించడం గురించీ పట్టుబట్టి వెన్నంటి అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న నా జీవన సహచరి ఉషకూ, తన చిత్రకళానైపుణ్యంతో ముఖచిత్రాలను అందిస్తున్న మా కుమారుడు చిరంజీవి స్నేహిత్‌కూ, సమాదరిస్తున్న కోడలుపిల్ల చి॥సౌ॥ స్రవంతికీ నా ప్రేమాభివందనాలు.

ఈ వ్యాససంపుటి గ్రంథాలను ముద్రించడంలో ఎంతగానో సహకరించిన మను గ్రాఫిక్స్ శ్రీ కుదుపూడి భాస్కర్ గారికీ, సతీష్ గ్రాఫిక్స్ శ్రీ సతీష్‌గారికీ, పుస్తకరూపశిల్పి, మిత్రుడు తాళ్లపల్లి మురళీధర్‌గౌడ్ గారికీ, ముద్రాపకులకూ అందరికీ నా కృతజ్ఞతలు. ఈ నా వ్యాససంపుటికి ఎప్పటివలెనే పాఠకసమాదరణను ఆశిస్తూ, అభిలషిస్తూ–

సదా మీ

25.11.2020 **సుధామ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| *1.* | తెనుగు సాహిత్యము-శతకవాఙ్మయము | *15* |
| *2.* | సామయిక కవిత్వం | *21* |
| *3.* | సామయిక కవిత్వం గుణస్వభావాలు | *25* |
| *4.* | కవిత్వం ముంగిలిలో - సంక్రాంతి భావనల ముగ్గు | *30* |
| *5.* | కవితా వి(లోకన)కారి- ఉగాది | *40* |
| *6.* | నాకు నచ్చిన ప్రసంగకళ | *51* |
| *7.* | కవితాత్మలోకంలో హీనమైన పాపం | *58* |
| *8.* | కవిని గుర్తించే కాలం | *61* |
| *9.* | కవిత్వం సంకుచితం కాదు | *65* |
| *10.* | ఎన్నిక(విత)ల కాలం | *68* |
| *11.* | క్రీనీడలూ-చిరు సాహిత్య దీపాలు | *72* |
| *12.* | కొత్త కవితాయుగం(ధరులు) | *75* |
| *13.* | కదిలేది, కదిలించేది | *78* |
| *14.* | అమ్మ మన పెన్నిధి | *81* |
| *15.* | తెలుగుకు వెలుగేదీ? | *90* |
| *16.* | నేన్ భీ టెల్గూ మాట్లాడ | *98* |
| *17.* | ప్రసార భాషగా తెలుగు | *101* |
| *18.* | అభిలాషలో సాహిత్య అస్తిత్వం | *107* |
| *19.* | అశ్రద్ధ శ్రాద్ధ కవితా వార్షికలు | *112* |
| *20.* | ఆకాశవాణి... వార్తలు చదువుతున్నది... | *119* |
| *21.* | అంతా ఎఫ్.ఎం మయం | *127* |
| *22.* | పదాల పదనిసలు | *136* |
| *23.* | కూచిపూడి కమనీయత | *144* |
| *24.* | ఉగ్గు'బాల సాహిత్యం' ఒగ్గేసినట్లేనా? | *148* |

25. కవిరాజ విరాజితం 151
26. రుబాయీల తెలుగు కవి సమ్రాట్టు 154
27. చదవతగిన పుస్తకం: కొడిగట్టిన సూర్యుడు 163
28. కవిత్వం ఓ జ్వర చికిత్సాలయం 168
29. పాలపిట్ట పుస్తకం 172
30. (క)వే మన గోపితో కాసేపు 175
31. అక్షరాలలో కవిత్వం – మాటలకందని వ్యక్తిత్వం 180
32. ధర్మవిస్తారకమయ్యు, సత్యశుభదాయకమయ్యును..
'కలం' కళల 'శాస్త్రి' 183
33. విహారి శ్రీ పదచిత్ర రామాయణం 188
34. అరవైఏళ్ల స్త్రీ కవిత్వ అస్తిత్వ రాగం 198
35. కవితల 'కాంతి కవాటం' 201
36. సూర్య దీప్తుల కవిరాజు 205
37. ప్రయాణంలో పద నిశ్వాసలు 208
38. మేలిమి భావాల 'కొలిమి' 211
39. రసవాయువు ద్రవించే ఘన కవిత్వ కుమారుడు 215
40. 'రెక్క' విచ్చిన చాణక్య నీతి 218
41. పద్యా రాధ(క)శ్రీ 221
42. పానుగంటి విశిష్టత 224
43. ఇతిహాస కావ్యనాయిక శిష్ట్లా వారి 'జెనీబు' 229
44. ఒక చారిత్రకుని ప్రణయ హృదయం 234
45. కదిలి కదిలించిన కవి 237
46. ఆధునిక కవితకు గురజాడ వ్యక్తత్వం 240
47. వెలుగు జాడ... గురజాడ 249
48. శ్రీశ్రీ మహాప్రస్థానం అనంతం 251
49. కీర్తి శేషుడు శేషేంద్ర 256
50. సినీ కవి సినారె 260

51. నార్ల చిరంజీవి అభ్యుదయ ప్రణయానికి కొమ్మలు రెమ్మలు 265
52. సినారె స్మృతి వీచికలు 270
53. సాహితీ కంఠాభరణం సినారె 280
54. సామాన్యుల 'మాన్యకవి' కుందుర్తి 284
55. నిర్భయ కవి రంధి సోమరాజు 287
56. పాటనావ సాగిపోయింది 293
57. పరిణత ప్రయాణం 'నిషాదం' 298
58. మనోజ్ఞ సాహితీమూర్తి శశాంక 303
59. సాహిత్య స్నేహ సుగంధాల అద్దేపల్లి 309
60. అస్తమించిన అనుభూతిపూర్ణ జీవి 316
61. మరువకూడని బంగారి మామ 322
62. సాహితీభీష్ముని కవిత్వభావరథం 325
63. (వి)ద్వానా శాస్త్రి హాస్య(సం)విధానం 337
64. ఆబాలగోపాల సాహిత్య కరుణారస సింధువు 341
65. కమనీయ కథన శిల్పి పెద్దిభొట్ల 344
66. సంపెంగలూ – సన్నజాజుల సాహితీమూర్తి అవసరాల 348
67. సాహిత్య క్షేత్రాన తెలుగు కథానికా రథసారథి! 352
68. వి'చారి'స్తేనాకవి 355
69. 'జర్నలిజం' అపురూప: డా॥కె.బి.లక్ష్మి 360
70. సృజనలోకస్ఫూర్తి శ్రీ పి.ఆర్.రామచంద్రరావు 364
71. "పోయినోళ్ళందరూ మంచోళ్ళు,
ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపిగురుతులు" 369
72. దివికేగిన 'పాటమాలి' 376
73. గాయకులు "రామకృష్ణ" స్మృతిలో 380
74. తెలుగు బొమ్మ తెల్లబోయింది! 384
75. బాపు.. ఓ ఉత్తరం! 388
76. విద్వత్ సంపాదక 'ఆంధ్రీ'మయ మూర్తి 394

* * *

# 1 తెనుగు సాహిత్యము - శతకవాఙ్మయము

**వి**స్తృత పరిశీలనావశ్యకత దృష్టి కలిగి వుండవలసిన విషయాలపట్ల పరిసీమిత కాలంలో పరిచయవివరణకు పూనుకోవడం సాహసంతో కూడిన వ్యవహారం. శతకవాఙ్మయ విషయమూ అంతే. అఆలు దిద్దనేర్చిన అయిదేండ్ల బాలుని నుండి షష్ట్యబ్ది మహోత్సవం నెరపుకొన్న ముదుసలివాని వరకు తెలిసియో తెలియకయో శతకములతో ఎంతో కొంత సాన్నిహిత్యం వుండి వుండగలదనడం నిర్హేతుకం కాజాలదు. పండితులను, పామరులను, బాలురను, వృద్ధులను, స్త్రీలను, సామాన్య ప్రజానీకమును సర్వేసర్వత్ర సమస్థాయిలో రంజింపచేయగల శక్తి శతకములకే చెల్లింది. అందుకొక ముఖ్యకారణముకూడా కలదు. శతకములు పురాణమువలె కథాప్రధానములు కావు; ప్రబంధములవలె వర్ణనా ప్రధానములు కావు; గేయకృతుల వలె సంగీత ప్రధానములు కావు. ద్విపదలవలె పొడుగుపాటివి కావు. ముక్తకములుగా ఏకసూత్రతతో, సుసంస్కృతములైనా సులభగ్రాహ్యంగా వుండేవి. శతకములలో కవి యాత్మానుభవము ప్రకటితమవుతూ వుంటుంది. కాబట్టి అవి హృదయముల కత్యంత సన్నిహితములై ఆంతరంగిక స్వానుభూతిని కలిగిస్తూంటాయి.

ఈ శతక వాఙ్మయము క్రీ.శ. 12వ శతాబ్ది నుండి ప్రారంభం అయింది. ఈ నూత్న ప్రక్రియారంభకులు వీరశైవ కవులనే చెప్పుకోవాలి Orginal Contribution to Telugu From Veerasyavas is Satkam అన్న వాస్తవాన్ని అంగీకరించాల్సిందే.

సంస్కృతంలో ఈ శతకప్రక్రియ లేదా? అంటే తెలుగుశతక లక్షణాలతో కూడి లేదు కానీ, నూరుశ్లోకాలతో కూడిన సంస్కృత శతకాలు వున్నాయి. అమరుక శతకం, భర్తృహరి శతకం వంటివి. కానయితే తెలుగులోవలె మకుట నియమముతోనూ, ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగానూ సంస్కృతభాషలో శతక వాఙ్మయం లేదనాల్సి వస్తుంది.

‘శివతత్వసారము’లో శివా! అనే మకుటంతో గల పద్యాల సంఖ్య ఎక్కువగా వుండడం వలన అదే తొలిశతకం అంటారు. అది తొలిశతకం కాకపోయినా అందులో సూచ్యమైన ఆ పద్ధతి శతక ప్రక్రియకు నాందిపలికి వుంటుందనయినా చెప్పుకోవాలి. అంతకుముందే మల్లికార్జున పండితారాధ్యులవారి మల్లికార్జున శతకం ఒకటి వున్నదనే ప్రతీతికూడా వుంది. శతకలక్షణములయినటువంటి సంఖ్యా, మకుట, వృత్త, రస, భాషా నియమాలన్నింటితో కూడిన తొలి తెలుగుశతకము ఆ “శ్రీగిరి మల్లికార్జున శతకమే” అని చెప్పగలం.

కానయితే లభ్యమైన తొలి తెలుగుశతకం పాల్కురికి సోమనాథుని యొక్క వృషాధిపశతకమే. సోమనాథునియొక్క బహుభాషా వైదగ్ధ్యాన్ని సైతం వెల్లడించే ఆ శతకం ప్రసిద్ధమైనది.

ఉపలబ్ధములైన తెలుగు గ్రంథములలో కేవలం సంఖ్యయే ప్రధానంగా తీసికొన్నచో తక్కిన ప్రబంధాది శాఖ లన్నింటి కంటా శతక వాఙ్మయ శాఖయందున్న సంఖ్యయే అధికమని ఘంటాపదంగా చెప్పవచ్చు. సంస్కృతంలో శతకవాఙ్మయ సంఖ్య శతసంఖ్యను కూడా మించవేమో అంటే అతిశయోక్తి వుండదు. ద్రవిడ, కన్నడ, మళయాళ భాషలలో శతకరచన చాలా విరళము. కన్నడభాషలో శతకము మనభాషకంటే ముందుగా అవతరించినా ఆ భాషలో దానికి ప్రాధాన్యమేలేదు. సంస్కృతానువాదములైన శతకముల సంఖ్య కూడా శతమును మించవు. కాబట్టి వేలకు మించిన తెలుగు శతకాలన్నీ స్వతంత్ర రచనలనియే నిర్ధారణ చేయవచ్చు. ఇవి అచ్చంగా తెనుగుముద్ర కలిగి దేశీసాహిత్యానికి సంబంధించినవి.

శతకలక్షణాలు గమనించినట్లయితే తొలుతది సంఖ్యా నియమము. ఈ నియమం సంస్కృతంలో గల స్తోత్రాల నుండి గ్రహింపబడింది. ఈ ఆచారాన్ననుసరించి శతకాల్లో నూరుగాని, నూటెనిమిది పద్యాలుగాని వుంటాయి. ఇక రెండవ లక్షణం మకుటం. శతకం ప్రతిపద్యం చివర వుండే నామసంబోధనకు మకుటం అని పేరు. ‘సుమతీ’, ‘విశ్వదాభిరామ వినురవేమ’, ‘శ్రీకాళహస్తీశ్వరా’, ‘బసవా బసవా బసవా వృషాధిపా’ వంటి వన్నమాట. సాధారణంగా ఈ మకుటాలన్నీ సంబోధనా విభక్తిలోనే వుంటాయి (అపవాదంగా ఏవేనీ 1, 2 శతకములుంటే యుండవచ్చు). మకుటంలో కూడా పర్యాయపదాలు వాడడం జరగదు. ఇక వృత్తనియమము– ఒకే వృత్తంతో,

ఒకే ఛందస్సులో రచన సాగడం వృత్తనియమం అన్నమాట. ఇక రసనియమం. శతకములో ఏ రసం ప్రతిపాదితమవుతోందియో అదియే అన్ని పద్యాల్లో ప్రపంచితం కావాలి కాని నడుమ మరో రసప్రవేశం జరగకూడదు. భక్తి, శృంగార, వీరరసం, హాస్యరసం ఏ రసంతో శతకారంభం జరిగిందో ఆ ఏకరసాన్వితమయ్యే చివరంటా సాగాలి. ఇక భాషానియమం అంటే కావ్యభాష అనే. 'చంద్రశేఖరా' అనే ఒక శతకం మటుకు గ్రామ్యభాషలో చంపకోత్పలమాలికలతో రచింపబడింది.

క్రీ.శ.12వ శతాబ్దంలో తెలుగులోవెలసిన శతకాలన్నీ శైవమత సంప్రదాయికములే. తర్వాతతర్వాత 'వేంకటేశ్వర శతకం' మొదలయిన విష్ణుభక్తి సంబంధియైన శతకాలు కూడా వెలువడ్డాయి. శతకములు చాలవరకు చంపకోత్పల మత్తేభ శార్దూల వృత్తాలతోనో; ఆటవెలది, తేటగీతులలోనో రచింపబడినవే. నీతిశతకములు చాలా భాగం కందములలో వెలువడ్డాయి. పేరెన్నికగన్న 'వేమన శతకం' ఆటవెలదులతో కూడినది.

ఇక శతకములలో భక్తి లేక స్తుతి శతకములు, శృంగార శతకములు, నీతిశతకములు, వేదాంతశతకములు, హాస్యశతకములు, చారిత్రక శతకములు, జీవిత చారిత్రక శతకములు, స్వీయచరిత్ర శతకములు, వ్యాజనిందాస్తుతి శతకములు, కథాశతకములు, సమస్యాశతకములు, నిఘంటు శతకములు, మానవస్తుతి శతకములు, అనువాద శతకములు, అచ్చతెనుగు శతకములు, చాటుశతకములు, జంతు సంబోధన శతకములు, సామాన్య విషయ శతకములు అని విభాగాలున్నాయి. పై విభాగాన్ని బట్టి అణువు నుండి బ్రహ్మాండందాకా, తృణం మొదలు మేరువు వరకు సమస్త విషయాలను శతకములలో ప్రపంచింపవచ్చునని తెలుస్తుంది. వీనివలన దేశ, కాల, పాత్రల మూలమున వ్యక్తమగు రాజకీయ, సాంఘిక సారస్వత జాతీయ సంస్కృతి విశేషము లెన్నింటినో మనం గ్రహించగలం.

భక్తిశతకాలు చాలా వెలువడినాయి. త్రిమూర్తులలో బ్రహ్మను గూర్చిన శతకములు లేనట్లున్నవి. సూర్యుని గురించి, శని గురించి కూడా శతకాలున్నాయి. భక్తిశతకాల్లో ఆధునాతన కాలంలో కవిశేఖరులు వడ్డాది సుబ్బారాయుడిగారి 'భక్తచింతామణి' శతకానికి మించింది లేదు. ఇది 1931 నాటికే 32 ముద్రణలు పొందింది. ఇక శృంగారశతకాల మాటకొస్తే ఇవి తొలుత భక్తిశృంగార పరాలే.

త్రిపురాంతకుని–అంబికాశతకం శివభక్తిశృంగారాన్ని, తాళ్ళపాక అన్నమాచార్యులవారి–వెంకటేశ్వర శతకం కృష్ణభక్తి శృంగారాన్ని ప్రపంచించినవి. ఆ వెనుక కేవలం శృంగార రసైకములగు శతకాలు వెలువడ్డాయి. సంయోగ, విప్రలంభ శృంగారశతకాల్లో విప్రలంభాలు మరీ ఎక్కువ. తెలుగుశతకాల్లో నీతిశతకములు నిరవద్యమైన స్థానాన్ని గడించాయి. ఇవి అన్నీ బహుసులభశైలితో, చక్కని ఉపమలతో, జాతీయములతో చదువరుల, ముఖ్యముగా పిల్లల మనస్సులను హత్తుకొనేట్లు చేస్తాయి. 13వ శతాబ్దినాటి బద్దెన సుమతీశతకమునుండి మొన్నటి పక్కి వెంకటనరసయ్య కుమారీ శతకం వరకు భాస్కరాది నీతిశతకాలు ఆంధ్ర సాహిత్యాన్నలంకరించి వ్యాప్తములయ్యాయి. నేటికీ పఠనీయాలుగా వున్నాయి. యధావాక్కుల అన్నమయ్య వ్రాసిన 'లీలానంద సర్వేశ్వర శతకం', 19వ శతాబ్దిలో తరిగొండ వెంగమాంబ, తరిగొండ నృసింహాశతకాలు వేదాంతంలోనూ, 17వ శతాబ్ది తర్వాత రాయభట్టు వీరరాఘవకవి – వేణుగోపాల శతకం హాస్యంలోనూ చెప్పుకోదగ్గవి. కవిచౌడప్ప శతకంలోనూ హాస్యంవున్నా ఈనాటి అభిరుచులకు సరిపోదు. వీనిలో కవి సాంఘిక, సారస్వత విషయములు స్పృశించాడు. అంతమాత్రాన వానిని ప్రామాణికం అనరాదు. వేల్పూరి విస్సన్నకవి ఔరంగజేబు చక్రవర్తి కాశీపట్టణమున మసీదు కట్టించిన సందర్భంలో వ్రాసిన విశ్వేశ్వరశతకం, రాచూరి లక్ష్మణదాసు కుంఫిణీ పరిపాలనలో రాజమహేంద్రవరంలోని రాజకీయ పరిస్థితులను దెల్పిన శ్యామలాంబశతకం చారిత్రకశతకాలు. గోపాలకృష్ణమూర్తి శతకం–జీవిత చరిత్ర శతకం. మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారి హరిహరేశ్వరశతకం, కొక్కొండ వెంకటరత్నంపంతులుగారి బిల్వేశ్వరశతకం స్వీయచరిత్రశతకాలు. నిందాగర్భిత శతకాలు–ఎగతాళితో కూడిన దూషణ శతకాలులో 17, 18 శతాబ్దులలో స్వదేశ సంస్థానాధిపతులు పైయధికారులైన నవాబులను లక్ష్యపెట్టక తమయిచ్చవచ్చినట్లు వ్యవహరించుచు ప్రజలను పీడించసాగారు. అట్టి రాజుల దుర్నయత్వానికి నిరసనసూచనగా అడిదంసూరకవి రామలింగేశ్వరశతకం, కూచిమంచి తిమ్మకవి కుక్కటేశ్వరశతకం చెప్పుకోదగ్గవి. వంగూరు నరసకవి ప్రసన్నరాఘవశతకం రామాయణ కథాశతకం. ఒక సమస్యనిచ్చి, దానికొక పద్యము చెప్పమనుట సంప్రదాయం అయినను 19వ శతాబ్దిని సమస్యలనిచ్చి శతకముగా వానిని పూరింపుమనుట ఒక పద్ధతి అయినది. ఆనందగజపతి కాలపు 'సతతము సంతసమొసంగు సత్యవ్రతికిన్' అను సమస్యామకుటంగల సత్యవ్రతిశతకం అట్టిది. ఆదిభట్ల వారి అచ్చతెనుగు శతకం,

కన్నెమొయిలి చంద్రరాజు రఘుపురీశ శతకం, విరిపాటరామచంద్రరాజు జామిజనార్దన శతకం చాటుశతకాలుగా చెప్పుకోదగ్గవి. భమిడిపాటి రామసోమయాజులుగారి కుక్కశతకం, బోయి భీమనగారి పిల్లిశతకం జంతుసంబోధనా విషయకములు. పన్నాల సీతారామబ్రహ్మశాస్త్రిగారి పూచిపుడక, త్రిపురాన పమ్మయరాట్కవీంద్రుల నిద్రాశతకాలు, కవిసమ్రాట్ విశ్వనాథవారి మధ్యాక్కర శతకాలు సామాన్య విషయకాలు.

శతకవాఙ్మయ ప్రత్యేక పరిశోధన ఆంధ్రపత్రిక ప్రథమ సంవత్సరాది సంచిక 1910 లో కేసానపల్లి చెంగయ్యగారి ఆంధ్రశతకములు అనే వ్యాసంతో ప్రారంభమైంది. శతకకవులను గూర్చి తొలుత పరిశోధన చేసింది కీ॥శే॥ వంగూరి సుబ్బారావుగారు. వారి శతకకవులచరిత్ర కాశీనాథుని నాగేశ్వరరావుగారి పీఠికతో 1923 లో ప్రచురితమైంది. శతకవాఙ్మయ పరిశోధనా గ్రంథాలన్నింటా తలమానికమైనది డా. కె. గోపాలకృష్ణారావుగారి శతకవాఙ్మయం. ఆ పరిశోధనా గ్రంథంలో అయిదు వేల శతకాలు పరిశీలింపడ్డాయి.

ఇటీవలి కాలంలో-వర్తమానంలో కూడా శతక రచన సాగుతూనే వున్నదంటే శతకవాఙ్మయ ప్రభావం తెలుగుసాహిత్యంలో, శతకప్రక్రియ ప్రభావం తెలుగు కవులలో ఎంతవుందో గ్రహించుకోవచ్చు. దాశరథి, నార్ల, కృష్ణశాస్త్రి, బోయిభీమన్న, పోతుకూచిగార్ల నవీన శతకాలు ఆధునిక పాఠకులను ఎంతగానో అలరించుచున్నవి.

శతకాల్లో ఏకపాద మకుటం, అర్ధపాదమకుటం, ద్విపాదమకుటం గల శతకాలు కూడా వున్నాయి. వేమన శతకాన్ని ఆత్మాంకిత శతకం అనీ అనవచ్చును. నీతిశతకం అనగానే అందు ఆత్మాంకితమో, ఆత్మాశ్రయత్వమో ఎక్కువ గుర్తొస్తుం దంటారు. శతకాలను కొందరు భావగీతాలన్నారు. ఆత్మాశ్రయత్వం రెంటిలోనూ కన్పిస్తుంది. కవిత్వంలో భావకవిత్వం లక్షణాలు దోబూచులాడతాయనడంలో నిర్హేతుకం లేదు. నిజానికి భావకవిత పాశ్చాత్యసంప్రదాయం నుండి వచ్చిందే.

భావగీతాలు శతక కవితలో దాగుడుమూత లాడినవి కాని, శతకములు భావగీతములు మాత్రమే కావు. ప్రకృతి సందర్శన తన్మయత్వంలో లుబ్ధుడై, ఒకే మనోవికృతిని విపులీకరించి కవిపాడుకొనేది భావగీతం. దీనికి శృతి సహాయం కాబట్టి భావగీతాల్లో గేయాలు కలుస్తున్నాయి. శతకాలంటే నానాభావానుభావ సంగ్రహములు కదా! భావగీతాలకు, శతకాలకు కొంత సాదృశ్యంవున్నా, కొంత భేదం కూడా వుంది. భావగీతాల్లో కవి ప్రకృతి స్వరూపమున గుణసౌందర్యాలను

కాని, మనోభావాలను కాని, మనోహరంగా వర్ణిస్తూ భావవికాసం కలిగిస్తాడు. భావగీతాలు కలగజేసే భావవికాసం మానసికానందం మాత్రమే అనవచ్చు. కానీ ఆత్మానందాన్ని కలుగజేసి పురుషార్థానికి ప్రయోజనకరాలు కావు. శతకాలంటేనో–అవి భావగీతాలకు అతీతమైన ఆత్మానందాన్ని కలుగజేస్తూ పురుషార్థాన్ని పొందడానికి కూడా సాధకాలుగా వున్నాయి. పురుషార్థానికి పరమార్థమైన మోక్షప్రాప్తియే శతకప్రయోజనం అంటారు కొందరు. శతకాలలో రచయితయగు కవియే పాత్ర. శతకమందలి భక్తుడు, శతకం వ్రాసిన కవి వేరని చెప్పాలి. పరమాత్మ కవి–జీవాత్మ భక్తుడు. భక్తుడే శతకమందలి పరమాత్మ.

శతకాలు సామాన్యంగా కవికి ఉద్రిక్తభావంలో పుట్టినవవడంతో భక్తి, శృంగారం, క్రోధం, భయం అద్భుతం మొదలగు భావాలఉద్రేకం కలిగినప్పుడే శతకాలు వ్రాయబడ్డాయి. కవి భగవంతుడితో ఈ శతకాల మూలమున మాట్లాడుతాడు. కాబట్టి వీనియందు కవిహృదయం సుస్పష్టంగా గ్రహించవచ్చు. ఇందుచేతనే ఇది కవి ఆత్మాశ్రయకవిత్వం అన్నారు.

ఏమయినా శతకం వ్రాయడం చాలా కష్టం. శతకకవికి లోకానుభవము, విమర్శనాదక్షత, సూక్ష్మబుద్ధి, గ్రహణశక్తి, ధారాపాటవము, వశ్యవాక్కు వుండాలి. సంఘంలోని మేలుకీళ్ళను, దేశ కాల పరిస్థితులను, రాజకీయ విషయాలను, వాఙ్మయ పరివర్తనలను, కవితారీతులను, నూతన సంస్కృతులను నానావిధ కళాభ్యుదయములు అద్దంలోవలె శతకములలో క్షుణ్ణంగా స్పష్టపడతాయనడం అతిశయోక్తి కాదు అనే వేదంవారి మాట నిజంగా వేదంవంటి మాట. అభిరుచినిబట్టి, మనఃస్థాయిని బట్టి శతకాలన్నీ కూడా ప్రమోదాన్ని కలిగించేవే. ఆద్యంతం ఏకధాటిలో పఠించేందుకు కాదా–అక్కడక్కడపద్య రత్నాలను పఠించి పరితుష్టి నొందడానికి కూడా అనువైనవి శతకములు. ఏమయినా తెనుగుసాహిత్యంలో శతకవాఙ్మయానికి వున్న స్థానం నిరుపమానమైనది.

చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా – చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చ రెచ్చటన్ – బదునుగ మంచికూర నలపాకము చేసిన నైన నందు నిం–పొందవెడు నుప్పులేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా! ✻

**(ఆకాశవాణి సౌజన్యంతో)**

**(చుక్కాని వారపత్రిక 24.3.1973)**

# 2 సామయిక కవిత్వం

అనంతమైన కాలంలో సమయాన్ని–వ్యక్తి తనకు 'ఉచితమైన కాలం' అనే అర్థంలో, 'అగత్యము' లేక 'ఒడంబడిక' లేక 'మాత్రము' అనే అర్థంలో గ్రహిస్తాడు. 'సంకేతము' 'ఆజ్ఞ, అనే అర్థంలో కూడా ఈ సమయం ఉంది.

ఉచితమైనది, సంకేతము, అగత్యము అయిన సమయం వైయక్తిక సమయంగా– ఒడంబడిక, ఆజ్ఞ, సూత్రము, ఆగత్యము అనేది సామాజిక సమయంగా పేర్కొనవచ్చు.

ప్రతి మనిషి అధికశాతం సమయానుకూలుడే. వర్తమానం ఊతవదలి సమయానికి ఎదురీదేవాడు వెనుకబడినవాడో లేక ముందుకురికే తొందరతో వర్తమానాన్ని విస్మరించేవాడో అవుతుంటాడు.

సమయాచ్ఛేదనం చేసి ముందుకాలాలకు పనికొచ్చే పనిచేసినా, వర్తమానాన్ని విస్మరించినందుకు విమర్శకు గురికాకతప్పదు. వర్తమాన సమాజ స్థితిని విస్మరించి సమయానుసారంగాకాక ఏదో భవిష్యద్దర్శనం చేస్తున్నాననడం నేలవిడిచి సాముచేయడం వంటిదే అవుతుంది. అందువల్లనే ప్రతి కవిలోనూ సామయికత అనివార్యంగా ఉంటుంది.

ఈ సామయికత కవిత్వ సంబంధిగా కవులచే వ్యక్తమవుతూ, ప్రయుక్తమౌతూ కవివ్యక్తిత్వాన్ని–మానసిక క్రమ పరిణామాన్ని, చారిత్రక విషయక్రమాన్ని, కవితాభ్యాసశీలతను– అల్పాంశలో అనల్ప అశయప్రకటనా సామర్థ్యాన్ని – బ్రతుకు తెరువుతెన్నులను (అవకాశవాద ధోరణులు) ప్రతిబింబించేదిగా కనిపిస్తుంది. వైయక్తిక సామయికతలో – పుట్టినరోజు, ప్రేమ, వివాహం, మరణశోకం మొదలైనవి సామయిక అంశాలు కాగా, సామాజిక సామయికతలో–ఋతువులు, పండుగలు–పబ్బాలు, తాత్కాలికంగా ఉత్పన్నమయ్యే సాంఘిక సమస్యలు, మహనీయుల స్మృతులు, యుద్ధాలు, ప్రపంచ విజయాలు, మొదలైన అంశాలు ఉంటాయి.

సామయిక కవిత్వం ముందునుంచీ ఉంది. రాజుల జైత్రయాత్రా ప్రశంసలు, అంకితం

పద్యాలు వంటివి ఒక అగత్యంగా రాయడం కారణంగా అది సామయిక కవిత్వమే. అయితే అది వైయుక్తిక అగత్యమై, వైయక్తిక సామయికతను కలిగి ఉంది.

అష్టాదశ వర్ణనలు ప్రధానంగా వచ్చిన ప్రబంధకాలంలో ఋతువర్ణనలు మొదలైనవి స్థిరపడ్డాయి. ఏదో రూపేణా చోటుచేసుకున్న ఆ ఋతువర్ణనలు సామయిక కవిత్వమే.

అదే విధంగా ఉగాది, దీపావళి, సంక్రాంతి వంటి పర్వాలు నాటి నుంచి నేటి దాకా కవితావిషయాలుగా ఉంటున్నాయి. సామాజిక సామయికతను ప్రతిఫలిస్తున్నాయి. సామయికకవిత్వం అనే మాట ఆ పండుగలు, ఉత్సవాలు సందర్భంగా వచ్చే కవిత్వానికి వాడబడుతోంది ఈనాడు.

కవిసమ్మేళనాల కోసం-ప్రత్యేక సంచిక కోసం-రేడియో కోసం- ప్రత్యేక సందర్భాలలో వ్రాయబడుతున్న కవిత్వం వుంది. వ్రాసేకవులు ఎందరో వున్నారు. ఈ అగత్యం అయిన కవిత్వాన్ని రాసే కవిని కొందరు కొంత తేలికగా అంచనా వేయడం జరుగుతోంది. కానీ ఆ ఆనవాయితీ అప్పటికీ ఇప్పటికీ సాగుతోంది, సాగుతుంది అంటే దాని వెనుకగల నిజమైన కవి మనశ్శీలతను, సామాజిక అగత్యాన్ని గుర్తించవలసి ఉంది. అంటే మనస్తత్వ పరంగానూ, సామాజిక సూత్రాల ఆధారంగానూ ఈ సామయిక కవిత్వాన్ని విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది.

కవి గమనశీలి కావడానికి, నిరంతరాభ్యాసి అయి కవిత్వంలో తనదైన స్థాయిని అందుకోవడానికి, ప్రాథమికంగా సామయిక కవిత్వం సోపానపంక్తి అవుతుంది. యువకవికి ఆ విధంగా దోహదమయ్యే ఈ కవిత, పరిణతమైన లబ్ధ ప్రతిష్టుని చేతిలో అతని ఆశయాలను, సామాజిక అవగాహనను ప్రతిబింబించే విద్యుత్ చైతన్యవంతమైన ఉపకరణమవుతోంది. సమయానికి సమాయత్తం చేసే చైతన్యోద్దీపన హేతువవుతోంది, ప్రబోధానికి, ప్రచారానికి సాధనమవుతోంది.

సమయ సంబంధమైన ఒక అంశం అనే సూర్యకిరణం ప్రసరింపజేయడంలో వివిధ కవులు వైయక్తిక మనస్తత్వాలను ఏడు రంగుల ఇంద్రధనుస్సుగా వెలార్చే పట్టకం వంటిది సామాయిక కవిత్వం. గతానుభవం నుండి వర్తమాన అవలోకనం, అనుసరణం గావిస్తూ భవిష్యత్తుపై దృష్టి ప్రసరింపజేచేసేది సామయిక కవిత్వం.

సామయిక కవిత్వం వెనుక తరతరాల మూలాంశాలు కూడా ఉంటాయి. సామయిక కవిత్వం మాటున కవిమనస్తత్వం, వర్తమాన చరిత్రకు, వర్తమానానికి

కవి ప్రతిస్పందించే తీరు, తద్వారా అతడు సమాజానికి అందిస్తున్నదేమిటనే ఆలోచనాధోరణి ఇవన్నీ ఉంటాయి.

గతంపై అతని తీర్పు, భవితవ్యానికి సూచిస్తున్న మార్పు కూడా అందులో ప్రతిబింబిస్తాయి.

ఋతువర్ణనల పేర విజయవిలాసాదికకర్తలు తమ కవిత్వలక్షణాలు వ్యంజమానం చేసినట్లు, నేటి సామయిక కవిత్వములో భావకవులు తమ తీరు తెన్నులను ప్రతిఫలింపజేస్తారు.

ఒక ఉగాదికవిత రాసి అన్ని ఉగాది పండుగలకూ దానినే చదివే కవులుండవచ్చు. అది కవి వైయక్తిక స్థితిని, అతని మానసిక ధోరణిని లేదా చరిత్ర స్తబ్ధతను దేనినైనా వ్యక్తీకరిస్తుంది.

సమానధర్ములైన కవులు, సమానభావాలు సామయిక కవిత్వంలో ఉండడం సహజమే. నిజానికి అది మూలాంశాల ప్రభావతీవ్రతను వ్యక్తం చేస్తుంది.

ఆశావాదులయిన కవులు లేక నిరాశావాదులయిన కవులు, ప్రగతిశీలురు లేక వైయక్తికులు-ఏ వర్గానికి చెందిన కవులయినా సామయికకవిత్వాన్ని స్వీకరించినవారే.

సామయిక కవిత కొందరు కవులకు డైరీ అయితే మరికొందరికి జీవితం.

సామయికకవిత్వం పునాదులపైనే సమగ్రకావ్యాలు వెలువడుతాయి. సామయిక కవితతో ఒక సందర్భంలో బీజభూతంగా కవిప్రస్తావించిన ఆలోచనా ధోరణే అతని వ్యక్తిత్వ కవిత్వ వికాసాన్ని సమగ్రంగా రూపు కట్టించే మహాకావ్యం వైపు ప్రస్థానింపచేస్తుంది.

అందువల్ల ఏ కవి వ్యక్తిత్వ కవిత్వ మనస్తత్వాలనయినా సమగ్రంగా అర్థం చేసుకోవడానికి అతను రాసే సామయిక కవిత్వాన్ని అది ఎటువంటి సందర్భంలోని దైనా విశ్లేషించి చూడవలసి ఉంది.

సామయికకవిత్వం యొక్క సమగ్ర పరిశోధన-కవుల కవితా లక్షణాలను మనస్తత్వాలనూ పరిశీలించడానికి, కాలము-సమయం వీటి ప్రభావము, ప్రయోజనాలను అధ్యయనం చేయడానికీ, తద్వారా వ్యక్తికీ, సమయానికీ గల సంబంధంతో పురోగమన మార్గాన్ని అర్థం చేసుకోవడానికీ, అదే విధంగా చారిత్రక

క్రమపరిణామాల, పండుగలు-పబ్బాల, ఉత్సవాల క్రమక్రమాగత స్థితిగతులను, సామాజిక ఆచార వ్యవహారాల అవగాహనను, వైయక్తికంగా అనుభూతిని, సామాజికంగా ఆశయసాధనా సంరంభాన్ని కవి కలిగి వుండే విధానాలను పరిశీలించడానికి, తద్వారా ప్రయోజనవంతమైన ఆలోచనల వైపు పయనించగలిగే స్పృహమ రేకెత్తించడానికి, మనస్తత్వ పఠనం, కాలచరిత్రాదుల పఠనంతో వ్యక్తి ఆచరణశీలి కావడానికి-ఎంతగానో సహకరిస్తుంది.

గతంలోని ఆశుకవిత, చాటుకవితలనుండి నేటి కవి సమ్మేళనాల, ప్రత్యేక సంచికల కవితల వరకు వెలువడిన సామయికకవిత్వం సమగ్రంగా అధ్యయనం చేయడానికి కావలసినంత విస్తృతమైన పరిధి దీనికి వుంది. ✻

**(స్రవంతి మాసపత్రిక-నవంబరు 1982)**

# 3 సామయిక కవిత్వం గుణస్వభావాలు

**సా**మాజికుడు కళల పట్ల ఎక్కువ ఆసక్తిని చూపించే సమయాలు అతని జీవితంలో ప్రత్యేకంగా కొన్ని ఉంటూంటాయి. తన జీవితంలోని అత్యంతానంద దాయకమైన రోజులలో అతను సాహిత్య కళా విషయాల పట్ల సహజాసక్తిని చూపిస్తాడు. సాహితీ మిత్రులను సమావేశపరిచి తనలోనూ అంతర్లీనంగా ఉన్న కళాతృష్ణను బయల్పరుచుకుంటూ తనసాటివారితో, కుటుంబ సభ్యులతో అతనప్పుడు కాలాన్ని వెచ్చిస్తాడు. సంగీత సాహిత్య గోష్ఠులను తన పరిసీమిత పరిధుల్లో నిర్వహించుకుంటాడు. అందరికీ సామూహికంగా ఇలా ఆనందదాయకమైన సమయాలే పండుగలూ, పర్వాలుగా ప్రత్యేక సందర్భాలుగా ఉన్నాయని చెప్పవచ్చు. అయితే కేవలం ఆనందదాయకమైన సందర్భాల్లోనే కాదు, భావావేశ పూరితమైన విచార సన్నివేశాలలో సైతం ఊరడింపుకై, మిత్రవాక్యానికై అతను హితసహితమైన సాహిత్య సంపర్కాన్ని అభిలషిస్తాడు. తన వేదనను, బాధను అందులో దర్శించి, దించుకుని ఉపశమనాన్ని పొందుతాడు.

వాసనా సహితుడైన సామాజికునికే రసానందం కలుగుతుందన్నది విదిత విషయమే. అందుకే వ్యక్తి జీవితంలోని ప్రత్యేక సమయాలతో ప్రత్యేకించి పెనవేసుకున్న రసవత్కవితలు అనూచానంగానే ఉంటున్నాయి.

**కావ్యం యశసేఽర్థకృతే**
**వ్యవహారవిదే శివేతరక్షతయే**
**సద్య:పర నిర్వృతయే**
**కాంతాసమ్మిత తయోపదేశయుజే.**

అర్థ సంపాదనం, వ్యవహారవైనం, కాంతాసమ్మిత ఉపదేశం అనే వాటికి నిత్య జీవితంతో చాలా దగ్గర సంబంధం ఉంది. కవి రచన ఈ మూడింటినీ ముఖ్యంగా అభిలషించడంలో దోషమేమీలేదు. నిజానికి కొంత యశస్సు మినహాయిస్తే, సామాజిక జీవితంలో కవి కేవలం తన కావ్యాల ద్వారా ధన సంపాదనం చేస్తూ, వ్యవహారాలు నెగ్గుకొస్తూ జీవించగల స్థితిలో ఈనాడు ఉన్నాడని మాత్రం పూర్తిగా చెప్పలేం.

ఏమైనా కవి - సామాజికునితో కొన్ని ప్రత్యేక సందర్భాలలో సహజంగా సమావేశమవుతుంటాడు. కాలంలో ఉత్కటమైన ఆనందం, ఉద్వేగ జనితమైన ఇతర భావావేశాలు పెల్లుబికే దినాలు, సందర్భాలు కొన్ని ఎదురవుతుంటాయి. అటువంటప్పుడు కవి తన కోసం వైయక్తికంగానో, నలుగురికీ ఆ సందర్భంలో ప్రత్యేకించి వెల్లడించేందుకు సామాజికంగానో కవితను రచిస్తాడు. ఆ రచనను అతను సార్వకాలిక గుణ ప్రణాళికతోగాని, ఒక సమగ్ర కావ్య ప్రణాళికా రచనం చేసిగానీ రచించకపోవచ్చు. తక్షణ అనుభూతిని అక్షరబద్ధంచేసి ఆ సందర్భానికి అనుగుణంగా అప్పటికప్పుడు రస సంచారం చేయడమే అతని ఉద్దేశ్యం. తన అనుభూతిని నలుగురికీ పంచివ్వడంలో అతనికి తృప్తి. లేక తక్షణ కర్తవ్యంగా ఏకోన్ముఖమైన ఒక విషయంలో ఆ సందర్భంలో అవసరానికై తనను తాను మేల్కొల్పుకుంటూ సాటివానిని కూడా రమ్మని మేల్కొలుపుతూ కోరి పిలవడం. తక్షణ సమస్యా పరిష్కారానికై ఉపదేశం, సందేశం, ప్రబోధం అందించడం-ఇవి ఏవయినా కావచ్చు. కవి ఆ క్షణంలో ఆ రచనలతో ఆశించేది అదే. కానీ అంతకు మించి తనకు తెలియకుండానే అందులో ఎంతో నిక్షిప్తం చేయవచ్చు. ప్రకటించవచ్చు. అది విమర్శకుల పరిశీలనాంశం.

ప్రత్యేక సందర్భాలకై కవి నలుగురికీ వినిపించే కవిత, పండుగలలో, ఉత్సవాలలో, సంతోషాలలో సామాజికుల మధ్య ప్రకటించే కవిత, కొన్ని సమస్యల సన్నివేశాలలో తక్షణ పరిస్థితులపై సామాజిక దృష్టిని మరలింపజేస్తూ ఉద్బోధ, సందేశం, హితవు సంచరిస్తూ చేసే రచన-ఇది సామయిక కవిత.

అలాగే జీవితంలోని ప్రధాన ఘట్టాలకు వైయక్తికంగా స్పందిస్తూ జన్మదినం, వివాహం, మరణశోకం వంటి సందర్భాలలో వెలువరించిన కవిత, తనఅవసరాల కోసమో లేక సహజంగానే సామాజికుల గుర్తింపులందదగిన అర్హత కలిగినందువల్లనో కొందరు ప్రముఖ వ్యక్తులపై ప్రత్యేక సందర్భాలలో వెలువరించిన కవిత-ఇది సామయిక కవిత.

ప్రతి కవీ సామయిక కవితారచన సహజంగానే చేస్తాడు. ఏ కవీ తాను అన్నీ మహాకావ్యాలే రాశాననీ, కేవలం ఒక సందర్భం కోసం, సమయం కోసం ప్రత్యేకించి ఏదీ రచించలేదనీ అనే సాహసం చేయలేడు. తన పాప పుట్టినరోజుకో, సంక్రాంతి సంబరానికో, మహనీయుని వర్ధంతికో, ఆత్మీయుని మరణానికో, హఠాత్తుగా తటస్థించిన ఉప్పెనకో ఏదో దానికి స్పందించి కవిత రాయని కవి ఉండడు.

ఆ విధంగా అతను సామయికకవితను రచించినవాడే. నిజానికి సహజంగానే కొందరు కవులుగా ఇలా సామయిక కవిత్వంతోనే గుర్తింపబడిన వారూ ఉంటారు. కొందరు పెళ్ళిళ్ళ పంచరత్నాల కవులని, పండుగల కవులని వ్యవహరింపబడి కొందరిచే కొంత పరిహాస చమత్కృతులకు లోనవుతూనూ ఉండవచ్చు.

ఒక భావావేశమయ స్థితిలో జనించేది కవిత్వం అన్నప్పుడు సహజంగా ఆనందోద్వేగాలతో ఆవేశపు క్షణాలను తెచ్చే సామయిక విషయాలు కొన్ని హృదయ స్పందనాన్ని కలిగిస్తాయి. ఊహించే మేధ, స్పందించగల హృదయం, రాటుదేరిన కలం కవికి ఉండవలసిన మూడు ముఖ్య లక్షణాలు. అయితే రాటుదేరిన కలం మాట ఎలా ఉన్నా స్పందించగల హృదయ లక్షణంతో, ఊహించే మేధతో కలం పట్టడం కవి ఆద్యదశ. అదీకాక ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అనేవి మూడూ కవికి ముఖ్యంగా చెప్పబడ్డాయి. ఇందులో అభ్యాసం అనేది నిరంతర సాధనకు సంబంధించినది.

కావ్య వస్తువు కోసం చూసినప్పుడు సామాజికులు నలుగురికీ ఆనందాన్ని కలిగించేది, వాళ్లకు పరిచితి కలిగినది అయిన విషయం అది ఏ పర్వాన్నో గురించే అయినా, కవి చెప్పే తీరులోని సొబగుతో పునరుక్తి అనిపించక, అననీయక కవి అభ్యాసానికి ఆసరాగా నిలిచి, ఆ రచనం నలుగురికీ హర్షణీయమే కాగలుతుంది.

అందుకే కొత్తగా కలం పట్టిన ప్రతి యువకవీ సామాజిక పర్వదినాలను కవితా విషయాలుగా స్వీకరించి అదే కవితావధి అన్నంతగా సాధన చేయడమూ కనిపిస్తుంది. అది దోషమేమీ కాదు. ప్రాథమిక స్థాయిలో అనివార్యమైన అభ్యాసయోగ్యమైన అంశమే. ఈ రీతిన సామయిక కవిత్వం అసలు కవి పుట్టుకకు మూలబీజం, మూలాధారం అవుతోంది. తన ఆనందాన్నో, ఆవేశాన్నో ప్రత్యేక సందర్భంలో ప్రకటించి మనస్సును విప్పి చెప్పటంతోనే కవిత ఆరంభమౌతోంది.

“.... మనస్సును విప్పి చెప్పుచుంటిమని, హృదయపూర్వకంగా పలుకుచుంటిమని” అనేక స్థలాల్లో వైదిక కవులన్నారు.

భావ రూపముల సమ్మేళనమును గూర్చి పలికే వాక్యాలు ఋగ్వేదంలో చాలా ఉన్నాయి. (3:34:2, 2:42:1, 6:42:3). కవిత్వం దేవప్రసాద ఫలమని, పడవను నడుపురీతిగా ఈ ఆవేశమును తెచ్చు దేవతయే గీత క్రమమును దిద్ది, దారి చూపునని ఉంది. సూక్తము (కవిత) జన్మించునదనియు, సృష్టింపబడునది అని

పలుచోట్ల చెప్పారు. తన హృదయాన్ని విప్పి చెప్పుకోవడానికి కవిత్వమే ఆధారమవడంతో ఈ భారాన్ని సంతోషంతో కవి గ్రహించాడు. వ్యవహారంలోగల పదజాలాన్ని శోధించి వడపోసి కావ్యానికి ఉపయోగించుట ఆచారంగా చేసుకున్నాట్ట.

కవిః కవిత్వా దివిరూప మాసజత్ (10:124:7) - ద్యులోకంలో తన రూపము కవిత్వవశాన కవి స్థిరపరిచినాడట.

కవిత జన్మించేది, సృష్టింపబడేది కూడా. భావావేశమయ పూర్ణస్థితిలోనే అది జన్మిస్తుంది. కవి దానిని సృష్టిస్తాడు. కవి ద్రష్ట, స్రష్ట అన్నారు. జన్మించేదానిని తాను దర్శించి, సృష్టించి, దర్శనీయం చేస్తాడు కవి. సృష్టింపచేసేది తనే.

కవిచే సృష్టింపబడే కవిత ప్రతిదీ మహత్తరమైనది కాకపోవచ్చు. కానీ సృష్టిస్తున్న కవి దృష్టిలో వెలువడుతున్న ప్రతి కవితా హదయభారాన్ని విప్పడమే. అనుభూతిని పంచుకోవడమే. తాను దర్శిస్తున్న జీవిత సత్యాలవెంట సామాజికులను ఆలోచనాపరులను కావించటమే.

ఆత్మోన్మీలనం చెంది వెలువరించే మహాకావ్యమైనా, ఆనందంగా రాసే ఉగాది గీతమే అయినా కవి సృష్టే. ప్రభవించే ముందు మధనం ఉంది. రెంటిలోనూ కవి మనస్సీమాసంచారం ఉంది. హృదయ ప్రకటనం ఉంది. స్థాయి భేదాలు విమర్శకులు గుణించేవి మాత్రమే.

అందువల్ల సామయిక కవిత్వం అన్నంత మాత్రాన, అది కేవలం అలవోక రచనగా, ప్రాథమిక స్థాయిగా లెక్కించడమూ సరికాదు. లబ్ధ ప్రతిష్టుడైన కవి సైతం సామయిక కవిత్వం రాస్తూంటాడు. ఒక వర్ధిష్ణు యువకవికి సాధనా రంగమై ఉన్న సామయిక కవితాంశమే, లబ్ధప్రతిష్ఠుడైన కవికి సవాలయిన ఆశయ సాధనారంగమై నిలిచి ఉంటుంది.

సామయిక కవితా ముఖాన ప్రముఖకవి జీవితానుభవాలతో తాను సంతరించుకున్న మానసిక స్థాయిని, క్రమ పరిణామాన్ని, సామాజిక చైతన్య విజయాల్ని, ప్రగతి ప్రస్థాన గీతాన్ని ఆలపిస్తాడు. పట్టకం మీద పడిన సూర్యకిరణం ఏడు రంగులను వెదజల్లినట్లు ఒకే అంశమే అయినా, వివిధకవుల కలాల్లో సామయిక కవిత్వం వినూత్న గతులను సంతరించుకుని ప్రకాశాన్ని ప్రతిఫలిస్తుంది.

యువకవికి అడుగులు నేర్పిన సామయిక కవిత్వం ప్రముఖునికి లోతులు చూపుతుంది. ఎత్తులు అందిస్తుంది. ఒకని సాధనకు ఆలంబన అయిన కవిత,

మరొకని జీవితానికి దర్పణం కాగలుతుంది. పాత్ర రూపుని బట్టి క్షీరం విస్తరించినట్లు కవి ప్రతిభాపాత్రత ననుసరించి సామయిక కవిత ప్రతిబింబిస్తుంది. మహనీయుని కలం ముఖాన అల్పాంశంతో అనల్పార్థ రచనం వెలువరిస్తుంది.

అందుకే ప్రజాసమూహంలో ఒక్కొక్కసారి ఒక కవిగారి కవిసమ్మేళనం కవిత కలిగించిన చైతన్యం, వారు ఆరేళ్ల క్రితం ప్రచురించిన ఒక కావ్యం అంతవరకూ కలిగించి ఉండకపోవచ్చు. కేవలం రసవత్ చమత్కారాల దృష్ట్యాకాదు ఆలోచనా ప్రేరణల దృష్ట్యా. అలాగే ఒక ప్రత్యేక సంచికకై చేసిన కవిగారి కవిత పాఠకులను ఆకర్షించినంతగా అదే అంశాన్ని వారు విస్తరించి చేసిన మహత్కావ్యం పొంది వుండదు. అందుకే నిన్నటి మహాకావ్యం 18 పర్వాలైతే నేటి మహాకావ్యం 18 పంక్తులే అనిపించుకునే సందర్భాలు కనబడుతూ ఉంటాయి. ఇది సామయికకవితలో విస్మరించలేని గుణాంశం.

జీవితకాలంలో కవి ఏ మహత్కావ్యం వెలువరించినా దానికి అంతస్సూత్రంగా, మూలాధారంగా అతని సామయిక కవిత్వం నిలబడుతుంది. కవి మానసిక తత్త్వాలు, వ్యక్తిత్వ కోణాలు సామయిక కవితలో ఎంతగానో ప్రతి ఫలిస్తాయి. సమయానికి అతను స్పందించే తీరు, ప్రత్యేక సందర్భాలు అతనిని ప్రభావితం చేసే తీరు సామయికకవితా ముఖాన వ్యక్తమవుతుంది.

సభారంజనను ఉద్దేశించినా, సామాజిక స్పృహను లక్ష్యించినా, ప్రయోగం దృష్ట్యా చేసినా, ప్రయోజనం దృష్ట్యా చూసినా సామయిక కవిత్వం విస్మరించరాని సముచితమైన సమాదరణీయమైన కవిత్వం.

కవి వ్యక్తిత్వ కవిత్వ వికాసాలకు, క్రమక్రమాగత మానసిక పరివర్తనా శీలతకు, సామాజిక ఆచారవ్యవహారాల ధోరణులకు, వాటి వృద్ధి క్షయాలకు, గతంపై కవి తీర్పుకు, వర్తమానంపై సారించిన చూపుకు, భవితవ్యానికి సూచించే మార్పుకు మొత్తంగా కాలంలో కవిపై, సమాజంపై సామయిక ప్రభావాలకు దర్పణం సామయిక కవిత్వం. *

**(నందిని త్రైమాసిక జూలై–సెప్టెంబర్ 1982)**

# (4) కవిత్వం ముంగిలిలో - సంక్రాంతి భావనల ముగ్గు

**ఆ**ధునిక సాంకేతికత పెరిగి, యంత్రయుగం పరిఢవిల్లుతున్న కాలాన- ఒకప్పటి సంప్రదాయాలూ, నాటి వ్యవహారాలూ కేవలం గత వైభవ స్ఫురణలుగా మిగిలిపోవడం కానవస్తున్న కాల పరిణామమే! మానవ జీవనసరళిలో కాలక్రమేణా చోటుచేసుకుంటున్న మార్పులు ఒకనాడున్న ప్రకృతికీ, మానవ స్వభావ ప్రకృతికీ కూడా మనలను మరింత ఎడం చేస్తూ వస్తున్నాయి.

మనది ప్రధానంగా వ్యవసాయిక దేశం, అందునా ఆంధ్రదేశం అన్నపూర్ణగా పేరుగాంచిన ప్రాంతం. అందుకు కారణం తెలుగునాట రైతు జీవనం. వ్యవసాయ క్షేత్రాన తెలుగువాడు వెలుగులు విరజిమ్మిన కాలం ఉంది. రైతు జీవన సౌభాగ్యం దేశాన్ని సుభిక్షం చేస్తూ సాగిన కాలం ఉంది. తెలుగునాట సంక్రాంతి అంటే ప్రధానంగా రైతు పండుగ. ధాన్యరాశులు నిండి, తెలుగులోగిళ్ళు కళకళలాడిపోతూ ఉండేవి. పంట చేతికివచ్చే కాలం కాబట్టి, ఆ ఆనందాన్ని శ్రమశక్తులన్నీ కలసి పండుగ చేసుకునే కాలంగా ఉండేది. సంక్రాంతి రోజుల్లో హరిదాసులు, గంగిరెద్దులవారు, బుడబుక్కలవారు, జంగమదేవరలు ఇలా సంచారజాతులవారంతా పల్లెల్లో సందడి చేసేవారు. ఇళ్ళ ముంగిళ్లు రంగవల్లికలతో, గొబ్బెమ్మలతో, పిల్లలు ఎగురవేసే గాలిపటాలతో, కోడిపందేలతో, కొత్త అల్లుళ్ల సందడితో, ఇంటింటా పిండివంటల సంభారాలతో నిజంగా సంబరాలు అంబరానంటినట్లుండేవి. సంక్రాంతి అంటేనే ఆనందానికి ప్రతీకగా భోగి, సంక్రాంతి, కనుమ అని మూడు రోజుల ముచ్చటైన కలయికతో తెలుగుల పెద్దపండుగగా భాసించేది. ధనుర్మాసమూ, ఉత్తరాయణ పుణ్యకాలమూ కావడంతో ఆధ్యాత్మిక భావనలు పరివ్యాపిస్తూ ఉండేవి. చలిమంటల, చెలిచెంతల వెచ్చదనాల కాలంగా చెలామణి అయ్యేది.

తెలుగు సాహిత్యంలో అందునా కవిత్వంలో అందుకే సంక్రాంతి ఒక ప్రధాన ఇతివృత్తమైంది. ప్రాచీన కావ్యాలలో, ప్రబంధాలలో ఋతువర్ణనలు కనిపిస్తాయిగానీ,

సంక్రాంతి కాలమూ, సంక్రాంతి పర్వమూ అంటూ భావకవులాదిగా మన తెలుగు కవులు ఎందరో తమ పద్య, గేయ, వచన, కవిత్వ రచనలుగా సంక్రాంతిని సమాదరించారు. పౌష్యలక్ష్మిని ఆరాధించారు. సంక్రాంతి అంటే రైతు పండుగ కనుక మొదటగా గుర్తొచ్చేది రైతుకవి అని చెప్పదగిన శ్రీ తుమ్మల సీతారామమూర్తి.

తెలుగు పల్లె జీవన సౌందర్యాన్ని తన పద్యాలలో సాకల్యంగా దృశ్యమానం చేసిన కవికృషీవలుడు అంటే తుమ్మలవారే! సంక్రాంతి సందర్భంగా కవి ప్రముఖులు చేసిన రచనలన్నీ తెలుగు భాషను, తెలుగుతనాన్ని పండించినవే! అందునా వెయ్యేళ్ళ తెలుగుపద్య వారసత్వంలో తెలుగుల పెద్దపండుగ సంక్రాంతి సొగసుల్ని తుమ్మలవారు వర్ణించినంత రమణీయంగా రచించిన కవి మరొకడు లేడనవచ్చు.

సంక్రాంతి పండుగంటే ఆయనకంత ప్రాణప్రదం. సంక్రాంతి గురించి ఆరు ఖండకావ్య సంపుటాలను వెలయించిన అద్భుత కవివతంసుడాయన. ఆ కావ్యాలు–సంక్రాంతి (1941), సంక్రాంతి తలపులు (1953), సంక్రాంతి వేదన (1954), జయ సంక్రాంతి (1955), కొత్త సంక్రాంతి (1960), సంక్రాంతి ముచ్చటలు (1983).

ఈ రచనల ద్వారా సంక్రాంతి భిత్తికగా తుమ్మలవారు నాలుగు దశాబ్దాల కాలంలో తెలుగునాట రైతు జీవితంలో వచ్చిన మార్పులను అత్యద్భుతంగా చిత్రించారు. రైతు కలిమియే దేశ బలిమిగా విశ్వసించిన తెనుగులెంక కవి తుమ్మలవారే. రైతు గురించీ, సంక్రాంతి గురించీ, కొత్తగా వివాహితులైన అల్లుళ్లకు అత్తవారింట జరిగే మర్యాదల గురించీ, అభ్యంగన స్నానాల గురించీ, డెబ్బై, ఎనభై ఏళ్ల క్రితపు తెలుగు పల్లె అందచందాలను అసాంతం అభివర్ణించారు.

“కొసరి నూరిన పచ్చి పూబైత మొగాన గుమ్మడి పూవుమారమ్మ నద్ది కండ రేగడ నారబండి కన్పండువై పొలుచు మిర్యపుబందు బొట్టువెట్టి విపమ్మునకు నొక్కవాసి హెచ్చైనట్టి నునుమంచుదెర చీర నూలుకొల్పి బంతిపూవులకు జేమంతి నెయ్యము గూర్చి కబరీభరమ్ము చక్కన కుదిర్చి” అంటూ సంక్రాంతి సొగసును వర్ణించారు. ఆ రోజుల్లో దువ్వూరి రామిరెడ్డి, ఏటుకూరి వెంకట నరసయ్య, తుమ్మలవారలు కర్షక కవిత్రయంగా పేరొందారు. రైతునే కథానాయకుడిని చేసి దువ్వూరి ‘కృషీవలుడు’ రాశారు. కట్టమంచి వారు ‘ముసలమ్మ మరణం’ ద్వారా 20వ శతాబ్ది ప్రారంభంలోనే

పల్లె జీవితగాథకు పట్టంకట్టారనవచ్చు. పల్లెప్రజల ఆత్మీయతలు, బంధాలు ఆ కావ్యంలో ఆయన రసాత్మకం చేసి కావ్యగౌరవం సంతరించారు.

తుమ్మల సీతారామమూర్తి గారు సంక్రాంతి విందుభోజనం గురించి రాసిన ఈ పద్యం నిజంగా సాహితీప్రియులకూ గొప్ప విందే!

లేగటి పాలలో గ్రాగి మాగిన తీయ
తీయ కప్పురభోగి పాయసంబు
చవులూరు కరివేప చివురాకుతో గమ
గమలాడు పైర వంకాయ కూర
తరుణ కస్తుంబరీదళ మైత్రిమై నాల్క
త్రుప్పుడుల్చెడు నక్కదోస బజ్జి
క్రొత్తబెల్లపు తోడికోడలై మరిగిన
ముదురు గుమ్మడిపండు ముద్దపులుసు
జిడ్డుదేఱిన వెన్నెల గడ్డపెరుగు
గరగరికజాటు ముంగారు జెఱకు రసము
సంతరించితి విందుభోజనము సేయ
రండురండని పిలిచె సంక్రాంతి లక్ష్మి

మునుపు ఏ పండుగకైనా ఆడపిల్లలు గోరింటాకు పెట్టుకునేవారు. విశ్వనాథవారు 'తెలుగు ఋతువులు' అనే తమ లఘు కావ్యంలో (కాలగతిలో నేడు కనుమరుగైపోయిన) ఆచార వ్యవహారాలకు అద్దంపట్టారు. అప్పట్లో పల్లెటూళ్లలో వానాకాలం వస్తోందంటే నేలపాతర్లో ధాన్యాన్ని తీసి గాదెల్లో పోసేవారు. పూడ్చిన పాతర గుంటమీద కూరపాదు ఏదివేసినా చిలవలు పలువలుగా అల్లుకునేది. చెట్టుకొమ్మలతో దానికి పందిరేస్తే ఆ కొమ్మకణుపుల్లో నీళ్ళు నిలిచి చెట్టుకొమ్మల్లోని జీవపదార్థంతో కలవడం వల్ల ఫంగస్ వచ్చేది. వాటినే పుట్టగొడుగులు, కాకిబొడ్లు అనేవారు. గోరింటాకు రుబ్బేటప్పుడు అందులో కాకిబొడ్డు వేస్తే ఎర్రగా పండుతుందని విశ్వాసం. 'కన్నెపిల్ల ఎదపొంగగ' అంటూ పందిరి గుంజ మీద మొలిచిన కాకిబొడ్డుని విశ్వనాథ ఒక పద్యంలో ప్రస్తావించారందుకే.

సంక్రాంతి హేమంతకాల పర్వమే! చలిమంటలు వేసుకునేది అందుకే మరి! 'భోగి' పండుగ తెల్లవారుజామున వేసే మంట ఎంత 'కనులపంట'యో వేరే చెప్పాలా? ఆంగ్ల సంవత్సరాది ప్రవేశించిన కొద్దినాళ్లకే సంక్రాంతి వస్తుంది. నిజానికి మూడు రోజుల పెద్దపండుగ అయిన సంక్రాంతియే, ఇంట పంట నుండు సౌభాగ్య సమయమే నవవర్షమనిపిస్తుంది.

ఈ నవాబ్దాగమమ్ముతో ఈ కిశోర
మధురకల కంఠమునకు హేమంతమెడలి
గొంతుచెరవీడెనేని, హృదంతికమున
దాగి యొదిగిన ప్రేమగీతుల రుచుల
నొక్కటొకటే నీకయి విప్పచూడు సకియ

అంటారొచోట కృష్ణశాస్త్రిగారు, హేమంతం గడిస్తేగానీ వసంతం రాదన్నమాట నిజమేగానీ సంక్రాంతి వేళ నూత్నవత్సర భావనలు పాదుకోవడం మాత్రం నేటికీ ఆంగ్లసంవత్సరాది జమలిక వల్ల సహజమే కదా!

సంక్రాంతి వేళ గురించి అశ్వధాటి వృత్తాలులో శ్రీఆదిభట్ల కామేశ్వరశర్మ అనే కవి ఇలా ప్రస్తావించారు.

సప్తాశ్వరూఢుడయి బాలార్కుడీ దినము తాజేరు రాశి మకరం
తృప్తాత్మలవ్వ ఘన కూష్మాండదానములు విప్రాళికందు సుదినం
ప్రాప్తించ పుణ్యగతి గాంగేయుడెంచినది స్వచ్ఛంద మరణదినం
తప్తాధికంబులకు మార్తాండుడున్ ధరయు సామీప్యమైన ఆయణం
లుప్తంబులై జనవె రోగాలు చేర హుతవాహుడు ప్రాణిజఠరం
దీప్తోద్ధతిన్ మెరయ పౌష్యంపు లక్ష్మికళ ముంగిళ్ల ముగ్గురచనం
క్లుప్తంబులై నిశలు దీర్ఘంబులై పగలు పత్రాలు రాలు శిశిరం
గుప్తంబుగా మసలు పూర్వీకులన్, బిలుచు పితౄణ తర్పణ దినం

సంక్రాంతిని పెద్దల పండుగగా వ్యవహరించడం, ఈ సమయంలోనే వారికి తర్పణాలు వదలడం తెలిసిన సంగతే కదా!

వ్యాప్తించగా లచిమిధాన్యంపు రాశులుగా పొంగళ్ల తీపి పచనం
సుప్తస్థితినే పొదలు శీతార్తు బాధితుల మేల్కొల్ప భోగిదహనం
జ్ఞప్తిన్ తలంచుకొని గోజాతి సేవలను గోలక్ష్మి గొల్చు కనుమల్
ఆప్తాళి బంధుతతి సమ్మేళనంబులకు సంక్రాంతి గొప్ప తరుణం

సంక్రాంతి సంబరాలకు అంతా కలుసుకోవడం అనేది, కొత్త అల్లుళ్ళతో, బావామరదళ్ళ సరాగాలతో ఇళ్లు కళకళలాడడం అనేదీ ఈ పర్వవిశిష్టతే.

తన జీవితంలోని ఘటనములేరి షడృతుచక్రభ్రమణ సంచాలిక కృతిగా డా॥ సి.నారాయణరెడ్డిగారు వెలయించిన గేయకావ్యం "ఋతుచక్రం'. "దీని లోతులలోన ఒక రసాత్మకుడైన తన బ్రతుకు దర్శించినంజాలు" అన్నారు గానీ, ఒక గొప్ప రసమంచిత కావ్యంగా ఎందరినో అలరించిన కావ్యం వారి 'ఋతుచక్రం'. అందులో హేమంత ఖండంలో-

నేడు సంక్రాంతి: ఊరి
వాడలన్ని గంగెద్దుల
కొమరాడెడు చిందులతో
'కూచిపూడు'లైపోయెను

అంటూ కూతుళ్ళకు భోగిపండ్లు పోయడం, భోగినాడు ఉదయం చలిమంటలు క్రాగుతుంటే, చిట్టిపాప నిద్రకళ్ళతో తూలిపడడంతో మంట అంటుకోవడం, కానీ పుణ్యంకొద్దీ ఆమె మోముకేమీ ప్రమాదం వాటిల్లక-తిరిగి 'దాని మేను లేత పసిడి నిగ్గులుచిల్కెను, భవితవ్యము పల్కెను' అని సంతసించడం చెబుతూ-

పోయిన సంక్రాంతి నాడు
పొగచూరిన యిల్లునేడు
కాంతి స్నానమ్ములాడె
కాలమెంత వింతైనది?

అని కథనం చేస్తారు. సంక్రాంతి వేళల హేమంత శీతగాలుల గూర్చి రాస్తూ-

నరాలలో చొరబడు, తుం
టరి చలి నెదిరించ నెన్ని

శాల్వలైన లాభమేమి?
చాలునొక్క బిగికౌగిలి

అని చమత్కరిస్తారు.

అలాగే దాశరథి తమ 'కవితాపుష్పకం'లో 'సంక్రాంతి రాత్రి' గురించి–

మంటలు వేసిన యంతనె
మన చలి పరుగెత్తేనా?
జంటలలో దొరుకువేడి
మంటలలో లేదోయీ! అంటూ–

ఒంటరిగా వింటర్‌లో
వెళ్లబోకు భాయీ
కంటకాల వలె చలి మన
వెంటపడినదోయీ

అని పరిస్థితిని చెబుతూ ప్రణయోర్మిని అభివ్యక్తం చేశారు.

అందానికి చంద్రముఖి
చూపులలో సూర్యముఖి
చలికేమో జ్వాలాముఖి
నను వలచిన నా సఖి

పరమాత్మను చేరలేక
పరితపించు ఆత్మలాగ
చెంతనున్న చిన్నారిని
చేరలేక చింతించితి

విసిగిపోయిన ఇంటి వెనుక
విరితీగెల జంపములో
వేసిన కుర్చీలోనే
మూసినాను కన్నులను

చల్లని సంక్రాంతి రాత్రి
పెల్లుబికిన దెల్ల ధాత్రి
అంతట చేయొకటి తాకె
వింత వెచ్చదనము ప్రాకె

అంటారు. అలాగే దాశరథి గారే 'సంక్రాంతి సుందరి' అనే మరో కవితా ఖండికలో...

బంతిపువ్వుల లేతనవ్వులతో
సంక్రాంతి సుందరి సాగివచ్చింది
తెలుగుపల్లెలు నిద్రలేచాయి
వెలుగులో కనువిప్పి చూచాయి
కొత్త అందం నృత్యమాడింది
సరికొత్త బంధం మదిని మెదిలింది
తిండి దొరకని పేదవాడైనా
నిండుగా భోంచేసి త్రేన్చేడు
ముసలిదైన జగత్తు ఫాలములో
కొసలుదేరెను క్రొత్త యౌవనము
అందచందాలొలుకు జవ్వనులు
అందుకొనిరీ పూలబాణములు
–అంటూ సంక్రాంతిని సరాగాల వేళగానూ రూపుకట్టించారు.

సంక్రాంతికి ఒకప్పుడు తెలుగుపత్రికల ప్రత్యేకసంచికలు వెలువడేవి. అసలు పండుగ వాతావరణాన్ని ఆ సంచికలో కవుల పద్యాలు వెల్లివిరియజేసేవి. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ వంటి నాటి వార పత్రికల సంక్రాంతి సంచికల్లో శ్రీ శనగన నరసింహస్వామి, శ్రీ మొవ్వ వృషాధిపతి, శ్రీ పైడిపాటి సుబ్బరాయశాస్త్రి వంటివారి పండుగ పద్యాలు విందొనర్చేవి.

ఇంటిముంగిట రంగవల్లికలను అంటే ముగ్గులను వర్ణిస్తూ శ్రీశనగన నరసింహస్వామి గారి ఈ పద్యం అమ్మాయిల చూపుల, నవ్వుల, చల్లని మనసుల మూడింటి చూపుల్లోని ఎరుపు, తెలుపు, శ్యామలత త్రివర్ణమయమైనట్లు ముగ్గుల్లో భాసించాయని చెబుతోంది.

అరుణ సరోరుహాక్షి సమదారుణదృష్టులు, పుండలీక సుం
దర ధవళాయతాక్షి తెలినవ్వుల చూపులు, మేచకోత్పల
స్ఫురదురునేత్ర నీలి జిగి చూడ్కులు గూడి త్రివర్ణ శోభలం
గురియుచునున్న ముగ్గులివిగో! భవనాంగణ శుభ్రసీమలన్

'హేమంత సంక్రాంతి' అంటూ శనగనవారు రాసిన ఖండిక ఎంతగానో అలరిస్తుంది.

శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారి 'కొత్త గోదావరి' పద్య కవితా సంపుటిలోని సంక్రాంతి పద్యాలు ఎంతో భావబంధురాలు. రాత్రి అనే సుందరి ఆకాశంలో ముగ్గువెయ్యడానికి ముందు చుక్కలు పెట్టిందట! ఆ చుక్కలే ఎంతో అందంగా కనిపిస్తుంటే చూస్తూండి పోయిందట. ఇంతలో భర్త రావడాన్ని చూసిన తొట్రుపాటులో ఒలికిపోయిన ముగ్గు పుష్యమాసం పండువెన్నెలలా వుందట!

"పొద్దున్నే వెళ్లి ఇప్పుడా రావడం" అని నిశ మూతిముడుచుకుంటే, ఆ భర్త తారలహారాన్ని బహుమతిగా ఇచ్చి కౌగిలించాడట. జారిన ఆమె మేలిముసుగు మంచు తెరలా కనిపించిందట.

గడపకు పచ్చబొట్టులిడగా మునుముందుకొకింతవంగ గీ
ల్జడ నునుకుచ్చులన్ బుజములంబడి జోడుకు జోడుగాగ వ్రే
లెడు గతికిన్ జిరాకుపడి లేమ శశిరంబు నెగర్చు వేళ మ్రో
వెడు మణిభూషణ ధ్వనులే యవు పిల్పులు క్రాంతిలక్ష్మికిన్

అంటూ గడపకు పసుపుబొట్టు పెట్టడానికి వంగిన అమ్మాయి జడకుచ్చులు భుజాలపై పడగా చిరాకుతో ఆమె తలఎగరేస్తే మెడలోని హారాలు గలగలమన్నాయట. అవే సంక్రాంతి లక్ష్మికి పిలుపులు కాబోలు అంటారు బేతవోలు వారు.

జడను లాగిన బావపై నలుకతోడ
నురిమిచూచెడు కాశ్మీర మొకట కంట
నుదిరిపడ నద్ది మూసి వేరొకట నతని
జూడ సిగ్గిల్లు మరదల చూడ్కి విందు

కొంటె బావ జడలాగితే, ఆ కోణంగి ఒక కంట అలక, మరోకంట సిగ్గులు జాలువారాయి! బావామరదళ్ల సరాగాలు పర్వశోభ కదా మరి!

ముగ్గువేసే ముదిత చేతుల
గంగిరెద్దుల గంగడోలున
దారిలో హరిదాసు పాటల
ఊరిలో తిరునాళ్ల ఆటల
వెల్లివిరిసే తెలుగుదనమూ
సౌరు చూడండి.
–అంటారు భైరవభట్ల కామేశ్వరరావుగారు.

నాటికీ నేటికీ సంక్రాంతి, కవులకు కవితావస్తువుగానే భాసిస్తోంది. కొత్త కవులు కూడా సంక్రాంతిని ఇతివృత్తంగా చేసుకుని పద్యరచన సాగిస్తున్న వారున్నారు. అలాంటి కొన్ని పద్యాలివి–

ఇంతలు ఇంతలై పుడమి యీ వలె సస్యము మానవాళికిన్
చింత రవంతలేని సుఖజీవన భాగ్యము కల్గజేయగా
శాంతి సమానతా సుగుణ సంపద తుష్టిని పుష్టినిచ్చు, సం
క్రాంతి శుభోదయంబు వనగావలె జాతికి భవ్యక్రాంతియై
–శ్రీమతి పింగళి మోహిని

తెలవారజామునే తెలుగు వాకిళ్ళలో
ముదితల్ వెలయింపు ముగ్గుబాట
గగనవీధులయందు కదనరంగముబోలి
బాలల గాలిపటాల వేట
ఘల్లుఘల్లున కాళ్ళ గజ్జెలను కదిలించి
గంగిరెద్దాడంగ గంతులాట
"హరిలో రంగో హరి హరీ! హరీ! హరీ" యంచు
హరిదాసు పాడంగ చిరతపాట
గోద, రంగనాథుల భక్తి గుడుల చాట
అరిసెలు, చకినాల్, పొంగళ్లు కరుగనోట
పులకరించు మనసు, జిహ్వ తెలుగునాట
కలుగు సంపూర్ణ తృప్తి సంక్రాంతి పూట!
–ఆచార్య ఫణీంద్ర

సరిగ్గా యాభైఏళ్ళ క్రితం అప్పటికింకా పద్యరచనా సాధన చేస్తూ, రాస్తున్న కాలంలో కృష్ణాపత్రిక 1969 సంక్రాంతి సంచికలో ఈ వ్యాసకర్త మీ సుధామ రాసిన పద్యం ఇది మీ కోసం...

**సంక్రాంతి వర్షము :**

రమణుల్ రచించిన రంగవల్లికలతో
ఇంటింటి ముంగిళ్ళ ఇంపు మీర
మంచు భయము తోడ మారిన తామర
లనిపించు బంతిపూ వరుసతోడ
పచ్చపచ్చని చేల పండిన పంటల
ప్రజల ముఖములు ప్రభల వెల్గ
అచ్చమైనట్టిదీ ఆంధ్రుల పబ్బంబు
సంక్రాంతి నిచ్చెరా సంతసమును
పంట యింటనుండు పబ్బంబు నాటికి
పిండివంట కొరకు చింతలేదు
కొత్త బట్టతొడుగు కోరికయును దీరు
ఏమి లోటు లేదు ఏటికంత

ఏటికొక్క తటిన ఏతెంచు నియ్యది
నేడు నొసగె ముదము నెంతగానో
నిజము చూడ నూత్నవర్షమ్మిదియెగాన
నెంతు కలుగు మీకు నెంతో శుభము. ✻

**(శివోహమ్ ప్రత్యేకసంచిక జనవరి 2019)**

# 5 కవితా వి(లోకన)కారి- ఉగాది

శ్రీరంజిల్లగ తెల్గుల
కారోగ్యము, పాడి, పంట యైశ్వర్యములన్
ధారాళముగా నొసగుము
నీరాజన మిదియెగొనుము నీకు వికారీ!

తీయని కంఠమెత్తి తమితీరగ తెల్గుల వైభవంబులన్
కోయిల కూయుచున్న దదుగో తిలకింపుము గున్నమావిపై
ఊయలలూగుచున్ మురియుచుండిరి బాలలు పూలతోటలో
హాయి! ఉగాది నేడు! దరహాసములందరి యాననమ్ములన్

ఎప్పుడో అరవై ఏళ్ల క్రితం.. అంటే 1959 లో 'వికారి' నామ సంవత్సరం వచ్చినప్పుడు 'ఆంధ్రపత్రిక'లో శ్రీ నేమాని సంగమేశ్వరరావుగారి ఆహ్వాన 'నీరాజనం' అది.

రమ్ము రమ్ము ఓ వికారి
రమ్మిదరి కొక్కసారి
సరాగాల పరాగాల
విరికన్నెల పరిమళాల
నొకపరి మూర్కొనగా...
వివాదాల విభేదాల విడిచి
బాలవినోదాల ఉనికి స్థిరం అనగా-
రమ్ము రమ్ము ఓ వికారి

అంటూ బాలసాహితీవేత్తగా పేరుగాంచిన శ్రీ ఆలపర్తి వెంకట సుబ్బారావుగారు నాడు ఉగాదికి స్వాగతం పలికారు.

అరవై ఏళ్ల తరువాత ఈ 2019 లో ఇప్పుడు ప్రవేశిస్తున్న 'వికారి' తెలుగు సంవత్సరాదికి రెండు తెలుగు రాష్ట్రాల భిత్తికపై, సంక్రమించిన దేశపు ఎన్నికల సంరంభ సమయాన-స్వాగతం పలుకుతున్నాం మనం!...

ఉగాది కాలానికి కోకిలలతో బాటు, కవికోకిలలు పలకడం తరాలుగా వస్తున్న ఆనవాయితీయే! తలంట్లు, కొత్త బట్టలు, పిండివంటలు, అల్లుళ్ళ రాకలు, పంచాంగ శ్రవణాలు కొత్త సంవత్సరాదికి ఎంతో మామూలో, కవి సమ్మేళనాలు కూడా అంతే ఆనవాయితీగా జరిగిన కాలం ఉంది. పత్రికల ప్రత్యేక సంచికలు, ఆకాశవాణి – ఉగాది సౌరభాలను ఉదీయమానం చేసేవి! దేవాలయాలు, రచ్చబండ చావిళ్లు కళకళలాడేవి!! సంప్రదాయ వైఖరులు మసకబారుతున్నప్పుడు, జనవరి ఒకటియే కొత్త సంవత్సరంగా శిరోధార్యం చేసుకున్నప్పుడు, ఉగాది ఈ తరానికి ఒక మామూలు పండుగగా పొడగడితే నివ్వెరపోనక్కర్లేదేమో! కాలానుగుణంగా గతానుగతికపు ఊహలు ఊడలు వేయడం అలా సాగుతుండగానే – కవి భావనల్లో మార్పులూ చోటు చేసుకుంటాయి. అది అనివార్యం.

పాడిన పాటేనా
ఇంకా పాతపాటయేనా

అనేవారుంటారు. "నా కుగాదులు లేవు – నాకుషస్సులు లేవు – నేను హేమంత కృష్ణానంత శర్వరిని – నాకు కాలమొక్కటే కారురూపు – నా శోకమ్ము వలెనే – నా బ్రతుకువలె – నా వలెనే" అని కృష్ణశాస్త్రిలా కృశించిన ఆశల వగపు జీవులూ ఉంటారు.

మహాకవి శ్రీశ్రీ "ఖడ్గసృష్టి'లో 'ఎవరిదీ ఉగాది'లో అతడు, ఆమెల చేత ఇలా సంభాషణాత్మకంగా ఉగాదిని సంభావింపచేస్తాడు.

ఇదిగో ఇంకో ఏడాది
ఎవరిదీ ఉగాది?
అడగాలా? ఇది నీదీ నాది
మన భావి సుఖాల పునాది
ఈ ఉగాది మనకిచ్చేదేది?
రోజురోజుకి తెచ్చేదేది?
రోజూ సూర్యుణ్ణి తెస్తుంది
వెలుతురు కానుకలిస్తుంది!!

సుఖాల వెంబడి దు:ఖం రాదా?
దుఃఖంలోనే ఆశాదీపిక
చీకటిలోనే తారాగీతిక!!
ఎవరి కోసమూ ఆగదు కాలం
కాలంతోనే మారును లోకం
కాలం మనదే లోకం మనదే
అవితెచ్చే రుచులన్నీ మనవే!!

అని ఆశావహ దృక్పథాన్ని ఎగదోస్తారు. నిజమే! కాళోజీ అన్నట్లు – “ఏడుమారినా, ఈడు ముదిరినా ఏమి మారినది ఈ లోకంలో” అనిపిస్తూంటుంది. కపట రాజకీయాలను చూస్తున్నప్పుడు శ్రీశ్రీయే ఒక చోట అన్నట్లు–

ఎన్ని ఉగాదులు రాలేదు
ఇంకెన్ని ఉగాదులు పోలేదు
ఎక్కడి దొంగలు అక్కడే
ఎక్కడి గొంగళి అక్కడే

అనిపిస్తుంది. కానీ “ఈ ఉగాది మహోదయ వేళ – ఈ వసంత నవోదయ వేళ – విప్లవ శంఖం పూరించుదాం – విజయ దుందుభి మ్రోగించుదాం” అన్న ప్రబోధం చూస్తూ, “ఈ నూతన సంవత్సరం నవ చేతన సంపత్కరము – యువజీవన శోభావహము – కవితామయ బృందావనము” అన్న స్ఫృహనే అందుకోవాలి మరి!

శ్రీ కాలనాథభట్ల ఫణీంద్ర అనే కవి ఉగాదివేళనే ఎన్నికలు వచ్చిన సందర్భంలో – గతంలోనే ఇలా రసాభివ్యక్తి చేశాడు–

ఎలకోయిల కాదిది, ఎలక్షన్ల కోయిల
హామీల కొమ్మెక్కి హాయిగా కూస్తుంది
తీపిపాటల గాలమేసి
ఎండ ‘మావి’ ఆమనని అంటగడుతుంది
అసలు రంగు నలుపని తెలిసినా కూడా
కూతలకీ, కోతలకీ చప్పట్లు ఎందుకో
ఆ ఉగాది పచ్చడి చేదని తెలిసినా

తినడమెందుకో, తిరిగి అనడమెందుకో
మనసు పుష్పించే మంచిపూలెన్ని?
కాయల్ని మనకిచ్చే మావిచెట్లన్ని?
చిగురుటాకులూ, చల్లగాలులూ అన్నీ తోటకోసమా?
తన కోసం తనే తెచ్చుకున్న ఆమని మనదెప్పుడయ్యింది?
ఇప్పుడు మనకోసం కూసే మనదైన కోయిల కావాలి
మనకోసం పూసే మనదైన ఆమని రావాలి
కోటిగొంతులు కలిపి కొత్త కోయిల పుట్టాలి
గుండెలో ఆమని  కోటలు కట్టాలి
ఇక.. చేతులు చాచి నింగిచెట్టును అందుకోవాలి
మన 'తారాఫలాలు" మనమే తెచ్చుకోవాలి!

నిజమే కదా! తనే అన్నట్లుగా...

ప్రతి ఉగాది ఒక జీవిత పాఠం
కోయిలపాటే జీవనగీతం
కొమ్మలరెమ్మల  పాఠశాలలో
పూసిందీ నా మానస కుసుమం

అని సామాన్యుడు అనుకోగల్గుతూంటాడు. జీవితమే వాస్తవం! కాలం మనం ఏర్పరచుకున్న ఒక సౌలభ్య విభజన. ఉగాది మూలకందంగా అందుకే కవులు జీవిత సత్యాలను వర్తమాన నేపథ్యంలో చెబుతారు. సమాజ స్థితిగతులనూ, వర్తమాన రాజకీయాల డొల్లతనాలనూ నిలేసి ప్రశ్నిస్తూంటారు ప్రగతిశీల కవులు.

కొరడాలు విసిరితే కోకిలలు కూయవు
కత్తులు ఝుళిపిస్తే కొమ్మలు విరబూయవు
కొత్త ఆలోచనల కోకిల నా హృదయం
కొత్త అనుభూతుల కొమ్మ నా ఆత్మ
ప్రగతి పల్లవాలు పల్లవిగా పాడుకోనీయండి దాన్ని
ఆనందచేతనం కేతనంగా ఆడుకోనీయండి దాన్ని

ప్రతి చెట్టుకూ పూచే హక్కుంది
ప్రతి పక్షికీ పాడే హక్కుంది
అని నిరూపిస్తున్నది ఆమని
జీవన రాగోద్దీప్తనని

అంటాడో కవి. ఇది సార్వత్రిక ప్రాకృతిక సత్యమే కదా! మార్పు అనివార్యం. ప్రతి పరిణామమూ మార్పులో భాగమే! మంచి మార్పుకోసం కృషిని కొనసాగిస్తూ, అప్పుడప్పుడు చేదు ఫలితాలు ఎదరైనా నిరుత్సాహపడకూడదు. ఉగాది కవీ- ఉగాది కాలం చెప్పేదదే!

తన పాటల ఉదాత్తభావాల తోటల్లో విహరింపజేస్తూ ఈ ఏడే పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన ఉగాది కవిత అలవోకగా అందించిన ఓ "మేలుకొలుపు'గా భాసిస్తోంది. అందులో అంటాడు తను-

కాలానికీ, భూగోళానికీ ఉగాదులూ కొత్త కాదు
ఉషస్సులూ కొత్త కాదు
గతం అంటే కేవలం జ్ఞాపకం అనీ
ఆగామి అంటే ఊసుపోని ఊహల వ్యాపకమనీ
చైత్రశుద్ధ పాడ్యమివచ్చి ట్యూషన్ చెప్పేదాకా మనకి తెలియదా?
మాఘమాసపు మంచుగాలికి పట్టిన పడిశం వదిలించుకుని
మావికొమ్మల్లో కచేరీ పెట్టిన కోకిలయ్య
పంచమంలో ప్రకటించేదాకా
అది అనాది ప్రకృతి గానమనీ
షడ్రుతువుల రాగమాలికలో సాగే ఆ గీతానికి
నిత్యం ఆదితాళమనీ ఎరుగమా మనం?
కొత్త పంచాంగం కట్టుకొచ్చినంత మాత్రాన
దినపత్రిక కల్యాణ సుముహూర్తాల పట్టికైపోతుందా?
ఆకలి, అవసరం, అసహాయతా, అత్యాచారం, ఆక్రోశం, అరాచకత్వం...
వాటి అడ్రస్సులు పబ్లిషవడం ఆగిపోతుందా?

మరీపాటి భాగ్యానికి పనులన్నిటికీ శెలవుపెట్టి
మన మూడొందల అరవై అయిదు రోజుల్లోంచి
ఈ ఒక్కరోజునీ పైకి తీసి, దులిపి, పండుగ
పేరుపెట్టి.. ప్రత్యేక అతిథిగా పెద్ద పీట వేసి
కోలాహలంగా సాగించే ఈ పాత సరికొత్త వేడుక ఎందుకూ?

అంటూనే, మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అంశాలను హెచ్చరిక చేస్తారిలా...

మాసిన తలల్ని కుంకుళ్ళతో అంటుకునేముందు
మూసుకున్న తలపులకీ, వాటి వెనుకనున్న అభ్యంతరాలకీ
అభ్యంగనం చేయించామా?
అప్పోసొప్పో చేసి కొత్త బట్టలు కుట్టించుకునే ముందు
చిరుగులు పడ్డ జీవన వాస్తవాలకి కుట్టువేసుకోగలిగామా?
మన కళ్ళెదెట కదుల్తున్న పగటివాస్తవాలని
మనవికావులే అని కళ్ళు మూసుకున్నా–
అవే వాస్తవాలు రాత్రిపూట పీడకలల్లో
మనముఖాలే తగిలించుకుని ఎదురౌతూ ఉంటే
ఆ కలవరింతల్నుంచి మేలకోగలుతున్నామా?
ఆశయాల్నీ, ఆదర్శాల్నీ ఆశల అంబరం నుంచి
ఆచరణల ధరాతలం మీదకి దింపలేక మనమే స్వప్నపక్షాల్ని కట్టుకుని
నీరవ నిశీధిలో విహాయసవిహారం చేస్తున్నాం కానీ
నేలమీద కాలూనే ప్రయత్నమేమైనా చేస్తున్నామా?
పండగంటే మూడువందల అరవై నాలుగు రోజుల
కలల కల్లోలాల కలవరింతల పతాకస్థాయి కాదు
నిదరని నిధనం దాకా సాగదియ్యకుండా
నిజంలోకి మేల్కోవడానికి పెద్దపనేం పెట్టుకోవద్దు!
పెద్దపెద్ద కబుర్లూ వద్దు! నిద్దర్లేద్దాం చాలు

–అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి.

"కవి వట్టి వసంత కోయిల కాదు, ఏడాదికొకసారి వచ్చి పోవటానికి. కవి మట్టి మనుషులకు తోవచూపే అక్షరజ్వాల". అందుకే నిజమైన కవి ఉగాది సందర్భం అందిపుచ్చుకున్నా, వర్తమాన జీవనపథంలో ఒక ఆశావహమైన సూచికలను సమస్యల ముళ్లదారిలోంచే సుగమం చేసి అందిస్తాడు. ఉగాది సమ్మేళనంలో ఇతివృత్తం కాజాలని అంశం అంటూ లేదు నిజానికి. సామాజిక వాస్తవాలకు వెన్నిచ్చి ఊహాలోక విహారం చేసేవారినీ కవి నిరసిస్తాడు ఒక్కోసారి.

ఉగాదికి ఊరంతా కవిసమ్మేళనాల వాసనే
కంఠాలు తెగిన కోయిలల చేత
కమ్మగా పాడించాలని కవుల ప్రయత్నం
ఆయువు తీరిన వసంతానికి
పద్యాల పూలజడలు అల్లుతున్నారు
చేదును మాత్రం మిగుల్చుకున్న ఉగాది పచ్చడికి
రుచీ, వాసనా లేని మాటల తలపాగా చుడుతున్నారు.

అంటాడో కవి. ఉగాది అంటే కోయిలలు, మావిపూతలు, వేపచిగుళ్లు, పంచాంగ శ్రవణాలు అంటూ చర్విత చర్వణాల పాత పద్ధతులు పట్టుకుని వేలాడక, వాస్తవంలోకి రండి అని ఎలుగెత్తే కవులున్నారు.

ఈ దినమెల్లడన్ కవులు యింపుగ పద్యములల్లుచున్ వసం
తోదయ గాన మెంచెదరు తుల్యత గూడిన జీవితేచ్ఛతో
వేదులు భావికాలమున వెల్వెడు శోభను జెప్పుచుండగా
వాదము లేక లోకులిట పావన భావన యుక్తులైజనన్

అంటారు క్రొవ్విడి వెంకట రాజారావుగారు.

శ్రీ తరిమెళ్ళ శ్రీనివాసప్రసాద్ అనే కవి ఈతరం 'ఉగాది కవిత' ఇలా అభివ్యక్తీకరిస్తున్నాడు.

ఉగాది పచ్చడి అమెజాన్‌లో ఆర్డరిచ్చి
కోయిల గానం యూట్యూబ్‌లో వింటున్నా
కవి సమ్మేళనాన్ని వాట్సప్‌లో తిలకిస్తూ..
తెలుగు పద్యాల్ని గూగుల్‌లో గుర్తుచేసుకుంటున్నా

మామిడి తోరణాల్ని మెసెంజర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నా
కొత్త బట్టల్ని ఫ్లిప్‌కార్ట్‌లో క్లిక్ చేసుకుంటున్నా
అతిథులకు ఈమెయిల్‌లో విందునందిస్తున్నా
నిండైన తెలుగుదనాన్ని ఫేస్‌బుక్ నుంచి తస్కరిస్తున్నా
ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపి...
షట్టర్ వేసుకుని నిదరోతున్నా

అంటాడు. ఆధునిక సాంకేతికత ఉగాది కాలాన్ని ఏ తీరున ఉద్దీపన చేస్తున్నదీ ఇదొక వాచవి మరి!

ఇది వసంతమ్ము: మదిరేక్షణల స్పర్శాది
కములతో చెట్లు సైతం పులకరించునట
చెట్లకన్నను రెండు మెట్టైన మిన్న కా
నా! సఖీ! నాకు దోహదము కల్పించవా!

అంటూ సతిమోల విరహార్తి ప్రకటనం చేసే కొత్త వరుడిగా డా.సినారె మురిపెంగా కానవస్తారు. అదే సినారె తనదనంతర కాలంలో 'వింత వసంతం' అనే ఉగాది కవితలో–

చిగుళ్ళు – పురిట్లో సంధికొట్టిన శిశువుల్లా ఊడిపడుతున్నాయి
పండుటాకులేమో గబ్బిలాల్లాగా పట్టుక వ్రేలాడుతున్నాయి

పడతుల విగ్గు సిగల మడతల్లోంచి ప్లాస్టిక్ మొగ్గలు పలకరిస్తున్నాయి
విలాసినుల నీలి కళ్ళజోళ్ళలోంచి చిలిపి చూపులు ఫిల్టరవుతున్నాయి
తెల్లని నైలాన్ మబ్బులు తొడుక్కుని ఒళ్ళు దాచుకుంటుంది ఆకాశం
సహనమనే లేబుల్ అంటించుకుని జావగారిపోతుంది ఆవేశం

స్ఫోటకం మచ్చలు బయటపడతాయని సుధాంశుడు దిగాలు పడుతున్నాడు
గంధకం వాసనల్ని మోయలేక గంధవహుడు గగ్గోలు పడుతున్నాడు
పంచాంగం చెబుతున్నది వసంతం ప్రకృతిలో మందహాసం చేసిందని
ప్రబంధకవులుంటున్నారు మరుడు పంచబాణాలు పదును పెడుతున్నాడని

–అంటూ కాలవిపరిణామాన్ని 'కలం'కారీ చేశారు.

ఉగాదిని నవవసంత సీమంతినిగా, కన్యకగా కవితలల్లిన వారెందరో ఉన్నారు. ఉగాదియే ఇతివృత్తంగా ఒక మొత్తం కవితాసంకలనాన్ని తొలిసారి 'వెండిపూలు' పేరిట హైదరాబాద్‌లో తారకా ఆర్గనైజర్స్ సంస్థ యువకవులకు ప్రాధాన్యత కల్పిస్తూ 1960 దశకంలో వెలువరించింది. ముఖమల్ అట్టతో సుధామ వేసిన ముఖచిత్రంతో, ప్రముఖ కవి అరిపిరాల విశ్వంగారి పీఠికతో ఆ సంకలనం ఆ రోజుల్లో ఒక ప్రత్యేకత సంతరించుకుని అలరారింది.

ఉగాది కవిసమ్మేళనాల ఆనవాయితీ నాటికీ, నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నదే. 'దేశోద్ధారక' కాశీనాథుని నాగేశ్వరరావు గారు ఆంధ్రపత్రిక స్థాపించి ఉగాది ప్రత్యేక సంచికలను ఏటేటా వెలువరించేలా శ్రీకారం చుట్టి– ఎందరో కవులను, రచయితలను ఆ దిశగా ప్రోత్సహించారు. బహుశా ఉగాది గురించి ఏదో సందర్భంలో ఒక్క కవితైనా వ్రాయని కవి అంటూ లేడంటే అతిశయోక్తి కాదేమో!

కాళిదాస కవీంద్రుని కావ్య దివ్య
కనక కల్లోలినిం దేలి కాంతులెసగ
పరిఢవిల్లెడి భావనాపద్మ మనగ
కానుపించితివమ్మ యుగాదిలక్ష్మి

అంటూ 'అంజలి'ంచిన (శ్రీ పి.వి.ప్రసాదరావు) కవులెందరెందరో!

దుబారా చేసిన గతాన్ని
దుఃఖంతో వీక్షించటం కన్నా
పుంఖానుపుంఖాలుగా
వెలుగు ఎలుగెత్తి భావిని తిలకిద్దాం!
గుత్తకు తీసుకోలేదు గడియారం
కాలం విలువైన మూలధనాన్ని
నీ చేతులలో కాలముంది
నీ చేతలలో కాలముంది
నీ చేతంలో కాలముంది
నీ హృదయంలో కాలముంది

అంటారు కె.శివారెడ్డి.

'మేలుకొనే ఉగాది' అనే కవితలో అద్దేపల్లి రామమోహనరావు – "ఈ క్రొత్త ఏడాది తొలి మెట్టుమీద కొలుపెట్టి / ఒక్కసారి వెనుదిరిగి చూస్తే గతించిన ఏడాది మహాకాలభూతంలా కనిపిస్తోంది ఇప్పుడు / ఈనాడు.. కాలం విలువ కోసం విలపిస్తున్నప్పుడు / నిమిషం కొన్ని యుగాల బరువై గుండెలో నిలిచి / కన్నీటి బిందువులై అరచేతిలో పడుతున్నది / నిమిషానికింత బరువుంటుందని / కిందటేడు మొదటిరోజున తెలిస్తే / ఇన్నివేల నిమిషాల్ని తేలిగ్గా వదిలేసేవాణ్ణి కాదు / గతకాలపు కన్నీటిలోని భవిష్యత్ కాంతిని గుర్తించి ఉంటే / ఏడాది పాటు నన్ను మరచి నేను తిరిగేవాణ్ణి కాదు. / కానీ ఎంత ఏడ్చినా గతకాలం తిరిగిరాదు–

నా ముందు మరో కొత్త ఏడాది / కళ్ల నిండా కలలతో నిలచి నాకు స్వాగతమిస్తోంది / ఈ ఏడాది ప్రతి నిమిషాన్నీ నా గుండెకు ముడివేస్తాను. / నా కలల మధ్య నుండి కాలాన్ని కారిపోనివ్వను. / ప్రతిక్షణం నా లోపల నేను మేల్కొని/ ప్రతి అనుభవాన్నీ నా మెలకువతో వెలిగించి / కాలాన్ని నా బానిసగా చేసుకుంటాను./ వచ్చే ఏడాది మొదటి రోజున వెనక్కి తిరిగి చూచినప్పుడు / గత వత్సరాన్ని చూసి భయపడను / తృప్తిగా, నిండుగా నిట్టూర్పు విడుస్తాను."

అంటూ మనిషి గతంలో కాక వర్తమానంలో జాగరూకుడై జీవించాలని స్వీయానుభూతిగా ప్రబోధిస్తారు.

ఏమైనా కాలం ప్రవహిస్తూనే ఉంటుంది. అరవై సంవత్సరాలుగా తెలుగు సంవత్సరాదులు పరిభ్రమణం చేస్తూనే ఉంటాయి. తాను పుట్టిన సంవత్సరాన్ని అరవై ఏళ్ళు జీవించిన మనిషి మరొకమారు చూడగలుగుతాడు. దానికీ నోచుకోని జీవులూ ఉంటారు. షష్టిపూర్తి వేడుక అందుకే వ్యక్తి జీవనగమనంలో ఒక జీవనసాఫల్య ప్రతీక.

ఆమని వచ్చింది సరే ఏమని చెప్పిందీ
ఈ మన పూదోటకు తానేమిటి తెచ్చిందీ?
ఆడినదే ఆటగదా పాడినదే పాటగదా
ఈ యేడొక కొత్తదనం ఏదో కనిపించదో!

అని వింజమూరి శివరామారావు గారన్నట్లు, ప్రతి ఏడు కొత్తదనం ఏదో తప్పక పరిఢవిల్లుతుంది. అదే మనిషి ఆశ, అదే మనిషి శ్వాస.

అరవైఏళ్ల క్రితం వికారి వత్సరాదికి శ్రీ జోస్యము జనార్దన శాస్త్రి పలికిన స్వాగతమే ఈ వికారికి సరికొత్త ఉపాయనంగా సంతరించుకుని స్వస్తి అనుకుందామా మరి!

నవకంపు లేమావి చివురుతోరణముల
గనుపండువైన రంగస్థలమ్ము
పంచమశ్రుతి మేళవించి చూపఱ మది
లోగొను కలకంఠ రాగకలన
లంబమాన విలంబ లాసకా చాతురీ
శ్లథమానమైన ప్రేక్షకచయమ్ము
పసుపు కుంకుమ మొగాలెసగ నారతిబట్టు
శారికా కీరికా శీరుతమ్ము
ప్రకృతి విష్కంభయోగ సంపత్తి గూర్చె
చైత్రక వసంతక ప్రవేశమ్ము నయ్యె
ఇక వికారి నాటకము కానిత్తంగాని
బసకరణమును వ్యత్యస్త పఱపబోకు

నీ జననంపు వేళ జననీ జనకుల్ భవితవ్యభావి సం
యోజన లాత్మలం దెలిసియో భవదీయ సూరూప భావ సం
జ్ఞాజనకంపు నామకరణం బటు చేసిరికాక, భూమిలో
నే జనులున్ వికారియని యీ గతి పేరులు కల్గియుందురే!

గురువుల గౌరవోన్నతులు కుంచితమౌ సమయంబునన్ గురూ!
దొరతన మే గతిన్ నెఱపెదో? కుజునన్దగమంత్రిజేసి, దు
ష్కరమగు సైన్యనాయకత చల్లని రాజుకు గట్టపెట్టి, ము
ష్కరు దపనున్ రసాధిపతిగా, నిజనీరసతా ప్రవృత్తితో. *

**(శివోహమ్–ఉగాది ప్రత్యేక సంచిక 2019)**

# (6) నాకు నచ్చిన ప్రసంగకళ

**భా**ష అనేది భావవినిమయ సాధనం, మాట్లాడేదాన్నే భాష అంటాం. రాస్తే అది లిపి. లిపి లేకుండా భాషలుంటాయిగానీ, భాష లేకుండా లిపి అనేది ఏర్పడదు. లిపి అక్షరాస్యుడుకి మాత్రమే అందుతుంది. భాష నిరక్షరాస్యులకు కూడాను. చాలాకాలం మౌఖికభాష వేరు. గ్రంథస్థభాష వేరు. మాట్లాడినట్టే రాయాలనే–వ్యావహారిక భాషోద్యమం వచ్చింది. రచనలో అనేక సాహిత్య ప్రక్రియలు. అసలు సాహిత్యప్రక్రియ అనగానే అది ఉద్దేశించింది పాఠకుడికి అనీ, రచన అనేది ఒక ప్రక్రియలో సాగుతుందనీ స్థిరపడిపోయింది. అందువల్లే ఉపన్యాసం ఒక సాహిత్య ప్రక్రియ అంటే అది వ్యాసరూపం దాల్చినప్పుడే కదా అనుకుంటాం!

కానీ మౌఖిక సాహిత్య ప్రక్రియలుగా గుర్తించవలసినవి వున్నాయి. పదకర్తలు ఆశువుగా పాడతారు. జానపదగీతాలూ (జానపదబాణీల్లో గీతాలు కాదు) అలా పుట్టినవే. ఒకరు రచన చేసినప్పుడు మునుపు అది ఇంకొకరికి చదివి వినిపించడం అనే గుణం వుండేది. ఇంట్లో భార్యకయినా, స్నేహితులకయినా ఎవరికో ఒకరికి వినిపించడం జరిగేది. అచ్చు అయితేనే రచనకు సార్థకత అనుకుంటున్నాంగానీ, అది వినిపించినప్పుడు, విని నలుగురూ మెచ్చితే చాలనుకోవడం పోయింది ! అచ్చు కాకుండానే తన రచన ఎవరికయినా వినిపిస్తే అది వాళ్లు రాసేసుకుని, అచ్చులో ఉపయోగించుకుంటారని భావించే వాళ్లు ఎక్కువయ్యారివాళ ! ఇంతకీ ఈ ఉపోద్ఘాతం అంతా ఉపన్యాసం గురించి ఆలోచించడానికే. 'ఉపన్యాసం' ఒక సాహిత్య ప్రక్రియగా కాకున్నా 'ప్రసంగకళ' అంటూ, దానినొక 'కళ'గా మటుకు మనవారు సంభావించారు. నిజానికి ప్రక్రియ అంటే 'ఫార్మట్'. అంటే రూపాన్ని ఏర్పరిచే నిర్మాణం. కవితకు, కథకు, వ్యాసానికీ, ఉపన్యాసానికి వాటివైన నిర్మాణాలున్నాయి. నిజానికి మౌఖికంగా వున్నా, లిపి రూపకంగా వున్నా ఒకే నిర్మాణంతో రాణించగలిగితే బాగానే వుంటుంది. అలా జరగడం లేదు.

ఏమైనా కానీ పాఠకుడికీ, శ్రోతకీ తేడావుంది. తను ఒక సాహిత్య ప్రక్రియను పాఠకుడుగా అందుకోవడానికీ, శ్రోతగా అందుకోవడానికీ తేడా వుంది. రచన

అచ్చులో  చదువుకునేటప్పుడు అర్థం కాకపోతే, వెనక్కు వెళ్లి చదివి మళ్లీ-రచయిత భావం ఏమై వుంటుందా అని తర్కించి అర్థం చేసుకోవచ్చు. కానీ శ్రోతకు ఆ సౌలభ్యం వుండదు. ముఖాముఖిగా వుంటే-'ఏదీ ఇంకోసారి చదువు' అని అడగవచ్చునేమో గానీ, సభాముఖంగా అనేకమంది శ్రోతల సమూహంలో వుండి వింటున్నప్పుడు అది కుదరదు. అలా అడిగితే అది సభామర్యాద కాకపోవడం ఒకటి అటుంచి, అందరికీ అర్థమై తనకే అర్థంకాలేదని అడుగుతున్నానేమోనన్న న్యూనతాభావమూ పొటమరించవచ్చు. శ్రోతగా ఒక్కసారి వినే అర్థం చేసుకోవాలి. ఆనందించగలగాలి.

నిజానికి రచయితలందరూ అక్షరాలలో వలెనే, మాటల్లోనూ మంచి 'కమ్యూనికేటర్స్' కాకపోవచ్చు. వక్తృత్వం వేరు, రచన వేరు. రెండింటినీ సవ్యసాచిగా నిర్వహించగలవాడు నిజంగా ప్రతిభావంతుడే. చాలా మంది కవులు కవిసమ్మేళనంలో కవితచదివి శ్రోతలను మెప్పించలేరు. ఇవాళ కవిత్వం-అర్థమైనా కాకపోయినా పాఠకులపరమే ఎక్కువైపోయింది. శ్రోతలను మెప్పించలేదు. ఇవాళ కవిత్వం-శ్రోతలకు అర్థమయ్యేలా, వారిని మెప్పించేలా, వారి కరతాళధ్వను లందుకునేలా కవి సమ్మేళనంలో కవిత వినిపిస్తే-ఇవాళ కవిత్వపు కొలమానాలతో దానిని కవితగానే అంగీకరించని స్థితి ఏర్పడింది. కవి సమ్మేళనమయినా ఆనందించగలంగానీ, 'కథాపఠనం' అసలు భరించలేమనుకుంటున్నారు శ్రోతలు.

విషయ ప్రాధాన్యం వుంటూ, సభారంజకంగా ప్రసంగించగలడమే ఉపన్యాస ప్రక్రియ. అందుకే అది 'కళ' అయింది. "ఏ విషయం మీదనయినా మగవాళ్ళు అనర్గళంగా ఉపన్యసించగలరు" అని ఒకరంటే- "అలా ప్రసంగించడానికి స్త్రీలకు ఒక విషయం అంటూ ఏమీ అవసరంలేదు" అని మరొకరన్నారని ఒక జోక్! ఉపన్యాసం చేయడం వట్టిమాటలు కాదు. నగరంలో సాహిత్య సభలకు ఈ రోజుల్లో జనం ఎందుకు ఎక్కువ రావడం లేదంటే, విని తెలుసుకోదగింది ఏమీ లేకుండా, ఊకదంపుడు వ్యవహారాలు ఎక్కువయ్యాయనేది ఓ ఆరోపణ. రోజుకు ఒక సభో, రెండు సభల్లో పాల్గొనే వక్త మాట్లాడే విషయాలు చర్వితచర్వణంగా వుంటున్నాయని-శ్రోతలు మారకుండా వారేఅయితే ఇట్టే గుర్తిస్తారు. 'రిపీట్' అవడం రచనల్లోనూ జరుగుతుందేమోగానీ, ఆ పునశ్చరణం మాటల్లో తొందరగా పట్టుబడిపోతుంది.

అందుకే మాట్లాడే, అభినయించే-రాజకీయ నాయకులనూ, నటులను అనుకరించే 'మిమిక్రీ' కళ పెరిగింది. సాహితీవేత్తల రచనలనూ బాగా చదివితే తప్ప 'పేరడీ'లు సృష్టించడం అంత సులభంకాదు.

వ్యాసం రాసుకువెళ్లి ఉపన్యాసం ఇవ్వడానికీ, ఉపన్యాసం ఇచ్చి వ్యాసం రాయడానికీ బోలెడు తేడా వుంది. ఉపన్యాసానికి శ్రోతలను ఆకట్టుకుని రంజించడం, తక్షణ ప్రభావం కలిగించడం ముఖ్యం. రచనకు పాఠకుడిని పరమావధిగా పెట్టుకుంటారు.

'వినదగునెవ్వరు చెప్పిన' అన్నారు. నిజానికి 'మౌఖికమే' ముఖ్యం. సంబంధాలు లిపి మీదకాదు, పరస్పరం మాట్లాడుకునే భాషమీద ఎక్కువ ఆధారపడి సాగుతాయి. జనమమేకమైన వాడుగా ఒక 'మాటకారి' ఎక్కువ రాణిస్తాడు. వాక్కూ అర్థమూ కలవాలని అన్నారుగానీ, లిపికి-ఆనుషంగిక ప్రయోజనమే.

తమాషా ఏమిటంటే పాఠశాలలో విద్య బోధించేవారు అధ్యాపకులు. కళాశాలల్లో బోధించేవారిని ఉపన్యాసకులు అంటున్నాం. అంటే లెక్చరర్సే వక్తలా? నిజానికి తమ బోధనద్వారా అంటే తమ మాటలతో విద్యార్థులపై ప్రభావం వేయగల దక్షత గలవారందరూ మంచి వక్తలు, ఉపన్యాసకులు. బోధనలతో సంబంధం లేకుండా వివిధ రంగాలలో అద్భుతమైన వక్తలు, ప్రాసంగికులు వున్నారు. ఉపన్యాసం ఇవ్వడాన్ని గురించి మాట్లాడుకుంటున్నప్పుడు ఓ విషయం గుర్తుకొస్తోంది.

ఒకమారు జార్జ్ బెర్నాడ్‌షా దగ్గరకు తాము ఏర్పాటు చేయబోయే సభలో ఉపన్యసించమని ఆహ్వానించడానికి ఆ సంఘ కార్యకర్తలు వెళ్లారు. 'ఎంతసేపు' అన్నాడట. 'ఓ గంటసేపు' అని వారనగానే – 'అలా అయితే సభ రేపయినా నేను సిద్ధమే' నన్నాడట షా. 'అబ్బే! ఓ అరగంట చాలు లెండి" అన్నారట. 'అలా అయితే నాకు ఓ నాలుగు రోజులు గడువివ్వండి." అన్నాట్ట 'షా'. కార్యకర్తల్లో ఇంకొకతను సమావేశంకు ఎవరెవరిని పిలుస్తున్నదీ చెప్పి, అందువల్ల "ఓ పావుగంట ప్రసంగించినా మాకు మహద్భాగ్యం" అన్నాడట 'షా'తో. ఆయన తలపంకించి 'అయితే ఓ పదిహేనురోజుల తరువాత సభపెట్టుకోండి' అన్నాడు. అంత సమయం అనేసరికి ఖంగుతిని కార్యకర్తలు– "మీరు రావడమే మాకు మహద్భాగ్యం! మీరు ఓ అయిదు నిమిషాలు మాట్లాడితే చాలదటండీ శ్రోతలు పొంగిపోవడానికి" అని పొగిడారట

సమయం నిర్దేశనం మారుస్తూ. "అయిదు నిమిషాల ప్రసంగం అంటే నాకు ఓ నెల రోజులయితేగానీ కుదరదు" అని లేచాడట బెర్నాడ్ షా.

గంటలు గంటలు ఉపన్యసించడం కన్నా ఓ అయిదు నిముషాలు ప్రసంగించి ఆకట్టుకోగలగడం ఎంత సాధనతో సాధ్యమయ్యేదీ 'షా' మాటలనుండి మనం గ్రహించవచ్చు. ఉపన్యాసకులకు తాము మాట్లాడేదాని మీద అంత శ్రద్ధా, శ్రమావుండి. ఉపన్యాసం ఎంతసేపయినా శ్రోతృజనరంజకంగా ప్రసంగించగలగడం గొప్ప నేర్పు. ఇచ్చిన అంశంమీద-అది ఎలాంటిదయినా విషయవివరణం చేస్తూ ప్రసంగించి శ్రోతలను ఆకట్టుకోవడం వట్టి మాటలు కాదు.

ఏదైనా విన్నదాని ప్రభావం తక్షణం వుంటుంది. ఎక్కువగా ఉంటుంది. దృశ్య మాధ్యమాలకు అందుకే అంత ప్రభావం. ఒక్క శ్రవ్య మాధ్యమమే అయిన రేడియో ఒక తరంపై ఎంత ప్రభావం వేసిందో ఆ తరం వారికే తెలుసు. అక్షరాస్యత ఎంతపెరిగినా నేడు పత్రికలకన్నా టీవీలు, సినిమాలు జనజీవనంలోకి ఎలా చొచ్చుకుపోయాయో వేరే చెప్పాలా?

శ్రోతృజనసమూహానికి చేసేది ప్రసంగం. సాహిత్యం విషయంలో సాహిత్యోపన్యాసం. ఉపన్యాసం నిడివి పెద్దదనీ, ప్రసంగం నిడివి చిన్నదనీ మనకొక భావన. అధ్యక్షుడు, ముఖ్యఅతిథి, విశిష్ట అతిథి, ఆత్మీయ అతిథి, పరిచయ ప్రసంగకర్త, శుభాకాంక్షలందించేవారు అంటూ ఇవాళ సభల్లో ఏ పేరిటవున్నా అంతా సభల్లో మాట్లాడేవారే. ఓ గ్రంథావిష్కరణ సభలో అధ్యక్షులు, ముఖ్య అతిథీ వీరంతా మాట్లాడాక అసలు గ్రంథపరిచయ కర్తకు విషయం ఏమీ మిగలదని శ్రోతలే అనుకుంటూంటారు. సభలో ముందు ప్రసంగించాలని ఆత్రపడేవారుంటూ వుంటారు. శ్రోతలను సభ చివరికంటా కూర్చోబెట్టగలిగితే ఎప్పుడు ఎవరు ఎంత మాట్లాడినా మేలే!

మాట ప్రభావం గొప్పది. 'మాటే మంత్రమూ' అన్నారు మనవాళ్లు. మంత్ర ముగ్ధుల్ని చేసింది అని ఒకరు మాట్లాడినదాన్ని గురించి మెచ్చుతుంటారు. నిజమే! ఒక ఉపన్యాసం శ్రోతలలో ఎవరిని ఒక మంచి పాఠకునిగా చేస్తుందో, ఎవరిని రచనకు పురికొల్పి ఒక రచయితగా మలుస్తుందో, ఎవరిని జీవితంలోనే ఒక మార్పుకు గురిచేస్తుందో, ఎవరిని ప్రభావితం చేసి ఆచరణోన్ముఖం చేస్తుందో వక్తకు తెలియదు. అనుభూతి చెందిన ఆయా శ్రోతలకు తప్ప. ఉపన్యాసం వేసే ప్రభావం, వ్యాసంగా

ఆ వక్తే రచించి అచ్చులో అందించినా కలగదు. ఆ శ్రోతే ఆ పాఠకుడు అయినా ఆ ప్రభావం వుండదు.

నాటి దివాకర్ల వేంకటావధానిగారు గానీ, నేటి జ్వాలాముఖిగానీ స్వయంగా కవులూ రచయితలూ అయినా, వక్తలగానే వారికి పేరు వచ్చింది. వక్తగా కృష్ణశాస్త్రిగారికి పేరున్నా ఆయన గొంతు మూగపోయాక చాలా మందికి ఆయన కవిగానే తెలుసు. సి.నారాయణరెడ్డిగారు రోజుకు రెండు సభల్లో మాట్లాడినా ఆయనను కవి అంటారేగాని జనం వక్త అనరు. మంచి వక్తలుగా, ఉపన్యాసకులుగా పేరుతెచ్చుకున్న కవులు, రచయితలున్నారు. ఇవాళ రచనమీద వున్న శ్రద్ధ కొందరికి – శ్రోతలకు దానిని అందించడంపై లేదు. మహాప్రస్థానం గీతాలు శ్రీశ్రీ కంటే ఎంతో భావస్ఫూర్తితో, ఆవేశంతో వినిపించి ప్రభావితం చేసిన వారున్నారు. రచయిత స్వయంగా వక్త, ఉపన్యాసకుడు, శ్రోతకు భావ వినిమయం చేయగల మంచి కమ్యూనికేటర్ కావడం కూడా అవసరం. తన రచనను తానే చదివినా పేలవంగా శ్రోతలముందు తేలిపోయే కవులు, రచయితలు ఆ విధంగా అపజయం పాలయినట్లే.

తమ వచోనైపుణితో నన్ను ప్రభావితం చేసినవారు, తెలుగు సాహిత్యంపై మమకారం పెంచినవారూ, నా విద్యార్థి దశలో ఉపన్యాసకులుగా మొట్టమొదటివారు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట పాఠశాలలో నేను పదోతరగతి చదువుతున్నప్పుడు అప్పటికే 'విజ్ఞానజ్యోతి' అనే లిఖిత పత్రిక నడుపుతూ తెలుగుపట్ల అభిరుచితో వున్న నాకు 1964 ఏప్రిల్ 24 వ తేదీ శుక్రవారం మా స్కూలు సారస్వతసమితి వార్షికోత్సవానికి మా తెలుగుమాస్టారు శ్రీ తిగుళ్ల వెంకటేశ్వరశర్మగారు అవధానిగారి ఉపన్యాసం ఏర్పాటుచేశారు. ఆనాటి సభకు ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనంగారు అధ్యక్షత వహించగా కవిసమ్మేళనంలో డా॥పల్లా దుర్గయ్య, విద్వాన్ సి. హెచ్ రంగాచార్యులు, ఎ.రాజేశ్వరశర్మ, ఎం.చంద్రశేఖరశర్మ, టి.విశ్వనాథశర్మ, వెంకటేశ్వరశర్మగారలు కవితాగానం చేశారు. ఆ కవితాగానం నాకేమీ గుర్తులేదుగానీ ఆరోజు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు చేసిన సాహిత్యోపన్యాసం మాత్రం నన్ను బాగా ఆకట్టుకుంది.

పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి అంత పెద్ద పండితుడు, ప్రసంగకర్త, యూనివర్సిటీ స్థాయిలోని ఉపన్యాసకుడు మాట్లాడి రంజింపచేయడం నిజంగా విశేషమే

మరి! కవిత్రయం భారతానువాదవైఖరిని గురించి కొంతా, శిరీషపుష్పం (దిరిసిన పువ్వు) గురించి కొంతా, ఆ తరువాత వసుచరిత్రలో గిరికను బాల్యంలో తల్లిదండ్రులు ప్రేమగా పెంచిన వైనం అనే అంశాలపై ఆయన ప్రసంగించారు. నిజంగా వసుచరిత్ర ఘట్టం ఆయన వివరించిన తీరు నన్ను చాలా ఆకర్షించింది ఆ వయస్సులో. మానవ సంబంధాలకు, ప్రేమకు ఒక బీజావాపనం వంటిది జరిగిందేమో నాలో.

"శుక్తిమతీ నదికి కోలాహల పర్వతానికి వివాహం జరిగింది. అందుకే నదిని స్త్రీ లింగంగా, పర్వతాన్ని పులింగంగా చెబుతారు. వారిద్దరికి గిరిక అనే కుమార్తె కలిగింది. గిరిక తల్లి దగ్గరకు వెడితే ఆమె మంచి శంఖాలను ఏరి కూతురు మెడలో వేసిందట. నదీమతల్లి ఇచ్చిన శంఖాలదండతో తండ్రి దగ్గరకు వెడితే పర్వత రాజయిన అతడు "ఛీ! నీ తల్లి ఈ శంఖాలు వేయడం ఏమిటి? నీ మెడే స్వయంగా శంఖంలా వుంటుంది. శంఖానికి మధ్య రేఖలుంటాయి. నీ గళానికీ వుంటాయి. శంఖంలోంచి ధ్వని వస్తుంది. నీ గళంలోంచీ వస్తుంది" అని తన దగ్గరవున్న రత్నాలను దండచేసి ఆ శంఖాలు తీసివేసి ఆమె మెడలో అలంకరించాడట. గిరిక తిరిగి తల్లి దగ్గరకు వెళ్లిందట. (అమెకు అదే పనేమో అటునుంచి ఇటు, ఇటు నుంచి అటు తిరగడం) తల్లి చూసి "ఛీ! ఇదేంటి? కుమార్తెకు ఇలాంటి బరువైన రాళ్లను మెడకు కడతారా?" అంటూ ఆ దండ విప్పేసి సుకుమార కోమలమైన శిరీష పుష్పాలను కూతురు మెడలో అలంకరించిందట" అంటూ ఆయన వివరించిన తీరు, ఆ ఘట్టం, పిల్లపట్ల తల్లిదండ్రుల ప్రేమ, అందులోని వైఖరులు చెప్పినప్పుడు మేం విన్న నాటి సభ, ఆ ప్రసంగం ప్రభావం నాకు ఈనాటికీ బాగా గుర్తు.

ఆ రోజుల్లో హెచ్.ఎస్.సి.పాసయ్యి ఆ తర్వాత కళాశాలలో వివేకవర్ధనీ కళాశాలలో పి.యు.సి.బైపీసీ తీసుకుని చేరినా, తెలుగునుండి ఒక్కసారిగా ఇంగ్లీష్ మీడియం కాలేజీలోకి రావడం, ఆ కప్పల డిసెక్షన్‌లూ అవీ సరిపడక సైన్సూ, లెక్కలూ లేని చదువే చదవాలని ఇంట్లో పోరుపెట్టి, ఆంధ్రసారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాలలో డిప్.ఓ.యల్ (డిప్లమో ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్) లోకి మారిపోయానంటే తెలుగుపట్ల గాఢంగా ఏర్పడిన సాహిత్య మమకారమే కారణం. ఆ తరువాత యువభారతి సంస్థతో అనుబంధం ఏర్పడి నేను సహకార్యదర్శిగా వున్నప్పుడే ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారి 'కావ్యలహరి' ఉపన్యాస పరంపర జరపడం,

లహరి పరంపరలతో ఉపన్యాసాలెన్నో వక్తలవి ఏర్పరచి మేం సభలతో, ప్రచురణలతో అశేష తెలుగు ప్రజలను ఆకర్షించడం అవిస్మరణీయాలే! యువభారతిలో వంగపల్లి విశ్వనాథంగారి వాక్చాతుర్యం, పరిషత్ కళాశాలలో శ్రీ కె.కె.రంగనాథాచార్యులుగారు మమ్ములను అభ్యుదయభావ పథగాములుగా, ప్రగతిశీల వామపక్ష భావసరణిని ఏర్పరచడం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంఫిల్ చేసినప్పుడు సినారె పాఠాలు ఉపన్యాసాలుగా వినడం ఇదంతా మా పరిణామ ప్రక్రియలో ఉపన్యాసాల పాత్రయే అని చెప్పాలి. రెండేళ్లు కరీంనగర్ జూనియర్ కాళాశాలలో లెక్చరర్ ఉద్యోగం, ఆ తరువాత ముప్పై సంవత్సరాలు ఆకాశవాణిలో ప్రసార, కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉద్యోగం నన్ను ఒక కవిగా, రచయితగా, విమర్శకుడిగానే కాక వక్తగానూ, ఉపన్యాసకుడిగానూ చేసాయనుకుంటున్నాను. నన్నూ వక్తగా, ప్రసంగకర్తగా, ఉపన్యాసకునిగా ప్రశంసించే, అభిమానించే వారుండడం నాకు సంతోషాన్ని, సంతృప్తినీ కలిగిస్తూంటుంది. ❋

**(చినుకు మాసపత్రిక జనవరి'2011)**

# 7 కవితాత్మలోకంలో హీనమైన పాపం

"కవిత్వంలోనూ జీవితంలోనూ ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ లేకపోవడం దేశభక్తి కన్నా హీనమైన పాపం, ఆత్మలోకంలో దివాలా" అని శ్రీశ్రీ మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం రాస్తూ చలం అన్నాడు. ఇందులో చలం – దేశభక్తిని హీనమైన పాపం అనడం ఘోరం కాదా? 'దేశమును ప్రేమించుమన్నా' అంటూ ప్రబోధించిన గురజాడను అడుగు జాడగా భావికి బాటగా భావించిన శ్రీశ్రీగాని, శ్రీశ్రీపై పరిశోధకులు గానీ, దీని గురించి చర్చించకపోవడం ఏమిటని కడియాల రామమోహనరాయ్ 'నవ్య' ఆక్షేపణ ముందుకు తెచ్చారు.

ఆ వాక్యాన్ని క్రమాలంకారంలో గ్రహిస్తే కవిత్వంలో ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ లేకపోవడం దేశభక్తి కన్న 'హీనమైన పాపం' అనీ , జీవితంలో ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ లేకపోవడం 'ఆత్మలోకంలో దివాలా' అని అర్థమవుతుంది. కవిత్వంలో దేశభక్తి హీనమైన పాపమెందుకయ్యింది అని ఆలోచించాలి. బహుశా ఆనాడు స్వాతంత్ర్యోద్యమం పేరుతో కవులు గతానుగతికంగా రాస్తూ వచ్చిన కవిత్వ భావజాలం చలానికి వెగటుపుట్టించి వుండాలి. అలాగే సోకాల్డ్ దేశనాయకుల వ్యవహార సరళి కూడాను! కవిత్వంలో పదాడంబరాలు, ఆలంకారికత ఇవన్నీ చెలానికి అప్పటికే ఏహ్యమయ్యాయి. 1940 జులై 17 న చలం ఆ యోగ్యతాపత్రం రాసాడు. స్వాతంత్ర్యం రావడానికి ఏడేళ్లకు ముందు రాసిందది.

చలం అప్పటికే ఇలా అన్నాడు "కవిత్వపు కాలం అంతమయింది. నగలూ, అపురూపపు కళలూ, సూర్యకిరణాల్ని ఎరగని అందాలూ గతిస్తున్నట్లే కవిత్వమూ గతించింది. కవిత్వానికి కూడా తన ప్రయోజనం తానే చెప్పుకోవాల్సిన గతిపట్టింది. "ఈనాటి కవిత్వమంతా ఏమిటి? ఎందుకు వుంది? ఏం చేస్తోంది?" అని ధిక్కరించి అడిగే తెలుగు ప్రజలకు శ్రీశ్రీ కవిత్వం ప్రత్యుత్తరం. కొద్ది రోజుల్లోనే నేడు విర్రవీగే కవులు ప్రతిఒక్కరూ శ్రీశ్రీ నీడకింద నించుని తమ ఉనికిని సమర్థించుకోవలసిన గతివస్తుంది" అని నాడే చెలం జోస్యం చెప్పాడు.

నిజమే! చెలానికి దేశభక్తి పేర నాడు వెలువడిన కవిత్వంలో, జాతి గుణగానంలో నిజాయితీ, చిత్తశుద్ధి కన్న కాపట్యం, వంచన, పరాన్నభుక్కుతనం

గోచరించాయి. "తను చెప్పదలచుకున్న సంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు తన చేతగాని తనాన్నీ, అర్థ అస్పష్టతనూ ఛందస్సు చీరల వెనకా, అలంకారాల మధ్యా, కఠినపదాల బురఖాలలోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి. ముఖ్యంగా సహజసౌందర్యం తక్కువకైనప్పుడు. సులభంగా సూటిగా చెప్పేసి ఇంత ధ్యానానికీ, మౌనానికీ, కార్యాలకీ, విజయాలకీ వ్యవధినివ్వరాదా అని చెలం కోర్కె. ఆ పని స్త్రీలూ చెయ్యరు. దేశ నాయకులూ చెయ్యరు. కవులూ చెయ్యరు. ఎంకీ, శ్రీశ్రీ తప్ప" అని పేర్కొని చెలం ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ గురించి ప్రస్తావించాడు.

చెయ్యక తప్పని కృత్యంగా, సహజ సౌందర్యం లేక కృత్రిమంగా, ఒక విధాయకంగా, దేశభక్తి గురించి రాసినా అది హీనమైన పాపమేనని చెలం భావన. నిజానికి నేటి కాలపు కవిత్వానికీ అది వర్తించేలా వుండడమే చలం భవిష్యత్ ద్రష్ట అనడానికి ఎంత ఉదాహరణో, అంత గొప్ప విషాదస్థితి కూడాను. కవులూ, దేశ నాయకులూ, స్త్రీలూ ఇప్పటికీ అలానే వున్నారు కదా!

'అబద్ధాలతో, స్తోత్రాలతో, వంచనలతో, అనుకూల దుష్టప్రచారంతో, ఆత్మ శ్లాఘనలతో దేశం మీదపడి బతుకుతున్న యీ పేరసైట్ కవివరేణ్యులు శ్రీశ్రీని విమర్శించడానికి సాహసిస్తున్నారు" అన్న చలం ఆనాటి మాట, ఈనాటికీ ప్రత్యక్షర సత్యమై భాసిస్తున్నట్లు శ్రీశ్రీ శతజయంతి వత్సర సందర్భంగా, కొత్తగా 'పునర్మూల్యాంకన'ల పేర, కొందరు పనిగట్టుకుని చేస్తున్న వైఖరులు స్పష్ట పరచడం లేదా? ఓ దివంగత ముఖ్యమంత్రి మీద వెల్లువలెత్తిన కవిత్వం, చెలం అప్పుడే అన్నట్లు'... తాము తెచ్చిన సంస్కారమే ఇంక సారస్వతానికి (కవిత్వానికి అనుకుందాం పోనీ) శాశ్వతావధి అని నిరూపించి, ఉప్పొంగి తెలుగు ప్రపంచాన్ని పావనం చెయ్యటానికి మీదికి ఉరికే..." కవితా పితామహులు, పీఠాధిపతులు, నాన్నలు, రకరకాల ఉద్యమ నాయకులు, వందిమాగధులతో, స్వీయ ముఠాలతో, భజనపరులతో చేస్తున్న సాహిత్యవీరంగాలూ ఇవన్నీ 'ఆత్మలోకంలో దివాలా'కోరు తనం తప్ప ఇంకేమీ కాదు. ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ అన్న చలం మాటను కూడా మినీలకు, నానీలకు వర్తింపచేసుకుని పొంగిపోయే తెంపరితనాలూ విషాదమే! చెలం రాసింది మహాప్రస్థానానికి యోగ్యతా పత్రమే కాదు, నాటికీ నేటికీ విర్రవీగుతున్న కుసంస్కార సమాజం మీద ఓ శ్వేతపత్రం కూడాను. చలం దేశభక్తిని హీనమైన పాపం అనడం వెనుక కవుల పట్లా, నాయకుల పట్లా ఆనాటి సమాజ వైఖరుల పట్లా వ్యంగ్య వైఖరియే కానీ, ఆయన దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వ్యతిరేకి అనుకోలేం కదా!

వ్యవస్థ వ్యక్తుల సముదాయం కనుక, ఆయన ముందు వ్యక్తి గురించీ, వ్యక్తి స్వేచ్ఛ గురించీ, వ్యక్తిలోని ఆత్మద్యుతుల గురించీ మానవీయ కోణంలో ఆలోచించి ఆవేశపడ్డాడు. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి రక్షించే అపూర్వశక్తి శ్రీశ్రీ మహాప్రస్థానం అని చలం ఇచ్చిన యోగ్యతాపత్రం వట్టిమాట కాదని కాలం నిరూపించింది. కానీ ఇవాళ్టి కవిత్వం, వాటి సిరాతడిఆరని అచ్చు పనులు, వాటి ముందుమాటలు రాసిన మహనీయులే పలికే వెనుకమాటలూ ఇవన్నీ గమనిస్తుంటే కొత్త 'కవిత'లో బండ్ల మాధవరావు అన్నట్లు... ' యుగం నాది అన్న శ్రీశ్రీనే కవిని కాదు పొమ్మంటున్నారు కువిమర్శకమ్మన్యులు. ఈ నేపథ్యంలో అకవుల్నీ, అకవిత్వాన్నీ తలకెత్తుకుంటున్న పీఠాధిపతులకు ఒక ప్రశ్న. అయ్యా! మీకు పేరు రావడం కోసం, మీ చుట్టూ కొంతమంది భజన గణాన్ని తయారు చేసుకోవడం కోసం అకవిత్వాన్ని ఎందుకు తలకెత్తుకుంటారు" అన్న ఘోష సరియైనదే! దశాబ్దాలుగా కవిత్వం రాస్తున్న మంచి కవులను పట్టించుకోక, తమకు భజన చేసే కొత్తవాళ్లనీ, చిన్నవాళ్లనీ పొగడ్తలతో, అవార్డులతో, సన్మానాలతో ఎదగనీయకుండా చేస్తూ తమ సాహిత్య అస్తిత్వాన్ని మాత్రమే నిలబెట్టుకునే కుట్రదారుల పట్ల, యువత జాగ్రత్త పడాలన్న మాట సరియైనదే! ఓహెూం ఓహెూంల బోయీలుగా మదకరీంద్రము డిగ్గుతున్న వారిపట్ల జాగ్రత్త పడాలి అన్న హెచ్చరిక సరియైనదే..

'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని గురజాడ అంటే ఆయనకు 'మట్టి' విలువ తెలియదని విమర్శించే వాళ్లు తయారై, కుల మత ప్రాతిపదికల మీద విడగొట్టే సాహిత్యానికి వీరతిలకం దిద్దుతూ, సాహిత్యం అనే దానికి 'సహిత స్య భావమ్' అనే అర్థమే పోగొట్టినవారు చెలామణి అవుతున్నారు. "ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, రక్షకభట వర్గాలు, చెరశాలలు, ఉరికొయ్యలు, భావకవిత్వం ఇవన్నీ మీ ప్రియమిత్రులు. యుద్ధాల నుంచి ముష్టివాళ్ల నించి, విప్లవాల నించి, అనాథల నించి, అశాంతి నుంచి సత్యాన్నించి మిమ్మల్ని కాపాడుతారు వీళ్లు" అని చలం అన్నది అరవై ఏళ్లవుతున్నా అలాగే ఉంది. శ్రీశ్రీకి చలం ముందుమాట చెల్లిందేమో కానీ, ఈనాడు యోగ్యతా పత్రాలకు విలువ ఏనాడో సాధారణీకరమై తేలిపోయింది! దేశభక్తి ఓ వంచనా శిల్పమైనప్పుడు అది హీనమైన పాపమే! ఎంత ప్రముఖులయినా 'ఆత్మ లోకంలో దివాలా' వర్తమాన విస్తృత విషాదం! *

**(ఆంధ్రప్రభ దినపత్రిక 26.11.2009)**

# 8 కవిని గుర్తించే కాలం

**ఇం**త మంది కవులు అవసరమా? "నేడు ఊరూరా కవులు, పేట పేటకు కవులు, ఇంటింటికీ కవులు..." అని 'కవితారసిక ప్రహసనం'లో పానుగంటి వారన్నట్లు, కవిత్వం రాయడం కొందరికి ఫ్యాషనైకూచుంది! వాళ్లలో ఐఏఎస్, ఐపీఎస్‌లూ వుండవచ్చు. వస్త్ర వ్యాపారీ వుండవచ్చు. కిరాణా కొట్టు యజమానీ వుండవచ్చు. సెలూన్ సారథీ వుండవచ్చు. తప్పేంలేదు! కవిత్వం ఫలానావాడే రాయాలని రూలేం లేదు. ఎవరు రాసినా కవిత్వం రాస్తే చాలు. ఫలానా హోదా గలవాడు రాసాడు కనుక – అది కవిత్వమై కూచుంటుందంటేనే పేచీ!

ఇంతకీ కవిత్వానికి కొలతబద్ద ఏదీ? నిజానికి పాఠకుడు మెచ్చిందీ, పాఠకుడికి నచ్చిందీ కవిత్వం కావాలి. పాఠకుల కోసం కాక – కవుల కోసం కవులూ, విమర్శకుల కోసం కవులూ – కవిత్వం రాసుకుంటూ పోయి, కవిత్వం కొలబద్దలు పేరుస్తూంటే, పాఠకులు కవిత్వమంటేనే – "ఇదేదో మన వ్యవహారంకాదులే" అనుకుంటారు. పాతికేళ్ల క్రితం కవి సమ్మేళనాలు అంటే ప్రేక్షకులు ఉత్సాహంతో ఉరకలెత్తే వారు. ఇవాళ అవి అంటేనే భయపడి, పుంజాలు తెంపుకుని పారిపోతున్నారు. కవిత్వంలో వస్తురూపాలు, శైలి, శిల్పం, ఆలంకారిత ఇవన్నీ విమర్శకులకు – ఒక కవిని బేరీజు వేసుకోవడానికి వాళ్ల పడికట్టు పరిశీలనలు! కానీ పఠితకూ, శ్రోతకూ ఒక కవితతో సద్యఃస్ఫూర్తిగా దక్కవలసింది రసానుభూతి. ఒక ఉద్వేగం, ఒక హర్షం. ఒక హృదయ సంచలనం. ఒక క్రమానుగత ఆలోచనకు ఆస్కారం. అదెలా వస్తుందనే విశ్లేషణ వాళ్ల కనవసరం. ఇతర సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేస్తున్నవారితో పోలిస్తే – నిస్సందేహంగా కవుల సంఖ్యే ఎక్కువ. కవిత్వం సామాన్య పాఠకుల కోసం అనే భావన లేకపోవడం వల్లనే – కొన్ని వార పత్రికలు కవిత్వం జోలికి పోవు. దినపత్రికల కొన్నింటి ధోరణీ అంతే! ఆదివారం అనుబంధమైనా, సోమవారం సాహితీపేజీ అయినా అవేవో ప్రత్యేక మేధావుల పరిశీలనలో వుంటాయని కాబోలు కొంత కవిత్వం అచ్చేస్తూంటాయి. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే అంతా అర్థమయ్యేలా ఉంటే అది

కవిత్వం కాదనీ, వట్టి వచనమనీ ఓ గాఢ నమ్మకం. (అక్కడకు వచనం అంటే ఏమిటో మనకు స్పష్టంగా అర్థమైపోయినట్లు. గొప్పవచనం చెప్పడం కష్టం కాబట్టే చంపూపద్ధతి అని పద్యాలెక్కువ రాసి, వచనంతో అనుసంధించారు పూర్వకవులంతటి వారే!)

ఇంతకీ ఇంతమంది కవులవసరమా? అని కదా ప్రశ్నించుకున్నాం. కవులు నిరంకుశులు అని ప్రాచీన లాక్షణికులన్నారు. ఆ నిరంకుశలనడంలోనే తెలుస్తోంది కదా వారి తెంపరితనం వ్యవహారం. కవులు స్వతంత్రులు అనడం సబబు. నిరంకుశులు కాదు. నిరంకుశత్వానికీ, స్వతంత్రానికీ తేడావుంది. కానీ వ్యవహారం చూస్తుంటే నిరంకుశత్వం కనబడుతోంది కనుకే, వాళ్లనలా ఆనాడే నిర్ధారించివుంటారు. కవులను కవులుగా గుర్తిస్తున్న దెవరు? పాఠకులా? పాలకులా? మావోయిస్టులపై నిషేధం ప్రకటించి, మావోయిజానికి అనుకూలంగా మాట్లాడినా, రాసినా నిర్బంధాలు తప్పవని హెచ్చరిస్తున్నప్పుడు పాలకులకు కావలసిన కవులెవరో ఎలాగూ తెలుస్తోంది. సెజ్‌లు, భూపోరాటాలు, సామ్రాజ్యవాద వ్యతిరేకతలు ఇవి కవిత్వ వస్తువులై, అవి రాసేవారే కవులని కొందరి నిశ్చితాభిప్రాయం. ధిక్కార కవిత్వమే కవిత్వం అనీ, కవి అనేవాడు ధిక్కరించే వాడే అయ్యుండాలనీ, ప్రజాసమస్యలపట్ల ప్రశ్నించడమే కవి లక్షణమనీ కొందరి తీర్పు. అలా రాస్తే – అవి నినాదాలు, మార్చింగ్ సాంగ్‌లు, రాజకీయాలు అవుతాయికదా అని ఎవరైనా అడిగితే వాడిని వెర్రివాడిలా చూస్తారు. మహాప్రస్థానం రాసేనాటికి శ్రీశ్రీకి మార్క్సిజం తెలియదన్నా, మల్లెపూలు రాసేనాటికి వరవరరావుకి రాజకీయాలపై లోతైన అధ్యయనం లేదన్నా వాస్తవమే అయ్యుండొచ్చు. కానీ కవులుగా వారు పుట్టింది అప్పుడే. తరువాత వారు ఎలా ఎదిగి, ఎలా స్థిరపడినా, కవిగానే ప్రజల్లో గుర్తింపుకు నోచారు.

ఇంత మంది కవులవసరమా? అంటే –

'మేం ఉంటాం. మీరు తప్పుకోండి' అని కవుల్లో ఓ వర్గం మరో వర్గాన్ని అనచ్చు. అదేంటి కవులంతా ఒక్కటే కదా! అని అడక్కండి. మీరు అమాయకులు, వెర్రిపప్పలు అవుతారు. కవులు అనేక రకములు. కౌలు కిచ్చే కవులూ వుండవచ్చు. "నల్లావు అయితేనేం, తెల్లావు అయితేనేం అన్ని ఆవులూ పాలేకదా ఇస్తాయి. అలాగే కవులందరూ కవిత్వమే కదా రాస్తారు" అంటే పైకి పాలు ఒకేరకం. కానీ వాటిలో

ఎన్నో రకాలు. ఇంకా పాల పదార్థాలు అనేకం ఉన్నాయి. కవిత్వ వ్యవహారమూ అంతే. తల్లిపాలు శ్రేష్ఠం అన్నా అందం తరిగిపోతుందని డబ్బాపాలే పట్టే వనితలున్నారు. అమ్మపాలు తెలియక పెరిగిన పిల్లలున్నారు. అలాగే అసలు కవిత్వంపాలు తెలియక పెరిగిన అర్భకులూ వున్నారు. వారిని ఎత్తుకున్న వారూ ఉన్నారు.

'ఇంతమంది కవులవసరమా' అంటే – 'ఇంత మంది మనుషులవసరమా' అనీ ప్రశ్నించవచ్చు. ఎవరి జీవితం వారిదే. ప్రతి మనిషిలోనూ అవతలి మనిషికి భిన్నంగా – రూపురేఖావిలాసాదులే కాదు, ఆలోచనాగతులూ, ఆచరణారీతులూ వుంటాయి. అవే ఆలోచనలు, అవే పరిస్థితులు, అదే మనుషులు, అయినా – ఎవడికి వాడికే. "మరల ఇదేల రామాయణమటన్న..." అని ప్రశ్నించి, 'తినుచున్న అన్నమే తినుచున్నది చేసిన సంసారమే చేస్తున్నది' అయినా, 'నాదైన అనుభూతి నాదిగాన' అని నిర్ధారించినట్లు, ఎందరు కవులున్నా కొందరే గుర్తించబడినా, ఏ కవికి ఆ కవే.

కవిత్వం ఒక ప్రకృతి. ఒక నైజం. అది ఎవరికి ఎందుకు అలవడుతుందో ఇతమిత్థంగా చెప్పలేం. "కవితాకన్య మనింటి ఆడబడుచా, కాకున్న ఇల్లాలా లేక వశంబందున నుండు వారవధువా"... అంటూ తనంతటతాను అలవడవలసిందే కానీ ప్రయత్నపూర్వకంగా సృష్టించబడేది కాదంటాడు ఓ పెద్దాయన. అసలంటూ కవిత్వాంశవుంటే శిక్షణా శిబిరాలు ప్రేరకాలై ప్రయోజనదాయకం కాగలవేమో గానీ, అవే కవుల్ని కర్మాగారంలో ఉత్పత్తుల్లా ఉత్పత్తి చేయలేవు. ఒక వేళ చేసినా అవి కృత్రిమంగా అలానే ఉంటాయి. సుదీర్ఘ కవిత అయినా, చప్పరించే బిళ్ల లాంటి నానీ అయినా అంతే! అయితే కవులెందరయినా ఉండవచ్చుందామా! – మనం అనడంతో సంబంధం లేకుండా ఉంటారు. వాళ్లల్లో వాళ్లే కవులం అని అనుకుంటూనూ ఉంటారు. అసలు ప్రతిభావంతులకు గుర్తింపులేకున్నా ప్రముఖ కవుల పేరిట అవార్డుల పేర, సన్మానాల పేర, పరస్పర ప్రశంసా వ్యాస మర్దనల పేర, అవకాశవాద విమర్శా సంచలనాల పేరా కవి నాయకత్వాలు పొందేవారూ ఉంటారు. కానీ పాఠకుడిని పట్టించుకోని కవిత్వపు కోటరీలు ఎంతవిస్తరిల్లినా, ఆర్నెల్లకో, ఏడాదికో ఒకటి చొప్పున ఎన్ని సంపుటులు వెలార్చినా, మఖలో పుట్టి పుబ్బలో మాడిపోయే తాత్కాలిక వెలుగుదీధితుల మిణుగురు కవులూ ఉంటారు. వికసించకుండా రాలిపోయే మొగ్గలూ వుండచ్చు. అవకాశాలు లేక, రాక, అణిగిపోయే స్వకీయానంద తృప్తులూ ఉంటారు.

ఎవరు పట్టించుకోకపోయినా మౌనంగా రాసుకుంటూపోయే మాదిరాజు రంగారావులూ వుంటారు. నిరాడంబర ముకుంద రామారావులూ వుంటారు. నాబోటి వారూ వుంటారు.

ఇంతకీ గొప్ప కవులయినా వారిని కవుల బృందంతో చేర్చక వేరే ప్రక్రియలోకి నెట్టేసే సాహిత్యలోక కుట్రలూ వుండొచ్చు. కానీ ఎంత అజ్ఞాతంగా ఉన్నా, ఎంత దూరం నెట్టినా, ఎక్కడవున్నా, ఏమైనా ఒక తరుణం వస్తుంది. అప్పుడు కోకిలపాడి తీరుతుంది. కవి కవిత్వం చెప్పే తీరుతాడు. 'ఆకులందున అణగిమణగీ కవిత కోకిల పలుకవలెనోయ్' అన్న గురజాడ అడుగుజాడ ననుసరించే వైఖరి ఉండనే వుంటుంది.

**మావిగున్న కొమ్మను మధుమాసవేళ/ బల్లవముమెక్కి కోయిల పాడుటేల/ పరుల దనియించుటకొ? తన బాగుకొఅకొ? / గాన మొనరింపక బ్రతుకు గడువబోకొ?** అని కృష్ణశాస్త్రి అన్నట్లు, 'కవితకోసం నేను పుట్టాను. క్రాంతి కోసం కలంపట్టాను' అని ఆరుద్ర అన్నట్లు, నేటి కవిత్వ లోకపు శషభిషలకు అతీతంగా పురాగానాన్ని నవనవంగా ఆత్మీయస్పర్శతో అందిస్తున్న-ఇజాలకు, కొలమానాలకు కాక-మనిషి అవిశ్రాంత మనుగడకు, అనుభూతామృత వర్షిణిగా, నిసర్గ రమణీయంగా కవిత్వం రాస్తున్న వాగ్దేవు చినవీరభద్రుడూ ఉంటాడు. 'కోకిల ప్రవేశించే కాలం' అనే చినవీరభద్రుడి కవిత్వ సంపుటి నిజంగానే ఒక పునర్యాన పాథేయం. అచ్చమైన అర్థమయ్యే కవిత్వానుభవ సాక్షాత్కార దీధితి.

**గొంతెత్తి కోకిల చెప్పేదిదే / నువ్వు పాడవలసిన పాట నువ్వే పాడాలని/ నిన్నురమ్మని పిలిచిన విందుకు/నీ బదులు మరొకరు పోలేరని/నీ మాటలేవో నువ్వు పోల్చుకోగలిగితే/నీ శ్రోత ఎవ్వరో అవి పోల్చుకుంటాయి/** అంటాడు వీరభద్రుడు. "చిన్న కోకిల కోసం పెద్ద ఆకాశం ఎదురుచూస్తుంది" అని తను అన్నట్లుగా అసలైన కవికోసం.. మానవ సమాజం ఎప్పటికప్పుడు చూసుకుంటూనే ఉంటుంది. ఎంతమందయినా కవులు అవసరమే. కవి ఎవరో, ఎలానో, ఎవరికోసమో, ఎలాగూ నిర్ణయించే కాలానికి ఏది గ్రీష్మమో, ఏది వసంతమో తెలియకపోతే కదా! ✱

**(ఆంధ్రప్రభ దినపత్రిక 25.6.2009)**

# 9 కవిత్వం సంకుచితం కాదు

**పు**ట్టుక యాదృచ్ఛికం. దశాబ్దాల క్రితం మాదిరిగా పుట్టినచోటే పెరిగి, జీవిక సాగించి, సంసారం నిర్వహించి, పిల్లాపాపలను పెంచి పోషించి అక్కడే గిట్టడం అనేది అసాధ్యం అయిపోయింది. మిగతా మనుషుల సంగతి ఎలా వున్నా మరీ ముఖ్యంగా కవులూ, కళాకారులు ఈ కుల, మత, ప్రాంత సంకుచితత్వాలను అధిగమించి ఆదర్శనీయులు కాగలగాలి. కవులు ఒక ప్రాంతంలో పుట్టినా, వారి కవిత్వం విశ్వజనీనం. సాహిత్య, సంగీతాలకు శిల్ప, చిత్ర కళలకు, నటనాది రంగాలకు ప్రాంతీయతలను, కుల మతాలను అంటగట్టడం తప్పు. వారు కూడా ఆ సంకుచిత పరిధిని అధిగమించలేకపోతే, సర్వజనామోద, సమాజాభ్యుదయ, మానవీయ విలువలను పరిరక్షించే, ప్రబోధించే వారు కాకపోతే ఉదాత్తులు కాలేరు.

నన్నయ్య, తిక్కన, పోతన, శ్రీనాథుడు మొదలుకుని గురజాడ, వేమన, శ్రీశ్రీ, ఆరుద్ర, కాళోజి, సినారె, బోయి భీమన్న ఏ కవులను తీసుకున్నా వారు వ్యక్తీకరించిన కవిత్వ భావజాలం తెలుగు వారందరి కోసమూ! ఆ మాటకొస్తే సర్వమానవాళి కోసమూను! జాషువా తాను 'విశ్వనరుడ'నని చెపుకున్నాడు. ఆరుద్ర గానీ, కుందుర్తిగానీ తెలంగాణ గురించి కవిత్వ సృజన చేశారంటే–వారు ఆ ప్రాంతానికి చెందిన వారు కాకపోయినా విశాల కవితా హృదయం వుండడమే కారణం. శ్రీశ్రీ పేరుకే విశాఖలో పుట్టింది. విశాఖపై ఒక దీర్ఘకావ్యం రాయాలన్న శ్రీశ్రీ కల కలగానే మిగిలింది. ఎందుకంటే ఆ ప్రాంతాన్ని అధిగమించి మరో ప్రపంచాన్ని వీక్షించేందుకు మహాప్రస్థానం చేయడమే కారణం!

తన తల్లి గురించి, పల్లె గురించి, బాల్యం గురించి కవులు కవిత్వం రాయవచ్చు. కానీ అది సార్వకాలికంగా, సార్వజనీనంగా అమ్మతనం గురించి, జన్మస్థలి స్వచ్ఛదనం గురించి, పసితనపు నిష్కల్మష, మమతానుబంధ ప్రేమైక జీవనం గురించి బహిర్గతపరిచేదిగా వుండాలిగానీ ఇంకొకరి తల్లినో, పల్లెనో, బాల్యాన్నో నిరసించేదిగా, నిందించేదిగా ఉండకూడదు. కవిత్వానికి సాహిత్యానికి కేవలం ప్రాంతీయతా పరిధులు,

గిరులు ఉండవు. కథల్లో స్థానికత ప్రతిబింబించడం, పాత్రలు, వాతావరణం ఆ ప్రాంతీయ నేపథ్యం కలిగి ఉండడం జరిగినా, ఆ ఇతివృత్తం మానవ జీవన సంబంధియై. మానవీయ కోణాన్ని, విలువలనూ ఆవిష్కరించేది కాగలిగినప్పుడే ఆ రచన కాలావధులను, దేశావధులను అధిగమించి అందరికీ నచ్చేది అవుతుంది. సాహిత్యంలో కూడా రాజకీయాలు ప్రవేశించి కవులు, కథకులూ, కళాకారులు కూడా నాయకత్వపు ఆరాటాల్లో పడుతూండడం విషాదం. ఫలానా ఉద్యమం, ఫలానా ఇజం, ఫలానా వాదం తనతోనే సాహిత్యంలో వేళ్లూనిందనో, పరిఢవిల్లిందనో, పరివాప్తి చెందిందనో సంభావించుకోవడం, సాహిత్యంలో తనను ఫలానా వాదానికో, ఉద్యమానికో ప్రతినిధిగా గుర్తించాలని ఆరాటపడడం సృజనశీలురకు తగినపని కాదు.

పద్య సాహిత్యంపై డాక్టరేట్ పట్టాలు పుచ్చుకుని ఆ ప్రక్రియనూ, నన్నయాది కవులను తనదైన రంగుటద్దాలు కొత్తగా పెట్టుకుని విమర్శించబూనే వారు కొందరైతే, గురజాడ, శ్రీశ్రీవంటి వారిని కులం పేరిట దర్పణాల్లో చూస్తూ వారు సమాజాభ్యుదయానికి చేసిందేమీ లేదనీ, వారు పక్షపాత వైఖరి గలవారనీ పాక్షిక పక్షపాత వీక్షణాలతో సిద్ధాంత పరామర్శలు చేసేవారు ఇంకొందరు. ఇప్పుడు లేని కవులు, రచయితలు అప్పుడు వున్నప్పుడు చేసిన రచనలు ఇలా చేసి వుండాల్సిందనీ, ఇలా చేయలేదు కనుక అవి సమాదరణీయాలు కావనీ, నేటి తమ మనోవైక్లబ్యాలతో త్రోసిరాజంటూండేవారు మరి కొందరు. నిజమే! వారి దృష్టి సార్వజనీనతవైపు, సర్వమానవ సంక్షేమం వైపు. నేడు మాత్రమే 'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' బాపతుగా ఇంత శకలాలు శకలాలవుతున్న వైఖరి. కానీ ఈ ఇటుకలన్నింటితో 'అందరి ఇల్లు' నిర్మించే ప్రయత్నం మాత్రం జరగ(నీయ)డం లేదు. 'బిందువు బిందువును చేరి సింధువగును' అన్నారు. ప్రపంచమే ఒక కుగ్రామం అయ్యే సందర్భం ఎదురవుతూంటే కలిపికుట్టేదిగా కాక విడగొట్టేదిగా సాహిత్యం పరిణమించడం విషాదం! అన్ని ప్రాంతాల, అన్ని కులాల, అన్ని మతాల భావసృజనా జరగవలసిందే. ఆయా అస్తిత్వాల మూలాలు గుర్తింపబడవలసిందే! కానీ అవన్నీ తిరిగి సమష్టిగా రూపొందాలి. సర్వమానవ సంక్షేమార్థం సాగాలి. రాళ్లల్లో బియ్యం ఏరినట్లు, పాలల్లో నలకలు తొలగించినట్లు స్వాదుకత కోసం, మానవహితం కోసం అవరోధాలయ్యేవాటిని,

అడ్డుపడేవాటిని ఏరి పక్కన పెట్టాల్సిందే. సంకుచిత ధోరణులు, స్వభావాలు వ్యష్టి స్వార్థ ప్రయోజనాలకు ఉపకరించినంతగా సమష్టి జీవన వికాసానికి ఉపయుక్తం కానప్పుడు, మామూలు మనుషులు కన్నా ఉదాత్తంగా, ఉత్తాలంగా ఆలోచించగలిగే, ఆచరించగలిగే, సందేశించగలిగే సృజనశీలురు సాహిత్యకారులు అయినప్పుడు - కవులు, కళాకారులు మరీ ముఖ్యంగా ఎదిగి విస్తరించాలి. ఊరూరా కవులు, పేట పేటకు కవులు, ఇంటింటికీ కవులు అని పానుగంటివారు కవితారసిక ప్రహసనంలో అన్నమాట నిజమే అయినా, వారు అక్కడికే పరిసీమితమై ప్రాంతీయ గుర్తింపులతోనే వుండిపోయేవారు కాకుండా వారి కవిత్వం, సృజనశీలత్వం ప్రాంతాల, రాష్ట్రాల, దేశాల పరిధుల్లోకి విస్తరించి కీర్తిమంతులు కావాలని ఆకాంక్షించాలి. వారి ఖ్యాతివారి సృజనద్వారా విశ్వజనీనం కావాలి. మానవాళి నివాళులెత్తదగిన మహనీయులు కావాలి. *

**(ఆంధ్రప్రభ దినపత్రిక 17.12.2009)**

# (10) ఎన్నిక(విత)ల కాలం

**క**విసమయాలు తెలుసుగానీ కవికాలమ్‌లు తెలియవనకండి. అందునా ప్రబంధాల్లో గట్రా కవిసమయాలు మీరు బహుధా గమనించేవుంటారు. కవులకు గిరాకీ వుండే ప్రత్యేకకాలంలో ఉగాది ఒకటని ఎవరడిగినా చెబుతారు. ఉగాది కవిసమ్మేళనాలు, సదరు సందర్భాల్లోనే సామూహిక సన్మానాలు ఇంకా వరుసపెట్టి సాగుతూనే ఉన్నాయి కూడాను.

అబ్బే! ఇదేం కొత్తకాదండీ! "వచ్చావా ఉగాదీ రా!" అని ఒకడంటాడు. "రావద్దు ఉగాదీ నువ్వు రావద్దు, విరోధివై దాపురించిన నిన్ను నేనేమని స్వాగతించను" అని ఒహరంటారు. ఈ మధ్యలో రావాలా, పోవాలా అనేది ఉగాది మాటేమోగానీ సదరుసభల శ్రోతలకు మాత్రం పెద్దసందిగ్ధమే. పంచాంగశ్రవణాలు ఏ పార్టీల వారివి వారివే అయినట్లు, కవిసమ్మేళనాలు కూడా ఎవరి బృందాలు వారివే అయ్యుంటాయని తెలుస్తూనే ఉంటుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసే కవి సమ్మేళనంలో పార్టీ అభ్యర్థుల సీట్ల పంపకంలోలాగే కులాలు గట్రా చూసుకుతీరాల్సిందే! ఎంతమంది బీసీలున్నారు, ఎందరు ఎస్సీ, ఎస్టీలున్నారన్నది తప్పక పరిగణనలోకొచ్చే విషయమే.

'అబ్బే! ఆయన ఇందులో ఇమడ్డండీ' అని ఓ కవి గురించి ప్రోగ్రాం చేసే ఆయన అంటాడు. కాదూ! నిర్వాహకుడు పట్టుబట్టాడనుకోండి తప్పదుమరి. కవిసమ్మేళనంలో కవిగా ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించడం కూడా ఓ పార్టీ టికెట్టు లభించినంత గొప్ప వ్యవహారం అయిపోతూంటుంది.

కవులు క్రాంతదర్శులూ గట్రా నిజమేగానీ ఆ క్రాంత దర్శకత్వంలో అవకాశవాదమూ, లౌక్యమూ గట్రా ఉగాదిపచ్చడిలో బెల్లంలా కలగలపకపోతే అనుభవాలు చేదు అవడం సంగతి మాట అలా వుంచండి, అవకాశాలే మృగ్యం అయ్యే డేంజరుంది. ఉగాది వచ్చినప్పుడల్లా ఎన్నికలు రావు. కాబట్టి ఈ మాటు ఎన్నికల స్పెషల్ 'ఎన్నికల ఉగాది కవి సమ్మేళనం' ఓ విశేషం. 'ఎన్నికల ఉగాది' పేర సాహితీ స్రవంతి హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేసిన కవి

సమ్మేళనం అందుకే ఓ వైవిధ్యంతో అలరారింది. ఓ నలభైమంది కవుల దాకా ఎన్నికల నేపథ్యంలో ఉగాది కవితలు వినిపించారు. ఉగాది మిషమాత్రమే. ప్రతిభావంతుడైన కవి పండగ నేపథ్యాన్ని కూడా అద్భుత కవితగా రూపుదిద్దగలుగుతాడు. అద్దేపల్లి రామ్మోహనరావు ఆ పనే చేశాడు. ఉగాది కవి సమ్మేళనం దూరదర్శన్ కూడా సప్తగిరిలో ప్రసారం చేసింది. గండ్లూరి దత్తాత్రేయ శర్మ సంధానకర్తగా పద్య కవులు, వచన కవులు కూడా వైవిధ్యం ప్రదర్శించారు. దర్భశయనం శ్రీనివాసాచార్య తన కవితతో బాగా ఆకట్టుకున్నాడు. సరే పత్రికల ప్రత్యేక సంచికల్లో కూడా కవుల ఉగాది కవితలు దృశ్యమానమవడం మామూలే కదా! ఎఫ్.ఎం. రేడియోలో వచ్చిందే నాళేశ్వరం శంకరం ఉగాదికవితలో కూడా విలక్షణత ఉంది. అద్భుత కవిత్వపాదాలు ఇప్పటికిప్పుడు ఉటంకించడం కుదరదు గానీ, మున్ముందు కవికాలంలో వర్తమాన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక స్థితిగతులకు కవుల స్పందనలు వాళ్ల ఆలోచనాలోచనలు, దిశానిర్దేశనాలు వంటివాటిని ఇక్కడ మాట్లాడుకుందాం.

కవులు కూడా రాజకీయాలకు అతీతులేంకారు. కవిత్వంలో రాజకీయ స్పృహలు అనివార్యమే. రాజకీయపక్షాల కొమ్ముకాసే కవులు లేకపోవలేదు. ఎవరే పార్టీ అయినా కవి మాత్రం ఎప్పుడూ ప్రతిపక్షంగానే వుండాలనేవాడు శ్రీశ్రీ. ఇందిరాగాంధీ ఇరవై సూత్రాలు నచ్చాయని మద్రాసు రేడియోకి పాటరాసాడు. అది వేరే విషయం అందామా!

విరోధంటే విచారకరమైన రోజులు ధిక్కరించి చిరునవ్వుల రోజులను తెచ్చేదని ఓ కవి ఆశావహ నిర్వచనమిచ్చాడు. వూసల రజనీగంగాధరనే కవి కాబోలు కోకిలనూ ఎన్నికలను సంధానిస్తూ ఎన్నికల ప్రకృతిని వివరించాడు. నిజానికి ఇప్పుడు వసంతం వేడెక్కింది. అందునా ఇది ఎన్నికలఉగాది కాలం, పైగా విరోధి నామ సంవత్సరం కావడంతో ఇది మరీ ఎక్కువైంది.

నాయకుల ప్రసంగాలకు స్క్రిప్టులు రాయడంలో కొందరు కవులు బిజీగా ఉంటారనుకుంటా. కవికి నిబద్ధత, నిమగ్నత అంటాంగానీ పాపం కవులూ, పత్రికా రచయితలు తొందర తొందరగా పొజిషన్లు మారిపోవలసి రావడం వల్ల ఇబ్బంది పడిపోతూంటారు. ఓ పత్రికలో పనిచేసే కవిగారో, కార్టూనిస్టు గారో మరో పత్రికకు ఉద్యోగరీత్యా బదిలీ అయ్యారనుకోండి, నిన్నటిదాకా నచ్చిమెచ్చిన విషయాలే కొత్త

పత్రిక యాజమాన్యంలో కుదురుకున్న కారణంగా నచ్చకుండా మెచ్చకుండా పోతాయి. 'ఎప్పటి కెయ్యది ప్రస్తుతము.." అన్నట్లుగా కలం తీరూ మారిపోతుంది. ప్రతిపక్షంలో వున్నవాడు అధికారంలోకి రాగానే అన్ని విధాలా రూపపరిణామం చెందినట్లు ఈ కవి వైఖరులూ అవే అయిపోతున్నాయి.

ఎన్నికల కాలంలో పత్రికల్లో రాజకీయ టుమ్రీలు కనబడుతూంటాయి. దేవిప్రియ రన్నింగ్ కామెంటరీలో ప్రముఖుడు, ఇప్పుడది ఛానెల్‌కు కూడా ఎక్కింది. పలు దినపత్రికలు ఈ పొలిటికల్ టుమ్రీలు ఈసరికే మొదలుపెట్టాయి. వచనంగా చెప్పేదానికన్నా కవిత్వంగా చెబితే అందునా అనుప్రాసలు గట్రా దట్టించి చెబితే కొందరికి బాగా నచ్చుతుంది. జూనియర్ ఎన్టీఆర్ ప్రసంగాల్లో ఆవేశభరితమైన ఒక కవితాత్మకతూగు వుంది. కనుకనే జనం అభిమానంతో చెలరేగిపోతున్నారని నిర్ధారించాడు ఒకాయన. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడే ఎన్టీఆర్ శ్రీశ్రీ కవి పలుకులను నోటబట్టించుకుని ఉదాహరిస్తూ, ఉద్రేకపడుతూ జనాన్ని ఊపాడు. ఇప్పుడు ఆస్కార్ అవార్డు చిత్రంలో, అదేనండీ! స్లమ్‌డాగ్ మిలియనీర్‌లో గుల్జార్ కవి గీతం 'జయహో' కాంగ్రెస్ ప్రచార బాణికి దిగగా, దానికి పేరడీ కట్టి 'భయహో' అంటూ బి.జె.పి ఇన్నాళ్ల అధికారంలోనూ ప్రజలు ఎలా భయ దు:ఖాల పాలబడ్డారో ఎద్దేవా చేస్తూ కవి గీతాన్ని కూర్చి ప్రచారిస్తోంది. ఒకప్పుడు జానపదబాణీ అంటే అందునా గొంగడి భుజానదాల్చి కర్ర తాటిస్తే అది ఏ జననాట్యమండలిదో, వామపక్ష పార్టీదో గీతం అనుకునేవాళ్లం. ఇప్పుడదేం లేదు. అన్ని పార్టీలు ఆ సీన్‌తో తమ తమ బాణీలను బాహాటంగా ప్రదర్శించుకుంటున్నాయి. 'ఈ దొర ఏందిరో ఆడి పీకుడేందిరో' అనే పంక్తి ఎవరైనా ఎటైనా మలిచేసుకుంటున్నారు. సినిమా పాటల సంగతి సరేసరి! ఎలక్షన్లలో నుంచున్న సినిమా వారి పాటలు అంటే ఆయా పాటలకు వారు అభినయించినవేవీ ప్రసారం చేయకుండా, ఆ సినీనటుల సినిమాలు వేయకుండా, రేడియో, టీవీలు జాగ్రత్త తీసుకుంటాయి. 'ప్రైవేట్ ఛానెళ్లకు ఈ రూలు వర్తించదేం' అని స్వయానా రోశయ్యగారే రోషకషాయిత నేత్రులయ్యారు.

"రాజశేఖరా నీపై మోజుతీరలేదురా రాజసాన ఏలరా" అని పాటవేస్తే అది వై.ఎస్.కు అనుకూలమని అర్థం.

'ఓహో గులాబిబాలా అందాల ప్రేమమాలా' అని... 'నీవారెవరో తెలుసుకో' అని పాటవస్తే అది మహాకూటమిలో తె.రా.స అస్థిత్వం గురించి తె.రా.స.లో విజయశాంతి వైఖరి గురించి అనుకోవడం మామూలైపోయింది. 'సైకిల్‌పై వన్నెలాడి పోతున్నది' అని పెళ్లి కానుక పాటవస్తే తెలుగుదేశం సైకిల్ గుర్తు కనుక ఏ రోజా సంబంధిత గీతమో అనేసుకుంటారు.

ఇంతకీ ఓటు విలువ గురించీ, ఓటర్ల చైతన్యాన్ని గురించీ కవులు కలాలు సంధిస్తున్నారా అంటే అసలు వాళ్లలో ఎందరు నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు, ఓటు పట్ల వారెంత చైతన్యమూ, వివేకమూ కలిగివున్నారనేది ప్రాథమికంగా తేలాల్సిన విషయం. వర్తమాన సంఘటనలకు సద్యః స్ఫూర్తి స్పందనలతో వ్యాఖ్యాతలుగా విశ్లేషకులుగా నేడు కవుల పాత్ర ఉంటోందనేది ఒప్పుకోవాల్సిన మాటే! కష్టజీవికి ఇరువైపులా నిల్చేవాడు కవి. కనుక కవికాలమ్ చెలామణిలో వుందంటే సామాన్య ప్రజాసంక్షేమ లక్ష్యం ముందుకు కదులుతున్నట్లే. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 2.4.2009)**

# (11) క్రీనీడలూ-చిరు సాహిత్య దీపాలు

ఆగిపోయిన సాహిత్య మాసపత్రిక 'భారతి'ని గూర్చి తెలుగు సాహిత్య ప్రపంచం నేటికీ తలుచుకుంటూనే ఉంటుంది. 'పోయినోళ్లందరూ మంచోళ్లు - ఉన్నోళ్లు పోయినోళ్ల తీపిగురుతులు' అన్నట్లు - ఆగిపోయిన వాటి గురించి ఆగిపోక, సాగిపోవడం ముఖ్యం కదా!

'దురంత పద్మవ్యూహాల వల్ల కానిది - రవ్వంత అనురాగం వల్ల అవుతుంది' అని సినారె అన్నట్లు - పెద్ద పెద్ద పత్రికలు చేయలేని పని, సిసలైన సాహిత్య సేవ, చిన్నవనుకున్న పత్రికలే మిన్నగా చేయగలుగుతున్నాయి. తెలుగు దినపత్రికల సోమవారం సాహిత్య పేజీలు నిజానికి ఆ పత్రికల వ్యాపారసరళి ముందు వీసమెత్తు యత్నాలే! వాటివల్ల ఏ 'లాభం' లేదనుకునే యాజమాన్యాలూ ఉన్నాయి.

ఇంతకీ ఇప్పుడు సాహిత్యానికీ, అందునా కవిత్వానికీ అంకితమై సాగుతున్న కొన్ని పత్రికల ఊసు చెప్పుకోవలసిందే. 'సాహిత్య ప్రస్థానం', 'చినుకు', 'సాహిత్యనేత్రం', 'ప్రకృతి సాహితి', 'పినాకిని', 'కవితా'!, 'విజ్ఞానసుధ', 'రవితేజమ్' - ఇలా కొన్ని పత్రికలు, సంకలనాలు, మాసానికో, మూడు నెలలకో సాహితీ ప్రియులను పలకరిస్తూన్నాయి. 'నేటి నిజం' దినపత్రిక గురువారం 'సాహితీ కెరటాలు' ఉవ్వెత్తున ఎగసిపడే కృషి చేస్తోంది. ఆంధ్రప్రభ సోమవారం 'సాహితీ గవాక్షం' ఇటీవలే వంశీ ఇంటర్నేషనల్ వారిచే బహుమతి యోగ్యమైన పుటగా అవార్డు అందుకుంది. ఆంధ్ర భూమి దినపత్రిక 'సాహితి', ఆంధ్రజ్యోతి దినపత్రిక 'అక్షరం', విశాలాంధ్ర దినపత్రిక సోమవారాల్లో ఒక పేజీని సాహిత్యానికి అంకితం చేశాయి. ప్రజాశక్తి దినపత్రిక కూడా వారంలో ఒక రోజు సాహిత్య పేజీని ఇస్తోంది. సాహిత్యం గురించి కాకపోయినా- తెలుగుభాష గురించి మౌలికంగా శ్రద్ధ పెడుతున్న 'నడుస్తున్న చరిత్ర' కూడా అవిస్మరణీయమే. 'జగతి', 'విశ్వరచన'లలో వ్యక్తిగతం తగ్గచ్చు మరి!

అయితే దినపత్రికల సాహిత్యపేజీలు కొన్ని-అక్కడ కూడా సంచలనాలకు తాపత్రయపడడం, వివాదాస్పద అంశాలుంటే అందరి దృష్టినీ ఆకర్షించవచ్చుననే

ధోరణి కనిపిస్తోంది. నిజానికి దినపత్రికల సాహిత్యపేజీల్లో సీరియల్ వ్యాసాలు వేయడం కన్నా – సాహిత్యపాఠకుడిని సమకాలీనంగా వుంచి – అలరించడం, ఆలోచింపచేయడం బాగుంటుంది. పెద్దపెద్ద సాహిత్య వ్యాసాలు ఏ ఆదివారం అనుబంధాల్లోనో సీరియలైజ్ చేసుకోవచ్చు. నిజంగా ఒక అంశం మీద పెద్దవ్యాసం ఒక్కటే మొత్తం పేజీని ఆక్రమించుకునేలా ప్రచురించే సాహసం ఏ సాహిత్య పేజీ చేయలేదు. నిజంగా అంతగొప్ప రచనే అయితే ఒక్కసారిగా ప్రచురించడం సమంజసమే. ఒక సెమినార్ పేపర్నో, సభాప్రసంగాన్నో అచ్చులో చూసుకోవడానికి పంపేవైఖరి నిజానికి సరికాదనాలి. దాని సారాంశాన్ని ఆ కవియో, రచయితో, వక్తో విడిగా వ్రాసి ప్రధానాంశాలతో పంపించవచ్చు ఓ వ్యాసంగా.

మరోవైఖరి ఏమిటంటే ప్రముఖ సాహితీ రచయితల, అందునా కీర్తిశేషుల జయంతులకు, వర్ధంతులకు రాసే వ్యాసపరంపరలు, రొడ్డకొట్టుడుగా ఒక కొత్త చూపుగానీ, వారి రచనల్లోని ఒక ప్రత్యేక అంశంపట్ల ఫోకస్తోగానీ లేకుండా రాసి 'తద్దినం వ్యాసంగం' చేసే వైఖరీ కనబడుతూంటుంది. ఇంకో వైఖరి ఏమిటంటే – 'లాబీయింగ్'ల వైఖరి! 'నా గురించి నువ్వురాయి', 'నీ గురించి నేను రాస్తాను' అని పరస్పర ప్రశంసా కూటముల ధోరణి. కొత్తగా రాస్తూ ఓ పుస్తకం అంటూ వేసినంతనే – ఆ పుస్తకం మీద సమీక్ష రాయడం కాదు. ఏకంగా ఆ కవి మీద వ్యాసమే రాసేయడం! దశాబ్దాలుగా కృషి చేస్తున్న వారిని పట్టించుకోరు గానీ, ఈ 'మ్యూచువల్' ప్రశంసా వైఖరి పాఠకుడికి – ఇదంతా ఏదో 'మహాకూటమి' వ్యవహారంలా తోస్తుంది మరి! నిజానికి వ్యక్తికన్నా – వ్యక్తీకరించిన విషయానికే ప్రాధాన్యం ఉండాలి. సాహిత్య విశ్లేషణలో, విమర్శలో– రాగద్వేషాలు అధిగమించకూడదు. కొందరు పెద్దలు కూడా – తమను అభిమానించే యువ సాహితీపరులైన అనుచరగణాన్నే తాము రాసే వ్యాసాల్లో 'కోట్' చేస్తూంటారు. వారికి అందుబాటులో వుండే సంకలనాలు, రచనలు వారివేకదా! తమచేత పీఠికలు రాయించుకునో, తమ గ్రంథాల ఆవిష్కరణ సభలకు పిలిచి తమచేత ప్రసంగాలు చేయించో ఎవరైతే అస్మదీయులుగా వున్నారో – వారి గురించి మాత్రమే వీరు రాస్తూంటారు. ఒక వ్యాసం రాయడానికి కొంత పరిశోధక కృషి చేయకుండానే పేరొందిన సాహిత్య విమర్శకులు కూడా యథాలాప రచనలు చేయడం కనబడుతూంటుంది.

ఇలాంటి అనారోగ్యకర ధోరణులు ఎన్నివున్నా అంతో ఇంతో జరుగుతున్న సాహిత్య కృషిని ఎలా కాదనుకుంటాం! 'గుర్తింపు' అనేది సృజనకారులు ఎవరైనా కోరుకునేదే. తెలిసి తెలిసీ 'తస్మదీయులుగా' కొందరిని కావాలని పక్కన బెట్టే నైజాన్ని కొందరు ప్రముఖులే నేరుగా ప్రదర్శించి, ప్రశ్నించినపుడు ఉదాసీనత చూపడం స్పష్టంగా కనబడుతూనే ఉంటుంది. అన్ని రంగాల్లో రాగానే సాహిత్యంలోనూ రాజకీయాలు, అవాంఛనీయ ధోరణులు ముమ్మరమవుతున్నాయన్న ఆవేదన తప్ప నిజానికి పాపం! ఎవరినీ తప్పుబట్టలేమేమో! అవసరాలు ముందంజవేసి, అసలు ప్రతిభలు వెనుకంజవేయడం కొత్త ఏమీ కాదు కాబోలు – 'ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేకదా' అని విజయవిలాస కర్త ప్రకృతి పరంగా నర్మగర్భంగా చెప్పినా – గ్రూపులు కట్టడం, కూటములేర్పరుచుకోవడం తప్పనడం లేదుగానీ, అవతలి గ్రూపునూ, అవతలి కూటమినీ– అంతా 'సహితస్యభావమైన సాహిత్యం' కోసం కృషి చేసేవారైనప్పుడు, పనిగట్టుకుని నిందించడం, నిరాదరించడం, తమ వ్యాసాల్లో వారి ఊసెత్తకపోవడం సాహిత్యకారుడు– అందునా సృజనకారుడు, సాహిత్య నిబద్ధత, నిమగ్నత గలవాడు చేయాల్సిన పనికాదు. కవితా వార్షికలు, కథావార్షికలు వెలువరించే సంకలనకర్తలు ఫలానావారి రచన తమ సంకలనంలో ఎందుకు చేర్చలేదో వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం ఏమీలేదు గానీ – ఆ సంకలనం చూసిన సాహిత్య పాఠకులూ, చదివిన చదువరులూ అందులో సాక్షికత ఉందనీ, అసమగ్రం అనీ అనిపించుకోకుండా చూచుకోవచ్చు! ఏదీ సమగ్రం కాదు నిజమే! కానీ అసమగ్రహేతువు – తమ నైజం, తమ వ్యవహార సరళి, తమ రాగద్వేషాలు మాత్రమే కాకూడదు కదా! ఏమయినా సాహిత్య దీపం కొడిగట్టకుండా 'చుట్టూరా వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కాక ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది' అన్న మాటను ఆచరణాత్మకం చేస్తున్న సాహిత్య పత్రికల వారికి జయహో!... ❖

**(ఆంధ్రప్రభ దినపత్రిక 23.4.2009)**

# (12) కొత్త కవితాయుగం(ధరులు)

**క**విత్వ రచన అనే విషయంలో సాహిత్యంలో ఇవాళ తప్పుడు సంకేతాలు వెడుతున్నాయని ఓ పెద్దాయన వాపోయాడు. నిర్వచనాలు, నినాదాలు, సూక్తులు, జోక్‌లు, మాటవరస పోలికలు కవిత్వంగా చెలామణీ అయిపోతున్నాయనీ ఓ పాతిక అక్షరాల పలవరింతలో, నాలుగు పదాల అనుసంధానమో కవిత్వమైపోయి భారీగా సంపుటాలుగా కూడా వెలువడుతున్నాయనీ హైకూలు, నానీలు, రెక్కలు, నానోలు అంటూ రకరకాల పేర్లు పెట్టుకుని చేసే ఈ ప్రయోగాలే గొప్ప కవిత్వంగా, అవి రాసేవారు ప్రముఖ కవులుగా చెలామణీ అయిపోతూండడం–వారికే గౌరవాలు, సన్మానాలు, పురస్కారాలు అంటూ సమాజం కూడా చెంగలించడం ఏమీ బాగోలేదని ఆయన నిశ్చితాభిప్రాయం.

కండక్టర్
చిల్లర చిల్లర
మాటజాగర్త
నే చిల్లరమనిషిని కాదు
ఇది ఒక కవిత.

జననం
నీటిబుడగలోంచి
మరణం
గాలిబుడగలోంచి
ఇది ఇంకో కవిత.

ఒకతను ఇంకో సరికొత్త ప్రయోగం అన్నాడు. అది పద కవితట. మొదటి పదం శీర్షిక అయితే రెండో పదం కవితట. రెండో పదం శీర్షిక అనుకుంటే మొదటిపదం కవిత అట. ఎటుదెటుదయినా గొప్ప కవిత్వ భావనే అని అతగాడి విశ్వాసం. మచ్చుకు అవి కొన్ని.

❖ భార్య
భర్తీ

భర్త
ఖాళీ

❖ దేహం
మట్టికుండ
దు:ఖం
నీటికుండ

❖ ఎన్నిక
ప్రజాస్వామ్యం
పాలన
ధనస్వామ్యం

ఇలాంటి వానిని పైకెత్తి గొప్పగా చాటడానికి కొందరు పెద్దలు, విమర్శకులు కూడా ఎప్పుడూ సిద్ధంగానే వుంటారు. అస్మదీయులు, అభిమానులు, అనుచరగణంలోని వారు అయితే భుజంతట్టి, కవిత్వం అచ్చువేసినందుకు దండవేసి, శాలువా కప్పి సాంస్కృతిక విలేఖరులకు డబ్బులిచ్చి వార్తనూ, ఫొటోనూ కూడా ఆవిష్కరణ సభానంతరం ఘనంగా ప్రకటింపచేయవచ్చు. ఆ తరువాత ఇలాంటి పరస్పర రచనా కుతూహలురైన కవులు ఒకరి కవిత్వ రచన మీద మరొకరు వ్యాసాలు రాసి సాహిత్య పేజీల్లో అచ్చు వేయించచ్చు. వడ్డించేవాడు మనవాడైతే, గుర్తింపుకు లోటేముంది. రేపు వీటి మీద ఓ విశ్వవిద్యాలయంలో సిద్ధాంత గ్రంథం రాసి డాక్టరేట్ తెచ్చుకుంటాడు ఒకాయన. ఆ టాపిక్‌ను సిద్ధాంత యోగ్యంగా తలిచేదీ, చేయించేదీ అంతా తమవారే అయినప్పుడు తగువేముందీ, తగనిదేముంది. వైతాళికులు లాంటి గొప్ప సంకలనంగా వీరందరినీ చేర్చి ఒకరి సంపాదకత్వాన గ్రంథం రావచ్చు. పరుగుల ప్రపంచంలో దీర్ఘకావ్యాలు రచించడానికి కవులకూ, వాటిని చదవడానికి పాఠకులకూ తీరిక వుండడం లేదనీ, ఓ పాతిక పంక్తుల కవిత రాయడం కంటే, నాలుగు పదాల ఓ అరడజను కవితలు రాసేయడం సులువనీ, అదీకాక – పత్రికల్లోనూ క్లుప్తతకు అచ్చులో అవకాశాలు ఎక్కువనీ, ఓ దీర్ఘకవిత ప్రచురించి ఒక కవిని సంతోషపెట్టడం కంటే, బోన్సాయ్ కవితలను ప్రచురించి బోలెడుమందిని సంతోషపెట్టడం ద్వారా–ఎక్కువమంది రచయితలను ప్రోత్సహించినట్లూ, పాఠకుల సంఖ్యనూ పెంచుకున్నట్లూ, కాస్త సర్క్యులేషన్ కూడా పెరుగుతుందనీ పత్రికల వారి భావన కూడాను. ఓ పత్రిక తమ చందాదారులైన వారి కవితలనే ప్రచురిస్తుంది. కవితల పోటీ పెట్టి పాల్గొనడానికి ఏడాది చందా

కట్టాలంటుంది. ఇంకొక సంస్థ పదో పాతికో ప్రవేశరుసుము పెట్టి, ఇలాంటి పోటీ రాష్ట్రస్థాయిలోనూ వీలైతే దేశస్థాయిలోనూ అంటుంది. అంతర్జాతీయ మహాసభలు జరిపితే ఎన్.ఆర్.ఐ అయిన తమ బంధువు ఒకరు హాజరైనా, అది అంతర్జాతీయ సదస్సు అయిపోతుంది. విదేశీ ప్రాతినిధ్యం వుందా లేదా? అదీ కావాల్సింది. అతగాడు వాళ్ల అమ్మమ్మ మృత్యుముఖంలో వుందని వచ్చిన వాడైతేనేం? వీలుచూచుకుని సభకు వచ్చాడు కదా! కవిత్వమూ, సాహిత్య సదస్సులూ కూడా మార్కెట్ సరుకులా మారుతున్నాయని ఆ పెద్దాయన ఆవేదన పడ్డాడంటే పాపం పడడామరి! ఇవన్నీ మారుతున్న సాహిత్య సాంస్కృతిక మహానీయ విలువలేనా?

తమాషా ఏమిటంటే ఇంతచేసీ అందరూ ఆ పెద్దాయనని విమర్శించడానికి తయారైపోవడం. ఆయన మార్పును గుర్తించలేని, అంగీకరించలేని గతకాలపు సాహిత్య విలువలతో కొట్టుకుంటున్నాడనీ ఆ సంప్రదాయ శృంఖలాలు ఛేదించుకుని బయటపడి, మారుతున్న ప్రపంచంతో ఆయన ముందుకు వెళ్లాలనీ, లేకపోతే సాహిత్యలోకంలో ఆయనే వెనకబడిపోతాడని సంఖ్యాబలం వున్న కవిత్వ కూటమి విరుచుకుపడుతుంది. అఫ్‌కోర్స్! కొందరు సౌమ్యంగా, కొందరు మెత్తమెత్తగా, కొందరు దూకుడుగా అదే విషయాన్ని ప్రకటిస్తారు. ఇంకో వర్గం వుంటుంది. తెలివిగా ఇంకో పనిచేస్తుంది. తమ కూటమి వెలువరించే ఈ వార్షిక సంకలనంలోనే ఆయన ఎంతచక్కని కవిత రాసినా పనిగట్టుకుని విస్మరించి చోటివ్వదు. వీలైతే తమకు తెలిసిన, తమ పరిచయాలున్న సంచికల్లో, పత్రికల్లో ఆయనను పక్కనుపెట్టే పన్నాగాలు చాలా ఉదాత్తంగా నిర్వర్తిస్తుంది. పెద్ద పత్రికల్లో పత్రిక సంపాదకుడే అన్నీ చూసుకోడు కదా సబ్ ఎడిటర్లో, ఆయా విభాగాలు చూసే ఔట్‌సోర్సింగ్ వాళ్లో ఉంటూంటారు. వారిని మంచి చేసుకుంటే చాలు ఒక ప్రతిభావంతుడిని తెలివిగా పక్కకు నెట్టేయనూవచ్చు. ఒక అర్భక రచయితని బాక్స్ కట్టి అందలాలెక్కించనూవచ్చు. తమ ప్రయోజనాలు వున్నప్పుడు పాపం 'తనకుమాలిన ధర్మం' వారెందుకు పాటిస్తారు. ఇంతకీ ఇదేదో ఉక్రోషంతో చెబుతున్న సంగతి కాదు. నడుస్తున్న వైఖరి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. కుక్క బిస్కెట్ విసిరినట్లు తమ మీద విరుచుకుపడే పెద్దాయనని కూడా ఏదో సందర్భంలో వీళ్లే పిలిని సన్మానం చేసి, శాలువా కప్పి పైకి ప్రశంసా వాక్యాలు పలికి, లోన పళ్లుకొరుక్కుని కిమ్మనకుండా అణచివేసేయగలరు. సాహిత్యంలో రాజకీయాలంటే ఇదిగో ఇలాంటివే. స్వేచ్ఛా స్వర్గంలోకి నడిపించు ప్రభూ! అనే రవి కవి ప్రార్థనకు సాహిత్యార్థం ఇదేనా! హతోస్మి. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 4.6.2009)**

# (13) కదిలేది, కదిలించేది

ప్రేరకశక్తి అనేది ఒకటుంటుంది. ప్రతి సంభవానికీ మూలం అది. వ్యక్తుల ప్రవర్తనలకూ అదే పునాది. అయితే అది ఎలా ఉంటుంది, ఏ పరిమాణంలో ఉంటుంది అనేది చెప్పలేం. ఒక అత్యద్భుత కార్యానికి ప్రేరకశక్తి పరిశీలించి చూస్తే అత్యల్పమైనదే కావచ్చు. ఒక పరమాణుకణం ప్రళయ భీకరాన్ని సృష్టించగలదన్నట్లు మర్రివిత్తులో మహావృక్షం దాగి ఉన్న చందాన అత్యల్పం నుండే అనల్ప అనలం ఆవిర్భవించవచ్చు.

ప్రేరకశక్తి చోదకశక్తిగానూ ఉంటుంది. అంటే ఏమిటన్న మాట! నడిపించేది. దాన్నే డ్రైవింగ్‌ఫోర్స్ అన్నారు. ఇంధనం–కొద్దియే కావచ్చు. ప్రయాణం ఎన్నో మైళ్ళకుగాను ఉపకరిస్తుంది. కొందరు కొందరిని, కొందరు కొందరు నడిపిస్తారు. నడిపించడం అంటే ఫిజికల్‌గా చెయ్యిపట్టుకుని నడిపించడం అని మాత్రమే కాదు. జీవితపు ప్రతి గమ్యంలోనూ ఆశగానో, ఆసరాగానో, ఆరాధనీయంగానో నిలుస్తూంటారు.

ఉదాహరణకు పి.వి.నరసింహారావు ఉన్నారు. తన చోదక శక్తిగా ప్రజాకవి కాళోజీని పేర్కొన్నారు. "కాళోజీ అనే భూతం నన్ను అనుక్షణం వెన్నంటే ఉంది" అని చమత్కరించారు. కాళోజీ జన్మదినోత్సవ సభలో మాట్లాడుతూ– తాను చేసే ప్రతిపనిలో ఇలా చేయడం వల్ల కాళోజీవంటి విమర్శకులు నన్నేమంటారు? అని ఆలోచించుకునే వాడినన్నారు. ఒక కవి ఒక రాజకీయ దురంధరుడికి ప్రేరక శక్తి, చోదకశక్తి కావడం కన్న హర్షణీయం ఏముంది? అనేక భాషల్లో పాండితీ ప్రకర్షగల పి.వి.యే కాళోజీని ఒక 'ఫినామినన్'గా పేర్కొంటూ, ఆ ఇంగ్లీషు పదానికి సరియైన తెలుగు అర్థం ఎవరయినా చెబుతారా నాకయితే తట్టడం లేదు అని సభాముఖంగా ప్రశ్నించారు. నిజమే! కొన్ని పదాలు కొందరికి అతికినట్లు సరిపోతాయి. కానీ అసలు అర్థం చేసుకోవడం వీలుకాకుండా పోతూంటుంది. కాళోజీ ఒక అద్భుతం అనడం ఫినామినన్‌కు అర్థంగా సరిపుచ్చుకోగలమా!

ప్రేరకశక్తి, చోదకశక్తి పరిశీలించి చూసుకుంటే నిజంగా ఒక అద్భుతంగానే తోస్తుంది. ప్రేరకమూ, చోదకమూ ఒక్కోసారి ఒక వ్యక్తే కానక్కర్లేదు. ఒక మాట కావచ్చు. ఒక తిట్టు కావచ్చు. కొందరి తిట్లు తిట్లు కావు. శాపనార్థాలు శాపనార్థాలుకావు. అవి ఒక ఉదాత్త పరిణామానికి ప్రాతిపదికలవుతూంటాయి.

మనకు నుడులు, జాతీయాలు ఉన్నాయి. ఒకరి అనుభవంలో మ్రగ్గి, ఎందరి అనుభూతుల్లోనో డిగ్గి, అగ్గిలా వెలిగే అక్షర సత్యాలవంటివవి, నిజం నిప్పులాంటిదనే దందుకే. నిజాల ముందు నిలబడడం కష్టం. అబద్ధాలు రాయడం ఇష్టంలేకే ఆత్మకథ రాసుకోలేదని అన్న వ్యక్తి నిజాయితీని శంకించనవసరం లేదు, ఒక కవి గొప్పతనం అతని అనుభవసారం అభివ్యక్తిలో ఉంటుంది. ఎవరిమాట జాతి జనులు వాడుకునే మంత్రంగా మారుమ్రోగుతుందో అతడు మహనీయుడు, మహానుభావుడు, 'నా' గొడవ అన్నవాడు అది తనదిగా మిగుల్చుకోక, 'మా'గా, 'మన'గా మహిమానిత్వం చేయడం నిజమైన ప్రతిభావిశేషం.

"చెమ్మగిలని కనులు బ్రతుకు  కమ్మదనము చూడలేవు
చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చాటలేవు"

"ఉదయం కానే కాదనుకోవడం నిరాశ
ఉదయించి అలాగే ఉంటుందనుకోవడం దురాశ"

"ఏడు మారినా ఈడు ముదిరినా
ఏమి మారినది ఈ లోకంలో"

"రాయి విసిరినా రాకెట్ విసిరినా
గిట్టని వానిని కొట్టుటకే కద"

ఇటువంటివి వట్టి కవితా పంక్తులుగా ఎలా అనుకోగలం! అనుభవసారం కాచివడబోసిన ఈ జీవన సూక్తం– అందిపుచ్చుకునేవాడి యోగ్యతను బట్టి, అవగాహనా సామర్థ్యాన్ని బట్టి ప్రేరకశక్తిగా, చోదకశక్తిగా పరివర్తనం, పరావర్తనం చెందగలుగుతుంది.

ఒక 'ఫినామినన్'ను సజీవంగా అంది పుచ్చుకోగలగడం అనుభూతి చెందగలగడం – దానికీ యోగ్యత కావాలేమో!  ఎందుకంటే వక్రీకరణలకన్నా

సరళతనూ, సూటిదనాన్ని గ్రహించడం కష్టం. దానికి 'కలేజా' ఉండాలి. కబీరూ, వేమన్నా, కాళోజీ జనం గుండెల్లోకి సూటిగా వెళ్లేవారు. వాళ్ళకూ, వాళ్ళ భాషకూ ముసుగులుండవు. వారి కవిత్వానికి పదచిత్రాలనో, మరో ఆధునికతా, ఉత్తరాధునికతలనో, మిస్టిజమనో, మార్మికత్వమనో ఏ భేషజాలూ ఉండవు. వారు సాహిత్య విమర్శకుల, సోకాల్డ్ అకడమిషియన్ల ప్రమాణాలకు నిలబడరు. అలా ఒదగకపోవడమే, వాటికై ఎగబడకపోవడమే గొప్ప ఫినామినా.

తమ కవిత్వం సామాజిక స్పృహగలదనీ, సమాజంలో మార్పు తెచ్చేదనీ, సామాన్య మానవుడికి పట్టంకట్టి సమసమాజ స్థాపనకీ, సోషలిజానికీ సోపానాలు వేసేదనీ డంబాలు కొట్టుకునే ఎందరో కవిపుంగవుల కవిత్వపంక్తులు సామాన్యుడి మాట ఎందుకు? సాటికవికే సూటిగా అర్థంకాని బుకాయింపు కవిత్వమే ఇవాళ టన్నులుగా చెలామణిలో ఉంది. కవి హృదయం వేరనీ, వారి స్థాయి వేరనీ పాఠకుడు కవిత్వాన్ని అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలే తప్ప, పాఠకుడికి అర్థమయ్యే స్థాయికి తాము దిగితే – అది కవిత్వమే కాదనీ సంభావించే కవిత్వావరణం, సాహిత్యావరణం ఇవాళ పెరిగిపోతోంది కనుకే–శ్రేయోదాయకమైన, ప్రయోజనదాయకమైన సాహిత్యానికి జనం దూరమైపోతున్నారు. కవిత్వం, సాహిత్యం అంతా ముఠావ్యాపారంగానూ, సహకార 'కృషి' కంపెనీలగానూ మారిపోతోంది. కెరీరిస్టులుగా మారేందుకు ఉపకరించే భావజాలమే అల్లుకుంటోంది. కవుల ద్వంద్వ ప్రవృత్తులు, నిజాయితీలేని, బుకాయింపులు, 'నా' అనే అహాలూ ఇవే రాజ్యమేలుతున్నాయి. సామ్రాజ్యవాద సంస్కృతిని నిరసిస్తున్నామంటూ, ఆ సంస్కృతీ జీవనమే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా మలుచుకుంటున్న, సదరు వ్యాపార సుఖభోగాలకై ఆత్రపడి పరుగులు తీస్తున్న సాహితీవేత్తలు, కవులు ఇవాళ పెరిగిపోతున్నారు.

"అక్షర రూపము దాల్చిన ఒకేఒక్క సిరాచుక్క–లక్ష మెదళ్ళకు కదలిక" – కాళోజీ వాపోయినట్లు సిరా సీసాల కొద్దీ కాదు, పీపాలకొద్దీ వొలకబోసినా ఏ ఒక్క మెదడూ కదలడం లేదంటే – అసలు'చుక్క' కవుల మెదడులో ఉంటేగా కదలిక. మరోడ్ని కదిలించగల నిజమైన ప్రేరకశక్తి కాగల 'ఫినామినన్' నేడేదీ? ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 19 సెప్టెంబర్' 2001)**

# (14) అమ్మ మన పెన్నిధి

"**ఢి**ల్లీకి రాజయినా ఒక తల్లికి బిడ్డయే" ! అమ్మ లేకుండా ఏ ప్రాణీ లేదు, రాదు. 'మాతృత్వంలోనే వుంది ఆడజన్మ సార్ధకం' అనే భావన కూడా ప్రచులితంగా వున్నదే. అమ్మ తోటి పేగుబంధం బొడ్డు కోసినా ఆమరణాంతరం నిలిచేదే! అమ్మ ఎవరికయినా అమ్మే. ఒక సూర్యుడు సమస్త జీవులకు తానొక్కక్కడై త్రాతగా నిలిచే భంగిన అమ్మ కూడా-స్వీయానుభూతి వ్యక్తీకరణగా, మానవసంబంధాల మౌలిక నిర్వచనంగా నిలవడం మాత్రమే కాదు, సాహిత్యంలో అందునా ప్రధానంగా కవిత్వంలో ఆయా ఉద్యమాల నేపథ్యంలోనూ, ఎక్కడో అక్కడ ప్రేరకశక్తిగా కానవస్తూనే వుంది. 'అమ్మ వాస్తవం, నాన్న విశ్వాసం' అని ఆంగ్లోక్తి. 'మాతృదేవో భవ.. పితృదేవో భవ.. ఆచార్యదేవోభవ..' అని వందనీయులలో ఆద్యస్థానం కూడా అమ్మదే! 'అమ్మ' అనే రెండక్షరాలలో దాగిన ఆనందం, ప్రేమ, ఆప్యాయత, కృతజ్ఞత, అర్ద్రత రాగరంజిత హృదయానికే అవగతమవుతుంది. అమ్మ మాటలో, అమ్మ పాటలో, అమ్మ స్పర్శలో, అమ్మ ప్రతిచేష్టలో అవధిలేని అనిర్వచనీయ అనురాగ గంధాలు, అనుభూతి గ్రంథాలు వున్నాయి. అనుకోగలగాలి, అందుకోగలగాలి. అమ్మ కేవలం ఒక 'సెంటిమెంట్' అనుకునేవారుంటే అది వారి సంస్కారం. అమ్మ గురించి కవిత్వమో, కథో రాయకపోతే అది ఆ సృజనకారుడి దోషమేమీ కాదు. కన్నతల్లిని ప్రేమగా ఆదరణగా పట్టించుకోగలగాలి. అమ్మ రుణం ఏమిచ్చి తీర్చుకోగలిగేది కానేకాదు. హృదయానికీ, బుద్ధికీ ఏకకాలంలో సంప్రీతిని కలిగించగలిగే 'అమ్మ' ఒక భౌతిక వాస్తవం మాత్రమే కాదు. ఆదిభౌతిక అనంతశక్తి.

వైదిక పురాణ వాఙ్మయం అమ్మను దైవిక భావనతో చూసింది. 'మాత్రూణాం మూర్ధ్ని సంస్థితా' అని దైవం తల్లుల నుదుటిపై ఉంటుందని పేర్కొంది. 'నమాతుః పరదైవతమ్' అని తల్లిని మించిన దైవం లేదని నీతిశాస్త్రం ప్రబోధించింది. వ్యక్తిత్వ వికాసానికి మూలధారనాడిగా అమ్మగా స్త్రీమూర్తి సంభావింపబడింది. 'కంటేనే అమ్మ అంటే ఎలా' అన్నట్లు ప్రేమమయురాలయిన పెంచిన స్త్రీ అయినా 'మాతృత్వ' భావనతో 'అమ్మతనం'తో ఆదరణీయురాలయింది. శ్రీకృష్ణుని బాల్యంలో పెంచిన

యశోద, బాలరాముని కన్నతల్లి కౌసల్యకన్నా మిన్నగా సమాదరించిన కైక కూడా 'అమ్మ' భావనలకు అనుభూతి గంధమద్దినవారే!

**రాజపత్నీ సురోఃపత్నీ భ్రాతృపృథ్వీ తథైవచ**
**పత్ని మాతా స్వమాతాచ పంచైతా: మాతరస్మృతా:**

అని రాజుభార్యను, గురువుగారి భార్యను, అన్నభార్య అయిన వదినెను, అత్తను, అమ్మను ఈ ఐదుగురిని 'అమ్మ'లుగానే అంటే మాతృస్వరూపులుగా నీతిశాస్త్రం పేర్కొంది. అమ్మలాగా వీరిని గౌరవాదరాలతో, ప్రేమ ప్రీతులతో చూడాలన్నమాట. ఏది ఇచ్చినా అమ్మయే ఇవ్వాలి! ఈ శరీరాన్ని మాత్రమే కాదు తన చనుబాలతో, ఆపై గోరుముద్దలతో, తన ఆలనా పాలనతో ముద్దుమురిపాలతో పెంచి పెద్దచేసి ఒక వ్యక్తిత్వాన్ని సంతరించడంలో అమ్మదే ప్రధాన పాత్ర.

**అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ, చాల బె**
**ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి వుచ్చిన యమ్మ తన్నులో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ, మా**
**యమ్మ కృపాబ్ధియిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్**

అంటూ పోతన మహాకవి కవిత్వంలోని గొప్పదనాన్నీ, పటుత్వాన్నీ తన కృపతో ప్రసాదించేది అమ్మయేనని, తల్లినే భాగవత రచనా సందర్భంలో తలచుకున్నాడు.

భక్తి సామ్రాజ్యంలో భగవంతుడిని ఎన్నో రకాలుగా భావించి భక్తులు తరించడం ఉంది. అతడో తండ్రిగా, భర్తగా, సఖుడిగా, సదా తమ సన్నిధిలోనే ఉండేవానిగా భావించి తరించినవారున్నట్లుగానే, భగవంతుడిని తమ కన్నబిడ్డడిగా, ఆయనకు తాను తల్లిగా సంభావించినవారూ వున్నారు. ద్వాపర యుగంలో యశోదమ్మ, కృష్ణుడిని తన పుత్రుడిగానే భావించి తల్లిప్రేమను పంచింది.

అలాగే శివభక్తులందరూ బెజ్జమహాదేవికి అగ్రస్థానం ఇచ్చారు. ఆది దేవుడికి అమ్మగా మారిపోయిన భక్తురాలు బెజ్జమహాదేవి . అక్షరజ్ఞానమే లేని అమాయకురాలు ఆమె. అలాంటి ఆమె శివుని గురించి తలపోస్తూ అతనికి అమ్మలేదనే ఆలోచనతో తల్లడిల్లిపోయింది. శివుడిని, శిశువుగా చేసి అమ్మగా లాలించి కైవల్యం పొందింది బెజ్జమహాదేవి.

**తల్లి గల్గిననేల తపసిగానిచ్చు?**
**తల్లిగల్గిన నేల తలజడల్గట్టు?**

**తల్లియున్న విషంబు త్రావనేలిచ్చు?**
**తల్లి యుండిన తోళ్లు దాల్పలేనిచ్చు?**
**తల్లి పాముల నేల ధరియింపనిచ్చు?**
**తల్లి పుచ్చునె సుతు వల్లకాటికిని?**

అని భావించిన బెజ్జమహాదేవి గురించి పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో ఆమెను అమ్మతనానికి మారురూపుగా రూపుకట్టించాడు. పరమశివునికి – బిడ్డడిగా స్నానాలు చేయించి, లాలించి వాత్సల్య భావంతో అమ్మగా బెజ్జమహాదేవి ఆదరించింది.

"నాయనా! నా కన్నా! నా పట్టీ! నా చిన్నివడుగా!" అంటూ బాలశివుని ముద్దాడింది. పాలుపట్టడం, గోరుముద్దలు తినిపించటం, ముద్దుచేస్తూ మురిపెంగా చూస్తూ వుంటే నిజంగానే శివుడు ఆమెకు బిడ్డడైపోయాడు.

ఆమె వాత్సల్యాన్ని పరీక్షించడానికి ఒక రోజు పాలుతాగక, గోరుముద్దలు తినక వుండిపోయిన బాలశివుడికి జబ్బు చేసింది. బెజ్జమహాదేవి ఏం చేయాలో పాలుబోక బిడ్డ పరిస్థితి చూస్తూ బతికివుండడం వృథా అని తన ప్రాణ త్యాగానికే సిద్ధపడుతుంది. శివుడు సాక్షాత్కరించి తల్లిప్రేమలోని మాధుర్యాన్ని రుచి చూపినందుకు, తల్లి అయిన కారణంగా ఆమె 'అమ్మవ్వ'గా ఖ్యాతికెక్కేలా వరమిచ్చాడు. అలా బెజ్జమహాదేవి బెజ్జమ్మవ్వగా, అమ్మవ్వగా ముల్లోకాలలో ప్రశంసలందుకుని శివైక్యం చెందింది. బెజ్జమ్మవ్వ బిడ్డడిగానే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో పలు ప్రాంతాలలో నేటికీ బాలశివమూర్తిని ఆరాధించడం కనిపిస్తుంది. శయనించి వున్న బాలశివరూపం చిత్రపటాలలో ఆ ప్రాంతాలలో ప్రసిద్ధంగా పూజలందుకుంటూనే ఉంది.

అలాగే పోతన భాగవతంలో 'అమ్మ' అంటే యశోదమ్మనే! చిన్ననాట పిల్లల అందాలను చూసి మురిసిపోతూ తల్లులు చెందే పారవశ్యం అంతా యశోదలో మూర్తీభవించి కానవస్తుంది.

**జోజో కమలదళేక్షణ**
**జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!**
**జోజో పల్లవకర పద!**
**జోజో పూర్ణేందువదన! జోజో కృష్ణా!**

అని ఆమె.. యశోద జోలపాట పాడుతుంది. ఇందులో పోతన తానే మాతృస్థానీయుడయిన వైభవమూ కానవస్తుంది. అలాగే గోపకాంతలు బిడ్డడి మీద...

**ఓయమ్మ నీ కుమారుడు మా యిండ్లను**
**బాలుబెరుగు మననీడమ్మా**
**బోయెదమెక్కడికైనను మాయన్నల**
**సురభులాన మంజులవాణీ**

అని మొరపెట్టుకుంటే వారి కోపం చల్లారేలా మంచిమాటలు చెప్పి 'నా బిడ్డ నా చన్ను వీడి రాడ'ని ఒట్లు పెట్టి వారిని శాంతింపచేసి ఇళ్లకు పంపిస్తుంది యశోదమ్మ.

కన్నయ్య ఇంటికి వచ్చి అన్యమనస్కంగా వున్న 'అమ్మ ఒడిలో దూరి' 'ఆకలేస్తోందమ్మా!' అని ముద్దుముద్దుగా బతిమాలేసరికి కరిగి నీరయి, పాలిస్తుంది. పాలు నిండిన బొజ్జతో, ఆయాసపడుతూ, పాలచారికల బుగ్గలతో మెరిసిపోతున్న బాల కృష్ణునితో 'కన్నయ్యా! పాలు తాగి మనింట్లోనే ఉండి ఆడుకోరాదా! ఎందుకు ఇరుగు పొరుగువారితో మాటలు పడడం, తల్లిపాలు గుక్కెడు–మిగిలినవి పుట్టెడు సరిసమానన్న మాట నా పట్ల బొంకైనదా? ఎందుకు ఈ రొష్ఠ' అని అనునయిస్తుంది.

మారాడక అమ్మ గుండెల మీద నిద్రపోయాడు కన్నయ్య.

'అమ్మా! తమ్ముడు మన్ను తిన్నాడు' అని బలరాముడు చెప్పగా తన సుద్దులు పెడచెవిన పెట్టాడని కోపంతో ఆ తల్లి 'కన్నా! మన్ను తిన్నావా? నీకు ఆకలయితే పాలూ వెన్న లేవా? అతి రుచికరమైన భక్ష్యాలు ఇంట్లో బోలెడున్నాయి కదా! మన్ను తినాల్సిన అగత్యం ఏమిటని' గద్దిస్తుంది.

'లేదమ్మా! నేనేమైనా వెర్రివాడినా? అన్న కొండేలు చెబుతున్నాడు. కావలిస్తే నా నోరు చూడు' అంటూ ఆ బిడ్డడు నోరు తెరిచాడు.

**కలయో వైష్ణవ మాయయో యితర సంకల్పార్థమో సత్యమో**
**తలపన్ నేరకయున్నదాననో యశోదాదేవిగానో**
**పరస్థలమో బాలకుడింత యాతని ముఖస్తంబై యజాండంబు ప్ర**
**జ్వలమై యుండుటకేమీ హేతువో మహాశ్చర్యంబు చింతింపగన్**

అని కైమోడ్చిన యశోదకు తృటిలో ఆ స్మృతి తొలగి మళ్లీ మామూలుగా అమ్మగా అయ్యేలా మాయచేసాడు ఆ కన్నయ్య. పిల్లవాడికి తాను యశోదలా వుండాలని తలపోసే తల్లులెందరో ఈ లోకంలో! కన్నతల్లి అనుకుంటే అంతకన్న మిన్నగా యశోదమ్మయే అసలయిన అమ్మగా స్థిరీకృతమైంది! తల్లులు తమ సంతానాన్ని పిలవటంలో వంశోద్ధారకునిగా భావించటం భాగవతంలోనే అదితి వామనుణ్ణి పిలవటంలో కనిపిస్తుంది.

**నన్ను గన్న తండ్రి! నా పాలిదైవమ**
**నా తప:ఫలంబ! నా కుమార!**
**నాదు చిన్ని వడుగ! నాకులదీపక!**
**రాగదయ్య భాగ్యరాశివగుచు**

ఇక బాలరామునిపై కౌసల్యకే కాక కైకేయికీ ఎంతో ప్రేమాభిమాలున్నాయి అనే సంగతి వాల్మీకి రామాయణంలో అయోధ్యకాండలో గమనించగలం. రామ పట్టాభిషేక వార్త మంథర నోట వినగానే కైక సంతోషంగా ఒక బంగారు ఆభరణాన్ని మంథరకు ఇస్తుంది. 'రామే వా భరతేవాహం విశేషనోపలక్షయే' అని భరతుడెంతో రాముడూ తనకంతే అని, తనకది అత్యంత సంతోషకరమైన వార్త అని అంటుంది. విశ్వనాథ సత్యనారాయణ గారు తమ 'రామాయణ కల్పవృక్షం'లో బాలరాముడు కైకేయిని చూడగానే ఆమె వద్దకు పరుగులు పెట్టేవాడనీ, తాను కైక దగ్గర వుంటే ఇక ఎవరూ పిలిచినా వారి దగ్గరకు వెళ్ళేవాడు కాదనీ రాశారు.

**కాళ్లు వచ్చినదాదిగా కైక కొఱకు**
**బరువులెత్తును శ్రీరామభద్రమూర్తి**
**నిద్ర మేల్కొన్నదాగ రామభద్రుకొఱకు**
**నంగలార్చుచు జను గేకయాత్మజాత**

అని వారిద్దరి అనుబంధాన్నీ చిత్రీకరించారు. విలువిద్యవేళ కైక రామునికి బాణాలు ఎలా సంధించాలో, లక్ష్యాలు ఎలా ఛేదించాలో చెబితే రాముడు కైక మాటనే పాటించేవాడట.

సరే! ఇక కౌసల్య సంగతి చెప్పనే అక్కర్లేదు. రామునిపై కన్నతల్లి కౌసల్య ప్రేమకు తార్కాణమైన అద్భుతమైన పద్యం కల్పవృక్షం అవతారఖండం 334 వ పద్యంలో కానవస్తుంది. బాలరాముడికి అప్పుడప్పుడే మాటలు వస్తున్నాయి. పిల్లల ముద్దుమాటలు తల్లికి కలిగించే ముచ్చట అంతా యింతా కాదు. కౌసల్యా బాలరాముల సంభాషణ ఇలా సాగింది-

**తానో 'లాములు' తండ్రిపేరెవరయా? 'దచాదమాలాలు' -నౌ**
**లే, నా పేరన 'నమ్మగాల'నగ నోలిందల్లి - 'కౌసల్యతం**
**డ్రీ!'నా తాననబోయి రాక కనులన్ నీర్వెట్ట గౌసల్య 'నౌ**
**గానే కానులె యమ్మనే!' యని ప్రభున్ గౌసల్య ముద్దాడినన్**

కౌసల్య ‘ఈ అబ్బాయి తానెవరయా’ అని అడిగితే ‘లాములు’ అని రాముడు ముద్దుగా చెప్పాడు. ‘తండ్రి పేరెవరయా?’ అని అడిగితే ‘దాచాదమాలాలు’ దశరథ మహారాజు అన్నాడు.. ‘ఔనులే’ మరి నా పేరేమిటి! అని అడిగితే రాముడు ‘అమ్మగాలు’ అమ్మగారు అన్నాడు. ‘కాదు తండ్రీ నా పేరు కౌసల్య అని’ తల్లి అంటే ఆ పేరు పలకడం రాక రాముడు ఏడవడం మొదలెట్టాడు. తల్లి వెంటనే ‘సరే నాన్నా! నేను కౌసల్యను కాదురా! అమ్మనే’ అంటూ బాలరాముని ముద్దాడిందట!

నిజంగా ఇది సహజ మధుర సన్నివేశం. పిల్లలకు ‘అమ్మ’ అంటే అమ్మయే! అమ్మ పేరుతో వారికి పరిచితి లేకపోవచ్చు కూడాను. రాజకుటుంబాలలో అమ్మను ‘అమ్మగారు’ అని గౌరవంగా సంబోధించడం ఆనవాయితీ! రాముడు అందుకే ‘అమ్మగాలు’ అని పేర్కొన్నట్లుగా విశ్వనాథ కడురమణీయంగా చెప్పారు. ‘నేను కౌసల్యను కాదులే! ‘అమ్మనే’ అని బాలరాముడిని కౌసల్య అమ్మగా లాలించడంలోని మధురత నిజంగా హృదయాన్ని తాకే రసార్ద్రతయే!

వసుచరిత్ర ప్రబంధకారుడు రామరాజ భూషణుడు శుక్తీమతీ, కోలాహలుల బిడ్డ అయిన గిరిక బాల్యాన్ని అద్భుతంగా చిత్రించాడు. శుక్తిమతి గిరిక తల్లి. ఆమె నది. కోలాహలుడు పర్వతం. అతడు తండ్రి. శుక్తిమతీ, కోలాహలులకు జనించిన గిరికను నది అయిన తల్లి ఎలా పెంచిందట!

**జలకములార్చి పొందు జలజచ్ఛదపాళికం గప్పి తమ్మి సం**
**కుల దెలిదేనెలుగ్గలిడి క్రౌందరగల్ గదిలించు కల్వతొ**
**ట్టెలల గుమారు గూతును ఘటించి భజించు నదీలలామ కో**
**మలకుముదా గతాళికుల మంజురవంబున జోలపాడుచున్**

తల్లి నదికనుక స్నానము ఆ నీటితోనే చేయించింది. తెల్లతామరపువ్వు రేకులనే వస్త్రంగా కప్పిందిట. శంఖపాత్రలే ఉగ్గగిన్నెలుగా చేసి పూలతేనెలు ఉగ్గుగా పట్టిందట. నదీ తరంగాలలో కదలే కలువపూవుటుయ్యాలలో, తేటిపాటలే జోలపాటలుగా ఊపిందట. ఓ కన్నతల్లి బిడ్డకి అందునా నదీమతల్లిగా కావించిన ముద్దుముచ్చటల ఆలనాపాలనా ఇది.

అలాగే పిల్లల పెంపకంలో తల్లికీ, తండ్రికీ బాధ్యత వున్నా తల్లి హృదయం బిడ్డల పట్ల ఎంత సుకుమారంగా, ప్రేమమయంగా వుంటుందో ఈ పద్యంలో గమనించవచ్చు.

**పంకజపాణి శంఖపరిభావక కంధర దల్లి యేలకో**
**సంకులు గట్టెనంచు గులశైలసుతాగ్రణి పాయద్రోచి ర**
**త్నాంకిత హారముంప బరువానునో బిడ్డకివేల కర్కశా**
**లంకృతులంచు హల్లక కలాపములుంచు నదీలలామయున్**

పద్మముల వంటి సుకుమారపు చేతులుగల గిరిక కంఠం సహజంగానే శంఖం వంటిది. ఆమె మెడలో శంఖముల హారము శుక్తిమతి ధరింపచేస్తే, తండ్రి కోలాహలుడు వాటిని తీసేసి రత్నాలహారం ధరింపచేశాడట. పర్వతసానువుల్లో రత్నాలు దొరకడం కవిసమయమే! కోలాహలుడు పర్వతమే కదా! అది చూసి తల్లి ఈ తండ్రి కర్కశుడులా వున్నాడు. లేకపోతే బరువైన రత్నాలను పాపమెడలో ధరింపచేస్తాడా అని కఠినపు ఆభరణాలను తీసేసి ఎర్ర కలువలను దండగా వేసిందట. పుష్పకోమలమైన కూతురు అవయవాలకు పూవులే అలంకారాలని ఆ అమ్మ సున్నిత హృదయ భావన మరి!

ఇలా అమ్మ ప్రేమ అభివర్ణితమయ్యే ఘట్టాలు తరచిచూడాలేగానీ ప్రాచీన సాహిత్యంలో అనేకం వున్నాయి.

అలాగే విశ్వనాథ, నాయని, జాషువా, కరుణశ్రీ వంటివారు తమ పద్య ఖండికలలో అమ్మతనాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన తావులు వున్నాయి. కల్పవృక్షంలో విశ్వనాథవారే దశరథ కుమారులకు ఉపనయనం జరిగిన ఘట్టాన్ని వర్ణిస్తూ బాలవటువయిన రాముడు నుదుట నిలువు కుంకుమ తిలకాలతో, చిరుత బుగ్గలమీద కాటుక చుక్కలతో, పాదాలకు పసుపు పారాణితో ప్రకాశిస్తూ కౌసల్యను భిక్ష అడగవచ్చాడు.

**ముదితుండై 'భిక్షాంభవ**
**తిదేహి' యని తల్లినడిగె దేవుడు రాముం**
**డు, దయాస్రోతస్విని 'త్వంచమ**
**మదేహి' యని తల్లి రాము మరి ముద్దాడెన్**

'భవతి భిక్షాందేహి' అని వటువుగా రాముడు అమ్మ కౌసల్యను భిక్ష అడగగానే, దయా స్రోతస్వినియైన ఆ అమ్మ కరిగిపోయి ఆనందంతో 'త్వంచమమదేహి' మరి నువ్వు కూడా నాకు భిక్ష ఇయ్యి– అని మరీ మరీ ముద్దాడిందట!

అమ్మ కోరే భిక్ష ఆ ముద్దులే! పిల్లవాడికి హేమాభరణాలు, ప్రేమ విభవ భాసురమైన వీక్షణాంశువులు ప్రసాదించిన ఆ అమ్మకు బిడ్డ నుంచి కావాల్సింది ఓ ముద్దు మాత్రమే! విశ్వనాథ కల్పించిన ఉపనయన ఘట్టం అమ్మప్రేమను అభివ్యక్తీకరించే అనుపమాన చిత్రణం!

అమ్మ మన తొలిస్పర్శ. మన నోట చిలికిన తొలి అమృత బిందువుల క్షీర ధార. లోకదర్శనం, విశ్వశ్రవణం ఆమె నుండే. ప్రపంచాన్ని అనుభవించటం, అర్థం చేసుకోవటం మొదలెట్టింది ఆమెతోనే. అలాంటి అమ్మలు నేడు బిడ్డల నిర్లక్ష్యానికీ, నిరాదరణకూ గురికావడం అంటే సకల మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలై పోతున్న దారుణ స్థితి విస్తరించడమే!

'మదర్స్ డే' అనేది పాశ్చాత్య సంస్కృతి.. భారతీయ జీవన మూల్యాలది కాదు. కానీ కన్నతల్లి పట్ల అమానవీయతను ప్రదర్శించే నైచ్యం నుండి, ఆర్థిక సూత్రాలు 'అమ్మ' అనే అనుభూతి తాలూకు సున్నితత్వపు పొరలను పెకిలించి వేసే దౌష్ట్యం నుండి ఇవాళ మనిషి రక్షింపబడితే చాలు!

ఆపదలో, ఆనందంలో, కష్టంలో, సుఖంలో అమ్మ ధ్యాస, అమ్మ ఆసరా లభించగల్గేలా–అమ్మను ప్రేమించే హృదయాన్ని, అమ్మ పట్ల బాధ్యతతోనే కాదు, అనవరతం ప్రేమతో నిలుపుకోగలగడం కావాలి. అమ్మ గురించి కథలూ, కవిత్వాలూ అల్లకపోయినంత మాత్రాన నష్టం లేదు. అమ్మకు సంబంధించిన సాహిత్యం, గోర్కీ 'అమ్మ' నవల, అమ్మ గురించి 'అమ్మపథం' వంటి అద్భుత కవితా సంకలనాలు, రంజని, నేటి నిజం వంటివారు వెలువరించిన 'అమ్మ' కవితా సంకలనాలు, అమ్మపై కథలు ఇప్పటికే ఎన్నో వచ్చాయి. 'అమ్మ' అనే భావన సార్వకాలికం, సార్వజనీనం. వాయుపురాణంలో అమ్మ గురించి షోడశ శ్లోకాలున్నాయి. మాతృషోడశి ప్రతి శ్లోకం బాపు బొమ్మలతో, శ్రీ చాగంటి కోటేశ్వరరావుగారి వ్యాఖ్యానంతో గ్రంథరూపంలో అయిదేళ్ల క్రితమే వెలువడింది.

'మాతృవందనం' ఒక స్ఫూర్తిదాయక గ్రంథం. గోరు ముద్దలు తినిపించిన అమ్మకు పిండ ప్రదానం చేయడం అనే ఆర్షధర్మాన్ని, అందులోని జీవలక్షణ సారాన్నీ మాతృషోడశి శ్లోకాలు ఆర్ద్రంగా గాఢంగా వివరిస్తాయి.

అమ్మపట్ల మనిషిని కర్తవ్యోన్ముఖుణ్ణి– ఆమె జీవించి వుండగానే చేయగల స్ఫూర్తిదాయక అక్షరదీపాలవి.

**యం మాతాపితరౌ క్లేశం, సహేతే సంభవేన్నృణామ్**

**నతస్య నిష్కృతి: శక్యా, కర్త వర్షశతైరపి**

అంటుంది మనుస్మృతి.

శిశువు జన్మించినపుడు అమ్మా, నాన్న వహించే శ్రమకు ప్రతిఫలం ఏమిచ్చీ తీర్చలేం. నూరేళ్లు అమ్మా, నాన్నలకు సేవచేసినా ఆ రుణం తీరదు.

**అమ్మ ఒకవైపు**
**దేవతలంతా ఒక వైపు**
**సరితూచమంటే**
**నేను ఒరిగేను అమ్మవైపు**

అని సినారె అన్నా

**చెట్టు విసురుగా నా మీద పడలేదన్న ఆనందమే తప్ప**
**అమ్మకు తన చేయి విరిగిన బాధ లేదు**
**ఉదయమే వెళ్లి అమ్మ హృదయానికి**
**దగ్గరగా ఒదిగి నిలిస్తే**
**ఆ చెయ్యి తూర్పు దిక్కు చూపుతూ**

అని వరవరరావు వివరించినా-

**భ్రష్టుడా! అమ్మ రుణం తీరదు**
**అమ్మకు అమ్మవై పుడితే తప్ప**

అని ఎన్.గోపి తీర్మానించినా-

**అమ్మ - అక్షరం**
**అమ్మ-ప్రత్యక్షర సత్యం**
**అమ్మ-శాశ్వతత్వ భావనం**
**అమ్మ-హదయంలో ఆరని దీపం**
**అమ్మ అంటే అమ్మయే! ❋**

(మా అమ్మ కీ.శే.అల్లంరాజు రాజేశ్వరమ్మ (30.10.1930-29.1.2018) కు అంకితం)

**(వార్త ఆదివారం అనుబంధం 27.8.2017)**

# (15) తెలుగుకు వెలుగేదీ?

'అయ్యయ్యో! మన భాషయే–

మకరంద బిందుబృంద రసస్యందన సుందరమగు మాతృభాషయే–

మహానంద కందళ సందోహ సంధాన తుందిలమగు మాతృభాషయే–

క్రమతకు గ్రమత, కఠినతకు కఠినత – వదలునకు వదులు, బిగికి బిగి, జోరునకు జోరు, నెదురెక్కున కెదురెక్కు – మందతకు మందత – ధాటికి ధాటియు – నన్ని వన్నెలు, నన్నిచిన్నెలు, నన్ని వగలు, నన్ని వద్దికలు, నన్ని తళుకులు, నన్ని బెళుకులు – నన్ని హొయలు, నన్ని యొయ్యారములు గలిగిన మన మాతృభాషయే – వ్యాసమునకు – నుపన్యాసమునకు – గవిత్వమునకు – గానమునకు సంపూర్ణార్హత గల భాషయే – పైవారే యా భాషను బట్టుదలతో బ్రయత్నమున నభ్యసించుచుండగా – మనవారే దానినంత యధమాధముగా జూచుట తగునా?'

'ఆంగ్లేయ భాష యేల చదువుకొంటివని నే నధిక్షేపింపను. ఇంతకన్న నధిక జ్ఞానమును గూడ నీ వా భాషలో సంపాదింపుము, నాకు మరింత యిష్టము. కానీ నీ యాంగ్లేయ భాషా జ్ఞానమెందులకో నీ వెరుగుదువా? ఆంగ్లేయ భాషయే కాదు, ఇంక ననేక భాషలు కూడా నేర్చుకొనుము. నీవు సంపాదించిన పరభాషా జ్ఞానమంతయు నీ భాష నభివృద్ధి పఱచుటకే. నీ భాషను భాగ్యవత్తరమును జేయుటకే – నీ భాషను బరభాషా గ్రంథ ప్రశస్థాభిప్రాయములతో వన్నె పెట్టుటకే. అంతకంటే వేరు కాదు'

– ఇప్పుడు కాదు తొంభై ఆరేళ్ల క్రితం 1921 జులై 23 ఆంధ్రపత్రికలో కీ.శే.పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు సాక్షి వ్యాసాలలో 'స్వభాష' పేరిట రాసిన వ్యాసంలోని తెలుగు భాషా స్థితిని గూర్చిన ఆర్తి అది. ఈనాడు తెలుగు భాషా స్థితిని గూర్చిన ఆవేదన ఇబ్బడిముబ్బడి అవుతోంది. అంతరించిపోయే భాషల పట్టికలో తెలుగుభాష పేర్కొనబడడం శోచనీయం కాక మరేమిటి?

తెలుగు మాట్లాడే దీపాలు తెల్లవార్లూ వెలుగుతూంటాయి.

– అన్నాడు ఆరుద్ర, అలా తెల్లవార్లూ వెలుగుతూంటే విద్యుత్‌శాఖ లోపమనీ, విద్యుత్ దుర్వినియోగమనీ అనుకుంటారని కాబోలు, భాషపేరునే పార్టీలో కలిగి వుండి, అధికారంలో వుండి తాము పరిపాలిస్తున్న రాష్ట్రంలోనే తెలుగు వెలుగులకు కోత విధిస్తున్న వైఖరి బాధాకరంగా ఉంటోంది.

అసలే తెలుగువారు రెండు రాష్ట్రాలుగా విడిపోవడం ఇంకా జీర్ణించుకోలేని దశలో, ఇరు రాష్ట్రాలలో తెలుగు భాష అస్తిత్వం గురించిన తులనాత్మక పరిశీలనం కొందరు విజ్ఞులకు మరింత ఆవేదనాభరితంగా మారిపోయింది. పక్కనున్న తమిళనాడు, కర్నాటక, కేరళ వంటి రాష్ట్రాలలో అక్కడి వారు తమ మాతృభాష పట్ల చూపుతున్న శ్రద్ధకీ, పట్టుదలకీ, అభిమానానికి భిన్నంగా అదే మూలద్రావిడ భాషలలోని మన తెలుగుపట్ల మన రాష్ట్రాలలో మాత్రం పొడచూపుతున్న ఉదాసీనత, నిర్లక్ష్యం బాధాకరంగానే ఉంటోంది.

తెలంగాణలో కనీసం కొంతమేరకు నయం అనిపిస్తోంది. భాష పట్ల, సాహిత్యం పట్ల, తెలుగుభాషా రచయితలు, కవులు, కళాకారుల పట్ల తెలంగాణలో కనబడుతున్నంత ఆదరణ తమదే అయిన మరో రాష్ట్రంలో మసకబారడం, శ్రద్ధాసక్తులు లోపించడం ప్రశ్నార్థకమవుతోంది.

ఉదాసీనత వేరు. పనిగట్టుకుని తెలుగు భాషాభివృద్ధికి అవరోధాలు కల్పించడం, చేజేతులా అణగద్రొక్కడం వేరు. ఆంధ్రప్రదేశ్‌లో – **'అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!'** అన్న కాళోజీ ఆగ్రహ వాక్యమే నినదించవలసిన పరిణామాలకు అక్కడి పాలకవర్గీయులే పూనుకోవడం శోచనీయం.

ఏ భాష అయినా వికసించాలంటే, అభివృద్ధి చెందాలంటే నాలుగు విధాల పురోగతి జరగాలి.

తెలుగులో మాట్లాడటం, తెలుగు చదవటం, తెలుగు రాయటం, తెలుగులో ఆలోచించటం.

అన్ని సమగ్ర పార్శ్వాలనూ నేటి తరం, రానున్న తరాలు పొందగలిగితే తప్ప భాషకు – అంతరించిపోయే స్థితికి ప్రమాదఘంటికలు మ్రోగక తప్పదు.

తెలుగు నేలపై, తెలుగు తల్లిదండ్రులకు పుట్టి, తెలుగు సంప్రదాయాలు అభ్యసించి, తెలుగు జాతీయ తత్త్వ సంపత్తిచే అభివృద్ధి చెంది, తెలుగుభాషలో పండితులై, తెలుగులో గ్రంథాలు రచించి భాషామతల్లికి అమూల్య అలంకారాలుగా అర్పించి, తెలుగు సీమ సేవ నాచరించి, తమ అంగములు, అసువులు, ఆత్మలు పవిత్రములుగా చేసుకుని ప్రాణములను బాసి పరమపదాన్ని చేరిన మహనీయులు ఎందరో వున్నారు. వారి జీవికకు గానీ, వృత్తికిగానీ తెలుగుభాష తోడ్పడిందే తప్ప అవరోధం కాలేదు.

తెలుగుభాష ఉపాధి, ఉద్యోగాలకు పనికిరాదనీ, తెలుగులో చదువుకుంటే అభివృద్ధి శూన్యమనీ అనుకునే, అనే, స్థితి దాపురించడానికి కారణం కూడా మనమే కానీ మరెవరో కాజాలరు. భారతదేశం పరదాస్య శృంఖలాలలో నుండి విడివడి స్వతంత్ర్య దేశం అయింది గానీ, ఈ డబ్బై సంవత్సరాలలో భావదాస్యం నుండి ఇంకా విడివడలేదు. ముఖ్యంగా పలు భాషల ఏకత్రిత జాతి అయిన మన దేశంలో తెలుగుకు మునుపెన్నడూ లేనంత పతన స్థితిని చేజేతులా కల్పించుకుంటున్న దౌర్భాగ్యం మనదే అనిపిస్తోంది. అమెరికాలో విద్య, ఉద్యోగాలే పరమావధి అన్న ధోరణిలో మన తెలుగువారు పడిపోయినంతగా దేశంలో మిగతావారెవ్వరూ తమ భాష విషయంలో, ఆలోచనాధోరణి విషయంలో మునిగిపోలేదు.

తెలుగు మాట్లాడటం నామోషీ అనే దశ విస్తరించడం విచారకరం. ఆంగ్లం నేర్చుకుంటే తప్ప గతి లేదు అనే స్థితికి పతనమయితే మన పరిపాలకుల ప్రయోజనం ఏముంది?

క్రమక్రమంగా పాఠశాలల నుంచి తెలుగును తొలగిస్తూ, తెలుగు మాధ్యమాన్ని నిర్వీర్యం చేస్తూ అంగన్వాడీ దశ నుండి ఆంగ్లమే శిరోధార్యం అనే ఆలోచనలు, తదనుగుణమైన చర్యలు అశనిపాతాలే!

ఇవాళ తెలుగు మాట్లాడటం మటుకే వచ్చిన పిల్లలు పెరిగిపోతున్నారు. వారికి తెలుగు చదవటం మాత్రం రావడం లేదు. తెలుగులో రాయడమూ రాదు. తాము మాట్లాడే, వినే తెలుగుని ఇంగ్లీషు అక్షరాలలో రాసుకుని చదువుతూ, తమ తెలుగును ఇంగ్లీషు లిపిలోనే రాస్తూ, అదే తెలుగు భాషోద్ధరణమనుకునే దశలో పడిపోవటం జరుగుతోంది. కంప్యూటర్లలో, స్మార్ట్ ఫోన్స్‌ల్లో లిపి వినియోగించగల సౌకర్యం వున్నా తెలుగులో రాయడం, చదవడం రాక ఇంగ్లీష్ లిపిలోనే తెలుగును

కూర్చడం అలవాటుగా మారిపోయిన వారున్నారు. సహజమైన తమ మాతృభాష తెలుగులో ఆలోచించే శక్తి కూడా సన్నగిల్లి అభివ్యక్తీకరణకు కూడా ఆమడ దూరంలో ఉంటున్నారు. ఇది భాషాభివృద్ధికి గొడ్డలిపెట్టు.

అయ్యయ్యో! తెలుగువాడే, తెలుగు తల్లిదండ్రులకు పుట్టినవాడే. తెలుగునేల గాలి పీల్చినవాడే.. ఇక్కడి నీరు ఇక్కడి ఆహారం పారణయొనర్చిన వాడే.. అలాంటి వాడు ఆంగ్లభాషను అభ్యసించిన మాత్రాన, ఏ అమెరికాకో వలస పోయి వుండవలసినంత మాత్రాన తెలుగును మరిచిపోవాలా? తెలుగు మాట్లాడనక్కరలేదా? తెలుగు చదవడం రాయడం విసర్జించేయాలా? అయిదేళ్లయినా రాకుండానే ప్లేస్కూల్ అంటూ పంపివేసి పిల్లలకు అప్పటి నుండే ఆంగ్లంలోకి నెట్టేస్తున్నది మన వైఖరికాక మరేమిటి? కనీసం పదవతరగతి వరకు తెలుగులో చదవడం విధాయకంగా వుండాలి. ఆంగ్ల మాధ్యమ బోధనలు వున్నా తెలుగు విధిగా మాట్లాడటం, చదవటం, రాయటం అనే నిబంధన ఉండాలి. నేడు అలాంటి నిబంధనలు విధించుకోవాల్సినంత స్థితికి తెలుగు భాషను నెట్టివేసుకున్నది మనం కాదా?! ఇప్పటికయినా కళ్లు తెరవకపోతే తెలుగు బడులు మూతపడితే ఇంక తెలుగు మనుగడే మృతశయ్య నెక్కుతుంది.

**ఇలా చేస్తేనే ఫలితం! :–**

అధికార భాషా సంఘం, గ్రంథాలయ వ్యవస్థ, సాహిత్య అకాడెమీ, తెలుగు అకాడెమీ, బాలల అకాడెమీ వంటి సంస్థలకు విశేష అధికారాలు, వనరులు సమకూర్చి, ప్రభుత్వ కార్యాలయాల్లో, బ్యాంకులలో, పరిపాలనలో తెలుగు వినియోగాన్ని విధాయకం చేయాలి. తెలుగు చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చిన వారికి మాత్రమే తెలుగు రాష్ట్రాలలో విద్య, ఉద్యోగ, వ్యాపారాలు చేసుకునే వీలుంటుంది అనే నియమాన్ని ఏర్పరచి, ఆ నిబంధనను కఠినంగా అమలు చేయాలి. అలా చేయడం పాలకులకు కష్టమేమీ కాదు.

భాష పట్ల నిర్లక్ష్యం పనికిరాదు. పరభాషలు నేర్చుకోవద్దని ఎవరూ అనడం లేదు. కానీ పరభాషా దాస్యం, వ్యామోహం తగదు. అవసరం మేరకు పరభాష. అంటే వృత్తి ఉద్యోగాలలోని అవసరాల మేరకే. అక్కడ కూడా స్వభాష వచ్చిన వారితో పరభాషా వినియోగం పరిహరించాలి. పానుగంటి వారన్నట్లుగానే 'పరభాషా పదముల కర్థము తెలిసినంత మాత్రమున బరభాష పాండిత్యము లభించినదని

భ్రమపడకూడదు. భాషలోని కళను, ప్రాణమును, తత్త్వమును, నాత్మను గనిపట్టవలయును. అది మీకసాధ్యము'. అసాధ్యమే కాదు ఆ దాస్యమూ అనవసరం. 'తల్లిస్తన్యముతో గూడ నే భాష మనము త్రావుదుమో యా భాషలోనే మనమెన్నటికైన గఠిన ప్రయత్నమొనర్చిన యెడల నుపజ్ఞా సహితమగు నుత్తమ గ్రంథములను వ్రాయగలము.'

**అప్పట్లోనే ఆందోళన**

పరభాషా దాస్యం మనకు కంఠగతమై పోతోందన్న ఆవేదన 1921 లోనే పానుగంటి వారు 'స్వభాష' సాక్షి వ్యాసంలో హెచ్చరికగా వివరించారు.

'నాయనలారా! మన కింగ్లీషు మాటలతో చెప్పినగాని ఏ అంశము కూడా మనస్సుకెక్కదు. అట్టి అభ్యాసము చిరకాలము నుంచి అస్థిగతరోగమై వున్నది. ఆయుర్వేద వైద్యుడు వచ్చి 'అయ్యా! కరివేపాకుపొడుముతో పథ్యము పుచ్చుకొనుమని నీతో చెప్పగా, నీకు ఆ మాట నచ్చదు. నాన్సెన్స్! కరివేపాకు పొడుము ఎందులకయ్యా అని నీవు ఆ ఆయుర్వేద వైద్యుని అధిక్షేపింతువు. ధనియాలు 'డైజేషన్'కు మంచివి. మిరియాలు 'లివర్' మీద 'ఆక్ట్' చేయును. కరివేపాకు 'గాల్‌బ్లాడర్'కు సత్తువనిచ్చును అని ఎవరో ఎల్.ఎం.పి మనవాడే చెప్పిన యెడల నీకది శ్రుతి ప్రమాణము. నాయనలారా! మనమెంత లక్షాధిపతులమైనను, కోటీశ్వరులమైనను మన బ్రతుకులు ముష్టి బ్రతుకులు కాక మరియొకటి కాదు. ఈ ముష్టి దేవులాటలో ఇంగ్లీషు మాటలు కూడా ఎందులకు? ఆ ఏడుపేదో మాతృభాష తోడనే ఏడ్చిన మంచిది కాదా? మన ఏడుపు సహజముగాను, సాపుగాను స్వతంత్రముగాను ఉండునే. ఏడుపులో కూడా మనకు అస్వతంత్ర ఏమి ఖర్మము? అందుకు సర్వ స్వతంత్రులము సంపూర్ణార్హులమే కదా?

ముష్టి బ్రాహ్మణుడు నీ ఇంటికి వచ్చి యాయవారపు బ్రాహ్మణుడనయ్యా యని అరవక 'బాయ్! రూమ్‌లో నున్న పాట్‌లో రైస్ యేమైన నున్నదేమో కైండ్లీ గెటిట్ హియర్, థాంక్యూ ఇన్ ఆంటిసిపేషన్' అని నీతో సంభాషింపగా నీవాతనికి ముష్టివేయుదువా? మూతి మీద ఈడ్చి ఒక్కటి వేయుదువా? అలాగే మన ముష్టిలోని ఈ ఇంగ్లీషు మాటలు కూడా అంత గౌరవప్రదములే అని నిశ్చయముగా నమ్ముడు నమ్ముడు'.

మాట్లాడే తెలుగులో కూడా ఇంగ్లీషు పదాలే ఎక్కువైపోయిన ధోరణి నేడు ప్రబలిపోయింది. టీవీ చానల్స్‌లో యాంకర్లు భాషను ఎంత భ్రష్టు పట్టించాలో అంత

పట్టిస్తున్నారు. ఉచ్చారణ దోషాలు లేకుండా మాట్లాడడం యువతకు గగనమైపోతోంది. విద్యావ్యవస్థ పటిష్టంగా తెలుగు బోధన పట్ల నిబద్ధమై వుండాలి. అప్పుడే భాషాభివృద్ధి, వికాసం సాధ్యం అవుతాయి. నిజానికి సాంకేతికాభివృద్ధితో తెలుగు వినియోగం సులభతరమైంది. ఇవాళ తెలుగులో మాట్లాడితే స్మార్ట్‌ఫోన్‌లో, కంప్యూటర్‌లో ఎక్కడైనా అదే తెలుగు రాసేసే లిపి ప్రత్యక్షమవుతోంది. కానయితే స్వయంగా తెలుగు రాయడం అనే దానికి అది విఘాతం కాకూడదు. అలాగే తెలుగు లిపిని చదవడం యువతకు వచ్చి తీరాల్సిందే. మనం ముందే అనుకున్నట్లు బాలబాలికలూ, యువతీ యువకులు తెలుగు చదవడం, రాయడం, మాట్లాడడం, తెలుగులో ఆలోచించడం అనే దిశగా జీవన విధానంలో రూపొంది తీరాలి. అందుకు కుటుంబం, స్నేహితులు, పరిసరాలు, పాలకులు, ప్రభుత్వం అన్నీ సహకరించేవిగా ఉండాలి.

ఏ భాషలోనయినా యాసలు, మాండలికాలు ఉంటాయి. తెలుగు భాషలో ప్రాంతీయ జీవనాలను బట్టి ఈ వైవిధ్యమూ అనంతంగా ఉంది. ప్రధానంగా ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ భాషగా వున్న వైవిధ్యం, మళ్లీ ఆయా ప్రాంతాలలోని వివిధ ప్రదేశాలను బట్టి యాసలుగా, మాండలికంగా ప్రతిధ్వనించినా అంతా తెలుగు భాషే! తెలుగు అక్షరాలు అవి అచ్చులైనా, హల్లులైనా తెలుగువారు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా అక్షరాలు విడిపోవు, విడిపోలేవు. తెలుగు వర్ణమాల ఇరురాష్ట్రాలకు ఒక్కటిగానే ఉంది. ఉంటుంది. పుట్టుక చేతనే కాక, బుద్ధిచేత, స్వభావము చేత, యోగ్యత చేత తెలుగు వారమనిపించుకునేలా పురోగతి చెందవలసిన అగత్యం నేడు మరింతగా ఉంది.

'మా తాతలు నేతులు తాగారు. మా మూతులు వాసన చూడండి' అన్న చందాన మన ప్రాచీన తెలుగువైభవాన్ని కీర్తించుకుంటే సరిపోదు. గత వైభవ స్మరణం, కీర్తనం మంచిదే కానీ, అది భవిష్య కార్యాచరణకు స్ఫూర్తిమంతం, ప్రేరకం కాగలగాలి. భాష జీవన స్రవంతి. తిరుపతి వెంకటకవులన్నట్లు 'తెలుగునకున్న వ్యాకరణ దీపం చిన్నది'. వ్యాకరణం అంటే ఏమిటి? అది కచ్చితంగా ప్రయోగ శరణం! ఎప్పటికప్పుడు భాషకు నవీన వ్యాకరణం, నూత్న నిఘంటువులు రూపొందించుకోవాల్సిందే! భాష అనేది ఎప్పుడైనా భావ వినిమయ సాధనమే! కాలానికి అనుగుణంగా భాషలో కొత్త పదాలు చేరుతూంటాయి. అన్య భాషా పదాలను యథాతథంగా స్వీకరించడం కొంత

మేరకు సహజమూ, సమంజసమే గానీ వ్యవహారంలోకి వస్తున్న సరికొత్త వాటికి తెలుగులో సమానార్థక పదాలను సృజించుకుని వినియోగంలోకి తెచ్చుకుని ప్రజాబాహుళ్యంలో పరివ్యాప్తమయ్యేలా చూసుకోవడం మన భాష పట్ల శ్రద్ధ, ఆసక్తి, అభిమానం అందరికీ వున్నప్పుడే సాధ్యం కాగలుగుతుంది.

ఎన్నో పదాలు అంతరించిపోతున్నాయి. వ్యవహారంలోంచి చ్యుతమైపోతే వాటి అస్తిత్వమూ, వాటి అర్థాలూ కూడా మనకే అంతుబట్టనివి అయిపోతాయి. ప్రజలువాడే భాషకు పట్టం గట్టినప్పుడే జనమమేకమై పాలన సాగడం కూడా సాధ్యమవుతుంది. ఇవాళ తెలంగాణ ఒక మాండలికం కాదనీ, తెలంగాణ ఒక భాష అనీ తెలంగాణ ఒక రాష్ట్రంగా రూపొందడానికి చెలరేగిన భావావేశం ఇక చల్లారిపోకూడదంటే సమగ్ర తెలంగాణ భాషా నిఘంటువు ఇంకా రూపొందాల్సే ఉంది. లక్ష పదాలతో తెలంగాణ నిఘంటువు రూపొందిస్తామని ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఒక ప్రకటన చేశారట!

తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ అధికార భాషా సంఘం, తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు సమన్వయ కృషి చేసి ఒక బృహత్ నిఘంటువును రూపొందించడం అత్యవసరమైన పనియే!

నిజానికి కవులకు, సాహితీవేత్తలకు, కళాకారులకు తెలంగాణలో లభిస్తున్న ఆదరణ, ప్రోత్సాహం ఆంధ్రప్రదేశ్‌కు కూడా స్ఫూర్తిదాయకం కావాల్సిఉందన్న భావన ప్రచులితంగా వినబడుతోంది. అది యదార్థమే.

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ వ్యాఖ్యలు ఎంతో వివాదాస్పదమయ్యాయి. తెలుగు భాషాభివృద్ధికి, వికాసానికి కాక అక్కడి చర్యలు పరభాషా దాస్యానికే మరింతగా దోహదకారులుగా వున్నాయనీ తెలుగులో చదువుకుంటే ఉద్యోగాలు దొరకవని ప్రచారం చేయడం ఆత్మహత్యా సదృశమని భాషాభిమానులు, మేధావులు అంటున్నారు. ఆంగ్ల విద్య ఆవశ్యకమే కానీ, అందుకు తెలుగును పణంగా పెట్టి తెలుగును మృతభాషగా మనమే మార్చుకునే వైఖరి గర్హనీయం. చైనా వంటి దేశం ఇంగ్లీషును తలకెత్తుకోకుండానే అమెరికా వంటి దేశంలో తలెత్తుకుని తన వ్యాపారాధిపత్యాలను సైతం పెంచుకోగలుగుతోంది. పరాయీకరణం చెందకుండా మన అస్తిత్వాన్ని నిలుపుకోగలగడం అసాధ్యమేమీ కాదు.

తెలుగు వారు ఎక్కడున్నా ఒక్కటే
తెలుగు భాష ఎన్ని వైవిధ్యాలతో కూడినదైనా తెలుగు భాషే
రెండు రాష్ట్రాలకి తెలుగు వెలుగే ధ్యేయం కావాలి

'ఇది తెలుగుగడ్డ' అనే కవిత్వంలో విశ్వంభరాకవి కీర్తిశేషులు డా.సి.నారాయణ రెడ్డి గారన్నట్లుగా ఇరు రాష్ట్రాలకూ దేనికి దానికి గానే వర్తించుకునేలానే ఒక ఐక్యతా భావన అత్యావశకం. ఇదే ఇది.

ఇది తెలుగుగడ్డ గాండ్రించు పిల్లి కూతొద్దురా
ఇది తెనుగు పలుకు, కురిసే తేనె చినుకు –
ఈ పలుకెప్పుడు నీరు గారొద్దురా –
తీపిచిలికితేనే చెవికి ముద్దురా
ఇది తెలుగు తెలివి, రగిలేనిప్పుకొలిమి –
ఇది ఎప్పుడు మండుతుండాలిరా
బూదికప్పినా ఉరుముతూండాలిరా
ఇది తెలుగుకీర్తి, కదిలే రణమూర్తి –
ఇది సాగరాలే దాటి పోయిందిరా–
నయాగరాలనే మీటివచ్చిందిరా

ఇది తెలుగు ప్రతిన! ఒకటేదీనితపన!
ఈ రాష్ట్రం పురోగమించాలిరా!
ప్రజలరాజ్యం త్రివిక్రమించాలిరా
పలుకులో పదునులో తెలివిలో కలిమిలో
గీతిలో రీతిలో కీర్తిలో స్ఫూర్తిలో
కొసకొమ్మలను ఒడిసిపట్టాలిరా
కుళ్ళుబుద్ధులు పాతిపెట్టాలిరా!
తెలుగు భాషకు జేజేలు
తెలుగు వెలుగుకు జేజేలు. *

**(ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం 27.8.2017)**

# (16) నేన్ భీ టెల్గూ మాట్లాడ

నిజమే! ఆంగ్లమాధ్యమం పాఠశాలే. ఒక భాష నేర్చుకునేప్పుడు వేరే భాషలో ఆలోచిస్తే, మాట్లాడితే, నేర్చుకోవాలనుకుంటున్న భాష సరిగ్గా పట్టుపడదేమోననే విచికిత్సలోనూ భాషాశాస్త్రపరంగా ఒక హేతువేమయినా ఉంటే ఉండవచ్చు! కానీ ఆంగ్లం నేర్చుకునేప్పుడు తెలుగులో మాట్లాడడం సరికాదని నియమం పెట్టినప్పుడు, తెలుగులో మాట్లాడేప్పుడు ఆంగ్లపదం రాకూడదని నియమం పెట్టరేం? పెట్టరు. ఎందుకంటే ఇప్పుడు పాపం తెలుగు నేర్వదగి, నేర్పదగిన భాషే కాకుండా పోయింది కదా! తెలుగుపాఠం ఒక్కటీ చదవనక్కరలేకుండా పాఠశాల పరీక్షలు ఉత్తీర్ణత చెందే వెసులుబాటు ప్రభుత్వమే కల్పించుతోందాయె! ప్రభుత్వ బడుల్లోనూ ఆంగ్ల మాధ్యమానికే మొగ్గు చూపుతున్నారాయె!

అసలు పాఠశాలలనూ, ప్రభుత్వాన్ని అనుకోవడం ఎందుకు? తమ పిల్లల చదువు సంధ్యల విషయంలో తల్లిదండ్రుల ఆలోచనా విధానంలోనే మార్పు వచ్చింది కదా! దానికి ముఖ్యకారణం హార్దికం కాదు ఆర్థికం. బాగా డబ్బు సంపాదించే పెద్ద ఉద్యోగం రావాలంటే తెలుగు ఒక్కటే వస్తే సరిపోతుంది అని నమ్మకం ఎక్కడా లేదుకదా? ఇంగ్లీషు వాడు మన బతుకుదెరువుని తాను నిర్దేశించి పోయాడు. పేరుకు స్వాతంత్ర్యం గానీ మాతృభాషలన్నీ అటకెక్కి, వాడు వెళ్లిపోయినా వాడి భాషే దిక్కుదిక్కులా మన దిక్కయి కూర్చుంది. 'అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదనుచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా?" అని కాళోజీ కవి తెలంగాణలోనే ఎప్పుడో ఆగ్రహించాడు. కానీ మన కేసీఆర్ కూడా లుచ్చే, లఫంగీ, బేకార్ ఇదంతా తమ తెలంగాణ తెలుగు సహజభాష అనీ, అందులోనే మాట్లాడతాం అని జబర్దస్తీగా అంటున్నాడు తప్పితే తెలంగాణ తెలుగు పలుకుబడుల గురించి ఆయనకు పట్టినట్లు లేదు. ఉర్దూభాష, నిజాం సంస్కృతి తలకెక్కించుకున్నందువల్ల 'బుల్లబ్బాయ్' లాంటి పదాల్లో ఆయనకు బూతు కనిపిస్తోంది కానీ తెలుగు పదం అది ఏ ప్రాంతానిదయినా స్వీకరించే స్వభావం ఉంటే తెలుగుభాష చచ్చిపోకుండా ఎప్పుడో విస్తరించేది.

ప్రాంతీయతల పేరుతో ఎన్నో పదాలను వ్యవహారం నుంచి తప్పించుకుని అన్యభాషా పదాలనూ ముఖ్యంగా ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ పదాలతో తెలుగును సంకరం చేసుకుని ఎఫ్.ఎం. చానెళ్లలో, టీవీ మీడియాలో అదే గొప్ప భాషాసంస్కృతిగా భుజాలెగరేసుకుంటున్న నాగరికత అయి కూర్చుంది మనది.

'నేనెప్పుడూ తెలుగులో మాట్లాడను' అని ఇంగ్లీషులో రాయించి మెడలో బోర్డు వ్రేలాడదీసినందుకు ఆ ప్రైవేట్ పాఠశాల ఘటనను ముక్తకంఠంతో నిరసిస్తున్నాం బానే ఉంది. ఇంగ్లీషు తరగతి జరుగుతున్నప్పుడు ఇంగ్లీషులోనే మాట్లాడాలనడం ఇంగ్లీషు బాగా నేర్చుకోవడానికి నియమించిన పద్ధతిగా అంగీకరించడంలో నిజానికి భాషాబోధన దృష్ట్యా అభినందనీయం కావాలి కానీ, దురుద్దేశాలు నిజానికి మనవి. తెలుగు మాట్లాడవద్దనడం తప్పే అయితే అసలు మాట్లాడలేని స్థితి కల్పిస్తున్న మనల్ని మనమే ఎంతగా శిక్షించుకోవాలి? అమ్మమ్మ, తాతయ్యల తెలుగుకు – పిల్లలు దూరంగా ఉంటేనే ఎదుగుతారనీ లేకపోతే చాదస్తులుగా, బీసీ నాటి వాళ్లుగా తయారవుతారని తలపోసి ప్రవర్తిస్తూండడం నేడు ఇళ్లల్లోనూ కనబడుతున్న సత్యం కాదా? ఇంగ్లీష్ రైమ్స్, ఏ బీ సీ డీ లు నేర్పించడం మీదున్న శ్రద్ధ, బడికి ఇంకాపంపని వయస్సులో తెలుగు పదాలు, పద్యాలు నేర్పడం మీద, కథలు చెప్పడం మీద ఎవరికయినా ఉందా?

నిజమే! కులాంతర, మతాంతర వివాహాలే కాదు, ప్రాంతాలకు అతీతంగా భాషాంతర వివాహాలూ జరుగుతున్నాయి. కానీ ఒక పంజాబీ అమ్మాయినో, గుజరాతీ అబ్బాయినో, ఆ మాటకు వస్తే అన్యభాషీయులను వివాహమాడిన మన తెలుగు వాళ్లు ఎందరు సహజీవనం కోసం ఆ భాషతో మమేకం అవడానికి సిద్ధమైపోతున్నారు. తమ సహచరికి తమ తెలుగు రాకపోయినా ఫరవాలేదు అనే వైఖరికి లోబడిపోతూ తమ పిల్లలకు కూడా తెలుగును నేర్పించడంలో ఏ మాత్రమూ ఉత్సహించడం లేదు. ఉదాసీనతతో ఉంటూ అదే గొప్ప త్యాగంగా చంకలు గుద్దుకుంటున్నాం. భాషనే త్యాగం చేయగల గొప్ప సంస్కారులు తెలుగువారు  అని మనల్ని మనం అభినందించుకోవాలా? లేక మూలాలను విస్మరించి, చిటారు కొమ్మన మిఠాయి పొట్లాల కోసం ఆశతో ఎగబడడాన్ని గొప్ప విషాదంగా గ్రహించుకోవాలా? ఇప్పుడు

పిల్లలు మాట్లాడుతున్న భాషలో తెలుగుపదాలు ఎన్ని అని లెక్క పెట్టుకోవలసిన స్థితి వచ్చిందంటే హేతువు మనలోపం కాదా?

తెలుగు మనకు సహజ మృతభాష కాదు. మనం చేస్తాం అంతే! తెలుగు రాజధానిలో ఉంటూ ఎందరు తెలుగుమాట్లాడ(లే)ను అనుకునే స్థితిలో ఈనాడు లేరు చెప్పండి? మునుపటి కాలంలోలా నోరారా ఆప్యాయంగానయినా చాకలి, మంగలి, వడ్రంగి, కుమ్మరి అని అనలేనితనం - కులరహిత సమాజం పేరిట అదేదో దోషంగా విస్మరించదగిన పదాలైపోయాయి. నిత్య వ్యవహారంలో ధోభీ, బార్బర్, ప్లంబర్ అంటే గౌరవం అనుకుంటూ వాటి తెలుగుపదాలు మాత్రం కులవాచక నిందలుగా మారిపోవడం విషాదం కాదూ? వాహనం టైరు పంక్చరయితేనో, ఇంట్లో కుళాయి బాగు చేయాల్సి వస్తేనో, ఏ వెల్లలో వేయించాల్సి వస్తేనో దైనందిన జీవితంలో సంప్రదించవలసిన వాళ్లలో చాలా మంది తెలుగులో కాక వచ్చీరాని హిందీ, ఉర్దూ సంకరంలో మాట్లాడితేనే పనులుచేసే స్థితి. ఎలక్ట్రీషియన్లు, మోరీ బాగు చేసే వాళ్లు, ఇస్త్రీ చేసేవాళ్లు ఇలా అనేకమందితో తెలుగు మాట్లాడ(లే)ని స్థితి ఇంకా రాజధానిలో రాజ్యమేలుతూనే ఉంది.

"హిందీమే బాత్‌కరో. ముఝే తెలుగూ నై మాలూం" అని అనేవారితో మనం సర్దుకుపోతాం తప్పితే, నిజానికి వారికి తెలుగు అర్థం అయినా, తెలుగు వచ్చినా మాట్లాడితే నామోషీయో, నామర్దాయో తెలీదు మరి! తెలంగాణ తెలుగును సినిమావాళు అభాసుపాలు చేసి ఎద్దేవా చేసేలా చేశారేమో గానీ, సెటిలర్స్ అయినా వాళ్లలో కలిసిపోడానికీ, పరస్పరం వివాహాలు చేసుకుని విదేశాలకు విస్తరించడానికీ ఏనాడో బీజాలు పడి అవి ఇవాళ మహావృక్షాలవుతున్నాయి గానీ, భాష అనే వ్రేళ్లను మట్టిలో కప్పెట్టి మనల్ని మనం ఇతర భాషల్లో ఖననం చేసుకుంటున్నాం అనిపిస్తుంది. తెలుగులోనే మాట్లాడతాను, తెలుగులోనే రాస్తాను, తెలుగులోనే జీవిస్తాను అని ఎదిగివచ్చి స్థిరపడిన తరం ఇప్పటికయినా భాషపట్ల మమకారం పెంచుకుని, తరువాతి తరానికి ఆ భాషా సంపత్తిని అందచేయగలిగితే హృదయగతమైన ఆ స్థిరాస్థిని మించిన సంపద ఏముంది? అలా ఆలోచించలేమా? *

**(ఆంధ్రప్రభ దినపత్రిక 29 అక్టోబర్' 2009)**

# (17) ప్రసార భాషగా తెలుగు

'ప్రసార భాషగా తెలుగు' అన్నమాట వినగానే ఇవాళ పెద్దలు పెదవి విరుస్తారు. ప్రసార మాధ్యమాలు తెలుగును సరిగా వినియోగించడం లేదనీ. ఆంగ్లం, హిందీ వంటి ఇతరపదాలతో 'సంకరం' చేసి భ్రష్టు పట్టిస్తున్నాయనీ, వినియోగించే తెలుగు కూడా శుద్ధమూ, ప్రామాణికమూ కాదనీ, అనేక ఉచ్చారణ దోషాలూ, కృత్రిమ వాక్య నిర్మాణాలూ ద్యోతకమవుతున్నాయనీ విమర్శిస్తుంటారు. అయితే– ఈ తరం శ్రోతలు, వీక్షకులు ఇప్పటికే ఆ తరహాకు అలవాటు పడిపోయారు. ప్రసార మాధ్యమాల్లో ప్రయుక్తమవుతున్న తెలుగు–పండితులకు, సాహితీపరులకు ఆమోదయోగ్యం కాలేక పోతోందిగానీ, సామాన్యజనం అందుగురించి అంతగా బాధపడిపోవడం లేదు.

మౌలికంగా అసలు భాష ప్రయోజనం ఏమిటన్నప్పుడు – భాషకు విశిష్ట సామాజిక ప్రయోజనం ఉంది. జన సముదాయపు సామూహిక జీవితాన్ని భాష ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రధానంగా భాష – 'భావవినిమయ సాధనం' అనేది. క్రమక్రమానుగతమైన తరతరాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ప్రధానంగా భాష రూపంలోనే తదనంతర తరాలకు అందచేయబడుతుంటాయి. జ్ఞానార్జనలో, భావవినిమయంలో ఒక మాధ్యమంగా భాష ప్రయోగింపబడుతుంది. ప్రధానమైన ప్రయోజనం ఇదే. మాతృభాష ప్రాశస్త్యం ఆనుషంగికంగా మారి, అన్యభాష ప్రధాన ప్రయోజనం అనే దశకు చేరుకోవడం స్వీయలోపమే అవుతుంది. అది జరుగుతోందనే నేడు విజ్ఞుల ఆర్తి.

భావాభివ్యంజన సాధనంగా ఉపయోగపడే భాష దృశ్యశ్రవ్య సంకేతరూపంగానే ఉంటుంది. భావం భాషలో అభివ్యక్తీకరింపబడుతుంది. అభివ్యక్తమయ్యే భాషయే ప్రేరకమూ అవుతుంది. భాష చాలా ప్రముఖమైన అంశం. ప్రసార భాషగా తెలుగు అన్నప్పుడు దానికి ప్రామాణికత ఏమిటి అనే ప్రశ్న వస్తుంది. అధిక సంఖ్యాకులయిన శ్రోతలు, వీక్షకులు అర్థం చేసుకోగల భావాభివ్యక్తి తీరే ప్రధానం గానీ, కావ్య, సాహిత్య, భాష ప్రయుక్తం చేయడం కాదు.

శ్రవ్యమాధ్యమంగా ఆకాశవాణి ఒక్కటే దేశంలో ఉన్నకాలంలో కూడా కేస్కర్ కమిటీ ఆ రోజుల్లోనే "రేడియో ఈజ్ నాట్ ఎ లిటరరీ క్లబ్" అని తీర్మానించింది. ప్రాంతీయ భాషలు, మాండలికాల అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతోందని గుర్తించే, వాటి ఉనికినీ, విస్తృతినీ సంరక్షించి, దోహదపడే సంకల్పంతోనే– ప్రాంతీయ రేడియో కేంద్రాలకూ అంకురార్పణ చేసింది. కానీ ఆదర్శం మంచిదయినా, ఆచరణలో – అమలు పరచవలసిన అధికారుల అలసత్వం, వైయక్తిక వైఖరుల కారణంగా వైఫల్యాలు వచ్చాయే తప్ప. భాషకు ద్రోహం చెయ్యలేదు. ప్రసారమాధ్యమాలది 'కమ్యూనికేటివ్ లాంగ్వేజ్' అంటే అభివ్యక్తీకరణ భాష. ఆ అభివ్యక్తి ఆయా కార్యక్రమాలు జనంలో ఏ వర్గాలకు ఉద్దేశింపబడి రూపొందుతున్నాయో, వారి వారి అవగాహనకు అందేవిగా వుండే భాషను ప్రయుక్తం చేయడమే ప్రధాన లక్ష్యం. పిల్లల కార్యక్రమాలు, విద్యావికాస కార్యక్రమాలు, ఆరోగ్యకార్యక్రమాలు అన్న వైవిధ్య భరితమైన తరహా కార్యక్రమాలకు ఆ రోజుల్లో ఆకాశవాణి ప్రాతిపదికలు వేసింది. టీవీ మాధ్యమంలోనూ ఆ ధోరణులే నేటికీ ప్రచులితంగా ఉన్నాయి. అయితే విజ్ఞాన, వినోద, వికాసాలనే త్రయంలో – వినోదమే ప్రధానమైన తీరు తెన్నులు ప్రబలుతూ, వాటికి కూడా సినిమా ఆధారితమే మూలాధార నాడిగా మారడంతో, ప్రభావోపేతమైన మీడియాకు వ్యాపారమే ప్రధాన ధ్యేయంగా అయిపోతూ ప్రజాప్రయోజనాలు పట్టించుకోనివవుతున్నాయనే భావం ప్రబలుతోంది. నేరాలు, హింసలు, రాజకీయాల అవలక్షణాలూ ద్యోతకమవుతున్నంతగా, ఒకప్పటి ఉదాత్త మానవవిలువలకు పెద్దపీట వేయడం లేదనీ, సంచలనాలే లక్ష్యంగా, బలహీనతలు రెచ్చగొట్టే తీరుగా కార్యక్రమాలు ఉంటున్నాయనీ, ఇరవై నాలుగు గంటల నిరంతర వార్తా స్రవంతి పేర ఒక వార్తను, అందునా దాని నెగిటివ్ పార్శ్వాన్ని, పదే పదే సాగదీసి చూపుతున్న అవలక్షణాలు పెరుగుతున్నాయని ఆరోపిస్తున్నవారి సంఖ్యా అధికంగానే ఉంటోంది. మరి ఆయా కార్యక్రమాల కనుగుణంగానే అందులోని భాషా అభివ్యక్తమవుతుంది.

ప్రసార భాషగా తెలుగులో నేడు ఆంగ్లం ఎక్కువగా ప్రయుక్తమవుతోందనేది ప్రధానంగా వినవచ్చే విమర్శ. సరియైన తెలుగు పదాలు అభివ్యక్తికి అనుకూలంగా ఉన్నవి వున్నా, ఆంగ్ల పదాలు ఎక్కువగా వినరావడం జరుగుతోంది అంటే అందుకు కేవలం ఆయా వ్యాఖ్యాతలనూ, కార్యక్రమ కర్తలనూ, మాధ్యమాల రచయితలనూ

నిందించి ప్రయోజనం లేదు. వ్యాపారమూ, వీక్షకసంఖ్యలో తమ ఆధిక్యమూ మాత్రమే ధ్యేయమయిన యాజమాన్యం నిర్దేశించిన మార్గదర్శకాలమేరకే వారు నడుచుకుంటారు. వారిని శాసించగల స్థాయి వీరికి ఉండడం లేదు.

భాషకు మాట–లిపి, నాణేనికి ఇరుపార్శ్వాల వంటివి. మాట్లాడే విధంగానే రాయడమనేది ఇప్పటికీ పూర్తిగా జరుగుతున్నదనలేం! గ్రాంథికభాష పోయి, వ్యవహారికం వచ్చింది కానీ, ఇప్పటికీ మాటకూ–రాతకూ తేడా ఉంటూనే ఉంది.

అనివార్యంగా మనం అంగీకరించవలసిన ఒక విషయం ఏమిటంటే – సమాజంలో వివిధ స్థాయిలున్నట్టుగా, భాషలో కూడా స్థాయీ భేదాలున్నాయి. ఉంటాయి. వాటిలో చదువు సంస్కారం ఉన్నవాళ్ళూ, కలిమి అధికారం గలవాళ్ళూ సామాన్యంగా రోజువారీ వ్యవహారాల్లో వాడే భాష ప్రామణికంగానో, శిష్ట వ్యావహారికంగానో గుర్తింపు పొందుతుంది. ఆ భాషను అనుకరిస్తూ మాట్లాడడం ద్వారా తాము ఆ స్థాయికి చేరుకోగలమన్న శిష్టేతరుల భావన భాషా విషయికంగా అభివృద్ధిగా – పరిపాలనలో ఉంటోంది. పత్రికలు, రేడియో, సినిమాలు, సృజనాత్మక సాహిత్యం ఒకప్పటి గ్రాంథికాన్ని విసర్జించి, వ్యవహారికాన్నే చేపట్టి సర్వవ్యాప్తం చేస్తూ వచ్చాయి. వ్యావహారిక భాష కాలానుగుణంగా మారి తీరుతుంది. ఎప్పటి వ్యవహారం అప్పటి భాషలో ఉంటుంది. ఇవాళ జరుగుతున్నదీ అదే!

వ్యవహారసరళి మారిపోవడానికి సమాజ పరిణామాలే కారణమవుతాయి. భాష విషయికమైనా అంతే! ప్రాంతీయభాషలో విద్యాబోధన అనేది ఎప్పుడయితే తగ్గుముఖం పట్టి, ఆంగ్లేయుల పరిపాలన అంతమైనా, వారిభాషను సొంతం చేసుకుంటేనే అభివృద్ధి అనే వింత పంతం మనలో పెరిగిందో – అప్పటి నుండే తెలుగు తగ్గుముఖం పట్టింది. సాంఘిక, రాజకీయ, చారిత్రక, ఆర్థిక పరిణామాల వల్ల కాలగతిలో క్రమంగా ఈ వైఖరి ప్రబలింది. ఇంగ్లీషు ప్రాధాన్యం అపరిమితంగా పెంచుకుంటూ పోయింది మనమే. కేంద్ర రాష్ట్ర వ్యవహారాల అధికార భాషగా, వివిధ రాష్ట్రాల అనుసంధాన భాషగా, న్యాయస్థానాల వ్యవహారభాషగా, విద్యాబోధన మాధ్యమభాషగా ఇలా ఆంగ్లమే సర్వం తానైన అవస్థను తొలగించుకుంటేగానీ, మాతృభాషా వికాసం సాధ్యంకాదు. దేశంమొత్తంమీద ఉన్నత విద్యాబోధన ఒకే భాష మాధ్యమంగా సాగాలన్నది మంచిదే అయినా, అందుకు ఆంగ్లం తప్ప మన భారతీయ భాషలేవీ పనికిరాని దురవస్థను కల్పించుకుని, ఇప్పటికీ పాశ్చాత్య సంస్కృతికే దాస్యప్రవృత్తితో

మ్రగ్గుతున్నది మనమే! ఇది స్వయంకృతాపరాధం తప్ప మరేమీ కాదు. బాబా సాహెబ్ అంబేద్కర్ మహాశయుడే ఇంగ్లీషును తొలగించి దాని స్థానంలో సంస్కృతాన్ని ప్రభుత్వ అధికారభాషగా, దేశంలో అనుసంధాన భాషగా రూపొందించాలని – 'రాజ్యాంగ పరిషత్తు'లో ప్రతిపాదించాడు. దార్శనికుడైన ఆయన ప్రతిపాదననే ఒక్కవోటు తేడాతో త్రోసిపుచ్చుకుని, ఆంగ్లభాషా దాస్యంలోనే పాశ్చాత్య జీవనశైలి ప్రభావంలోపడి భారతీయతకు విద్యావంతులుగా మరింత దూరమవుతున్నాం. శుద్ధమైన తెలుగుని కులాధిక్యధోరణిగా ఆపాదించుకుని, భాషను కూడా ప్రాంతాలపేర, కులాలపేర వైషమ్యాలకు ఆలంబనం చేసుకుని, ఏకత్రితం కాలేని స్థితిని తెచ్చుకుంటున్నదీ మనమే! అంబేద్కర్ ఆశయాలకు– ఆ విధంగానూ తిలోదకాలిస్తున్నదీ మనమే! భారతీయతను నిలబెట్టగల భాషగా హిందీని కూడా సర్వదా ఆమోదించలేని వైఖరి అటుండగా, మాతృభాషలను ఆంగ్లం పాదాలచెంత పరచి, అందుకు ఉపాధి ఉద్యోగాలను నెపంగా నెత్తికెక్కించుకుంటున్నదీ మనమే!

ఇంగ్లీషుమీడియం పాఠశాలలు ఒకటోతరగతి నుండే కాదు కిండర్‌గార్డెన్, నర్సరీ, ప్రీనర్సరీ అనే శిశు, పూర్వశిశు స్థాయినుండి కూడా తెలుగును కాక ఆంగ్లాన్ని అందిపుచ్చుకున్నవిగా మారిపోయాక, ఇవాళ ప్రసారభాషగా తెలుగు గురించి ఆవేదన చెందితే ఏం లాభం? పసిపిల్లలకు కూడా – వారిని ఆకర్షించే వ్యాపార ప్రకటనల్లో వారికి తెలిసిన పదజాలాన్నే ఉత్పత్తిదారుడు వాడతాడు మరి! తెలుగు మాటలు, తెలుగు శతకపద్యాలు మటుమాయమై, ఇంగ్లీష్ రైమ్స్ ఆ దశనుంచే ఆధిపత్యం వహించడాన్ని నిరోధించకపోతే, భావవినిమయ సాధనమైన భాషగా మన తెలుగు ప్రసార మాధ్యమంలో సైతం మనగలగలేకపోతే మరి విడ్డూరం ఏముంది? రచనామాధ్యమంగా, సంభాషణా మాధ్యమంగా ఇవాళ అధికసంఖ్యాకులు ఉపయోగించే ఆంగ్లపద భూయిష్టమైన తెలుగే ప్రసారభాషగానూ చెలామణీ అవుతుండడం విడ్డూరమేమీ కాదు.

తెలుగు చదవడం, రాయడం రాకపోవడం తమ పిల్లల ఘనతగా పెద్దలే భావిస్తున్న రోజులివి. తెలుగులో చదివితే ఉద్యోగాలు రావన్న స్థితి ప్రభుత్వాలు కల్పించినదే! అందువల్ల అనుకూల సామాజిక రాజకీయార్థిక పరిస్థితులకనుగుణంగానే భాష – ప్రసార రంగంలోనూ చెలామణి అవుతోంది. పండితులను పామరు లనుకరించడం ఒకప్పటి స్థితియేమోగానీ, భాష విషయంలో ఇవాళ ఆ ప్రమాణాలూ

లేవు. “తెలుగు నాకేం లాభం” అనుకునే పరిణామం వచ్చింది. “ఈ భాష మనకేం చెయ్యగలుగుతుంది” అనే వాళ్లేగానీ, “ఈ భాషకు మనమేం చేశాం” అని ప్రశ్నించుకునే నేతలు, అధికారులు కరువవ్వడం వల్లనే – భాషా విషయికంగా మరో నలభైఏళ్లలో తెలుగు పూర్తిగా అంతరించి పోతుందనే సర్వేల కష్టకాలం దాపురించింది.

మన కవిత్రయభారత సృష్టి కాలానికి ఇంగ్లీషుకు ఇంకా అసలు రూపకల్పనే కాలేదట! క్రీ.శ.1350 లో పాఠశాలలో ఇంగ్లీషు ప్రవేశ పెట్టబడేదాకా, దానిని ఓ దేశవాళి సరుకుగా అక్కడే చిన్నచూపు చూసేవారట! 14 వ శతాబ్దం చివరలోనే ఇంగ్లీషుకు ఆ దేశంలో పార్లమెంట్ ప్రవేశం దొరికింది. అంతవరకూ వాళ్ళూ వాళ్ళ దేశంలో ఫ్రెంచి, లాటిన్ భాషల వ్యామోహంలో ఉండేవారట. 1586 లో జార్జిపెటీ అనే రచయిత – “నేను ఇంగ్లీషులో రాస్తాను కాబట్టి నా రచనని తేలిక చేసేవారు. శోచనీయమైన విషయమేమిటంటే వారు ఇంగ్లీషులో ఉత్తమరచనలు చేయడం అసాధ్యమనీ, ఇంగ్లీషు నిస్సారమైనదనీ, అనాగరిక భాష అనీ ఎంచుతారు. గుర్తింపదగనిది అంటారు” అంటూ వాపోయాడు. ఫ్రెంచ్, లాటిన్ భాషల స్థానంలో వారి ఇంగ్లీషు రావడానికి అంత వ్యతిరేకత ఉండేదట! అలాంటి ఇంగ్లీషే ఇవాళ ప్రపంచమంతటా గొప్పగా భావింపబడుతోంది. ప్రాంతీయభాష ఏదయినా దాని స్థానం ఆక్రమించలేదని మనపెద్దలే ఘోషిస్తున్నారు. నేడు చెలామణిలో ఉన్న ఆంగ్లంలో ఎన్నో–నిజానికి వారు స్వేచ్ఛగా కలిపేసుకున్న ఫ్రెంచి మొదలైన వాటి అనుకృతులో, తత్సమాలో, తద్భవాలో అని మనం గ్రహించగలిగితే, అది మనకు గుణపాఠం కాగలుగుతుంది. తెలుగులో సంస్కృతపదాల గురించి గోలపెట్టేవారు, ఇది గమనించాలి. ఇంగ్లీషుని పట్టుకుని ఊగులాడకుండా, తెలుగును అది ఎక్కడి ఏ ప్రాంతీయమైన పదసంపదతో కూడినదైనా ఎదగనిచ్చి, ఎదకు హత్తుకోగలగాలి. రష్యా, జపాన్, ఇజ్రాయిల్ వంటి దేశాల్లో వారి వారి భాషలే అధికారభాషలుగా బోధనాభాషలుగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన ఆధునిక దేశాలుగా అవి రాణిస్తున్నాయి. ప్రయోగంబట్టే భాషకు యోగ్యత లభిస్తుంది. దానికి హద్దులు పెట్టుకుని, గిరులు గీసుకుని, సంస్కృతాన్ని ద్వేషిస్తూ, అన్యదేశ్యాలను అవరోధిస్తూ కూర్చుంటే – తెలుగుభాష సజీవంగా, స్వేచ్ఛగా మనలేదు సరికదా, మనమే చేజేతులా దాని ఉనికిని కోల్పోయేటట్లు చేసిన వారమవుతాం.

‘ప్రసారభాషగా తెలుగు’ – తెలుగులో ఆలోచించడంగా, తెలుగులో మాట్లాడడంగా, తెలుగులో చదవడంగా, తెలుగులో రాయడంగా అలా సమగ్రంగా వికసింపవలసిన అవసరం ఉంది. తెలుగును ఇంగ్లీషు లిపిలో రాసుకోవడం, ఇంగ్లీషు

లిపిలోనే తెలుగును చదవగలగడం, ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడడం అన్న వైఖరులు ఇవాళ పిల్లల్లో, యువతలో ముఖ్యంగా కన్పిస్తూనే ఉన్నాయి. విద్యావిధానంలో తెలుగు సర్వత్రా విధాయకంగా నిలిపితే తప్ప తెలుగు చదవడం, రాయడం నేటి పిల్లలకు రావడం అసాధ్యం. అంతేకాదు తెలుగులో ఆలోచించలేని స్థితిలోకి కూడా వారు నెట్టబడుతూ, తద్వారా తెలుగులో అభివ్యక్తి చేయలేని, మాట్లాడలేని విపరిణామాలూ చోటుచేసుకోవచ్చు. 'మీరు కాల్చేయండి', 'లైన్లో ఎవరున్నారో చూద్దాం', 'ఇప్పుడొక బ్రేక్', 'ఉయ్ రిపోర్ట్ - యూ డిసైడ్' ఇలాంటి ప్రయోగాలన్నీ ప్రసారమాధ్యమంలో ఇవాళ విరివిగా చెలామణిలో ఉన్నవే! తప్పొప్పుల విషయం పక్కన బడితే అసలు తెలుగుతనం గురించిన ఆర్తి, ఆవేదన ఎందరికున్నదనేది ప్రశ్నే! వచ్చీరాని ఇంగ్లీషే గొప్పదై, మనదైన తెలుగే నామోషీ అనిపించే స్థితి వ్యక్తిత్వాలలో చోటుచేసుకోవడం దౌర్భాగ్యమే! "పరాయి మాధ్యమంలో జ్ఞానార్జన చేయడం వల్ల విద్యార్థుల్ని విషయంపై ఆధిపత్యం సంపాదించేందుకు బదులుగా, వల్లెవేయడం పైనే కేంద్రీకరించడం అనివార్యం చేస్తుంది." అని కొఠారీ కమిషన్ (1964-66) తన నివేదికలో ఏనాడో చెప్పింది. విద్యామాధ్యమంగా అన్ని స్థాయిల్లో తెలుగు నెలకొని, ఉద్యోగావకాశాలకూ అది అనివార్యంగా ప్రభుత్వాలు చేయగలగాలి. ఇంగ్లీషే కాదు, అన్యభాషలు ఎన్ని చేర్చుకున్నా సరే-తెలుగు చదువనూ, వ్రాయనూ, మాట్లాడనూ వచ్చి ఉండాలి - అన్న శాసనం వచ్చి, ఆచరణసాధ్యం చేయగలగాలి. ప్రసార మాధ్యమాలు తెలుగు భాషా వికాసానికి ఎంతయినా దోహదం చేయగలుగుతాయి. నిరక్షరాస్యుడిని కూడా తన శ్రవ్య దృశ్య మాధ్యమంతో ప్రభావితులను చేయగలిగింది ప్రసారభాష. తెలుగులో ఆలోచించి, తెలుగులో మాట్లాడి, తెలుగులో చదివి, తెలుగు రాసి, తెలుగు వాళ్లు తేజరిల్లాలనీ, ఎన్ని భాషలు నేర్చి, ఎంత సాంకేతికత అలవరుచుకుని, ఏఏ హోదాల్లో, ఏఏ దేశాల్లో, ఎక్కడెక్కడకు వెళ్లి నివసించవలసి వచ్చినా, తెలుగు వెలుగులు విస్తరింపచేయాలనీ ఆకాంక్షిద్దాం. ప్రసారభాషగా తెలుగు ఈ మహోద్యమంలో దీపించి, రాణించాలని కోరుకుందాం. ప్రభుత్వమూ, ప్రజలూ తెలుగు ఎదుగుదలకు ఏకోన్ముఖంగా చిత్తశుద్ధితో, నిజాయితీతో నిలుస్తారని అభిలషిద్దాం. ✻

**(ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక' 2012)**

# (18) అభిలాషలో సాహిత్య అస్తిత్వం

**యు**వతలో సాహిత్యాభిలాష నేటికాలాన సన్నగిల్లుతున్న మాట ఎంతనిజమో, సాహిత్యాభిలాష ఉన్న వారిని కూడా పఠనం పట్ల, సాహిత్యరచనపట్ల, వారికి ఆసక్తికలిగించి, సరియైన దిశానిర్దేశం చేయగల వాతావరణం ఉండడం లేదన్నది అంతనిజం! సాహిత్య సాంస్కృతిక సంస్థలుగా పేరెన్నికగన్న సంస్థలు కూడా, గ్రంథావిష్కరణ సభలూ, సన్మాన కార్యక్రమాలూ, అడపాదడపా సెమినార్లు వంటి వాటికి పూనుకుని – ఆ సభలను స్పాన్సర్ చేసే వదాన్యుల వెంట, పారిశ్రామిక వేత్తలవెంట, ఇతర ఆర్థిక పరిపుష్టిగల వారి సహాయాల పట్ల పడి చూపుతున్న శ్రద్ధ, ఒక తాలింఖానాగా సాహిత్యరచన చేసేవారికీ, యువతకూ, ఆసక్తినీ, అభిలాషనూ కలిగించి, చక్కని సాహిత్య చర్చలకూ, తమలోని రచనా నైపుణికీ మెరుగులు పెట్టుకోగల అవకాశాలనూ ఇచ్చి సాహిత్యం ద్వారా పరస్పర మానవసంబంధాలను పెంపుచేసేందుకు లేక, ఉన్నా – దాఖలాలు క్వచిత్తుగానే ఉంటున్నాయి.

ఒకప్పటి పరిస్థితి ఇదికాదు. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం రచయితకు కావలసిన మౌలికలక్షణాలు. ప్రతిభ ఉన్న మాత్రాన సరిపోదు. పఠనం, పరిశీలన ద్వారానే వ్యుత్పత్తి పెరుగుతుంది. అయితే అభ్యాసం లేనిదే అభివృద్ధి అసాధ్యం. 'అభ్యాసం కూసువిద్య' వంటి మాటలు చెప్పుకుంటాం గానీ, నేడు ముఖ్యంగా మందగిస్తున్నది వ్యుత్పత్తి, అభ్యాసాలే.

భాష మీద, భావాభివ్యక్తి మీద పటుత్వం రావాలంటే విస్తృత అధ్యయనం చేయాలి. ఆ అధ్యయనం కూడా ఆలోచనను పెంచే రీతిలో ప్రాచీన, ఆధునిక పఠనం ద్వారా, సాహిత్యాభిలాష, అభినివేశం ఉన్న వ్యక్తుల పరిచయాలతో సంభాషణలతో పెరుగుతుంది. గ్రంథాలయాలకు వెళ్లడం మానుకుని – అన్నీ గూగుల్ సెర్చ్ ద్వారా కంప్యూటర్‌లోనే చూడగలం అనుకోవడం – ఆలోచనలకు పదును పెట్టే సంవిధానం కాదు. పుస్తకాలు చదవాలి, అభిలాషవున్న నలుగురూ కలిసి అభ్యాసం, సాధన చేయగలగాలి. వ్యుత్పత్తి, అభ్యాసాలు కూడా గాఢంగా, లోతుగా ఉండాలి.

సమయంలేదనో, తొందరగా కీర్తి పొందవచ్చుననో, రాసినది రాసినట్టుగా వెనువెంటనే అచ్చుకావాలన్న తపనతోనో రచనాభివేశం గల కొత్త రచయితలు కూడా సులభమార్గాలకు పోతూ, త్వరితగతి పేరు ప్రతిష్టలకూ, వీలయితే ఆర్జనకూ వెంపర్లాడుతున్నారు గానీ, హృదయదఘ్నంగా జీవితమే సాహిత్యం–సాహిత్యమే జీవితం అన్నంత నిబద్ధత, నిమగ్నతలను కలిగి ఉండడం లేదు. దిశానిర్దేశం చేయదగిన పెద్దలు కూడా తమ అభిమాన బృందాలను, అనుసరణ సేనను పెంచుకునే ధోరణిలో ఆవగింజంత ప్రతిభ ఉన్నవారిని కూడా గుమ్మడికాయంత స్థాయిలో పొగిడి, అస్మదీయులను అందలాలెక్కించి, ప్రచార ప్రసారమాధ్యమాల్లో పలుకుబడితో, కొండొకచో డబ్బు ఎరతో, విశేష కీర్తి ప్రతిష్ఠలకు ఎగదోస్తున్నారు. కాదు పడదోస్తున్నారు.

నాలుగు దశాబ్దాలుగా సాహిత్యకృషి చేస్తున్న వాడికన్నా, నాలుగు పంక్తుల కొత్త ప్రక్రియా కవిత్వాలు రాసి పట్టు పరిశ్రమలతో, ఆశ్రిత ధోరణులతో ఆర్థిక వనరులు కూర్చుకుని గ్రంథాలు అచ్చు వేయించుకుని, అట్టహాస ఆహ్వానాలతో, సభలతో, సందడి చేసే సంరంభం ఎక్కువైపోయింది. డొల్ల ఎక్కువైంది. కంచుమ్రోతల సంరంభాలే, ఖాళీ కుండల చప్పుళ్లే, బోన్సాయ్‌ల పటాటోపాలే నేటి సాహిత్య రంగంలోనూ అధికం అంటే కొందరికి కోపం, ఉడుకుమోత్తనం రావచ్చు.

ఒకప్పుడు ఎంతో సాధనచేసి, కృషి చేస్తేగానీ గుర్తింపూ, ప్రచారము లభించేవి కావు. ఇరవై నాలుగు గంటల మీడియా చానెళ్లు, విస్తృతంగా పత్రికలు నేడు ఉండడం వలన అవకాశాలు అందిపుచ్చుకుని, అప్పటికప్పటి పబ్బం గడుపుకుని రాణింపు కెక్కే వేగధోరణులు పెరిగాయి. అందువల్ల నిజమైన ప్రతిభామతులు నిశ్శబ్దంగా పనిచేసుకుంటూ పోయి సాహిత్యంలోని గాఢతకు, జీవ చైతన్యానికి అంకితులై ఉండగా, ఏమీలేనమ్మ ఎగిరెగిరిపడిందన్న బాపతుగానే ఆర్భాటజీవుల హడావుడులే అంతటా కనిపిస్తుంటాయి. ఆఖరికి అదే అంతా అనుకునే స్థితి వచ్చి సాహిత్యమంటే రోతపుట్టే స్థితి పాఠకుల్లో కలిగినా విడ్డూరంలేదు.

సాహిత్యాభిలాషగల నలుగురు కలిసి ఆరోగ్యంగా, హాయిగా మాట్లాడుకుని, చర్చించుకుని, పరస్పరం అభిప్రాయాలు కలబోసుకుని, ఒకరి రచనలు ఒకరు చదివి వినిపించుకుని, తప్పొప్పుల బేరీజువేసుకుని, సవరించుకుని, అలాగే తాము కొత్తగా చదివిన పుస్తకాల గురించీ, తెలుసుకున్న సంగతుల గురించీ మనసు విప్పి మాట్లాడుకుని

– ఆ అనుభూతులను, అనుభవాలనూ రచనా వ్యాసంగానికి వినియోగించుకునే మౌలిక సృజనశీలక స్నేహ వాతావరణం, రచయితల, కళాకారుల చిన్న చిన్న మిత్ర బృందాలు నేటి పరుగుల ప్రపంచంలో ఎవరికీ తీరిక లేని ఒక ధోరణిని చేజేతులా తామే పెంచిపోషించుకొని, ఒక సామూహిక చేతననీ, సమష్టి నుండి వ్యష్టి ఎదిగే హృద్యమైన వికాస స్థితినీ దూరంచేసుకుంటున్నట్లే అనిపిస్తోంది. మానవ సంబంధాల గురించి రచనలు చేసి, మనిషి ఇంటికి రాకుండా గిరిగీసుకునే మనస్తత్వాలూ, పోటీ పేరుతో స్పర్ధలతో పరస్పర ఎదుగుదలకు కాక ఒకరిని పడగొట్టి తాము పైకి రావాలనుకునే వైఖరులూ, సిరాతడి ఆరకుండానే అచ్చుకెక్కాలన్న ఆరాటాలు, గ్రంథాలు వేసి, సభలు పెట్టి, అవార్డులు కొట్టి, కీర్తి ప్రతిష్టలు కొట్టేయాలన్న ఆత్రుతలు, తదనుగుణమైన అసహజ ఆచరణలూ ఎక్కువయ్యాయి. అందువల్ల ఒకరంటే ఒకరికి మునుపటి తీరు మనుషుల మధ్య ఉన్నంత విశ్వాసం, ప్రేమ, స్నేహం, వదాన్యత, చేయూత, కలివిడి కృషి అంతరించిపోతున్నాయి అనిపిస్తోంది. అసలు ఇప్పుడు సిరా కలాలు ఏవి? 'తడి' ఉండడానికి. ఆర్ద్రత నిలవడానికి. రచయిత స్పందనలకు.

జంటనగరాల విషయమే ఉదాహరణకు తీసుకుందాం 1960–70 దశకం వరకూ కూడా ఒక అద్భుతమైన సాహిత్య వాతావరణం ఉండేది. కథకుల బృందాలు, కవిమిత్రుల కలయికలూ, స్నేహ వాతావరణాలూ, పరస్పర సాహిత్యచర్చలూ జరిగేవి. భాషా నిలయం, సారస్వత పరిషత్తు, దేశీబుక్‌హౌస్, భాషాకుటీరం, జ్ఞాన్‌బాగ్ ప్యాలస్, వైఎంసీఏ, సికింద్రాబాద్ జీరా, అబిడ్స్ ఆల్ఫా హొటల్, ఆర్ట్స్ కళాశాల, ద్వారక, వంటి ప్రాంతాల్లో సాహితీ మిత్రుల కూటములు సచేతనంగా నిశ్శబ్ద కార్యాచరణకు ప్రతి వ్యక్తినీ ప్రోత్సహించేలా సమావేశమవుతూండేవి. సాహిత్యాభిలాషగల యువతను ఆకర్షిస్తూండేవి. మాటలతో చేతలతో దిశానిర్దేశం చేస్తుండేవి. కవి సమ్మేళనాలు జనాన్ని విశేషంగా ఆకర్షించేవి.

యువభారతి సాహితీ సంస్థ ప్రతినెలా రెండు, నాలుగు ఆదివారాల్లో మధ్యాహ్నం రెండుగంటలకు శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో చేసే సాహిత్య సమావేశాల గురించి పేపర్లో చూసి, వెళ్లి వారి కార్యక్రమ సరళికి ఆకర్షితమై సాహిత్యం జీవన వ్యక్తిత్వ వికాస మూలకందమని గ్రహించి, ఆ వాతావరణంలో ఇష్టంతో ఒదిగి ఎదిగిన వారిలో నేనొకడిని. క్లుప్తగోష్ఠి, నా ఊహాపథంలో, పుస్తక చర్చ, నా గురించి,

సంస్కృతశ్లోకం, నేటి వక్తల్లో అనవసర ఆంగ్లపదాలు, లలితగీతం, ముఖ్యఅతిథి ప్రసంగం వంటి వివిధ అంశాలతో ఆ సమావేశాలు సమయపాలనను కచ్చితంగా పాటిస్తూ అయిదుగురున్నా, పదిమంది వచ్చినా నిరాటంకంగా సాగేవి. ఎప్పుడూ యాభైమందికి మించి ఆ రెగ్యులర్ సమావేశాలు కిటకిటలాడలేదు. అతిథి పరిచయపత్రం నింపిన అతిథులను పరిచయం చేయడంతో మొదలై, ప్రార్థన నుండి వందనసమర్పణ వరకూ అందరూ అన్ని బాధ్యతలూ వంతులవారీగా నిర్వర్తించేవారు. నేర్చుకోడానికి, నేర్పడానికి, గ్రహించింది అనుష్ఠించడానికి అవకాశం ఉండిన సమ్యక్‌వేదిక అది. ఒక తాలింఖానాలా, శిక్షణాలయంలా– అందరూ కలిసికట్టుగా ఉండి ఆలోచించి ఎదిగిన వాతావరణం అది. సమ్యక్‌దృష్టి. అన్ని రకాల అభిప్రాయాలవారూ సనాతనులు, ఆధునికులు అందరూ ఉండేవారు. కావ్యలహరి ఉపన్యాస పరంపరలు, రచన సెమినార్, మహతి ప్రచురణతో యువభారతి ఎదిగి, ఎప్పుడయితే వారి ఆదివార సమావేశాలు కూడా తెరమరుగయ్యాయో, నూతనశక్తి, మానవ వనరులుగా యువతా రూపొందక ఉత్తాలదశకు వందలాది ప్రచురణలతో సంస్థ చేరినా, తర్వాత కొత్తనీరు సచేతనమైనది రూపొంది రాక, స్తబ్ధమయింది అన్నమాట నిజం. యువభారతి సభ్యుడనని చెప్పుకోవడం నాడు గర్వకారణం.

ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితలసంఘం, తారకా ఆర్గనైజర్స్, వై.ఎం.సి.ఎ.వక్తృత్వ సాహిత్య సమితి, తెలుగు భాషా సమితి, నవ్య సాహితీ సమితి, విశ్వసాహితి వంటి సంస్థల కృషిలో ఎదిగివచ్చిన సాహితీవేత్తలున్నారు. పలు రంగాల ప్రముఖులున్నారు. అలాగే కవులు, కథకులు చిన్న చిన్న బృందాలుగా కలిసి చేసిన కృషి చెప్పుకోదగింది. దేశీబుక్‌హౌస్ శివాజి గారి దగ్గర కలిసే శ్రీపతి, డి.వెంకట్రామయ్య వంటి కథకమిత్రుల కూటమిలోని వారికే పత్రికల దీపావళి కథల పోటీల్లో బహుమతులొచ్చేంత కృషి, సాధన వారివి. అలాగే దిగంబరకవులు జంటనగరాలు వేదికగా కలిసి ఎదిగిన ఉద్యమ సాహితీవేత్తలే. సరే! అరసం ఎందరినో అభ్యుదయ పథగాములుగా తీర్చిదిద్దింది. ఏజీ ఆఫీస్ రంజని సాహితీమిత్రుల కృషి కూడా అలాంటిదే. కళాశాల వార్షిక సంచికలు కూడా అందునా ప్రాచ్యకళాశాలగా ఆంధ్రసారస్వత పరిషత్తు విద్యార్థుల వార్షిక సంచిక 'నెలవంక' సైతం ఆధునిక సాహిత్య చైతన్యంతో కె.కె.రంగనాథాచార్యులుగారి నిర్దేశకత్వంలో విద్యార్థులను తీర్చిదిద్దుతుండేది.

ఒక ఆరోగ్యదాయకమైన పోటీతో సాహిత్య సృజనశీలురు కలిసి నడిచేవారానాడు. ఎన్నో అద్భుతమైన రచనలు వెలువడ్డాయి. యువతతో భుజం భుజం కలిపి పెద్దలు ప్రోత్సహించి నడిచేవారు, నడిపేవారు. 'సహితస్య భావమ్ సాహిత్యం' అన్నదానికి సజీవ దాఖలాలుండేవి. నిబద్ధత, నిమగ్నత ఉండేవి. కీర్తికి షార్ట్‌కట్ కొట్టాలనో, రాత్రికి రాత్రే పేరు ప్రఖ్యాతలు వచ్చేయాలనో, డబ్బు సంపాదించేయాలనో ఆరాటం, పరుగులు తక్కువ. వ్యాపార సాహితీవేత్తలు, రచయితలు కొందరున్నా వారిని చూసే ధోరణే వేరుగా ఉండేది. సాహిత్యాన్ని సీరియస్‌గా, జీవితంలో ప్రధానమైన ఓ భాగంగా తీసుకున్న వారికీ, ఒక కాలక్షేప వ్యవహారంగా, ప్రచారావకాశంగా తీసుకునే వారికీ తేడా ఉంటుంది. అది ఆనాడయినా ఈనాడయినా అంతే.

"నువ్వు కవివి కావడం కన్నా కవిత్వంగా బ్రతకడం ముఖ్యం. కవివి కాకపోయినా ఫరవాలేదు. ముందు మనిషివికా" అని విలువలకు పట్టంకట్టి సాహిత్యసృజన చేయడం వల్లనే గొప్ప తృప్తి ఉంటుంది. సాహిత్యం మనిషిని ఉన్నతుడిని చేయడానికే. కలిపికుట్టేది సాహిత్యంగానీ విడగొట్టేదీ, పడగొట్టేదీ సాహిత్యం కా(జాల)దు. సాహిత్యం అన్ని పార్శ్వాలతో కూడిన సంపూర్ణత్వసాధనా మార్గం. వాపును చూసి బలుపు అనుకున్నా, పాక్షికతతో కుంచించుకుపోయినా అది వైయక్తికలోపమే అవుతుంది.

చిత్తశుద్ధి, నిజాయితీ, సమ్యక్‌దృష్టి, గాఢత, మగ్నత, నిరంతర వ్యుత్పత్తి, అభ్యాసం పెంచుకుంటే, యువతలో పెరిగేలా చేయగలిగితే–సాహిత్యం నిలుస్తుంది. దానిని కూడా ఒక మార్కెట్ సరుకుగా, కేవలం కీర్తికీ, ధనానికి ఆసరా నివ్వగలిగేది మాత్రమే కావాలనుకుంటే–ఇలానే అస్తిత్వ ప్రమాదంలో పడుతుంది. లేదూ ఉన్నానంటే ఉన్నానన్నట్లు ఇలానే ఉంటుంది. ✻

**(ఆంధ్రభూమి దినపత్రిక)**

# (19) అశ్రద్ధ శ్రాద్ధ కవితా వార్షికలు

'**ఉ**పేక్ష'ను కూడా ఒక విమర్శనాయుధంగా ప్రయోగిస్తున్న నేటి సాహిత్య కాలాన, ఎవ్వరేమనుకున్నా అనుకున్నది అనుకున్నట్లుగా చెప్పడమూ ఒక్కోసారి తెంపరితనమే అనిపిస్తుంది! ఉపేక్ష చేస్తే అది వారల చేటే అవుతుందనీ, ధర్మవిస్తారకమై 'సత్యం' అనేది ఎప్పుడూ నిలిచే ఉంటుందనీ మహాభారతం పేర్కొన్నట్లుగా, నేటి సాహిత్య భారతానికీ వర్తించే విషయమే అది కూడాను!

సినిమారంగంలో హిందీ తరువాత సంఖ్యలో తెలుగు సినిమాలే నిర్మాణం అధికమవుతున్నట్లుగానే, సాహిత్య ప్రక్రియల్లోనూ కథల తరువాత (బహుశా కథలకంటే ఎక్కువగా కూడానేమో) కవిత్వమే వెలువడుతోంది. తెలుగు సినిమాల్లో హీరోయిజంలానే – కవిత్వంలోనూ 'హీరోయిజం', సదరు పెద్దమనిషికి అభిమానులు, వారి కవిత్వమో, పుస్తకమో పత్రికలోనో, సంపుటంగానో వెలువడగానే, పనిగట్టుకుని వ్యాసాలు రాయడాలు (రాయించుకోవడాలూ) కనబడుతున్న సంగతులే! తెలుగు కవిత్వం మళ్లీ 'జ్ఞానపీఠం' ఎక్కలేదన్న మాట నిజమే గానీ, 'లౌక్యపీఠం' ఎక్కిన కవివతంసులు మనకున్నారు! సోమవారం సాహిత్యపేజీలు చూసేవాళ్లూ, సాహిత్య బులిటెన్లూ, సాహిత్యపు చిన్న పత్రికలు చూసేవాళ్లూ– తమ శిష్యులో, అభిమానులో అయినప్పుడు అలవోకగా రాసిన కవితయినా అచ్చయి ప్రశంసలతో చెలరేగిపోగలదు. ఢోకా లేదు! వడ్డించేవాడు మనవాడైతే –పంక్తిలో ఎక్కడున్నా, మన విస్తరి నిండేందుకు లోటే ఉండదు! పత్రికల పుటలు ఆక్రమించుకోడానికీ, చానెళ్ల చర్చల్లో తలదూర్చడానికీ కవిత్వ 'పెద్దరికం', కవిత్వ 'దొరతనం' సంక్రమించిన వారుంటారు. తాము అధ్యాపక వృత్తిలో వుండడం వల్లనో, ప్రయోజనం కలిగించే వివిధ అధికారపీఠాలపై ఉండడం వల్లనో, పత్రికారంగంలో పనిచేస్తూండడం వల్లనో, కవులుగా చెలామణి అయిపోవడం సులభతరమని గ్రహించినవారున్నారు. తాము ఆ రంగాలలో లేకపోయినా, ఆ రంగాలలోని వారికి శిష్యులుగా, అభిమానులుగా, ఇష్టులుగా చెలామణి కావడం వల్ల కూడా తామూ కవులుగా రాణిస్తున్నవారూ ఉంటారు.

సరే! కవులు ఎలా ఉన్నా, వారి కవిత్వం బాగుంటే ఇదంతా అనుకోవలసిన ఆగత్యమే రాదు కదా! నిజానికి కవిత్వం పేర జరుగుతున్న బుకాయింపు ఒకటి ఉంది! అర్థంకాని కవిత్వంలో ఏదో రూపశ్రద్ధ ఉన్నట్లూ, అర్థమైపోతుంటే వచనమై తేలిపోతున్నట్లూ నిర్ధారించే విమర్శకవతంసులూ ఉన్నారు! ఏ సామాన్యుడి కోసం కవిత్వం అన్నారో అది వాళ్లకు అర్థమైతే, కవిత్వం కాకుండా పోతోందన్న కవి కూటములు తయారయ్యాయి. కవులే కవిత్వం రాసేవారూ, కవిత్వాన్ని విమర్శించేవారూ అవుతున్నారు.

ఇవాళ కవిత్వం సమాజ సంఘటనల తక్షణ ప్రతిస్పందనగానే అధికశాతం ఉంటోంది. "ఓ ఘటన జరగగానే వెంటనే స్పందించి కవితలల్లేవారిలో చాలామంది వస్తువును తమలో సమ్మిళితం చేసుకుని, దానితో తమకున్న సంబంధాన్ని నిర్వచించుకుని, చింతనా స్వభావాన్ని ఏర్పరుచుకుంటున్నట్లు కనబడదు. అపరిపక్వ ధ్యానంతో వస్తువును సొంతం చేసుకోవడం కష్టం. వస్తువుకు సంబంధించిన సమస్త వాతావరణంలోకి ప్రవేశించి ఊహాశాలిత్వంతో తిరుగాడి, దాని మూలాంశాల్ని దర్శించి సారాంశానికి చేరువ కావడం ఒక ప్రయాణం. ఈ ప్రయాణమే లేకుండా కవి రచనకు సిద్ధపడితే లోతులేని సృజనే మిగులుతుంది. శబ్దం వినబడచ్చుగానీ భావకాంతి ప్రసారం అంతగా ఉండదు" అంటూ సంపాదకుడి హోదాలో 'కవిత–2009' కు దర్భశయనం నిఖార్సయిన సత్యం చెప్పాడుగానీ, అందులో సంకలించిన కవితలు అన్నీ అలాంటి భావకాంతి ప్రసరించేవిగా లేకపోవడానికి, తానేమీ బాధ్యత వహించజాలడు పాపం! ఆలోచనమూ, అక్షరమూ, అన్వయమూ, కవితా ధ్యానమూ... అంటూ అంటున్నాడుగానీ వాటికోసం కూర్చుంటే ఈ కవులు ఎప్పటికి అచ్చయ్యేరు! "కవితలు విస్తారంగా రాయడం సుగుణమే! సామాజిక స్థితిగతుల్నీ, పరిణామాల్నీ, వివిధ ఘటనల్నీ జీవనానుభవాలను, వైయక్తిక అనుభూతుల్నీ స్వీకరించి కవులు బహు సంఖ్యలో కవితలల్లారు. ఇది ఒక అనుకూలాంశం" అంటాడు మళ్లీ తానే! 2009 లో వివిధ పత్రికల్లో అచ్చయిన దాదాపు రెండువేలకు పైగా కవితల్ని పరిశీలించామనీ, వెబ్ పత్రికల్లోంచీ స్వీకరించామనీ, కొత్తవాళ్లను పట్టించుకున్నామనీ అన్నారు. స్మైల్, జ్వాలాముఖి, బాలగోపాల్‌లపై నివాళి కవితలు, 2009 లో రాయకపోయినా సంజీవదేవ్, నాగభైరవ కవితల్ని స్వీకరించామనీ చెప్పారు. కవితా

ప్రకంపనాలు ఏ కోణం నుంచైనా రావచ్చు కనుక ఈ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకున్నామన్నారు. దీనితో ఇది ఒక 'కలగూరగంప' అని ఎలాగూ చెప్పకనే చెప్పినట్లయింది! సాహితీ మిత్రులు విజయవాడ వారి కవిత 2009 ముందుమాట ఇదయితే, వరంగల్లు సృజనలోకం (బ్రాకెట్లో ఇంగ్లీష్‌లో రైటర్స్ కార్నర్) వారి 'కవితా వార్షిక 2009' "కణకణలాడుతున్న తెలంగాణ నిప్పుల కొలిమినుండీ, నింగినంటే ఉద్యమ జ్వాలల గర్భం నుండీ వెలువడుతున్నది" అంటూ రామచంద్రమౌళి ప్రస్తావన చేస్తూ "ఈ సంచిక తెలంగాణ ప్రాణగానాన్ని వినిపిస్తోంది" అంటూనే, "ఒక ఏడాదికాలంలో తెలుగునేల నేపథ్యాలు ఏవైనా, వ్యూహాలు వేరైనా, లక్ష్యాలు వేరైనా, చాలామంది కంటే నిబద్ధతగల, సమర్థతగల, దక్షతగల ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కోల్పోయింది. ఎవరూ పూరించలేని ఖాళీ ఏర్పడింది" అని వగవడం నివ్వెరపరుస్తుంది మనల్ని!

ప్రారంభంలో ఈ కవితావార్షికల సంకల్పం గొప్పదే! కానీ రానురాను నిజంగానే 'వార్షిక'ల్లానే తయారవుతున్నాయి. పోయిన పితరులమీద రానురాను శ్రద్ధ, భక్తి, సన్నగిల్లి, ఏటా తద్దినాలు పెట్టినట్లు, తప్పనిసరి 'కృత్యంగా' తలకెత్తుకోవాల్సిన అగత్యమేమీ లేదు! పెట్టకపోతే నష్టమేమీ లేదు. పెట్టినప్పుడు మాత్రం చిత్తశుద్ధి, నిజాయితీ, ప్రగాఢ విశ్వాసం, శ్రద్ధాసక్తులు ఉండాలి. అవే కోల్పోతున్నారనిపిస్తోంది.

'కవిత-2009' లో ఎనభై మూడు కవితలూ, 'కవితా వార్షిక-2009' లో తొంభై ఒక్క కవితలూ ఉన్నాయి. రెండు సంకలనాల్లో సమంగా కనిపించే కవులు నలభై మంది. సృజనలోకం విద్యార్థిబృందంతో 'కవితాగోష్టి' నిర్వహించి, చివరికి సారాంశంగా 'యువత - పై జవాబులు తెలుగు సాహిత్య భవిష్యత్తు పట్ల చాలా 'భయం' కల్గిస్తున్నాయి' అని నిర్ధారించింది. అలాంటి యువతకు మరి ఈ వార్షికల వల్ల ఒనగూడే ప్రయోజనం ఏమిటన్న సందేహం పొటమరిస్తుంది! ఈ ఏడాది వెలువడిన 2009 కవితా సంకలనాలు రెండూ కూడా సంపాదకుల అశ్రద్ధకు పరాకాష్టగా ఉన్నాయి. స్వయంగా సంకలనంలోని కవి దేవరాజు మహారాజు- సృజనలోకం 'కవితావార్షిక'లోని తన కవిత 'పుచ్చిన ఊతకర్ర'లో తొలి 19 పాదాలు మాత్రం తప్ప, మిగితా పంక్తులు తనవి కానే కావనీ, పైగా తనకే అభ్యంతరకరమైన

పాదాలు ఎవరివో చేర్చేసారనీ, ఈ తప్పు ఒక హెచ్చరికగా పని చేయాలనీ స్వయంగా పత్రికాముఖంగా తన నిరసనని ప్రకటించాడు.

రెండింటిలోనూ సమానంగా చోటు చేసుకున్న నలభైమంది కవుల్లో అమ్మంగి వేణుగోపాల్ 'తెలంగాణ జాడ', జూపాక సుభద్ర 'తెలుగును బిచ్చెగత్తెను జేసి' కవితలే రెండింటిలోనూ చోటు చేసుకున్నాయి. విజయవాడ కవితాసంపుటిలో జూపాక సుభద్రదే తొలి కవితగా సంకలనం మొదలుకాగా, వరంగల్లు కవితా సంకలనంలో అది వరుస క్రమంలో 40వ కవిత కావడం గమనార్హం!

ఈ మాటు 'కవితా వార్షికలో ఇన్ని తప్పులా?' అని జానపాడు సైదా 17 మే 2010 'వివిధ'లో ఎత్తి చూపిన పొరపాట్లు నిజంగానే దారుణంగా ఉన్నాయి! "జాగో... జాగో..." ఉద్యమ కవితా సంకలనం లోంచి తీసుకున్నాం అన్నవి, నిజానికి కొన్ని దానిలోనివి కానేకావు. పైగా పత్రికల్లోంచో, అంతర్జాలంలోంచో తీసుకోవడానికీ, మరో సంకలనంలోంచి ఎత్తివేసుకోడానికి తేడా లేదా? నాళేశ్వరం శంకరం కవిత 2009 లో వచ్చింది కాకపోయినా చేర్చుకున్నారుట. ఆ లేఖలో సైదా అన్నట్లు–

"పేరాలకు పేరాలు రిపీట్ కావడం, ఎన్నో తప్పులు దొర్లడం, కవితల వరుస కావాలని మార్చడం జరిగింది. ఇంతటి నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోంది? ఉద్యమంలాగా ఎందరితోనో కవితలు రాయించో, సేకరించో సంకలనం అచ్చేయడం నిజానికి చాలా కష్టమైన పని. కానీ పత్రికల్లో వచ్చిన కవితలను ఎత్తి సంకలనం వేసే పనికి కూడా ఇంతటి నిర్లక్ష్యం తగునా? పైగా సంపాదకుల ముందు, వెనుక మాటల్లో తప్పులు దొర్లకుండా, కేవలం కవితలమేరకే అన్నన్ని తప్పులు దొర్లుతున్నాయంటే, సంపాదకులకు తమ ప్రచారం మీద ఉన్న ధ్యాస, సంకలనం మీద ఉన్నట్లు కనిపించడం లేదు. పుస్తకం అందంగా కనిపించాలనే ధ్యాస, పుస్తకానికి మూలమైన కవితలపైన లేకుంటే ఏమనుకోవాలి? పైగా ఎప్పుడూ వేసేవారి కవితలే వేయడం, అణగారిన జాతులవారు, కొత్తవారు ఎంత మంచి కవితలు రాసినా లెక్కలోకి తీసుకోకపోవడం సరైందా?" అన్న ప్రశ్న సహేతుకంగా సంధించిందే!

ఇక వరంగల్లు సంకలనంలో లేని 'వరవరరావు' కవిగా విజయవాడ 'కవిత–2009 లో ఉండటం ఓ విశేషంకాగా, "ప్రభాకరన్ చంపబడ్డాడు ప్రభాతం చావదు" పేర వివిధలో 25 మే 2009లో అచ్చయిన ఆ వార్తా కవితను– 'ప్రభాతం

చావదు' శీర్షికన ప్రచురించిన సాహితీమిత్రులు– అది అరుణతార జూన్ '2009 నుండి గ్రహించినట్లు ఉటంకించారు. కవిత ప్రారంభంలో మూడు, నాలుగు లైన్లలోనే పదాల్లో అర్థంకాని తప్పులు చోటుచేసుకున్నాయి. 'రాజపక్షే', 'ఈలం పక్షం' 'ఆకాంక్ష' అన్నపదాలు అర్థం కాకుండా అచ్చయి కూచున్నాయి. రెండు సంకలనాల్లోనూ 'తెలంగాణ జాడ' అన్న కవితే అమ్మంగి వేణుగోపాల్‌ది తీసుకున్నారు. కవితావార్షికలో ఎక్కడ నుండి తీసుకున్నదీ పేర్కొనకుండా 37వ కవితగా ఉన్న ఈ కవిత, విజయవాడ సంకలనంలోని చిట్టచివరి కవిత. ('అక్షరం' 28 డిసెంబర్ సంచికది గా పేర్కొనబడింది) కవిత 2009 లోని కవితలు, అచ్చయిన కాలక్రమం ఒకటి గమనించి కూర్చినట్లు తోస్తుంది! 'చరిత్రలో అణచివేయబడే వాళ్లనే ప్రజలంటారు' అంటాడీకవితలో అమ్మంగి. ప్రజల్లోనే అణచేవారూ, అణచబడేవారూ ఉంటారు కనుకనే– వర్గ వైరుధ్యాలూ, వర్గ పోరాటాలూ వచ్చాయి. నాయకులూ ప్రజల్లోంచి ప్రజలచే ఎన్నుకోబడి వచ్చినవాళ్లే కదా. 'బలైపోయిన తరువాత బతికేవాళ్లనే అమరులంటారు' అన్న భావన సరియైనది. "ట్రిగ్గర్ మీద వేలుపెట్టి 'కలిసుంటా' అని బెదిరించే నాయకులను ఏమనాలో నిఘంటువులు వెతకాలి" అన్న ముగింపు వాక్యంలోని 'ఏమనాలో' పదం కవితా వార్షికలో 'ఏమవాలో' అన్న పదంగా మారిపోయింది.

సరే! రెండు కవితాసంకలనాల్లోనూ ఉన్న నలభైమందిని అలా ఉంచి, కవితావార్షికలోనే కనిపించే కవులు యాభై ఒక్కమంది. ఎల్.ఆర్.స్వామి, అన్వర్, పాణి, కాంచనపల్లి రాజేందర్ రాజు, శంకర్‌రావు శెంకేసి, ఎ.కె.ప్రభాకర్, వడలి రాధాకృష్ణ, సూరారం శంకర్, వేణు సంకోజు, అనిశెట్టి రజిత, లోచన్, డా॥ మానేపల్లి, డా॥ ఆవంత్స సోమసుందర్, గుండెబోయిన శ్రీనివాస్, శీలా సుభద్రాదేవి, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, శిలాలోలిత, ఆచార్య పి.వెంకటరెడ్డి, కందాళై రాఘవాచార్య, నల్లెల్ల రాజయ్య, డా॥ ఎల్.ఎస్.ఆర్.ప్రసాద్, అపరాజిత, ఆవాల దామోదర్‌రెడ్డి, విన్నకోట రవిశంకర్, డా॥ బన్న అయిలయ్య, సంగెవేని రవీంద్ర, వేముగంటి మురళీకృష్ణ, కె.వరలక్ష్మి, శైలజామిత్ర, పెన్నా శివరామకృష్ణ, నలిమెల భాస్కర్, పెరుగు రామకృష్ణ, తమ్మెర రాధిక, కాసుల ప్రతాపరెడ్డి, సుంకర రమేష్, పొట్లపల్లి శ్రీనివాసరావు, వడ్డెబోయిన శ్రీనివాస్, మెట్టు రవీందర్, నాళేశ్వరం శంకరం, నెల్లుట్ల రమాదేవి, కోవెల సుప్రసన్నాచార్య, వి.ఆర్.విద్యార్థి, కాత్యాయని విద్మహే, జనజ్వాల, మునిమడుగుల

రాజారావు, వంశీకృష్ణ, మాదిరాజు రంగారావు, డా॥టి.జితేందర్‌రావు, కె.వి.కూర్మనాథ్, పప్పుల రాజిరెడ్డి, హిమజ, నిజానికి వీరిలో కవులెందరో కానివారెందరో తెలంగాణ ప్రాంతానికి చెందకపోయినా చోటు చేసుకున్నవారెందరో విదితమే! వారి కవితల స్థాయి వారిది!

అలాగే సాహితీ మిత్రుల కవిత '2009 లో మాత్రమే ఉన్న కవులు - కృష్ణుడు, షేక్ కరీముల్లా, కోసూరి రవికుమార్, అవనిగడ్డ సూర్యప్రకాష్, అరుణ పప్పు, తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్, బండ్ల మాధవరావు, అరసవిల్లి కృష్ణ, వైదేహి శశిధర్, కోడూరి విజయకుమార్, కె.ఆంజనేయకుమార్, వఝల శివకుమార్, పి.శ్రీనివాస్‌గౌడ్, ఛాయారాజ్, చిత్తలూరి సత్యనారాయణ, డా॥ నాగభైరవ కోటేశ్వరరావు, నగ్నముని, యం.కె.సుగమ్‌బాబు, వరవరరావు, స్కైబాబ, ఇంద్రాణి పాలపర్తి, నామాడి శ్రీధర్, అఫ్సర్, ఉప్పు జ్యోతిర్మయి, దేవిప్రియ, చింతా అప్పల్నాయుడు, కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్, ఎ.నాగరాజు, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, డా॥ సంజీవదేవ్, సిరికి స్వామినాయుడు, మంత్రి కృష్ణమోహన్, రివేరా, సుంకర రమేష్, ఇంద్రవెల్లి రమేష్, దీవి సుబ్బారావు, ఎస్.ఆర్.భల్లం, మో, పాటిబండ్ల రజని, బా రహమతుల్లా, శ్రీనివాస్ దెంచనాల, నన్నపనేని రవి, ఊడ్గుల వేణు అనే నలభైముగ్గురు కవులు.

కవితావార్షికలో మాత్రమే కనిపించే యాభై ఒక్కమందీ కవులుగా కవిత '2009 వారికి ఎందుకు ఆనలేదో, లేక కవిత '2009 లో మాత్రమే కనబడే నలభై ముగ్గురూ కవులుగా కవితావార్షిక వారికి ఎందుకు ఆనలేదో మనం చెప్పలేం! ఒక్క నలభైమంది విషయంలోనే ఇరు 'వార్షికల' సంపాదకులూ ఏకాభిప్రాయంగా కవులుగా ఎంచుకుని, వారి కవితలకు అవీ (ఇద్దరి విషయంలో తప్ప) భిన్నమైనవాటికి చోటు కల్పించడం జరిగింది. ఇక ఇరు కవితావార్షిక సంపుటులకు అందని కవులు ఎవరో, 2009 లో పత్రికల్లో వారి కవితలు వచ్చినా ఈ సంపాదకుల దృష్టికి వారెందుకు రాలేదో ఏ పాఠకులూ ప్రశ్నించ(లే)రు కదా! సంకలనం సంపాదకుల ఇష్టం!

పోతే- ప్రధానంగా క్రితం సంవత్సరంలో సమాజంలో వచ్చిన పరిణామాల్నీ, చోటు చేసుకున్న ఘటనల్నీ చిత్రించిన కవితల్ని పరిశీలించి కొన్ని ప్రాతినిధ్య కవితల్ని ఎంచుకున్నామంటున్నారు గానీ, ఆ ప్రాతినిధ్యంలో నిష్పాక్షికత కొరవడినట్లు కవిత్వ

పాఠకులకు అర్థం కాకపోదు. 'కవి కాలమ్' పేరిట ఆంధ్రప్రభ దినపత్రికలో గురువారాల్లో 2009 సంవత్సరం పొడుగుతా సమకాలిక ఘటనల ప్రతిస్పందనగా కవిత్వ కాలమ్ నడిపిన భవదీయుడు కూడా ఎవరికీ ఉదాహరణప్రాయుడిగానైనా తోచకపోవడమూ చిత్రమే! అంతర్జాతీయ పత్రికల్లో కవితలు రాస్తున్న యువతను కూడా వీరు గుర్తించకపోవడం చిత్రమే! అలాగే స్త్రీలకు మరింత చోటు కూడా ఇచ్చే అవకాశం ఉండీ (చల్లపల్లి స్వరూపరాణి, స్వాతిశ్రీపాద వంటివారికి) చోటు కల్పించలేకపోవడం కూడా సరికానిదే!

"తెలంగాణల వొఱ్ఱే నోరు-పొగరు-విఱ్ఱవీగడం-
ఉరుకురుకి తన్నడం-లఢాయ్ జేసుడు-యాడ సచ్చినయో ఏందో...
యాడగూడా సూద్దామన్నా కనపడతలే"
(అన్నీ ఉన్నయ్-అన్వర్)

వంటి భావాలు కవితా వార్షిక-2009 తప్పుడు సంకేతాలు పంపే ప్రమాదం కూడా ఉందని గ్రహించాలి. ఇంతకీ ఈ కవితావార్షికలు వెలువరించడం కేవలం ఒక 'అచ్చుపిచ్చి'గా మారిందని వ్యాఖ్యానిస్తున్నవారూ ఉన్నారు. ఎంత కాదన్నా డా॥ సి.నారాయణరెడ్డిగారి కవిత్వ పాదాలే ముక్తాయింపుకు అనివార్యమైన పెద్దదిక్కుగా నిలుస్తున్నాయి.

"మరో కోణం నుంచి సమీక్షిస్తే
ఈ విశ్వావతరణకు మౌలిక ప్రేరణ
సృజనాత్మకంగా రూపొందిన ఉన్మాదమే
సమన్వయ సూత్రంలో అనుసంధించి చెబితే
ఇటు వినూతన సృష్టి అటు విధ్వంసన దృష్టి
ఉన్మాదానికి రెండు వైపులు"

ఈ రెండు వైపులనుంచీ వచ్చిన కవితా వార్షికలూ అందుకు దాఖలాలు! ✻

**(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం 28 ఆగస్టు'2010)**

## 20

# ఆకాశవాణి... వార్తలు చదువుతున్నది...

**'తె**లుగు మాట్లాడే దీపాలు తెల్లవార్లూ వెలుగుతూనే ఉంటాయి' అని ఆరుద్ర అన్నట్లు జీవితపువిలువను పెంచగల మాధ్యమం... తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను ఎక్కువ మందికి తక్కువ ఖర్చుతో అందించే మాధ్యమం... ఆకాశవాణి. 'ఇల్లూ-వాకిలి' ముచ్చట్ల నుంచి జాతీయ, అంతర్జాతీయ వార్తల వరకూ... ప్రసంగాల నుంచి నాటకాల వరకూ కార్యక్రమమేదైనా సరే, సరళమైన, పొందికైన తెలుగుకే ఆకాశవాణి పట్టం కట్టింది. ఇప్పటికీ కడుతోంది. ఎప్పటికీ కడుతూనే ఉంటుంది. అలాంటి ఆకాశవాణి మహాప్రస్థానంలో తొలినాటి జ్ఞాపకాలివి.

రేడియో అనగానే పులకించిపోయే తరం ఇప్పటికీ ఉంది. ఇంటింటి వినోద, విజ్ఞాన, వికాస మాధ్యమంగా ఒకప్పుడు రేడియోనే ఉండేది. ఆకాశవాణి – నాటి సమాజంతో బలీయంగా పెనవేసుకుపోయిన శ్రవణసాధనం. సాహిత్య, సంగీత, నాటక సమలంకృతంగా ఎందరెందరో కవులు, రచయితలు, కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వడం మాత్రమే కాదు, ఎంతో కొంత పోషకంగానూ ఉంటూ వచ్చింది. వారి ప్రతిభా పాటవాలకు వన్నెతెచ్చి కీర్తి ప్రతిష్ఠలనిచ్చింది. పండితపామర జనరంజకంగా భాసిస్తూ వచ్చింది. మారుమూల గ్రామాల్లోకీ చొచ్చుకుపోయి, అన్ని తరగతుల శ్రోతలనూ అలరించింది. రైతులకు 'పొలంపనులు', 'పాడిపంట'లకు అండగా నిలిచి 'ఇల్లూ-వాకిలి' తీర్చి దిద్దుకోవడం చెప్పింది. వాతారణ సూచనలతో అప్రమత్తం చేసింది. బాలానందం, బాలవినోదం, పాలవెల్లి, ఆటవిడుపు, బొమ్మరిల్లు అంటూ చిన్నపిల్లలను కూడా కథలూ కబుర్లూ ఆటపాటలతో అలరించింది. రంగవల్లి, మహిళా సమాజం, వనితావాణి అంటూ స్త్రీలకు వంటింటి కబుర్లతోనే సరిపెట్టక, సాధికారత దిశగా నడిపించింది. ప్రాథమిక పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలకు విద్యా కార్యక్రమాలతో బోధనలు చేసింది. కార్మికులు, గ్రామస్తులు, వయోధికుల

కార్యక్రమాలు అంటూ వారి జీవనసరళిని వికాసవంతం, వినోదభరితం చేసే కార్యక్రమాలతో అలరించింది.

రేడియో వార్తలు విశ్వసనీయతకు, ప్రామాణికతకు కేంద్రబిందువై ప్రపంచాన్నంతటినీ సమాచార సంపదతో పరిపుష్టం చేసేవి. ఆరోగ్యదాయకమైన రాజకీయ చర్చలుండేవి. సామాజిక బాధ్యతను నెరవేర్చే అంశాలతో కార్యక్రమాల రూపకల్పన జరిగేది. ఆకాశవాణి ప్రజాస్వామ్య స్ఫూర్తికి దీప్తినిచ్చింది. జాతీయతకు, భిన్నత్వంలో ఏకత్వానికి వెన్నంటి సాగింది. ఇంగ్లీషు, హిందీ పాఠాలనే కాదు సంస్కారాన్నీ, తెలుగు భాష ఉచ్చారణనీ కూడా నేర్పించింది. ప్రసారాల్లో సమయాన్ని ప్రకటిస్తూ జనానికి సమయ పాలననూ గుర్తు చేసింది. సినిమాహాలుకు వెళ్లి సినిమాలు చూడలేకపోయినా – సంక్షిప్త శబ్దచిత్రాలను వినిపించింది. రంగస్థలాన్ని 'రేడియో నాటకంగా' వినిపిస్తూ కనిపించేలా చేసింది. మహా విద్వాంసులు సామాన్య శ్రోతల కోసం గాత్ర, వాద్య కచేరీలు చేశారు రేడియోలో. హరికథలు, బుర్రకథలు, జానపద గీతాలు, ఒగ్గుకథలు మొదలు భజనలు, కీర్తనలు, కృతులు వినిపించి సుప్రభాతాలను, సాయంసంధ్యలను కూడా రసరమ్యం చేసింది.

**అప్పుడు పడింది తొలి అడుగు**

దక్షిణ భారతదేశంలో 1924 లో మద్రాసు ప్రెసిడెన్సీ రేడియో క్లబ్ ద్వారా రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. దానికి కారణం తెలుగు వారైన రావుబహదూర్ సి.వి.కృష్ణస్వామిశెట్టి. ఆయన మద్రాసు నగరపాలక సంస్థలో ఎలక్ట్రికల్ ఇంజినీరు. రేడియో క్లబ్‌కు ఆయనే కార్యదర్శి. సంగీతానికి పెద్దపీట వేస్తూ ఈ క్లబ్ 31 జూలై 1924 న ప్రసారాలు మొదలెట్టింది. 1927 అక్టోబరులో అది మూతపడింది. కానీ, కృష్ణస్వామిశెట్టి పూనిక పట్టి 1930 ఏప్రిల్ 1 నుంచి నగరపాలక సంస్థ ద్వారా రేడియో ప్రసారాలు చేయించారు. అవి పరిమితమైనవే. అయినా... తెలుగు పాటలు, ఆరోగ్య విశేషాలు, బడిపిల్లల కోసం కొన్ని కార్యక్రమాలు తెలుగులో ప్రసారమై చిత్తూరు, వెంకటగిరి వంటి చోట్లా, వాతావరణం బావుంటే విశాఖపట్నం దాకా వినిపించేవట. ఇంతకు మించి అప్పటి కార్యక్రమాల వివరాలు తెలియరావడంలేదు. అలాగే, హైదరాబాద్‌లో చిరాగ్‌అలీ వీధిలో మహబూబ్ అలీ 1933 లో మొదట 200 వాట్ల శక్తిగల రేడియో కేంద్రం స్థాపించారు. దానిని 1935 ఫిబ్రవరి 3న

నిజాం తన ఆధీనంలోకి తీసుకున్నాడు. 'దక్కన్ రేడియో'గా –7వ ఆసఫ్‌జా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిజాము ఉర్దూ ప్రసారాలతో మొదలుపెట్టినా, పరిమితంగా తెలుగు, కన్నడ, మరాఠీ కార్యక్రమాలుండేవట. స్టూడియో సరూర్‌నగర్ నుంచి ఖైరతాబాద్ యావర్ మంజిల్‌కు తరలింది. స్వాతంత్ర్యం వచ్చాక 1948 డిసెంబర్ 1 నాటికి 800 వాట్ల శక్తితో షార్ట్‌వేవ్, మీడియంవేవ్ లతో ఉండిన దక్కన్‌రేడియోలో మాడపాటి హనుమంతరావు చొరవతో తెలుగు కార్యక్రమాలు పెరిగాయని చెబుతారు. కర్నాటక సంగీతానికి ప్రసారాల్లో సమయం కేటాయించారు. దక్కన్‌రేడియోలో వసీఖాన్ తెలుగు కార్యక్రమాల అధికారిగా ఉండేవారు. రాయప్రోలు రాజశేఖర్, భాస్కరభట్ల కృష్ణారావు, దుర్గాచలం దక్కన్ రేడియోలో పనిచేసిన తెలుగు ప్రముఖులు. కురుగంటి సీతారామయ్య, త్రిపురనేని మహారథి సంభాషణలు, వార్తలు వంటివి రాసేవారు. లలిత, వెంకటేశ్వర్లు వార్తలు చదివేవారు. 1950 ఏప్రిల్ ఒకటిన దక్కన్ రేడియోను భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

**'మీరెక్కడ నుంచి వినుచున్నారో'**

తొలి తెలుగు ప్రసారాల కచ్చితమైన సమాచారం కావాలంటే... 1938 జూన్ 16 న మొదలైన మద్రాసు రేడియో కేంద్రం చరిత్రను తిరగేయాలి. మద్రాసు, విజయవాడ, హైదరాబాద్ మూడు ఆకాశవాణి కేంద్రాల్లోనూ పనిచేసిన డా॥ పి.ఎస్.గోపాలకృష్ణ ఆ విలువైన సమాచారాన్ని నిక్షిప్తం చేశారు.

మద్రాసు రేడియోను నాటి గవర్నర్ లార్డ్ ఎర్‌స్కిన్, మద్రాసు రాష్ట్ర ప్రధానమంత్రి (అంటే ముఖ్యమంత్రి) చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ) ప్రారంభించారు. ఆలిండియా రేడియో పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆ సంస్థను రాజాజీ తన ఆంగ్ల ప్రసంగంలో 'హిందుస్థాన్ ఆకాశవాణి' అని ప్రస్తావించారట. ఆనాటి సాయంకాలం 5.30 కి సౌరాష్ట్ర రాగంలో త్యాగరాజస్వామి రచించిన 'శ్రీ గణపతిని సేవింపరారే' అనే తెలుగు కృతిని తిరువెన్కాడు సుబ్రహ్మణ్య పిళ్లై నాదస్వరంపై వాయిస్తుండగా మద్రాసు కేంద్రం ప్రారంభమైంది. ఆ రాత్రే 8.15 కు 'భారతదేశం–రేడియో' అనే అంశంపై సర్ కూర్మా వెంకటరెడ్డినాయుడు తెలుగులో ప్రసంగించారు. అదే తొలి తెలుగు ప్రసంగం. జస్టిస్‌పార్టీ నాయకుడైన ఆయన 1937 ఏప్రిల్ 1 నుంచి – జూలై 14 దాకా ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ప్రధానిగా

పనిచేశారు. 'నేనిప్పుడు చెన్నపట్నం నుంచి మాట్లాడుచున్నాను. మీరెక్కడ నుంచి వినుచున్నారో నేను చెప్పజాలను. కానీ అనేక స్థలములయందు ఉండి వినుచున్నారని తలచుచున్నాను. నేనీ రోజున చెప్పవలసినదేమనగా ఆకాశవాణి యొక్క ఉపయోగములే. దీన్నే ఇంగ్లీషులో రేడియో అందురు' అని ప్రసంగం మొదలు పెట్టారాయన.

మద్రాసు కేంద్రం తొలి తెలుగు ప్రసారాల్లో 1938 జూన్ 18 న 'సజీవమైన తెలుగు' అనే అంశంపై గిడుగు రామమూర్తి పంతులు, జూన్ 21 న 'మన ఇల్లు - దాని అందము చందము' అనే అంశంపై కోలవెన్ను రామకోటేశ్వరరావు. జూన్ 23 న 'రవీంద్రుడు' గురించి బెజవాడ గోపాలరెడ్డి 15 నిమిషాల వ్యవధిగల ప్రసంగాలు చేశారు.

ముద్దుకృష్ణ రాసిన 'అనార్కలి' మద్రాసు కేంద్రం నుంచి ప్రసారమైన తొలి తెలుగు నాటకం. నాటకీకరణ చేసింది ఆయనే, రూపొందించింది ఆచంట జానకీరాం. నాయిక పాత్రను రేడియో భానుమతి (పున్నావఝుల భానుమతి) ధరించగా, సలీంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి, అక్బర్‌గా అయ్యగారి వీరభద్రరావు ఆ నాటకంలో పాల్గొన్నారు. 1938 జూన్ 24 రాత్రి ఎనిమిదిన్నరకు ఆ నాటకం ప్రసారమైంది. పల్లెపాటలు పేరుతో 1938 జూన్ 25 రాత్రి జానపద సంగీతం ప్రసారమైంది. పాడింది మాత్రం జానపద కళాకారులు కాదు. 1938 జూన్‌లో రేడియో కార్యక్రమాల గురించి శ్రోతలకు తెలియజేయడానికి తమిళంలో 'వానొకలి', తెలుగులో 'వాణి' పక్షపత్రికలు మొదలయ్యాయి. 'వాణి' 1980 వరకూ వచ్చింది.

మద్రాసు తెలుగు ప్రసారాల తొలి తెలుగు వ్యాఖ్యాత (అనౌన్సర్) చారిత్రకులు మల్లంపల్లి సోమశేఖర శర్మ సోదరుడైన మల్లంపల్లి ఉమామహేశ్వరరావు. పిల్లల కార్యక్రమాల్లో 'రేడియో తాతయ్య'గా ప్రసిద్ధులైన ఆయన 95 ఏళ్లు జీవించి కొన్నేళ్ల క్రితమే మరణించారు. 1939 లో మల్లవరపు విశ్వేశ్వరరావు 'బిల్హణీయం' సంగీత నాటకం ప్రసారమైంది. బి.వి.నరసింహారావు సంగీతం సమకూర్చి నాయకపాత్ర ధరించారు.

గీతావళి పేరుతో భావగీతాలు తొలుత ప్రసారమైనా, 'లలితసంగీతం' అన్న పేరు ప్రాచుర్యం పొందింది ఆకాశవాణితోనే. అలాగే ఆంగ్లంలో 'ఫీచర్' అనే 'రూపకం' ప్రక్రియ రేడియోకి ప్రత్యేకమైంది. తెలుగులో ప్రసారమైన తొలి రూపకం 'శ్రీకృష్ణదేవరాయ

వైభవం'. 1941 జనవరి 15 న ప్రసారమైన ఈ రూపక మౌలిక రచన మద్రాసు నుంచి 'తెలుగు' అనే పత్రికను సంపాదకునిగా నడిపిన ఆకొండి వేంకటేశ్వరరావు. ఆచంట జానకీరాం దానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

**ఓ శ్రీశ్రీ... ఓ కొ.కు**

అక్టోబరు 3, 1938 నుంచి పాఠశాల విద్యార్థుల కోసం ప్రసారాలు మొదలయ్యాయి. 1938 నవంబర్ 2 న తెలుగులో గ్రామస్తుల కార్యక్రమాలు మొదలయ్యాయి. అంతవరకూ తెలుగులో ప్రసారాలు రాత్రి మాత్రమే ఉండేవి. 1939 సెప్టెంబర్ 5 నుంచి మద్రాసు రేడియో కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నమూ ప్రసారాలు మొదలయ్యాయి. 1939 అక్టోబరు 1 న తెలుగులో వార్తా ప్రసారాలు, నవంబరు 2 నుంచి కళాశాల విద్యార్థుల కార్యక్రమాలు మొదలయ్యాయి. టేప్‌రికార్డింగ్ సదుపాయాల్లేని కార్యక్రమాలు అన్నీ ప్రత్యక్ష ప్రసారాలుగా అప్పటికప్పుడే రూపొందించి ప్రసారం చేసేవారు. అందువల్ల నాటి గొప్ప గొప్ప కార్యక్రమాలన్నీ నిజంగానే గాలిలో కలిసిపోయినట్లే! శ్రీశ్రీ రాసిన 'బలి', 'గ్రామ్‌ఫోన్ రికార్డుల తిరుగుబాటు' అనే రేడియో నాటికలు 1939–40 లో ప్రసారమయ్యాయి. శ్రీశ్రీ 'మరో ప్రపంచం' పేరునా రేడియో నాటిక రాశారు. పి.వి.రాజమన్నార్, కొడవటిగంటి కుటుంబరావు, గోరాశాస్త్రి, వీరంతా తొలి తెలుగు రేడియోనాటక రచయితలు. పిల్లల కోసం 'ఆటవిడుపు' 1939 లో మొదలైంది. తొలుత దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ నిర్వహించేవారు. ఆపై న్యాయపతి కామేశ్వరి, న్యాయపతి రాఘవరావులు 'బాలానందం' పేర శనివారాల్లోనూ కార్యక్రమాలు వినిపిస్తూ 'రేడియో అక్కయ్య', 'రేడియో అన్నయ్య'గా ప్రాచుర్యం పొందారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక హైదరాబాద్‌కు తరలివచ్చారు వారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ తన పదకొండేళ్ల వయసులో 1941 జులై 2 న మొదటి రేడియో కార్యక్రమం ఇచ్చారు. తదనంతర కాలంలో ఆయన రేడియోలో ఉద్యోగం చేశారు. 1944 సెప్టెంబర్ 30న ఘంటసాల వేంకటేశ్వరరావు రేడియోలో శాస్త్రీయ సంగీతం వినిపించారు. రెండో ప్రపంచ యుద్ధం రోజుల్లో మద్రాసు షార్ట్‌వేవ్ రేడియో ప్రసారిణి ఢిల్లీకి తరలించారు. 1942 నుంచి 1945 దాకా తెలుగు, తమిళ కార్యక్రమాలు ఢిల్లీ నుంచి కూడా ప్రసారమయ్యాయి.

**అష్టావధానాలు... ప్రత్యక్ష వ్యాఖ్యానాలు**

అక్టోబరు 12, 1948 న విజయవాడలో రేడియోకేంద్రం స్థాపించారు. అదే సంవత్సరం డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రసారాలు ప్రారంభించడంతో తొలి తెలుగు రేడియో కేంద్రంగా విజయవాడ స్థిరపడింది. 1950 ఏప్రిల్ 1 న హైదరాబాద్ రేడియో కేంద్రం ఆలిండియా రేడియోగా పరివర్తితమై ప్రసారాలు ప్రారంభించింది. 1955 నవంబరు 2 న మొదలైన బెంగళూరు, 1963 జూన్‌లో మొదలైన పోర్ట్‌బ్లెయిర్ కేంద్రాల్లోనూ తెలుగు ప్రసారాలున్నాయి. తెలుగు ప్రసారాలకు సంబంధించి విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలు చేసిన కృషి రాశిలోనూ వాసిలోనూ అధికం. ప్రసంగాలు, గోష్టులు, సంచికా కార్యక్రమాలు, కవిసమ్మేళనాలు, అష్టావధానాలు, సమస్యాపూరణలు, ధర్మసందేహాలు, భద్రాచల సీతారామ కల్యాణం, తిరుపతి బ్రహ్మోత్సవాలు, శ్రీశైల శివరాత్రి ఉత్సవాల ప్రత్యక్షవ్యాఖ్యానాలతో కొత్తపుంతలు తొక్కాయి ఈ కేంద్రాలు. విశ్వనాథ సత్యనారాయణ విజయవాడ కేంద్రం నుంచి తమ 'బద్దన్నసేనాని' నవలను తానే స్వయంగా చదివి వినిపించారు. హైదరాబాద్ కేంద్రం 'నవలా స్రవంతి' పేరిట తెలుగు నవలలు ఎన్నింటినో వినిపించింది.

1939 అక్టోబరు 1 నాడే ఢిల్లీ నుంచి తెలుగు వార్తలు మొదలైనా హైదరాబాద్, విజయవాడ కేంద్రాల వార్తా విభాగాలే నేడు తెలుగు వార్తా ప్రసారాలు నిర్వహిస్తున్నాయి. ప్రాంతీయ వార్తలే కాక ఢిల్లీ నుంచి గతంలో వచ్చే తెలుగు వార్తా బులిటెన్లు ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రం నుంచే ప్రసారమవుతున్నాయి. ఢిల్లీ నుంచి తెలుగు వార్తలు చదివిన తొలితరం వారిలో శ్రీశ్రీ, కొంగర జంగయ్య కూడా ఉన్నారు. కపిల కాశీపతి, శ్రీవాత్సవ, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, పన్యాల రంగనాథరావు, వనమాలి ప్రసాద్, కందుకూరి సూర్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీరాములు, ఏడిద గోపాలరావు, మల్లాది రామారావు, దుగ్గిరాల పూర్ణయ్య, అద్దంకి మన్నార్, పి.ఎస్.ఆర్.ఆంజనేయశాస్త్రి, సురమౌళి, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి, జోళిపాళెం మంగమ్మ, డి.వెంకట్రామయ్య, జ్యోత్స్నాదేవి, కొప్పుల సుబ్బారావు, ప్రయాగ రామకృష్ణ వీరంతా తెలుగు వార్తలు వినిపించడంలో పేరెన్నికగన్నారు. ఆకాశవాణిలో మొట్టమొదటి జాతీయ కవిసమ్మేళనం ప్రసారమైన తేదీ జనవరి 25, 1956... ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రస్తుతం ఉన్న 22 భాషల నుంచి కవితలను ఒక్కో భాషకు ప్రాతినిధ్యంగా ఎంపిక

చేస్తారు. ఆయా ప్రాంతీయభాషా కేంద్రాలన్నిటినుంచీ వాటి అనువాదాలను వినిపించడం ప్రతిష్ఠాత్మక కార్యక్రమమే. 1955 నుంచి హైదరాబాద్ కేంద్రంలో 'గీతావళి' పేర ప్రతిరోజూ లలితగీతాలు ప్రసారమయ్యేవి. దాశరథి, నారాయణరెడ్డి, ఎన్నో లలిత గీతాలు, గేయ నాటికలు రాశారు. 1957లో కృష్ణశాస్త్రి హైదరాబాద్ కేంద్రంలో ప్రయోక్తగా చేరారు. అలాగే బాలాంత్రపు రజనీకాంతరావు, పింగళి లక్ష్మీకాంతం, నాయని సుబ్బారావు, బందా కనకలింగేశ్వరరావు, స్థానం నరసింహారావు, గుర్రం జాషువా, జి.వి.కృష్ణారావు, గోపీచంద్, బుచ్చిబాబు, కేశవపంతుల నరసింహశాస్త్రి, వేలూరి సహజానంద, రావూరి భరద్వాజ, పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్, వోలేటి వెంకటేశ్వర్లు, దండమూడి, మారెళ్ల కేశవరావు, అన్నవరపు రామస్వామి వంటి సాహిత్య, సంగీత దిగ్దంతులు ఎందరో తొలి తెలుగు ప్రసార ప్రముఖులే.

| **ఆకాశవాణి కేంద్రం** | **ప్రారంభం** |
|---|---|
| కడప | 17.06.1963 |
| విశాఖపట్నం | 04.08.1963 |
| కొత్తగూడెం | 20.03.1989 |
| ఆదిలాబాద్ | 12.10.1986 |
| వరంగల్ | 17.02.1990 |
| నిజామాబాద్ | 09.09.1990 |
| తిరుపతి | 01.02.1991 |
| అనంతపురం | 29.05.1991 |
| కర్నూలు | 01.05.1992 |
| మార్కాపురం | 09.08.1993 |

తొలి తెలుగు ప్రసారాల వైభవ ప్రాభవాలను వివరించడానికి నిజానికి ఒక పెద్ద గ్రంథమే రాయాల్సి ఉంటుంది. 1970 డిసెంబర్ 20 నుంచి హైదరాబాద్‌లో 'యువవాణి' కార్యక్రమాలకు అంకురార్పణ జరిగింది. ఆగ్నేయ ఆసియాలోని తెలుగు

వారి కోసం ఆకాశవాణి 1990 మార్చి 27 ఉగాది నుంచి ప్రత్యేక కార్యక్రమాలు అరగంట వ్యవధితో మొదలుపెట్టింది. మొదట ఢిల్లీ కేంద్రంగా పనిచేసినా ప్రస్తుతం హైదరాబాద్ నుంచే నిత్యం ఈ ప్రసారాలు సాగుతున్నాయి.

శ్రీలంకలో గతంలో తెలుగు ప్రసారాలు రోజూ నియమిత సమయంలో ఉండేవి. వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగం (మార్చి 21, 1971) నెలకొల్పడానికి ఒక విధంగా అదే ప్రేరణ అయ్యిందేమో. ఉత్తర శ్రీలంకలో మారిన పరిస్థితుల దృష్ట్యా ఆ ప్రసారాలు ఇప్పుడు లేవు.

జనజీవనంలో ఆకాశవాణి పాత్ర విస్మరించలేనిది. తెలుగు భాష, సాహిత్యం, సంగీతం ఆకాశవాణి ద్వారా విస్తృత ప్రాచుర్యం పొందాయి. కేవలం వినోద ప్రధానంగానే కాక విజ్ఞాన, వికాసాలకు ఆలంబనమై ఆకాశవాణి కొన్ని తరాల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడింది. దోహదపడుతోంది. ✻

**(తెలుగువెలుగు మాసపత్రిక ఫిబ్రవరి' 2014)**

# (21) అంతా ఎఫ్.ఎం మయం

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సత్యసాయి నిగమాగమం పక్క సందులో ఒక ప్రైవేట్ స్టూడియో–

చాలా హడావుడిగా ఉంది.

వికాస్‌తో కలిసి సాయిప్రసాద్ హడావుడిగా తిరుగుతున్నాడు.

ప్రోగ్రాం కాన్సెప్ట్‌లు చర్చించేందుకు కొందరు, ప్రొడక్షన్ చేసేందుకు కొందరు.

ఓ పక్క సంప్రదింపులు జరుగుతున్నాయి.

మరోపక్క యువతీయువకులు డిస్క్ జాకీలుగా శిక్షణ పొందుతున్నారు. ఇంకో పక్క ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్, మిగతా సరంజామా దిగుతోంది.

ముంబై నుండి సంప్రదింపులు.

అదే పనిగా మ్రోగుతున్న సెల్‌ఫోన్లు.

ఈ హడావుడి అంతా ఏమిటంటారా?

అతి త్వరలో ప్రారంభంకాబోతున్న ఎఫ్.ఎం.రేడియో 'రేడియో సిటీ' హడావుడి ఇది. ఒక తాత్కాలిక వాసంగా అక్కడ మొదలైన సంరంభం అది!

ఇలాంటి హడావుడి, ఇంతకు మించిన హడావుడి హైదరాబాద్‌లో ఇంకా మరికొన్ని సంస్థలూ సాగిస్తున్నాయి.

ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు రేడియో మిర్చి, యాడ్‌లాబ్స్ ఇవన్నీ ప్రైవేట్ రేడియో ఎఫ్.ఎంలే–

ప్రస్తుతం ఆకాశవాణికి పోటీ లేదు. ఒక్క దూరదర్శన్‌కే ప్రైవేట్‌చానళ్ల వల్ల ఉంది. కానీ ఇప్పుడు ఎఫ్.ఎం. విప్లవం విస్తరిస్తోంది.

మొన్నటిదాకా పల్లెపల్లెలో
సన్నని జూకామల్లె తీగల్లో అల్లుకుని
సన్నని లాంతరు వెలుగులో కమ్ముకొని పాడిన రేడియో
ఇవాళ నగరయువతను అలరించే అత్యాధునిక మీడియాగా
సరికొత్తగా మళ్ళీ పాడుతోంది!

ఎఫ్.ఎం. రేడియో సెట్లు రకరకాల ఆకారాల్లో, సైజుల్లో చూడగానే ఆకర్షించేలా లభిస్తూ యువతను రేడియో వినేలా ప్రేరేపిస్తున్నాయి. ఒకప్పుడు రేడియోలో భక్తిరంజని, సుభాషితాలు, రేడియో సంక్షిప్త శబ్దచిత్రాలు, గంట నాటకాలు, పిల్లల, స్త్రీల, కార్మికుల కార్యక్రమాలు, ప్రసంగాలు... చర్చలు, పొలం పనులు, మరీ ముఖ్యంగా వార్తలు.. అయితే ఇవాళ రేడియో ఎఫ్.ఎం.ల్లో  సినిమా పాటలు, రీమిక్స్‌లు, పాప్‌లు, రాక్‌లు, ఫోన్‌ఇన్‌లో ఇంటరాక్షన్‌లు, గేమ్‌షోలు, ట్రాఫిక్ న్యూస్‌లు

ఓహ్!... సండదే సందడి! డిజిటల్ సౌండ్స్! ఫాస్ట్ బీట్స్! యాంకరింగ్ కబుర్ల పోగు, ఇబ్బడిముబ్బడిగా ఎఫ్.ఎం. రేడియో చానళ్లు యువతను ఆకర్షిస్తూ ప్రవేశిస్తున్నాయి.

ఇవాళ రేడియో డ్రాయింగ్ రూమ్‌లోనో, బెడ్‌రూంలోనో ఉండదు. యువత డ్రైవ్‌చేసే కార్లోకీ, నిరంతరం వారి వెంటుండే సెల్‌ఫోన్లలోకీ చొచ్చుకుపోతోంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానం రేడియోని కొత్త బంగారు లోకంలోకి తీసుకుపోతోంది. కంగారు యువతకు హంగామా హమేషాకి కొత్త అలవరసలు దిద్దుతోంది. రేడియో ప్రాధాన్యత తగ్గలేదు అనడానికి ఎఫ్.ఎం. రేడియో చానళ్ల సరికొత్త పోటీయే తార్కాణం.

ఆకాశవాణి కూడా మడిగుట్టుకు కూర్చోలేదు.

ప్రసారభారతి బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాగా మారాక ఆకాశవాణి కూడా నాటితరం ఆసక్తులను అలా నిలుపుతూనే, కొత్తతరం యువతను ఆకట్టుకునే సరికొత్తదారులు త్రొక్కడానికి సిద్ధమైంది.

తన ఒకప్పటి వివిధ భారతి 'పంచరంగీ' ప్రోగ్రామ్‌లను కమర్షియల్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్‌లకు అనుసంధానం చేసుకుని ఊరుకోలేదు.

ఎఫ్.ఎం. చానెళ్లకు శ్రీకారం చుట్టింది.

నిజానికి ఆకాశవాణి ఎఫ్.ఎం. చానెళ్లు ముందు చిన్న పట్టణాల్లోనే మొదలయ్యాయి. అయితే అవి ఎల్.ఆర్.ఎస్ (లోకల్ రేడియో స్టేషన్లు) గా ముద్రపడ్డాయి. సహజంగానే స్థానిక అంశాలకు, కళాకారులకు ప్రాధాన్యం ఇచ్చిన అవి – దినపత్రికల జిల్లా టాబ్లాయిడ్ ఎడిషన్లలా రాణించేవే గానీ, యువతను సంచలనశీలురను చేసే దిశగా లేవు.

అందువల్లే నవతరం అభిరుచులకు అద్దంపడుతూ నగర యువతను ఆకర్షించే దిశగా ఆకాశవాణి కూడా ప్రధాన నగరాల్లో ఎఫ్.ఎం.లకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీ, ముంబై, మద్రాస్, 2005 డిసెంబర్ 25 నుండి హైదరాబాద్‌లో 'ఎఫ్.ఎం, రెయిన్‌బో'తో ఆకాశవాణి కొత్త ఉరకలెత్తింది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు మూడింటిలోనూ వైవిధ్య భరితమైన కార్యక్రమాలతో కొత్త తరాన్ని ఆకట్టుకోవడం మొదలెట్టింది. కొన్ని రూట్ల ఆర్టీసీ బస్సుల్లో కూడా ఎఫ్.ఎం రేడియో పలుకుతోంది.

నవీన కాలంలో ప్రైవేట్ రేడియో కాన్సెప్ట్‌కు 2000 సంవత్సరంలో మొదట బెంగళూరులో వరల్డ్‌స్పేస్ రేడియో అంకురార్పణ చేసింది. సంగీతానికి, తెలుగు పాటలకు ఇలా వేర్వేరుగా ఇరవైనాలుగ్గంటల చానెళ్ళ ప్రసారం దాని ప్రత్యేకత. అయితే నాలుగైదువేలు కనీసం ఖర్చుపెడితేగానీ అది అమరదు. ఏడాదిగా హైదరాబాద్‌లోనూ వరల్డ్‌స్పేస్ తన సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఎఫ్.ఎం అంటే ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్, మీడియం వేవ్, షార్ట్‌వేవ్‌ల వలె కాక ఎఫ్.ఎంల ప్రసార పరిధి నియమిత దూరానికి, ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. అయితే కేవలం ఓ వందరూపాయలు పెట్టి ఎఫ్.ఎం రేడియో పరికరం కొనుక్కోగలిగే వీలుంది కనుక, ఇది అందరికీ అందుబాటులో ఉండేదే. ఎఫ్.ఎం రేడియో సెట్‌తో ఏ పట్టణానికి వెళ్ళినా అక్కడి ఎఫ్.ఎం రేడియో ప్రసారాలు వినగలిగే వీలుంటుంది. వరల్డ్ స్పేస్ రేడియో కన్నా ఎఫ్.ఎం రేడియో చౌకగానూ విస్తృతంగానూ అందుకునే వీలువచ్చేసింది.

2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక చారిత్రాత్మక తీర్పు కారణంగానే దేశంలో ప్రైవేట్ ఎఫ్.ఎం రేడియో కేంద్రాలకు అనుమతి లభించింది. టైమ్స్ ఆఫ ఇండియా, ఇండియా టుడే, స్టార్, మిడ్‌డే వంటి సంస్థలు అప్పుడే రేడియో రంగంలోకి ప్రవేశించాయి. రేడియో సిటీ లక్నో, రేడియో మిర్చి పూనే, విన్ 94.6 ముంబైలో ఆర్భాటంగా మొదలై శ్రోతలను ఆకట్టుకున్నా అప్పటి లైసెన్స్ ఫీజు విధానంవల్ల, నిర్వహణా ఖర్చుల భారం అధికం కావడంవల్లా... 2004లో నష్టాలు భరించలేక నిలిచిపోయాయి. నలభైనగరాల్లో రెండువేల ఎఫ్.ఎం కేంద్రాలనుకోగా కేవలం 14 నగరాల్లో 21 ఎఫ్.ఎం స్టేషన్లు మొదలై కొంతమేరకు నష్టపోయాయి.

అందుకే ప్రభుత్వం గత సంవత్సరం జూలైలో తన విధానాలను కొంత సడలించింది. ఎఫ్.ఎం ప్రైవేట్ రేడియో సర్వీసుల విస్తరణకు ఫేజ్‌టూలో చేపట్టిన చర్యలు మళ్లీ ప్రైవేట్ ఎఫ్.ఎంలకు కొత్త జవాన్నీ, జీవాన్నీ ఇచ్చి – స్థాపించడానికి కొత్త బలాన్ని ఇచ్చాయి. వారి వారి వార్షిక మొత్తం ఆదాయంలో నాలుగుశాతం గానీ లేక ఒకేసారి పదిశాతం చెల్లింపుతో గానీ తొంభై నగరాలలో ప్రైవేట్ ఎఫ్.ఎంలు నెలకొల్పేందుకు ప్రభుత్వం అనుమతించడంతో – రేడియో గాలి ఉత్సాహంగా ఉధృతమూ, వేగవంతమూ అయింది. అయితే ఒక ప్రైవేటుసంస్థ ఒక నగరంలో ఒక చానెల్ మాత్రమే నెలకొల్పాలని మొత్తం చానెళ్లు 15 శాతానికి మించరాదనీ పరిమితి విధించిన ప్రభుత్వం ఎఫ్.ఎం రేడియో ప్రైవేట్ చానెళ్లు వార్తలు, కరెంట్ ఎఫైర్స్ మాత్రం ప్రసారం చేయకూడదనే ఆంక్ష విధించింది. అనుమతించబడిన ప్రతి ఎఫ్.ఎం రేడియో చానల్ వారు కార్యక్రమాల విషయంలో, వాణిజ్యప్రకటనల విషయంలో, ఆల్ ఇండియా రేడియోకు ఉన్న కోడ్‌నే పాటించాల్సి ఉంటుంది. లేదా ఒకవేళ ప్రభుత్వం యోచిస్తున్నట్లుగా త్వరలోనే బ్రాడ్‌కాస్టింగ్ రెగ్యులేటరీ అథారిటీ ఏర్పడినట్లయితే అది నిర్దేశించే నియమ నిబంధనావళికి లోబడి వ్యవహరించవలసి ఉంటుంది.

ఫేజ్.2 సరికొత్త రేడియో ప్యాకేజీ ఎఫ్.ఎం ప్రైవేట్ రేడియోల విస్తరణకు మార్గం సుగమం చేసింది. ఎఫ్‌డీఐకు అంగీకరించి ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్‌కు కూడా కొంత వెసులుబాటు ఏర్పడడంతో గత ఏడాది 1.18 బిలియన్లు నష్టపోయిన ఎఫ్.ఎం రేడియోలవారు ఇప్పుడు ఊపిరి పీల్చుకుని తమ విస్తరణకు సంసిద్ధులయ్యారు. లాభాల బాట మాట ఎలాఉన్నా నష్టపోమన్న ధీమా వారిని ముందుకు నడిపిస్తోంది.

రేడియో పట్ల పెరుగుతున్న యువత మోజు వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తోంది. 'హిందుస్థాన్ టైమ్స్' ఈసరికే తన ముద్రవేసుకుంది. 'రేడియో సిటీ' ఇరవై అయిదు నగరాల్లో తన ఎఫ్.ఎం సర్వీసులను ప్రకటించి హైదరాబాద్‌లో అతి త్వరలో ప్రారంభించడానికి రంగం సిద్ధం చేసింది. ఈ లోగానే 'రేడియో మిర్చి' 'ఇది చాలా హాట్‌గురూ...' అని యువతను ఉత్సాహంతో వేడెక్కిస్తూ 95 మెగాహెడ్జ్‌పై హైదరాబాద్‌లో తన ప్రసారాలను మొదలెట్టింది. బెంగళూరుకు పోటీగా హైదరాబాద్‌ను ప్రాచుర్యంలోకి తెస్తోంది. యాడ్‌లాబ్స్ కూడా హైదరాబాద్‌లో ఎఫ్.ఎంకు రంగం

సిద్ధం చేస్తోంది. దాదాపు 90 నగరాలలో 330 ఫ్రీక్వెన్సీలను ప్రభుత్వం వేలం వేసి తద్వారా ఒక వెయ్యి నూటముప్పైనాలుగుకోట్ల రూపాయల ఆదాయం సమకూర్చుకుందిట.

మన ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నంలో ప్రస్తుతం సన్ టీవీ వారి 'విశాఖ ఎఫ్.ఎం' ఒక్కటే ప్రైవేట్ రంగంలో ప్రసారాలు చేస్తోంది. ఆకాశవాణి వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగం సర్వీస్‌లో సమయాన్ని కొనుగోలుచేసి 'జపా-4', 'గుడీవినింగ్ హైదరాబాద్', 'అంజలి-గీతాంజలి' వంటి ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు కార్యక్రమాలను నడిపారు. 'ఫైర్‌బ్రాండ్' వంటి కార్యక్రమాలు కొన్ని సాగుతున్నాయి.

అయితే పూర్తిస్థాయి ఎఫ్.ఎం ప్రైవేట్ చానళ్లుగా హైదరాబాద్‌లో నాలుగు ప్రముఖంగా రాబోతున్నాయి. రేడియో మిర్చి, రేడియో సిటీ, యాడ్‌లాబ్స్, న్యూ చానెల్ పరస్పరం పోటీపడనున్నాయి. ఒక దానికొకటి పోటీ కాదనుకున్నా ఏ చానల్ యువతను బాగా ఆకట్టుకుంటుంది, వాణిజ్యపరంగా విజయవంతం అవుతుంది అనేది వేచి చూడాల్సిందే.

దేశంలో ప్రస్తుతం నడుస్తున్న 21 ఎఫ్.ఎంలు త్వరలోనే మొత్తం మూడువందల సంఖ్యకు చేరితే పరిస్థితి ఎలా వుంటుందనేది అంత సులభంగా ఊహించలేం.

కబుర్లు, పాటలు తప్ప, గోలగోల సంగీతం తప్ప, ఎఫ్.ఎంల ప్రయోజనం ఏమిటని కొందరు పెదవి విరవచ్చు గానీ, నిజానికి ఈ ప్రైవేట్ ఎఫ్.ఎం.లను కేవలం వినోదం ప్రధానమైనవిగానే కాక అభివృద్ధికరమైన ప్రయోజనాలకు ముఖ్యంగా వ్యవసాయ, విద్య, వైద్య రంగాలలో వాడుకునే వీలుంది. ఇందారాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఇప్పటికే ఎఫ్.ఎం ప్రసారాలను వినియోగిస్తోంది. పూర్తి చానెల్‌గా విస్తరించకున్నా గ్రామీణాభివృద్ధి శాఖ, 'విందాం - చదువుకుందాం' వంటి కార్యక్రమాలతో విద్యాశాఖ తను కార్యక్రమాలను రేడియోలో రూపొందిస్తూనే ఉన్నాయి. అవి తమ ప్రత్యేక పరిధులను విస్తరించుకోవచ్చు.

శాటిలైట్ ఎఫ్.ఎం రేడియోనేకాక కంప్యూటర్‌లో వినగల ఆన్‌లైన్ రేడియో కూడా విస్తరించడం మొదలైంది. ఇంటర్నెట్ రేడియోగా లేదా వెబ్‌రేడియోగా రేడియో బక్వాస్ లైవ్ 24/7 ఆన్‌లైన్ రేడియో నెట్‌వర్క్‌లు ఇప్పటికే రంగంలో ఉన్నాయి.

సమాచార ప్రసార సాంకేతిక విప్లవం నేటి యువతను ఆకర్షించడానికి మరో ముఖ్యకారణం సరికొత్త ఉద్యోగావకాశాలు కూడాను. అందరూ ఇంజనీర్లే కారు, కాలేరు, కానక్కర్లేదు కదా! ఉత్సాహం, ప్రతిభ, దూసుకుపోయే చొరవ, కబుర్లుచెప్పే ఆకర్షణీయమైన దక్షత ఉన్నవాళ్లు ఆర్.జే (రేడియో జాకీ) లుగా ఎఫ్.ఎం ప్రైవేట్ చానళ్లలో ఉద్యోగాలు సంపాదించి పేరుకి పేరూ, డబ్బుకి డబ్బూ సంపాదించుకోగల అవకాశాలున్నాయి. మ్యూజిక్, టాక్‌షోలు, న్యూ చార్ట్‌బూస్టర్స్ డాక్యుమెంటరీలు నిర్వహిస్తూ చౌచౌ బాత్‌లూ, హాట్ ఎయిర్‌లూ, డ్రైవ్‌టైమ్‌లూ, ఫోన్‌ఇన్‌లు నిర్వహిస్తూ రేడియో జాకీలుగా, యాంకర్లుగా పేరుతెచ్చుకోగల అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఆమధ్య డెక్కన్ క్రానికల్ సంస్థ 'గుడ్ ఈవినింగ్ హైదరాబాద్' కోసం ఆడిషన్లు నిర్వహిస్తే వెయ్యిమందికి పైగా రేడియోజాకీలుగా కావడానికి ఉత్సాహపడగా యోగ్యత గల 300 మందిని గుర్తించడం జరిగిందట. రేడియో జాకీలుగా నెలకు పదివేలు సంపాదించడం ఎవరికి మాత్రం నచ్చదు? కొన్ని చానల్స్‌లో ముప్ఫైవేల నుండి డబ్భైవేల దాకా నెలజీతం పొందవచ్చు. కార్యక్రమ నిర్వహణా సామర్థ్యంగల యువత ఏడాదికి ఏడెనిమిది లక్షలు ఇస్తామంటే వున్న ఉద్యోగం నుండి గెంతేయడానికి సిద్ధపడుతున్నారు మరి! ముంబై నేపథ్యపు ఓ ప్రైవేట్ సంస్థ నెలకు 1.5లక్షలు కూడా ఆఫర్ చేసిందట!

ఏమయినా ఎఫ్.ఎం రేడియో చానళ్లు మామూలైన అలవరసలు కాదు... సరికొత్త ఉత్సాహపు తరగలు. సంగీత తరంగాలు! మాటల కెరటాలు! పాటల హోరు! శ్రణానందపు జోరు! రేడియో జాకీలు కావడానికి ఉద్యోగాల కోసం యువత ఈ సరికొత్త కథాకమామీషులో ప్రధానపాత్ర అవుతోంది. ఎఫ్.ఎంను పెంచి, పోషించి, ఆదరించి ఆనందించేది యువతే! ఎఫ్.ఎం రేడియోలదే భవిత!

అయతే పోటాపోటీగా ఈ రేడియో ఛానళ్ళు ఏం చేస్తాయనేది వేచి చూడాల్సిందే. వాతావరణం, స్టాక్‌న్యూస్, లోకల్ ట్రాఫిక్ గురించి మాత్రమేకాక ఎఫ్.ఎం ప్రైవేట్ రేడియో ఛానళ్లలో వార్తలకు అనుమతించాలని ఇటీవలే ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ కమిటీ(ఐసీసీ) కిరణ్ కార్నిక్, శేఖర్‌కపూర్, కునాల దుర్గాబిన్‌ల త్రిసభ్యత్వంలో తీర్మానించింది కూడా! వార్తల మీద ఆకాశవాణి మోనోపలీ పోవాలని ప్రైవేట్ ఎఫ్.ఎంలలో 24 గంటల వార్తలకు వీలు కల్పించాలని వీరి వాదన. ప్రభుత్వం ఏం తీర్మానిస్తుందో అప్పుడే చెప్పలేం.

తాజా: 101.9 మెగాహెడ్జ్‌పై ఆకాశవాణి సరికొత్తగా మొదలెట్టిన ఎఫ్.ఎం. రెయిన్‌బో ఛానల్ హైదరాబాద్‌లో ఇప్పటికే యువతను ఆకర్షించే దిశగా పరుగులు తీస్తోంది 'డయల్-రెయిన్‌బో' పేర ఫోన్‌ఇన్ పాటలు, 'ఎ.ఐ.ఆర్.ఎఫ్.ఎం' పేర ఇ-మెయిల్ ద్వారా శ్రోతలు కోరిన పాటలు ప్రతిరోజూ విన్పిస్తోంది. శని, ఆదివారాల్లో పొద్దున్న ఎనిమిదింటికి 'వేడి వేడిగా', సాయంత్రాల్లో ఆరింటికి 'గరమాగరమ్' సినీ రంగ ప్రముఖులతో భేటీ చేయిస్తోంది. ఉదయం 'మార్నింగ్ రాగా' రాత్రి 9 గంటలకు 'రాత్ బాకీ' సమయోచిత గీతాలతో అలరిస్తూంటే, ఆదివారాల్లో మధ్యాహ్నం పన్నెండింటికి ప్రముఖ ధ్వన్యనుకరణ కళాకారుడు హరికిషన్ ఎస్.ఎం.ఎస్ చేసిన శ్రోతల నెంబర్లకు తానే ఫోన్ చేసి 'నవ్వులే నవ్వులు' సర్ప్రైజ్‌గా పండిస్తున్నాడు. ఆకాశవాణి రొటీన్ బాలానందం స్థానంలో ఆదివారాల్లో మధ్యాహ్నం రెండింటికి నేటితరం పిల్లల కార్యక్రమంగా 'కిడ్స్ డాట్‌కామ్' ఎఫ్.ఎం. రెయిన్‌బో ప్రసారం చేస్తోంది. స్త్రీల కోసం 'పరిణీత' మధ్యాహ్నం ఒంటిగంటకు నవ్య యువతులకనుగుణంగా రూపొందుతోంది.

* * *

సన్ టీవీ వారి "విశాఖ ఎఫ్.ఎం" ఆంధ్రప్రదేశ్‌లో తొలి పూర్తిస్థాయి ప్రైవేట్ ఎఫ్.ఎంగా గత ఏడాదిగా విశాఖపట్టణం శ్రోతలను ఆకట్టుకుంటోంది. విశాఖ సముద్రపు గాలులకు తోడు ఈ సరికొత్త అలవరుసలు విశాఖ శ్రోతలకు ముచ్చటనూ, హాయినీ అందిస్తున్నాయట.

రేడియోజాకీలు కావడానికి ఉత్సాహం, మంచి కంఠస్వరం, సరియైన ఉచ్చారణ ప్రధానమైన పెట్టుబడులు. అబ్బాయిలైనా, అమ్మాయిలైనా మాస్ కమ్యూనికేషన్స్ పాసై, అటువైపు దృష్టిపెడితే రేడియో ద్వారా ధనమే కాదు, వ్యక్తిగత కీర్తి కూడా లభిస్తుంది. ఎంతోకొంత రచనాకౌశలం వుంటే మరీ మంచిది. పాడే నైపుణ్యం వుందా ఇంకా భలే భలేలు!!

* * *

"పోటీకి మాకెప్పుడూ భయం లేదు. ఎందుకంటే ప్రస్తుతం మేమే మాకు పోటీగా వున్నాం. హైదరాబాద్ 'ఎ' ఛానల్, హైదరాబాద్ 'బి'

ఛానల్–మీడియం వేవ్ మీదా, ఎఫ్.ఎం మీద వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగం ఇప్పుడు సరికొత్తగా ఎఫ్.ఎం.మీద 'ఎఫ్.ఎం. రెయిన్‌బో' ఇలాగ ఆకాశవాణికి చెందిన నాలుగు ఛానల్సు శ్రోతలకు కార్యక్రమాలు రూపొందించి అందిస్తున్నాయి. ఎవరి శ్రోతలు వారికి ఎప్పుడూ వున్నారు. హైదరాబాద్ 'ఎ' కార్యక్రమాలు వినే శ్రోతల్లో యువతరమూ వుంది. ఎఫ్.ఎం.రెయిన్‌బో వినే పెద్దతరమూ వుంది" అన్నారు ఓ ఆకాశవాణి అధికారి నవ్వుతూ. నిజమే కదా!

* * *

ప్రైవేట్ కార్యక్రమాలలోని రుచీ, మజా 'జపాఫోర్' చూపించింది. సరికొత్తదనాన్ని విలువల పరిధుల్లోనే అందించవచ్చని ఉన్న కొంతకాలం విన్పించిన రోజువారీ కొద్దిగంటల్లో నిరూపించింది. అయితే పూర్తిస్థాయి ప్రైవేట్ రేడియో ఎఫ్.ఎంగా ఎదగలేదు సరికదా ఆర్థికంగా నష్టపోయి కార్యక్రమ ప్రసారాలు నిలుపుకొంది. మంచి పెట్టుబడి పెట్టే వారెవరైనా ముందుకొస్తే సత్తా నిరూపించుకోగలమంటున్నారు.

* * *

నోకియా వంటి సంస్థలు, సెల్‌ఫోన్‌లో ఎఫ్.ఎం. వినే సౌకర్యాన్ని కల్పించడంవల్ల సెల్‌ఫోన్ల వాడకానికి బాగా అలవాటుపడుతున్న యువత ఎఫ్.ఎం. రేడియో తమ సెల్‌లో వినడానికి ఉత్సాహం చూపుతున్నారు. స్నేహితులతో ముచ్చటిస్తూ, బైక్‌లమీద వెడుతూ, హొటళ్లలో, పిజ్జాకార్నర్స్‌లో, పబ్‌లలో, ఆఖరికి థియేటర్లలో కూడా మ్యూజిక్ ట్యూన్ చేసి వింటున్నారు అని పట్టణాల్లో జరిపిన సర్వే తెలుపుతోంది.

* * *

**ముక్తాయింపు :**

కళ్లు, చెవులు, మెదడూ మూడూ అప్పచెప్పి 'ఇడియట్ బాక్స్' అనబడే టీవీల ముందు ప్రైవేట్ టీవీ ఛానెళ్లు డ్రాయింగ్ రూంకూ, బెడ్‌రూంకూ తేడా లేకుండా చేస్తున్న ఈ కాలాన, యువత ఆ విధంగా చెడిపోవడం కన్నా కేవలం చెవులతో విని

ఆనందిస్తూ, ఆలోచనకు అవకాశం ఉంచే ప్రైవేట్ ఎఫ్.ఎం రేడియోల ఆగమనం, విస్తరణ ఏ మాత్రం హానికరం కాదనీ, ప్రయోజనదాయకమేననీ పెద్దలు కూడా ఒప్పుకుంటున్నారు. అంచేత పట్టణాల్లో విస్తరిస్తున్న ఈ ఎఫ్.ఎం, సంస్కృతి పల్లెలకు కూడా – అక్కడి స్వచ్ఛతనూ, సంతోషాన్నీ ఇనుమడింపజేసేలా విస్తరించగలిగితే మేలే కలుగుతుంది.

నీలి మేఘాలలో గాలి కెరటాలలో
నీవు పాడేపాట వినిపించు నే వేళ....

అంటూ అందుకోజాలిన ఆనందంగా, దూరం కాకుండా చేరువై, అలా ఆత్మీయంగా రేడియో మానవజీవన వికాసంలో యువతరాలకు, నవతరాలకు కూడా ప్రభావోపేతం కాగలదని ఆశిద్దాం, ఆకాంక్షిద్దాం. ✻

**(ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం 30 ఏప్రిల్'2006)**

# 22 పదాల పదనిసలు

**బ**స్సులోనో, రైల్లోనో ప్రయాణం చేస్తుంటారు. చదివే అలవాటున్న వాళ్లు ఏ దినపత్రికో, వారపత్రికో చదువుతుంటారు. చదవడం కంటే కాలక్షేపానికీ, సరదాకీ, కాస్త మెదడు ఆలోచనకీ పనికొచ్చేదేమైనా ఉందేమో అని ఆ పత్రికలోకి తొంగిచూస్తే సాధారణంగా చప్పున కనిపించేది మాటలకోట లాంటి గళ్లనుడికట్టే. లేదా ఇప్పుడిప్పుడు కొంతకాలంగా చోటుచేసుకుంటున్న అంకెల క్రీడ సుడోకు. గళ్లనుడికట్టు వైపు ఎక్కువ మంది పాఠకులు ఆకర్షితులు కావడానికి కారణం– ఇచ్చిన ఆధారాలతో ఆ పదాలను కనుక్కుంటూ అడ్డగళ్లు, నిలువు గళ్లూ అక్షరాలతో నింపుతూ, తద్వారా తమ భాషా పరిజ్ఞానాన్ని, పద సంపదనూ, ఒక  పదానికి అది కనుక్కునేందుకు పజిల్‌నిర్మాత రకరకాలుగా ఇచ్చే ఆధారాల నుండి ఒక ఆలోచననూ, ఆనందాన్ని పొందడానికి దోహదపడడమే.

శ్రీశ్రీ ప్రస్థాన త్రయం ఆవిష్కరణ సభ జూబ్లీ హాల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సభా ప్రారంభానికి ఇంకా సమయముంది. ప్రముఖ కథారచయిత కాళీపట్నం రామారావు గారిని పలకరించితే "సుధామ... మీరు నాకు బాగు గుర్తే! మీ పజిల్స్ నింపుతుంటాను. ఈ ముదిమి వయసులో మెదడును చురుగ్గా ఉంచడానికి అవెంతో పనికొస్తాయి." అన్నారు. అలాగే ఓ సభలో కొన్నాళ్ళ క్రితం చేకూరి రామారావుగారు ప్రముఖ సాహిత్య విమర్శకులు పలకరిస్తూ "గళ్లు ఇచ్చేటప్పుడు నిలువు గళ్లలో పదాలు నింపేందుకు విధిగా ఒక అడ్డం గడిలో అక్షరం కూడా ఉండేలా నిర్మాణం చేస్తూ ఆధారాలు ఇవ్వండి. కేవలం అడ్డానికో, నిలువుకో మాత్రమే ఉండేవి సరికాదేమో!" అని సూచించారు. ఇలా గళ్లనుడికట్టలు నింపేవారిలో ఆసక్తి, శ్రద్ధ కనబరిచే సాహితీదిగ్దంతుల నుండి సామాన్యపాఠకుల వరకు ఉండడమే ఈ పజిల్స్ ప్రాచుర్యానికి నిదర్శనం. పదవినోదం, పదరంగం, పదచదరంగం, పదరసం, పదశోధన, పదబంధం, పదనిసలు, సండే పజిల్, మాటలకొలువు, పదమవ్యూహం, పజిలింగ్ పజిల్, పదక్రీడ, పదవిన్యాసం, పదప్రజ్ఞ, పదగారడి, పదకేళి ఇలా పేరు ఏదయితేనేం

వివిధ దిన, వార, మాస పత్రికల్లో ఇంగ్లీషులో క్రాస్‌వర్డ్ పజిల్స్ అని పిలుచుకునే ఈ గళ్లనుడికట్టులు నేటికీ దర్శనమిస్తున్నాయి. సరదాగా నింపి సమాధానాలు సరిచూసుకునేలాంటివి కొన్నయితే, నింపిపంపితే సరియైన సమాధానాలు రాసిన వారి పేర్లు ప్రచురించేవి కొన్ని, నింపి పంపినందుకు పుస్తకాలనో, విలువైన నగదు బహుమతులనో ఇచ్చేవి మరికొన్ని. ఇలా వివిధ పత్రికలు ఈ గళ్లనుడికట్టులను నిర్వహిస్తున్నాయి.

మన తెలుగులో ఆరుద్రగారే తొలుత గళ్లనుడికట్లు నిర్మించారనీ, అయితే శ్రీశ్రీ 'పదబంధ ప్రహేళిక' పేరుతో దానిని ప్రాచుర్యంలోకి తెచ్చారని అంటారు. ప్రాచీన ప్రబంధాల్లో బంధకవిత్వం, చిత్రకవిత్వం పేర ఇలా ఒక ఆకృతిలో అర్థవంతమైన అక్షర సముదాయాన్ని కూర్చడం ఉంది. అయితే ఈ క్రాస్‌వర్డ్ పజిల్స్ తరహా మాత్రం ఇలా ఒక నిర్దుష్ట చదరపు ఆకారపు గళ్లతో నిర్మితమై వచ్చింది మాత్రం ఆంగ్లం నుండే.

**క్రాస్‌వర్డ్ పజిల్ పుట్టిందిలా...**

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పదక్రీడ ఈ క్రాస్‌వర్డ్ పజిల్. మొట్టమొదట 19 వ శతాబ్దిలో ఇంగ్లాండులో తొలిసారిగా రూపుదాల్చింది. అడ్డంగానూ, నిలువుగానూ గళ్లలో అక్షరాలు నింపుతూ పదాలను నింపడం ఈ క్రీడలో ప్రధానం. ఆ పదాలు కనుక్కోడానికి ఆధారాలు ఇవ్వబడతాయి. యూ.ఎస్‌లో ఇది పెద్దల కాలక్షేపానికి ప్రధానమైందిగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. లివర్‌పుల్ వాసి అయిన ఒక జర్నలిస్టు ఆర్థర్ వ్విన్నె దీనికి ఆద్యునిగా గుర్తింపబడ్డారు. 21 డిసెంబర్ 1913 లో 'న్యూయార్క్ వరల్డ్' దినపత్రిక ఆదివారం సంచికలో తొలిసారి క్రాస్‌వర్డ్ పజిల్ వచ్చింది. అప్పుడు ఇప్పటి నలుచదరపు ఆకారంలో లేదు. డైమండ్ ఆకారంలో మొదటి క్రాస్‌వర్డ్ పజిల్ వచ్చింది. అంతేకాదు! లోపల ఎక్కడా నల్లగళ్లు లేవు అందులో. వారాంతపు పజిల్‌గా కామిక్ సెక్షన్‌లో వ్విన్నె దానిని ప్రకటించడంతో విపరీతమైన స్పందన వచ్చింది. 1914 లో పాఠకులు కూడా అలా పజిల్ నిర్మించి పంపడం మొదలు పెట్టారు. వ్విన్నె వాటిని కూడా వినియోగించేవాడట. అయితే కూర్పులో అచ్చుతప్పులు (గళ్లల్లోనూ, ఆధారాల్లోనూ ఇప్పుడూ తారట్లాడుతూనే ఉంటాయి) విపరీతమవడంతో క్రాస్‌వర్డ్ పజిల్ ఆపేస్తే పాఠకులు నానా గోల చేసి

తిరిగి ప్రారంభమయ్యేలా చూశారట. 1920 లో ప్రస్తుతం పత్రికల్లో వస్తున్న చదరపు పద్ధతి నిర్మాణం మొదలై దాదాపు అమెరికన్ న్యూస్‌పేపర్లన్నీ క్రాస్‌వరల్డ్ పజిల్ ప్రచురిస్తూ సాగాయి. ఆ తరువాత పదేళ్ళకు అట్లాంటిక్, యూరప్ దేశాలకు ఈ అక్షర క్రీడ వ్యాపించింది. బ్రిటీష్ పత్రికల్లో తొలిసారి 'పియర్సన్స్' మ్యాగజైన్‌లో 1922 ఫిబ్రవరిలో, 1930 ఫిబ్రవరి 1 న 'టైమ్స్' మ్యాగజైన్‌లో క్రాస్‌వర్డ్ పజిల్ సాక్షాత్కరించింది. అమెరికన్‌పజిల్స్ కన్నా బ్రిటిష్ క్రాస్‌వర్డ్ పజిల్స్ తమదైన ముద్రతో మెదడుకి నిజంగా ఒక మేతగా ఉండసాగాయి. మార్మికమైన, గూఢార్ధభరితమైన గళ్లనుడికట్టులను ఎ.ఎఫ్.రిట్చి, డి.ఎస్.మాక్‌నట్ట్ ఆధారాలు ఇవ్వడంలో ఒక గజిబిజి తనాన్ని, చమత్కారాన్ని పాటిస్తూ ఒక స్థాయి కల్పించారు.

**ఎలా చేస్తారు?**

చదరం, దీర్ఘచతురస్రాకారంలో- తెల్లని మరియు నల్లని గడులతో ఉండే దీంట్లో గళ్లను అక్షరాలతో నింపుతూ, పదాలను లేదా వాక్యాన్ని కనుక్కోవాలి. ఆధారాలను బట్టి సమాధానాలు సాధించాలి. అడ్డంగానూ, నిలువుగానూ ఈ అక్షరాలు గళ్లలో నింపడం ఉంటుంది. ఒక్కోసారి కుడినుండి ఎడమకు, కిందినుండి పైకి చదువుకునేలాగానూ నింపడానికి ఆధారాలు ఇస్తుంటారు. పదం ప్రారంభమయ్యే గడిలో సంఖ్యను చూపించడం జరుగుతుంది. నాలుగు అడ్డం, పద్దెనిమిది నిలువు అన్నట్లుగా సంఖ్యతో మొదలయ్యే పదాలు కనుగొనే ఆధారాలు ఇస్తారు. అసలు మజా అంతా ఆధారాలలోనే ఉంటుంది. ఆ ఆధారాలను మెదడుకు మేత పెడుతూ సరిగ్గా అర్థం చేసుకుని పట్టుకోగలిగితే నింపడం అలవోకగానే అనిపిస్తుంది. ఒక పదానికి గల నానార్థాలు, పర్యాయపదాలు, సామెతలు, జాతీయాలు, నుడులు, సాహిత్యపరిజ్ఞానం, వర్తమానఅంశాల అవగాహన ఇలా అన్నీ అవసరం పడుతుంటాయి. ఆయా క్రాస్‌వర్డ్ పజిల్స్ రూపొందిన విధానం బట్టి. ఆధారం చివర మొత్తం పదంలోని అక్షరాల సంఖ్యను బ్రాకెట్లలో ఇవ్వడం జరుగుతుంది. ఒక్కొక్కసారి ఆ సంఖ్య సూచించని పదబంధ ప్రహేళికలూ ఉంటాయి. ఒక వేళ వాక్యం కనుక్కోవాల్సి వస్తే ఆ వాక్యంలో ఎన్ని పదాలు ఉంటాయనే సూచన కూడా ఇస్తారు. ఈ గళ్లనుడికట్టులలో తేలికవీ, కొంచెం కష్టమైనవీ, అతిగా బుర్రకు శ్రమ కలిగించాల్సినవీ కూడా ఉంటాయి. 7x7, 9x9 గళ్లవి ఎక్కువగా తెలుగు పత్రికల్లో ముఖ్యంగా దిన, వార పత్రికల్లో చూస్తాం.

8 గళ్లవీ, 10 గళ్లవీ, 12 గళ్లవీ ఉంటాయి. అలాగే ఆంగ్లపత్రికల్లో 15x15, 21x21, 23x23, 25x25 గళ్లతో ఉండేవీ వస్తుంటాయి. మాసపత్రికల్లో పన్నెండు గళ్లు–అడ్డం ప్లస్ నిలువుగా ఉండేవి, అడ్డం 17, నిలువు 9గా పజిల్ 'రచన'గా ఉండేవి ఉన్నాయి. అలాగే పిల్లల కోసం కొన్ని పత్రికల్లో అయిదు గళ్ల పజిల్స్ రూపొందించబడ్డాయి.

**ఎన్ని రకాలో...**

ఇక ఈ క్రాస్‌వర్డ్ పజిల్స్‌లో ప్రత్యేకం భాషా సంబంధంగానూ, భక్తి, సంస్కృతి సంబంధంగానూ ఇలా ప్రత్యేకించి రూపొందించబడి ఇచ్చే పదబంధాలూ ఉంటుంటాయి. సినిమామాధ్యమం ఇవాళ చాలా ప్రభావోపేతమైనది కాబట్టి సినీ పదరంగం అంటూ ప్రత్యేకించి పత్రికలు సినిమా గళ్లనుడికట్టులు కూడా ఇవ్వడం జరుగుతుంటుంది. 'సితార', 'సంతోషం' వంటి సినిమా పత్రికల్లో గతంలో ఇలాంటి సినిమా పజిల్స్ సుధామ ఇచ్చినవే ఎన్నో ఉన్నాయి.

**విదేశాల్లోనూ ఉన్నాయ్...**

వాషింగ్టన్ పోస్ట్, ది యు.ఎస్.ఎ.టుడే, న్యూయార్క్ టైమ్స్, ది హెరిటేజ్ న్యూస్‌పేపర్ వంటి అమెరికన్ పత్రికలే కాదు– హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి పత్రికలూ క్రాస్‌వర్డ్ పజిల్స్ ఇస్తున్నాయి. తెలుగు దినపత్రికలో రోజువారీగా ప్రస్తుతం ఆంధ్రప్రభ దినపత్రికలో సుధామ, ఆంధ్రభూమి దిన పత్రికలలో పెద్దిభొట్ల సుబ్బరామయ్య పదనిసలు, పదకేళి నిర్వహిస్తూనే ఉన్నారు. ఎడ్యుకేషనల్ క్రాస్‌వర్డ్ పజిల్స్ విదేశాల్లో ప్రాముఖ్యంగా ఉన్నాయి. భాష, కెమిస్ట్రీ, బైబిల్ ఆధారంగా క్రాస్‌వర్డ్ పజిల్స్ ఇప్పటికీ అక్కడ సాగుతున్నాయి. తేలికగా, సులభంగా, కష్టంగా, కష్టతరంగా ఎలా ఉన్నా వీటిని నింపే వ్యసనానికి ప్రపంచవ్యాప్తంగా ఎందరో లోనయ్యారు. వీటిని నింపడంలో ఆనందాన్ని, పూర్తి చేయగానే ఒక గొప్ప ఆత్మవిశ్వాసాన్నీ, ధీమానీ పొందుతుంటారు.

రెండవ ప్రపంచయుద్ధం సమయంలో 1944 లో 'ది డైలీ టెలిగ్రాఫ్'లో వస్తున్న క్రాస్‌వర్డ్ పజిల్స్ మిలిటరీ ఆపరేషన్స్‌కు చెందిన రహస్యాలను బహిర్గతం చేస్తున్నాయని రక్షణ అధికారులకు అనుమానం కలిగింది. 1944 మే 2 వ తేదీ ఉటా అనే లాండింగ్ స్థావరం పేరు, అలాగే కృత్రిమ ఓడరేవుల పేర్లు, జూన్ 2 వ నెఫ్ట్యూన్ అనే నేషనల్ ఆపరేషనల్ ప్లాన్ పేరు వచ్చింది. ఆ క్రాస్‌వర్డ్ పజిల్‌ను

ఇచ్చింది 'లియొనార్డ్ డావె' అనే స్కూల్ టీచర్. అతన్ని అనుమానించి అరెస్ట్ చేశారు. 1984 లో 'ది డైలీ టెలిగ్రాఫ్' పత్రిక క్రాస్‌వర్డ్‌పజిల్స్ ఎడిటర్ ఆర్మీక్యాంపుల్లోని కబుర్ల నుండి ఆ టీచర్ ఒక స్టూడెంట్ చెప్పిన పదాలను వినియోగించడం వల్ల ఈ గందరగోళం ఏర్పడిందని తెలిసింది.

క్రాస్‌వర్డ్ పజిల్స్ నింపే వ్యసనంలో పడి పనులు కూడా మందగిస్తున్నాయని బ్రిటన్‌లో ఒక సందర్భంలో వీటిమీద నిషేధం కూడా విధించారట. ఆ తరువాతనే పనివేళల్లో విశ్రాంతి సమయాన్ని విభజించి అనుమతించారట. గిన్నిస్ బుక్ రికార్డుల ప్రకారం రోగర్ స్క్వియిర్స్ అత్యధిక క్రాస్‌వర్డ్ పజిల్స్ తయారుచేసిన వ్యక్తిగా 15 మే 2007 న నమోదయ్యాడు. ది టైమ్స్, ది డైలీ టెలిగ్రాఫ్, ది గార్డియన్, ఫైనాన్షియల్ టైమ్స్, ది ఇండిపెండెంట్ మొదలైన పత్రికల్లో గళ్లనుడికట్టులు ఇచ్చిన అతను 14 మే 2007 నాటికి మొత్తం అరవైఆరువేల ఆరువందల అరవైఆరు పజిల్స్ రెండు మిలియన్ల ఆధారాలతో ఇచ్చాడట. గళ్లనుడికట్టులో యాభైఎనిమిది అక్షరాల పదం ఇచ్చిన పజిల్ నిర్మాత కూడా తానే!

ఇటలీ, జపాన్, ఫ్రాన్స్, పోలెండ్, హిబ్రూ మొదలైన అనేక భాషల్లో క్రాస్‌వర్డ్ పజిల్స్ దూసుకువెడుతున్నాయి.

**మన రాష్ట్రాల్లో...**

ఇక మనదేశంలోనూ వివిధ భాషా పత్రికల్లో ఈ పదబంధ ప్రహేళికలు వస్తున్నాయి. మన దేశానికి చెంది ఎ.ఎన్.ప్రహ్లాదరావ్ అనే బెంగళూరు వాసి కన్నడ భాషలో ఇప్పటికీ ఇరవై మూడువేల గళ్లనుడికట్టులు చేశాడట. వాటిలో ఆరువేలు సినిమాలకు సంబంధించి రూపొందించినవి. ప్రహ్లాదరావు మూడు దిన పత్రికలకూ, ఇరవై నాలుగు వివిధ మ్యాగజైన్లకూ తయారు చేసిన ఈ ప్రహేళికలకై ఆరులక్షల ఇరవై వేల ఆధారాలు ఇచ్చినవాడయ్యాడు. ఇక బెంగాలీలో కూడా బ్రిటీష్ నుడికట్టు పద్ధతిలో పదచదరంగాలు రూపొందించి ప్రకటిస్తున్నారు. అయితే బెంగాలీ గళ్లనుడికట్టుల్లో రెండక్షరాల పదాలను ఇప్పుడు పరిహరించారట! నిజంగా అదో విశేషమే!

**అంకెల పజిల్**

గణితంలో లాటిన్ స్క్వేర్ మూలంగా లియాన్ హార్డ్ ఈలర్ అనే గణితశాస్త్రవేత్త 1780 లో అంకెలను వరుసగళ్లతో ఒకసారి వచ్చిన అంకె మరొకసారి రాకుండా

ఒకటి నుండి తొమ్మిది వరకు వచ్చే పద్ధతి పజిల్ కనుక్కున్నాడు. డెల్ పత్రికలు వీటిని అందిపుచ్చుకున్నాయి. అమెరికాలో కనుక్కున్నా, జపాన్‌లో వేనీగౌల్డ్ అనే హాంగ్‌కాంగ్ రిటైర్డ్ జడ్జి–టోకియో బుక్ స్టోర్‌లో 1997లో వీటిని ప్రవేశపెట్టాడు. అంకెలు ఒంటరిగా జత కట్టకుండా ఉండడం అనే అర్థంలో Sujji wa dokushin ni karigu అనే జపనీస్ పదం కుదింపబడి 'సుడోకు'గా ఇవాళ ప్రపంచ వ్యాప్తమైన అంకెల క్రీడగా ప్రాచుర్యం చెందింది. బ్రిటీష్ న్యూస్‌పేపర్ 'ది టైమ్స్' 12 నవంబర్ 2004 లో తొలిసారి 'సుడోకు' ప్రచురించింది. యూ.ఎస్‌కు ఆ తర్వాత పరివ్యాప్తమై ఇవాళ ప్రపంచ ప్రసిద్ధమైంది. 9x9 గళ్లల్లో, తొమ్మిది 3x3 అనుబంధిత గళ్లలో ఒకటి నుండి తొమ్మిది వరకు వేసిన అంకె వేయకుండా గళ్లలో ముందే ఇచ్చిన అంకెను మార్చకుండా నింపే ఆ పద్ధతి ఇవాళ ఓ పెద్ద క్రేజ్! వాటికి పోటీలు, బహుమతులు కూడాను. ఏ గడికి ఆ గడి– కచ్చితమైన నియమిత అంకెతోనే సుడోకు రూపొందుతుంది. 9x9 గళ్లలో పూర్తి చేయదగిన సుడోకు కాంబినేషన్స్ ఎన్ని ఉండడానికి అవకాశం ఉందంటే 6,670, 91,752,021,072,936,960 రకాలుగా ఇవ్వవచ్చు నన్నమాట.

అయితే భారతదేశం ప్రపంచానికి కానుక ఇచ్చిన సున్న '0' సుడోకులో లేదు. ఈ అంకెలక్రీడ కన్నా భాషా, సాహిత్యాలు, ప్రపంచ పరిజ్ఞానం, కాలక్షేపానికి కాలక్షేపం, మెదడుకు చురుకు, హృదయానికి ఆనందం కలిగించే గళ్ల నుడికట్టుల వల్లనే ఎక్కువ లాభం వుంటుందంటున్నారు. ఈ తరం పిల్లలకు మన భాషా, సాహిత్య సంస్కృతుల పట్ల అభిరుచి పెరగడానికి పదబంధ ప్రహేళికలే ఎక్కువ ఉపకరిస్తాయనీ, అందువల్ల 'సుడోకు'కు బదులు అన్ని పత్రికలు క్రాస్‌వర్డ్ పజిల్స్‌ను ప్రోత్సహించడమే సబబనీ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఇవాళ ఇంటర్నెట్‌లో కూడా క్రాస్‌వర్డ్ పజిల్స్ చోటు చేసుకుంటున్నాయి. థింక్స్ డాట్ కామ్, క్రాస్‌వర్డ్ సైట్, పజిల్ ఎక్స్‌ప్రెస్, డైలీ కోడెడ్ క్రాస్‌వర్డ్ వంటి సైట్లు ఉన్నాయి. 1997లో క్రాస్‌వర్డ్ వీవర్ పేర కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం అభివృద్ధి పరిచారు. తొలుత 'వర్డ్‌క్రాస్' పేరిట మొదలైన ఈ గళ్ల నుడికట్టును 1924 లో సైమన్, స్కూస్టర్ వారు పుస్తక రూపంలో ప్రచురించారు. గళ్లనుడికట్టు పుస్తకాలు ఇప్పుడిప్పుడు మన దగ్గరా విస్తృతంగా రావడం మొదలైంది.

**మన పెద్దలు... పదబంధాలు..**

తెలుగులో ఆరుద్ర, శ్రీశ్రీ పదబంధప్రహేళికల పట్ల పాఠకులకు ఆసక్తిని పెంచారు. ఆధారాలు ఇవ్వడంలో శ్రీశ్రీ, ఆరుద్రలు చేసిన జిమ్మిక్కులు అన్నీ ఇన్నీ కావు. భాషాచమత్కారాలతో, రెండర్థాలతో, పదంలోనే సమాధానం దాగి ఉండే రీతిలో, నానార్థాలు, సామెతలు, ప్రాచీన ప్రబంధ, సాహిత్యాది అంశాల పరిచితి వల్ల సాధించగలిగే రీతిలో వారు పజిల్స్ నిర్మించేవారు. "పిల్లి లేని పినతల్లి వికారంతో కూడితే గరుత్మంతుడి తల్లి" అని వినత అనే పదానికి, 'కత్తిలో తోక' అంటే 'కరవాలము'లో వాలము అని రాయడం. ఇలా వారు ఆరంభించిన చమత్కార వైఖరులను ఆపై ఎందరో అందిపుచ్చుకుని అభివృద్ధిపరిచారు.

తెలుగులో ఇప్పటికీ అత్యధిక పదబంధ ప్రహేళికలను కూర్చింది ఎవరంటే కచ్చితంగా చెప్పడం కష్టం! కానీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సుధామ, నిశాపతి, అదృష్టదీపక్, ఎన్.సురేంద్ర, ఘంటసాల నిర్మల, వాడ్రేవు ఉమాశంకర్, బాలు, వాణిశ్రీ, కావూరి వెంకట సుబ్బారావు, హుమాయూన్ సంఘీర్, జి.శుభాకరరావు, కె.బి.గోపాలం, ప్రదీప్, గొరుసు, వెలివల సాంబశివరావు ఇలా ఎందరెందరో- కొన్ని పత్రికల్లో తమపేరు పేర్కొనకుండా కూడా మరెందరో ఈ గళ్లనుడికట్టులను నిర్మిస్తున్నారు. ఆంధ్రభూమి దినపత్రిక, నవ్య వార పత్రికల్లో పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ఆంధ్రప్రభ దినపత్రిక, వార్త(ఆదివారం), ఆంధ్రభూమి, రచన మాసపత్రికల్లో సుధామ ఆ తర్వాత నిశాపతి అంతకుముందు యామినీ సరస్వతిగారు అత్యధిక సంఖ్యలో అంటే వేలాదిగా పదబంధ ప్రహేళికలను రూపొందించిన వారుగా చెప్పుకోవచ్చు. పెన్నా శివరామకృష్ణ వంటి కవులు, మణికుమారి, నిర్మల, నీరజ కూడా పదబంధాలు తయారు చేసారు. గతంలో గళ్ల నుడికట్టులు నిర్మించినవారు ఈ వ్యాసకర్త దృష్టిలోకి రాని వారెందరో ఉండి ఉంటారు. అలాగే పత్రికల్లో కాక వినోదాలు, వేడుకల కోసం, గేమ్‌షోల కోసం ఈ గళ్లనుడికట్టు పదక్రీడలు రూపొందించి అలరించేవారూ ఎందరో!

**ప్రయోజనాలెన్నో**

ఏమయినా ఈ గళ్లనుడికట్టు పదబంధ క్రీడలు మన భాషను, పదసంపదను పరిరక్షించుకోవడానికీ, పాఠకులలో పరివ్యాప్తం చేయడానికీ అలాగే మన సంస్కృతీ

సంప్రదాయాలలోని, ఆచార వ్యవహారాలలోని, జానపద మధురిమల్లోని విషయగత పదబంధాలను నిక్షిప్తపరుచుకోవడానికీ, వర్తమాన సామాజిక, రాజకీయ, చలనచిత్రాది అంశాలతో నిరంతరం సంబంధం కలిగిఉండేందుకూ ఎంతగానో ఉపకరిస్తాయి.

మెదడుకు మేతగా అన్ని వయస్సులవారికీ ఉపయోగపడే శీర్షికగా పదబంధ ప్రహేళికలు అన్ని పత్రికల్లోనూ రాణిస్తాయి. ఎన్ని రకాల కొత్తకొత్త పజిల్స్ వచ్చినా నిర్మాణపరంగా పజిల్స్ అన్నింటిలోనూ మకుటాయమానమైనది క్రాస్‌వర్డ్ పజిల్ అనే పదబంధ ప్రహేళికే. గళ్లనుడికట్టుపై పట్టు సాధించిన పాఠకుడికి కలిగే ఆనందం, విజయానుభవం వర్ణనాతీతాలు. ఈ సందర్భంగా వీటిని రూపొందించే స్రష్టలకు, సమాధానాలిస్తున్న పాఠకశ్రేష్ఠులకూ స్నేహాభినందనలు. ✻

**(ప్రజాశక్తి దినపత్రిక–స్నేహ ఆదివారం అనుబంధం 8 ఆగస్టు' 2010)**

# (23) కూచిపూడి కమనీయత

**డ్యాన్స్** అనగానే మనకు, అంటే తెలుగువాళ్ళకు ప్రధానంగా గుర్తుకొచ్చేవి రెండే. భరతనాట్యం, కూచిపూడి. నిజానికి భరతనాట్యానికి తమిళనాడు ప్రధానకేంద్రమైంది. కూచిపూడి మన ఆంధ్రదేశానిది.

అసలు శాస్త్రీయ నృత్యకళ రెండురకాలుగా ప్రచారంలోకి వచ్చింది. ఒకటి లాస్యనర్తనము, రెండవది తాండవనర్తనము. డ్యాన్స్ అన్నదానికి అసలు సిసలుగా అర్థం 'నర్తనము' అనే.

స్త్రీలచే ప్రదర్శింపబడేది లాస్యనర్తనం. దీనినే 'నట్టువమేళ' అంటారు. స్త్రీలు చేసేది కనుక సహజంగానే సుందరం, సుకుమారం, కోమలం, లలితం అయిన హస్తపాద విన్యాసాలతో, హావభావాలతో ఉంటుంది. ఈ నర్తనరీతి కైశికీవృత్తి ప్రాధాన్యత కలిగి ఉంటుంది. అంటే శృంగారరసమే ప్రధానం అన్నమాట.

పురుషులచే ప్రదర్శింపబడేది తాండవనర్తనం. దీనిని 'నాట్యమేళ' అంటారు. ఆరభటీ వృత్తి ప్రాధాన్యంగా వీర, రౌద్ర, బీభత్స భయానకరసాలు పోషిస్తూ చేసే నర్తనం అన్నమాట. అయితే ఈ రోజుల్లో స్త్రీ, పురుషులు సమానంగా అన్నింటినీ ప్రదర్శించేస్తున్నారు. ఈ రెండు సంప్రదాయాలకు భరతుని నాట్యశాస్త్రం మూలాధారం.

'మా అమ్మాయి డ్యాన్స్ నేర్చుకుని ఆరంగేట్రం కూడా చేసిందండీ' అనే మాట మనం వింటూంటాం! అంటే అలా అనేవారి అభిప్రాయం ప్రకారం ఆ అమ్మాయి నాట్యంలో నిష్ణాతురాలు అయిందని. ఆరంగేట్రం అయిందంటే డ్యాన్స్ పరిపూర్ణమైపోయిందని కాదు. నిజానికి అసలు సాధన అక్కడనుండే మొదలు కావాలి.

సాధారణంగా అమ్మాయిలకు చిన్నప్పుడు డ్యాన్స్ నేర్పించడం, కాళ్ళకు గజ్జె కట్టించి ప్రదర్శనలిప్పించడం, ఆ తరువాత అమ్మాయికి పెళ్ళి చేసేయడం. అక్కడితో ఆమె డ్యాన్స్‌కు పునిస్టాప్ పెట్టేస్తుంది. భరతనాట్యం నేర్చిందే అయినా 'భర్త' నాట్యానికి – అంటే ఆ భర్తకు అనుగుణంగా నర్తించేదిగా మారిపోతూంటుంది.

'ఆరంగేట్రం' అనేది తమిళం నుండి వచ్చిందే. 'ఆరంగ' అంటే వేదిక: – RAISED STAGE. 'ఎట్రం' అంటే ఎక్కడం, CLIMBING. రంగప్రవేశం అని

కన్నడిగలు అంటూంటారు. పాతమైసూరు రాష్ట్రంలో గజ్జెపూజ అని వ్యవహరించేవారు. డ్యాన్స్ నేర్చుకున్నా నిష్ణాతులయ్యాకే మువ్వలపూజ చేసి కాలికి గజ్జెకట్టేవారు. అంతవరకూ గజ్జె కట్టకూడదు ఆ రోజుల్లో.

పది పన్నెండు సంవత్సరాలు గురువు సన్నిధానంలో డ్యాన్స్ నేర్చుకున్నాక, తాను నేర్పినది శిష్యుడు గ్రహించి ప్రతిభ సంపాదించినట్లుగా గురువు భావించాకనే – శిష్యునిచేత గురువు జనం సమక్షంలో చేయించే నృత్య ప్రదర్శన– 'ఆరంగేట్రం'.

ఆరంగేట్రం గురువు జ్ఞానానికీ, శిష్యుని ప్రతిభకీ ఇద్దరికీ పరీక్ష వంటిదే. తమిళ ప్రాచీన గ్రంథమైన 'శిలప్పదిగారం'లో పన్నెండు సంవత్సరాల వయసుగల 'మాధవి'చేత గురువు చేయించిన ప్రదర్శనగా 'ఆరంగేట్రం' అనే పదం వాడబడింది. భరతనాట్యం సంబంధిగానే కాక తొలుత వేదిక ఎక్కి చేసే ప్రదర్శనగా 'ఆరంగేట్రం' అనే మాట ప్రసిద్ధమైంది.

ఆరంగేట్రం రెండు భాగాలు.

మొదటి భాగంలో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, శబ్దం, వర్ణం ఉండగా, రెండవభాగంలో పదం, అష్టపది లేదా దేవరనామ, తిల్లాన, మంగళం–గురువు మార్గదర్శకంలో జనం ముందు శిష్యులు చేసే నర్తనంలో ఉంటాయి. శ్రద్ధ, పట్టుదల, దీక్షతో నేర్చుకున్నాకే ఆరంగేట్రం చేసే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం ఆరంగేట్రంలో అలరిపు, జతిస్వరం, శబ్దం, వర్ణం, తిల్లానలతో ప్రదర్శన చేసేస్తున్నవారూ ఉన్నారు. నటరాజు సమక్షంలో గురువుగారి సహకారంతో జనం మెప్పు పొందేటట్లుగా ప్రతిభానృత్య ప్రదర్శనకు అంకురార్పణమే – 'ఆరంగేట్రం'

డ్యాన్స్ అంటే చాలామందికి వ్యక్తిగత నృత్య ప్రదర్శనం అనే భావనే. భరతనాట్యం అంటే సోలో ప్రదర్శనగా ఎలా చేస్తారో, కూచిపూడి నృత్యాన్ని కూడా అలానే చేస్తూంటారు.

నిజానికి కూచిపూడి నాట్యపద్ధతి సాంప్రదాయికంగా భిన్నమైనదే. 1950 లో కేంద్ర సంగీత నాటక అకాడమీ నాలుగు నాట్య రూపాలకే అధికారముద్ర వేసింది. భరతనాట్యం, కథాకళి, కథక్, మణిపురి. వీటిలో చివరి మూడు ఇటీవల పునరుజ్జీవనం పొందినవే. 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాకనే కూచిపూడికి క్రమంగా ప్రాచుర్యం పెరుగుతూవచ్చింది. విద్వాంసులు, పండితులు, కళారాధకులు ఎందరో చేసిన కృషి వల్ల ఈనాడు అంతర్జాతీయంగా కూడా ఎంతో ప్రాముఖ్యం సంతరించుకుంది కూచిపూడి నాట్యం.

కూచిపూడి కృష్ణాజిల్లా దివితాలూకాలో ఒక చిన్నగ్రామం. విజయవాడకు కొంతదూరంలో ఉంది. శాతవాహనుల కాలం నుండి దేవదాసీల ఆలయనృత్యాలకు ప్రసిద్ధం ఆ ప్రాంతం. శాతవాహనుల రాజధాని శ్రీకాకుళానికి ఆరుమైళ్ళ దూరంలోనిదే కూచిపూడి.

కుశలవపురి, కుశీపురం, కుచేలపురి, కుచేలపురం అని కూచిపూడిని మొదట్లో పిలిచేవారట.

14వ శతాబ్దికి చెందిన సిద్ధేంద్రయోగి గొప్ప పండితుడు, కళాకారుడే కాక సృజనాత్మక భావుకుడు. అతను మొదట వట్టి సిద్ధప్ప. సన్యాసిగా మారి సంసారాన్ని త్యజించి సిద్ధేంద్రయోగి అయ్యాడట. "కృష్ణుడు ఏకైక ప్రేమికుడు, లోకభర్త. లోకంలోని స్త్రీపురుషులంతా ఆ ప్రేమకై ఆరాటపడే భక్తులు" అని భావించిన సిద్ధేంద్రయోగి – కృష్ణునికై సత్యభామ ఆరాటాన్ని, పరమాత్మకై జీవాత్మ ఆరాటానికి ప్రతీకగా నిలిపి, 'భామాకలాపం' రచించాడంటారు.

భామాకలాపం నృత్యనాటికలోని గేయాల భావం, భాష, సౌందర్యం, రసం మొదలైన లక్షణాలతో ఆకర్షితులైన శ్రీకాకుళం దేవదాసీ బృందం తమకు ఆ కలాపాన్ని నేర్పమని వేడుకున్నారట. శృంగార, భక్తి రసాల సమ్మేళనమైన మధురభక్తి భామాకలాపానిది. శృంగార నాట్యంలో పేరుపొంది, భక్తి మార్గం నుండి తప్పుకుంటున్న దేవదాసీలకూ, రాజనర్తకిలకూ దానిని నేర్పి భక్తి భావనను ప్రదర్శించలేని వారివల్ల నాట్యాన్ని దిగజార్చినట్లవుతుందని సిద్ధేంద్రుడు అంగీకరించలేదట.

చక్కటి శరీరాకృతి, సౌకుమార్యం కలిగిన బ్రాహ్మణబాలకులు మాత్రమే కూచిపూడి నాట్య ప్రదర్శనకు అర్హులని సిద్ధేంద్రయోగి నాట్యాన్ని 'మోక్షసాధనామార్గంగా' ఆ కుటుంబాలవారిచే ఒప్పించి కేవలం వారికే నేర్పసాగాడు. అలా కేవలం పదిహేను బ్రాహ్మణ కుటుంబాలవారికే పరిమితమై, కూచిపూడిలో 500 ఏళ్ళ క్రితం మొదలైన ఈ నృత్యం కాలానుగుణంగా మార్పులు చెందింది, అభివృద్ధి పొందింది. ఇది యక్షగానం నుండి ఆవిర్భవించిందన్న భావన సరికాదంటారు.

కూచిపూడి నాట్యం పూర్తిగా లాక్షిణకమైంది. భరతముని ప్రకారం 'నాట్యం' అనే పదం నృత్య నాటకానికే వర్తిస్తుంది. నాటకాలలో నాట్యధర్మంతో బాటు లోకధర్మం కూడా ఉంటుంది. లోకధర్మం లాక్షణిక నాట్యానికి సన్నిహితమైనదే. కేవలం నాటకాన్ని లేదా నృత్యాన్ని నాట్యం అనలేమనీ, కూచిపూడి నృత్యనాటికకే 'నాట్యం' అనే పేరు

పూర్తిగా వర్తిస్తుందనీ డా॥ వెంపటి చినసత్యం వంటివారు ఈ కళను స్త్రీపురుషులందరికీ నేర్పుతూ అభివృద్ధి పరిచారు.

శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రిగారు కూచిపూడికి విశిష్టతను తెచ్చిపెట్టారు. కూచిపూడి నాట్యంలోని గానం లాక్షణికం. పాటలు ఉత్తమ కవితాస్థాయివి. ఇతిహాసాల నుండి, పురాణాల నుండి స్వీకరించిన ఇతివృత్తాలు కథావస్తువులు. ప్రేక్షకులను సంస్కార జీవులుగా మలిచే ఆంగిక, వాచిక, సాత్త్విక, ఆహార్యాల మేళవింపుతో కూచిపూడి ప్రదర్శనలు సంకల్పించబడ్డాయి.

కూచిపూడి నాట్యంలో 20 శబ్దాలు, ఎన్నో జాతులు ఉన్నాయి. ప్రదర్శనలో స్తబ్దతను పోగొట్టి ఉత్సాహం కలిగించేవి జాతులు. జయదేవుని గీతగోవిందం, నారాయణ తీర్థ తరంగాలు, క్షేత్రయ్య పదాలు, లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృత గేయాలు, బాలగోపాలతరంగం ప్రదర్శనలో ఇత్తడిపళ్ళెం అంచుపై కాళ్ళతో నాట్యం చేస్తూ, తలపై నీళ్ళచెంబు ధరించి ఒక్కచుక్క క్రింద పడకుండా ప్రదర్శిస్తారు. ఈ పద్ధతి వేదాంతం వారు ప్రవేశపెట్టిందే. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారే స్త్రీలకు కూడా కూచిపూడి నాట్యం నేర్పటం మొదలు పెట్టారు. కళ, కాలానుగుణంగా జనాభిరుచులననుసరించి మారాలి. చెరువు ఎప్పటికప్పుడు కొత్తనీటితో నిండాలి అది పాతచెరువే అయినా. కూచిపూడి నాట్యానికి అలా అంతర్జాతీయ ఖ్యాతిని వేదాంతం, వెంపటి, పసుమర్తి, కోరాడ మొదలైనవారంతా తెచ్చిపెట్టారు. మంజుభార్గవి, శోభానాయుడు, జొన్నలగడ్డ అనూరాధ వంటి స్త్రీలు నర్తకీమణులుగా కూచిపూడి నాట్యంలో ఖ్యాతి తెచ్చుకుని ఎందరో శిష్య ప్రశిష్యులను తయారుచేస్తున్నారు. డా॥వెంపటి చినసత్యం ఎందరో అటువంటి శిష్యురాండ్రను తయారుచేశారు. అనేక నృత్యనాటికలను రూపొందించి, వ్యక్తిగత ప్రదర్శనలనూ విస్తృత పరిచారు. స్త్రీపాత్రలను పురుషులు ధరించే స్థాయినుండి పురుషపాత్రలను నేడు స్త్రీలు ధరించగల స్థాయి ఏర్పడింది.

ఏమైనా, కళ ఏదయినా లోకహితం కోరుతూ భగవదంకితంగా ప్రదర్శితమైనప్పుడు రాణిస్తుంది. కైవల్య సాధనామార్గాలలో నృత్యం కూడా ఒకటని విశ్వసించి కళారాధన చేసినప్పుడు అది కన్నవారికీ విన్నవారికీ కూడా మేలు కలిగిస్తుంది. *

**(ఒక నృత్యోత్సవ సభకు రాసిచ్చిన ప్రసంగవ్యాసం)**

# 24 ఉగ్గు'బాల సాహిత్యం' ఒగ్గేసినట్లేనా?

సాహిత్యం ఆలోచనామృతం, పిల్లల్లో ఊహాశక్తిని, సృజనాత్మకతనూ పెంపొందింపచేసేవిధంగా, విషయ పరిజ్ఞానాన్నీ, వినోదాన్నీ, ఉత్సుకతనూ కలిగించేలా –కాలానుగుణంగా బాలసాహిత్యం పరిఢవిల్లాలి. తాము పిల్లలకు ఏది చెప్పాలనుకుని రాస్తున్నామో అదే 'బాలసాహిత్యం' కాదనీ, పిల్లలకు ఏది కావాలో, వారికి ఆసక్తికరమైన విషయాలేమిటో, వారిని వ్యక్తిత్వ వికాసశీలురుగా చేసే, వారికి అవసరమైన, అనుగుణమైన పంథాలో అందించగలగడమే బాలసాహిత్యమనీ గుర్తించగలగాలి.

తరం మారుతున్న కొద్దీ ఈ తరం పిల్లల ఆసక్తులూ, ఊహాశక్తులూ, బుద్ధికుశలత పరిణామం చెందుతున్నాయి. అందుకే కాలానుగుణంగా బాలసాహిత్య సృష్టి జరగాలి. ప్రకృతిపరంగా, చెట్ల చేమల పరంగా, జంతువుల పరంగా చెప్పే కథలూ, కబుర్లూ, కవితలూ ఓ పదేళ్ల వయసులోపల వరకూ ఇప్పటి పిల్లలకూ ఆసక్తికరంగానే ఉంటాయి, మనం సరిగ్గా చెప్పాలే గానీ!, కానీ ఆ వయసులోనే వారిని ఇవాళ టీవీ చానెల్స్ పాటలకూ, డ్యాన్సులకూ, సినిమా ఆధారిత విషయాలకూ ప్రోత్సహించడమే ఎక్కువ కనిపిస్తోంది కానీ, సాహిత్యాభిరుచి వారిలో కలిగించి, వారి ఆలోచనలకు పదునుపెట్టే కార్యక్రమాలేవీ సాగడంలేదు. ఇంట్లో ఇవాళ తిష్ట వేసుకుని కూర్చున్న టీవీల్లో – పిల్లల్ని పాపం! కనీసం వారికిష్టమైన కార్టూన్ చానెల్స్ నయినా, ఒక సరియైన సమయంలో పద్ధతిలో చూడగలిగేలా పెద్దలు చేయలేకపోతున్నారనిపిస్తోంది! 'బోర్నవిటా క్విజ్'ల వంటివి పిల్లలకోసం తెలుగుచానెల్స్ ఇప్పుడేవీ నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. అంతా సినిమా పాటలూ, వాటికి డ్యాన్సుల గురించి పోటీలే. సప్తగిరిలో 'మువ్వల సందడి' వంటి శాస్త్రీయ నృత్యాల పట్ల ఆసక్తి కలిగించే వైఖరి కొంతమేరకు నయం!

చిన్నప్పుడు నేర్చుకున్నవే బాగా గుర్తుంటాయి. అప్పుడే ధారణకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఆ వయసులో పడే ప్రభావాలే వారి ఆసక్తులను తీర్చిదిద్దుతాయి. బొమ్మలు వేయడం, కథలు రాయడం, సంగీత సాధన, డ్యాన్స్ నేర్చుకోవడం ఏవయినా

కళాభిరుచులు కలగడానికి అనువైన తరుణం అదే. ఆటపాటలతో, శారీరక దృఢత్వంతో చెట్లెక్కడం, ఈతకొట్టడం ఏవయినా చిన్నప్పుడు నేర్చుకోవడం సులభమూ అధిక ప్రయోజనమూను.

ప్రీస్కూల్ వయసులో పిల్లలకూ ఇవాళ ఇంగ్లీష్ రైమ్స్, టీవీ ప్రకటనల పాటలు, తుపాకులు, ఫైటింగ్‌లు పట్ల ఆసక్తి పెంపొందిస్తున్నామే గానీ, వారికి ఆలోచనాశక్తినీ, ధారణాశక్తినీ క్రమంగా పెంచగల శతకపద్యాలనో, నీతికథలనో వినేలా చెప్పడం, వారు వల్లించేలా నేర్పించడం, క్రమంగా కనుమరుగై పోతోంది. నిజమే! తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులై, ఇంట్లో అమ్మమ్మలూ, తాతయ్యలూ కూడా వారి కాలక్షేపానికి టీవీలకే అంకితమైపోతున్నకాలాన, మౌఖికంగా పరివ్యాప్తం కావలసిన బాలసాహిత్యం కూడా –క్రమేపీ మటుమాయమవుతోంది మరి!

ఇవాల్టి పిల్లలు చిన్నప్పుడే –ఏ మాత్రం వారిలో ప్రతిభవున్నా, సృజనశక్తి ఉన్నా, ఎక్కువ ప్రచారానికీ, కీర్తికాముకతకూ, కొండొకచో ధనార్జనకు కూడా లోనవుతున్నారు. దానితో పెద్దలు కూడా పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించడం కనిపిస్తూ ఉంది. చదువు సంధ్యలు పణంపెట్టి కూడా– పిల్లలను ఆ దిశగా మళ్లిస్తున్న పెద్దల వైఖరి నిజానికి చాలా గర్హనీయం, శోచనీయం.

తమ పిల్లల్లోని కళాత్మక ప్రతిభా పాటవాలను ఇంటికొచ్చిన మిత్రులముందూ, బంధువులముందూ ప్రదర్శింపచేయడం, పిల్లల్లోని అభివ్యక్తి వైఖరులేవయినా ఆనందింపచేయటం కొంత సహజమే గానీ –పసివయసులోనే తద్రూపక భారాన్ని వారి మీద వేసి, ప్రదర్శనకారులుగా వారిని మలచడం సమర్థనీయం కాదు. విద్యావిధానం పుణ్యమా అని వారి మీద ఉన్న పుస్తకాల భారానికితోడు సహజసిద్ధంగా, స్వేచ్ఛగా, వారిలో మానసిక వికాసకారకంగా అభివృద్ధి చెందవలసిన సృజన కార్యాలనూ, వారి అభిరుచులనూ –వారికి విధాయకంగా మలచి, ప్రోత్సహిస్తున్నామనుకోవడమూ నిజానికి సరికాదు. "సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు –చంద్రికలనేల వెదజల్లు చందమామ –ఏల సలిలంబుపారు గాడ్పేలవిసరు –ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను" అని కృష్ణశాస్త్రి గారన్నట్లు, పిల్లల సృజనాత్మక అభివ్యక్తి వారంతట వారు, సహజంగా, తమ ఇష్టాల మేరకు వ్యక్తీకరించుకునేది కావాలి. పిల్లలపట్ల పెద్దల ప్రేమ కూడా సహజంగానూ, సహేతుకంగానూ,

ఆ పిల్లల జీవన వికాస హేతువుగానూ ఉండాలి తప్ప, 'చైల్డ్ ప్రాడిజీస్' తల్లిదండ్రుల వొత్తిడులకు లోనయినా – అది ఆహ్వానించదగిన పరిణామం కాదు.

పాఠశాల స్థాయినుండే పిల్లలు గ్రంథాలయాలు వినియోగించుకుని సాహిత్యాభిరుచి పెంచుకునే ఒకనాటి బంగారు కాలం కనుమరుగవుతోందనిపిస్తోంది. 'లైబ్రరీ పీరియడ్' అని తరగతి టైంటేబుల్‌లోనే ఉండి, ఆ సమయంలో –పాఠశాల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయడం, చదివిన పుస్తకంపై ప్రసంగ రూపంగానో, రచనా రూపంగానో అభిప్రాయం చెప్పాలనడం మునుపు ఉండేది. ఇప్పుడా తీరు ఏమేరకుందో తెలీదుగానీ, 'నేను తెలుగులో మాట్లాడను' అని బోర్డు వ్రాయించి, ఆ పిల్లల మెడలోనే వ్రేలాడగట్టే హేయ సంస్కృతి వ్యాపిస్తోంది. తెలుగు మాట్లాడడమే తప్పయితే, తెలుగు పుస్తకం చదవడం శిక్షార్హమైన నేరమేమో!

సున్నితమనస్కులైన పిల్లలపై పడుతున్న నేటి ఆ ప్రభావాలే యుక్తవయసు వచ్చేసరికే –వారిని నిరాశోపహతులుగా చేస్తూ, ఒత్తిడుల నుంచి దూరం కాగల ఆశావహ ప్రత్యామ్నాయాలు వారికి లేక, బలవంతపు చావులకూ, బుద్ధిజాడ్యానికీ ద్రోవతీస్తున్నాయనిపిస్తోంది. చదువు సంధ్యలే ఒత్తిడీ, బరువు అనుకుంటే ఈ పోటీల పేరిట, చానెల్స్‌వారి వైఖరులూ వారిని ఒక్కొక్కసారి మానసికంగా ఇబ్బంది పెడుతూ, ధైర్యస్థైర్యాలను దెబ్బతీస్తున్నాయనిపిస్తోంది. హాయిగా, స్వేచ్ఛగా తమ సృజనాత్మక ప్రతిభానందాన్ని అనుభవించనీయక, ప్రచారార్భటుల, ప్రైజ్‌మనీల ఆరాటంలో చిన్నతనం నుంచే వారిని కాంక్షాపరులనూ, అతృప్తులనూ కావించే అనారోగ్య వైఖరులు ప్రబలుతున్నాయనిపిస్తోంది. బాలసాహిత్యం కలికంలోకైనా లేకుండా పోయేలా ఉంది. కళ ఏదయినా తొలుత హృదయవికాసానికి దోహద పడాలి. సమాజ ప్రయోజనం దిశగా పరిణమించి ఎదగాలి. బాలసాహిత్యం కూడా బాలలచే సృజింపబడిన సాహిత్యానికి వర్తించే మాట కావాలి! సాహిత్యంలో ఇవాళ అనేక వాదాలు, ఇజాలూ ఆ వర్గాలవారి సృజనకు మాత్రమే పేర్కొనబడినట్లు, బాలలు చేసిన రచనలే 'బాలసాహిత్యం' కావాలి కదా మరి నిజానికి? ఏమయినా పాటలూ, కథలూ, పసందైన మాటలు, ప్రేమలూ, ఆత్మీయతలూ రంగరించుకుని –బాల్యం వికాసవంతం కావాలంటే, ఏ తరం పిల్లలకయినా సాహిత్యం ఊతగర్ర కాగలగాలి. సృజనాత్మక ఊహాశీలురైన పిల్లలే భవిష్యత్ సాహితీవేత్తలు. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 12 నవంబర్'2009)**

# (25) కవిరాజ విరాజితం

**మ**రెవ్వరికంటే ఎక్కువగా భావోద్వేగాలకు లోనయ్యేది కవులే. అందుకే తమాషాగా–సమాజాన్ని పట్టించుకున్నా, పట్టించుకోకపోయినా వ్యక్తిని గురించి పట్టించుకునేది కవులే. ఆ వైయక్తిక 'వెచ్చని స్పర్శ' వారికి ఎక్కువ ప్రీతికరం కావడం వల్లనే, అందునా తమ సహజకళ అయిన ఉపమలు, రూపకాలు, ప్రతీకలు అతిశయోక్తులతో నచ్చిన, అవసరపడిన వ్యక్తుల గురించి కవులు అభివ్యక్తం అయినట్లుగా వేరొకరు కారు. పెళ్ళిళ్ళకు పంచరత్నాలు రాసే కవులున్నట్లే, దివంగతులకు అశ్రుగీతాలు రాసే కవులూ ఉంటారు. 'ఎలిజీ' అనేది కవిత్వంలో ఓ శాఖగా కూడా విస్తరించింది. పోయిన వెంటనే రాయడం వేరు. పోయిన కొద్దికాలానికి రాయడం వేరు. జ్ఞాపకాల్లో నిలబడిపోయిన వ్యక్తి గురించి కావ్యాలు అల్లినవారున్నారు. స్మృతి సాహిత్యం అంటూ అలా విస్తరించిందే. అమ్మ గురించో, నాన్న గురించో, మిత్రుడి గురించో, భార్య గురించో, సంతానం గురించో వారి మరణంతో కవిత్వంగా అభివ్యక్తమైన ఖండికలున్నాయి తెలుగు కవిత్వంలో. అభిమానించే ఒక రాజకీయ నాయకుడి అస్తమయం గురించి కూడా అలా ప్రతిస్పందించడం గాంధీ, నెహ్రూల మరణానంతరం తెలుగుకవుల కవిత్వంలో చూశాం. సరే కవుల గురించి కవులే రాసినవీ వున్నాయి. గాంధీజీ శతజయంతి సందర్భంగా 'కావ్యాంజలి' అని రెండు సంపుటాల కవిత్వం వచ్చింది. ఆ రోజుల్లో నెహ్రూపై ఆనాటి వరవరరావు రాసిన అప్పటి మంచికవితా వుంది. ఇప్పుడు రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటూ హెలికాప్టర్ దుర్ఘటనలో మరణించిన సంఘటనపై ఇటీవల కవులు స్పందించిన వైఖరి చూస్తే అలా స్పందించిన వారి భావద్వేగాల తీవ్రత ఏమిటో అవగతమవుతుంది. రాజశేఖర్‌రెడ్డి వ్యక్తిగా ఏ మతాన్ని అవలంబించినా, ఏ స్ఫూర్తితో పేదలను, దళితులను సేవలతో ఆకట్టుకుంటూ వారికి దైవస్వరూపంగా కదిలింపచేశాడో కొందరి కవితల్లోనూ అభివ్యక్తం అవుతోంది. ఎవరు స్పందించి కవిత్వం రాశారో, ఎలా రాశారో, ఎవరు ఎలాంటి భావోద్వేగం చెందారో పత్రికల పుటలే ప్రత్యక్ష సాక్షిగా నిలిచాయి. త్వరలోనే

రాజశేఖర్‌రెడ్డిపై ఓ కవితా సంకలనం వెలువడబోతోందని కూడా తెలుస్తోంది. అయితే దివంగత నేతపై ఇంకా కవిసమ్మేళనం ఏదీ నగరంలో అయితే జరిగినట్లు లేదు. 'ఒక్కసూర్యుడు' అనే కవితలో శిఖామణి దివంగత ముఖ్యమంత్రిని గూర్చి "పొదుగుసేపుతున్న దూడ నుంచి తల్లియావును వేరుచేసి కబేళాకు తోలుకుపోయినట్టు క్రూరవిధి నిన్ను మానుండి దూరం చేసింది" అని బాధపడతాడు. "ఎవరు అలవోకగా అరచేతిని అలా గాల్లోకి ఎత్తి అటూ ఇటూ సుతారంగా ఊపితే నల్ల ఏనుగుల గుంపులాంటి మేఘాలు ఆకాశమంతా ఆవరించి కుంభవృష్టి కురుస్తుందో, ఎవరు పాదం మోపితే పిచ్చిగడ్డి అయినా మొలవని కడుదయనీయ బీడుభూములు సతత హరిత సస్యక్షేత్రాలై పల్లవించాయో" అంటూ వానలు కురవడానికీ, పంటలు పండడానికీ ఆయనే కారణమని సకల జనసమ్మత సవిత్రుడు రాజశేఖరుడు అంటాడు.

"నీకు చేతనైతే గీతమకరందంతో, వేద సుగంధంతో సప్తవర్ణ సమ్మేళనంతో ప్రజలను ఆకర్షించు. సేవాదృక్పథంతో హృదయాలను జయించు" అంటూ నేరుగా దివంగతనేతపై రాసినట్లు కనబడకపోయనా మతం పేరు అవగతం కాకుండానే జనహితం చేసిన నేతగా 'మిత్రవాక్యం'లో ఎస్వీ సత్యనారాయణ ధ్వనింప చేశాడనిపిస్తుంది.

"మిమ్మల్ని మళ్ళీ మళ్ళీ కలుస్తానని మాట్లాడతానని అనుకున్నాను మీతో మాట్లాడిన అతి కొద్ది సందర్భాలు గుర్తొచ్చి కన్నీళ్ళ పర్యంతమయ్యాను.. మీ జ్ఞాపకాల మధ్య దీపం పెట్టుకునే వేళ మహిళలు మిమ్మల్ని గుర్తు చేసుకుంటారు. తినే అన్నం ముద్దలో పేద ప్రజలు మీ రూపం చూసుకుంటారు" అంటుంది మహెజబీన్. "ఆయనతో రాజకీయ ఆర్థిక సామాజిక అభిప్రాయాలలో ఎన్ని విభేదాలున్నా డాక్టర్ యెడుగూరి సందింటి రాజశేఖర్‌రెడ్డి అకాల దుర్మరణం అటువంటి విషాదాన్ని కలిగించింది. జర్నలిస్టుగా పది సంవత్సరాలకు పైగా పరిచయం, ఒకింత సాన్నిహిత్యం గుర్తొచ్చి హృదయం ద్రవించింది.. ఆయన ఏమైనా కావచ్చు. ఎంత మొండిగా, నిర్దాక్షిణ్యంగానైనా ఉండొచ్చు. కాని పరిచయస్తులకు, స్నేహితులకు మాత్రం ఆయన దరహాసం, వెచ్చని కరస్పర్శ ఎప్పటికీ మరుపురావు" అని కవితా హృదయంతో వై.ఎస్. చివరి పుట్టినరోజుని ఎన్.వేణుగోపాల్ తలుచుకున్నందుకే వి.ర.సం నుండి బహిష్కృతుడైన ప్రకటన–సైతం వచ్చింది. తన భావోద్వేగాన్ని సంయమనంతో

నిలుపుకోలేని పరిణామమే అది. "నీ హఠాన్మరణంతో తెలుగునేల మట్టి పరిమళం కోల్పోయింది" అనే స్థాయికి వెళ్లాడు పెరుగు రామకృష్ణ. "పరలోక మందున్న మా యొక్క తండ్రీ/ మీ నామాన్ని పూజిస్తూనే ఉన్నాం కదా/ మా రాజ్యం వచ్చిందని నమ్మాం కదా... నా గ్లోబల్ కాంక్రీట్ గోడౌన్‌ని/ నాటి పచ్చదనపు 'ఏదేను'గా మార్చిన/ నా సరికొత్త ఆదాము ఏమయ్యాడు?" అని రాజ్య ప్రభువు గురించి పైడి తెరేష్ బాబు 'మట్టిబిడ్డ' కవితలో చెబుతాడు. "అధునాతన బాపూజీ. త్యాగయోగి ఆ దధీచి. జలయజ్ఞపు సోమయాజి మా నూతన నేతాజీ" అంటారు వేటూరి సుందరరామ్మూర్తి. "ఉన్నా తనకోసం లేనివాడు. లేకున్నా అందరి కోసం తపించే వాడు. పచ్చనైన నేలలో పవ్వళించినవాడు. జనహృదయాలలో జగన్మోహనుడై ఉదయిస్తాడు" అంటాడు సినీ గేయ రచయిత గురుచరణ్. 'జీవితానికీ రాజకీయానికీ అభేదం పాటించని వ్యక్తి - అద్భుత జనాకర్షకశక్తి" అంటాడు చందు సుబ్బారావు. "గ్లోబలైజేషన్ శకంలో తిరిగి వ్యవసాయం గ్రామాలు- ప్రజల ముందుంచిన ధీరుడు" అని ఆ పంచెకట్టును వాడ్రేవు చిన వీరభద్రుడు కొనియాడాడు. గరికపాటి నరసింహారావు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం వంటి వారి ప్రతిస్పందన కవితలూ వున్నాయి. 'దృశ్యపు వధ్యశిలపై' అనే కవితలో ర్యాలి ప్రసాద్ రాచపీనుగ సామెతను గుర్తుచేస్తే ప్రతి ముగింపుకూ ఒక ఆరంభమే కారణమని గత కవికాలంలో మనమూ గుర్తు చేసుకున్నాం. "ఆ అభివాదన హస్తైక ముద్రలో కరుణేందిరా భద్రకళయె తోచు" అని రామడుగు వేంకటేశ్వర శర్మ అశ్రునివాళి పలికాడు. ఇవి ఇప్పటికి నాదృష్టికి వచ్చినవి. హఠాత్పరిణామ భావోద్వేగ కాలాన్ని అధిగమించాక ఇంకా ఆయనపై ఏ కవితలు, కావ్యాలు వెలువడతాయో, ఎవరు రాజశేఖరచరిత విషాద కవి రాజులవుతారో రాబోయే కాలమే చెబుతుంది. కవితా యద్యస్తి రాజ్యేనకిం? ✱

**(ఆంధ్రప్రభ దినపత్రిక 11 సెప్టెంబర్' 2009)**

# (26) రుబాయీల తెలుగు కవి సమ్రాట్టు

**మ**నది కాని దాన్ని మనదే అన్నంతగా – మనోధర్మంతో మమేకం చేసుకుని, మహదానందంతో, రసమంచితంగా మనం – మననం చేసుకునేంతగా, ఒక సాహిత్య ప్రక్రియకు విశాలత్వాన్ని ఇచ్చిన, వినుతించదగిన కవిశ్రేష్ఠులు డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య. బహుశా తెలుగులో 'రుబాయీ'కి ఇంత విస్తృతినీ, రసధృతినీ కలిగించిన వేరొకకవి లేరనడం అతిశయోక్తి కాదు.

ఉరుదూ, ఫారసీ భాషలకు చెందిన కవితాప్రక్రియ 'రుబాయీ'. దానికి తొలిసారిగా తెలుగుదనపు పరిమళాలు అద్దింది మహాకవి దాశరథి, 15 ఆగస్టు 1973 న సాయంకాలం రవీంద్రభారతిలో జరిగిన కవిసమ్మేళనంలో 'కళ్లెం ఉన్నది మనచేతిలో / గుర్రం మాత్రం పడె గోతిలో / దప్పి తీరదని నేనంటాను / నీళ్ళేలేని మన నూతిలో' అంటూ దాశరథి గళం విచ్చినప్పుడు హర్షపులకాంకితులైన శ్రోతల కరతాళ ధ్వనులతో సభ అంతా మార్మోగింది. అంతేకాదు! ఆ ఛందోప్రక్రియ ఎందరినో ఎంతగానో ఆకర్షించింది. జనసామాన్యంలోని సామాజిక భావాలను ఉపయోగించుకుంటూ, వాటికి హాస్య వ్యంగ్య ఫణితితో వాస్తవికత చేకూర్చుతూ, సూక్తులూ, సందేశాలూ వంటి వాటిని కూడా సంతరిస్తూ, రసవత్తర కవిత్వం జనరంజకంగా చెప్పవచ్చునని దాశరథి 'రుబాయీ' ద్వారా చాటి చూపారు. లయ ఛందస్సుల ఉనికి – భాషలోనే కాదు, శ్రోతల హృదయాలలో ఉంటుందని రుబాయీలు కవిసమ్మేళనాలలో వినిపించినప్పుడల్లా నిరూపితమవుతూనే ఉంది. శ్రీ తిరుమల శ్రీనివాసాచార్య రుబాయీల కవి సమ్రాట్టుగా ఎదిగారు.

ఇంతకీ ఏమిటీ రుబాయీ ప్రక్రియ? దానిని ఆచార్యులవారు ఎలా ఒడిసిపట్టుకున్నారు? 'తెలుగు రుబాయీ'లకు కవిత్వ 'దీపాల చూపులు' సంతరించి, తెలుగులో రుబాయీని 'రవ్వల పతాక'గా ఎగురవేసి, 'రుబాయీ గులాబీలు', 'పలుకరించే పరిమళాలు' గా తెలుగు సాహిత్య ప్రపంచంలో 'తెలుగులో మాటాడుకుందాం'గా, తన ప్రక్రియాదేశంతో 'నా దేశం నా ఆవేశం'గా ఎలా ఉనికినీ, మనికినీ ఇచ్చి, రసప్రపంచంలో సుస్థిరం చేశారు? అన్నది గమనించాల్సిన విషయం.

గులాబీపువ్వు ఇరాన్ నుంచి మనదేశానికి వలస వచ్చి స్థిరపడి పోయిందని వృక్షశాస్త్రజ్ఞులు చెప్పేమాట! ఇవాళ గులాబీ పరిమళాలు మనవేనన్నంతగా పరివ్యాప్తమవుతున్నట్లుగానే, ఇరాన్ నుంచి అంటే ఫారసీ భాష నుంచి ముక్తక కవితా ప్రక్రియగా 'రుబాయీ' దూసుకొచ్చింది. ఫారసీ, సంస్కృత, ప్రాకృత, అపభ్రంశాల కలయికతో పరిఢవిల్లిన ఉర్దూ భాషలో పదహారవ శతాబ్దం నుంచే రుబాయీలు వచ్చాయి. హిందీలో కూడా 'చౌపాయీ' పేరుతో అడుగులు వేసింది ఈ రుబాయీయే! 'ముక్తకాలు' భారతీయులకు కొత్త ఏమీకాదు. వివేకాన్నీ, శృంగారాన్నీ, అధిక్షేపాన్నీ పొదుగుకున్న 'ముక్తకాలు' చాటువులుగా కూడా చమత్కారంతోనూ సాధించిన ప్రయోజనాలు అనేకం.

పదకొండవ శతాబ్దంలో ఇరాన్‌లో ఉమర్‌ఖయ్యాం కవి 'రుబాయీ' లతో విశ్వసాహిత్యాన్నే పరిమళ భరితం చేశాడు. ఫ్రిట్జ్ జెరాల్డ్ – రుబాయీలు ఇంగ్లీషులోకి అనువదించి 'రుబాయీ' కవితాప్రక్రియను నిఖిల సాహిత్య ప్రపంచానికీ పరిచయం చేశాడు. 'రుబాయీ' అంటే సూక్తికి నామాంతరమా అన్పించింది కొందరికి.

'రుబాయీ' ప్రక్రియ, దాని ఛందో వైశిష్ట్యం ఫారసీ ఉర్దూలవరకే పరిమితమై ఉమర్‌ఖయ్యాం అనువాదకులు కూడా సంప్రదాయ ఛందో రీతుల్లోనే అనువదించి తృప్తిపడ్డారే కానీ 'రుబాయీ' ఛందోవైశిష్ట్యం జోలికి పోలేదు. 'రుబాయీ' ఛందో పద్ధతిని ఉర్దూ ఫారసీలలో వలెనే నిర్మించి తెలుగు చేసిన ఖ్యాతి తొలుత మహాకవి దాశరథికే దక్కుతుంది. ఉమర్‌ఖయ్యామ్ ను తెలుగులో రాయప్రోలు, ఆదిభట్ల నారాయణదాసు, దువ్వూరి, కరుణశ్రీ, ఉమర్ ఆలీషా, బూర్గుల రామకృష్ణారావు, మడిపడగ బలరామాచార్య, దుర్గానంద్ వంటి వారెందరో అనువదించారు. మూలాభిధేయంగా, తెలుగు నుడికారం సొంపులతో 'దువ్వూరి'ది విశిష్ట అనువాదంగా తెలుగువారు ఎదకు హత్తుకున్నారు.

'రుబాయీ' అనే కావ్య ప్రక్రియ పేరు ఉమర్‌ఖయ్యాంతోనే తెలియవచ్చింది. మహితసూక్తికీ, చతురోక్తికీ అనుకూలమైన నాలుగు పాదాల్లో సమగ్ర భావాన్ని గర్భీకరించుకునే ఫారసీ, ఉర్దూభాషలలోని విశిష్ట కవితా ముక్తక ప్రక్రియ 'రుబాయీ'ని తెలుగులోకి దాశరథి అవతరింప చేశారు.

నారాయణరెడ్డిగారు ఈ ప్రక్రియను చేపట్టి ఆ పేర కాకపోయినా 'రుబాయీ' రచించారు. అయితే తెలుగు కవితా ప్రపంచంలో డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యగారే

ఇంతవరకూ అత్యధిక సంఖ్యలో రుబాయీలను వెలయించి, రుబాయీ ప్రక్రియలో ఇంద్రధనుస్సు వలె ఏడురంగుల సంపుటాలను పాఠకలోకానికి అందించి చరితార్థులవుతున్నారు.

నిజానికి 'రుబాయీ' అరబ్బీ పదం. కానీ ఈ ప్రక్రియకు మూలం అరబ్బీ భాష కాదు. ఫారసీలో రుబాయీ వికసించాక, అరబ్బీ సాహిత్యంలోనూ వెలువడినవన్నమాట మాత్రం నిజం! 'రుబా' అంటే 'ఒక వస్తువుకు చెందిన నాల్గవభాగం' అని అరబ్బీలో అర్థం. 'రుబాయీ' అంటే శబ్దార్థం నాలుగు భాగాలుగా ఉండడం. అలా నాలుగు పాదాల ముక్తకం 'రుబాయీ' అనిపించుకుంది.

సంస్కృతాంధ్ర ఉర్దూ భాషావేత్తలు కీ॥శే॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు ఈ ప్రక్రియా స్వరూపాన్ని అవలోఢనం చేసిన విద్వన్మణులు. అరబ్బీ ఉర్దూ ఫారసీలలో 'షేర్' అంటే రెండు పాదాలున్న కవిత. ఉర్దూ కవితాపాదాన్ని 'మిస్రా' అంటారు. రెండు మిస్రాలు ఒక 'షేర్'. రెండు 'షేర్లు' కలిసి ఒక 'రుబాయీ'. ఉర్దూ షేర్లలోని 'విజన్' – తెలుగులో ఒక 'తూగు', 'ఊపు'గా కూడా రుబాయిలలో అందిపుచ్చుకోగలం.

'రుబాయీ' సమతూకం కలిగిన నాలుగుపంక్తుల కవితారచన. మొదటి, రెండవ, నాల్గవ పాదాలకు అంత్యప్రాస అనివార్యం. మూడవది ప్రాసరహితం. స్థూలంగా ఇదీ 'రుబాయీ' లక్షణం. సమమాత్రలతో సాగే నాలుగు పాదాల ఛందం 'రుబాయీ'లలో కొన్నింటిని, కొన్ని సందర్భాలలో మాత్రలను పెంచి, తగ్గించి, లయకూ, తూగుకూ, తూకానికీ భంగం కలగకుండా స్వచ్ఛందంగా, తిరుమల శ్రీనివాసాచార్యులవారు సంతరించి వ్రాసారు.

అలాగే మొదటి రెండవ నాల్గవ పాదాల అంత్యప్రాసలతో బాటుగా మూడవపాదంలోనూ అంత్యప్రాసను కూర్చి స్వతంత్రంగా నిర్మించారు. నాలుగు పాదాలలో అంత్యప్రాసను పాటించే 'రుబాయీ తరానా' అనే లక్షణం ఉర్దూ ఫారసీ భాషలలోనూ కొత్త ఏమీ కాదు! అలాంటివి ఆ భాషల్లో వేలాదిగా వచ్చినవే! అయినా వాటికి 'రుబాయీ' అనే పేరే రూఢమైంది. 'తర్' అంటే తడిలేక చల్లదనం. అంటే శుష్కమైన హృదయాన్ని రసార్ద్రం చేసేది 'తరానా'. సంగీతప్రియులైన ఇరాన్ ప్రజలు 'తరానా'లను అనేక రాగాలతో పాడి, ఆనందించడం వల్ల ఆధునికకాలంలో 'తరానా'కు 'గీతం', 'పాట' అనే రూఢ్యర్థం ఏర్పడిందన్నారు ఇరివెంటివారు.

'రుబాయీ'లో ప్రధానంగా ఒకే ఒక్క భావం ఉంటుంది. అది నాలుగు పాదాలుగా కుసుమిస్తుంది. తొలిపాదంలో భావం మొగ్గ తొడిగి, రెండవ పాదంలో

విచ్చుకుని, మూడవపాదంలో ఉత్కంఠతో ఉన్ముఖమై, నాలుగవ పాదంలో హృదయానికి సంభ్రమాశ్చర్య రసానందప్రాప్తి నందిస్తూ పరీమళిస్తుంది. మూడుపాదాల సారం నాల్గవపాదంలో ఇమిడి పోతుంది. ఆ ముగింపులోనే కవి ప్రతిభ, చమత్కృతి, ప్రౌఢిమ దృగ్గోచర మౌతాయి. రుబాయీరచన పైకి సులభంగా అనిపిస్తుంది. కానీ, మంచి 'రుబాయీ' రాయడం చాలా కష్టం. ప్రతిపాదం వాక్యనిర్మాణం బాగుండాలి. కృత్రిమ పదాలు, దురాన్వయమూ, కృతక అంత్యప్రాసలు, శ్లేషలు విశ్లేషించుకునే గహనతా, పనికిరావు. 'అల్పాక్షరముల అనల్పార్థ రచనే' కాదు, అద్భుత రసభావోద్దీపనంగా భాసించాలి.

'రుబాయీ'ల రచనలో శ్రీ తిరుమల శ్రీనివాసాచార్య గారు రాశిని, వాసిని కూడా వెలార్చిన కవివతంసులు. రుబాయీని శృంగార భావాభివ్యక్తికి పరిమితం చేయలేదు సరికదా! ఆ ప్రక్రియకు తన కవిత్వ ప్రతిభాశక్తితో, ప్రత్యేకతను సంతరించిపెట్టారు. సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, విద్యా కళారంగాలకు సంబంధించిన సమకాలీన సమస్యలకు స్పందిస్తూ రచించిన వ్యాఖ్యలుగా, సూక్తులుగా, నిర్వచనాలుగా, సందేశాలుగా, ప్రశంసలుగా, ప్రశ్నలుగా, ప్రముఖులకు ప్రస్తుతులుగా, ప్రహేళికలుగా, వ్యంగ్యోక్తులుగా, వ్యాజోక్తులుగా, పరిహాసోక్తులుగా.. అంతెందుకు? జీవితపు సర్వసమగ్ర అంశాలకూ అద్భుత అభివ్యక్తి వాహికలుగా 'రుబాయీ'లను తెలుగులో తీర్చిదిద్దిన ఘనత తిరుమల శ్రీనివాసాచర్యగారిదే!

'దాశరథి' గారి నుండి స్వయంగా తిరుమల శ్రీనివాసాచార్యగారు ఒకనాటి సాయంసంధ్యా సమయంలో హుసేన్‌సాగర తీరంలో విహరిస్తూ ఆయన నుండి రుబాయీలను విని, స్థూలంగా వాటి రచనా విధానాన్ని తెలుసుకుని, రుబాయీలను రాయడం ప్రారంభించినవారు. అనేక కవి సమ్మేళనాల్లో, సభల్లో తమ రుబాయీలను వినిపించి, దాశరథి గారిచేతే ప్రశంసలందుకున్నవారు. ఒక సంపుటిగా ప్రచురించమన్న ఆయన సూచనతోనే, దాశరథి గారు మరణించినా, ఆయనకు కృతజ్ఞతాపూర్వక స్మృత్యంజలి సమర్పించుకుంటూ, తమ మిత్రులు సాయం బసలింగప్ప గారి జన్మదిన సందర్భంగా 1988 లో తిరుమల శ్రీనివాసాచార్యగారు మిత్రునికి అంకితంగా తొలిసారి 320 రుబాయీలతో 'తెలుగు రుబాయీలు' యువభారతి ప్రచురణగా వెలువరించారు. వారి ముద్రిత రచనలలో 'తెలుగు రుబాయీలు' ఆరవ గ్రంథం. రుబాయీ ప్రక్రియలో అదే తొలి సంకలనం.

వివిధ కవిసమ్మేళనాల్లో, అప్పట్లో కొన్నింటిని 'ఆంధ్రభూమి' దిన పత్రికలో ముందుగా వెలువరించి, ఆపై 'తెలుగు రుబాయిలు'గా సంపుటీకరించారు. 'రుబాయీ' ప్రక్రియలో ఎంత వైవిధ్య భావ ప్రకటనం రసభరితంగా చేయవచ్చునో, మొదటిసారిగా సాక్షాత్కరింప చేశారు. వివిధ సాహితీమూర్తులను రుబాయిలతో వర్ణించారు. వాక్య నిర్మాణ ప్రసన్నత, పరిమితత్వం, అంత్యానుప్రాస సంతులనం, అభివ్యక్తి విశేషం ప్రస్ఫుటమయ్యేలా దేశభక్తి, మహనీయుల ప్రశస్తి, రాజకీయ అధిక్షేపం, హాస్యం, వ్యంగ్యం వంటి ఎన్నో అంశాలు గొప్ప అధ్యయనం, స్పందించే హృదయం, పాండిత్యం వ్యక్తమయ్యే లాగా రచించి అందించారు. రుబాయి ఛందస్సు తన భావాలన్నింటికీ ఒదిగిపోయేలా మలుచుకోవడం కవి దక్షత. అది వారికి చెల్లింది.

'తెలుగు రుబాయిలు' గ్రంథంలో మొట్టమొదట్లోనే కవి 'పొదిగాను హిమగిరులను నా హృదిలో / అదిమాను జలనిధులను నా హృదిలో / నదులన్నీ నా నరాల పారుతుండగా / నిలిపాను విశ్వాన్నే నాగదిలో' అంటూ తన కవితామూర్తి వైశిష్ట్యాన్ని ప్రకటించుకున్నారు.

ఉరుదూ కవితోద్యానం తిలకించావు
పలువన్నెల పూలను గని పులకించావు
గజల్ రుబాయిలలోని ఘుమఘుమలు
దాశరథీ! తెలుగులోన చిలికించావు

అని రుబాయిని తెలుగు రంగ ప్రవేశం చేయించిన దాశరథిని ప్రశంసించారు.

అలాగే 'పుస్తకం' గొప్పతనాన్ని ప్రకటిస్తూ... 'పల్లవాన్ని బల్లెంగా మలిచేస్తుంది/ కన్నీటిని ఖడ్గంగా మలిచేస్తుంది / లోకంలో ఒకే ఒకటి పుస్తకమే / జడతను విప్లవంగా మలిచేస్తుంది' అన్నారు.

దేశభక్తి ప్రపూరితమైన 'రుబాయీ'లు అనేకం ఈ సంపుటిలో ఉన్నాయి.

"ఈ దేశం వృక్షానికి ప్రతిమనిషీ ఒక ఆకు
ఈ దేశం పుష్పానికి ప్రతి మనిషీ ఒక రేకు
ఈ తరుపుష్పాలపైన ఎవరైన చేయివేస్తే
తత్క్షణమే అవుతాడు ప్రతిమనిషీ ఒక బాకు"..

ఇలా! గాంధీ, రవీంద్రుడు, పోతన, వేటూరి ప్రభాకరశాస్త్రి, శివశంకరస్వామి, వానమామలై వరదాచార్యులు, ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, కుందుర్తి, ఖండవల్లి లక్ష్మీరంజనం,

వేమన, దివాకర్ల వేంకటావధాని, దాశరథి, బోయి భీమన్న, దేవులపల్లి రామానుజరావు, సి.నారాయణరెడ్డి, కాళోజి, ఉత్పల సత్యనారాయణాచార్య, ఆరుద్ర, శేషేంద్ర, జి.వి.సుబ్రహ్మణ్యం, జె.బాపురెడ్డి వంటి ప్రముఖులపై ప్రశంసాత్మక రుబాయీలు ఈ గ్రంథంలో అధికంగా ఉన్నాయి. తొలిసారి కొత్త ప్రక్రియలో ఇన్ని ముక్తకాలు వెలువరిస్తున్న నేపథ్యంలో 'తెలుగు రుబాయీలు' చివర్లో కవి ఇలా అంటారు.

"మిఠాయిలు ఏవైనా చక్కెర ఒకటే / యంత్రాలు ఏవైనా విద్యుత్తొకటే / ఛందస్సులు ఏవైనా కవిత్వమొకటే / కవుల దారులేవైనా గమ్యం ఒకటే"

"నా భాషా నా ఘోషా దేశమే / నా హాసం నా శ్వాసం దేశమే / నా దేహం నా గేహం దేశమే / నా గేయం నా ధ్యేయం దేశమే" అని ప్రకటించుకున్న జాతీయాభిమాని కవి తిరుమల శ్రీనివాసాచార్య గారు.

రుబాయీ ప్రక్రియలో తిరుమల వెలువరించిన రెండవ సంపుటి 1993 లో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుగారికి అంకితంగా వెలువరించిన 'దీపాల చూపులు'. 1996 లో ఉత్తమ కవితాగ్రంథంగా తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్యపురస్కారం ఈ గ్రంథానికి లభించడంతో 'రుబాయీ' ప్రక్రియకు తెలుగు కవితలో ఒక విశేషమైన గుర్తింపు లభించినట్లయింది. 76 పేజీల ఈ సంపుటిలో కూడా ఆచార్యులవారి దేశభక్తి భావనలు, సమైక్యతా సందేశాలే ప్రధానంగా కనిపిస్తాయి. ముఖ్యంగా ఈ సంపుటిలోని రుబాయీల్లో మొదట్లో వ్యంగ్య, అధిక్షేపాలు కొన్ని కనబడినా, అధికభాగం హితోక్తులుతో రూపొందినదే.

"నదులు జలాలివ్వడమే విప్లవం / తరులు ఫలాలివ్వడమే విప్లవం / విప్లవమంటే నిప్పులు కక్కుటా? / ధరణి ధాన్యమివ్వడమే విప్లవం" అని సూత్రీకరిస్తారు.

"రచనకు భాషకు ఎలాంటిదో అనుబంధం / నేలకు నింగికి ఎలాంటిదో సంబంధం / నా హృదయం నా కవనం చెప్పలేవులే / మీకు నాకు ఇలాంటిదే అనుబంధం" అంటూ ఆచార్య సి.నారాయణరెడ్డిగారికి అంకితంగా, 1999 లో తిరుమల శ్రీనివాసాచార్య తెలుగు రుబాయీ ప్రక్రియలో వెలువరించిన సంకలనం 'రవ్వలపతాక'. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు ఈ సంపుటికి ముందుమాట రాస్తూ 'రుబాయీల వేమన' అని తిరుమల శ్రీనివాసాచార్యను పేర్కొనడం గుర్తించదగింది.

"మంచుగుండెలకు జ్వాలాశలాకగా / వేడి వెల్లులకు సమతాప్రతీకగా /

ప్రగతి పథాంకితమౌ నా హృదయాన్నే / ఎత్తానిదిగో! రవ్వలపతాకగా'' అంటూ వేడినీ, వెలుగునూ జమలికగా పంచారిందులో. ఇందులో 293 రుబాయీలున్నాయి.

"నదిలాగా నడిచే నవ నరజాతికి స్వాగతం / వృక్షంలా వికసించే హృదయాలకు స్వాగతం / పద్మంలా జీవించే ప్రజావళికి ఆహ్వానం / దీపంలా వెలిగే నవనాయకులకు స్వాగతం" అని మొదలయ్యే ఈ సంపుటి "కిరణం శరణం గచ్ఛామి / స్ఫురణం శరణం గచ్ఛామి / కాంతిని శాంతిని వర్షించు / కవనం శరణం గచ్ఛామి" అని ముగుస్తుంది.

"గానంలో జీవిస్తే గాయకుడు / నావపైన పయనిస్తే నావికుడు / కష్టాలకు కన్నీళ్ళకు భయపడక / నీతికొరకు కృషి చేస్తే నాయకుడు" అన్న ఇందులోని ఆచార్యులవారి 'రుబాయీ' దాశరథిగారి ఈ రుబాయీని గుర్తుచేసింది.

"పడవ నడపలేని వాడు నావికుడు / పాటపాడలేని వాడు గాయకుడు / అందుకోసమే వేదనతో నేనంటాను / ప్రజలనడపలేని వాడు నాయకుడు".

సంప్రదాయం మీద గౌరవం, ప్రగతి మీద లక్ష్యం రెండూగల వారు తిరుమల శ్రీనివాసాచార్యులవారు. అందుకే ఆయన రుబాయీల్లో ఆ అనుసంధానం కనిపిస్తూ ఉంటుంది.

"పిల్ల బాగుపడకుంటే తల్లిది లోపం / తనుజుడే చెడిపోతే తండ్రిది లోపం / పదవులున్న ప్రభుత ఉన్న రాజ్యాంగంలో / ప్రజలు బాగుపడకుంటే ఎవరిదిలోపం?" అని ప్రశ్నిస్తారందుకే.

"క్రికెట్" అనే క్రీడను ఆధారం చేసుకుని అన్న ఈ రుబాయీ చూడండి. "బలవంతులు బ్యాటింగులు చేస్తున్నారు / ధనవంతులు బౌలింగులు చేస్తున్నారు / బంతిలాంటి సామాన్యులు పరుగులు పెట్టి / ప్రతిదెబ్బకు నురుగు కక్కి చస్తున్నారు".

వెయ్యి రుబాయీలు రాయాలనే సంకల్పాన్ని సమర్థవంతంగా సాకారం చేసుకుంటూ రెండువందల రుబాయీలతో శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యుల వారు వెలువరించిన రుబాయీల నాలుగవసంపుటి 'రుబాయీల గులాబీలు'. దీనితో ఆయన రాసిన రుబాయీల సంఖ్య పదకొండువందలు దాటింది.

ఈ 'రుబాయీ గులాబీలు' కూడా – ఒక్క ఎర్ర గులాబీగా కాకుండా, రంగుల గులాబీలుగా పూయించారు కవి. "కవనం రస పవనం / పరిమళాల దవనం / మరపురాని మరువం/ కవనం నాక వనం" అంటారిందులో.

ఇక 'పలుకరించే పరిమళాలు' పేరిట రసమయి వ్యవస్థాపకులు శ్రీ

ఎం.కె.రాముకు అంకితంగా 2009 లో వెలువడిన ఆచార్యులవారి రుబాయీల సంపుటిలో 304 రుబాయీలున్నాయి.

"కాలం ఒక కాగితం ఒక బొమ్మను గీసిపో / కాలం ఒక సచ్చరిత్ర ఒక మంచిని చేసిపో / ఈ దేహం శాశ్వతం కాదని నీకూ తెలుసు / కాలం దేవుని రూపం ఒక పువ్వును వేసిపో" అని మొదలయ్యే ఈ సంపుటి "అందరు బాగుండనీ / అన్నీ బాగుండనీ / కవిగా నా ధ్యేయమిది / అందరు సుఖముండనీ" అని ముగుస్తుంది. ఒక 'ఆధ్యాత్మిక స్పృహ' ఈ సంపుటిలోని అనేక రుబాయీల్లో చొరబడింది. బహుశా కవి అనుభవపూర్ణత, జీవితగమనం, ప్రక్రియా పరంగా ఆయన మమేకమైన ఈ తెలుగు 'రుబాయీ'ల్లో ప్రతిఫలనమైందనవచ్చు.

2009 లో 'పలుకరించే పరిమళాలు' వెలువరించిన ఏడాదికే తన రాటుదేలిన కలం ప్రతిభతో 'రుబాయీ'లు ప్రక్రియలో రాబోయే తరాలకు ఉపయుక్తమయ్యేలా, తెలుగువారందరూ ఎదకు హత్తుకోదగిన విశిష్టకృషిని 'తెలుగులో మాటాడుకుందాం'గా తిరుమల శ్రీనివాసాచార్యులుగారు, తెలుగు సాహిత్య ప్రపంచంలో వెలయించారు. ఇది ఒక చక్కని, ఉపయుక్తమైన ప్రయోగం.

'తెలుగు ఆటలు ఆడుకుందాం / తెలుగు పాటలు పాడుకుందాం / వెలుగునకు పర్యాయపదమౌ / తెలుగులో మాటాడుకుందాం" అంటూ తిరుమలవారు, ఈ గ్రంథం మొదట తెలుగు వైభవ ప్రాభవాలను, తెలుగులోని మహనీయమూర్తులను ప్రస్తావించారు. అనంతరం ఇవాళ తెలుగులో మాట్లాడడంలో ప్రయుక్తమవుతున్న అనేక దోష భూయిష్టమైన పదాలనూ, వాటి సరియైన స్వరూపాలనూ వివరించారు. 'రుబాయీ'లలో ఈ విషయాలను చెప్పడం నిజంగా గొప్ప ప్రతిభ! దీనివల్ల 'ధారణ'కు అనుకూలత కూడా ఉంది. 'రుబాయీ' ప్రక్రియలో ఇదొక సార్థకమైన రచన. మంచిప్రయోగం. ఇందుకు ఆచార్యుల వారెంతయినా అభినందనీయులు.

గత సంవత్సరం 2012 లో డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య గారి కవితాసంపుటి 'నా దేశం నా ఆవేశం' ధ్వన్యనుకరణ కళాకారులు పద్మశ్రీ నేరెళ్ళ వేణుమాధవ్‌గారికి అంకితంగా వెలువడింది. తిరుమల వారే అన్నట్లు "కలం పట్టుకున్నప్పుడల్లా నా దేశం, నా దేశంలోని సంఘర్షణలూ, ప్రగతి ప్రయత్నాలూ, శాంతిసమన్వయాలూ, జరుగుతున్న పరివర్తనలోని తీరుతెన్నులూ, అన్నీ నాలో ఒక ఆవేశాన్ని ఉద్గమింపచేస్తాయి. ఆ ఆవేశం కవితగా కాగితంపై ప్రసరిస్తూ తరగెత్తుతుంది. అలా

విభిన్నవేళల్లో ఎగసిన ఆవేశ తరంగాలే ఈ రుబాయిలూ. వాటి సంకలనమే ఈ సంపుటి".

"ప్రజాధనం తమకోసం వాడేస్తారు / ప్రజావనం పెరగకుండ తోడేస్తారు / నేటి నాయకులు నూటికి తొంభైపాళ్ళు / సేవపేర కాళ్ళుసేతులాడిస్తారు" అని ఆవేశంగా మొదలయ్యే ఈ సంపుటి "నా దేశం నా లోపల వికసించే ఉద్దేశ్యం / నా దేశం ప్రత్యణువును వెలిగించే ఆవేశం / నాకు పదార్థాలన్నీ చెంత ఉండి అందించే / నా దేశం నిరంతరం నా పాలిటి పదకోశం" అంటూ సంపూర్ణమవుతుంది.

ఇవాళ హంగులూ, ఆర్భాటాలూ పెరిగి సహజత్వాలు లోపిస్తూ 'ఆత్మ'లోపిస్తున్న వైఖరులపట్ల కవి ఆర్తి చెందుతున్నారు. ఆ ఆర్తినే వ్యంగ్యస్ఫూర్తిగా వెలయిస్తున్నారు. "జవ్వనికేం? బాగున్నది నాసిక తప్ప / సినిమాకేం? అద్భుతమది, ఒక కథ తప్ప / ముఖచిత్రం కాగితమూ ముద్రణ సొగసు / అన్నీ బాగానే ఉన్నై కవనం తప్ప" అన్నారందుకే.

"జననీ జనకులను మరచిపోతే ఎట్లా / బోధించిన గురుని మఱచిపోతే ఎట్లా/ నీ కోసం నిచ్చెన నిలిపిన దేశాన్నే / ఋణం తీర్చకుండ మఱచిపోతే ఎట్లా" అంటారు తిరుమలవారు.

డా॥తిరుమల శ్రీనివాసాచార్యగారు సమాజాన్నీ, మనుషులను, దేశాన్నీ, సమస్తవిషయాలనూ ఒక సానుకూల దృష్టితో మానవీయ విలువల మూలకందంగా చూసినవారు. చిత్రమైన లోకరీతులపట్ల హాస్య, వ్యంగ్య, అధిక్షేపాలతో ఋజుమార్గంలోకి మలుపు త్రిప్పే ఆలోచనలు చేసినవారు. ఆయన సాహిత్యకృషి ప్రయోజనదాయకమైనది. ముఖ్యంగా 'రుబాయి' ప్రక్రియను తెలుగులో సామాన్య జనానికి కూడా అర్థమయ్యే విధంగా కవిత్వ రచనామార్గంగా అందుకని, ఆ ప్రక్రియలో తెలుగులో విస్తృతంగా రచనలు చేసిన ప్రతిభాపాటవాలు ఆయనవే! తన కవిత్వాన్ని సాహితీ సుగంధాలతో సమాజం పరం చేసిన రుబాయిల కవి సమ్రాట్టుగా డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు సదా అభినందనీయులు. ✻

**(చినుకు మాసపత్రిక ఏప్రిల్ 2013)**

# (27) చదవతగిన పుస్తకం: కొడిగట్టిన సూర్యుడు

**అ**యిదేళ్ల క్రితం కొడిగట్టిన సూర్యుడు చదువుకున్న కొత్తలో ఓ మిత్రునితో పుస్తకం గురించి, ప్రక్రియ గురించి, కవిత్వం గురించి సందర్భం వచ్చింది. వచన కవితా కథానిక అనే ప్రక్రియ శీలా వీర్రాజుతోనే ప్రథమమూ, సమగ్రమూ అయిందన్న కుందుర్తిగారి అభిప్రాయాన్ని చెబితే ఆ మిత్రుడు రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారి 'విలువలు', 'మెరుపు మెరిసింది' అన్న కథలూ, బీనాదేవి 'కన్నీళ్ళొచ్చాయి' కథావస్తు స్వీకరణ దృష్ట్యాను, రచనా పద్ధతి దృష్ట్యానుకూడా మంచి వచన కవితా కథానికలుగా ముందేవచ్చాయి అన్నాడు. కళాకేళి జూన్ 69 సంచికలో రవిబాబు 'అద్దెగది' సమీక్షచేస్తూ ఇలానే వ్రాశాడు.

అంతకన్నా విచిత్రం ఏమిటంటే – ఒకాయన – ఈ వచనకవితా కథానిక ప్రక్రియ కొత్తదేమీ కాదని, ఇది సంస్కృతాన్ననుసరించే వచ్చిందనీ అనడం. కొత్తదని మనం ఏది చెప్పినా అది పురాణాల్లోనూ, వేదాల్లోనే ఉందనడం, అంతగా అయితే ప్రస్తుతం కవిని అభినవకాళిదాసో, వాల్మీకో అని పొగడడం ఈ మధ్య కొందరికి బాగా అలవాటయిపోయింది. ఇంతకీ ఆయన అన్నదేమిటంటే –

"బాణుని 'కాదంబరి' ఈ కవితా కథానికలకు అసలుమూలం. కాదంబరి శైలి గద్యమే అయినా అందులో కవితాత్మయే వుంది. ఆ గద్యంలో తొంగిచూసే కవితాగుణం అపారం. 'గద్యం కవీనాం నికషం వదన్తి' అనీ, 'బాణోచ్ఛిష్టం జగత్ సర్వం' అనీ అందుకే అనూచానంగా వస్తోంది ఓ నానుడి. కాదంబరి కథ అంతా పెద్ద వచన కవితాకావ్యం వంటిదే. ఇప్పటి ఈ కవులు ఈ ప్రక్రియలో అందిపుచ్చుకున్న వర్ణనావైభవం, భావచిత్రణ అన్నీ అక్కడ పుష్కలంగా వున్నవే. రకరకాల అలంకారాలు ఉపయోగించుకొనడం ద్వారా భావచిత్రణ చేయడం బాణుడే చేశాడు" అంటూ అరగంట అనర్గళోపన్యాసం చేశారాయన. "ఇంతకీ మా వీర్రాజు గారి కావ్యం

గురించి మీరేమంటారు?” అంటే “ఆయనకేం చాలా బాగా వ్రాశారు. సంస్కృతంలో వున్న కాదంబరి ప్రక్రియలోకి దింపి కథాత్మక కావ్యాలను వర్తమానంలో చక్కగా వ్రాస్తున్న అభినవ బాణులు వారు. ఆయన్ని ఆంధ్ర బాణుడు అంటాను నేను” అన్నారాయన. సరేనని వచ్చేశాను.

‘వీర్రాజుగారూ! మీరు కాదంబరి చదివారా?’ అని వారిని అడుగుదా మనుకుంటూనే ఆ సంస్కృతపాకం వాసనైనా వారికి తగల్లేదనే అనుకుంటూ, ఇంతవరకూ అడగనేలేదు.

ఆ రోజు వీర్రాజుగారిని ఆంధ్రబాణుడు అన్న ఆయనే ఇంకా చాలా ఉపన్యాసం యిచ్చారనుకోండి. ‘నానృషి: కురుతే కావ్యం’ అన్నది బాణునికి లాగానే వీర్రాజుగారికి కూడా వర్తిస్తుందనీ, వీర్రాజుగారు ఋషేననీ అన్నాడాయన. వీర్రాజుగారు పుస్తకావిష్కరణ సమావేశాలు ఎందుకు పెట్టడం లేదో నాకు అర్థమైందప్పుడు. వీర్రాజుగారు ఋషేమిటి? ఆయన సంసార సుభద్రమైన జీవితం పాటకు పల్లవి కూడా వుంది. నేటి సంఘంలో సమాజంలోవుంటూ సామాజిక స్పృహతో స్పందిస్తున్న కవిహృదయం ఆయనది. కవులను ఋషులను చేస్తేగానీ తృప్తిపడని కావ్యవిమర్శకులను చూస్తే చిరాకెత్తుతోంది.

శీలా వీర్రాజుగారు వచన కవితా కథను ప్రతిభావంతంగానే చేపట్టి సాగించడం జరిగింది కాబట్టే పై అభిప్రాయాలన్నీ వచ్చాయి. ఆ అభిప్రాయాలు ఇక్కడ చెప్పడానికి కారణం వీర్రాజుగారి ప్రత్యేకతను స్పష్టపరచడానికే.

‘కొడిగట్టిన సూర్యుడు’ 1965 లో వెలువడ్డాక రెండవ ముద్రణ రెండు నెలల క్రితమే అందమైన కొత్త గెటప్‌లో కళాత్మకంగా వెలువడింది. ‘కొడిగట్టిన సూర్యుడు’ కాక ‘ముళ్ల రెమ్మ’, ‘విశ్వాసం నీడకింద’ అనే మరో రెండు – మొత్తం మూడు కవితా కథానికలున్నాయి ఇందులో. ఈ మూడు కథల్లోనూ స్థూలంగాచూస్తే ఒక పాత్ర ఇంకోపాత్రమీద అభిమానాన్ని, ప్రేమను పెంచుకోవడం, అది భగ్నంకావడం కనిపిస్తుంది. మొదటి, రెండు కథల్లో అలా ప్రేమ పెంచుకున్నది స్త్రీ పాత్రలు కాగా ‘ముళ్లరెమ్మ’లో శ్రీనివాసుపాత్ర అలాంటిది. ఈ మూడు కథల్లోనూ ప్రేమ సంవిధానం ఒకేలా గోచరిస్తుంది. ‘కొడిగట్టిన సూర్యుడు’లో నర్సు కృష్ణవేణి, నిరాశతో కుమిలిపోతున్న పార్వతీశం అనే పేషెంటులో ఆశ కలిగించి, తన స్తబ్ధజీవితంలోకి అతనిని

ఆహ్వానించుకుని వెన్నెలలు పండించుకోవాలని అనుకుంటుంది. నిద్రమత్తులో ఆ రాత్రే అతనికి ఇవ్వవలసిన దానికంటే ఎక్కువడోసులో మార్ఫియా ఇంజెక్షన్ యిచ్చి అతనిని చేజేతులా కోల్పోతుంది. 'ముళ్ల రెమ్మ'లో శ్రీనివాసు, తననికాదని ఎక్కువగా చదువుకున్న కారణం వల్ల మరెవరినో చేసుకున్న పావని– 'పెళ్లి చేసుకుని పప్పన్నం ఎప్పుడు పెట్టిస్తావు?" అని అడగగా అడగగా, చాలా ఏళ్ల తర్వాత ఎవరో వితంతువుని వివాహమాడి ఆమె కోరిక తీరుస్తాడు. కానీ పెళ్లయ్యాక ఓ మిత్రుడి ద్వారా పావని అప్పటికి ఓ వారం ముందే భర్తను యాక్సిడెంట్‌లో కోల్పోయి వితంతువయిందని వింటాడు. అప్పుడనుకుంటాడు – 'అయ్యో! ఇన్ని సంవత్సరాలు ఎదురు చూసిననేను మరొకవారం ఎందుకు ఎదురు చూడలేదు?' అని. "జీవితాంతం ఆ ఆలోచన అతన్ని వదలదు / జ్ఞాపకాల గాలులు వీచినప్పుడల్లా ఆ రెమ్మ అలా రెపరెపలాడకతప్పదు" అంటారు చివర్లో కవి.

తొలి రెండు కథలకన్న వస్తు వైవిధ్యం అంతగాలేకున్నా మూడో కథ 'విశ్వాసం నీడక్రింద' సంకలనంలో ఓ విశేషరచన. ప్రేమసంవిధానమే ఇందులోవున్నా వ్యక్తీకరణ పద్ధతిలో నవ్యతవుంది. దమయంతి అందగత్తెకాదు. డబ్బున్నది. ఆమె ప్రియుడు బాలకృష్ణ ఓ వర్షంపడుతున్న ఉదయమే ఆమె దగ్గరికొస్తాడు. అంతకు ముందు ఎన్నాళ్లక్రితమో అలాంటి వర్షవేళలో దమయంతి పోసిన కాసిన్నిపాలతో విశ్వాసంతో ఆమెనే అంటిపెట్టుకుని వున్న (వూర) కుక్క, బాలకృష్ణ రావడంతోనే అతన్ని చూసి మొరుగుతుంది. బాలకృష్ణకు చిరాకెత్తించిందన్న కోపంతో దమయంతి ఆ కుక్కను చీపురుతో తెగబాదుతుంది. ఆ తర్వాత తనకోరికలు తీరుతాయనుకునేవేళ బాలకృష్ణ ఆమెని వంద రూపాయలు అడుగుతాడు. ఆ వందరూపాయలతో బాలకృష్ణ మరోచోట సుఖాన్ని కొనుక్కోదలచుకున్నాడని దమయంతికి అతని యధార్థ నైజం తెలుస్తుంది. అతనికన్నా తన కుక్కపిల్లే విశ్వసనీయమైందని ఆమె గ్రహించి ఆప్యాయంగా దానిని ముద్దాడుతుంది.

ఈ మూడో కథలో వీర్రాజుగారి రచనా సంవిధానం చాలా రసార్ద్రంగా వుంది. ఆఖరికి కుక్కపిల్ల గురించి కూడా–

ఏ ఐశ్వర్యవంతుని బడుద్దాయి చిన్నబ్బాయో
ఆడుకోడానికి మనుషులు పనికిరాక

ముచ్చటగా కొనుక్కున్న కుక్కపిల్ల కాదది
ఎంగిలిపడని నాజూకు తిళ్ళూ
చల్లారని గోరువెచ్చని పాలూ
ఒంటి మీద తెల్లటి జూలూ
సబ్బునీళ్ల స్నానాలూ
సాయంత్రపు షికార్లులేని సామాన్యపు ఊరకుక్క' అని అతి చిన్న పదాల్లోనే వ్రాస్తూ దాని విశ్వాసం విలువను –

'కుక్కపిల్ల చుట్టూ గాలి తెరల్ని తిప్పి
ఆ తెరలతో దాన్ని దోబూచులాడించి
దానితోబాటు మనసును గంతులేయించి...' న దమయంతి చేష్టద్వారా చక్కగా అనుభూతి రమ్యంగా చిత్రించారు

చివరకు దమయంతి బాలకృష్ణ నైజాన్ని గుర్తించినప్పుడు వ్రాసిన వాక్యాల్ని చూడండి –

"ఇతరుల ఆనందాల అగరువత్తుల్ని కాల్చి
మంచితనాల మల్లెల్ని పిండి
సువాసనల స్వార్థాన్ని తీసి
ఆ స్వార్థాన్నే ఊపిరిగా పీల్చి బ్రతికే
పచ్చి స్వార్థపరుడివి నువ్వు, నీ అవసరం నాకు తెలుసు
నా డబ్బుతో మరోచోట ఆనందాన్ని
అంగట్లో కొనుక్కొని వద్దామని
నా త్యాగాన్ని మంటగా రగుల్చుకుని ఈ చలిరోజు కొసల్ని పట్టుకుని
నా మీద అభిమానంతో నన్నెతుక్కుంటూ వచ్చినట్టు
ఇంత ప్రొద్దుటే యింత వర్షంలో వచ్చావునువ్వు
వర్షం తుంపర్లలో తడిసి కరిగి పాలిపోయిన
నీ ముఖంలోని అభిమానం పౌడర్ని గుర్తించగలను
నీ నాటకం నేను భరించలేను." అంటుంది దమయంతి. పాత్రల

సంభాషణలను వ్రాయడంలో కవి నైశిత్యం యిది. వర్ణనానైపుణిని ఉదాహరించడానికి విస్తరణభీతి అడ్డువస్తోంది.

వచనకవితా కథానికలన్నీ వస్తువును ఎన్నుకోవడంలో అంతగా వైవిధ్యాన్ని చూపుతున్నట్లు లేదు. శీలా వీర్రాజుగారి బాటలో వచన కవితా కథానికలు కొన్ని వ్రాసిన మరికొందరి రచనల్లో కూడా ఈ ప్రేమతత్వమే ఇప్పటికీ చాలా భాగం కనిపిస్తోంది. కొన్నికొన్ని అలంకార పదబంధాలు, వాక్యాల అల్లిక అన్ని కథల్లోను అదే మోస్తరులో కనిపిస్తుంటాయి. శీలా వీర్రాజుగారి భావచిత్రణ చిత్రకారుడైన కథకుడు, కవిచేసే వర్ణనలు కాబట్టి చాలా అందంగా కళాత్మకంగా వుంటాయి. కవి యొక్క ఇమేజరీ రసహృదయుడైన పాఠకుడు స్వయంగా తెలుసుకోవలసినది.

ముఖ్యంగా వచనకవితా కథానిక ప్రక్రియ అటు కవిత్వం కిందకీ కాక, ఇటు కథా ప్రక్రియలోకీకాక, ఒక ప్రత్యేకతను కలిగిందీకాక అలా వుండిపోయే ప్రమాదం రాకుండా వుండాలంటే ఈ ప్రక్రియ నవ్యత్వాన్ని సంతరించుకుని విస్తరించాలి. ఇది వచనకవిత్వంలోని భాగమని కథకులూ, కథాప్రక్రియలోని కొత్త పద్ధతి అని కవులూ అనుకుంటూ నిర్లక్ష్యంచేసే వైఖరికాకుండా చూసుకోవాలి. ఒక ప్రత్యేకశాఖగా విస్తరిల్లాలంటే అమితమైన కృషి జరగాలి యింకా. ఇది ఒకరివల్ల అయ్యేపనికాదు. పలువురూ ఈ పద్ధతిని చేపట్టకపోవడానికి కారణం రాయలేని తనమో, ప్రక్రియపట్ల సదభిప్రాయం లేకపోవడమో తెలియడం లేదు. శీలా వీర్రాజుగారి 'మల్లీ వెలుగు' వచనకవితా కథానిక కాదుగానీ వర్ణనాత్మక కావ్యం. అది ఒక ప్రత్యేకమైన అతినవ్య వచనాత్మక కావ్యం. కథతో కూడి అంతటి విస్తార రచనలు రావాల్సి వున్నాయి. వచనకవితా కథకు కథను ఎన్నుకునేటప్పుడు ఈసారి రొటీన్‌కు విభిన్నమైన వస్తువును ఎన్నుకోవాలి. ఈ ప్రక్రియపట్ల అత్యంత విశ్వాసం వున్న కుందుర్తివంటి వారుకూడా ఇలాంటి రచన వొకటిచేస్తే–యువతరం మరింత ఉత్సాహంతో ఈ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లి పటిష్టమూ, ప్రయోజన వంతమూ చేస్తుందని విశ్వసించవచ్చు. అందుకుగాను ముందుగా అందరూ చదవదగిన పుస్తకం శ్రీ శీలా వీర్రాజు గారి 'కొడిగట్టిన సూర్యుడు'. *

**(ప్రజావాహిని వారపత్రిక 23 అక్టోబర్' 1974)**

# (28) కవిత్వం ఓ జ్వర చికిత్సాలయం

**మా**మూలు వాళ్లకు జ్వరం చేయడం వేరు. కవులకు జ్వరం చేయడం వేరు. అసలు మంచి కవిత్వం చదివినా, కథ చదివినా, చదివాక జ్వరం వచ్చినట్లుండాలి అనికూడా ఊరికే అనలేదు. శ్రీశ్రీకి టైఫాయిడ్ వచ్చి తగ్గాకే మహాప్రస్థానంలోని అద్భుతగీతం ఆవిర్భవించింది. ఇంతకీ జ్వరం ఎవరికైనా ఎందుకు వస్తుంది. ఉన్నస్థితి ఉన్నతస్థితివైపు వెళ్లకుండా హఠాత్తుగా కలిగే ఒక గందరగోళం, రుగ్మత, జ్వరం వచ్చినప్పుడే తెలుస్తుంది. మానవసంబంధాల అసలుతనం కూడాను. నిజంగా సేవ చేసేవారెవరో, మనలను కనిపెట్టుకుని ఉండేవారెవరో, పరామర్శించేవారెవరో అప్పుడే అర్థం అవుతూ వస్తుంది. 'జరిగితే జ్వరమంత సుఖం లేదు' అనే సామెత ఉట్టినే ఏమీ పుట్టలేదు. ఎప్పుడో అప్పుడు జ్వరం రావాలి. 'జిగ్రున చీదెరగరు' అని ఆరోగ్యం గురించి గొప్పలు చెబుతుంటారు గానీ, పడిలేచినవాడికి తెలిసే సంగతులు పడని వాడికి తెలియదు. ఏదో పడకపోతేనే జ్వరం వస్తుందన్నదీ ఓ పాయింటే.

వ్యవస్థను రోగగ్రస్థంగా ప్రతిపక్షం భావిస్తూంటూంది కనుకనే క్షాళనకోసం ప్రయత్నిస్తుంది. ఆరోగ్యశ్రీ వెల్లివిరుస్తోంది అనుకుంటున్న చోట అభివ్యక్తం కాని డొల్లతనం ఒకటి ఎక్కడో గుల్లచేస్తూనే ఉండవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారన్న పాయింటు పట్టుకునే–భాగ్యవంతులు కావడానికీ, కొందరిని సంపన్నులను చేయడానికి ఆరోగ్యపథకాలు కొన్ని సంక్షేమ బాటలుగా ఆరోపింపపడుతూంటాయని అర్థమవుతూండే విషయమే.

కె.శివారెడ్డి 'ఆసుపత్రి గీతం' రాసి పాతికేళ్లయి పోయినట్లుంది. తన అనారోగ్యం వల్ల ఆసుపత్రిలో చేరి, చాన్నాళ్లు ఆ వాతావరణంలో ఉండి కవిగా అనుభూతి చెంది, వ్యవస్థకు ఆసుపత్రిని ప్రతీక చేసి పలవరించిన కవిత అది. దీర్ఘకవిత అంటాంగానీ కావ్యత్వ లక్షణాలు సంతరించుకున్నదే. నగ్నముని 'కొయ్యగుర్రం'ను ఆధునిక మహాకావ్యం అని చేరా ప్రతిపాదించినప్పుడు చాలా తర్జన భర్జనలే జరిగాయి. సరే

కావ్యం అన్నా, దీర్ఘకవిత అన్నా మరేమన్నా అందులోని విషయం ప్రధానం. అందులోని కవిత్వం ప్రధానం.

ఆసుపత్రులు అంటే ఇప్పుడు మరీ భయపడేలా తయారయ్యాయి. కార్పొరేట్ వైద్యం కాలుమీద కాలువేసుకు దర్జాగా ఉంది. పేదవాడి ప్రభుత్వఆసుపత్రి మందులు లేక, డాక్టర్లు లేక వెలవెల బోతోంది. కొంతకాలం క్రితం దాకా కూడా ఆ స్థితి లేదు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రిగాని అంతకన్నా మరీ దగ్గరగా ప్రసూతులు జరిపే జఢ్జి దవాఖానా గానీ, పిల్లల రోగాలకై నీలోఫర్ ఆసుపత్రి గానీ, ఫీవర్ హాస్పిటల్‌గానీ ఎంతో ప్రాణరక్షకభావనతో, సాన్నిహిత్యంగా విశ్వసనీయంగా తోచేవి. ప్రభుత్వ ఆసుపత్రిలో అరకుపుచ్చుకున్నా, ఏ గోళీలో మింగినా స్వస్థత కలుగుతుందనే కనీసనమ్మకం ఉండేది. ఊళ్లల్లో డాక్టర్లు కూడా ఇప్పటంత వ్యాపార దృక్పథం కలవారిగా తోచేవారుకాదు. ఇంగ్లీష్ డాక్టరంటే అప్పుడూ ఒక ప్రత్యేకహోదాయే. ఆయుర్వేదం ప్లస్ కవిత్వం కలగలసిన కవిభిషక్కులు ఎందరో ఆ రోజుల్లో కానవచ్చేవారు. చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం. కొత్తపల్లి శ్రీలక్ష్మీగణపతి ఆయుర్వేద నిలయం మందులకే కాక ఆ డాక్టర్లు మంచి కవిత్వం చెప్పేవారుగానూ ప్రసిద్ధులు.

వైద్యానికీ, కవిత్వానికీ పొంతన కుదరదనుకోనక్కర్లేదు. 'వైద్యం మానేసి కవిత్వం మీదే శ్రద్ధ పెడుతున్నానోయ్' అని ఒకాయన అంటే – 'ఏదైతేనేంలే మా ప్రాణాలు తీయడానికి' అని మరొహాయన చమత్కరించాడట. నిజానికి ప్రాణం పోయగలవారు, ప్రాణానికి హాయినివ్వగలవారు డాక్టర్లూ, కవులే. నిజానికి ఇద్దరికీ వ్యాపారదృష్టి ఉండకూడదు. మానవ సేవాభావన ఉండాలి. కష్టజీవికి ఇరువైపులా నిలిచేవాడే కవి అన్నదందుకే. అయితే ఇప్పుడు రోజులుమారాయి. వైద్యంలోనూ, కవిత్వంలోనూ చిత్తశుద్ధి తగ్గింది. నిజాయితీ కుంటుపడుతోంది. హార్దికం కాక ఆర్థికం ముఖ్యమవుతోంది. దాంతోనే కొత్త కొత్త రుగ్మతలు పుట్టుకొస్తున్నాయి. మునుపులేని రోగాలు చాలా వచ్చాయి. కార్పొరేట్ ఆస్పత్రులు పెరిగాయి. ప్రజావైద్యులు తగ్గారు. వినియోగదారుల చట్టంలోకి డాక్టర్లనూ తెచ్చేసరికి ఎందుకు వచ్చిన రిస్కులే అని అయినదానికీ కానిదానికీ డాక్టర్లూ రోగులపట్ల అతిజాగ్రత్త వహించి, అనవసరమని తెలిసినా పరీక్షలు చేయిస్తున్నారు. ఈసీజీలు, ఎక్స్‌రేలు, బ్లడ్‌టెస్ట్‌లు, స్కానింగ్‌లు

చాలా మామూలైన వ్యవహారాలైపోయాయి. అవసరం ఉన్నా లేకపోయినా ఆడవాళ్ల గర్భసంచులు తొలగించేయడం, సహజ కాన్పులకన్నా సిజేరియన్ డెలివరీలు చేయడం అలవాటైన ఆటైపోయింది. వైద్యరంగంలో హిపోక్రసీ వెయ్యితలల పామై బుసకొడుతోంది.

తెలుగు కవితాజగత్తులో చాలా రోజుల తరువాత ఈ మధ్యే 'అందని చందమామ' కావ్యం ఇదిగో ఈ ప్రస్తుత వైద్యరంగంలోని బండారాలను బయటపెడుతూ, మానవీయ విలువలను ప్రోదిచేసే ఆలోచనలు రేకెత్తిస్తూ వెలువడింది. రాసింది డా॥కాసుల లింగారెడ్డి, జనగామలో పిల్లల వైద్యునిగా పనిచేసి ఎందరికో ఆత్మీయుడైన మనిషే ఆయన. అలా తనవల్ల ప్రాణం పోసుకున్న పునరుజ్జీవితుడైన పిల్లవాడు అరుణ్‌కుమార్ వాళ్ల నాన్న ఎత్తుకుని ఉండగానే ఆ పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించాడు. ఆసుపత్రిగీతం రాసిన కె.శివారెడ్డి ఆ సభకు అధ్యక్షత వహించగా, వరవరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. హైదరాబాద్‌లోనూ, వరంగల్‌లోనూ ఒకప్పటి వైద్యవాతావరణాన్నీ, క్రమేపి అది మానవీయ విధ్వంసాలతో ఎలా కార్పొరేట్ క్రూరమృగం పంజాకు చిక్కుకుపోతోందో చెప్పారు.

నిజానికి విద్య, వైద్యం ఈ రెండూ ప్రైవేటీకరణ చెందడం వల్ల జరిగే ఘోర విపత్తును మించిన మానవ మహోపద్రవం మరోటి లేదేమో! ఏవైతే మనిషిని నిలబెట్టి మనుగడ సాగించేలా చేసే మౌలికమయిన అంశాలో, వాటిపట్ల ప్రజాస్వామ్యం పేర చెలామణి అవుతున్న ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరి – క్షమార్హం కాని తప్పిదం. కానీ జరుగుతున్నదదే. లింగారెడ్డి కవియే కాదు. డాక్టర్ కూడాను. తానేమీ ప్రజావైద్యుడిని కాననీ, అయితే వైద్యం అనేది వ్యాపారం అనుకున్నా, దానిని నీతిమంతంగా మాత్రం చేశాననీ వినమ్రంగా చెప్పాడు. నిజంగా ప్రజావైద్యులనదగిన రామనాథం వంటి డాక్టర్లను తలుచుకుంటూనే–అసలు ఈనాడు 'సేవాదృక్పథం' అనేది ఎలా కనుమరుగవుతున్నదీ, వైద్యునికీ రోగికీ మధ్య ఉండవలసిన సంబంధం ఎలా దెబ్బతింటున్నదీ, ఫార్మస్యూటికల్ రంగం ఎలా ఆర్థిక శక్తులను శాసిస్తున్నదీ అనేక ఆలోచనలకు 'అందని చందమామ' తెరతీసింది. తెలకపల్లి రవి, నాళేశ్వరం శంకరం– లింగారెడ్డి 'అందని చందమామ'లోని అంతస్సారాన్ని పరిచయం చేశారు.

నిజమే! పనికొచ్చే సభలకు పట్టుమని పదిమంది ఉండరు. ఒక పుస్తకం ముఖచిత్రం అచ్చువేసుకోదగిన ఖర్చుతో ఆహ్వానపత్రం ముద్రించి ఆర్భాటం చేసే సంస్థల సమావేశాలకు తరలివచ్చే ప్రేక్షకుల్లో వినడానికి ఉత్సుకత, ఓ సీరియస్‌నెస్ కనబడవు. కొందరు కేవల సభారంజక ప్రాసంగికులు కాకపోవచ్చు. కానీ సమాజహిత చింతనా శీలురైన చిత్తశుద్ధి గల వక్తల మాటలు పదిమందీ విన్నప్పుడు, కొంతయినా కదిలేదీ, కదిలించేదీ, పెనునిద్దుర వదిలించేదీ కానవస్తుంది. రవ్వంత ఆలోచన రగిలి ఆలోచనల తేనెతుట్టెను కదుపుతుంది.

అన్నిటికీ శస్త్ర చికిత్సలే అక్కర్లేదు.

అసలు సిసలు వైద్యంలో కనుగొనగలగాలే గానీ కవిత్వమూ ఒక భాగమే. కవిత్వ సామీప్యంలో–దగ్గరగా ఒకరు ఆత్మీయంగా కూర్చున్నప్పుడు 'మౌత్‌భీ ఆగయీతొ ఢల్‌జాయెగీ' అన్నట్లు మృత్యువు కూడా పంజాలు త్రెంపుకుని పారిపోగలుగుతుంది. సామాన్యుడికి కవిత్వమూ, వైద్యమూ కూడా అందని చందమామ కాక, వెన్నెలజాలు సోకాలని ఆరోగ్యకర వ్యవస్థను ఆకాంక్షిద్దాం. *

**(ఆంధ్రప్రభ దినపత్రిక 9 ఏప్రిల్'2009)**

# 29 పాలపిట్ట పుస్తకం

**'ఆ**దియందు వాక్యముండెను' అన్నట్లు ఇన్నేళ్ల తన జీవిత కవిత్వ ప్రస్థానంతో కె.శివారెడ్డి అంతిమంగానూ నిలిచే ఓ మాట అన్నాడు. అది– 'ఆమె కలదు, నువ్వు లేవు'

'ఆమె ఎవరైతే మాత్రం...' ఉన్నది తనే. ఉంచేది తనే. తల్లిని బాల్యంలోనే కోల్పోయినా 'ఇండైరెక్ట్ డ్రైవింగ్ ఫోర్స్' అమ్మ అని ప్రగాఢంగా విశ్వసించాడు కనుకనే – "అమ్మ గురించి నాకేం తెలుసు – అమ్మ నుంచి వచ్చాను, అమ్మని చూశాను– ఎప్పటికీ అమ్మని కాలేని నేను, కలం పట్టుకున్నపుడన్నా అమ్మ కాకపోతే – అక్షరాలెట్టా బతుకుతాయి, ఎట్టా ఎదుగుతాయి – ఎట్టా ఎగురుతాయి" అని ప్రతి కవిత పుట్టుకకూ అమ్మలా పురుటినొప్పులు పడి ఇన్ని కవిత్వ శిశువులను ప్రపంచానికి ఇచ్చాడు. అమ్మ మాత్రమే, అమ్మతనం మాత్రమే పొడిబారని చెమ్మదనాన్ని కనులకూ గుండెలకు నిరంతర ప్రేమ వర్షంతో నిలిపి మానవ సంబంధాలను బ్రతికిస్తుంది. అమ్మ అమ్మమ్మ నుండో నాయనమ్మ నుండో మొదలై సోదరిలోనూ, భార్యలోనూ, కూతురులోనూ, మనుమరాలిలోనూ కూడా తల్లీనమై తరుణంలో పుష్పించి పరిమళిస్తుంది. "వెదకటం తెలియాలి. మనుషుల్లో మనుషుల్ని వెదకటం తెలియాలిరా" అంటాడు అందుకే.

కవి కవిత్వాన్ని గుండెల్లో ఒంపుకోవడం కన్నా, అందునా కవి ముఖతః ఎదురుగ్గా కూచుని ఆస్వాదించడం కన్నా గొప్ప అనుభవం ఏముంటుంది. తనను తనే శోధించి, పరిశోధించి, అమర్త్య రూపంలో ఒక పద్యంలా జన్మించిన కవిని ఎండాకాలం కుండలోనీరు గుండె గొంతులోకి ఒంపుకుంటున్నప్పుడు, ఒక అనంత సమరం నుంచి ఒక అనంతానందంలోకి ఇక్కడ నుంచుని పరివ్యాప్తమయ్యే దిఙ్మండలం కేసి చూస్తున్నప్పుడు, మేఘాలమీద ఆనీ ఆనని పాదాలతో నడుస్తున్నప్పటి హాయి, తొలిపొద్దు హిమాలయాల మీద చేతులే రెక్కలుగా ఎగిరినప్పటి అనుభవం... ఆ క్షణమే మహత్తర దివ్యశోభతో ఒక మనోహర లావణ్యంతో పొంగిపొర్లేది.

శివుడన్నట్లు ప్రతివాడూ అర్థనారీశ్వరుడే. తల మీద ఓ గంగను, దేహంలో ఓ అంబను దాల్చినవాడు సైతం "నీ అస్తిత్వాన్ని మర్చిపోయి – ఆమె అస్తిత్వాన్ని

గుర్తించగలవా” అని ప్రశ్నిస్తున్నాడంటే నిజమే ఒక మౌలికతను మూలాధారనాడి సవ్వడితో ముందుంచుతున్నాడు. పుట్టుకతో వచ్చిన కులం, మతం, ప్రాంతం అనే అస్తిత్వాల నధిగమించి మానవీయ అస్తిత్వాన్ని గుర్తించలేనందువల్లనే ఇన్ని భేదాలు, విభేదాలు, ద్వేషాలు. ఒకరికి ఒక అస్తిత్వం కాదు అనేక అస్తిత్వాలుండవచ్చు. అందరూ ఏకత్రితం కాగల ఒక మానవీయ అస్తిత్వాన్ని ఎప్పటికయినా సాధించగలమా అనేది సందేహమే. కానీ ఆ ప్రయత్నమే మనుగడ కాగలగాలి అన్న ఆలోచనా సందర్భాన్ని శివారెడ్డి కవిత్వ ప్రస్థానంలో అనుభూతి నుంచి ఆలోచనకు, ఆలోచన నుంచి అనుభూతి వరకూ ‘ఆమె’ పరంగా సాగిన నిరంతర కవిత్వ హేలను, వివిధ కాలాలలో, వివిధ మానసిక స్థితులలో అనుభవమే ప్రమాణంగా రాయబడిన వాటిని గుడిపాటి, పెన్నా శివరామకృష్ణ పాలపిట్ట పుస్తకంగా కూర్చగా ఆ కవిత్వ పరిచయ సభలో వేణుగోపాల్ గుర్తుచేశాడు.

ప్రేమించడం స్త్రీకి సహజంగా అబ్బిన గొప్ప లక్షణం, ఆ తత్వాన్ని నేను వీళ్లదగ్గర నుంచి ఇంకా నేర్చుకుంటూనే ఉన్నాను అంటూ ‘ఫీల్ మై లవ్’ అన్న ప్రేమ యొక్క వివిధ పరివ్యాప్త అస్తిత్వాల అక్షర రూపం ‘ఆమె ఎవరైతే మాత్రం...”. కోపంగా, ద్వేషంగా, శాసనంగా స్త్రీ అస్తిత్వవాద కవిత్వం ఎనభై దశకంలో ఎగిసిన సందర్భాలలోనూ శివారెడ్డి ‘ఆమె’ అనే కవిత్వ వస్తువు ఏ ఒడిదుడుకులు పడలేదు. అతని ‘సౌందర్య దిదృక్ష’లో స్త్రీ పట్ల, అయిదు తరాల స్త్రీ పట్ల అకుంఠిత విశ్వాసానుభూతి భావన చెదరకుండా ఉంది. అతన్ని ఎంత విమర్శించినా తన కవిత్వంలోని ప్రాసంగికతను, సందర్భాన్ని, అందులోని బలాన్ని ఒక కవితా నిర్మాణంగా విమర్శకులు సైతం అంగీకరించక తప్పని స్థితి వచ్చిందంటే తనలోని ఆ గాఢతే కారణం. ‘ప్రేమ ఇచ్చిన ప్రేమవచ్చును’ అన్న బసవరాజు నుండి “అవిరతానందమున్ పొందునపుడు/ నన్ను మరచిపోదువు సరె అట్లెమరచిపొమ్ము/ గాఢ దుఃఖతమంబున కుందునపుడు/ తెరచి హృదయంబు/ అరనిదివ్వెనిత్తు” అన్న కృష్ణశాస్త్రి వరకూ ‘పురూరవుల్ని నిలేసి అన్ని విలువల వలువల్ని ఆవలబెట్టి పరమ దిగంబరంగా రమ్మన్న ఊర్వశులందరికీ జై’ అంటున్న శివారెడ్డి వరకూ ఆమె ఎవరైతే మాత్రం.. చలం అన్నట్లుగా ఊగించి ఆడించి శాసించేశక్తి.

ఇంతకీ గుడిపాటి, పెన్నాల ఆలోచన బాగుంది. శివారెడ్డి కవిత్వంలో ఆమెను ‘ఆమె ఎవరైతే మాత్రం...’ అంటూ సంకలనం చేయడం ఒక విశిష్టత, ప్రత్యేకతే.

ఒకే వస్తువుపై ఒకేకవి భిన్న సందర్భాల్లో భిన్న రీతుల్లో అభివ్యక్తమైనప్పుడు ఎంతో వైవిధ్యం వైరుధ్యం వున్నట్లు కనబడినా ఒక ఏకసూత్రత నిలపగలగడం కవి ప్రజ్ఞే. పాలు స్వచ్ఛతకు సంకేతం. పిట్ట స్వేచ్ఛకు సంకేతం. స్వచ్ఛత, స్వేచ్ఛతతో సాహిత్యం అందునా కవిత్వం, విమర్శ విస్తృతమవడం చాలా అవసరం. పాలపిట్ట బుక్స్ అంటూ గుడిపాటి మొదలుపెట్టిన సంవిధానం మానవ జీవన కథావలోకనం చేస్తూ ఒక దీపఖడ్గంలా ప్రహరిస్తూ ఇప్పుడు 'ఆమె ఎవరైతే మాత్రం...' అంటూ వెలుగొందడం అభిరుచిగల యత్నమే కాదు, విలువలతో కూడిన కృషి.

చలం 'స్త్రీ' పుస్తకం ఆమె భౌతికతను శారీరకతను కూడా మూలకందంగా చేసుకుని విశదీకరించిన గ్రంథం అయితే, శివారెడ్డి 'ఆమె ఎవరైతే మాత్రం..' ఆమె మానసికతను ఆత్మికతను అక్షరీకరించిన అనుభవ సృజన.

"నన్ను కని మా అమ్మ వెళ్లిపోయింది ఇన్నేళ్ల నుంచి మా అమ్మ పురుటినొప్పులు నే పడుతూ బతుకుతున్నా" అంటున్న కవి కవితాశిశువు సిజేరియన్ బేబీగా అవతరించాలని కాక, సహజసిద్ధంగా కనాలని తపిస్తున్న మాతృభావుకుడు. అందం తరగిపోతుందని అక్షర శిశువుకి చనుబాలివ్వని అమ్మదనం కలవాడు కాదు. ఏ నిరోధాలు, విరోధాలు లేని స్త్రీత్వాన్ని అర్ధనారీశ్వర తత్వంగా అక్షరీకరించుకున్న శివుడే. శివుడు లయాత్మకుడు. తల్లీనం చెందడమే లయాత్మకత. అలయే ఊయల.. ఊయల లాగుతున్నదీ, ఊయల లూపుతున్నదీ ఆమె. "శివుడామె ముందు కూర్చుని తపస్సు చేస్తున్నాడు. ఒక ప్రాకృత జ్ఞానాన్నివ్వమని శరీరంతో స్వర్గారోహణం ఎలా చేయాలో చెప్పమని". అందుకే ఇన్నేళ్లయినా ఎన్నేళ్లయినా–

"ఇప్పటికీ గుండెల్లో ఉయ్యాల కదులుతూనే ఉంది/.. వెర్రిగా చిన్నపిల్లాణ్ణి చేసి తిప్పుతూనే ఉంది/ ఉన్నన్నాళ్లూ ఊగుతూనే ఉంటాను/ నేనెళ్లిపోయాక/నా పద్యాల వేళ్ల చివర్లు పట్టుకుని నిరంతరం ఊగుతుంటారు మీరు హాయిగా/ కిందనుంచి పైకి పై నుంచి కిందకీ/ షేక్స్పియర్ అన్నట్లు/ భూమ్యాకాశాల మధ్యనున్న సమస్తాన్ని చూస్తూ/ అనుశీలిస్తూ అనుభవిస్తూ ఆకారాన్నిస్తూ/ ఊపిరి ఆగవచ్చునేమో కానీ ఊయల ఆగకూడదు/ గుండెల్లోని ఉయ్యాల ఆగకూడదు. గుండెగూటిలోని ఈ పాలపిట్ట పుస్తకం అలాంటి ఒక ఊపు. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 30 ఏప్రిల్ '2009)**

# 30 (క)వే మన గోపితో కాసేపు

ప్రజాకవి వేమనపై పరిశోధన చేసి, సాహిత్య ప్రపంచంలో వేమన గోపిగా సుప్రసిద్ధుడై, ఇటీవలే వేమన పద్యాల పారిస్ ప్రతి సముద్ధరణతో ఎక్కడా మునుపు లభ్యంకాని ఏడు కొత్త పద్యాలను వెలికి తీసిన డా.ఎన్.గోపి వస్తుతః కవి. తను 1976 లోనే 'తంగెడుపూలు' కవితా సంపుటి వెలువరించాడు. ఎన్నుకున్న అధ్యాపకవృత్తికి ఉపబలకంగా ప్రజాకవి వేమనపై పరిశోధన చేసి, 1980 లో సిద్ధాంత వ్యాసాన్ని ప్రచురించాడు. సాధారణ డాక్టరేట్స్‌లా పరిశోధనాంశాన్ని అంతటితోనే విస్మరించకుండా ఆ మార్గంలో నూతన అన్వేషణలు సాగించాడు. 1982 లో 'మైలురాయి' కవితా సంపుటి డా.ఎన్.గోపిని సొంతగొంతున్న కవిగా రంగం మీదకి తెచ్చింది. ఒక వంక పరిశోధనలో తలమున్కలవుతూనే కవితా రచన కొనసాగిస్తూ 1989 లో గోపి 'చిత్ర దీపాలు' కవితా సంపుటి వెలువరించారు. కరీంనగర్‌లో స్థాపించబడిన సినారె సాహితీపురస్కారాన్ని మొట్టమొదటగా అందుకున్న కవితాసంపుటి 'చిత్రదీపాలు'. ఈ ఏడాది తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కవితాసంపుటిగా 'చిత్రదీపాలు'కు బహుమతి ప్రదానం చేసింది. 'వేమన గోపీకాదు. కవే మన గోపి' అని కవితాభిమానులు ఆనందించారు.

కవిత్వం, పరిశోధనా రెండు పార్శ్వాలుగా ఎదిగిన గోపీని కవిగా అవార్డులు పొందిన నేపథ్యంలో కలిసి కాసేపు ముచ్చటించడానికి ఓ ఉదయం వెళ్లడం జరిగింది. ముందుగా ఇటీవలి కవిత్వంతో కవిత్వం కబుర్లు మొదలయ్యాయి.

"కవిత్వానికి ఇప్పుడు స్వర్ణయుగం, ఏ ధోరణులు వస్తున్నప్పటికీ, జీవితంలోని చాలా సున్నితమైన పొరల్లోకి నేటి కవులు వెళ్లగలుగుతున్నారు" అంటూ గోపి వస్తు దారిద్ర్యం కనబడుతోందన్న అభిప్రాయం వ్యక్తీకరించాడు. "శిల్పానికి ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తోంది. పర్సనల్‌మూడ్‌కి నేటి కవులు విశేషించి ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఈ ట్రెండ్ ఎక్కువ ప్రబలంగా రావడం మంచిది కాదు. అదే ప్రాబల్యం వహిస్తే వస్తువును మింగేస్తుంది. కవిత్వానికి వస్తురాహిత్యం ఎప్పుడూ మంచిది కాదు

జీవితానుభవంలోంచి కవిత్వం వస్తే వస్తువు తప్పకుండా ఉంటుంది. తన అనుభవమే అందరిఅనుభవం అనుకుంటే వస్తువు పోతుంది. జనంలో మమేకం అయితే వస్తుదారిద్ర్యం ఉండదు" అన్నాడు గోపి.

కవిత్వంలో అస్పష్టత, సంక్లిష్టతల గురించి సహజంగానే ప్రస్తావన వచ్చింది. వీటికి నేటి కవిత్వంలో ఉన్న స్థానం గురించి, సంక్లిష్టత అంటే తాననుకుంటున్నదీ, దానికి హేతువు, ఏ మేరకు దాని ఆవశ్యకత అనే వాటిని గురించి చెబుతూ–

"వ్యక్తి, సమూహం రెండూ ఉంటాయి. సమూహం గురించి రాసినప్పుడు అందులో వ్యక్తి ఉంటాడు. వ్యక్తి తనగురించి రాసినప్పుడు అందులో సమూహం లేకపోతే అది నిజమైన కవితకాదు. నేటికవులు ఎక్కువగా బాల్యంలోకి వెళ్ళిపోతున్నారు. అమ్మగురించి ఆలోచిస్తున్నారు. కారణం సోషల్ ఇన్‌సెక్యూరిటీ ఎక్కువగా పెరిగిపోతోంది. హాయిగా స్పష్టంగా ఉన్న బాల్యం, మధురమైన అమ్మ గురించి రాసే ఈ ధోరణి సంక్లిష్టతవల్ల వచ్చిందే అనుకుంటాను. ఈ జనరేషన్ మహా ప్రతిభావంతులు. ప్రతిభావంతులు తొందరగా నైరాశ్యానికి గురి అవుతారు. ఫ్రస్టేట్ చేసే పరిస్థితులు చుట్టూ ఉన్నాయి" అంటాడు గోపి.

కానీ సమాజంలోని సంక్లిష్టతను కవిత్వంలో ప్రతిఫలించడాన్ని గోపీ సమర్థించడు. ఆ మాటకొస్తే నగరజీవితం పేర సంక్లిష్టత అనే మాటను అతను అసలు ఒప్పుకోడు.

"ఆంధ్రదేశంలో సంక్లిష్టతకు కారణమైన నగరాలు ఉన్నాయనుకోను. బొంబాయి, కలకత్తా వంటి మెట్రోపాలిటన్ నగరాలు మనకు లేవు. హైదరాబాద్ నగర జీవితం సంక్లిష్టమైనదనుకోను. ఒకవేళ సంక్లిష్టత ఉన్నమాట నిజమేఅయితే దానిని స్పష్టంగా దర్శించి సంక్లిష్టతలో ఆ సత్యాన్ని కవిత్వంలో ఆవిష్కరించవచ్చును. సంక్లిష్టమైన పరిస్థితులు ఉండవచ్చు. కానీ అవి కవిత్వంలో రావాల్సిన అవసరం లేదు" అంటాడు.

ఇవాళ కవుల్లో శిబిరాలు ఎక్కువయ్యాయి. ఇవి పోవాలి. ట్రెండ్స్ పేరున విమర్శకులు గీతలు, లేబిలింగ్స్ వేయడం మంచి పద్ధతి కాదు' అన్నాడు గోపి. "వ్యక్తిగత అభిప్రాయాలు ఎక్కువైపోయాయి. ఫలానా పొయెట్రీ ఎక్కడ ఫిక్స్ చేయాలి అన్నది ప్రాముఖ్యమై ఆ కవి ఏం చెబుతున్నాడు. జీవిత చిత్రణ ఎలా చేస్తున్నాడు అనేది చూడడం తక్కువైపోతోంది. లేబిలింగ్ వల్ల కొన్ని రకాల కవిత్వాలు రిసీవ్

చేసుకోడానికి సిద్ధంగా లేరు. అన్ని విలువలూ డబ్బువిలువ ముందు దిగదుడుపు అయిపోతున్నప్పుడు, విలువలన్నీ గల్లంతయినప్పుడు మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఆ ఆవేదనతో చాలా కవిత్వం రావచ్చు. అంత రావటం లేదనుకుంటాను. కవిత్వం జీవితానికి నిబద్ధమై ఉండాలి. ఒకే దృక్పథం నుంచి ఆలోచించడం మంచిది కాదు. దృక్పథాలు కూడా జీవితంలోంచి రావాలి. ఫలానా దృక్పథానికి చెందకపోతే కవిత్వం కాదని నిరాదరించడం మంచిది కాదు" అంటాడు గోపి నిక్కచ్చిగా.

ఇప్పుడు వస్తున్న పద్ధతుల్లో తాను ఏ గీతల్లోనూ లేబిలింగ్స్‌లోనూ లేననీ, ఏ రచయితల సంఘాల పద్ధతిలోంచో తానెప్పుడూ ఆలోచింపలేదనీ, కవిగా తన మొగ్గుమాత్రం మొదటి నుంచీ పీడిత పక్షపాతంగానే ఉందనీ అన్నాడు గోపి.

కవిత్వం గురించి తనకు కొన్ని నిర్దుష్టమైన భావాలు ఉన్నాయి. "కవితలో నువ్వు నీ అనుభవాన్ని సామూహికం చేయటమనే ఒక పద్ధతి ఉంది. కొన్ని రకాల అనుభవాలు కవిత్వంలోకి రాలేదు. సోషియాలజికల్ డైమెన్షన్ తక్కువైపోయింది. జీవితంలోని ఎక్కువ తక్కువలు కవిత్వంలో అంతగా రావడంలేదు. ఒకే వస్తువు ఇద్దరు రాయడంలో తేడా ఉంటుంది. కవి సమూహంలోంచి బెదిరి అంతర్ముఖుడై రాస్తున్న కవిత్వం – ఎదుటివారికి అర్థం కాకపోవడం సరికదా, తనకే అర్థంకాని స్థితి రావచ్చు. వ్యక్తికి సమూహంతో ఆరోగ్యకరమైన సంబంధం ఉండాలి".

తన దృష్టిలో కవిత్వం ఎలా ఉండాలి అన్న సంగతి గోపి ఇలా వివరించాడు–

"కవిత్వం నా ఉద్దేశంలో జీవితాన్ని చిత్రించాలి. కవిత్వం ధైర్యం ఇవ్వాలి. ఫలానా కవిత్వం చదివితే జీవితం మళ్లీ అర్థమైనట్లుండాలి. జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం లోపించి, జీవితం అర్థం కానప్పుడే అస్పష్టతలు, సంక్లిష్టతలు అనే ప్రమాదాలు వస్తాయి. ముందు కవే బెదిరిపోకూడదు. కృష్ణశాస్త్రి ఆత్మాశ్రయ కవిత్వమే రాశాడు. "ఎవియొ అర్థమ్ముకాని భావగీతమ్ములు" అన్నాడు కానీ మరీ అర్థంకానీ స్థితి ఏమీలేదు అతని కవితలో. ట్రాన్స్‌పరెంట్ చీకటి దశ దాటితేనే కష్టం" అంటాడు తను.

అవార్డు పొందిన గోపీ కవితా సంపుటి 'చిత్రదీపాలు' పుస్తకానికి ఆ పేరు కూడా వేమన పద్య స్ఫూర్తితోనే ఉంచానన్నాడు గోపి.

స్వానుభూతి లేక శాస్త్రవాసనలచే
సంశయంబు చెడదు సాధకులకు
చిత్ర దీపములను చీకటి పోనట్లు
విశ్వదాభిరామ వినురవేమ!

తన కవితలు ఒక రకంగా మనోచిత్రదీపాలనీ, మనోచిత్ర దీపాలు బయటికొస్తేగానీ వెలుగవు అనీ అంటూ గోపి కవిత్వం చేయాల్సిన పని ఏమిటో, తన భావసరళిని ఇలా వివరించాడు.

"కవిత్వం నీరసం ఇవ్వకూడదు. జీవితంలో నైరాశ్యం తప్పకపోవచ్చు. అందులోంచి బయటకు రావాలి. మొత్తం ఆశ అనేది ఒక నటన. జీవితానికి నిబద్ధత అంటే నా ఉద్దేశ్యం – నిరాశవుంటే చెప్పండి, కానీ అందులోంచి బయటకు రావాలి. కవిత ఆశ ఇవ్వాలి. లోన నిరాశ పెట్టుకుని అంతా ఆశంటే నటన. సమకాలీన సమాజం నాడిలా స్పందించాలి కవి. ఒకోసారి నాడి కొట్టుకోదు. ఒక్కోసారి విపరీతంగా కొట్టుకుంటుంది" అన్నాడు.

అవార్డులు వస్తాయి. రాకపోవచ్చు. అది కొలమానం కాదు. గోపి కవితా సంపుటాలు మూడింటికీ అవార్డులు వచ్చాయి. 'తంగెడుపూలు' కృష్ణశాస్త్రి అవార్డు, 'మైలురాయి' ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, ఇప్పుడీ 'చిత్రదీపాలు' సినారె సాహిత్యపురస్కారం, తెలుగుయూనివర్సిటీ అవార్డు పొందాయి. గత ఏడాది తెలుగు యూనివర్సిటీ అవార్డు వచనకవితలో గోపి చేస్తున్న కృషికి వచ్చింది కానీ 'చిత్రదీపాలు'కు కాదు. కవిత్వానికే ఫస్ట్‌ప్లేస్. మధ్యలో పరిశోధన వచ్చింది. కవి కాబట్టే వేమనని అంత స్పందనతో పరిశోధించగలిగాడు. పరిశోధనలో పడడం వల్ల అయిదారేళ్లు గ్యాప్ వచ్చింది తప్ప తానెప్పుడూ కవిత్వానికే ప్రాధాన్యం ఇచ్చాడు.

గోపి ఎనిమిదవ తరగతిలో ఉండగానే పద్యకవిత రాశాడు. కృష్ణాపత్రికలో మాత్రాఛందస్సులూ రాశాడు. గోపి పన్నెండువేల పద్యాలు రాశాడంటే నమ్మకం కలగపోవచ్చు. 'నేత' పత్రికలో 'శశి శతకం' వచ్చింది. భువనగిరిలో తమ ఊరి లైబ్రరీలో డా.సి.నారాయణరెడ్డిగారి నాగార్జున సాగరం, స్వప్నభంగం చదివి ఉండకపోతే తాను కవినయ్యేవాడిని కానేమో అన్నాడు గోపి. 1965 లో సినారెను చూడడానికే హైదరాబాద్ వచ్చిన గోపిని కవిగా తీర్చిదిద్దిన ఘనత సినారేదే. బి.ఈలో చేరి మానేసి, బిఏలో అడుగుపెట్టి తెలుగుపంతులు కావడమే జీవిత ధ్యేయం అనుకున్న

గోపి అది నెరవేరి డా.ఎన్.గోపిగా నేడు ఉస్మానియాలో రీడర్‌గా ఎదిగాడు. 'తంగెడుపూలు'లో సినారె ప్రభావం ఉందనీ, 'మైలురాయి' నుంచీ కొంత సొంతగొంతు వచ్చిందనీ నిజాయితీగా చెప్పుకున్నాడు. గోపి తంగెడుపూలు తరువాత, మైలురాయికి ముందూ ప్రవృత్తిరీత్యా అప్పుడు ఎక్స్ట్రీమిటీ ఇష్టం లేకపోవడం, దిగంబర కవిత్వపు అశ్లీలం నచ్చకపోవడం వంటి యుగసంధ్యలోని భయంవల్ల ఎక్కువగా రాయలేదన్నాడు.

తొలుత మాండలికంలో కవితలు రాసిన గోపి ఎక్కువగా మాండలికంలో రాయడం కష్టం అనీ, ఈనాడు జరుగుతోంది మాండలికాన్ని వాడుకోవడం మాత్రమేననీ, ఆ రెండూ వేరువేరనీ అంటూ "శిష్టవ్యావహారికంలో ఆలోచించి మాండలికంలో రాయడం కాక, జనంలో మమేకమై మాండలికంలో ఆలోచిస్తేనే మాండలికం రాయాల"నీ అంటాడు. "మాండలికంలోని కొన్ని ఎక్స్‌ప్రెషన్స్, ఫ్లాష్‌తోకూడిన వాక్యాలు అయిపోయాయి. ఆ జీవితానికి కూడా దూరమైపోయాను. అందుకే మాండలిక కవిత్వం రాయడంలేదు" అన్నాడు. "పూర్తి మాండలికాన్ని కవిత్వంలో రాయడం ఎక్కువ రోజులు సాధ్యంకాదు. వచనంలో పాత్రోచిత భాషగా పెట్టచ్చు. అయితే ప్రాంతీయముద్ర కోసం కవిత్వంలో మాండలికపదాలను వాడుకోవచ్చు. నేటివిటీ కవికి ఉండాలి. అది చిన్న అరకాదు. మట్టివాసన కవితకు లేకపోతే ఎలా'' అన్నాడు.

"ఇప్పటి కవులు ఇంగ్లీష్ పొయెట్రీ ఎక్కువగా చదువుతున్నారు. ఆ ప్రభావం వారిమీద ఉంటుంది. ఉందికూడా. అదివారి పరిధుల్ని విశాలం చేస్తుంది నిజమే. కానీ ఉన్నది ఉన్నట్లు తీసుకొచ్చి పెడితే కష్టం. మన కల్చరల్ సన్నివేశం ఉండాలి" అంటూ గోపి "భావచిత్రాలు–ఒక మంచి బలమైన వస్తువు అనే దారానికి పూసల్లా ఉంటే బాగా రాణిస్తున్నాయి. ఆ వస్తువు లేనప్పుడు తేలిపోతున్నాయి. కేవలం పదచిత్రాల దొంతర భావ దారిద్రానికి తార్కాణం" అంటూ తెగేసి చెప్పాడు.

కవిత్వం కబుర్లతో గోపి గదంతా నిండాక తన భావజాలాన్ని కాగితం మీదకు యథాతథంగా ఏరుకుని అభినందించి వచ్చాను. ✱

(డా.ఎన్.గోపికి 1990 సంవత్సరపు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ వచనకవితా పురస్కారం లభించిన సందర్భంగా 'సుధామ'చేతిలో ఒక చిన్న అక్షర రేఖా చిత్రణ.)

**(ఉదయం దినపత్రిక ఆదివారం ఏప్రెల్ 1990)**

# (31) అక్షరాలలో కవిత్వం - మాటలకందని వ్యక్తిత్వం

**క**వి నిరంకుశుడనే మాట ఒకప్పటి లాక్షణికులది. కాని కవి స్వతంత్రుడు అనడం వేరు. రాచరికపు కాలాల్లో నిరంకుశత్వానికి చెల్లుబాటేమో గానీ ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ గణనీయం. గణతంత్రం అనడంలో సామూహిక ప్రయోజనాలు, సమాజ శ్రేయస్సు ప్రధానం గానీ, వైయక్తిక ప్రయోజనాలు, స్వార్థమూ కాదు. కళ కళ కోసం కాదనీ, కళ ప్రయోజనం కోసమనీ విశ్వసిస్తున్న కాలాన నిరంకుశత్వం పనికిరాదు సరికదా, కవి స్వేచ్ఛ కూడా బాధ్యతతో కూడుకున్నది కావాలి. తన బాధని ప్రపంచపు బాధ అనుకునేవాడి కన్నా, ప్రపంచపు బాధని తన బాధగా చేసుకుని సాగేవాడే ప్రజాస్వామ్యంలో నిజమైన నాయకుడైనా, కవి అయినా.

తన వెలుగు కోసం మంటపెట్టేవారు నేతల్లోనూ ఉంటారు. రచయితల్లోనూ ఉంటారు. కానీ వీటికతీతంగా తమ సృజనను, నేతృత్వాన్నీ కీర్తిప్రతిష్ఠలకూ ప్రచారార్భాటాలకూ, ధనానికీ, పదవులకూ అతీతంగా నిర్వర్తిస్తూ సాగేవారూ ఉంటూంటారు.

కవిత్వంలో ఇజాల జోలికి కాక నిజమైన మానవస్వేచ్ఛను సంకల్పం చేసి అవిశ్రాంత కవితాతపస్సు చేస్తూ వచ్చిన కవుల్లో మాదిరాజు రంగారావు ఒకరు. రావలసిన గుర్తింపులు,అవార్డులుగురించి క్షోభిల్లకుండా 'కవితాయద్యస్తి రాజ్యేన కిం' అన్నట్లు సాగిపోతున్న కవితాప్రస్థానం ఆయనది. తనది 'స్వేచ్ఛాకవిత్వం' అంటారాయన. అందులో ప్రజాస్వామ్య దృక్పథం, మానవీయ భావన, సామాజిక వాస్తవికత, వర్తమానస్థితి చలనం, మనస్తత్వచిత్రణం ఒక పార్శ్వమూ, సమాలోచనంలో– కవిదృష్టి, వ్యక్తిత్వం, కృతి సమాజ ఆదర్శరూపం, మానవీయ విశ్వభావన, మనస్తత్వ ప్రకాశనం, సృజనకళ సంవిధాన శిల్పంపై వెలుగుతో మరో పార్శ్వమూ కలిగింది ఆయన సాహిత్యవ్యక్తిత్వం. తనది 'రసధుని'. 'సృజనకృతిలో చారిత్రకం, సామాజికం కవి మనోరూపం. నేపథ్యంలో భిన్నత్వం అనివార్యమే కాదు

సహజమూ అన్న అభిప్రాయం కలిగింది' అంటారాయన. 1952 నుండీ 'తెలుగు స్వతంత్ర' లో ఆయన 'స్రవంతి' నవతతో సాహిత్య క్షేత్రం లో ప్రవహిస్తూ వచ్చింది.

మాదిరాజు రంగారావు 1936 లో ఖమ్మం పండితాపురంలో జన్మించారు. స్వేచ్ఛాకవిత్వం (48) పరిశోధన, సమాలోచనం (15) మొత్తం 63 పుస్తకాలు ప్రచురించారాయన. డబ్భై నాలుగేళ్ల ఈ కవి సరికొత్తగా వెలువరించిన స్వేచ్ఛాకవిత్వం 'అజ్ఞాతం నుండి'. మాదిరాజు రంగారావు మొదటి పుస్తకం 'కిర్మీరం' కవితా సంకలనం 1958 లో "ఉషాగమాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు" అన్న చలం మాటతో మహాకవి శ్రీశ్రీకి అంకితమీయడం జరిగింది. శ్రీశ్రీ శతజయంతి చివరలో ఇప్పుడు 2010 లో ఈ 'అజ్ఞాతం నుండి' కూడా శ్రీశ్రీ కే అంకితమివ్వడం విశేషం. ఇది దాదాపు చివరిది అంటున్నారు రంగారావు. సుప్త చేతనను సూచించడం ఈ ముక్తక కావ్యం ఉద్దేశ్యం.

"స్వేచ్ఛాకవిత్వంలో సామాజికదార్శనికత ప్రజాస్వామ్య దిశానిర్దేశనంతో నిబద్ధమైంది. భౌతిక భావవాద సమన్వయాన్ని కోరుతుంది. ప్రగతిశీలం కలిగింది." అని చెప్పుకుంటారు.

కవిని అందిపుచ్చుకోవడం కోసం గహనాటవిలో వేటకు వెళ్లడంగా ఉండకూడదు. సమాజ భావనతో ప్రకృతి నేపథ్యంగా మానవ జీవితం వస్తువుగా ఉన్నప్పుడు రూపం, ఆకృతి దృశ్యం, అనేవి విషయ విస్తృతి కనుగుణంగా దృగ్గోచరం కావాలి.

అజ్ఞాతం నుండి రూపం బయటకు వస్తుంది
స్మృతి లహరులపై సృజన భూమి చేరుతుంది
ఎద ఎదను స్పృశిస్తూ విశ్వతలంపై
అస్తమయం లేని ప్రజాస్వామ్య బింబం

అంటూ కావ్యం మొదలవుతుంది. నలభైరెండు ఖండికలుగా సాగిన కావ్యం ఇది. రూపం, ఆకృతి, దృశ్యం ఇలా ఈ ఖండాల నుండి భావప్రసారం అజ్ఞాతం నుండి ఆవిష్కృతమవుతూ తరంగిత మవుతుంది. ఒక గాఢత, చిక్కదనం, తాత్త్వికత వీటిల్లో ఉన్నాయి. అర్థం లేని మాటలేదు. ఊహచేయని మనసులేదు. తుఫాను

ఎరగని జలధిలేదు. మార్పు జరగని ప్రకృతిలేదు. అంటూనే – కంటి చూపు వెలుగులో మంటలు వెలుగులు కావు. పక్కనున్న విగ్రహం మనిషికి తోడు కాదు. అని కటిక వాస్తవాన్ని చెబుతారు.

నిన్న గురించి మాట సులభం కాదు
నేడు గురించి మాట సాధ్యం కాదు
రేపు గురించి మాటకు వీలులేదు
నిన్న నేడు రేపు కలయికతో జీవితం

అంటూ వర్గ కుల సమీకరణ సమాజంలో అందరినీ కలుపుతుంది మానవతా సమీచీనం అంటారు రంగారావు. ఒక దృశ్యంలో అంటారు గదా–సమాజం నిశ్శబ్దంగా ఉండేందుకు వ్యక్తి తాను మౌనంగా ఉంటేనే సమాజానికీ మనిషికీ తప్పని సంబంధం జీవితాన్ని కదిలించే శబ్ద ప్రపంచంతోనే అని. లోపలి నుంచి ఒకరూ బయట నుండి ఒకరూ తమతమ వైపుకు లాగేరు అవసరాలలో ఇరువైపుల నుండీ. పిడికిలిలో బహుమానం. దీనికి మురిసే మతిగతిలోనే జీవితమంతా. ఏ పిడికిలిలో ఏముందో తెలియదు కానీ బయటికి చెప్పలేని రహస్యం ఉందని తెలుసు. అక్షరయానంలో శబ్దంపై అభిమానం. జీవనయానంలో అర్థంపై అభిలాష. చేతిలో గలగలలాడే డబ్బుల్లా మనిషి ముందు క్షణాలు ఆడవు. ఎవరి ఆజ్ఞపై కాలం నడవదని తెలిసీ ప్రతివ్యక్తీ తన పిడికిలిలో కాలాన్ని నిలపాలనే ఆరాటం. మనిషి గురించీ, మనుగడ గురించీ, సమాజం గురించీ, కాలం గురించీ విస్పష్టంగా విశదపరిచే వైఖరి హృదయంగమంగా ఈ ఖండికల్లో కానవస్తుంది. పరిశోధన చేయదగినన్ని కృతులూ, వాటిలో బహుముఖీన సృజనాకృతులూ కలిగిన కవి మాదిరాజు రంగారావు. "మనిషిమాట వినిపిస్తూ–పూవుఫలం కనిపిస్తూ–శూన్యస్థితి నింపే అనుభవ రుచి హృదిలో–కాలాని కతీతమైన కవి బింబం కృతిలో–" అని ముగిస్తారీ కావ్యాన్ని. ఇది చివరిది కాకూడదనీ ఆయన సాహితీ వరివస్య అజ్ఞాతం నుండి సాక్షాత్కారం వరకూ జీవనగీత కావాలనీ ఆకాంక్ష. ✳

**(ఆంధ్రప్రభ దినపత్రిక 21 జనవరి 2010)**

## 32

# ధర్మవిస్తారకమయ్యు, సత్యశుభదాయకమయ్యును.. 'కలం' కళల 'శాస్త్రి'

**వ్య**వస్థ మంచికి మారాలని అందరూ అంటారు. కానీ అందుకు కృషి చేసేవారు కొందరే ఉంటారు. వ్యక్తులవల్లనే వ్యవస్థ మార్పు సంభవం. ఇంతకీ వ్యవస్థ మారడం అంటే వ్యక్తులు మారడమే! వ్యక్తియొక్క సమష్టిరూపమే వ్యవస్థ. అందువల్ల వ్యక్తులలో మార్పుతీసుకొని రావడానికి వ్యక్తే దోహదపడతాడు. అంటే వ్యవస్థలో మార్పుకు కేంద్రబిందువు వ్యక్తే. అయితే ఆ వ్యక్తి యొక్క ప్రభావశక్తే మార్పునకు మూలకందం. 'అతడే ఒక సైన్యం' అనేది అలాంటివారిని గురించే!

పత్రికారంగంలో విలువలను పరిరక్షిస్తూ సమాజహిత చింతనతో కృషి చేసే సంపాదకులు, అందునా యాజమాన్యపు పోకడలను నిగ్రహించుకుంటూ నిజమైన అక్షరయోధునిగా నిలువగలవారు కొరవడుతున్న వర్తమానకాలంలో సంపాదకుడు అన్న పదానికి ఉదాత్తతనూ, వృత్తికి గౌరవాన్నీ నిలబెడుతున్న కలంజీవి శ్రీ మార్తి వేంకట రామచంద్రశాస్త్రిగారు. అలాఅంటే అందరికీ తెలియకపోవచ్చు. కానీ ఎం.వి.ఆర్. శాస్త్రిగారు అనగానే ఆంధ్రభూమి పులకించిపోతుంది. తెలుగునాట నేటి విశిష్ట పత్రికాసంపాదకుల్లో శాస్త్రిగారు అగ్రగణ్యులు.

నాలుగు దశాబ్దాల క్రితం జగ్గయ్యపేటలో ఆంధ్రజ్యోతి విలేఖరిగా పత్రికారంగంలోకి ప్రవేశించిన ఆయన ఈనాడులో 1978 లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా చేరి అసిస్టెంట్ఎడిటర్ వరకూ ఎదిగి 1990 లో ఆంధ్రప్రభలో డిప్యూటీ ఎడిటర్ అయి, ఆ తరువాత 1994 డిసెంబర్ 12 నుంచి ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులుగా అప్రతిహతంగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రభలో ఉండగా కాలమిస్టుగా 'రాష్ట్రాయణం' సంతరించిన ఆయన, ఆంధ్రభూమి దినపత్రికలో గురుతర సంపాదకత్వ బాధ్యతలు వహిస్తూనే 'జంతర్ మంతర్', 'ఉన్నమాట', 'వీక్ పాయింట్' కాలమ్స్‌ను వైవిధ్యభరితంగా రాయడం మాత్రమే కాదు, ఆదివారం

అనుబంధంలో మునుపెవ్వరూ రాయనివిధంగా అనేక చారిత్రక కథనాలను ధారావాహికంగా అందించి, సంచలన రచయిత అనిపించుకున్నారు. అవన్నీ గ్రంథ రూపాన్ని సంతరించుకుని తెలుగు పాఠకుల లోగిళ్ళలో ఆలోచనాత్మకమైన కొత్త కాంతులు వెదజల్లాయి.

విప్లవ వీరుడు 'అల్లూరి సీతారామరాజు' గురించీ, 'మన మహాత్ముడు' అంటూ మహాత్మాగాంధీ గురించీ ఆయన రాసినవి వారి జీవిత చరిత్రలు మాత్రమే అనుకుంటే పొరపాటు. ఆ వ్యక్తుల జీవనపార్శ్వాలను లోతుగా అధ్యయనం చేసి అందించిన వ్యక్తిత్వ జీవనకథనాలవి. ఆయా వ్యక్తుల గురించి వినికిడిలో ఉన్న కథనాలకు భిన్నంగా, భ్రమలను తొలగిస్తూ, వారి బ్రతుకు కథలేమిటో వివరిస్తూ సంఘటనాత్మకంగా సజావైన సాక్ష్యాధారాలతో సంతరించిన ప్రభావోపేత గ్రంథాలవి. ఒక జీవితచరిత్రకారుడు ఒకరి జీవనకథనం ఎలా అందించాలి అన్న దానికి దాఖలాలవి.

ఆయన చదివింది పాలిటెక్నిక్ విద్య మాత్రమే. జర్నలిజంలో అందరూ గొప్పగా చెప్పుకునే డిగ్రీలేవీ శాస్త్రిగారికి లేవుకానీ పాలిటిక్స్‌ను గానీ, జనరల్ సోషల్ విషయాలు గానీ, జర్నలిజం వైఖరులుగానీ ఆయన ఒడిసిపట్టుకున్న తీరు, తన రచనలలో ఎన్నుకునే విషయాలు, వాడే శైలి, విశ్లేషించే నైజం విలక్షణంగా ఉంటాయి. అంతేకాదు సమగ్రతను, సాధికారతను సంతరించుకుని ఆ విషయం పట్ల పాఠకుడికి సంపూర్ణ అర్థావబోధన కలిగిస్తాయి.

ఎం.వి.ఆర్. శాస్త్రిగారి ఏది చరిత్ర, కాశ్మీర్ కథ, ఆంధ్రుల కథ, ఇదీ చరిత్ర, కాశ్మీర్ వ్యథ, 1857 వంటి గ్రంథాలు చారిత్రకులకు కూడా అచ్చెరువు కలిగించే పరిశోధనాంశాలతో ప్రత్యంశ వివరణలతో పరిఢవిల్లుతున్నాయి. అందుకు ఆయన అధ్యయనం, పరిశోధనాదృష్టి, సత్యాన్వేషణ దృక్పథం, సమాజాభ్యుదయ చింతన మూలధాతువులు.

సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపము చేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడబాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష చేసిరది వారలచేటగుగాని ధర్మవి
స్తారకమయ్యు సత్య శుభదాయక మయ్యును దైవముండెడిన్ (మహాభారతం)

అనే పద్యం శాస్త్రిగారి రాతలకు వర్తిస్తుందనిపిస్తుంది. సారమైన ధర్మం పాపంచేతా, ఏ మాలిన్యంలేని సత్యం బొంకుచేతా గట్టెక్కలేక చెడిపోయేదశ చరిత్రలో

హీనమైన పాపం. అలాంటి దశను సమర్థులైన వారు ఉపేక్ష చేయకూడదు. అలా ఉపేక్ష చేస్తే అది దక్షులకే చేటుతెస్తుంది. సత్యధర్మాలనేవి నిరంతరం కాపాడబడడం అనేదే ముఖ్యం. చారిత్రకంగా జరిగిన తప్పిదాలను ఎత్తిచూపుతూ, గతానుగతికంగా మహనీయులుగా పూజింపబడేవారి అసలు నైజాలను ఎండగడుతూ, గతజల సేతుబంధనం కాక, భావికాల పరిరక్షణ కోసం, వాస్తవాలను కళ్ళకు కట్టేలా చిత్రించే రచనలను శాస్త్రిగారు రాశారు. వాస్తవాలను వెల్లడించడానికి ఆయన ఎప్పుడూ వెనుదీయలేదు. శాస్త్రిగారు ఏది రాసినా ఆ నిబద్ధతతోనే రాశారు. రాసే విషయం పట్ల అంత నిమగ్నతనూ చూపారు. అదే సమయంలో "ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగునపడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు. దాచేస్తే దాగని సత్యం" అన్నట్లుగా రాజకీయాల అసలు స్వరూపాలను బట్టబయలు చేస్తూ 'ఆంధ్రుల కథ' రాసి తలపండిన రాజకీయ విశ్లేషకులనే అబ్బురపరిచారు.

తాను రాయడమే కాదు, తాను సంపాదకత్వం వహిస్తున్న దినపత్రిక వైభవ ప్రాభవాల కోసం ఎందరిచేతో కలం పట్టించి విలువైన రచనలు చేయించి పత్రిక ప్రాచుర్యాన్ని పెంచిన వారాయన. 1994 లో అప్పట్లో భూమిలో సబ్‌ఎడిటర్‌గా ఉన్న రాంలాల్ ద్వారా సుధామను ఆదరంతో పిలిపించుకుని 'సం.సా.రా.లు' అనే ఎడిట్‌పేజ్ మిడిల్ కాలమ్‌ను ప్రారంభింపచేసింది ఎం.వి.ఆర్. శాస్త్రిగారే. సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు 'సం.సా.రా.లు' గా మధ్యలో కొంత విరామం ఇచ్చినా సుమారుగా పదిహేను సంవత్సరాలు ఆ కాలమ్ రాయించింది ఆయన ఇచ్చిన ప్రేరణే! 2001 లో ఆ కాలమ్‌లోని యాభై వ్యాసాలతో "సం.సా.రా.లు" పుస్తకంగా వెలువడి 2004 లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ సాహితీపురస్కారాన్ని అందుకుంది. బహుశా ఒక 'కాలమ్' వ్యాసాల పుస్తకానికి అలా సాహితీ పురస్కారం రావడం, సుధామ అందుకోవడం అదే ప్రథమమేమో!

శాస్త్రిగారి వ్యక్తిత్వం ఆయన సన్నిహితులకే గానీ తెలియడం చాలా కష్టం. 'నిండుమనంబు నవ్యనీత సమానము పల్కు దారుణాఖండ శస్త్రతుల్యము' అన్నట్లు ఆయన గోచరించే సందర్భాలు కొత్తేమీ కాదు. ఆయన దగ్గర పనిచేయడం అంత సులభం కాదనేవారెందరో. కానీ ఆయనతో పనిచేసినవారు, ఆయన నుండి స్ఫూర్తి పొందినవారు జర్నలిజంలో ఎందరో ఉన్నారు. ఆయనను గురువుగా భావించి గౌరవించే శిష్యవర్గం ఉన్నారు. ఆయన కోపం మామూలు కోపం కాదు. నిజానికి ధర్మాగ్రహం. ఆంధ్రభూమి కాంగ్రెస్ వారి పేపర్ అయితే - బీజేపీభావాల సంపాదకుడు ఎలా

ఉన్నాడని కొందరు, బుగ్గలు నొక్కుకున్న వేళలూ ఉన్నాయి. నిజానికి ఆయన కమ్యూనిస్టుగానే మొదలు పెట్టారు. తన 'వీక్‌పాయింట్' కాలమ్‌లో అందరినీ అవసరమొచ్చినప్పుడు ఉతికి ఆరవేసారు. ఆయన 'వాక్యవిహారం' అలాంటిది. రేడియోలో ఆయన ప్రసంగాలు చేశారు. టీవీల్లో విశ్లేషణలు చేశారు. ఆయన నిర్భీతి గొప్పది. ఎవరికీ ఎప్పుడూ బాకా ఊది – రాజకీయాల పేరనో, పత్రికా సంపాదకత్వమనే అధికారం పేరనో స్వార్థ ప్రయోజనాలు ఆశించి పబ్బం గడుపుకునే నైజం కాదాయనది. అందుకే ఆయనంటే చాలామందికి ఎంత గౌరవమో అంత భయం కూడాను. ఆయనను పొగిడి పనులు చేయించుకోగలమనుకుంటే ఆ పప్పులేం ఉడకవు. ఆయన వృత్తి శీలత గొప్పది. కొండొకచో కర్కశంగా కానవస్తుంది. పత్రికలో రోజువారీ కార్టూనిస్టు అయినా నాలుగైదు వేసి చూపిస్తే పనికొచ్చేదేదో చెప్పి మిగతావి అతనిముందరే నిర్దాక్షిణ్యంగా బుట్టదాఖలు చేయగలరు. తప్పులను ఇట్టే పట్టేసి, ఇంటూ పెట్టేసి, త్రోసి రాజనగలరు. అదే సమయంలో కార్యాలయంలో తనను కలుసుకోవడానికి వచ్చినవారిని హేతువేమిటో తెలుసుకుని క్షణాలలో నిర్ణయంచేసి పంపించివేయనూ గలరు. అంతటి హడావుడిలోనూ కాగితాలు ముందేసుకుని ధారావాహిక రాబోయే భాగాన్నో, తన రచనలోనికో, సంపాదకీయం లోనికో సీరియస్‌గా నిమగ్నమై కలంపట్టి రాసేయనూ గలరు.

భారతీయ దృక్కోణంలో చారిత్రక రచనలు అందించిన శాస్త్రిగారు సమకాలీన వస్తువుతో ఎప్పటికప్పుడు 'ఉన్నమాట', 'వీక్ పాయింట్'లను రాయడం, శైలిలో వైవిధ్యంతో విస్మయులను చేయడం విశేషమే మరి! శాస్త్రిగారిలో సమర్థుడైన నాయకుడున్నాడు. సమయస్ఫూర్తి, సృజనాత్మకత, చొరవ, బహుముఖీన ప్రజ్ఞ, చక్కటి ఊహాశక్తి, నిర్ణయసామర్థ్యం ఆయన విజయానికి హేతువులు. అలాగే ఆయన వేదికలు ఎక్కేది తక్కువేగానీ – వక్తగా తన హాస్య, వ్యంగ్య చతురోక్తులతో సూటిగా సరసభాషణం చేసి ఆకట్టుకోగల దక్షులు.

ఎం.వి.ఆర్. శాస్త్రిగారిలోని మరో పార్శ్వం ఆయన ఆధ్యాత్మికత, హైందవ ధర్మం పట్ల గౌరవం, నిబద్ధత. అందుకే ఆయనంటే ఎందరో పీఠాధిపతులకు కూడా అపారమైన వాత్సల్యం, గౌరవం. సద్గురు శివానందమూర్తి గారు శాస్త్రిగారి పట్ల ఎంతో మక్కువ కలిగివుండేవారు. శాస్త్రిగారిని అభినందిస్తూ శివానంద మూర్తిగారు "ఆయనకు చరిత్ర అవగాహన ఉంది. ఆయనకు ప్రజాక్షేమం కావాలి. దేశభక్తి

ఉన్నది. ఛాందసవాదం గాని, విప్లవనాదం కాని ఆయనలో లేవు. మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆయనకు గౌరవం ఉన్నది. మొహమాటం లేని విమర్శ ఘాటుగానే చేయడం ఆయనకు తెలుసు. ఆయనకు ఎవరంటేను భయం లేదు. తన పదవి కాపాడుకోవడం ఆయనకు ముఖ్యం కానేకాదు. అన్నింటికీ సిద్ధమైన ధైర్యశీలి ఆయన" అని ప్రశంసించడం నిజంగా అక్షర సత్యం.

ముగ్గురు కూతుళ్ళనూ ముత్యాల్లా తీర్చిదిద్దారాయన. భార్య పేరిట దుర్గా పబ్లికేషన్స్‌గా తను రాసిన గ్రంథాలనే కాక, ఉపయుక్తమైన పలువురు రచయితల గ్రంథాలను ప్రచురింపచేసేరు. అలాగే భారతీయ విద్య గురించి 'మన చదువులు' అంటూ శాస్త్రిగారు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అగత్యాలను, తీరుతెన్నులనూ అద్భుత రచనలుగా వెలువరించారు. శాస్త్రిగారు రచించిన 'మన చదువులు' గ్రంథం విద్యారంగ చారిత్రక గ్రంథాల్లోకి మణిపూస వంటిదనీ, విద్యా సంస్కరణాభిలాషులు కావటానికి ఆ గ్రంథం ప్రేరణాత్మకమనీ, విశ్వ విద్యాలయ ఉపకులపతులుగా చేసినవారే పలువురు ప్రశంసించారు.

శాస్త్రిగారి వచనరచనా వైదుష్యం అలా ఏ గ్రంథానికయినా పఠనీయతను, ప్రయోజనాన్ని సంతరిస్తుంది.

ఇంత చదివినా, ఇంత రాసినా ఆయనలోని విజ్ఞాన జిజ్ఞాస, నిరంతర అధ్యయన తృష్ణ చల్లారనివి. తన దృక్పథాల పట్ల ఆయనకు తిరుగులేని నిబద్ధత ఉంది. ప్రతిభ ఎక్కడున్నా ప్రోత్సహించే ఆదరణీయ నైజం ఉంది. పండితులను, విద్వాంసులను, గురువులను సతతమూ వినయ పూర్వకంగా సమాదరించే స్వభావం ఉంది. పని ఒత్తిడుల కారణంగా, నిరంతర శ్రమవలనా ఇటీవల ఆరోగ్యం కొంత మందగించినా నిలద్రొక్కుకుని ద్విగుణీకృతంగా నిత్యోత్సాహంతో సాగుతున్న చైతన్యం ఆయన. అరవై నాలుగేళ్ళ ఈ అరుదైన కలం యోధుడిని అప్పాజోశ్యుల - విష్ణుభొట్ల - కందాళం ఫౌండేషన్ ప్రతిభామూర్తి పురస్కారం వరించడం ఆనందవర్ధనం! ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధులతో శ్రీ మార్తి వేంకట రామచంద్ర శాస్త్రిగారూ! శతమానం భవతి! ✱

**(ప్రతిభావైజయంతి అ.జో.వి.భొ ప్రచురణ జనవరి' 2017)**

(33)

# విహారి శ్రీ పదచిత్ర రామాయణం (అరణ్యకాండ)

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు రామాయణపథ 'విహారి'గా ఎందుకు మారారంటే – కేవలం 'తనదైన అనుభూతి తనదిగాన' అనుకోవడానికి లేదు. కథకునిగా, విమర్శకునిగా, అభ్యుదయ భావజాలం వున్న రచయితయిన తాను తన 'హృద్దర్శనం'లో ఇలా అంటారు –

"సమాజ కల్యాణానికి వ్యక్తిచైతన్యం, వ్యక్తివికాసం కేంద్రకాలు అని నమ్మినవాడిని. వ్యవస్థ కంటే ముందు వ్యక్తి ముఖ్యం. ఆ వ్యక్తిని ఉన్నతీకరించే జీవన సూత్రాలూ, వ్యక్తుల ద్వారా సమాజాన్ని సమతుల్యతతో నిలిపి ఉంచే విశిష్టమైన శాశ్వత విలువలూ – ఇవన్నీ రామాయణంలోని మూలప్రతిపాదనలు. కనుక రామాయణంలోని ఆ శాశ్వత విలువలు సర్వకాలాల్లోనూ పఠనీయమూ, అనుసరణీయమూ అని నా విశ్వాసం. ఇవన్నీ ఒక తరం నుంచి మరోతరానికి అందచేయబడాలని ఆకాంక్ష, వాంఛ! నా మనసును రామాయణం వైపు నడిపించిన కారణాలు ఇవి."

రామాయణమంత మహాశిఖరాన్ని పద్యకవిత్వమంత కాంతికిరణ ప్రసారంలోనే దర్శింపచేయాలని ఆయన కోరిక, పూనిక. ఇలా పదచిత్ర రామాయణం అవతరించింది. పదచిత్రం అంటే మాటలతో బొమ్మకట్టడం. అయితే ఆ పదాలు వట్టిపదాలు కాదు. సమర్థ భావాత్మకాలు. అందుకే భావచిత్రం అనేది పాశ్చాత్యుల సాహిత్యవిమర్శనా శాస్త్రంలో 'ఇమేజ్'గా గొప్ప కావ్యగౌరవాన్ని, కవి ప్రతిభా సామర్థ్యానికి గీటురాయిగా గుర్తింపబడి, అందుకుంటోంది.

'పదములె చాలును రామా!...' అన్నట్లు మనమున రామగాథ శ్రుతి మాన్యము చేసి గుండె రామునికడ దిష్ఠ వేయడంతో విహారిగారికి ధర్మధారణావిలసిత శీల సంజనిత వృత్తలతాంతమైన రామాయణాన్ని బాసల తొలిముద్దరాలి పదసన్నిధి నుంచే భాగ్యమబ్బింది.

'ఈ కృతిలో నా రీతిని
నాకృతి దయనాకళించి, నా పద సౌభా
గ్యాకారణ నందుకొనుడు
సాకల్యాకాంక్ష తోడ సద్భావమునన్'

అంటూ ఆయన –

'వర్ణచిత్రము లిచ్చితి బరిధి గూర్చి
యెల్ల లెఱుగుచు భావమ్ము లుల్లసిల్ల
వంపు వాటమ్ము లిడితి బద్యంపు నడక
విజ్ఞదాదృతి నిల్పుచు వేడ్కలిడితి'

'ఇవి పదచిత్రముల్ వరుసయేర్పడె, నన్నిట హృద్యపద్య సుచ్ఛవికదలాడె, బద్యముల ఛందపు రూపము భిన్నభిన్నమయ్యె విపుల దృశ్యభాగములవెన్నియొ గాథల రూపమెత్తె, నా కవనము చిత్తశుద్ధి పరికల్పితమైనది తేటమాటలన్' అంటూ తన పద్యకావ్యం రూపొందిన ఫణితిని వినమ్రంగా విశదపరిచారు. రామునిపట్ల చిత్తశుద్ధి పరికల్పితమైన భక్తిరచన ఇది.

కవితకు సమర్థవంతమైన కారణం ఆ కవే. కానీ కవితాపద్ధతి కవితకు ఒక విద్యుక్తకారణం మాత్రమే. ఆ విద్యుక్తకారణమే దాని మౌలికరూపం. మనం కవిలోని ప్రాథమిక మూలరూపాలను పొందలేం. కానీ అతని పదచిత్రాలను మనకు మనం ఇచ్చుకోగలం. అంటే అతని అనుభూతి స్వర్గాన్ని మనం అందుకోగలం. సరియైన భాష, సత్యదృష్టి, భావాల ఏకాగ్రత ప్రబలమైన పదచిత్రాలతో కవి అభివ్యక్తీకరిస్తాడు.

చిత్రం సహజ చిహ్నం
పదం స్వతంత్ర చిహ్నం

కవి తన స్వతంత్రచిహ్నాలు సహజచిహ్నాలుగా ఎదిగే ప్రయత్నం చేసినప్పుడు అది భావచిత్రాత్మకమై పదచిత్రంగా మాటలతో బొమ్మకట్టగలుగుతుంది. హృదయస్తం కాగలుగుతుంది. కవి అన్నది సంపూర్ణంగా పఠిత అందుకునేలా రూపాంతరం చెందేలా చేసి మూర్తిమంతం చేయగల ప్రతిభ – సఫల పదచిత్రానిది. పదచిత్రం సమగ్ర కవితా సౌందర్యానికి దోహదకారి. దానికి భావవ్యంజనే ప్రధానం. భావచిత్రం కేవలం సంకేతితార్థాన్ని మాత్రమే కాక బహుముఖీనమై నిత్యనూతనంగా పఠితకు

బాహ్యాంతర దృశ్య సాక్షాత్కర సామర్థ్యాన్ని అందిస్తుంది. అంటే కేవలం ఇంద్రియగతమే కాక, పరోక్షానుభవ సంబంధిగా మానసికపరంగా కూడా భాసిల్లుతుంది.

The Function of all Poetic imagery is to order, relate and unify desperate modes of physical, mental and emotional experience అని R.H.Fogle అన్నా-

An Image is that which presents an intellectual and emotional complex in an instant of time అని Ezrapound అన్నా కావ్యశాస్త్రంలో పదచిత్ర వైశిష్ట్యాన్ని వ్యక్తీకరించడానికే.

ఏకకాలంలో బుద్ధికీ, హృదయానికీ కూడా రసస్ఫూర్తినందించి, తల్లీనం చేసి తనియింపచేసేదే విహరిగారి 'పదచిత్ర రామాయణం' కూడాను.

విహారిగారి పదచిత్ర రామాయణంలో అరణ్యకాండకు ఒక విశిష్ఠత ఉంది. "ఇది చాలాచదివి కొంచెం వ్రాసిన సందర్భం. అయినా వేయికిపైగా పద్యాలు వచ్చాయి" అని ఆయనే చెప్పుకున్నారు.

రామాయణం అంటే రాముని గమనము. రాముడు నడిచిన దారి. రామకథలో అరణ్యకాండ - మానవజీవన యదార్థసత్యాన్ని ఆవిష్కృతం చేసే మూలాధారనాడి. సత్య, ధర్మాల ఆయువుపట్టు. మానవజీవితం మంచిచెడుల సమ్మిశ్రితవాసమే. అరణ్యకాండలో ఋషులూ వున్నారు, రాక్షసులూ వున్నారు. ద్విధాప్రయుక్తమైన రెండు ప్రయాణాలు ఏకాకాలంలో. రాక్షసులకు భయం, మునులకు అభయం. రాక్షస సంహారంలో కూడా రాముని ఔదార్యం చిత్రితమైంది. ఎందుకంటే శాపగ్రస్తులైన వారి ఉద్ధరణే రాముడు చేసింది. శిక్షలా కనబడేదీ అసలుకు రక్షే!

ఆశ్రమ దర్శనంతో మొదలై ఆశ్రమ దర్శనంతోనే అరణ్యకాండ ముగుస్తుంది. శరభంగుడు, సుతీక్షణుడు, అగస్త్యుడు వంటి మహామునుల సందర్శనం, మతంగమహర్షి ఆశ్రమంలో శబరి ఆతిథ్యం వంటి ఉజ్జ్వల ఘట్టాలు ఒకవంకా, విరాధుడు, శూర్పణఖ, ఖరదూషణులు, మారీచుడు, అయోముఖి, కబంధుడు మొదలైన రాక్షసేతివృత్తాలు మరోవంకా అరణ్యకాండలో దర్శిస్తాం.

అవతార ధర్మానికి అనుగుణంగా సంఘటనాత్మక కథనం అరణ్యకాండలోనే సాగుతుంది. సీతాపహరణం అనే ప్రధాన ఘట్టం ఈ కాండలోనే. ప్రతినాయకుడైన రావణపాత్ర ప్రవేశమూ ఈ కాండలోనే. అరణ్యంలో ప్రకృతి ఉంది. పక్షులు, కొండలు,

సెలయేళ్ళు, వృక్షాలు, మృగాలు వున్నాయి. ఇక్కడే రాక్షసులు వున్నారు. ఇక్కడే తపశ్శక్తి సంపన్నులైన మునులూ వున్నారు. తేనెవాకలూ వున్నాయి, రక్త ప్రవాహాలూ వున్నాయి. అరణ్యంలోనే రాముడు పద్నాలుగేళ్ళు వున్నాడు. క్షత్రియుడైన నరుడిగానే సంచరించాడు. అతనిని వెంటనంటి తమ్ముడు లక్ష్మణుడు, సహధర్మచారిణి సీత నడిచారు.

అరణ్యకాండలోని విశేషం – పద్నాలుగేళ్ళ వనవాసంలో దాదాపు పదేళ్ళు వివిధ ఆశ్రమాలను సందర్శించడంలోనే, మునులను, మహాతపశ్శక్తి సంపన్నులనూ దర్శించుకుంటూ వారిని తానెక్కడ నివసించడం మంచిది అని అడగడంలోనే గడిచిపోయింది. పంచవటిలో పర్ణశాల నిర్మించుకుని నివసించినది చివరి నాలుగేళ్ళ కాలంలోనే. ఎవరికీ కలగకూడని కష్టం – సీతాపహరణంతో, కలిగిన వియోగాన్ని చవిచూసిందీ అక్కడే.

అరణ్యకాండ గతంగా వాల్మీకి మహర్షి నిక్షిప్తం చేసిన మహనీయ ధార్మికమైన అంశాలెన్నింటినో, కథాంతర్గతంగా వున్న నిగూఢ మానవజీవన సందేశాలెన్నింటినో, విహారిగారు అవలోఢనం చేశారు. వాల్మీకి హృదయాన్నే విహారిగారూ పట్టుకున్నారు తప్ప ప్రాచుర్యంలో వున్నాయనే కల్పనా చమత్కృతుల వెంటపోలేదు. శబరి ఎంగిలి పండ్లిచ్చిందని విహారిగారూ రాయలేదు.

పద్యరచనలో విహారిగారు ఎనుకున్న వృత్తాలు, ఛందోరీతులు అన్ని కూడా ఔచితీమంతంగా ప్రకాశించేవే తప్ప, ఆయన కేవలం తన పాండితీప్రకర్షను వెలార్చుకోవడానికి మాత్రమే ఉద్దేశించినవి కావు. సుమంగళి, కలియుగమంజరి, ద్రుతవిలంబితము, అశ్వగతి, మత్తకోకిల, మాలిని, భద్రకము, త్రిపదలు మొదలైనవి ప్రయోగించే తావులను గమనిస్తే–ఆయన పదచిత్ర విన్నాణం ప్రస్ఫుటంగా తెలుస్తుంది. ప్రభాతము, విజయభద్రము వంటి కొత్త ఛందస్సులు ప్రయోగించడంలో మంచి పాటవం చూపించారు. కమలినగీతి, సమగీతి, పవడగీతి, కర్ణాట చతుష్పద, తరలము, మధురాక్కర, మధ్యాక్కర, అల్పాక్కర, తరువోజ, వియోగిని–ఏది రాసినా–అవి ఏవీ ప్రయత్నపూర్వకంగా కూర్చినట్లున్నవిగా కాక, ధారాశుద్ధితో సాగినవిగానే గుర్తించ గలం!

సీతారాములమధ్య సంభాషణలనూ, అలాగే రామలక్ష్మణుల నడిమి భాషణలనూ, రాముడు మునులతో భాషించే తీరులనూ విహారిగారు విశదపరిచే వైఖరి ఎంతో మనోజ్ఞంగా భాసిస్తోంది. అలాగే దానవవర్తనలనూ, వారి

మనఃప్రవృత్తులనూ పాత్రోచితంగా రూపుకట్టించారు. సీతారాముల ధర్మనిర్ణయ సంభాషణాన్ని విహారిగారు చిత్రించిన తీరు భార్యాభర్తల మధ్య కూడా గృహస్త్రాశ్రమంలో పనికిమాలిన కబుర్లుకాక ఎలాంటి ఉపయుక్త సహధర్మచర్యం చేయాలో ఆదర్శవంతంగా వున్నాయి.

'కామజవ్యసనములని కలవు మూడు
దానిలో మొదటి దసత్య వాక్యమగును
మలిపలుకు పరభార్యాగమనము, మూడు
వైరమే లేక క్రూరత్వవర్తనమ్ము'

అంటూ సీత దనుజుల మీదయినా అకారణవైరంతో ధనుర్బాణాలతో వెళ్ళడమెందుకని రాముడిని అడుగుతుంది. వనవాసవేళ ఆయుధాలు ఎందుకంటుంది. మునులయినా వారు చేసే తపస్సులో ఆరవవంతు భాగం రాజుకు దక్కుతుంది. రాజు మునులను రక్షించాలి. అది ధర్మం. అందునా మునులే స్వయంగా తమను రాక్షసుల బారి నుండి కాపాడమని కోరినపుడు కాదనరాదని చెబుతాడు రాముడు–

'చూడము జానకీ! ఋషుల సూచన లేమియు లేక యుండినన్
వీడగరాదు నాదు విధివృత్తము, నందున నేడు వారలే
వేడ పరాఙ్ముఖ ప్రకృతి వీడ్వడ నొక్కెడ జారిపోదునే
కాడిని పాఱవేసి తలకన్ రఘురాముడు కాకరూకడే?!'

అంటాడు. భీరువే, పిరికివాడే అనడానికి 'కాకరూకడే' వంటి పద ప్రయోగాలు చేయడం, "జనకాత్మజ! యుక్తము నీ హితోక్తి ధర్మనివృత నిర్ణయ స్వరము మంతనమంతయు నీ మృదూక్తిలోననె కలదోయి! నాకిట వనంబున మానునె క్షాత్ర ధర్మముల్" అంటూనే ఇలా వివరించడం 'కరణేషుమంత్రి'గా సతిని గౌరవిస్తూనే, పతి మాట్లాడవలసిన తీరుని తేటపరుస్తోంది.

'నిఖిల దేవకోటి నిర్వైరపరచదే
సీత ధర్మసూక్ష్మ శీలనమ్ము
రామ మనుజు ధర్మ రక్షణ కేంద్రమ్ము
సీత సహృదయ సరసీజసీమ!'

అంటారు విహారిగారు.

ఏ పొరపొచ్చము లెరుంగనట్టి ఒక ఆప్తుని చూచినట్లయిందట రాముడికి జటాయువును దర్శించినపుడు.

'అవునవును ఘనమూర్తి జటాయువతని
కుపకృతి స్వభావ మఱచేతి పటయయ్యె
పథములోనున్న యిష్టకాపథమతండు
కారుమబ్బుల మధ్య క్రొక్కారు మెఱుపు'

అన్న పద్యంలో జటాయువు వ్యక్తిత్వమహత్త్వాల రెంటినీ రూపుకట్టించేసారు. ఆ పాత్ర స్వరూపస్వభావాల సమగ్ర చిత్రణాన్ని అందించారు.

లక్ష్మణుడు పర్ణశాల నిర్మించిన విధానాన్ని విహారిగారు నిజంగా అంతమనోహరంగానూ పద్యాలలో నిర్మించారు. ఈశ్వర కైంకర్యంలో ప్రీతి ఎంతటిదో లక్ష్మణుడు తన పరిచర్యాభక్తితో నిరూపించుకున్నాడు.

ప్రీతోస్మితే మహత్కర్మా
త్వయా కృత మీదం ప్రభో
ప్రదేయో అనిమిత్తంతే
పరిష్వంగో మయాకృతః

అని రాముడు పర్ణశాలా నిర్మాణానికి ప్రతికృతిగా గాఢాలింగనం చేసుకున్నాడట తమ్ముడిని.

'నిన్ను నాకిచ్చి జనె నవనీశుడయ్య
మత్పురాకృత సుకృతము మగ్గిగాదె
లక్ష్మణుండంత తమ్ముడు లభ్యమయ్యె
చెలిమి దీప్తికి నీవు సూచికవు గాదె'

అని రాముడు తమ్ముడిని చూసి పరవశించిపోవడాన్ని రాశారు విహారిగారు. 'పరిష్వంగంపు సంప్రీతియున్ సకలస్నిగ్ధమనోహరాయత సమస్పందంబు నందంబుగా బ్రకటించెన్ రఘురామమూర్తి తనదౌ భ్రాతృత్వ చిహ్నంబుగన్' అన్నారు.

స్త్రీ రాక్షసుల విషయంలో వారి కాళ్లూ చేతులూ నరికేయడం కాక, ముక్కు, చెవులు కోసినట్లుగానే వాల్మీకి చిత్రించాడు రామలక్ష్మణుల గురించి. శూర్పణఖ

విషయంలోనూ అంతే! అలా ముక్కూ చెవులూ కోయడం ఎందుకంటే 'ఊడిన ముక్కు, రాలిన చెవుల్ తన మోహము గూలగొట్టగన్' అంటారు విహారిగారు కూడా. స్త్రీగా శూర్పణఖ చుప్పనాతితనం అంతా కూడా సౌందర్యం గురించే. సీతవంటి సౌందర్యవతి లేకపోతే రామలక్ష్మణులు తనను పెళ్లాడేస్తారనే మోహభ్రమ శూర్పణఖది. రాముడు సీత లేకపోతే బ్రతకలేడని శూర్పణఖకు తెలుసు. అంచేతే శూర్పణఖ అన్నయైన రావణాసురుడితో 'సౌందర్యమున కామె నిర్వచనము' అనదగిన సీతనెత్తుకుని వస్తే రాముడు మరణించినట్లే అనిచెప్పిందిట–

'ప్రాణహిత జానకి యపహరణము చాలు
చాలు రాము ప్రాణాహతు సలుప – నిజము
సోదరా! నా ప్రతీకార సూత్రమిదియె
గుంజి లాగుకోగలిగిన కొసరనేల!'

అంది శూర్పణఖ అని విహారిగారు విశదపరిచారు. శూర్పణఖ అంటే చేటలంత గోళ్ళు కలది అని. లక్ష్మణుడిని మోహించిన అయోముఖికి కూడా ముక్కు, చెవులు, స్తనాలు ఖండితమయ్యాయి.

ఇక అరణ్యకాండలో అద్భుతమైన పాత్ర మారీచుడు. మారీచుడు రాక్షసుడేగానీ, 'భీత భక్తి' తో సర్వం రామమయమైపోయినవాడు.

'అదియె మారీచు నాశ్రమ మచటగలదు
నారచీర ధరించి, కృష్ణాజినమ్ము
దాల్చి మునివృత్తి పచరించుతాటకేయు
డొక మహానుభావుని వోలె నుండెనతడు'

అని మారీచుణ్ణి – సీతాపహరణ సహాయార్థం రావణుడు కలవడానికి వెడుతున్నప్పుడు ఆ ప్రాంతాన్ని – పరిచయం చేశారు కవి. అసలు రాముని గురించి లోకంలో ప్రసిద్ధంగా వున్న గుణగణ సంపత్తి అంతా మారీచుడు చెప్పిందే ప్రాచుర్యంలో వుంది! మారీచుని పాత్రను విహారిగారూ ఎంతో ఉదాత్తంగా అద్భుత భావచిత్రాలతో సాక్షాత్కరింప చేశారు. రావణుడిని ఎదిరించి హితవు చెప్పడానికి సిద్ధపడింది మారీచుడొక్కడే!

సులభం పురుషా రాజన్
సతతం ప్రియవాదినః
అప్రియస్తు పర్జస్య
వక్తాశ్రోతాచ దుర్లభః

అంటూ ప్రియోక్తులు అభ్యున్నతివైపు నడిపేవి కావనీ, మంచి చెప్పేవాడు అప్రియం చెప్పేవాడిగానే కనబడతాడనీ, కానీ అలాంటి వారు లభించడం అరుదనీ చెబుతాడు మారీచుడు.

'ఏ యవకాశమైనగొని యింపగు నిచ్చకముల్ వచింపగా
నాయకు జేరి యుందురు ప్రణామము లిచ్చుచు గొందరెప్పుడున్
మాయలు నేర్వలేని మతిమంతులు వాస్తవమున్, హితంబునే
పాయకనూది పల్కుదురు, వారు లభించుట జేని భాగ్యమే!'

అనే సార్వకాలిక సత్యాన్ని విహారిగారు హృద్యమైన పద్యంగా అందించారు.

రామో విగ్రహవాన్ ధర్మః
సాధు సత్య పరాక్రమః
రాజా సర్వస్యలోకస్య
దేవానాం అఘవానిన

అన్న వాల్మీకి శ్లోకానికి విహారిగారు అందించిన పద్యం ఇది -

'శ్రీ రఘురాము గూర్చి వివరించగ వాని చరిత్రమెల్ల వి
స్తారము చెప్పలేను - ప్రభు! ధర్మము, సత్యపరాక్రమంబులున్
బేరున, మూర్తిలోన రఘువీరు వరించి క్రమించె, సాధు వౌ
పూరుషపుంగవుండతడు పూజ్యుడు మాన్యుడు పుణ్యమూర్తియున్'

గతానుభవాల వల్ల మారీచుడికి రాముడంటే వల్లమాలిన భీతి! "నా భయ భ్రాంతులకట వర్ణన కతీతమయ్య! ఎచట చూచినగాని యా దశరథ తనయుడే కన్పడచునుండి - తటమటించ నడవి యడవియే రామమయమయిపోయె!''

రకారాది నినామాని
రామత్రస్య తస్యరావణ
రత్నానిచ రథాశ్చైవ
ప్రాతం జనయింతామే

రథమో, రత్నమో అందామని ఎవరయినా 'ర' అనగానే తర్వాత ఎక్కడ 'మ' అంటారోనని భయంతో ఉలికిపడి పారిపోతూంటాడట మారీచుడు. రామస్వరూప మావిష్కరించి, రావణుని భావి దర్శన ప్రతిమను పరిచయ ప్రకృతితో వెలార్చినవాడు మారీచుడు! అందుకే మాయామృగ రూపమెత్తినా 'రామరామాభియోగ విభ్రమము

మృగము'గా, 'మారీచుగమనమెల్ల నచటనే పునరేవ విన్యాసమయ్యే, భావనము ప్రవర్తనపు స్వభావమయ్యె' నట! అంతా రామమయంగా అయిపోయినందువల్లనే మారీచుడు 'హా సీతా! హా లక్ష్మణా' అని తానే రాముడైనట్లు అరవగలిగాడుట!

'ఆ యుద్ఘోషణ మచ్చుగ
శ్రీయుతుడా రాము నెలుగు రీతిగ నెనసెన్
న్యాయవిధాయకమన, మెయి
మాయావియు రూపుమాజె మహితుని స్మరణన్'

అన్నారు విహారిగారు. రామనామస్మరణ అంత గొప్పది. అది భీతభక్తి అయినా.

ఇలా అరణ్యకాండలోని ఘట్టాలనన్నింటినీ విహారిగారు పదచిత్ర భావనాత్మకంగా, పద్యాలుగా పలికించిన తీరు వాల్మీకి హృదయాన్ని పట్టుకుని గమించింది.

– అలాగే అరణ్యకాండ చివరలో దర్శమానమయ్యే శబరి వృత్తాంతాన్ని కూడా మనోహరంగా చిత్రించారు. మతంగ మహర్షి ఆదేశానుసారం తపస్సంపన్న అయిన శబరి, గురువులతో బాటు తరలిపోక, రామలక్ష్మణులకు ఆతిథ్యం ఇచ్చేందుకే – వుండి నిరీక్షించింది. రామలక్ష్మణులకు ఆశ్రమం అంతా చూపించి, తన గురువుల మహత్తును చెప్పింది. జ్ఞానమార్గంలో వున్న శబరి – ఆత్మస్థితి పొందిన తల్లి. మతంగాదుల తపశ్శక్తి ఎంత గొప్పది అంటే ప్రకృతి కూడా ఆ మహనీయులకు వశమైపోయింది. అందుకే ఆనాడు వారు తడిపి ఆరేసిన బట్ట – తడి ఆరకుండానూ, పూజావేదికపై వేసిన పూవు – వాడకుండానూ అలానే వున్నాయి. తన కర్తవ్యం తీరగానే తన దేహాన్ని యోగాగ్నిలో వ్రేల్చి తరలిపోయిందట శబరి కూడా!

'చిత్త పాకమ్మిది జీవుని వేదన
విత్తమౌ ప్రకృతి జీవి సరసాస్వాదన
స్థూలసూక్ష్మతా విశుద్ధ విచారమే
కాలరహస్య సంస్కార సారధార
రామదిదృక్షన్ బ్రకృతియే పేర్చెన్
రామరిరక్షన్ బ్రకృతియే పిల్చెన్'

అంటూ యతులూ, దానవతతులూ కూడా సంచరించిన అరణ్యకాండలోని రామాయణ రహస్యాలను తన పదచిత్ర భావనలలో విహారిగారు హృదయంగమంగా రూపుకట్టించారు.

– సాంసారిక హర్షదోహలము శబ్దము జేయునె చిత్రఘంటికల్
– నీ మృదుమార్గంబది గణ్యమై నిలుచున్నదీ తెల్గు కావ్యంబుగన్
– నీ తత్త్వము, రాగమున్ సమయధర్మవిచారము – నాకు పాఠముల్
– మిడుత పోటుకు జడ్డిగ మెటుల చెడును
– కుచ్చిత మెట్లు గెల్చు? సమకూరునె గెల్పది దుర్వినీతికిన్
– మనుజాళి విరాళికి లోగుటబ్రమే
– నిజము రాముడొక వర్తమాన రౌద్రాక్షరమ్ము
– ఏమో – ఈ ఘటనంబు? జీవుల మతుల్ హేతుస్థితుల్ చిత్రమౌ!
– శనిని పిడికిట బిగియింప శక్యమె మొనయన్
– తొక్కటలన్ని యెప్పుడతిథుల్ వలె వచ్చును పోవు వెంటనే
– ఏ కాలవిధాన మే ఘటన కారణమౌనొ తలంచలేమిలన్

ఇలా ఉటంకింపదగిన భావబంధురమైన హృద్యపద్యపాదాలకు కొదవే లేదు! అరణ్యకాండ చివరి ఎనిమిది పద్యాలలో విహారిగారు అరణ్యకాండనంతనూ నిగ్గుదేల్చి చెప్పారా అనిపిస్తుంది.

ఏమయినా విహారిగారు మాటల్లోనే చెప్పాలంటే –

'ఇది యరణ్యము ముగిసె సమీక్షిత కృతి
సత్యధర్మ పరాక్రమ సత్త్వవివృతి
యుదిత సుఖదుఃఖ మిశ్ర భావోపపత్తి!'
సమధిక పదచిత్ర రచనాశ్వాస సమితి!

విహారిగారి పద చిత్ర రామాయణం –

'ఎవరి యానందమదెంత మేరకోపు
నెవరి కెంతెంతగా నిభ నిమీలికమోపు
నంతంత హాయి యారగింపునించు
నంతగా రసమయాహ్లాద సుధ బంచు.'

పదచిత్ర రామాయణ కథా విహారియైన పాఠకుడు ధన్యుడు! ✻

**(విహారి పదచిత్ర రామాయణం కావ్య సమాలోచన సదస్సు–
హైదరాబాద్, 5–4–2015)**

**భావఝురి సంపుటి అక్టోబర్'2016**

# 34 అరవైఏళ్ల స్త్రీ కవిత్వ అస్తిత్వ రాగం

**మ**నకున్న సీనియర్ కవయిత్రులలో శీలా సుభద్రాదేవి ఒకరు. సాధారణంగా దంపతులై ఉండి ఇద్దరూ నిరంతర సాహితీ సేవచేసేవాళ్లని అరుదుగా చూస్తాం. సుభద్ర మేనత్తకొడుకు శీలావీర్రాజుని వివాహం చేసుకున్నారు. కవిగా, కథకునిగా, చిత్రకారునిగా, నవలా రచయితగా శీలావి సుప్రసిద్ధులు.

సుభద్ర కళాశాల విద్యవరకూ విజయనగరంలోనే చదివినా వివాహానంతరమే హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి గణితంలో ఎంఎస్సీతో పాటు తెలుగులో ఎంఏ చేశారు. బి.ఈడీ శిక్షణ పొంది ఉపాధ్యాయురాలిగా చేరి ప్రిన్సిపాల్‌గా రెండేళ్ల క్రితం పదవీ విరమణచేశారు. 'సాధారణంగా మగవారికి షష్టిపూర్తి ఉత్సవం జరుగుతుంది. ఆడవాళ్లకి ప్రత్యేకంగా షష్టిపూర్తి ఎందుకు చేయరు? నేను చేసుకుంటాను" అని దివంగత కవయిత్రి అనువాదకురాలు డాక్టర్ భార్గవి. పి.రావు అంటూండేవారట. అలా ఉత్సవంలా ఏమీ కాదు గానీ, సన్నిహిత బంధుమిత్రులతో, పిల్లలతో డిసెంబర్ ఇరవై ఆదివారం మలక్‌పేటలోని 'ప్లాంటెన్ లీఫ్'లో ఒక చిరు సమావేశం జరిగింది. శీలా సుభద్రాదేవి సమగ్ర కవితాసంకలనం ప్రతి ఆవిష్కరింపబడింది. విశేషం ఏమిటంటే డిసెంబర్ 19 నాటికి సుభద్రకి షష్టిపూర్తి. ఆవిడకు ఇష్టమైన కవిత్వం సమగ్రంగా సంపుటీకరింపబడడం మించిన ఇష్టపూర్తి ఏముంది.

ఆకలి నృత్యం, మోళి, తెగిన పేగు, ఆవిష్కారం, ఒప్పులకుప్ప, యుద్ధం ఒక గుండెకోత, ఏకాంత సమూహాలు – కవితా సంపుటులను, దేవుడుబండ, రెక్కలచూపు అనే రెండు కథా సంపుటులను వెలువరించిన సుభద్రాదేవి తెలుగు విశ్వవిద్యాలయం నుండి 1997 లో ధర్మనిధి పురస్కారాన్నీ, 1999 లో ఉత్తమ రచయిత్రి పురస్కారాన్నీ అందుకున్నారు. వందమంది కవయిత్రుల కవితాసంకలనం 'ముద్ర'కు డా॥భార్గవీరావుతో బాటు సంపాదకత్వం వహించారు. 'యుద్ధం ఒక గుండెకోత' దీర్ఘకావ్యం 'వార్ ఎ హార్ట్స్ రావేజ్' పేరిట ఆంగ్లంలోకి అనువాదమై ప్రశంసలందుకుంది.

అరవయ్యవ ఏట రిటైరయ్యాక కూడా కలం పట్టి సరికొత్తగా శీలా సుభద్రాదేవి వెలువరించిన 'బతుకుపాటలో అస్తిత్వ రాగం' దీర్ఘకవిత పుట్టినదాదిగా వృద్ధాప్య పర్యంతం ఒక స్త్రీ జీవనదశలను, ఆమె శారీరక స్థితిగతులను కాక మానసిక క్రమానుగత అనుభవ సోపానాలను అనుభూతి రమ్యంగా చిత్రించిన కావ్యం. బహుశా జెండర్ కాన్సెప్ట్‌తో ఆడపిల్ల జీవితాన్ని ఆమూలాగ్రం అనేకానేక వర్తమాన ధోరణుల నేపథ్యంలో చిత్రించిన రచన ఇదేనేమో!

"ఒక్కో పాపాయీ ఒక్కో చరిత్రకు ప్రారంభవాక్యమవుతుంది. కాలం మాత్రం జీవన కావ్యాలు రచిస్తూనే ఉంటుంది" అంటూ కాలక్రమేణా సంతరించుకున్న అనుభవసారంతో సుభద్రకి ఈ రచన తరువాతే మనసు భద్ర మయ్యిందేమో! వడ్లగింజ నోట్లోవేసి ఆడపిల్లకు నూకలుచెల్లేలా చేసే, అసలు ఆడపిల్ల గర్భంలో ఉందని తెలిసినప్పటి నుంచి సమాజంలో వున్న వివక్ష మొదలు – పుట్టి, బ్రతికి బట్టకట్టినా అనుక్షణం సమాజంలో స్వేచ్ఛగా ఎదగలేని, బ్రతకలేని అనుమానాస్పద, భీతాత్మక, క్రౌర్యాత్మక వాతావరణం గురించీ, విద్యనేర్చి, ఉద్యోగం చేసి, విదేశీయానాలు చేసినా వివాహం అనంతరం మోసే నిరంతర బరువు బాధ్యతల గురించీ, విధి వక్రించి సంసారంలో చోటు చేసుకున్న విషాదాల నధిగమించి, ఒంటరిగానైనా సరే తన పిల్లలను పెంచుకునే నిరంతర శ్రమైక జీవనం గురించీ, ఉద్యోగంలో పదవీ విరమణ ఉన్నా గృహంలో శ్రమకు విరమణలేక, వయసు పైబడి శరీరం సహకరించకున్నా అన్ని విధాలా చాకిరీ తప్పక – స్త్రీ ఎంతటి బ్రతుకు పోరాటాన్ని సాగిస్తోందో ఈ కవిత గాఢంగా చిత్రిస్తుంది. అనాధబాల అయినా, అయినింటి బిడ్డయినా ఆడపిల్ల చిన్నప్పటి నుంచి వృద్ధాప్యం దాకా బతుకు పాటలో అస్తిత్వరాగాన్ని అలపించే వైనాన్ని విశదీకరించి అనుభూతి రమ్యం చేశారు కవయిత్రి.

కావాలని కోరుకున్నా పిల్లలు పుట్టక కొందరు స్త్రీలు వేదన చెందుతూంటే సంక్షేమాశ్రమాల వంటి వాటిల్లో నిరుపేద అమాయక బాలికల్ని ఆగమాగం చేసేందుకు అక్షరాలకి బదులుగా పొట్టల్లో పిండాలు ఊపిరి పోసుకోవడం గురించి, వయసుకు మించిన భారాన్ని చంకనేసుకుని, పసితనంలోనే ఆరిందాలై పండిపోతున్న వారి గురించీ, యవ్వనంలో ఆకర్షణలు, బుల్లితెరలెక్కించే ప్రలోభాలు, ప్రకటనల్లోని సౌందర్య సాధనాలపై ఆశలు, గొర్రె కసాయివాణ్ణి నమ్మినట్లు మంత్రించిన ప్రేమికుడి వెనుకపడి

యాసిడ్ దాడులతోనో, కత్తిపోట్లతోనో మోసపోయే ప్రమాదాల గురించీ అమ్మాయిలకే కాదు, తల్లిదండ్రులకీ ఉపయుక్తమైన సందేశ కావ్యం వంటిదిది.

"కాలాన్నైనా జీవితాన్నైనా
ఈ దశలోనే అమూల్యంగా దాచుకోవలసింది
చేజారిన నిమిషాన్ని ఎంత తపించినా
తిరిగి చేతిలోకి తీసుకోలేం
వేస్తున్న ప్రతి అడుగూ జారుడుబండపై పడకుండా
భవిష్యత్ పథంలో నిలదొక్కుకోటానికై
ఆచి తూచి అడుగువేయాల్సినదే"

అని హెచ్చరిస్తారు. "ఒకవైపు కార్యాలయాల్లో ఉద్యోగపు మెట్లు ఒక్కొటొక్కటే అధిగమించటానికై, మరోవైపు గృహాలయంలో బాధ్యతలచుట్లు ఒక్కొటొక్కటే సరిచేసుకోవటానికై, సహకరించని శరీరాన్ని ఉత్సాహపరుచుకుంటూ, అలసిపోతున్న మనసుని స్వాంతన పరుచుకుంటూ భవిష్యత్తు రచనల్ని అందంగా లిఖిస్తుంది" అని స్త్రీ ఉదాత్త నైజాన్ని ఉల్లేఖించారు. "క్షణికావేశంలో నిర్దయగా చిదిమేయాలనే పిరికి ఆలోచనని - ఎప్పుడూ ఎక్కడా రెక్కవిచ్చుకోనీకుండా - ముందుగానే పసిగట్టి పాతరేద్దాం - ఆటుపోట్ల పాఠాన్ని అవగాహన చేసుకుని - మనల్ని మనం ఆవిష్కరించుకోవాలే గానీ - ఆత్మహత్యల్ని ఆశ్రయించటమేమిటి" అని ధైర్యం నూరిపోస్తారు.

ఒక ఆలోచన వెనక ఆంతర్యాన్ని, ఆంతర్యాన్ని అల్లుకున్న ఆశయాల్ని, ఆశయాల్ని సాధించుకోవాలనే అనంత తపనల్ని. తపనల్ని పలవరించే ఆశల్ని, ఆశల్ని దాచుకున్న హృదయాల్ని ఒకదాని వెంట మరొకటిగా హృదయ విహంగాల్ని చిన్ని ఆకాశంలోంచి అస్తిత్వ ఆలాపనని విశ్వమంతటా వినిపించమని ఎగరేస్తూ, కలత నిద్రలో సైతం స్వప్నిస్తూ, గాఢనిద్రలో సైతం కలవరిస్తూ ఉన్న, ఉత్తాల ఉదాత్త గుణగణ భూషిత అయిన స్త్రీ సమగ్ర జీవన హృదయావిష్కరణం ఈ దీర్ఘకవిత.

'అస్తిత్వాన్ని' అస్థిత్వంగా అనేకచోట్ల నమోదు చేసినా, నిజంగా అనుభూతిని ఎముక మజ్జలోకి ఇంకిపోయేంతగా అనుభూతి చెందిన కవయిత్రి శీలా సుభద్రాదేవి. ఆవిడకు షష్టిపూర్తి శుభాకాంక్షలు. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 3 జనవరి' 2010)**

# (35) కవితల 'కాంతి కవాటం'

**సి**నిమాపాటలు రాసే సినీగీత రచయితలకు జనబాహుళ్యంలో ఎక్కువ పేరు ప్రతిష్ఠలుంటాయి. నిజమే కానీ సాహిత్య ప్రపంచంలో సీరియస్ కవులుగా వారిని గుర్తించటం తక్కువ. కానయితే, సినిమాలలోకి రాకమునుపే తమ కవితా వ్యాసంగంతో కవులుగా పేరొందిన శ్రీశ్రీ, ఆరుద్ర, సినారె, దాశరథి వంటివారికి ఇది వర్తించదు. సినిమా పాటల సాహిత్యాన్ని కూడా గుర్తించాలని శ్రీశ్రీ వంటి కవి ప్రత్యేకించి అన్నాడంటే..., కవిగా గుర్తించబడటానికి సినీగీతరచయిత మాత్రమే కావటం ఒక అవరోధంగా ఉన్నట్లే మరి. సినీకవికి గ్లామర్ ఎక్కువే. కానీ అసలు సిసలు సీరియస్ కవిగా సాహిత్య చరిత్రలో కవితారంగంలో గుర్తించబడటం విశేష గౌరవ భాజనం.

లలితగేయ రచయితగా ఆకాశవాణి ద్వారా తొలుత సుప్రతిష్టుడైన డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ ఆ తర్వాత సినీ గేయ రచయితగా మాత్రమే గాక, టీవీ ధారావాహికలు, చలనచిత్రాల రచన, దర్శకత్వం వహిస్తూ 'జయ జయహే తెలంగాణ' వంటి నృత్య రూపకాల రచనతో గణుతికెక్కారు. పద్యకవిత్వం, గేయకవిత్వం, వచనకవిత్వం ఇవన్నీ కవిత్వ ప్రక్రియా సంబంధులే. ఒకప్పుడు  పద్యకవిత్వం రాజ్యమేలింది. ప్రస్తుతం వచనకవిత్వం ప్రధాన స్రవంతిగా సాగుతున్నది. 1968 నుంచి పలు పత్రికల ద్వారా తన కవితా రచనా వ్యాసంగాన్ని నిరంతరాయంగా సాగిస్తూనే వచ్చిన వడ్డేపల్లి కృష్ణ ఇంతవరకు ప్రచురించిన పాతిక ముద్రిత గ్రంథాలలో అంతర్మథనం, హలాహలం, వడ్డేపల్లి సమగ్రవచన కవిత మాత్రమే పూర్తినిడివి వచనకవితా సంపుటాలు.

1995 లో తన సాహిత్య జీవిత రజతోత్సవం సందర్భంగా వెలువరించిన సమగ్ర వచనకవితా సంపుటి తర్వాత, దాదాపు రెండు దశాబ్దాల తన కవితలను 'కాంతికవాటం'గా సరికొత్త కవితా సంపుటిగా వెలువరించారు వడ్డేపల్లి కృష్ణ. ఈ కవితా సంపుటి 'కాంతి కవాటం' – 'కందిలి' అనే కవితతో ప్రారంభమై తనకు స్ఫూర్తి ప్రదాత అయిన సినారెకు స్మృతిగా రాసిన 'దివికేగిన దివ్యకవి' కవితతో సమాపనమైంది.

కరెంటు లేని ఆ రోజుల్లో 'కందిలి'యే ఎలా తోడయ్యిందీ చెబుతూ..

'రేపటి పరీక్ష ఏమవుతుందో.. అని
రెప్పవాల్చక చదువుతూ
గావర గావరవుతుంటే
భయపడక బుద్ధిగా చదువు–
భద్రంగా నాలాగా వెలుగుతావు!
రేపటి పరీక్షలే కాదు
ఆపై జీవితంలో ఎదురయ్యే
అనేక పరీక్షల్నీ నెగ్గుతావు.. అంటూ
హితోపదేశం చేసేది కందిలి!'

అంటూ అందువల్లనే తానెంతగా ఎదిగినా

'ఆ కందిలి
నా వెలుగుల పందిరి!
దానికి నా స్మరాంజలి..' అంటాడు వడ్డేపల్లి.

'కాంతి కవాటం' కవితా సంపుటి నామధేయంగా అమర్చుకున్న కవితలో..

'ఇంటి కలప కవాటం తెరిస్తే.. వాకిలి వైభవం ప్రత్యక్షం..' అంటాడు కృష్ణ.

వడ్డేపల్లికి హాస్య, చమత్కారాలు అంటే ఇష్టం. ప్రధానంగా గేయకవి కావటం వల్ల 'ప్రాస'లతో క్రీడలు, పదాల 'ఫన్'దిరులు సలపడం, నిలపడం చేస్తాడు. వ్యంగ్య వైభవంలోనూ, 'చురుక్కు'ల చురకలూ వేస్తుంటాడు. వచనమై తేలిపోవటానికైనా సంసిద్ధుడే కానీ.. గూఢత, మార్మికత పేరనో, అస్పష్టత పేరనో అభివ్యక్తం కాదు.

'ఓ కవీ, సుకవీ, సుఖకవీ
శాలువాలు, సత్కారాలు అందుకుంటున్నా
పండగపూటా పాత కవిత్వమేనా?
నిన్నమొన్నటి పదార్థాల్ని
మైక్రోవేవ్‌లో మళ్లీ వేడిచేసి తిన్నట్లు!
తాజాగా తయారుచేసుకోలేవా
అక్షరాల బొబ్బట్లు...' అంటాడు.

నాలుగు ఉగాది కవితలు, ప్రపంచ కవితా దినోత్సవ కవితలు రెండు, గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భ కవితలు.. ఇలా పునరావృత్త సందర్భాలకై సమయోచిత భావనలతో, గతానుగతిక ఇతివృత్తాలను సంతరించుకోవటం అనే వైఖరిని మూసను ఛేదిస్తూ మాస్‌ను చేరుకుని చప్పట్లు చరిపించుకునే చేవను వడ్డేపల్లి ఆవాహన చేసుకున్నాడు.

మానవతే మకుటాయమానంగా బతుకులోని కోణాలను ఆవిష్కరించి చూపే ప్రజ్ఞ తనలోని మరో కవితా పార్శ్వం.

'పడిపోతే కంటతడితో
పరితపిస్తూ లేవనెత్తుతుంది అమ్మ!
అసలు కంటతడియే కలుగకుండా
అది అనుభవంగా మార్చి
అదనుగా పరిగెత్తేలా చేస్తాడు నాన్న..'

అంటాడు 'అమ్మ– నాన్న' కవితలో.

'పల్లె తల్లి మారుమూల
తల్లడిల్లిపోతున్నా
పట్నాలకు పంటలనే
కట్నాలుగ యిస్తోంది...'

అంటూ 'మా వూరే తల్లివేరు' అన్న ఖండికలో తనదైన గేయధారలో..

'సిరినేతలు విలసిల్లిన
సిరిసిల్లా మా వూరు
కాని నేడు కర్మగాలు
ఉరి 'సెల్లా' మా వూరు..'

అని గాయాల దారిని తలచి తల్లడిల్లుతాడు.

అలాగే 'విశ్వనగరం' అన్న కవితలో..

'చార్మినార్ 'చార్మ్'తోనో
గోల్కొండ పాత గొప్పతోనో

విశ్వనగరం ఏర్పడదు!
ప్రతిపేదవాడి 'పేట్' గండిపేట్
పరమానందంగా నిండినప్పుడే
నిజమైన విశ్వనగరం రుజువుగా అగుపిస్తుంది..'

అంటూ వీధులు కేవలం విశాలం అవడం కాదు, జీవుల హృదయాలు విశాలం అయినప్పుడే సంపూర్ణత అంటాడు.

'చిలక ముక్కు' అనే కవితలో..

'పండ్లను అదే పనిగా కొట్టడం వల్లనేమో.. చిలకముక్కు చిత్రంగా ఎర్రబడి పోయింది! / ఫండ్లను అదేపనిగా కాజేయటం వల్లనేమో.. రాజకీయం పూర్తిగా రంగునే కోల్పోయింది..' అంటూ పండ్లను, ఫండ్లనూ చమత్కరించటంతో బాటు, ఏ 'ముక్కు'ను రాజకీయంగా ధ్వనింపచేస్తున్నాడో గ్రహించటం కష్టమేమీ కాదు.

తెలంగాణ మాండలికంలో 'బంగారు భాష–బతుకు' అనే కవిత మురిపిస్తది. అలాగే 'సెల్‌ఫోన్‌కు సెల్యూట్' అనే కవితలో ఆధునిక సాంకేతికతకు ఆహ్వానం పలుకక తప్పదనిపిస్తాడు.

'మబ్బులెన్ని కమ్మిననూ
వెలుగొందేవాడు రవి
మరణానంతరం గూడ
మన గలిగినవాడు కవి

అందుకే...
మరో రవిలా నిత్య నూతనంగా ప్రకాశించు
మహాకవిలా సత్యకేతనంగా రాణించు..'

అంటాడు రవి–కవి అనే కవితా ఖండికలో.

అభ్యుదయ భావాల కాంతి కవాటం తెరిచిన వడ్డేపల్లి కృష్ణ కవిత్వకాంతులు సమాజ శ్రేయోదీప్తులు కావాలనీ, 'పైరవీలు' ప్రతిబంధకం కాని ప్రతిభా పురస్కారపు 'కందిలి' తనకు అందిరావాలని కోరుకుంటున్నాను. ✻

**(నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె 22 అక్టోబరు' 2018)**

# (36) సూర్యదీప్తుల కవిరాజు

'రవిగాంచనిచో కవిగాంచును'. సూర్యుడు చొరబడలేని తావుల్లో కూడా కవిసూర్యుడు చొరబడగలుగుతాడు. కవి అంటే సూర్యుడనే అర్థమూ ఉంది. 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' – మనిషికి ఆరోగ్యకారకుడు సూర్యుడు. అలాగే సమాజ ఆరోగ్యానికి కవి సూర్యుడు తన కవిత్వ కిరణాల ద్వారా మేలు చేయగలగాలి. చీకట్లను ఛేదించేది సాహిత్యంగానీ, తిమిరజీమూతాలను ఆవరింపజేసేది కాదు. నిజమే! మణిమీదా, మట్టిముద్దమీదా సూర్యకిరణం సమానంగానే పడుతుంది. గ్రహణశక్తిని బట్టి రాణింపు వుంటుంది. మణులయినా మట్టిలోనుంచి వచ్చేవే! మట్టిలో మాణిక్యాలను వెలికితీసి ప్రకాశమానం చేయగల జీవనవ్యక్తిత్వవికాసం అందించగల సాహిత్యమే సదా సమాదరణీయం! కవిత్వం ఆ పనిచేయగలగాలి. ఉపరితలాలను కాక, హృదయమూలాలను కదిలించగలిగే కవిత్వమే – సూర్యకిరణ ప్రభాసమానమై వెలుగులు విస్తరించగలుగుతుంది. సమాజాన్ని ఆరోగ్యప్రద మొనరించగలుగుతుంది.

అందుకేనేమో ప్రత్యక్ష నారాయణుడైన సూర్యుడినే హృదయస్థం చేసుకుని 'కవిరాజు' (సి.ఎస్.ఎన్.రాజు) సూర్యాంశువులు, సూర్యకఠారి, సూర్యధ్వజం, సూర్యరథం కవితాసంకలనాలుగా మునుపు వెలువరించి, ఇప్పుడు సరికొత్తగా 'సూర్యపుత్రి' ని ప్రసవించాడు. "మానం జనః సూర్యేణ ప్రసూతా", ఈ సూర్యపుత్రి హృదయనేత్రి.

నేటి కాలాన మొక్కమొలిచిన కవిత్వంలో, మొక్కవోని జీవన సారాన్ని అందుకోగలగడం ఆధునిక జీవితంలో మరీ అపురూపమైపోతోంది! నగర జీవనం జనారణ్యమే గానీ వృక్షతతులేవీ? కిరణజన్య సంయోగ క్రియ ఏదీ? అపార్ట్‌మెంట్ కల్చర్‌లో కుండీ మొక్కలే గతి! అవి కూడా తగిన నీరు, వేడి తగలకపోతే మటాష్! 'మొక్కల మురిపెంలో తనను అలక్ష్యం చేస్తానని హఠాత్తుగా సూర్యుడు ఓ ఖాళీకుండీలో ఉదయించాడు' అని కవిరాజు 'సూర్యపుత్రి' మొదలవుతుంది. కుండీ కూడా మట్టితో చేసిందే. మట్టితో చేసిన కుండీలో మట్టిలేకపోతే మొక్క మొలవదు. కానీ మట్టిలోంచి, అందునా ఖాళీ కుండీలోంచి సూర్యుడు ఉదయించాడనడం కవి అసమాన సృజన!!

'సముద్రపుటలలు పోగుచేసి సూర్యుడు ఆకాశం నిండా ముగ్గులు పెట్టాడు. చిలిపిగాలి కాళ్ళతో చిమ్మేసి భూదేవిని శ్రీదేవిని చేసింది'ట! సిరులు పొంగిన జీవగడ్డగా ధరిత్రిని చేసే 'సూర్యపుత్రి' ఇది కదా!

ప్రకృతి నుండి బహిర్చక్షువులకు కనబడే అంశాలనయినా అంతర్నేత్రాలతో వీక్షించి, ఒక తాత్త్వికతను వెలార్చడం కవిరాజు ప్రతిభ. ఇదీ ఒక 'మ్యాజిక్ రియలిజమే'! సమాజగత దైనందిన వార్తా విషయాల నుండి కూడా, ఒక జీవన దార్శనికతను పట్టుకోవడం ఎలాగో ఈ కవిరాజుకు తెలుసు

"నెత్తికెత్తుకుని ఆకాశం ఎంత ఊరేగించినా
నేలమీద వాలటానికే మబ్బు ఉత్సాహపడుతుంది"

అనడంలోనే కీర్తి ప్రతిష్ఠలకన్నా కర్తవ్య నిష్ఠయొక్క గొప్పదనాన్నీ, ఒక చిత్త శుద్ధి, నిజాయితీ నైజాన్నీ రూపుకట్టిస్తున్నాడు మన 'కవిరాజు'. నగరీకరణ కారణంగా పల్లెకూడా  ఎలా ప్రకృతినికాక వికృతిని వల్లెవేస్తోందో చెప్పడానికా అన్నట్లు "విద్యుత్ సరఫరా ఆగిపోతేతప్ప ఏరాత్రీ కనిపించని నక్షత్రాలకోసం- పల్లెకు వలసవచ్చాను అమ్మో ఇక్కడ పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి" అంటాడు. పల్లె పట్టపగలే చుక్కలు కనిపించేదిగా పరిణామం చెందిందనడంలో మారుతున్న పల్లెచిత్రపు వ్యధాభరిత బ్రతుకుకు గొప్ప భావచిత్రం అందించాడు.

కవిరాజు చాలా తెలివైనవాడు. రాజకీయాన్ని కూడా ప్రకృతిగతంగా ప్రతిఫలింపచేయడం చేతనైనవాడు. విసిగిపోయిన ప్రభుత్వం నుండి మార్పు కోరుకునే ఓటరు లక్షణాన్ని ఒక చోట ఇలా అన్నాడు "రాజీవమిత్రుడి ఏలుబడిలో వేగలేక కలువ చెలువుని రాకకోసం తపిస్తూంది ప్రజాగణం" అని. "బంగారం ఎంత ఉన్నా కడుపులో పెట్టుకుని దాచుకుంటుందే తప్ప భూమితల్లి ఒంటికి అలంకరించుకుని ఊరేగదు" అంటాడు కవిరాజు. తహతహల తాపత్రయాలు, అనవసరపు ఆరాటాలు ఎందుకన్నట్లుగానే "అదును వచ్చేవరకు ఎంతభారమైనా భరిస్తూ, మేఘం ఆకాశంలో ఎగురుతూనే ఉంటుంది" అనీ అంటాడు. ఎంత విలువైన సందేశాత్మకత!

"చంద్రుడికి మరీబడాయి-అందగత్తెలంతా తనలాగే ఉంటారంటారని! కానీ నేనెప్పుడూ అంటూఉంటాను చందమామ మా ఆవిడలా ఉంటుందని!" అన్న కవిరాజులోని కౌటుంబిక జీవన మాధురి ఎంతైనా అభినందనీయం కాదా! 'ఆకాశాన్ని

కడిగిన వర్షపునీరంతా చేరి భూమ్మీద జలాశయాలు నీలంగా మారిపోయాయి' అంటాడు. సహజ స్వభావం సజ్జనసాంగత్యం వల్ల కూడా మారలేకపోవడాన్ని "ఎంత మంచినీటిలో సదా ఈదులాడుతున్నా, చేపల్లో నీచువాసన దూరం కావటంలేదు" అంటూ చెబుతాడు. 'ఆకాశంలో మెరుస్తున్న సూర్యచంద్రులు జగన్మాతమెడలో ఆదిపురుషుడు కట్టిన మంగళసూత్రాలు' అన్న కవిరాజే–'తారలదండుతో చంద్రుడు చేసిన దాడికి భయపడి సూర్యుడు పలాయనం చిత్తగించాడు' అనీ, 'సూర్యచంద్రులది రాచవైరం. ఒకరికొకరు ఎదురుపడరు. ఎప్పుడూ ఎడముఖం పెడముఖం' అనడం చమత్కారమే అయినా, తాత్విక భూమికపై పొసగకపోవచ్చు. 'సూర్యధ్వజం' ఎత్తుగానే ఎగరేయాలి సదా. ఎందుకంటే ఆలనాపాలనా చూడడానికి అమ్మే సూర్యుడికి ఒప్పగించిపోయింది కదా! ఏమైనా ప్రకృతిగత అద్భుత భావజాలాన్ని సూర్యకిరణ సంతప్త జీవనగీతం చేసి, హృదయపీఠాన్నే అనువైన తావుచేసిన కవిరాజు' అందుకోవాల్సిన ఓ కవిత్వవేది. ❋

**(ఆంధ్రప్రభ దినపత్రిక 5 నవంబరు 2009)**

# (37) ప్రయాణంలో పద నిశ్వాసలు

**స్టే**షన్లు వస్తాయి. ఆగిపోవడాలుంటాయి. ఎక్కడో ఏదో సిగ్నల్ పడదు. ఔటర్ దాకా వచ్చీ నిలిచిపోయే స్థితి ఉంటుంది. పట్టా ఏదో తప్పిందనో, ఏదో కట్ట తెగి నీరు ట్రాక్‌ను ముంచెత్తిందనో, అవరోధాలతో నిలుపుదలలుంటాయి. అయినా ప్రయాణిస్తున్నట్లే! ప్రయాణం సాగుతూనే ఉంటుంది! నువ్వు రైల్లో అంటూ ఉంటే.

బహుశా బ్రతుకురైలు సంగతీ అంతే! అది ఒక ఎడతెగని ప్రయాణం. భార్యాపిల్లలూ, బంధుమిత్రులూ అదే రైల్లో ఉన్నా నీ ప్రయాణం నీదే! నీ సుఖదుఃఖాలు, కలవరింతలు, భయాందోళనలు, పరి పరి పరిచయాల కరచాలనాలు, చిరునవ్వుల పలకరింపులు, అసహ్యించుకోవడాలూ, రోతలూ, చిల్లరమల్లర అమ్మకాలు అన్నీ ప్రయాణగతాలే!

షేక్ హారాన్ బీ, షేక్ మహమ్మద్–యాకూబ్‌ను కన్నారు. యాకూబ్ శిలాలోలితను కరిగించుకుని సందీప్, సాహిర్ భారతిలతో బాటు కవిత్వాన్ని కన్నాడు. ప్రవహించే జ్ఞాపకంగా హృదయాన్ని మలుచుకుని, సమాజ సరిహద్దురేఖలు ఎరిగీ "రేషన్‌లో శాంతిని ఈ రాజ్యం ఎంత కేటాయిస్తే అంతే సంచీలో తెచ్చుకోవాలి. అంతటితోనే సరిపుచ్చుకుంటూ గడపాలి" అని గ్రహించీ, సరిహద్దుల మధ్య, సన్నాయి నొక్కుల మధ్య, ప్రయాణాన్నే సదా విశ్వసంగీతంగా ఒక లయాత్మక యాత్ర చేస్తున్నాడు. "రైలు లోపలి ప్రయాణం బయటి ప్రయాణాన్ని దాటి దూసుకెళ్తుంటుంది."

అతనికి కరుణ గురించి తెలుసు, కాఠిన్యం గురించి తెలుసు. బయటి 'రియల్ ఎస్టేట్'లు తెలుసు. హృదయం లోపలి మనిషికి కావలసిన రియల్ ఎస్టేట్ తెలుసు. "వెక్కి వెక్కి పడిన ఒంటరితనాల వనాల్లో నన్నో ప్రాణవంతపు పత్రహరితంగా మార్చిన కన్నీటి చుక్కలకు ప్రణామం" అంటాడు. "చిత్తంలో ప్రతిదెబ్బా సుత్తిదెబ్బగా మలచిన మానవమూర్తిని మించిన మహితశిల్పమేమున్నది" అంటారు బోయి భీమన్న. యాకూబ్ కవితాశిల్పంలో ఆ ఉలిపోటుల, ఉలికిపాటుల సాక్షాత్కారం ఉంది. "శుభ్రంగా పెళ్లి చేసుకో. పెళ్లాం అనుకూలవతి అయిందా సుఖపడతావ్, లేదా

వేదాంతివవుతావ్" అన్నాట్ట సోక్రటీసు. సోక్రటీసు కాలం వేరు. శోకాన్నీ, టీజింగునూ కూడా కలుపుకున్న ఆధునికాన అనుకూలవతి మాత్రమే అసలైన వేదాంతిని చేయగలుగుతుంది. వేదాంతం అంటే ఆత్మను చావుకు దారితీయించడం అని కొందరి భ్రమ! "ఆమె ఎవరు, ఎవరీ పిల్లలు, ఎవరు వీరంతా? అనుబంధాల కొనలకు తగిలించిన ఈ తెరల వెనుక–మసగ్గా తిరుగాడుతున్న వీళ్లనెలా గుర్తుపట్టడం – నాలాగే దేహంలేని దేహాలతో – కరెన్సీ ముఖాల నవ్వుల మధ్య సేద తీరుతున్న వీళ్లెవరో" అని 'ఒకానొక నేను'ను 'సందేహం' తోటే ఆవిష్కరించుకునే యత్నంచేస్తున్న కవి అందుకే ఆమె ఎప్పుడూ అలకపాన్పుమీంచే మాట్లాడినా, నన్ను ప్రేమిస్తున్నావా అని నిత్యం విసిగించినా "నేనో రూపాన్ని వెతుక్కుంటున్న వాయువుని. పిట్టలకు మల్లే రెక్కల్ని ధరించిన గమనాన్ని" అని ప్రసరించిన లోచూపు కలవాడై, 'సజీవంగా ఉంటూ హృదయాన్ని వినడం నిపుణుల పని' అని ఆ నైపుణ్యంతో ప్రయాణిస్తుంటాడు. అతనికి తెలుసు 'ప్రతి పరిచయం ప్రేమ మాత్రమే కానక్కర్లేదు. మనల్ని మనకు సరికొత్తగా పరిచయం చేసే పురాజ్ఞాపకంకూడా" నని.

"జీవితంలోకి ప్రేమగా ప్రయాణించినవాడే
తనను తాను సంపూర్ణ మానవునిగా నిర్మించుకుంటాడు"

అంటూ సహజభాష నిర్భయసంచార నిజమైన జీవితప్రయాణమేనని వచిస్తాడు. 'మనసు విప్పి మాట్లాడుకోవడం' సాధ్యంకాకపోవడమే అసలైన అవిద్య. ప్రతివాడూ ఎంతో కొంత ఆ రకంగా నిరక్షరాస్యుడైన అవిద్యావంతుడేనేమో!

మతంకన్నా మానవత్వం అసలు గమ్యం అనే యాకూబ్ "ఈ లోకానికి ప్రేమ కావలసిన వనరు" అని చాటేందుకు మసీదు, మందిరంలా కాక మనుషుల్లా ప్రయత్నిస్తూనే ఉంటాడు. శాంతి శాంతి శాంతి అని పచ్చజెండా ఊపుతూంటాడు. "రణాలు ఈ భూమిని వ్రణంగా మార్చకముందే శాంతి నినాదం చేద్దాం" అంటాడు. రాజకీయం మనిషిని ఎలా ప్రక్కదారులు పట్టించి సహజీవన ప్రయాణ అవరోధాలు కల్పించి పరిహసిస్తుందో తెలుసుకనుకనే "నిన్నటి నాయకుడ్ని వదిలి మరో నాయకుడిలోకి హాయిగా ప్రయాణిస్తాం. కానీ మన మనిషిలోకి మనం హాయిగా సాగిపోవడానికి సందేహిస్తాం" అంటూ – "నిజంగానే నిజం, మనమే నిజం, మనమంతా నిజం, మిగతా అంతా ఒట్టి అబద్ధం" అని 'ఒకే ధార'తో తేల్చి చెబుతాడు.

"కల వంటి, శిలవంటి, కాంతి వంటి, కరుణ వంటి, సుడులు తిరిగే ఊహవంటి, ఉరకలెత్తే ఉద్వేగం వంటి ప్రేమే కవిత్వం. కవిత్వమే ప్రేమ" అంటూ యాకూబ్ "నిన్నూ సమూహాన్నీ కలిపే రహదారి కవిత్వం" అంటూ ప్రకటించి, ప్రేమైకమయ సామూహిక ప్రయాణానికి జీవితపు బాటలు వేస్తున్నాడు. యాకూబ్ కవిత్వం చదివి అందుకే ఒక తాత్త్వికతను గ్రహించిన కె.శివారెడ్డి – "భక్తికవుల, సూఫీకవుల జీవనతత్వమేదో, నిజమయిన జీవన వేదాంత విధానమేదో అది బతుకే. బతుకునుంచి జనించిందే. బతుకును ఆనందమయం చేయడానికి, కాంతిమంతం చేయటానికి ఉపయోగపడేదే. భక్తికవులు, సూఫీకవులు ఎవ్వరూ బతుకును వదల్లేదు. బతుకును బతుకుతూ జీవితం ఆమోదయోగ్యమయిన ఆనందమయమవటానికి దోహదం చేశారు" అంటూ సూఫీకవిగా యాకూబ్‌ను సంభావన చేశాడు.

'ఏకో రసః కరుణ ఏవ' అని భవభూతి నిర్వచించినట్లే "నా ఉద్వేగ గాద్గద్యాల ప్రాణవంతపు పరిచయ సంతకం ఈ కన్నీటి బొట్టే" అంటున్న యాకుబ్ ఎడతెగని ప్రయాణ లక్ష్యాన్ని ఇలా సారభూతం చేశాడు.

"జీవన ప్రయాణంలో ప్రేమ ఒకటే దరిచేర్చే సాధనం
ప్రేమ పథంలో ప్రేయసి నాకు తోడు
ప్రేయసి కళ్లలోకి తొంగిచూస్తే జీవితమంతటి భరోసా
ఏడుపులు, కన్నీళ్లు అతలాకుతలం చేస్తున్నా
ఆమెలోంచి నేను ఒంపుకునే ఆత్మవిశ్వాసం
ఎప్పుడూ ఓడిపోనీకుండా చేస్తుంది

ప్రేయసిని గుండెల నిండుగా ప్రేమించడం, ఆమెలోని అంతరంగాన్ని దర్శించడం కోసం తపస్సు చేస్తుండటం, ఇవన్నీ నేను తోటి మనిషిని ప్రేమించడం కోసం చేస్తున్న పరిశ్రమ. ఆ పరిశ్రమలోనే నాలోపలి స్వరం నాతో మాట్లాడుతుంది. మనిషి నిజం. మనిషి మాత్రమే నిజం. మనిషిని ప్రేమించడం వినా అంతా అబద్ధం" అని అంటాడు. జీవితమే ప్రేయసి. ప్రేమే ఎడతెగని ప్రయాణం. అందుకే వ్యష్టిని సమష్టి చేసే కవిత్వ ప్రయాణికుడు యాకూబ్‌కు యా ఖూబ్ 'సలామ్'లు. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 18.2.2010)**

# (38) మేలిమి భావాల 'కొలిమి'

ఇన్‌స్టెంట్ కాఫీలా, ఫాస్ట్‌ఫుడ్‌లా - కవిత్వమూ, సాహిత్యమూ కూడా తయారయ్యాక మనసుకు ఇంకించుకుని, అనుభూతి రసాస్వాదన చేయడమూ పోతోంది! అంతా పరుగు! వేగం!! సాధ్యమైతే అవతలివాడిని ఏదో రకంగా అధిగమించడమే ముఖ్యం! కలిసి ప్రయాణించడం, ఒకరి వెనుక ఒకరు సాగడం పెద్ద నామోషీ! వెనక ఉండటమంటే అనుసరించడమేననీ, ముందుండడమే నాయకత్వ లక్షణమనీ భావన. కలసి పదిమందితో వెళ్లడం జరిగినా, పది మందిలో తనకే గుర్తింపు ఉండాలనీ, అందరిదృష్టీ తనను అభినందిస్తూనే సాగాలనీ, ఆరాటం!!! నెమ్మది లేదు. పైగా అందరూ వెళ్లేదారిలో తాను వెడితే గుర్తించరని, ఏదో భిన్నమార్గం తొక్కాలని తపన!! పదిమంది వెళ్లే దారిలో వెళ్లినా, వెళ్లడంలో ఏదో వైచిత్రి ప్రదర్శనకై, తద్వారా ఇతరుల దృష్టిని ఆకర్షించేందుకై తహతహలు!!! ఇదీ నైజంగా మారుతోంది. సాహిత్య ప్రపంచం ఇందుకు భిన్నంగా ఏమీలేదు.

కవిత్వంలో ఇన్ని ఇజాలు, వాదాలు ఎందుకు? 'విశ్వశ్రేయః కావ్యమ్' అని కవిత్వ ప్రయోజనం అందరికీ కదా అంటే, అంతిమ గమ్యం ఒకటే అయినా, దారులు భిన్నాలు అవడంలో కానిపని, కూడని వైఖరి ఏముంది? అంటారు. కావచ్చు! కానీ ఇప్పుడు చిక్కు ఎక్కడ వచ్చిందంటే గమ్యం మరచి వట్టినే దారులు పట్టుకుతిరగడం! ఎవడిదారి వాడిదే!! తనదారే సరియైనదనో, అవతలివారి దారి వక్రమైనదనో, దుర్గంధ భూయిష్టమైనదనో ఆరోపణలు. నీ దారి నీకు గమ్యానికి చేరడానికి సులభమూ, సౌఖ్యవంతమూ అనిపించినట్లే, ఎదుటి వానికి వాని దారి అనిపించవచ్చుకదా! మతం అంటే మార్గమే. మార్గాలు ఏవయినా, మనిషి చేరుకోవలసిన పరిపూర్ణ గమ్యం ఒకటే వేమన అంటాడు.

"పశుల వన్నెవెరు పాలెల్ల యొక్కటి
పుష్పజాతి వేరు పూజయొకటి
దర్శనంబులారు దైవంబు ఒకటయా
విశ్వదాభిరామ వినురవేమ!"

అలాగే ఒక ఏకత్వం అనేది లక్ష్యంగా నిర్దేశించుకోకుండా, గమ్యం చేరడం మాటమరచి, దారుల్లోనే గిరికీలు కొడుతూంటే ఒరిగేదేముంది? నీ దారిలో ఓ మామిడి చెట్టువుంది. నీ దారిలో ఓ చెత్తకుండీ కూడా ఉంది. కానీ ఎదుటివాడి దారిలోని చెత్తకుండీ గురించి గోరంతలు కొండంతలు చేసి నువ్వు చెబుతూ, నీ దారిలోని మామిడిచెట్టు గురించే విమర్శకులు కూడా పట్టించుకుని మెచ్చాలను కోవడం ఎలాంటి ప్రజాస్వామ్యం? ఎలాంటి సాంఘిక చైతన్యం? ఏ విధంగా ప్రయోజనదాయకం?? "వివిధ సాహితీసంస్థలు, వాదాలకు చెందిన కవులు, రచయితలు, ఎన్ని భావపరమైన తేడాలున్నప్పటికీ, ఒక విద్వేష పూరితమైన వాతావరణంలో బతకవలసిన అవసరం లేదు. సాహిత్యకారులే ఇలా ఉంటూ అందరికీ సుద్దులు చెప్పటం హాస్యాస్పదం కాదా? అలాంటి అప్రజాస్వామిక ఆలోచనల్ని దూరం చేసుకోవల్సిన అవసరం కవులకీ రచయితలకీ ఉంది. కేవలం కొన్ని సమస్యలపైనే మేం మాట్లాడుతాం అని గిరిగీసుకునే వైఖరి మంచిదికాదు. మంచిని మంచిగా చర్చించటం, చెడుని చెడుగా వ్యతిరేకించటంలో నిజాయితీ ఉంటుంది" అంటాడు షేక్ కరీముల్లా. తను ఇస్లాంవాద సాహిత్యంకు ప్రవర్తకుడుగా నేడు నిలిచినవాడు. ముస్లింల జీవన సరళిపై, సంస్కృతిపై వ్యతిరేకంగా రాసే ముస్లిం రచయితలనే, ప్రగతివాద రచయితలుగా, కవులుగా భావించే వైఖరిని తాను నిరసిస్తున్నాడు. ఇస్లాం మార్గంలో గల మంచిని విస్మరించి, తమ మతంలోగల లోపాలను రాసేవారినే గొప్ప సాహితీ సృజనశీలురుగా ఆదరించి గౌరవించడాన్ని కరీముల్లా సరికాదంటున్నాడు. "మేం ఇస్లాంను దూషిస్తున్నాం. కనుక మాది ప్రజాస్వామిక వాదం. మీరంతా మాకు సహకారమివ్వండి" అని అర్థిస్తున్నట్లు వ్యవహరించే ముస్లిం రచయితలు, సాహిత్యాన్ని దిగజార్చడం పట్ల ఆర్తిని చెందడమే కాదు, 'కొలిమి' అంటుకున్న భావజాలంతో ధర్మాగ్రహం చెందుతున్నాడు. "ఈ దేశంలో సామాన్య హిందూ ముస్లిం ప్రజలు మతోన్మాదులు కారు. ఈ విషయాన్ని విస్మరించి హిందువులందరూ దుర్మార్గులేనన్న తప్పుడు సూత్రీకరణలు చేయడమెందుకు? ఆ తప్పును కప్పి పుచ్చుకోవడానికి ఇస్లాంపై దాడి చేసి దూషించి ఇస్లాం వ్యతిరేకుల్ని సంతృప్తి పరచటమెందుకు? ఇటువంటి జిమ్మిక్కుల ఫలితంగా చిన్నా చితకా అవార్డులు వస్తాయేమో గానీ నాగరిక సమాజం ఇటువంటి ఎత్తుగడల్ని ఆమోదించదు" అంటాడు

కరీముల్లా, కొందరు కవులు, రచయితల వైఖరి గురించి. ఇస్లాంవాదం మత ఛాందస వాదం కాదనీ, ఏ మతంలోనైనా మానవత్వపు విలువలున్నాయనీ, వాటిని పరిగ్రహించాలనీ, ప్రగతిశీల మార్గంలో ప్రయాణించడం అంటే ఉదాత్త విలువలను పరిరక్షించుకుంటూ, సరియైన అవగాహన పెంపొందించుకుంటూ, ముందుకు సాగడం అనీ అంటూ, మేధావులు సైతం ఇస్లామో ఫోబియోకు గురి అవడం వెనుక, పెత్తందారీ, ఆర్థిక వనరుల దోపిడీ, సామ్రాజ్యవాద కుట్రలు దాగివున్నాయనీ, వాటిని అర్థం చేసుకోవలసిన ఆగత్యం ఉందనీ, ఈ వ్యాసాలలో బలీయంగా విశ్లేషించాడతను. "ఇస్లాం వేరు, ముస్లిం వేరు అని జరిగే ప్రచారానికి వాస్తవికత లేదు" అంటూనే "నిజానికి ఇప్పుడు ముస్లింవాదం పేరుతో వస్తున్న సాహిత్యం ముస్లింసాహిత్యం కానేకాదు. పచ్చి ముస్లిం వ్యతిరేక విద్రోహ సాహిత్యమది" అంటాడు కరాఖండీగా. "రంగనాయకమ్మలో ముస్లిం వ్యతిరేకత", 'ఇస్లాంపై విషం చిమ్మిన రాతలు' అని బి.ఎస్.రాములు గురించీ రాసిన వ్యాసాల్లో సంయమనంతోనే ఖండించడం చూస్తాం. సాహిత్యంలో మతం పొడే గిట్టదని ప్రగతి శీలవాదులమనే దళిత కవులు, రచయితలు కొందరు, టీడీపీ సారథ్యంలో 'తెలుగు భాషా బ్రహ్మోత్సవాల'లో పాల్గొనడంలోని ఔచిత్యాన్ని తొలివ్యాసంలోనే కరీముల్లా ప్రశ్నించాడు.

తస్లీమా గురించి షేక్ కరీముల్లా – "ఆమె ఒక సాధారణ రచయిత్రి. కేవలం ప్రచారం కోసం అనేక జిమ్మిక్కులు చేసే సాధారణ ఆలోచనలు కల్గిన రచయిత్రి. రష్దీ మాదిరిగా యూరప్ సామ్రాజ్యవాదుల సాంస్కృతిక ఏజెంట్‌గా మారి, యూరప్ దేశాల అండదండలతో, ముస్లిం సంస్కృతిపై దాడి చేస్తున్నది. ఆమె తన రచనల్లో సమాజానికి ఇచ్చిన గొప్ప మెసేజ్ ఏమీలేదు. జర్నలిస్టులు వచ్చి మీ ఫొటోలు తీసుకుంటాం అంటే ఒక్కక్షణం ఆగండి అంటూ జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించి, వైన్ బాటిల్ పక్కన పెట్టుకుని పత్రికలకు ఫోజులిచ్చిన ఘన చరిత్ర కలిగిన రచయిత్రి. దీనిని బట్టే ఆమె సమాజానికి ఏ విలువలను చెప్పాలనుకుంటున్నదో స్పష్టంగా అర్థమవుతోంది. ఆమె వివాహవ్యవస్థను తిరస్కరిస్తుంది. విచ్చలవిడి సంస్కృతిని కోరుకుంటుంది. అయితే అది ఆమె ఇష్టం. ఆమె స్వేచ్ఛను మేం కాదనం. కానీ సభ్యతా సంస్కారాలతో బతికే ఒక వర్గ ప్రజల మనోభావాలను కించపరిచే అధికారం మాత్రం ఆమెకు లేదు. ఈమె గారిని నెత్తిమీద పెట్టుకుని ఊరేగుతున్నవాళ్లంతా వచ్చి

ముస్లిం వ్యతిరేకులే. ఎర్రెర్రని ముసుగుల్లో వున్న మనువాదులు ఆమె గొప్ప ప్రగతిశీల వాది అని అంటున్నారు. అంటే ఇస్లాంను తిట్టడమే ప్రగతిశీలంలా వాళ్లకూ అన్పిస్తుంది. ముస్లిం స్త్రీలు నెత్తిపై వస్త్రం కప్పుకుంటారు కనుక వారి బుర్రలు పనిచేయవని తస్లీమా అంటోంది. దీన్ని దళిత సాహిత్యం ముసుగులో ఉన్న కొంతమంది (అందరూ కాదు) సాహిత్య క్రుసేడర్లు సమర్థిస్తున్నారు" అని షేక్ కరీముల్లా అనడాన్ని సరియైన దృక్కోణంలో అర్థం చేసుకోలేకపోతే, ఇస్లాం వాదమంటే మత ఛాందస వాదమనే పొరబడే ప్రమాదం ఉంది. విశాల భావజాలం కల ఇస్లాంను ముస్లింలే అర్థం చేసుకోలేకపోతున్నారు అన్న ఆవేదన కరీముల్లాలో కంఠదఘ్నంగా ఉంది. తెలుగు సాహిత్యంలో కానీ, పత్రికారంగాలలో కానీ కొద్దిమందైనా నిజమైన లౌకిక వాదులు, ప్రగతిశీల వాదులు ఉండబట్టే జీవనదిలాంటి ఇస్లాంవాదం మనగలుగుతోందన్న సంతృప్తిని ప్రకటిస్తాడు. ముస్లిం సామాజిక సంస్కరణోద్యమంగానే ఇస్లాంవాదం భాసిస్తుందని మతసామరస్య పునాదులపై బలీయంగా ఆలోచిస్తున్న, అభివ్యక్తమౌతున్న కరీముల్లా అభినందనీయుడు.

"ఒక వర్గం ఏదో ఒక విధంగా మిమ్మల్ని రుజుమార్గం నుండి తొలగించాలని కోరుతున్నది. వాస్తవానికి వారంతట వారే దారితప్పుతున్నారు తప్ప మరెవరినీ అపమార్గం పట్టించటం లేదు. కాని వారు దానిని గ్రహించటం లేదు" అన్న ఖుర్ఆన్ సూక్తం మూలకందంగా రగిలిన ఈ భావజాల 'కొలిమి' సువర్ణాభరణ సౌందర్య ప్రదాయకమే. ఇలాంటి సాహిత్యగత ఆలోచనా ధారలు నేడు విధాయకమే. *

**(ఆంధ్రప్రభ దినపత్రిక 27 ఆగస్టు' 2009)**

# (39) రసవాయువు ద్రవించే ఘన కవిత్వ కుమారుడు

'బ్రహ్మ పదార్థం' అనే మాట ఒకటుంది. సృష్టికర్త బ్రహ్మ అనుకుంటున్నప్పుడు, ఆ బ్రహ్మ సృష్టించిన గొప్ప పదార్థం 'మనిషి' తప్ప మరేదీ కాదు. మనిషి పూర్తిగా అర్థమవుతాడా? ఎదుటివాడికే కాదు, తనకు తాను కూడాను! అందుకే 'నిన్ను నువ్వు తెలుసుకో' అనేదే గొప్ప అన్వేషణ! అది నిరంతర క్రియ! బ్రహ్మపదార్థమైన మనిషి తనలోని సృజనాత్మకశక్తుల కారణంగా కవిబ్రహ్మయై సృష్టించే పదార్థం ఏదయితే ఉందో అదే 'కళ'. ప్రధానంగా అందులో చెప్పుకుంటున్నది 'కవిత్వం'. మనిషికి మనిషే అర్థంకానప్పుడు కవిత్వం మాత్రం అంతా అర్థంకావాలని ఎక్కడుంది? అర్థం కానిదే కవిత్వం అని నిర్ధారించలేం కానీ, అర్థం కానిది కవిత్వం కాకుండా మాత్రం పోదు! నిజానికి అర్థాల గురించిన అన్వేషణ కూడా ఒక పరమార్థమే! కవిత్వ పరమార్థమూ ఓ ఎరుకే!

కవి మనుషుల్లోని వాడే! కానీ మామూలు మనిషి కన్నా భిన్నుడెలా అవుతున్నాడు అంటే మామూలు మాటనే అభివ్యక్తీకరించడంలోని వైలక్షణ్యం కారణంగా, ఆ విలక్షణతకు అనేక మార్గాలుంటాయి. అలంకారాలు, శయ్యా, పాకం, దిబ్బా దిడి గుండం.. అని దాన్నేమయినా అనవచ్చు. కవిత్వం మామూలు మాటల్లాగా వుంటే అది కవిత్వం ఎందుకవుతుంది? కానీ అందులోనూ ఒక అంతర్లయ, ఒకతూగు, చెప్పడంలోని ఒక సొబగు దానిని కవిత్వం అనుకునేలా చేస్తుంది అని కదా మనకు అనిపిస్తుంది. ఒక మనిషి 'తెరిచిన పుస్తకం' అనిపించవచ్చు. కానీ నిరక్షరాస్యుడికి ఆ అక్షరాలన్నీ అర్థంకాని బ్రహ్మపదార్థాలే! ఇంతకీ పదార్థవిజ్ఞానమే విశ్వమంతా విస్తరించివుంది. ఘన, ద్రవ, వాయు అంటూ ఎలా వింగడించుకున్నా మనిషిలోనూ, మనిషిలోని కవిత్వంలోనూ అవి ఆవరించుకు ఉంటాయి. కవిత్వంలోనూ ఘనం ఉంది. కవిత్వంలోనూ ద్రవత్వం ఉంది. కవిత్వ వాయువూ ఒకటుంది. కళ్లకు

కనబడనంత మాత్రాన గాలి లేదనలేం. అలాగే కేవలం తాకి, అనుభూతికి లోనుచేసి వెళ్లిపోయేది ఉంటుంది. ఇంతకీ ఘనమైన కవిత్వం గురించి తెలిసినంతగా ద్రవ, వాయుగత కవిత్వం గురించి తెలియదు! జీవితంలాగానే కవిత్వం ప్రవహిస్తూనే ఉంటుంది. ప్రవహించే దాని మీదుగా తరగలెత్తే ఒక రసవాయువు ఉంటుంది. ఘనీభవించిందే కవిత్వం అనుకోవడం వల్ల, పదార్థం మనకు కళ్లకు కనబడినదాన్ని విశ్వసించినంతగా ద్రవస్థితినో, వాయుస్థితినో అందిపుచ్చుకుని, అంతర్ముఖీనం చేసుకోవడం అదేమంత సునాయాస విషయం కాదు. దానికంత త్వరగా సిద్ధమూ కారు.

త్రిగుణాత్మకుడైన మనిషిలో పదార్థత్రయం ఉంది. రజస్తత్వతమో గుణాలు ఘన ద్రవ వాయువులతో సమ్మిశ్రణం అవుతుంటాయి. ఇది దీనితోనే కలిసి అభివ్యక్తి చెందుతుందన్న నిర్ధారిత నియమమేమీ లేదు! జీవాత్మ, పరమాత్మల మధ్యనే కాదు ప్రకృతికి, సమాజానికీ మధ్య, ఆ మాటకొస్తే ప్రతిమనిషికీ మనిషికీ మధ్య ఈ అసమయ రంగుల ముఖమూ... ఇద్దరి దాహం ఓ బ్రహ్మపదార్థంగా ద్యోతకమవుతూనే ఉంటుంది. 'ఆట కదరా శివా' అనిపిస్తూంటుంది. ఇప్పుడిలా బి.ఎస్.ఎం.కుమార్ అనే ఓ పదార్థం నుండి సృజింపబడిన కవిత్వపదార్థం ఒక తీరని దాహంను, రంగుల ముఖోర్మిగా, అసలైన బ్రహ్మపదార్థంగా, సాక్షాత్కరింపచేసుకొమ్మని తపస్సాధనా వాటికగా మన ముందు నిలుస్తూంది! ఈ పరీమళాల్లో ఒక ప్రవాహగుణం ఉంది. ఆ ప్రవాహాలు హృదయ శిఖరాలమీద ఘనంగా గడ్డకట్టుకునే ఒక రసాయనిక చర్య ఉంది. అనివార్య అయోమయంలో అర్థంకాగల తేజోమయం ఉంటుంది. కుమార్ ఎందుకు కవిత్వం రాస్తాడు? "చీకట్ని దాచుకోలేను.. వెలుగునూ ఇవ్వలేని క్షణాలు క్షణ యుగ రాత్రుల్ని ఆరబోసి అమృతమయ దుఃఖాన్ని తాగే క్షణాలు వెంటాడాక ఇంకా తొడగని నీడలు వేటాడతాయి. నిర్మలమవ్వని ప్రాణమయత దీర్ఘమై ఆత్మసమూహాన్ని ఒంటరి చేశాక అయోమయంగా నిలబెట్టే దిగులు నన్నాక్రమిస్తుంది. అర్థ సందోహం పూర్తవని ఆలోచన, కంటిలో దిగబడ్డ గోదావరి... పొరల్ని విడిచేసిన గది, వేడన్నపు ఆవిరి, ప్రాణజీర నిద్రపోతున్నప్పుడు స్ఖలిస్తున్న కలని పెదవులు దగ్గర చేసినపుడు నాలోని జారబడ్డ ఆత్మ లేదా కవిత్వం" అంటాడతను. ఈ కుమార సంభవం సత్య శివ సుందరమైన ఘన ద్రవ వాయు సంచరిత రేతఃపతన కవిత్వ

తేజం. "ఆత్మ ఛాయలు మనల్ని మార్చుకోనీయని సమర్పిత ప్రాణశోభని గదంతా నింపి గడపని కడుగుతుంది... అడ్డదిడ్డంగా నరుక్కున్న మాట సమూహం ఆవిరయ్యాక ఎవరమూ మోసుకుపోక.. గాజు మంత్రాలు జన్మల్ని పొదుగుతూ నీళ్ళని ఊదేసిన గోళంలో నీరుపట్టిన పాదాలు వెలుపలపడ్డాయి... పిల్చినా వొంగి చూసేవే తప్ప గదుల్ని తలుపులుగా మార్చని గుప్పెడు 'మాయని' ఎప్పటికీ సరిచేయలేం. ముగిసిపోయిందంతే.." అంటాడు గాఢంగా. "ఒక్క మాటు నిజం నిర్వేదానికి హేతువుండదు. భావాకాశం భాషాధాత్రి కావ్యదిగంతం దగ్గర అక్షరం చెరచబడ్డప్పుడు ఓ ప్రత్యూషనో ఓ ప్రదోషమో ఏదైతేనేం ఓ సంధ్య" అది కుమార్ కవిత్వం అని కాశీభట్ల అన్నట్లుగా, "మొక్కయినా, మనిషయినా, ప్రాణి ఏదయినా ఒకసారి వాత్సల్యంలోనో, ఒకసారి అనురాగంలోనో, ఒకసారి ఆత్మీయతలోనో ఏవీలేకున్న జడివానలోనో తడిస్తేనే తాదాత్మ్యం చెందుతుంది" అని శైలజామిత్ర సంభావించినట్లుగా, కుమార్ కవిత్వం బ్రహ్మపదార్థ వినిర్మిత ధ్వంసరచన! హింసనచణ! అటు విలయం, ఇటు సమరం. తెగిపోయిన కరుణం, బాష్పకిరణం. కుమార్ కవిత్వం పోటెత్తిన బడబాగ్ని సముద్రఘోష. 'వాటర్ వాటర్ ఎవ్విరీవేర్! నాట్ ఎ సింగిల్ డ్రాప్ టు డ్రింక్' కవిత్వ మొక తీరని దాహం అనడానికి కుమార్ అసమయ రంగుల ముఖాన్ని చుంబించి ఆవిరవ్వాల్సిందే! ❋

**(ఆంధ్రప్రభ దినపత్రిక 11 ఫిబ్రవరి '2010)**

# 40 'రెక్క' విచ్చిన చాణక్య నీతి

**"ఒ**క మంచిపనిని సాధించడానికి అనుసరించే మార్గం కూడా మంచిది గానే ఉండాలి" అని సత్యసంధత గల గాంధీ వంటి వారు అన్నమాట, నేడు గేలిచేయబడుతోంది!. 'ఎలా సంపాదించాం' అన్నది కాక, 'ఎంత సంపాదించాం' అన్నదే ప్రధానమైపోయి, లోకం కూడా అలాసంపాదించినవారినే పట్టించుకునేలా, ప్రచార ప్రసార సాధనాలు కూడా పనిచేస్తున్నప్పుడు సహజంగానే సంచలనాలకూ, రెచ్చగొట్టే వ్యక్తులకూ ప్రాముఖ్యం కనిపిస్తుంది! విశుద్ధమైన విలువలు రోతగా మారి, వింతలూ విడ్డూరాలవుతాయి. విశృంఖల వ్యవహారులకు ఖ్యాతి లభిస్తూంటుంది. రాజకీయం అంటే? నిరంతరం నియమబద్ధంగా సాగే విలువల ఆచరణాత్మక నేతృత్వమనే కార్యక్రమం కాక, అనుక్షణ సంచలన సమస్యాత్మక సృజనకార్యంగా దుమ్మురేపుతూంటుంది!

నిజానికి రాజకీయం అనేది జీవనపథ నిర్దేశక నీతిసూత్రం కావాలి. నేత అంటేనే నడిపించే ఆదర్శవంతుడు కావాలి. కానీ దురదృష్టవశాత్తూ ఇవాళ 'రాజకీయం' అన్నమాటే, ఒక నిందార్థక పదమై కూర్చుంది! రాజకీయం నెరపడం అంటే స్వార్థ ప్రయోజనాల కోసం 'వక్రపథానుగామి కావడం' అని అర్థమవుతోంది!

ఒకప్పటి విలువలు చ్యుతమైపోతున్నాయని అందరూ అనేమాటే! కాలానుగుణంగా మార్పులూ, పరిణామాలూ తప్పవు. అయితే అవి అభ్యున్నతివైపూ, బ్రతుకును సద్గతివైపూ సుఖమయం కావించడం అనే దిశగా ఉంటే సంతోషదాయకమే! 'యథారాజా తథా ప్రజా' అనడంలో ఉద్దేశింపబడిన సంగతి, ప్రజలు పాలకులను అనుసరిస్తారు కాబట్టి, పాలకులు ఆదర్శ ప్రవర్తనాశీలురై ఉండాలని. ప్రభువే లంపటుడూ, ధనమోహుడూ, దుర్వర్తనుడూ అయితే అనుసరించే ప్రజను గొప్పగా ఎలా అనుకోగలం?

ఇవాళ జరుగుతున్నదదే!

రాజకీయంలో 'చాణక్య నీతి' ఇప్పుడు స్మరణీయమవుతోందా! నందుల రాక్షసమంత్రినే, చంద్రగుప్తునికి సచివునిగా చేయగల 'మేధావి' చాణక్యుడు! మూడో

శతాబ్దానికి చెందిన 'అర్థశాస్త్ర' రచయిత చాణక్యుడు ఆర్థిక విషయాలు మాత్రమే చెప్పలేదు. 'నీతిసాహస్రి'ని అందించాడు. బడ్జెట్ వెలువడిన ప్రస్తుత కాలం చూస్తుంటే చాణక్యుడు గుర్తొస్తున్నాడు. ధరలు పెరిగినట్లు, సామాన్యుడి నడ్డి విరిచినట్లు ఏ బడ్జెట్టూ పైకి కనబడదు. 'పోలీసువాడి దెబ్బ' సామెత అనాలేమో నేడు! కానీ భారం సామాన్యుడు భరించాల్సిందే. అలాంటి అంశాలననేకం చాణక్యుడు చెప్పాడు. చాణక్యుడి సూత్రాల స్ఫూర్తితో పి.వీరారెడ్డి గారు సుగమ్‌బాబు అందించిన 'రెక్కలు' ప్రక్రియలో, 'చాణక్య నీతి'ని నూట ఒక్క ఖండికలుగా గ్రంథస్థం చేసి వెలువరించారు. ఈనాటికీ అనువర్తించగల విషయాలు చాణక్య నీతిలో ఉండడమే ఆ 'సార్వకాలీన' ప్రతిభకు నిదర్శనం. కొన్ని వర్తమానానికి విస్మృతి చెందాల్సినవీ ఉన్నాయి.

"పక్వం పక్వమివారామాత్ ఫలం
రాజ్యాదవాప్నుయాత్
ఆత్మచ్ఛేద భయదామం
వర్జయేత్ కోపకారకమ్"

(తోటనుండి పండిన ఫలాలను ఏరినట్లు, రాజుగారు కూడా, పక్వతలో ఉన్నప్పుడే పన్నులు రాబట్టాలి! పరిపక్వత నొందని ఫలములు రాబడితే ప్రజలలో క్రోధం పెరిగి, ఆత్మవినాశానికి దారి తీస్తుంది అంటాడు చాణక్యుడు)

"పువ్వులోని మకరందాన్ని తేనెటీగ త్రావినట్టు నొప్పి తెలియకుండా పన్నులు రాబట్టాలి – ప్రజామోదం రాజయోగం!" అని రెక్కవిచ్చారు దీన్ని వీరారెడ్డి. "రాజు బికారిగా, బికారి రాజుగా మారవచ్చు. బొమ్మయినా బొరుసైనా నాణెమే". కానీ సామాన్యుడి ఇంటికి మాన్యుడు గొప్పకివచ్చి నిరుపేద గుడిసెలో భోజనం చేయచ్చు. కానీ ఈ నిరుపేద ఆ మాన్యుడి ఇంటికి భోజనానికి వెళ్లగలడా? "మనిషి మనిషే! రాజయినా పేదయినా నాణెం విలువ ఒక్కటే" అన్న చాణక్యుడి మాటకు చెల్లుబాటుందా నేడు! "విషహీన సర్పం బుసకొట్టే భయపెట్టి బతుకుతుంది. బలహీనుడు నటించి బయటపడాలి" అని చాణక్యుడన్నమాట రాజకీయ స్వలాభాల కోసం జరిగే ఆందోళనల బాటలకు వర్తించుకోగలమా? అలానే బహుశా నటించి బయటపడుతున్న చిదంబరాలు, బలహీనులు అనుకోగలమా?

మనువు లాగానే చాణక్యుడినీ మొత్తంగా పట్టించుకోలేము నేడు! అయితే వారిని సరిగా అర్థం చేసుకునే సహనమూ కొందరికి ఉండడం లేదు. మూలమట్టంగా త్రోసిపారేయడం కాక, సమకాలీన సమస్యలకు పరిష్కారాలను దిశానిర్దేశనం చేయగల అంశాలను స్వాగతించి, పునర్మూల్యాంకనతో స్వీకరించి, ఉపయుక్తం చేసుకోగలగాలి? "చందమామను అందుకోవడం శాస్త్రంగానే మిగిలితే! ఆచరణకు రాని జ్ఞానం!" కానీ నేడది పరాస్తం అయ్యే మంచి కాలంగా ఆసన్నమయితే మంచిదేగా! "ఫలించిన వృక్షమునకే రాతి దెబ్బలు" అని కందుకూరి వీరేశలింగం ఒక చోట అంటారు. అదీ చాణక్య స్ఫూర్తియే! 'నిటారుగా ఎత్తుగా పెరిగిన చెట్లనే ఎక్కువగా కొట్టేస్తారు. మంచి మనిషికే కష్టాలు'! అని వీరారెడ్డిగారు దానినే విశదపరిచారు. ఇవాళ వలసలు సామాన్యమైపోయాయి. 'మేధోవలస' ఇరువైపులా ఆహ్వానింపబడుతోంది! "హంసః ప్రేత వనే న రమతే" అంటూ 'హంస శ్మశానంలో క్రీడించదు' అంటాడు చాణక్యుడు. 'సరస్సు ఎండిపోతే హంసలు వెళ్లిపోతాయి మనిషి గతి తప్పితే ఊరొదిలేస్తాడా? కొత్తదేశం కష్టాలకు మూలం!" అని వీరారెడ్డి చెప్పారు. కొత్త సరస్సును హంసలు వెదుక్కోవడం సహజమైనట్లు, కష్టాలకు మూలమైనా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు మనవారు తరలిపోవడం చూస్తుంటే 'ప్రేతవనే రమతే' అనే అనిపిస్తోంది! ఇది కాలవైపరీత్యం కాక మరేమిటి? "యత్ కించిత్ కురుతే భృత్యః శుభం వాయది వాశుభం సుకృతం వర్ధతే తేన రాజాజ్ఞ దుష్కృతమేవచ" అంటాడు చాణక్యుడు. (సేవకుడు చేసే మంచిచెడులు రాజు చేసినట్లుగానే పరిగణించాలి అని అర్థం) "ఎవరు చేసిన పాపం వారనుభవించడం అనేది సత్యమే! శిష్యుల పాపం గురువుకే శిక్ష!" కానీ అమాయకుల ఆత్మాహుతుల పాపం రెచ్చగొట్టిన రాజకీయ నేతలకు అంటకపోవడం నేటివైచిత్రి! వారివల్లే వీరి కీర్తి! 'సర్వస్య భూషణం వినయః' అని వినయం అందరికీ అలంకారమేనట! 'బంగారమని తెలిసినా గీటు పెట్టకపోతే అది పరీక్షాకాదు. వినయమే మనిషి యోగ్యత!' అంటూ దీనినే లెక్కగా చెప్పారు వీరారెడ్డి. కేంద్ర అధిష్టానం పట్ల వినయమే రోశయ్యగారి యోగ్యత! అనుకోవాలా? ఏమయినా వర్తమాన కాలంలో ఒక ఆలోచనను, వివేచనను, విచికిత్సను, ఇలా పలు రకాలుగా ప్రేరేపించే 'చాణక్య నీతి' ఆహ్వానించదగింది! ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 4 మార్చి'2010)**

# (41) పద్యా రాధ(క)శ్రీ

**"కం**దంరాసినవాడే కవి. పందిని కొట్టినవాడే బంటు" అని ఒక నానుడి. అందంగా, మధురసనిష్యందంగా, కందాలు వ్రాసిన కవులు ప్రాచీనుల లోనే కాదు, అధునాతనులలోనూ అగుపడుతున్నారు. పద్యకవిత్వ ప్రాభవం పత్రికలలో మరుగున పడిందేమోగానీ, కవిత్వమంటే పద్య రచనేననీ, నవీన భావాలను సైతం పద్యంలో ప్రతిఫలింపచేయవచ్చుననీ ప్రగాఢంగా విశ్వసించి తద్రూపక కృషి సాగిస్తున్న వారున్నారు.

సిండికేట్ బ్యాంకులో ట్రైనింగ్ మేనేజరుగా పనిచేస్తున్న డా॥ డి.ఎ.వి.ఆర్.కె. ప్రసాద్ పద్య రచనలోనూ, ధారణలోనూ అసమాన ప్రతిభ చూపుతున్నవాడు. "మీరొక కంద పద్యం వ్రాసి బజార్లో పడేస్తే, తీసి చూచి చదివినవారు అది మీదే అని మీకంద చేస్తారు. 'కంద' రచనలో విలక్షణ శైలి మీది. మీరు కంద కవిసార్వభౌములు" అని కీర్తిశేషులు ఉత్పల సత్యనారాయణాచార్యుల గారి ప్రశంసలందుకున్న మేటి ఇతడు. పద్యరచనలో వ్యంగ్య వైభవాన్ని పుణికిపుచ్చుకున్న అక్కిరాజు సుందర రామకృష్ణ 'ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా' అనకుండా ఈ దిడుగంటి పేరుగల పిడుగును ప్రశంసించారు.

ఇంతకీ డి.ఎ.ఎ.ఆర్.కె.ప్రసాద్ అంటే ఎవరో తెలియకపోవచ్చుగానీ డా॥ రాధాశ్రీ అంటే పద్యకవితాభిమానులు తప్పక చటుక్కున గుర్తిస్తారు. "రాధాశ్రీవై సత్కవితా ధారశ్రీ గ పద్యధారణ తోడన్ మేధానిధివై రసమయ పాదోధిగ నిలచినావు పలనాటికవీ" అని ప్రశంసిస్తాడు సుందరరామకృష్ణ. ఆశువుగా వేలాది పద్యాలను కమనీయంగా అప్పచెప్పగల కంఠం రాధశ్రీది.

ఆర్య చాణక్య, కవితా కృష్ణవేణి, విజ్ఞానగీత, చెన్నప్ప శతకం, వర్గల్ వాణీశతకం, రాధశ్రీ లిమరుక్కులు, తారామతి ప్రేమావతి, రాధశ్రీ రత్నశతం, విశ్వనాథ శతకం, శశిమౌళి శతకం, చౌడేశ్వరీ శతకం, విశ్వనాథ శతకం, శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ల శతకం, నాగలింగ శతకం వంటి పలు గ్రంథాలను రాధశ్రీ ఇప్పటికే వెలువరించారు.

సాధారణంగా పద్యకవులు భక్తిభావ విలసితులై ఉంటారు. సమాజంలోని విషయాలను పట్టించుకున్నా అవన్నీ పరమేశ్వర సంకల్పాలుగానే సంభావిస్తారు. అందుకే అభ్యుదయ కాముకులయిన కొందరికీ పద్యకవుల పట్ల చిన్నచూపు ఉండడాన్ని గమనిస్తూంటాం. పద్యం ఆధునిక భావవాహిక కాజాలదనీ, 'పాతకాలం పద్యమైతే వర్తమానం వచన గేయం' అని విశ్వసించేవారున్నారు. కానీ పద్యంలోనే ఆధునికతనూ సమాదరించే, సమారాధించే కవి రాధశ్రీ.

అదియె మహాప్రస్థానం
పదిలమ్ముగ నుండు దాని ప్రథమ స్థానం
ముదమొసగెడు సంస్థానం
కదలించును ముజ్జగముల కవి రాధశ్రీ!!

పాలకులను ప్రశ్నించుచు
బాలకునిగ నున్న నాడె పద్యము వ్రాసెన్
పాలితులను రక్షింపగ
గాలీబుకు తెనుగురూపు కవి రాధశ్రీ!

అంటూ శ్రీశ్రీని, దాశరథినీ కూడా కందంలోనే తలుస్తాడు ఈ కవి! ప్రముఖ కవుల ప్రాచీన అర్వాచీన పద్యాలను ఉటంకిస్తూ, ఆ రచనతో ఆ కవి ఖ్యాతిని ఓ 'కందం'లో అందంగా పొదిగిన విలక్షణ రచన రాధశ్రీ రాసిన 'రాధశ్రీ 'రత్న'శతం'. సభలలో పద్యాలను వెలిగింప చేస్తూ

పలుకు పలుకున పద్యమే పరవశింప
పలుకు పలుకున పద్యమే పరిమళింప
పలుకు పలుకున పద్యమే పల్లవింప
పద్యమందునే మాటాడు ప్రతిననాది
అంటాడు డా॥ రాధశ్రీ.

పద్యం ధారణకు ఒదిగే అసాధారణ ప్రక్రియ. ముఖ్యంగా చిన్నతనంలో నేర్చుకున్న పద్యాలే చిరకాలం గుర్తుంటాయి. ధారణానుకూల కవిత్వం కనుకనే పద్యం జనుల నాల్కల మీద నిలుస్తుంది. సైన్సు సంగతులను కూడా శ్రీ ఇరగవరపు

సూర్యనారాయణ, ఆచార్య ఫణీంద్ర వంటి కవులు పద్యాలలో నేడు చెబుతున్నారు. పావులూరి మల్లన్న గణితశాస్త్రాన్ని ఒకనాడు పద్యాలలోనే చెప్పాడు.

పద్యం చచ్చిపోదు, మనం చంపుతామేమోగానీ. పద్యాన్ని నిరసించవలసిన అవసరం లేదు. ఉత్పలవారికి, చిట్టిప్రోలు కృష్ణమూర్తికీ కేంద్రసాహిత్య అకాడమీ అవార్డులు లభించడం పద్యం పట్ల గౌరవ సూచికలే! అయితే అవార్డులు కొలమానాలు కావు. అదే అకాడమీ ఈ ఏడు బహుమతి ప్రకటించిన నవల కారణంగా పలు విమర్శలకూ గురి అయ్యింది. సాహిత్యం ఏదయినా ప్రజలకు నచ్చడం ముఖ్యం. ఎంత ప్రచారార్భటులతో వందమాగధులతో పొగిడింప చేసుకున్నా, సరుకులేని కవిత్వం తాత్కాలికంగా ప్రభలీనుతుందేమో గానీ కాలానికి నిలవదు. త్వరగా కనుమరుగై పోతుంది. కవిత్వం విషయంలో మరీను. కుప్పతిప్పలుగా వచ్చేది కవిత్వమే. పాఠకుడిని తెప్పరిల్ల జేయకుండా ముంచెత్తేదీ కవిత్వమే. 'కవితాయద్యస్తి రాజ్యేనం కిం' అన్నారు. కవికి కవిత్వమే ప్రాణం, కవిత్వమే జీవితం. పాఠకుడికి కవిత్వం అంతటిదిగా అనిపించగలగాలి, చేరగలగాలి. బండ్ల కొలదిగ ఎదకదల్చని కావ్యరాశులు ఎన్ని ఉంటే ఏం ప్రయోజనం. కదిలేదీ కదిలించేదీ మునుముందుకు నడిపించేదీ అయిన కవిత్వం కావాలి. ఏళ్లుగా నిరంతరం రాస్తున్నా ఎదుగుబొదుగు లేక, ఒక తాత్త్వికతతో పని లేక, రాస్తున్న లబ్ధ ప్రతిష్ఠులెందరైనా ఉండవచ్చు. సమాజంలో వారికి కీర్తి ప్రతిష్ఠలూ, ధనసంపత్తులూ ఉండవచ్చు. వారు శ్రీనాధులే కావచ్చు. కానీ ప్రజల నాల్కలపై, గుండెలపై నిలిచే పోతనలు కవి కపోతములై విశ్వశ్రేయ సందేశవ్యాప్తి చేయగలుగుతారు. 'సహితస్య భావం సాహిత్యమ్' అని మంచిని పెంచేది, నిలిపేది అయిన కవిత్వమే, సమాదరణీయమవుతుంది. పద్యరచన, పద్య ప్రచారమే అనవద్య కర్తవ్యంగా ముందుకు సాగుతున్న డా॥ రాధశ్రీ అభినందనీయుడు. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 4.2.2010)**

# (42) పానుగంటి విశిష్టత

"**తే**నెవంటి భావమును ఏనుగంటి భాషలో పానుగంటి రచించున్" అన్నారు శ్రీశ్రీ గారు. నిజమేమరి! పానుగంటి పదములకు పూతపూసి పెద్దదిచేసి ప్రదర్శిస్తారు మరి! ఆయన ఆంధ్రదేశమున బుట్టి, యాంధ్రమాతాపితల కుద్భవించి, యాంధ్ర సంప్రదాయము లభ్యసించి, యాంధ్రభాషలో పండితులయి, యాంధ్రగ్రంథముల రచించి యాంధ్రభాషాదేవి కమూల్యాలంకారములుగ నర్పించి, యాంధ్రదేశ సేవ నాచరించి తమ యంగము, తనువు, నాత్మపవిత్రములుగ జేసికొని, ప్రాణములను బాసి, పరమపదమునుజేరిన వాగ్ధోరణీ వాగ్వాహినీ మోహినీకరణదక్షులు.

అది జాతీయోద్యమ సమయము, సంఘసంస్కరణోద్యమ సమయము. సాహితీ సముద్ధరణము ముమ్మరముగా సాగుచున్న రోజులు. భారతీయ భాషలపై పాశ్చాత్య నాగరికతా ప్రభావము, పలుకుబడి విశేషముగా ప్రసరించి నాటుకొన్నదినములు. వివేకానందుడు, అనిబిసెంటు మొదలగువారు భారతీయ సంస్కృతీ వైభవమును, తాత్విక భావములను పునరుద్ధరించి పాశ్చాత్యవ్యామోహమున కొట్టుకుపోవుచున్న యువకులను మరల్చి, ఆర్షవిద్యలపట్ల అనురక్తులను గావించిన సంఘటనలు తటస్థించినవి. ఇట్టి వివిధోద్యమ జంఝామారుతములలో నూతనచైతన్యమును సంతరించుకొన్న తరుణమున పానుగంటి పవిత్రమయిన సాక్షి రచనా వాఙ్మయము ఆంధ్రపత్రిక, సువర్ణ లేఖలయందు ప్రచురింపబడినది.

మనసులకు రెప్పపాటయిన శాంతిలేక, మహా సంక్షోభము నొందుచున్న ప్రజలకు ఆ 20 వ శతాబ్ద ప్రారంభమున సాక్షి సంఘము హాస్యసాహిత్య సుధామధురామృతమును త్రావించి ఆనందమున నోలలాడించెను. శ్రీ పీఠికాపుర ప్రభువగు రాజారావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ వారి ధనసహాయమున ఈ వ్యాస వాఙ్మయమంతయు 6 సంపుటములుగ ప్రచురింపబడినది. ఈ ఆరు సంపుటము లందును సుమారు 644 వ్యాసములు గలవు. ఈ వ్యాసములయందు పానుగంటి వారిచే భారతీయ పురాతనపద్ధతులు విద్య, వేషము, కట్టు, బొట్టు, ఆనాటి సాంఘిక

దురాచారములు, మతము, నాగరికత, వేదాంతము, రాజకీయాలు, విద్యా విధానముపై విమర్శలు లిఖింపబడినవి. సాక్షి ఉపన్యాసములలో కోడిపందెములు మొదలు, గోవింద నామస్మరణము వరకు, తోలు బొమ్మలు మొదలు తత్త్వోపన్యాసముల వరకు, రాజకీయముల నుండి సాహితీచర్చల వరకు అసంఖ్యాక సమస్యలపై లిఖించినారు. పానుగంటి ఎడిసన్ గారి స్పెక్టేటర్ అను ఇంగ్లాండు ఆంగ్లపత్రిక ఆధారముగా ఈ వ్యాసరచనలను గావించినారు. ఒక పరిశోధకుని దృష్టితో, వైజ్ఞానికుని దీక్షతో, లోకవ్యవహారములను పరిశీలించి, అందలి మంచిచెడ్డలను నిర్ణయించి లోకమునకు చూపుట వీటి ప్రధాన లక్ష్యం.

సాక్షియందు 'నిష్కారణ నింద' అను శీర్షికలో సాక్షి యుద్దేశ్యము ఆశయము వివరింపబడినది. వారి సంఘము సత్యపురమున స్థాపించిన నాటి నుండియు నిష్పక్షపాత బుద్ధితో మృదువుగా నొకప్పుడు, తీవ్రముగనొకప్పుడు, ఉత్తరక్షణమున పుష్పవేటుగా, మరొకప్పుడు పిడుగుపాటుగా, అటుపై జారుజారుగను, పిదప ఎమరెత్తుగను హాస్యరససేచనము నొకపరి, వీరరస సమ్మేళన మరియొకపరి అనేక నుపన్యాసములలో చేసి యుండిరట.

ఈ సాక్షి సంఘం పరీధావిసంవత్సర మాఘబహుళ చతుర్దశీ శివరాత్రి గురువారంనాడు లింగోద్భవ కాలమున నుద్భవించినదని సాక్షి మొదటి సంపుటమున తెలుపబడినది. వీరి సంఘము ఒక అద్దెగదియందుగలదు. వీరి సంఘము నందు పంచపాండవుల వలె అయిదుగురు సభ్యులుకలరట!

అందు మొదటివాడు కాలాచార్యులు. ఈతడు బ్రహ్మచారి, శ్రీవైష్ణవుడు, నరులలో "బుల్‌డాగ్" జాతివాడు. అఖండ ధారణాశక్తి సంపన్నుడు, యధార్థవాది, ప్రవేశరుసుమీజాలనట్టి ప్రథమసభ్యుడు.

ఇక ద్వితీయుడు జంఘాలశాస్త్రి. ఈతడు కాలినడకనే ఆసేతుహిమాచల పర్యంతం తిరిగిన వాడు, అనేక సంస్థానములను జూచినాడు. ఆయా సంస్థానముల పూర్వచరిత్ర, ఆయా సంస్థానాధీశ్వరుల లోపములను సమగ్రముగా నెరిగిన జ్ఞానసంపన్నుడు. వాచాలుడు. వాదములయందు కర్రజారిపోయినను కలియబడ గలిగిన ధీరుడు. అన్ని అంశములను గూర్చియు, అంతయో, ఇంతయో, కూసంతయో తెలిసిన ప్రాజ్ఞుడు.

తృతీయుడు వాణీదాసుడు. ఇతడు కవి. అసూయాపరుడు, నన్నయభట్టు కవీంద్రుల మొదలు నానాసాహెబువరకు నందరిని దుయ్యబట్టు చుండును. (తననుతప్ప) ఆవగింజమీద అరవయి పద్యములు, నువ్వగింజమీద నూరుపద్యములు చెప్పినవాడు. మూడేండ్ల నుండి ఇతడు కంకణబంధమొకటి రచించుచున్నవాడు.

నాలుగవవాడు బొర్రయశెట్టి. ఈతడు కోమటని పేరునుబట్టియే విదిత మగుచున్నది. ఈతడు వాణిజ్యరహస్యములు నెరిగిన వాడు. ఈతడు వారి సభలో ఎన్నడును ప్రవేశింపడు. ఏలనన అతడు అద్దెగది గుమ్మమునందు దూరలేడు. ఎన్నియో పర్యాయములు అతడు ప్రయత్నించినను బొజ్జ బిగుసుకు పోవుటదప్ప ఫలమేమియు గాన్పింపలేదు (అంత స్థూలకాయుడు)

ఇక అయిదవవాడు ప్రధానకర్త - సాక్షి. ఈతనిసంగతి వ్రాతలనుబట్టి తెలిసికోదగినవాడు. ఆరామద్రావిడుడు. వారు ప్రచురించు పత్రికకు అతనిపేరే యుంచినారు.

ఒక కవిని-ఉపన్యాసకుని-వొక వణిజుని-బ్రహ్మచారియైన శ్రీవైష్ణవుని-లోకవృత్తమునకంతకూ సాక్షీ భూతుడయిన సాక్షి ఈ అయిదుగురును చేర్చి మానవులందలి అరిషడ్వర్గముల కల్లోలములన్నింటిని కన్నులకు కట్టినట్లుగ చిత్రించెను.

'స్వకీయ విషయ'మను నుపన్యాసమునందు కవిత్వంగూర్చి జంఘాల శాస్త్రి ఇట్లు చెప్పెను. "ఉత్తమకవిత్వములు ముఖ్యంగా మూడుజాతులు. గుండు పోకచెక్కవలె కొరక వలసిన కవిత్వమొకటి- వేపుడు శెనగలు నమిలినట్లు నమలవలసిన కవిత్వమొకటి- (మామిడి) తాండ్రవలె జప్పరించవలసిన కవిత్వమొకటి. ఇప్పటి గీతకవిత్వములు దేనిలోగూడ జేరవయ్యెను. ఎందులకా కవిత్వములు? మనపూర్వులు ఎన్నో గ్రంథములు రచించినారు. వారి తరువాతవారు గూడ యేవేవో పెద్ద గ్రంథములు- చేతబట్టుకు దిరుగునవి, చేతికి బట్టుదొరుకునవి, చంకక్రిందబెట్టుటకు సరిపోయినవి, తప్పనిసరియగునెడల నప్పుడు - తలక్రిందబెట్టుటకు సరిపోయినవి, తప్పనిసరి యగునెడల నప్పుడు తలకిందకక్కరకు వచ్చునవి - అట్టివి ఆ మాత్రపు పొడుగు వెడల్పు బలిమిగల గ్రంథములనే వ్రాసినారు. పాడి-పంట-బట్ట పై జన్మకేమో యన్నట్లున్నవి. ఈ గతియే కవిత్వమునకు గూడ పట్టినది. పాలాస్త్రీపట్టీ యంతటి కాగితము మీద రెండు మోహగీతములు-మూడు యుద్ధగీతములు వ్రాయవచ్చుననియూ

– కవితలో వీరరసమునకు శృంగారరసము చుక్కయెదురు. నలుడు వంటవాడయి రాజ్యమును సంపాదించుకొనెను. భీముడు వంటవాడయి స్వరాజ్యమును సంపాదించుకొనెను. కవులెల్లరు పాచకులగునెడల స్వరాజ్యము నవలీలగా రాగలదు" అని 'పాచక మహాజనసభ' యను శీర్షికలో స్వరాజ్య సంరంభం సాగుచున్న రోజులందు నుపన్యసించెను.

'స్వభాష' అను శీర్షికలో మాతృభాషలో నుపన్యసింపజాలనని చెప్పిన యధ్యక్షుని గూర్చి "హరహరా! మహదేవశంభో! మన యధ్యక్ష భగవానుని ఆగమసూత్రమేది! చెప్పనా! ఆయనకు ఆంధ్రమున మాటలాడుట రాదట. ఆంగ్లేయభాషా పండితాగ్ర గణ్యులే! బి.ఎల్ పరీక్షలోగడతేరి కాలాంబర కవచధారియై (అనగా నల్లకోటును ధరించువాడు–ప్లీడర్) న్యాయమూర్తుల ఎదుట గ్రద్దను కాకిని, కాకిని గ్రద్దను చేయగలిగిన వాగ్ధోరణీ ధురీణులే! మాటలాడకపోవుటయేమి! తెలుగున మాటలాడవలసిన ఇందరిలో నీవొక్కడవు ఇంగ్లీషులో మాటలాడుటయా? నీకు ఇంగ్లీషులో మాత్రమేమి భాషాసౌలభ్యము సిద్ధించినది. నీవేగ్రంథములు రచించితివి! నిన్నే గ్రంథములూ వ్రాయుమని నే కోరుటలేదు. నీవు వ్రాయునదేమి! పార్టీలనెత్తిన పేడ... ముష్టి బ్రాహ్మణుడు నీ యింటికివచ్చి 'పాట్‌లో రైస్ యేమయిన నున్నదేమో. కైన్డ్లీ గెటిట్ హియర్ – థాంకుయూ ఇన్ ఆంటిసిపేషన్' అని సంభాషింప నీవాతనికి ముష్టివేయుదువా? మూతిమీద నీడ్చి నొకటి వేయుదువా" అని సంభాషించెను.

ఈ విధంగా జంఘాలశాస్త్రి యుపన్యాస ధోరణి, వాణీదాస బంధుర ప్రబంధ రచనా నైపుణ్యము, సాక్షి విషయనివేదనా వైఖరి, అభిప్రాయ సమంజసత ఆంధ్రభాషలో ఒక ప్రత్యేక స్థానమును ఆర్జించుకొన్నవి.

అందరి హృదయముల దూరువారు కవులయియుండ, కవుల హృదయము లందు దూరువారు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహముగారు. ఆయన సాక్షియందు తన కవిత్వమును కర్కశతర్క వాగ్వాహినీ మోహినీకరణదక్షతవలె సాధించి రచించారు.

కవిగట్టినదేదో విడగొట్టుట విమర్శకుని పనియని చెప్పుదురు. సాక్షి సమక్షమున విమర్శకులకిది అసాధ్యము, దుర్లభము. పానుగంటి ప్రయోగించిన పదజాలము, పొందిక, పదముల పట్టు గురించి వివరించుట మనకు కానిపని. పానుగంటి వారాంధ్ర సాహిత్యమునకు ముఖ్యంగా నిందలి హాస్యవాఙ్మయమునకు నూతనపుష్టిని

కలిగించిరి. వీరు యుదాత్తాశయములును, రసవద్రచనాశక్తిని, స్వదేశీ యభిమానమును గలవారు. మనము వారి వ్యాసరచనలను చదువుట మన భాగ్యమింతింత యనవచ్చునా! వారి మాటలు... మాటయన్నమాటయా? మాణిక్యముల మాట, మౌక్తికముల పేట, మకరంద ప్రవాహపు తేట. దీన్ని గూర్చి నిర్వచింపవలయునన్న మనకు మెదడు చాలునా?–చాలదు. ఆయన తన వ్యాస వాఙ్మయమును, మకరంద బిందుబృందస్యంద సుందరముగను, మహానంద కందోళ సందోహ సంధానతుందిలముగను క్రమతకుక్రమత, కఠితనకు కఠినత, వదలునకువదలు, బిగికిబిగి, జోరునకుజోరు. నెదురెక్కునకెదురెక్కు, యెన్నో వన్నెలు, యెన్నో చిన్నెలు – వగలు, వద్దికలు, తళకులు, బెళుకులు, హొయలు, యొయ్యారములు ఏర్చికూర్చి, చిలకరించి గిలకరించి తన వ్యాసవాఙ్మయ మధురామృతమును ఆంధ్రప్రజానీకమునకు త్రావించినారు. *

**(పదిహేనేళ్ళ వయసులో రాసిన అచ్చులో వచ్చిన తొలి వ్యాసం:**
**చుక్కాని వారపత్రిక 15.4.1966)**

# 43 ఇతిహాస కావ్యనాయిక శిష్ట్లావారి 'జెనీబు'

ప్రేమ రాజ్యమందు ప్రియతయొండె మతంబు
సామ్యగుణమె ప్రేమ సాధకంబు
వేఱుమతములెంచు విమతులు కుమతులు
మానవులకు మతము మానవతయ

దివ్యమైన ప్రేమ దేశంబు నెరుగదు
మతము జాతి కులము, మాటగనదు
విమల గాఢ బంధ వివశానురాగమే
హృదయములను గలుపు ముదము వరల

శిష్ట్లా లక్ష్మీపతి శాస్త్రిగారు తమ 'జెనీబు' కావ్యం ద్వారా ఒక మహనీయ మానవతా సందేశాన్ని, మతాతీత ప్రేమ సామర్థ్యాన్ని చిత్రించారు. నిజానికి ఇలాంటి కథలు కేవల కల్పనాచమత్కృతులుగా, వినడానికీ, చదవడానికీ బాగుంటాయి కానీ –వాస్తవ జీవితంలో ఏ మేరకు సంభావ్యాలు అనుకునే వారుండవచ్చు. అయితే శాస్త్రిగారు తమ కావ్యానికి ఎన్నుకున్న ఇతివృత్తం వాస్తవంగా జరిగినదే. FREE-DOM AT MIDNIGHT అనే గ్రంథాన్ని LARRY COLLINS & DOMINIQUE LAPIERRE రచించారు. భారత స్వాతంత్ర్యం వెనుక జరిగిన అనేక తెలియని ఘట్టాలపై కూడా వెలుగు ప్రసరించిన గ్రంథం అది. ఈ 'జెనీబు' కావ్యానికి మూలమైన కథాంశం అందులోనే దొరికింది కవిగారికి.

అఖండ భారతదేశం ఇండియా – పాకిస్తాన్‌లుగా విడిపోయిన దేశ విభజన సందర్భంలో జరిగిన కథ ఇది. రాజస్థాన్‌లోని బందూఖాన్ అనే ముస్లిం తన బంధువుల ప్రోద్బలంవల్ల పాకిస్తాన్‌లో స్థిరపడడానికి, దేశవిభజన సందర్భంగా తరలిపోదలుచుకుంటాడు. అతని భార్య బేగం జానుకు, కుమార్తె జెనీబుకు అది

ఇష్టం లేకపోయినా, లాహోర్‌కు తరలిపోతుంటారు. మార్గమధ్యంలో అమృత్‌సర్ ప్రాంతంలో కొందరు సిక్కు సరదారులు– జెనీబును అపహరించి తీసుకుపోయి, బలాత్కరించి వదిలివేస్తారు. ఒంటరియైన ఆమెను భారతసైన్యంలో పనిచేసి, ఆ తరువాత స్వచ్ఛందంగా రిటైరయిన భూతాసింగు రక్షిస్తాడు. సాత్వికుడు, ఉదారుడు, సుశిక్షితుడు అయిన భూతాసింగు ఆశ్రయంలో కాలం గడుపుతున్న జెనీబుకూ, భూతాసింగ్‌కూ శరీరాలే కాక మనస్సులూ కలుస్తాయి. భూతాసింగు సిక్కుమత గురువు సమక్షంలో ఆమెను పెళ్ళి చేసుకుంటాడు. 'తన్వీర్' అని ఆమెకు పేరుంచుతాడు. భూతాసింగు ఆస్తిపై కన్నేసిన దాయాదులు–అతను పెళ్ళి చేసుకోవడం పైగా ఒక కుమార్తెను కూడా కనడంతో సహించలేకపోతారు.

అప్పట్లో భారత పాకిస్తాన్ దేశాల మధ్య ఒక ఒప్పందం ఉండేది. రెండు దేశాలలోనూ ఒంటరిగా స్త్రీలు ఎవరయినా దొరికితే వారి వివరాలను వాకబు చేసి, వారి వారి ముందు ప్రశ్నించి, ఎక్కడ ఉండదలిచారో అక్కడ వారి తల్లిదండ్రులకో, బంధువులకో అప్పగించడం జరిగేది. భూతాసింగ్ దాయాదుల్లో ఒకరు, భూతాసింగ్ పాకిస్తాన్ కన్యను అపహరించి, పెళ్లాడాడని –పాకిస్తాన్ అధికారులకు ఫిర్యాదుచేయడంతో, జెనీబును లాహోర్‌లోని ఆమె తల్లిదండ్రులకు ఆ అధికారులు బలవంతంగా అప్పగిస్తారు. జెనీబు భూతాసింగ్‌కు తల్లిదండ్రుల చిరునామా ఇచ్చి, అక్కడకు వెళ్లగానే లేఖరాస్తానని, నాలుగైదు రోజులలో భర్త దగ్గరకు తిరిగి వస్తానని చెప్పి తల్లిదండ్రులను చేరుతుంది.

ఎంతకీ భార్య తిరిగి రాకపోయే సరికి భూతాసింగ్ పాక్ విదేశీ రాయబార కార్యాలయంలో విచారించగా, జెనీబు భారతదేశంలో కాక పాకిస్తాన్‌లో తల్లిదండ్రుల దగ్గరే ఉండడానికి కోరుకున్నట్లు, ఆమె చేత వాంగ్మూలం లిఖితపూర్వకంగా కూడా తీసుకున్నట్లూ తెలిసి హతాశుడవుతాడు. ఏదో మోసం జరిగిందని గ్రహిస్తాడు. మతగురువు ఆదేశం మేరకు పాకిస్తాన్ వెళ్లి అసలు విషయం గ్రహించగోరతాడు. కానీ అతనికి అనుమతి లభించదు. సిక్కు కావడం వల్లే తనకు అనుమతి నిరాకరింపబడిందని, భార్యకోసం మతం మార్చుకుని, ముస్లింమతం స్వీకరించి వెళ్లడానికి ప్రయత్నించినా, అధికారులు నిరాకరిస్తారు. జెనీబు మీద ప్రేమతో కుమార్తెను తీసుకుని అక్రమ మార్గంలో పాకిస్తాన్ చేరి, ఒక మిత్రుని సహకారంతో మోతీ మసీదులో బస

చేస్తాడు. కానీ – జెనీబు తండ్రి బందూఖాన్ పాక్ ఉద్యోగులకు లంచమిచ్చి, కుమార్తె పాకిస్తాన్‌లోనే ఉండిపోయేలా పత్రాలు మార్పు చేయించాడనీ, పైగా మళ్లీ పెళ్ళి కూడా చేశాడని తెలిసి దుఃఖితుడవుతాడు. ఆమెను కలవడానికి వెళ్ళిన భూతాసింగ్‌ను ఆమె భర్త, బంధువర్గం చితకబాది పోలీసులకప్పగిస్తారు. కోర్టులో హాజరుపరుస్తారు. కోర్టుకు జెనీబు వచ్చినా, భర్త, తల్లిదండ్రుల బెదరింపుల వల్ల భూతాసింగ్‌తో ఉండడానికి ఇష్టం లేదన్నట్లు తల అడ్డంగా ఊపుతుంది. దానితో అతన్ని పాక్ వదిలిపోవాలని తీర్పునిస్తారు. కూతురు సుల్తానాతోబాటు భూతాసింగ్ జీవితంమీద విరక్తి చెందినవాడై తన ప్రేమమూర్తి జెనీబు తనకింక లభించదని వేగంగా వస్తున్న రైలుకిందకు దూకుతాడు. సుల్తానా బతుకుతుంది గానీ, భూతాసింగు మరణిస్తాడు. 'జమీదు'గా పేరు మార్చుకుని మతం మార్పిడీ చేసుకున్నా, ప్రేమకథ సుఖాంతం కాని భూతాసింగ్ వృత్తాంతం–లాహోర్ ప్రజలను, అతని జేబులోని లేఖ ద్వారా పత్రికలకు ఎక్కి కదిలిస్తుంది. అతని శవాన్ని జెనీబు ఉండిన ఊరిలో సమాధి చేయడానికి తీసుకువెళ్ళగా, జెనీబు భర్త, తల్లిదండ్రులు, బంధువులు నిరాకరించడంతో ఘర్షణలు జరుగుతాయి. ప్రభుత్వాజ్ఞతో భూతాసింగ్‌ను సమాధి చేయగా, రాత్రికి రాత్రి శవాన్ని తవ్వి బయటపడేస్తారు. చివరకు ఘర్షణలను నివారించడానికి మౌల్వీలు, న్యాయవాదులు, విజ్ఞుల ఆమోదంతో పౌరులు గొప్ప ఊరేగింపు చేసి లాహోరులో సమాధి చేస్తారు. జరిగిన ఘోరాలకు ఏమీ చేయలేని స్థితిలో పడిన జెనీబు కుమిలి కుమిలి మరణిస్తుంది. కూతురు మరణానికి తామే కారణమని బందూఖాన్, బేగంఖాన్ కూడా మంచంపట్టి మరణిస్తారు. సుల్తానాను ఒక లాహోరు న్యాయవాది పెంచి పెద్దచేసి, బెహరేను వర్తకునికిచ్చి వైభవంగా పెళ్ళిచేస్తాడు.

నిజానికి భూతాసింగును సమాధిచేయడంతో కావ్యం ముగిసినా, ఉపసంహారంగా కవి మిగతా కథను చెప్పారు. విషాదాంత కావ్యంగా ముగించడం నచ్చక అలా చేశారనిపిస్తుంది. ఈ కథను ఎంతో రసమంతంగా తీర్చిదిద్దారు శాస్త్రిగారు. 'భారతీ త్రిశతి', 'సాహసము' అనే పద్య గ్రంథాలు అంతకుమునుపు ప్రచురించినా, లక్ష్మీపతిశాస్త్రిగారు ఒక సమగ్రేతి వృత్తాన్ని తీసుకుని కావ్యంగా మలచిన 'జెనీబు' సంవిధాన చాతుర్యాన్ని మాత్రమే కాకుండా, ఆయన ఆశయదీప్తిని కూడా ప్రతిబింబిస్తోంది.

పవిత్రార్ష సంప్రదాయ విధులను నిర్వర్తించుతూనే భర్తతోపాటు మహ్మదీయ సూఫీ సద్గురువు బందానవాజ్ బాజీబాబావారి శిష్యత్వం స్వీకరించి, శిష్టనిష్టా గరిష్టత వలన గురువర్యులచేత దైవాంశ సంభూతురాలుగా గుర్తింపబడి, పీఠార్హత సంపాదించి సంసార బాధ్యతల వలన ఆ పీఠాధిపత్యము నిరసించి, అన్యథా సర్వమత సమానత్వ భావము ప్రబోధించబరగిన తమ సతీమణి కీర్తిశేషురాలు శిష్టా శ్రీలక్ష్మికి శాస్త్రిగారు ఈ కావ్యాన్ని అంకితం చేశారు. స్వీయానుభవంలో కూడా మతాతీత సమత్వ భావాన్ని గ్రహించి, అనుష్ఠించగలిగిన ఉదార కవితాహృదయులు లక్ష్మీపతిశాస్త్రిగారు. పీఠిక, భూమిక అమరించి– ఆపై కాందిశీక ఖండము, ప్రస్థాన ఖండము, రక్షా ఖండము, ప్రయాణ ఖండము, ఢిల్లీ ఖండము, పరివర్తన ఖండము, అల్విదా ఖండము, లాహోరు ఖండము, న్యాయాలయ ఖండము, త్యాగోన్నతి ఖండము అనే ప్రకరణాలుగా ఈ మతాతీత ప్రణయ కావ్యాన్ని నిర్వహించి ఉపసంహారంతో మంగళాంతం చేశారు.

శాస్త్రిగారి పద్యాలలో చక్కటి ధార ఉంది. ఛందం ఏదయినా ఆయన స్వచ్ఛంద భావవాహికగా సాగుతుంది. సీసపద్య గతులు శ్రీనాధుడిని తలపించేవే అయినా, జెనీబు మానసాన్ని వర్ణిస్తూ ఆమె వివాహ వేళ ఉన్న వైనాన్ని కవి ఇలా పేర్కొంటారు: సీసపద్యాన్ని దానికనుగుణంగా లలితమొనరిస్తూ

తన విషాద చరిత్ర దలచి యొకొక్కకమారు
గాద్గదికంబున కలగ దొఱగు
తన తోడు భూతసింహుని యండయుంట
ధైర్యము బట్టు నొక్కొక్క యవసరమున
తన తల్లిదండ్రుల దలచి యొక్కొక్కమారు
దీనాస్యయై కందు, దిగులు జెందు
తన భవిష్యజ్జీవితపు తీరు తెలియక
వెలదియు యొక్కొక్కమారు కలత జెందు
దుఃఖమొకమారు, నొకమారు తుష్టిగలుగు
నుదధిలో నూర్మికలమధ్య నుడుపమట్లు
గాలికెదురైన యొక కాచగోళమట్లు
జెనిబు డెందంబు విహ్వలస్థితి దపించె.

కథానుగుణమైన పద్యవృత్తాలను ప్రతిపద్య భావ శకటికలుగ మలుచుకుని, ప్రణయకావ్య ప్రయాణాన్ని నిర్వహించారు. పఠితలమనస్సు ఆయా కథా సందర్భాలకనుగుణంగా విషాదానందాలను అనుభూతి చెందేట్లుగా కావ్య రచన సాగింది.

'ఒడలు మఱపించి బాధల నుడుగజేయు
మానసమునకు విశ్రాంతి మునుప జేయు
కలలలో జన్మలకు సేతువులను గట్టు
నరులకీశ్వరుడిచ్చిన వరము నిద్ర'

వంటి సుభాషిత సదృశ భావాలను కావ్యాంతర్గతంగా, సందర్భానుసారంగా, కవి చక్కగా అభివ్యక్తీకరించారు.

మానవాళి నివాళులెత్తదగిన మతాతీత ప్రణయ కారుణ్య కావ్యాన్ని ఆధునిక మానవగీతంగా, మానవీయ చారిత్రకేతిహాసంగా మలచిన శిష్ట్లా లక్ష్మీపతి శాస్త్రిగారు బహుధా ప్రశంసనీయులు. ఇలాంటి రచనలు ఆధునిక భావాలకు, సందేశాలకు పద్యం చక్కనివాహిక కాగలదనీ, ధారణకు నిలచి, వ్యక్తిత్వ వికాస సముద్ధరణకు సమాజంలో నేటికీ సాహితీ ప్రియులను సమాకర్షించగలదనీ నిరూపించేవిగా భాసిస్తాయి. పద్యప్రియులకు ఆవశ్యపఠనీయ కావ్యం 'జెనీబు'. ❋

**(ఆంధ్రభూమి దినపత్రిక సాహితి 19.1.2004)**

# (44) ఒక చారిత్రకుని ప్రణయ హృదయం

ప్రణయకవిత్వం లోని గొప్ప ప్రయోజనం ఏమిటంటే కావ్యంలో కవి అభివ్యక్తీకరించిన భావాలు పఠితకు కూడా స్వీయంగానే తోచే అవకాశం ఎక్కువ. అందువల్ల విశ్వజనీనత నిజానికి ప్రేమలో వెల్లివిరిసినట్లు మరో వస్తువులో కానరావడం అరుదు. అనుభూతితో కూడిన ఆనందాద్భుత రసాన్ని అందుకోవడానికి ప్రేమరసైక రసాయనాన్ని మించింది మరొకటిలేదు.

కొందరువ్యక్తులు వారివారి రంగాలలో పొందిన ఖ్యాతిని అనుసరించి సాహిత్యేతర రంగాలలోని వారి విషయంలో, ముఖ్యంగా వారిలోని ప్రణయపార్శ్వాలు గమనించినప్పుడు కొందరికి చిత్రంగా తోస్తుంది. అంటే ఆ మనిషిని ఆ రకంగా ఊహించుకోవడానికి పొందే వైచిత్రి అన్నమాట. కానీ ఎంతటి రారాజులోనయినా ఆ భావన 'అయ్యారే! విచిత్రం భళారే! విచిత్రం' అనిపించడం కద్దే.

చారిత్రకులుగా పరిశోధన, రచనలలో పేరుగాంచిన కీ॥శే॥ భట్టిప్రోలు హనుమంతరావుగారు బి.ఎస్.ఎల్. హనుమంతరావుగా చరిత్రప్రసిద్ధులు. 'చారిత్రక విభాత సంధ్యల మానవకథ వికాసమెట్టిది?' అని శ్రీశ్రీ ప్రశ్నించినదానికి అనుగుణంగా చారిత్రక యథార్థాలను ప్రయోజనాత్మకమైన యథార్థ అంశాలుగా ఒక గౌరవంతో చూపే సమగ్ర, సశాస్త్రీయవైఖరికి ఆయన నిదర్శనం. హనుమంతరావుగారి వ్యాసాలు, ఉపన్యాసాలు, రచనలు చాలాగాఢత కలిగినట్టివి. ముఖ్యంగా బౌద్ధ, జైన మతాల గురించిన ఆయన సాధికారిక వైఖరి విషయకూలంకషకు దర్పణం.

1924 జనవరి నాలుగున జన్మించిన హనుమంతరావు తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ కూడా అనేకగ్రంథాలు రచించారు. ఆయన జీవించివుండగా వెలుగుచూసినవి కొన్నే అయినా, వారి తమ్ముడు డాక్టర్ భట్టిప్రోలు ఆంజనేయశర్మగారి కృషి ఫలితంగా, అగ్రజునిమీద ఆయనకుగల అపార శ్రద్ధాసక్తుల కారణంగా ఇతర రచనలెన్నో వెలుగుచూశాయి. బి.ఎస్.ఎల్ గారి 'ఆంధ్రుల చరిత్ర' 1956 లో తొలిసారిగా ముద్రితమై దాని సాధికారత హేతువుగా నాలుగైదుమార్లు పునర్ముద్రణలు పొందింది. 'భారతీయ సంస్కృతి–ఒక పరిశీలన' 1993 లో హనుమంతరావు మృతి చెందిన ఏడాది వచ్చి, వెనువెంటనే ద్వితీయముద్రణ పొందింది. ఆంధ్రదేశంలో

జైన బౌద్ధ మతాలు, బౌద్ధము, ఆంధ్రము, సామాజిక శాస్త్రము, సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశ వ్యాసాలు, ఆంధ్రలో సామాజిక చలనం, అలాగే ఆంగ్లంలో మోడ్రన్ యూరప్, ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్, గుంటూర్ త్రూ ఏజెస్, రెలిజియన్ ఇన్ ఆంధ్ర, ది ఏజ్ ఆఫ్ శాతవాహన, శ్రీశైలం హిస్టరీ అండ్ కల్చర్, సోషల్ మొబిలిటీ ఇన్ మెడీవల్ ఆంధ్ర, బుద్ధియిజం అండ్ జైనీయిజం ఇన్ ఆంధ్రదేశ, బుద్ధిస్ట్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రదేశ – వంటి గ్రంథాలు, అలాగే అనువాద గ్రంథాలు ఎం.ఎన్. రాయ్ స్వీయగాథలు, మానవ నాగరికత, గతాన్ని గురించిన అపోహలు, లోకాయుత వాద పరిశీలన, అశోకుడు: మౌర్యవంశ క్షీణత–వంటి రచనలన్నీ చారిత్రకునిగా, పరిశోధకునిగా ఆయన ఖ్యాతికి, ప్రజ్ఞకు ప్రబల నిదర్శనాలు. 'ఆంధ్ర దేశం మతపరిణామాలు' గురించి 2005 లో ఆయన గ్రంథం, ఆంజనేయశర్మ గారు పూనుకుని వెలువరించినదే.

ఇంతటి చారిత్రకునిలో దాగివున్న కవిత్వ పార్శ్వానికి ఆయన సుకుమార అనుభూతుల ప్రేమైక హృదయానికి సాక్షీభూతంగా అలరిస్తున్న ఏకైక గ్రంథం 'ప్రణయాంజలి'. భట్టిప్రోలు హనుమంతరావుని కవిగా, ప్రణయ భావుకునిగా పట్టిచూపే పద్యకావ్యం 'ప్రణయాంజలి' వెలువడి యాభై సంవత్సరాలు. శార్వరినామ సంవత్సరం అంటే 1960 లో సాహితీ సమితి ప్రచురణగా వెలువడిన ఈ చిరుకావ్యానికి శివశంకర స్వామివారే పీఠిక సంతరించడం హనుమంతరావు కవితా ప్రతిభ గుర్తింపుకు ఓ ప్రబల నిదర్శనం. "కొందరు కవులకు కులకాంత మీద తొలగిపోని అనురాగము నిత్యనూతనంగా అలరారుతూ ఉంటుంది. ఏతత్కవి ఆ కోవలోనివాడు... ప్రియగృహిణి సమక్షంలో లేనప్పుడు ప్రియభర్తకు పరిపరి విధాల కలిగిన భావావేశాలే పద్యాలుగా రూపుదాల్చిన ఈ హృద్య ఖండికలు విషాదమయంగా ఆ బాలసుందరీదేవి ప్రకృతి లీనం కావడంతోనే ఆమె దగ్గరకే తుదికాన్కగా అంకితం కావడం కరుణ రసాత్మకమే!" కానీ ఆ తరువాత హనుమంతరావు కవిత్వం జోలికి వెళ్లిన దాఖలాలు లేవు!

కవిగా హనుమంతరావు గారిలో శిరీష కుసుమ పేశలమైన ప్రణయార్తి ఉంది. "లలితమౌ నాదు హృదయశైవలి యందు ప్రణయ మందానిలోద్ధూత భావనోర్మిడోలికమాలికా సమాటోప విహృత కనకవారిరూపంబదో కలికి నీవు!" అంటూ ప్రణయినితో "నిను శిరంబునదాల్ప కాంచన కిరీట వైభవంబైన లేదు... భావ ప్రసన్న మధురమూర్తివి... నే నస్మత్ పవిత్ర సరళ హృదయంబె బంగారు బరిణసేతు" అంటారాయన.

కృష్ణశాస్త్రి, వేదుల, మల్లవరపు వంటివారి సరసన చేరదగిన భావకవిత్వ విహంగాలు గల కవిహృదయం ఆయనది. "హనుమంతరాయకవి విదగ్ధుడు కావడం చేత వివిధ కవుల విధానం అక్కడక్కడ గోచరిస్తుంది. కాలాతీతుడైన ఉమర్‌ఖయ్యాం కవీంద్రుని బాణి ప్రస్ఫుటంగా కాకపోయినా ముద్దు ముద్దుగా అక్కడక్కడ అఱ్ఱులు చాపుతుంది. హనుమంతరాయ కవి రచన ప్రతిధ్వనికాక ఉపజ్ఞ వల్ల ఉత్తమ రూపంలో ఉద్భూతమైనది" అని ప్రశంసించారు శివశంకర స్వామి.

'ప్రణయాంజలి'లో అష్టాదశ ఖండికలున్నాయి. పద్యాలు, గేయాలు కూడా ఉన్నాయి. ఒక ప్రౌఢ పద్యం రాయడం, ఒక లాలిత్యంతో కూడిన గేయం అల్లడం ఈ చారిత్రకునిలో ఎంతలా దాగివుందో కదా! అనే విభ్రమానందం కలుగుతుంది. 'ఓ దివ్యమోహినీ ఓ భవ్య గాయనీ' అంటూ 'నీపాట'కై 'ప్రతీక్ష' అంటూ 'చెప్పవా' అని అడుగుతాడు. 'జాబిల్లి' 'తార' అందించే 'సందేశము' 'మెఱుపుకన్య'లో కవి 'వాంఛ'న 'ముద్దు'గా 'మధురకళ'కు 'స్వాగతము'గా భాసిస్తూంటాయి. 'చుక్కలరేడు' 'ఆకాంక్ష' వలె 'ప్రణయామృతం' వర్షిస్తూంటుంది అన్నింటా.

"భావలత కుసుమించి పరిమళించుటెగాని ఎరిగి రూపిదియంచు విరచింపనేర్తునే!" అంటూనే హృదయ, సౌధ ద్వార ప్రపద బంధము లూడ్చి ప్రణయ సామ్రాజ్యాధిపత్నిగా అధివసింపచేస్తాడు కవి. తన ప్రణయైక మధుర రస సముజ్జ్వల భావ సామ్రాజ్యాన్నంతటినీ ఏలుకొమ్మని ఎలుగెత్తి వలపు పిలుపులిస్తాడు.

'కలలు జీవన మధుర
కళలుగా మారాలి
కళలు మన కౌగింట
పులకరించాలిరా!' అన్నది కవి భావన

'ప్రకృతిలో నేడు మాధవ స్పర్శవేది
గళిత దుఃఖంబు లెల్ల సౌఖ్యంబులయ్యె
మరపునకు రాని వేదనా భరములోన
గత సుఖంబె వినూత్న దుఃఖంబు మనకు'

అనడం తనకే చెల్లింది. సౌఖ్యంలోని బాధకు, బాధా సౌఖ్యానికి 'ప్రణయాంజలి' నర్పించిన చారిత్రక కవి హృదయం సంస్మరణీయం. స్వర్ణోత్సవ కావ్యానికి ఇది స్మృత్యంజలి. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 28.1.2010)**

# (45) కదిలి కదిలించిన కవి

**'కొం**ప కొల్లేరయ్యింది' అన్న మాట వింటూఉంటాం. కదల్చివేసే ఒక ఉపద్రవం ఏదో ముంచెత్తినప్పుడు ఆ భావం కలుగుతుంది. ప్రస్తుతం రాష్ట్రం స్థితీ అలానే అనిపిస్తూంది చాలామందికి. ఒక జాతిలో రెండు విరుద్ధతత్వాలు అనుకుంటున్నాం గానీ, నిజానికి ఒకే దానికి అవి ప్రవాహదిశలు! 'నదీనాం సాగరో గతిః' అన్నట్లు ఎన్ని ప్రాంతీయ విభజనలయినా, తిరిగి అవి ఒకే భాషాత్మను భజించేవే.

కష్టజీవికి ఇరువైపులా నిలిచేవాడు కవి అన్నట్లు కష్టకాలంలో సాంత్వనము కలిగించేవాడే కవి. పుట్టుకకు కవికి ఒక ప్రాంతం ప్రాతిపదిక కావచ్చుగానీ, అతని మేధా, హృదయం సంకుచిత పరిధుల్లోనివి కాజాలవు. 'దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్' అని గురజాడ అన్నదందుకే. కవి దేశసంపద. సంపన్న హృదయం కలిగేవాడే అందరివాడు కాగలుగుతాడు.

"ఎవ్రి థింగ్ ఈజ్ ఫ్లో. ఎండ్ ఎవ్రి దట్ ఈజ్ ఇట్స్ ఫోం. ది సేమ్ ఇన్ సెవరల్" అన్నట్లుగా ఈ సమస్త సృష్టి జీవితం అంతా ప్రవాహమయం అన్నాడు దుర్గానంద్. రావలసినంత ప్రాచుర్యం రాని దేశ సంపద్విభవోజ్జ్వల కవి దుర్గానంద్. నేటి తెలుగు తల్లిని తలుచుకుంటే 'భీతాంగన' అన్న దుర్గానంద్ కావ్యం గుర్తొస్తోంది. ప్రతిదీ ప్రవహిస్తుంది అన్న సిద్ధాంతం తనది. జడం చైతన్యంలోకి, పురుషుడు స్త్రీలోకి, జీవితం మరణంలోకీ వలెనే సంఘర్షణ శాంతిలోకీ, సమైక్యతలోకీ ప్రవహిస్తుంది అనుకోవాలేమో! దుర్గానంద్ 'భీతాంగన' పన్నెండు వందల పద్యాల కావ్యం. 'ఏకోరసః కరుణ ఏవ' అనిపించే అనుభూతి గాఢత గలది.

అయిదేళ్లపాటు శ్రమించి, ముప్ఫై ఏళ్ల క్రితం వెలుగుచూసిన కావ్యం అది. పది అశ్వాసాల ఈ కావ్యంలో ఒక స్త్రీ కన్నీటి గాధకు ఆలవాలమైన కొల్లేటి ప్రాంతాన్ని, సాహిత్యగతం చేశాడాయన. కథకోసం కథ కాదు. పైగా ఇంగితం గల కవి కనుక మానవ జీవన ప్రవాహధారగా వివిధ రసాలు, మానవ ప్రవృత్తులు, జీవితపు నడకలు చిత్రించే కాన్వాస్‌గా చేశాడు. కవితాసాగరాన్ని కరుణార్ఝురులతో నింపాడు. భక్తులనూ, జ్ఞానులనూ కూడా కదిల్చివేయగల కావ్యం ఇది. 'కొల్లేటి కాపురం' చిత్రంలో హీరోయిన్

ప్రభకు దుర్గానంద్ ఈ కావ్యం అంకితం చేయడం విశేషం. స్వీట్ సిక్స్‌టీన్‌లా పదహారు భావుక పద్యాలు ఆమెపై రాశాడు. కావ్యరచన ముగించాక “ఈ తేనెను ప్రోగుచేసే మమకారం మాత్రం నాది. ఫలితం అందరిదీను” అంటాడు.

విలక్షణమూ, విశిష్టమూ అయిన ‘భీతాంగన’, ‘అంతర్గోళాలు’ వంటి కావ్యాలు రాసిన దుర్గానంద్ అసలు పేరు చక్రాల దుర్గానంద రాజు. 1927లో గుంటూరులోని మోదుకూరులో జనవరి 12 న జన్మించాడు. పదహారవ ఏటనే ‘గో విలాపం’ పద్య రచన చేసి జాషువా ప్రశంసలందారు. “ఎముకలరగించి మీ నేల నింకజేతు చచ్చిపోయియు మీకాలి ముచ్చెనౌదు” అని గోవు విలపించిందన్నాడు. ఇదే సినీ కవికీ స్ఫూర్తి అయింది. రావల్పిండికి వెళ్లి సంస్కృతం, హిందీ చదివి తిరిగి మాతృదేశం చేరి, తెనాలి, రాజమండ్రి, హైదరాబాద్‌లలో హిందీ పండితునిగా, ఆపై నూజివీడు ఎం.ఆర్.అప్పారావు కాలేజీలో లెక్చరర్‌గా చివరివరకూ పనిచేశారు.

పద్యం ఎంత హృద్యంగా రాయగలరో, అభ్యుదయ కవితనీ అంతగా సేద్యం చేయగల ప్రతిభామతి దుర్గానంద్. 1956 లోనే ‘అంతర్గోళాలు’ అభ్యుదయ గేయ కవితా సంకలనం వచ్చింది. పద్య ప్రబంధం ‘మధూలిక’ 1958 లో ప్రచురితమైంది. ‘గీతాంజలి’ని దుర్గానంద్ అనువదించడమే కాదు, రవీంద్రుని వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని, హృదయాన్నీ వింగడిస్తూ దానికి సంతరించిన పీఠిక 1958 లోనే ఒక సిద్ధాంత గ్రంథ స్థాయిలో నిలిచింది. 1960 లో ‘జనప్రణయ గాధ’ గేయకావ్యం రాశారు. ‘రంగపతి’ పేరిట దుర్గానంద్ రాసిన నవల 1965 లో సీరియల్‌గా వచ్చింది. ‘సూరదాసు పదాలు’ను తెలుగులోకి అనువదించగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1966 లో ప్రచురించి, ఆపై ఏడే పురస్కారం కూడా ఇచ్చింది. 1970 లో ‘చిరంతన’ ద్విభాషారచనగా వచ్చింది. తాత్త్వికత, మార్మికత, నిండిన రచన అది. వానలు వరదలు అంటే భయపడే గౌరీ అనే పిల్ల కొల్లేటి నివాసి, సాగరం అనే అతణ్ణి పెళ్లాడుతుంది. ఆ వరద రక్కసికి భర్తా, అత్తా బలైపోతారు అన్న కథాంశాన్ని కొల్లేటి జీవన చిత్రంగా అద్భుత కావ్యంగా మలిచిందే 1979 లో వచ్చిన ‘భీతాంగన’. “మీ కావ్యానికి ఎవడో భవభూతి వంటివాడు భూమిక వ్రాయవలె గానీ నావంటివాడు అసలే వ్రాయలేడు.” అని ఆచార్య బిరుదురాజు రామరాజుగారు “సహస్రారమంటిన కావ్య కుండలినికి కేలుమోడ్పు”లందించారు.

దుర్గానంద్ 'తేనెటీగ' అనే బాలల శతకం (1979) రాశారు. 'ఘెరావు కవితలు' ఒక విప్లవ ఝంఝా స్ఫురణలే! అప్పటి ప్రధాని మొరార్జీకి ఆర్థిక అసమానతలు తొలగడానికి సలహాలేఖ వ్రాసి, కరెన్సీని రద్దు చేయడానికి ఇచ్చిన సూచన మేరకే అన్నట్లు అప్పట్లో వెయ్యిరూపాయల నోటు ప్రభుత్వం రద్దు చేసింది కూడాను. కొత్తగూడెం నుండి 1966 లో సామీరి మాసపత్రిక కొంతకాలం నిర్వహించారు. అంబికానంద్ 1985 లో సారధ్యం వహించిన 'గంథకుటి' పత్రికకు సలహాలనిచ్చారు. గోపీచంద్, ఆవుల సాంబశివరావు, సినారె, గోరాశాస్త్రి, బాలశౌరిరెడ్డి, ఎం.ఆర్. అప్పారావు, దేవులపల్లి రామానుజరావు వంటి ప్రముఖుల ప్రశంసలు అందుకున్న దుర్గానంద్– రేడియోలో 'దేశం మారింది', 'మనమంతా ఒక్కటే' వంటి నాటికలు రాశారు. దుర్గానంద్ సాహిత్య వ్యాసాలు, పీఠికలు సాహిత్య సరస్వతికి అమూల్య కంఠాభరణాలు. 1970 లో వచ్చిన 'చిరంతన' కావ్యానికై తమిళస్వామి నుండి 'విద్యారత్న' బిరుదు పొందారు.

దుర్గానంద్ సాహిత్యంలో ఎందరికో స్ఫూర్తిదాయకమూ, ప్రేరణాత్మకమూ అయి దారిదీపం అయ్యాడు! ఆయన భావజాలాన్ని, ఆలోచనా స్రవంతినీ తమది చేసుకుని ఎదిగినవారు సైతం తూష్ణీభావం వహించినా, ఆ నిస్సహాయతనూ, అసహనాన్నీ భరించి, ధిక్కారాన్నీ, నిర్భీకతనూ నిలుపుకున్న దుర్గానంద్ మే, 7 1985 న అస్తమించాడు. కవిగా వెలుగొందాడు.

"ఎగసిపోయిన నా భావమెన్ని వాడ
లెన్నియూళ్ళను తిరిగెనో! ఏ యెడంద
కలతలన్ దాల్చెనో? రాలు కనుల బాష్ప
మొలికి సారస రసభూమి నిలిపి అలను".

అన్న దుర్గానంద్ సాహితీ స్మృతిని శాశ్వతం చేస్తూ ఆయన పేరున కళాపీఠం ఏర్పడి, ఏటా ఒక కవికి సాహిత్య పురస్కారం ఇవ్వబూనడం హర్షదాయకం! ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 7.1.2010)**

# (46) ఆధునిక కవితకు గురజాడ వ్యక్తత్వం

**గు**రజాడ కవిత్వం గురించీ ఆధునిక కవిత్వంపై ఆయన ప్రభావం గురించీ నేడు కొత్తగా ఏదో చెప్పగలమనుకోవడం – సూర్యునికి దివిటీ చూపడం లాంటిదే!

'అడుగుజాడ గురజాడది
అది భావికి బాట'

అన్న శ్రీశ్రీ మాటలు అక్షరసత్యాలు. కవితకు కొత్త రూపురేఖలు ఇచ్చి, ప్రాణమంతం చేసింది గురజాడ అప్పారావుగారే. సాహిత్యాన్ని సామాజిక ప్రయోజనాల కోసం వినియోగించాలని, సామాన్యులకు చేరేలా వారు మాట్లాడుకునే భాషలోనే రాయాలని సంకల్పించి, తదనుగుణమైన బాటలువేసింది ఆయనే. ఫ్యూడల్ వ్యవస్థలో వుండి కూడా దేశభక్తి గొప్పదని, ఒక జాతీయ దృక్పథాన్ని పరివ్యాప్తం చేసింది గురజాడ. గతానుగతికమైన విషయాలను కాకుండా వస్తునవ్యతకు, వస్తువులో మార్పు వచ్చినప్పుడు అనివార్యమైన ఛందస్సులోని మార్పుకూ బీజవాపనం చేసారు గురజాడ.

దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్

అని గురజాడ అనడం వల్లనే – ఆ బాటను అనుసరించిన శ్రీశ్రీ, ఆ మనుష్యులు శ్రామికులైన కష్టజీవులని నొక్కి చెప్పగలిగాడు. అయితే – గురజాడ వేసిన బాటనే శ్రీశ్రీ విస్తృతపరిచాడు. శ్రామికులకన్నా తెలుగు కవిత్వంలో – 1955 తరువాత మధ్యతరగతి జనం ఎక్కువ కనబడతారు అన్న ఆరుద్ర మాట వాస్తవమే అయినా, ఒక సామాజిక చైతన్యం, మానసిక సంవేదనలు, మానవీయ విలువల దర్శనం, అభ్యుదయ దృక్పథం వ్యవస్థీకృతం కావడానికి తెలుగు కవిత్వానికి పాదులువేసింది గురజాడ వారనడంలో సందేహం లేదు.

సనాతనులు, సంప్రదాయానికి విధేయులూ ఎప్పుడూ ఉంటారు. అయితే పాత ధోరణిలో, పాత విలువలతో, పాతబడ్డ పద్ధతులలో పాత ఇతివృత్తాలను అల్లుకోక, ఎప్పటికప్పుడు నవీనత సంతరింపచేసుకోవాలన్న 'కవిత్వ స్పృహ' గురజాడ

వారు కలిగించిందే! "నవ్యాంధ్ర కవిత్వ శుభోదయానికి అప్పారావు వేగుచుక్క. ప్రబంధవీధుల బందీకృతయైన కవితానదిని కొత్తతెన్నులకు గొనివచ్చి, ఆమెకు స్వేచ్ఛానిశ్వాసము కలిగించిన ప్రజ్ఞానిధి" అని గురజాడ వారిని గురించి ఆంధ్ర శేషగిరిరావు గారు 1927 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో 'తెనుగు కైతల క్రొత్తతెన్నులు' వ్యాసంలో యుగకర్తగా సంభావించారు. విశ్వనాథ సత్యనారాయణ గారు కూడా "అప్పారాయోపజ్ఞకమైన రసగీతాలనే రాయప్రోలు వారు అందుకున్నార"ని నవ్య సాహిత్య పరిషత్తు సప్తమ వార్షిక అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు.

గురజాడ వారి 'ముత్యాల సరములు' 1910 లో వెలువడడం సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించడమేనని, మహాకవి గురజాడ అప్పారావు మొట్టమొదటి సారి ముత్యాలసరాలు గుచ్చిన ఏడు (1910) అప్పుడే తెలుగు కవిత్వంలో విప్లవశకం ఆరంభమైందని శ్రీశ్రీ తాను గురజాడపై రాసిన పుస్తకంలో – గురజాడ ఆధిక్యానికి గల కారణాలు వివరించాడు. అప్పారావు గారి నీలగిరి పాటలు, ముత్యాలసరాలు – కొత్త పాతల మేలుకలయిక కూర్చిన నవ్య సాహిత్యపు తొలికృతులని నోరి నరసింహశాస్త్రిగారు ప్రకటించారు. యువలోకం కంటున్న కలలకు రూపాన్నిస్తూ ఆధునిక కవితాధ్వజాన్ని ప్రతిష్టించింది గురజాడ వారేనని, నవ్య కవితకు ముత్యాలసరాలే నాంది అని ఖండవల్లి లక్ష్మీరంజనం వంటివారు సమర్థించారు.

నవ్య కవిత్వానికి బాట గురజాడ వారేనన్నది, ముత్యాలసరాల ప్రభావంతోనే తాను 'చిల్క' అనే గేయం రాసినట్లుగా రాయప్రోలు సుబ్బారావుగారు స్వయంగా చెప్పడం వల్ల కూడా విదితమవుతోంది. 1910 లో 'ముత్యాలసరాలు' పత్రిక (ఆంధ్రభారతి) లో వెలువడినప్పుడు సంప్రదాయజ్ఞుల ఒకరిద్దరి విమర్శలకు పాత్రమైనా, యువకులలో గొప్ప ఉత్తేజం కలిగించాయి. "గురజాడ అప్పారావు గారు 1915 లో చనిపోయినా, 1915 తరువాతే జీవించిసాగారు" అని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు భారతిలో 'పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం' అని 1949 లో రాసిన వ్యాసంలో పేర్కొనడం బట్టి, గురజాడ ప్రభావం నవకవుల మీద అనివార్యంగా పడుతూవచ్చిందని, గురజాడ బాట అనుసరణీయంగా భాసించిందనీ స్పష్టమవుతోంది.

గురజాడ వారి 'దేశభక్తి' కవితకు గత ఏడాదే శతజయంతి. "దేశమును ప్రేమించుమన్నా – మంచియన్నది పెంచుమన్నా" అంటూ నూరేళ్ల క్రితం రాసిన

ఆ కవిత ఈనాటికీ దేశభక్తికీ, జాతీయతా స్ఫూర్తికీ, సమాజ చైతన్యానికీ, సాహిత్య దీప్తికీ గొప్ప ఉత్తేజదాయకంగా వుండడం చూస్తున్నాం! ఆ బాణీలో అనేకులు కవితలల్లడం నేటికీ జరుగుతూనే ఉంది. గురజాడ అంకురార్పణ చేసిన నూత్న కవితాప్రస్థానం, వారి ప్రతిభ 1913–16 సంవత్సరాల మధ్య సాహిత్య జగత్తులో జాజ్వల్యమానంగా కనిపించడం వల్లనే ఆ దీపకాంతులలో నేటికీ కవుల కవితాప్రస్థానం సాగుతోంది. అభ్యుదయ కవిత్వయుగంలో శ్రీశ్రీ అవతరణతో గురజాడ వారి గురుత్వం మరింత పెరిగింది. ఆ గురుత్వాకర్షణ శక్తితో ఎందరో కవులు కంఠదఘ్న ప్రభావంతో కదిలారు. కదులుతున్నారు.

సాంప్రదాయక రీతి, ప్రాచీన వృత్తరచనా ప్రభావం లేక గురజాడ వారు కొత్తపుంతలు తొక్కలేదు. నిజానికి ముందు ఆంగ్లంలో కవితలు రాసి, సారంగధర వంటి దీర్ఘకవితను ఆంగ్లంలోనే రచించి, 'ఇండియన్ లీజర్ అవర్' అనే పత్రికలో ప్రచురించారు. కలకత్తా నుండి వచ్చే 'రీస్ అండ్ రెయిట్' పత్రికా సంపాదకులైన శంభుచంద్ర ముఖర్జీ – ఇంగ్లీషులో ఎంత ప్రావీణ్యం పొంది రచన చేసినా, అది పరభాషే అవుతుందనీ, స్వభాషలోనే రచించితే ఎప్పటికైనా ఎత్తులు చేరగలవనీ గురజాడ వారిని తెలుగులో రాయమని ప్రబోధించారు. ఆ మాట వారికి తెలుగులో రాయాలన్న సంకల్పానికి గొప్ప ప్రేరణగా నిలిచింది. 1882 లో సారంగధర, చంద్రహాస ఇంగ్లీషులో దీర్ఘ కవితలుగా రచించిన గురజాడ వారు, 1907 లో కవిత్వంగా 'నీలగిరి పాటలు' ముందు వెలువరించారు. 1910 లో రాసిన 'ముత్యాలసరాలు' తెలుగు సాహిత్యంలోనే చిరస్థాయిగా నిలుస్తూ, విశ్వజనీన సందేశం సంతరించుకున్న 'దేశభక్తి' కవిత రచించడం జరిగింది. సాంప్రదాయక రీతిలో 'మాటల మబ్బులు', 'పుష్పలావికలు' వంటి ఖండరచనలు, 'సుభద్ర' కావ్యం వంటివీ రాసారు.

'రచన భాష' అనేది జనవ్యవహారంలోనే వుండాలని భాషపట్ల నిర్దుష్టమైన అభిప్రాయం గలవారు కనుకనే – గురజాడ వారు 1892 లో రాసిన కన్యాశుల్కం నాటకాన్ని, ద్వితీయ ముద్రణగా 1909 లో వెలువరించినప్పుడు నాటకరచన మొత్తం పునర్నిర్మించారు. అందువల్లనే ఆందులోని ప్రతి పాత్రా ఈనాటికీ సజీవంగా సమాజంలోని వ్యక్తులకు యదార్థ దర్పణాలుగా నిలిచివున్నాయి. గురజాడ సృష్టించిన 'గిరీశం సంస్కృతి', నేటి సమాజంలో విస్తృతంగా కనబడుతోందన్న మాట యథార్థం.

భాష పట్ల గురజాడకు గల నిశ్చితాభిప్రాయం వల్లనే 1906 లో విశాఖపట్నం ఎ.వి.ఎన్.కళాశాల ప్రిన్సిపాల్ పి.టి.శ్రీనివాస అయ్యంగార్ ఉన్నత పాఠశాల బోధనా సంస్కరణలకు ఒక సంస్థ స్థాపించినప్పుడు అందులో బ్రిటీష్ సివిల్ సర్వెంట్ అయిన జె.ఎ.ఏట్స్‌తో బాటు ప్రధాన సభ్యులుగా గురజాడ వారిని, గిడుగు వారినీ నియుక్తం చేసుకున్నారు. 1926 – గౌహతి అఖిలభారత కాంగ్రెస్ వార్షిక సభలకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది ఎస్.శ్రీనివాస్ అయ్యంగార్ కూడా అందులో ఉన్నారు. గురజాడ వారు కూడా స్వయంగా 1908 లో మద్రాస్ కాంగ్రెస్ మహాసభలలో పాల్గొన్నారు. మద్రాస్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో 1911 లో గురజాడ వారి పాత్ర అవిస్మరణీయం. వ్యవహారిక భాషావ్యాప్తికై ఆంధ్ర సారస్వత పరిషత్ స్థాపన జరిగింది. దానికి మూలస్తంభమై నిలిచారు గురజాడవారు.

1889 నుంచి 1915 వరకు గురజాడ రాసుకున్న డైరీలు సాహిత్యం పట్ల, భాష పట్ల, సమకాలీన సమాజం పట్ల వారి అభిప్రాయాలను, వారి వ్యక్తిత్వ వికాసాన్నీ స్పష్టపరుస్తాయి. ముఖ్యంగా గురజాడవారిలోని చిత్తశుద్ధి, నిర్భీతి గొప్పవి. వ్యావహారిక భాషా ప్రాశస్త్యం గురించి, సంఘ సంస్కరణం గురించి, నాటక రచన గురించి, సమకాలిక పండితుల ధోరణుల గురించీ కన్యాశుల్కం ద్వితీయ ముద్రణం పీఠికలో 1909 మే నెలలో గురజాడ వారు కూలంకషంగా చర్చించి, ప్రాంతీయ భాషలు కావ్యోపయోగాలని నిరూపించారు. వాస్తవికతకు, సాంఘిక జీవన చిత్రణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.

ఇటీవల కొందరు గురజాడ వారికి బ్రాహ్మణీకాన్ని, వివక్షతలనూ ఆరోపిస్తూ రాసిన రచనలు చూసినప్పుడు వారి అరకొర అధ్యయనాల పట్ల విచారం కలిగింది.

మంచిచెడ్డలు రెండె కులములు
మనుజులందున ఎంచిచూడగ
మంచియన్నది మాలయైతే
మాలనేయగుదున్

అన్న గురజాడ – రచనకూ, జీవితానికీ పొంతనలేని వ్యక్తి కాదు. 1910 లోనే బెర్హంపూర్‌లో జరిగిన సహపంక్తి భోజనాల్లో స్వయంగా దళితుల సమాదరణ నందుకున్నవారే. 1910 సంవత్సరం ఏ రకంగా చూసినా గురజాడ యుగకర్తృత్వానికి

వేగుచుక్కగా నిలిచే సంవత్సరం! తన కాలంలో వున్న వ్యవహారపు పలుకుబడులనూ, వర్ణభేదంలేని సంఘవ్యవస్థనూ వాంఛించి తీసుకుని, సాహిత్యాన్ని ఒక అక్షరాయుధంగా మలచింది కూడా గురజాడయే!

సామాన్య మానవుల జీవితమే కావ్యవృత్తంగా తీసుకుని రచించడానికి వర్డ్సువర్త్‌ని గురజాడ ఆదర్శంగా గ్రహించారనవచ్చు. కావ్యగత పాత్రలు లోకంలో కనరాని గుణ, రూప సంపత్తితో వున్నట్లు అభివర్ణించే ప్రాచీన కవుల పంథాను కాక, అట్టి సంపత్తి అట్టడుగు కులాలకు చెందినవారిలో వుండదన్న అభిప్రాయం సరికాదని, గురజాడ ప్రకటించడం మాత్రమే కాదు, 'లవణరాజుకల'లో 'మాలెత'ను నాయికగా స్వీకరించి కవిత్వీకరించారు. అలాగే 'కన్యక'లో సెట్టికూతురు, 'పూర్ణమ్మ'లో పేద పూజారి కూతురు నాయికలుగా కవిత్వంలో కనిపిస్తారు.

సహజత్వం చెడకుండా, ఔచితీమంతంగా సమకాలీనతా ముద్రతో కావ్య రచన చేయడం గురజాడ పెట్టిన ఒరవడియే.

మెచ్చనంటా వీవు: నీవిక
మెచ్చుకుంటే మించిపాయెనె
కొయ్యబొమ్మలె మెచ్చుకళ్లకు
కోమలుల సౌరెక్కునా

అని తన పంథాను విమర్శించే వాళ్ల గురించి అన్నారు.

"అప్పారావు గారు మహాశిల్పి. సంఘసంస్కర్త. వాడుక భాషలో వ్రాసిన పాటలు రమ్యమైన కథాసృష్టి కలవి. పండితులు విని బాగానే వుంది, భాష బాగులేదంటారు. భాష బాగు లేకపోతే భావం యెల్లా స్ఫురిస్తుంది" అంటూ విశ్వనాథవారే స్వయంగా గురజాడ భాషను సమర్థించారు.

"ముత్యాల సరాలు" గురజాడ వారు కల్పించిన నూత్న ఛందస్సు. గేయకవిత్వానికి బాటలు వేసిందదే. ఒక జాతి ఫార్సీ గజల్ యొక్క నడకతో తానీ ఛందస్సుకు పూనుకున్నట్లు వ్యాసచంద్రికలో గురజాడవారే పేర్కొన్నారట.

ముత్యాలసరాల గేయాలలో కూడా ఆయన వైవిధ్యం చూపారు. ఒకే ఛందస్సుతో విసుగు కలగకుండా నాలుగుపాదాలు సమానంగా కూర్చినవి, మాత్రలే ప్రధానం. కనుక ఈ ఛందస్సులో – చివరి పాదంలో 12 మాత్రలు చివర గురువు

కలవి, చివర రెండు లఘువులు కలవి, అలాగే చివరి పాదంలో ఒకసారి తొమ్మిది, మరోసారి ఎనిమిది, ఇంకోసారి మూడు మాత్రలే కూర్చినవీ, మొదటి మూడు పాదాలలో 13 మాత్రలు, మూడవ పాదంలో 12 మాత్రలు, అయిదు పాదాల గేయం, రెండు పాదాల గేయం, ఇలా నడిపించిన ప్రయోగశీలత్వాన్ని గురించి డాక్టర్ సి.నారాయణరెడ్డిగారు తమ సిద్ధాంత గ్రంథంలో విశ్లేషించారు.

ఆ మాత్రా ఛందస్సుల పద్ధతిలోనే గేయకవిత్వం పలు విధాలుగా విప్పారింది. దాశరథి, నారాయణరెడ్డి వంటివారి గేయ కవిత్వానికీ గురజాడ స్ఫూర్తి నేపథ్యంలో వుందనవచ్చు.

బెంగాల్‌లో రవీంద్రుడు, తెలుగనాట గురజాడ ఒకే సంవత్సరాన జన్మించారు. గురజాడ వారికీ, రవీంద్రునికీ మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయి. గురజాడ కలకత్తా వెళ్లి రవీంద్రుని కలుసుకున్నారు కూడా. అంధవిశ్వాసాలను ప్రతిఘటించిన రవీంద్రుని వ్యక్తిత్వం గురజాడ వారికి నచ్చింది. గురజాడవారు కూడా దైవం కన్నా మానవీయ విలువలకే ప్రాధాన్యం ఇచ్చిన కవి. ఆ మానవీయతా ధోరణులనే కవిత్వంలో తెలుగు కవులెందరో అందిపుచ్చుకున్నారు. అది గురజాడ దీపధారిగా నిలిపిన బాటే–

మనిషి చేసిన రాయిరప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయిరప్పల కన్న కనిష్టం
గాను చూస్తావేల బాలా?
దేవుడెక్కడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడే వేలా?
కన్ను తెరచిన కానబడడో
మనిషి మాత్రుడియందు లేడో
యెరిగి కోరిన కరిగి యీడో ముక్తి

అంటూ 'మనిషి' అనే కవితలో మానవతావాదానికి పట్టం కట్టారు కవిత్వంలో గురజాడ. తెన్నేటి సూరి వంటి వారు –

"కీలు గుర్రం మీద – బాలీసు నానుకుని
ప్రాణాలు లేనట్టి భగవంతుడొచ్చాడు

కూలి మాటడగండిరా

అన్నాలు చాలవని చెప్పండి రా"

అంటూ రాయడానికి నేపథ్యంలో ప్రేరణ 'మనిషి'యే!

సంఘసంస్కరణకు – కవిత్వంలో, నాటకంలో, పట్టంకట్టి జనహృదయాలకు ఎక్కించింది గురజాడవారు. గాంధీజీ హరిజనోద్యమాన్ని మొదలెట్టకముందే 'లవణరాజు కల'లో–

మలిన దేహుల మాలలనుచును

మలిన చిత్తుల కధిక కులముల

నెలవొసంగిన వర్ణ ధర్మ మధర్మ ధర్మంబే

అని ప్రాచీన వర్ణవ్యవస్థను దునుమాడారు. స్త్రీ పురుష సంబంధాల విషయంలో కూడా కవిత్వంలో గురజాడవారు హద్దుమీరిన ఇంద్రియలోలత్వాన్ని ఖండించారు.

'మానవ జీవితంలోకాని, సారస్వత కల్పనలో కానీ ఎందులోనైనా స్త్రీ పురుష శారీరకానుభవాలు, ఆనందాలు, వాటి వర్ణనలూ తత్తదుచిత స్థానంలో వుండాలి. ఇప్పుడు వీటికి అనుచిత ప్రాధాన్యమిచ్చి గోరంతలు కొండంతలు చేస్తున్నారు" అని ఎప్పుడోవారన్న మాట, ఈ నాటికీ వందేళ్ల తరువాత కూడా, అలానే కానవస్తోంది. హద్దులు మీరినతనం మరింత ఎక్కువవుతోంది కూడాను.

ఎల్లలోకము లొక్కయిల్లై

వర్ణభేదము లెల్ల కల్లై

ప్రేమబంధము వేడుకలు కురియగా ఆవిష్కృతం కావాలని ఆయన కాంక్షించారు. వట్టి కబుర్లు కాదనీ, మనుషులు మనోదారుఢ్యమే కాదు దేహబలిమిని కూడా కలిగివుండాలనీ ప్రబోధించారు.

ఈసురోమని మనుషులుంటే

దేశమేగతి బాగుపడునోయ్

తిండి కలిగితే కండకలదోయ్

కండకలవాడేను మనిషోయ్

అనడంలో ఆయన సంకల్పం దేహబలిమియే కానీ, కండకావరం కాదనేది గ్రహించాలి! రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి, దువ్వూరి, కృష్ణశాస్త్రి, వేదుల,

బసవరాజు అప్పారావు, మల్లవరపు, శ్రీశ్రీ, పురిపండా, సినారె వంటి కవుల మీదనే కాదు – వచన కవితా మార్గాన్ని త్రొక్కిన కవులపై కూడా కథాకావ్య రచనాధోరణులు, ఆత్మాశ్రయ రీతులు, ప్రబోధ కవిత్వం, సమాజ హిత చింతన, సంస్కరణాభిలాష వంటి ధోరణులకు, భాషను వ్యవహారికంగాను, మాండలికంగానూ ప్రయుక్తం చేయడానికీ బాటలు వేసింది గురజాడ వారేననేది నిస్సందేహం.

అంతేకాదు! బాలసాహిత్యానికి కూడా గురజాడ వారే బాలగేయాలు రచించి మార్గదర్శకమయ్యారు. –

ఏనుగు ఎక్కిన మనం
ఏ వూరెళదాం?
ఏనుగు ఎక్కిన మనం
ఏలూరెళదాం

అరటికాయ బజ్జి
మినప్పప్పు సొజ్జి
కలిసి మెలసి తిందాం
కథలు వ్యథలు విందాం

అంటూ పిల్లలకు కూడా అర్థమయ్యే వారి చిన్న చిన్న పరిచితిలోని పదాలతోనే వినోద వికాసాల నందించే రచనలు చేసేందుకు ప్రేరకులుగా నిలుస్తున్నారు గురజాడ.

గురజాడవారు 1915 లో నిర్యాణం చెందిన తరువాత జరిగిన సంతాప సభలో గాడిచర్లవారు మాట్లాడుతూ – మరికొన్నేళ్లు జీవించి తానవలంబించిన మార్గంలో గురజాడ కావ్య రచనలు అధికంగా చేసివుంటే తెలుగుదేశానికి రవీంద్రులయ్యేవార'ని అన్నారట.

నిజానికి సమకాలికులుగా వున్న గురజాడ, రవీంద్రులు సాహిత్యంలో శిఖరప్రాయులే. తెలుగువాడిగా పుట్టి గురజాడ మనకు భాగ్యం కలిగించారు గానీ, ఆయనకు రావలసిన ఖ్యాతిరానేలేదు. నిజానికి రవీంద్రులనే ఆంధ్రా గురజాడ అనాల్సినంత గొప్పతనం గురజాడ వారిలో వుంది అని గురజాడనూ, కథనూ

ఉద్యమంగా ముందుకు తీసుకువెడుతూ ఈ తరంలో అభిలాషను పెంచుతున్న వేదగిరి రాంబాబు భావించడంలో ఎంతో ఔచిత్యం వుంది.

"మనవాళ్ళు వట్టి వెధవాయిలోయ్" అని గురజాడ గిరీశం చేత అనిపించిన సంస్కృతి యధార్ధంగా రాజ్యమేలుతున్నప్పుడు ఈ ఆర్తి తప్పదు! గురజాడకు ఇవాళ ప్రాంతీయతలూ, కులాలు, పాక్షికతలూ అంటగట్టి విగ్రహాన్ని కూల్చి నిగ్రహం కోల్పోతున్న దుస్థితి తాండవిస్తోంది. అయినా 'అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతినాపలేరు' అన్నట్లు గురజాడ ప్రతిభా ప్రభావదీధితులు ఆయనను కాదనుకునే వారిలో కూడా ప్రకాశిస్తూనే వుంటాయి.

"నాది ప్రజల వుద్యమము. దానిని యెవరిని సంతోపెట్టడానికైనా వదులుకోలేను" అన్న వజ్రసంకల్పం ప్రకటించిన మహాకవి, ప్రజా కవి, యుగకవి గురజాడ. ఆయన నూటయాభైవ జయంతి సందర్భంగా వారికి అక్షరాంజలి. ✳

**(కథాకేళి మాసపత్రిక అక్టోబర్' 2011)**

# (47) వెలుగు జాడ... గురజాడ

**మతములన్నియు మాసిపోవును**
**జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును**

అని భవిష్యదిశా గీతిక పలికాడు గురజాడ. యుగకర్త, తెలుగు సాహిత్యానికి వెలుగుబాట పరిచిన గురజాడ అప్పారావు గారు మరణించి ఈ నవంబర్ 30 కి నూరేళ్లవుతుంది. గురజాడ శతవర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడు ఆశించిన లక్ష్యాల దిశగా, ఆశయాల పథంలో వ్యవస్థ ఏ మేరకు ముందుకు వెళ్లింది అంటే ఇంకా సందేహాస్పదంగానే ఉంది. ఇవాళ దేశంలో అసహన వాతావరణం ఉంది అంటున్న తరుణంలో ఆయన సందేశాలు స్మృతిపథంలో మెదలడం సహజం. సాహిత్యకారులు, సైంటిస్టులు మొదలైన వారి అవార్డుల తిరస్కరణ ఒక ప్రధాన చర్చనీయాంశంగా ఉంది.

ఆకులందున అణగిమణగి / కవిత కోకిల పలుకవలెనోయ్ / పలుకులను విని దేశమందభి / మానములు మొలకెత్తవలె నోయ్ – అని గురజాడ పలికాడంటే దేశంపట్ల అభిమానాన్ని, భక్తినీ కలిగించేదిగా సృజనకారులు మెలగవలసిన ఆవశ్యకతను నొక్కివక్కాణిస్తోంది అది. రాజకీయం ఏదైనా కానీ, అధికార పీఠాలు ఎవరివయినా కానీ, పౌరులకు దేశభక్తి ఉండాలి. ఈ దేశంలో నివసించే వారంతా జాతీయాభిమానంతో వుండాలే కానీ ఎలుకలు వున్నాయని ఇంటిని తగలబెట్టుకోకూడదు కదా!

అడుగు జాడ గురజాడదది / అది భావికి బాట / మనలో వెధవాయిత్వం / మరిపించే బాట–అని శ్రీశ్రీ ఊరికే అనలేదు. తెలుగు కవిత్వం, కథ, నాటకం, బాల సాహిత్యం, భాష ఇవాళ ఇంత జనజీవన మమేకంగా సామాన్యుల, అట్టడుగు వర్గాల స్థాయికి కూడా రాగలిగిందంటే అందుకు గురజాడ వేసిన ప్రాతిపదికలు అవిస్మరణీయాలు. పునర్మూల్యాంకనల పేర గురజాడకు కులం, మతం, ప్రాంతం అనే పాక్షికతలు అంటగట్టే చర్యలు జరిగాయి. బ్రతికి ఉండగానే విమర్శలు ఎదుర్కొన్న కవికి, మరణించి బ్రతకడం మొదలెట్టాక అలాంటి వివాదాలు రావడం విడ్డూరమేమీ కాదు.

బ్రతికి చచ్చియు జనులకెవ్వడు / మేలు చేసెనో, వాడు ధన్యుడు – అని ఆయన అన్నట్లుగానే నిజానికి గురజాడ భావనల ఆవశ్యకత ఈనాడు మరీ ఉంది.

‘1915 లో, నిజానికి, మరణించిన తరువాతనే గురజాడ బతకడం మొదలుపెట్టాడు’ అన్న కృష్ణశాస్త్రి మాట యథార్థం. ‘గురజాడను కవిగా గుర్తించని వాడిని నేను మనిషిగానే గుర్తించను’ అన్నాడు శ్రీశ్రీ. కన్యాశుల్కం నాటకంలో గిరీశం ఒక్కడే! కానీ ఈనాడు గిరీశం సంస్కృతి వ్యవస్థీకృతమైపోతోంది. కుహనా మేధావులు, పబ్బం గడుపుకునే రాజకీయవేత్తలు, స్త్రీ సముద్ధరణ వాదులూ పెరిగిపోయారు.

దేశమనియెడి దొడ్డవృక్షం / ప్రేమలను పూలెత్తవలెనోయ్ / నరుల చెమటను తడిసి మూలం / ధనం పంటలు పండవలె నోయ్ – అని శ్రమ శక్తినీ, శ్రమశక్తి ఫలాలను మాత్రమే అనుభవించాలనే ఆదర్శాన్నీ ఆనాడే వెల్లడించాడు గురజాడ. అంతెందుకు? – గురజాడ దేశభక్తి గీతంలోని ప్రత్యంశమూ ఏ దేశానికయినా వర్తించే విశ్వజనీన అంశాలు. శ్రీశ్రీ మాటలో–గురజాడను ఈనాడు ముఖ్యంగా గుర్తించాల్సిన ఆవశ్యకత ఉంది. ‘స్వచ్ఛమైన సత్యాన్ని చూపి చచ్చుపుచ్చు అబద్ధాలనే కవిత్వంగా చెలామణి చేసే వాళ్లకి గురజాడలోని మహత్తర మానవత్వం అర్థం కాదు. వాళ్లకి ఎదుటివాడు ఒక దేవతగానో, రాక్షసిగానో కనబడతాడే తప్ప తన లాంటి మనిషిగా కనిపించడు...”

“గాంధీ మహాత్ముడు డ్రాయింగ్ రూమ్ రాజకీయాలను ప్రజాయత్తం చేసినట్టే గురజాడ మహాకవి పండితులు తన గుత్తసొత్తుగా భావించే కవితా శక్తిని ప్రజలందరు పాడుకునే జీవితావసర వస్తువుగా రూపొందించాడు”.

“దేశభక్తి గీతం సమస్త ప్రపంచ మహాజనుల జాతీయ గీతం. రామాయణ భారతాది ఇతిహాసాలకున్న విలువ ఈ ఒక్క గీతానికి ఉందని అంటే కొందరు ఆశ్చర్యం పొందుతారేమో! కానీ ఆశ్చర్యకరమైన యథార్థం ఇది. కాలం గడుస్తున్న కొద్దీ బలం సంతరించుకునే కొద్దిపాటి మహాకావ్యాలలో ఒకటిగా దీనిని గుర్తించక తప్పదు. ఒక తెలుగుకవి ప్రపంచానికి ఇచ్చిన కవిత్వపు కానుక ఇది. మానవుని ఆధ్యాత్మిక యాత్రలో భగవద్గీతకు ప్రత్యేక స్థానంలా, గురజాడ కవి దేశభక్తి గీతానికి ఉంది. ఒక కాలానికీ, ఒక స్థలానికీ పరిమితం కాని సందేశం ఇచ్చేది ఈ గీతం” అని శ్రీశ్రీ ఢంకా బజాయించి చెప్పాడు.

మెచ్చనంటావీవు, నీవిక / మెచ్చుకుంటే మించిపాయెనె / కొయ్యబొమ్మలు మెచ్చుకళ్లకు / కోమలుల సౌరెక్కునా – అన్న గురజాడ భావన రంధ్రాన్వేషక విమర్శలకు కనువిప్పు కాదగిందే! గురజాడకు శతవర్ధంతి నివాళులు. *

**(ఆంధ్రభూమి దినపత్రిక సాహితి 30.11.2015)**

# (48) శ్రీశ్రీ మహాప్రస్థానం అనంతం

**ఒ**క పుస్తకం జీవితాన్ని ప్రభావితం చేస్తుందా అంటే అది నేరుగా చేయదు. మనం ఒక వయసులో బాల్య ప్రభావాల కుటుంబం నుంచి విడిగా చదువు పేర, స్నేహితుల పేర సమాజంలో సంచరిస్తున్నప్పుడు బహిర్గతంగా తెలియని ఘర్షణ ఒకటి అనివార్యంగా లోన జరుగుతూనే వుంటుంది. కుటుంబ వాతావరణ శక్తి, సమాజ వాతావరణ శక్తి ఒక్కటిగా వుండవు. ఎదుగుతున్న క్రమంలో పరస్పరం ఆ శక్తులూ సంఘర్షిస్తాయి. చరిత్ర అంటే ఓ గతి, ఓ నడక, ఒక రూపుదిద్దుకున్న క్రమం అనుకునేట్టయితే మనదైన వ్యక్తిత్వం వికసించే మార్గంలో స్ఫూర్తినిచ్చే అంశాలలో పుస్తకాలు, మనుషులు కూడా వుంటారు. వాటిల్లో ఒక మలుపుదశలో కంఠదఘ్నంగా ప్రభావం వేయగల స్ఫూర్తిదాయకమైన గ్రంథమూ, వ్యక్తి ఎవరో వుంటారనుకోవచ్చు.

మతం చెప్పినా, గతి తార్కిక భౌతికవాదం చెప్పినా 'నిన్ను నువ్వు తెలుసుకో' అనే చెప్పాయి. తన వివాహ విషయంలోనూ, మతావలంబన విషయంలోనూ తనదైన స్వేచ్ఛను స్వీకరించి అనుసరించుకోలేనివాడు స్వతంత్ర జీవి అనడానికి తగడు. తప్పటడుగుల బాల్యం నుండి పాఠశాలలో ప్రవేశించడంతోనే గురువులు, స్నేహితులతో కలిసి సాగే సామాజిక జీవనం మొదలౌతుంది. విద్యారంగానికి అందుకే ఎనలేని ప్రాధాన్యత వుంది. చిన్నప్పుడు చదువుకున్నవే చితిమంటల వరకు గుర్తుంటాయి. బతుకుపుస్తకంలో వివిధ పుటలుంటాయి. కొన్ని సువర్ణాక్షరాలవి. ప్రతి పుటలో వివిధ రసానుభవాలుంటాయి. కొన్ని పేజీలు పదేపదే దాచుకోవాలనిపిస్తే, కొన్ని చింపేస్తే బాగుండు అనిపించవచ్చు. కానీ చరిత్ర చింపేస్తే చిరిగిపోదు, చెరిపేస్తే చెరిగిపోదు. తనను తాను మభ్యపెట్టుకుని, మరుగుపరుచుకుని లోకానికి విదితమయ్యేవాడు చిత్తశుద్ధీ, నిజాయితీలేని వాడవుతాడు. తనదయినా కూడా చారిత్రక యథార్థం, సత్యం నిష్కర్షగా చెప్పుకోగలగాలి. రచనకూ, జీవితానికీ అనుకునేదానికీ ఆచరించేదానికీ పొంతన కనిపించినప్పుడు వ్యక్తి ఎక్కువ సమాదరణీయుడవుతాడు. 'అనకాపల్లికి దారి' అని దారి చూపించేబోర్డు అనకాపల్లి వెళ్లదన్నట్లుగా–'మార్గదర్శి' ఆ మార్గంలో నడిపించేవాడేగానీ, తాను నడిచేవాడు

కాకపోయే సందర్భాలుంటాయి. అందుకనే ఒక గ్రంథం నుండి గానీ, మనిషి నుండి గానీ స్ఫూర్తి పొందడం అనేది పొందేవాడిననుసరించి వుంటుంది. సూర్యుడు తన కిరణాన్ని మణిమీదా, మట్టిముద్ద మీదా ఒకేలా ప్రసరింపచేస్తాడు. ఆ కిరణంతో మణి ప్రకాశిస్తుంది. మట్టిముద్ద ప్రకాశించదు. అంటే అది వాటివాటి తీరునుబట్టే కదా!

పదహారేళ్ల ప్రాయంలో అప్పుడప్పుడే లోకాన్ని సమాజజీవిగా అర్థం చేసుకుంటున్న రోజుల్లో 1967 లో నాకు శ్రీశ్రీ 'మహాప్రస్థానం' చదవడం తటస్థించింది. ఇక్కడ అనివార్యంగా నా గురించి కొంత చెప్పాలి. కర్నూలు కాక హైదరాబాద్ రాజధానిగా మద్రాసు నుండి తరలివచ్చిన కుటుంబమే మాది. మా నాన్నగారు కీ.శే.అల్లంరాజు కామేశ్వరరావు గారు వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగి. 1956 లో ఒకటో తరగతిలో హైదరాబాదులోనే చేరాను. సుల్తాన్‌బజార్ క్లాక్‌టవర్ ఎదురుగా ఓ చిన్న పాఠశాలలోనే చేరాను. ఆ తర్వాత కేశవ మెమోరియల్ స్కూల్‌లో ఆరవతరగతి చదివాను. మలక్‌పేట కాలనీలో మా నాన్నగారికి క్వార్టర్ కేటాయించడంతో మలక్‌పేట ప్రభుత్వోన్నత పాఠశాలలోనే 7వ తరగతిలో చేరి చదువుకుంటూ ఆనాటి హెచ్.ఎస్.సి.పాసయ్యాను. స్కూల్లో ఉండగానే గ్రంథాలయం పీరియడ్ వుండడం వల్ల బాల సాహిత్య గ్రంథాలేవో ఉపాధ్యాయులు చదివించిన గుర్తు. పదేళ్ల ప్రాయంలోనే 'విజ్ఞాన జ్యోతి' అనే లిఖిత పత్రిక నిర్వహించాను. తెలుగు మీద మమకారం, కృష్ణమూర్తి, వెంకటేశ్వరశర్మగార్లు కలిగించారు. హెచ్.ఎస్.సి తర్వాత వివేకవర్ధినీ కళాశాలలో పి.యు.సి సైన్స్ గ్రూప్‌లో చేరాను. హైస్కూల్ తెలుగు మీడియం నుండి కాలేజీలో ఒక్కసారిగా ఆంగ్లమాధ్యమం కావడంతో బెంబేలుపడ్డాను. లెక్కలూ, సైన్సూలేని విద్య కోసం వెదికి ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాలలో డిప్.ఓ.యల్ (డిప్లమో ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్)లో చేరాను. పి.యు.సిలో తెలుగు క్లాసు ఒకటే నిడదవోలు సర్వేశ్వరరావుగారిది ఆసక్తికరంగా వుండేది. పాఠ్య గ్రంథంలోని పానుగంటివారి 'స్వభాష' నన్ను తొలుతగా ఆకర్షించిన వచన రచన.

నాకు 1967 వ సంవత్సరంలోనే ప్రభావోపేతమైన 'యువభారతి' సంస్థతో అనుకోకుండా పరిచయం కలిగింది. సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో ప్రతినెలా మొదటి, మూడవ ఆదివారాలలో జరిగే సాహిత్య

సమావేశాల గురించి 'డెక్కన్ క్రానికల్' సిటీడైరీలో చూసి సాహిత్య సమావేశం చూడడానికి వెళ్లిన నాకు, అతిథులను కూడా వారిలో కలుపుకుని, కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసిన యువభారతి తీరు నచ్చింది. కాళోజీ నారాయణరావు, ఇరివెంటి కృష్ణమూర్తి వంటి ప్రముఖులున్న ఆ తొలి సమావేశంలోనే అప్పటికప్పుడు వచ్చిన అంశంపై రెండు నిమిషాలు మాట్లాడే 'క్లుప్తగోష్టి'లో పాల్గొని, బ్యాలెట్ ద్వారా ఉత్తమ వక్తగా ఎంపికైన నాకు అందిన పుస్తక బహుమతి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. 1930 ల్లో టైఫాయిడ్ జ్వరం పడిలేచాక శ్రీశ్రీ మహాప్రస్థానం గీతాలు రాస్తే–'మహాప్రస్థానం' చదవడంతోనే నేను జ్వరానపడి క్షాళనమయ్యాను. నాకెంతో స్ఫూర్తిదాయకమైంది ఆ కవిత్వం. నా సాహిత్యాభిలాషను ప్రేరేపించడమే కాదు 'ఒక సకలాతీత శక్తి ఉన్నట్లా లేనట్టా' అనే సంశయగ్రస్తుడనై వున్న తరుణంలో, వ్యక్తి కన్నా సమష్టి విలువను ప్రబోధిస్తూ, సమాజ హితచింతనతో నేను సైతం ప్రపంచాగ్నికి ఒక సమిధనన్న లక్ష్యాన్ని ప్రేరేపించి నన్ను అభ్యుదయ పథగామిగా ఆనాడు వామపక్ష భావాలవైపు మొగ్గేలా చేసింది మహాప్రస్థానమే. 'దేశ చరిత్రలు' చదివి ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కన్పించని కథలన్నీ కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం అని గ్రహించాను. యువభారతి సంస్థలో నాడు కాళోజీ 'జీవనగీత' (ఖలీల్ జిబ్రాన్ ద ప్రాఫెట్‌కు అనువాదం) ప్రచురణకు శుద్ధ ప్రతి తయారు చేయడంలో పాల్గొంటూ కాళోజీగారితో యువకునిగా సాన్నిహిత్యాన్ని, ఉత్తర ప్రత్యుత్తరాలను పొందగలిగాను. చదివింది ప్రాచ్యవిద్యయే అయినా ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్‌గా వున్న ఆచార్య కె.కె. రంగనాథాచార్యులుగారు అభ్యుదయ భావోద్దీపన కలిగించారు. యువభారతి వంగపల్లి విశ్వనాథంగారు 'సమ్యక్ దృష్టి' అలవడేందుకు హేతువయ్యారు. అందుకే శ్రీశ్రీ కవిత్వంవైపు నేను ఆకర్షితుడిని, ప్రభావితుడిని అయ్యానేగానీ వ్యక్తిగా ఆయన వీరాభిమానిని కాలేదు సరికదా ఆ సిగరెట్లు, మద్యపానాలకు దూరంగా వున్నాను.

"ఆయన రాసి పారేసిన కవిత్వం గుబాళిస్తుండగా
తాగి పారేసిన సీసాల సంగతి మనకెందుకు"

అన్న కాళోజీ మాటల్లా మహాప్రస్థానానికి ప్రభావితుడిని అయ్యాను గానీ శ్రీశ్రీ కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని కలగలుపు చేసుకుని కలవరపడ లేదు నేను. సైకిల్ కొనుక్కోమని ఇంట్లో రెండు వందల రూపాయలిస్తే ఆ డబ్బులతో మద్రాసుకు రైల్లో వెళ్లి శ్రీశ్రీని ఆయన ఇంట్లో తాగి తూలుతూ అనంతంగా రంగనాయకమ్మను దూషిస్తున్న

స్థితిలో చూసిన యువ మిత్రుడు సుబ్బారావు తిరిగి వచ్చి ఆ విషయం మాతో చెప్పాక మహాకవుల జీవితాలను కాక, వారి రచనలను, అందులోని భావాలను గ్రహించి అనుష్ఠించడమే సబబు అనిపించింది. మహాప్రస్థానంలోని ప్రతి కవితా నాకు స్ఫూర్తిమంతమే. లోకం తీరునంతా

"నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు
నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే" అంటూ 'ఆః' అన్న ఒక్క అక్షరాన్ని అర్థవంతమైన అద్భుత శీర్షికగా నిలిపి స్వరోచ్చారణలోని దాని ఉత్థానపతనాలతో రూపుకట్టించిన తీరు ప్రశంసలకూ, తిరస్కారాలకూ అతీతంగా వ్యక్తి తనదైన నిబద్ధతతో, నిమగ్నతతో వుండాలని సందేశిస్తూనే ఉంది.

'జగన్నాథ రథచక్రాలు' ను శ్రీశ్రీ బ్రాహ్మణీక భావజాలంతో కవిత్వీకరించాడని ఆ మధ్య ఏదో పత్రికలో ఓ దళితకవి రాశాడు. 'సర్వం జగన్నాథం అని' తాడితుల పీడితుల కోసం ఎప్పటికప్పుడు విధ్వంసం నుండి కొత్త సృష్టి చేసుకునే దారు విగ్రహాలతో జరిగే జగన్నాథ రథయాత్ర సర్వమానవ ఏకీకరణ సంకేతం అనే నా ప్రగాఢ భావన. "పతితులార భ్రష్టులార బాధాసర్పదష్టులార పనికిమాలి బ్రతుకు కాలి శనిదేవత రథ చక్రపుటిరుసులలో పడి నలిగిన హీనులార!" అంటూ వారిని సముద్ధరించేందుకే వారి కోసమే కలంపట్టి ఆకాశపు దారివెంట హడావిడిగా వెళ్లిపోయే రథచక్రపు ప్రళయఘోషను భూమార్గం పట్టించిన అసలైన సామ్యవాదకవి శ్రీశ్రీ.

'మరోప్రపంచం మరోప్రపంచం మరోప్రపంచం పిలిచింది' అని సమాజాంతర్గతంగానే వున్న నవ్యలోకాన్ని ఆవిష్కరించి ఎర్రబావుటా ధగధగలను హోమజ్వాలల భుగభుగలను సమ్యక్ దృష్టితో సమీకరించి సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు తాను విరచించే నవీనగీతికి ప్రాణం, ప్రణవంగా స్వీకరించి తెలుగు కవిత్వానికి ఒక అంతర్జాతీయ దృక్పథాన్ని, 'ప్రపంచ కార్మికులారా ఏకంకండు' అని విశ్వజనీన శ్రామిక ఏకీకరణను లాంగ్ మార్చ్ చేయించాడు. నవయుగ భగవద్గీతా ఝంఝను సాయుధ విప్లవ రథసారథియై పలికించాడు.

1930-1940 ల మధ్య రాసిన మహాప్రస్థానం గీతాలే శ్రీశ్రీని మహాకవిని చేశాయి. "1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. నాటి నుంచీ

తెలుగు సాహిత్యాన్ని నేను నడిపిస్తున్నా. ఈ శతాబ్దం నాది” అన్న శ్రీశ్రీ ఆత్మవిశ్వాసానికి ‘మహాప్రస్థానం’లోని గీతాలే ప్రాతిపదికలు. ఈ తర్వాత సర్రియలిస్టు ధోరణిలో రాసిన ‘ఖడ్గసృష్టి’ కవితలు, ‘విచిత్రమే సౌందర్యం, సౌందర్యమే విచిత్రం’ అన్న దాఖలాగా సిరిసిరిమువ్వ, లిమరిక్కులు, ప్రాసక్రీడలు (సిప్రాలి) వంటి ప్రయోగవైవిధ్యాలు, సినీగీతాలు ఏవయినా అతనికీర్తికి అనుషంగికాలే. మరోప్రస్థానం నాటికే సమాజ ధోరణులు మారిపోయాయి. మహాప్రస్థానంతో శ్రీశ్రీ ఏకోన్ముఖంగా సంకల్పించిన సామ్యవాదశీల ‘మరో ప్రపంచం’– విరసంతో అంతర్జాతీయ దృక్పథం నుండి ఎడమైపోయింది. సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు కార్మికలోకపు కళ్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి ఏకీకృతం కావడం పోయి కుల, మత, ప్రాంత, యాసల పేరిట వేటి కుంపట్లు అవి వేరుగా పెట్టుకోవడం ప్రబలింది. అందుకే శ్రీశ్రీ కవిత్వంలో ఒక సమగ్రతా వీక్షణాన్ని దర్శించక– తమ కుల, వర్గ, ప్రాంత అస్తిత్వం– స్త్రీ వాద, దళిత స్పృహలు లేవు గనుక శ్రీశ్రీ ‘రిలెవెన్సీ’ నేడు లేదనీ శ్రీశ్రీ గారికి నిజంగానే ‘నూరేళ్ళు నిండాయి’ అనేవారు బయలుదేరారు.

కాలం పరిణామ శీలమైంది. గతి శీలమైంది. శ్రీశ్రీలో లేనిదాన్ని వెదుక్కోవడం బదులు, శ్రీశ్రీలో ఉన్నదాన్నీ, అది కలిగించే స్ఫూర్తిని, మహాప్రస్థాన కవిత్వపు ఆచరణాత్మక ఆవేశాన్ని అందిపుచ్చుకోవడం విజ్ఞత. శ్రీశ్రీ శూన్యాన్ని పూరించినవాడు. శ్రీశ్రీ తర్వాత శ్రీశ్రీ స్ఫూర్తితో శూన్యం ఏర్పడే వీలేలేదు. ‘మహాప్రస్థానం’ ఒక చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించింది. శ్రీశ్రీ కవిత్వాన్ని తూచే తూనికరాళ్లు తన దగ్గర లేవన్నాడు చలం. నేడు మన కొలతలతో శ్రీశ్రీని తూచవలసిన అవసరం లేదు. శ్రీశ్రీ అందించిన కవిత్వపు కొలతలు అవగాహన చేసుకుంటే, ఏ సామ్యవాద దిశగా తానాశించిన ‘మహాప్రస్థానం’ నేటి సమాజం సాగించగలదో విశ్లేషించుకుని అనుగమిస్తే అదీ ప్రయోజనదాయకం. శ్రీశ్రీని కాదనుకుని ముందుకెళ్ళిపోదామని అనుకున్న వారికెవరికయినా అతను స్ఫూర్తిదాయకమై నీడలా అనుసరించి వస్తాడన్న నిజం ఎలాగూ అంతఃకరణంలో అవగతమవుతూనే వుంటుంది.

శ్రీశ్రీ స్ఫూర్తి అందుకోగలిగిన వారికి అదెన్నడూ ఆరిపోని దీపం. *

**(ప్రజాశక్తి ‘స్నేహ’ ఆదివారం అనుబంధం 2.5.2010)**

# (49) కీర్తి శేషుడు శేషేంద్ర

**"ఈ** లోకం కల విలువ, నీవు మోసే శిలువ. కానీ దేవుడెదురైౖ ఈ ఋతువులో ఏం కావాలంటే.. పిడికెడు వసంతాలందరికీ భిక్ష పెట్టమంటాను. నాకు మాత్రం ప్రేమించే పెదవులు చాలునంటాను" – శేషేంద్ర

"కవిత్వం ఒక మెస్మరిజం. కవికన్ను ఒక ప్రిజం. నేను సృష్టించిన అలంకారం నీ అంధకారానికి దీపం–శేషేంద్ర

**శేషేంద్ర అచ్చమైన కవి. అంతకు మించి పండితుడు**

కవులలో అందగాడు. ధిషణాహంకారం ఉన్నట్లు తోచినా, లౌక్యమెరుగని భోళా మనిషి. ఆయనను సాహిత్య ఎన్.టి.రామారావు అనే వారు. గుంటూరులో డిగ్రీ చదువుతున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ప్రముఖ నటుడు ఎన్.టి.రామారావు శేషేంద్రకు క్లాస్‌మేట్, బెంచ్‌మేట్ కూడాను. శేషేంద్రశర్మ ఇంటి పేరు గుంటూరయినా పుట్టింది నెల్లూరులో. 1927 అక్టోబర్ 20 ఆయన జన్మదినం.

కాలేజీ చదువులకు గుంటూరు వెళ్లే ముందే స్వగ్రామంలో కావ్య, నాటక, అలంకారాది సంస్కృత విద్యను, వేదనోపనిషత్తులు, పురాణేతిహాసాలు, తంత్ర జ్ఞానం.. ఇవన్నీ నేతి కృష్ణశాస్త్రి, వావిలాల వెంకటేశ్వరశాస్త్రి వంటి గురువుల వద్ద అభ్యసించారు. గుంటూరులో డిగ్రీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లు చదువుకుంటే, మద్రాసు లా కాలేజీలో న్యాయశాస్త్రం చదివారు. ఆయన మున్సిపల్‌కమిషనర్‌గా చాలాకాలం పనిచేశారు. ఒంగోలులో ఉండేవారు. భార్య జానకి, ఇద్దరుకొడుకులు సాత్యకి, వనమాలి, ఇద్దరుకూతుళ్లు వసుంధర, రేవతి.

శేషేంద్రను చూస్తే రాజసకవిగా అనిపించేది. శ్రీనాథుని అభినవమూర్తిగా తోచేది. 1962 ప్రాంతంలో హైదరాబాద్ వచ్చిన శేషేంద్రకు ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిరి పరిచయం ఒక మలుపు. వారి స్నేహం ప్రణయమై, పరిణయంగా మారింది. శేషేంద్రకు విలాస జీవితం అందుబాటులోకి రావడం వల్లనే ప్రజల పక్షం వహించే ఆయనలోని కవితాపార్శ్వం వివాదగ్రస్తమయిందనాలి. రచనకు జీవితానికి కొంతయినా పొంతన ఉండాలని అధికశాతం మంది భావిస్తారు కదా!

"నేనొక చెమట బిందువుని కండలకొండల్లో ఉదయించే లోకబంధువుని"

"ఈ దేశపు ప్రాచీరేఖ మీద సూర్యుడు ఉదయించకపోతే మండే నా గుండె చీల్చి దాని మీద పెడతా–ఎర్రటి నా కండలతో ఎండలు కాయిస్తా"

"కవిత్వం వద్దు వేయి ప్రళయాలు దట్టించిన ఒక బాంబు ఇవ్వండి"

వంటి భావాలు జ్ఞాన్‌బ్యాగ్ ప్యాలెస్‌లో ఉండి జీవితం గడుపుతూ, కఠోర వాస్తవాల పీడిత జనజీవనాల గురించి, అణచివేతల గురించి ఆయన అందంగా కవిత్వం అల్లడం, కవిత్వం ఎంత అద్భుతంగా ఉన్నా విప్లవ భావనలు కూడా 'కలల బేహారి'గా కేవలం రసప్లావితం చేయడం విరోధాభాసగా అనిపించింది కొందరికి.

విప్లవ వస్తువుకు ఆయన ఇచ్చిన కవిత్వ రూపం, ఆయన జీవనసరళి, ఆయనను 'కమ్యూనిజం నాలో స్పందించే ఏకతార', 'నక్సలిజం వైపే నా పయనం' అని చెప్పుకున్నా- అనుభూతి కవిగా, సంప్రదాయ వాదిగా, పండితుడిగానే సంభావింపజేసింది. శేషేంద్ర కవితను 'నీది పద్యమా లేక ఫ్రెంచి మద్యమా' అన్నాడు శ్రీశ్రీ.

నిజానికి ఆయన పాండిత్యం అసమానమైనది. సొరాబు, ఋతుఘోష కావ్యాలతో విద్వత్కవిగా సాహితీప్రస్థానం ప్రారంభించిన ఆయన రాసిన 'షోడశిరామాయణ రహస్యాలు', 'స్వర్ణహంస' గొప్ప విమర్శగ్రంథాలు. రామాయణం–గాయత్రీ మహామంత్ర రహస్య వ్యాపకం తప్ప మరేమీ కాదనీ, నైషధంలోని దమయంతి ఆదిపరాశక్తి అనీ, హంస కుండలినీ యోగశక్తి అనీ 'స్వర్ణ హంస'లో ఆయన సోపత్తికంగా పేర్కొని, పండితులను సైతం విస్మయపరిచారు. అయితే కవిత్వంలో తనదైన ముద్రతో ఆ తరువాత దూసుకువచ్చారు. భావకవిత్వాన్నీ, మార్క్సిజాన్నీ, కాక్‌టైల్ చేసినట్లుండే ఆ కవిత్వానికి ఎందరో అచ్చెరువొంది ప్రభావోపేతులైనా, విమర్శకులు సంప్రదాయకవిగా అంగీకరించక – నియోక్లాసికల్ పొయెట్ అని కొందరంటే, మండే సూర్యుడు, నా దేశం నా ప్రజలు, గొరిల్లా వంటి ఆయన అద్భుత రచనలను విప్లవ సాహిత్యంలో భాగాలుగా స్వీకరించలేమని మరికొందరు పక్కకు పెట్టారు. అయితే ఆయనను కవిగా అభిమానించి అంగీకరించకుండా ఉండలేకపోయారు.

1968 లో మారిషస్, మడగాస్కర్, తూర్పు ఆఫ్రికా దేశాలు, 1970 లో జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, గ్రీసు మొదలైన దేశాలు తిరిగిన తరువాత

తనదైన కవిత్వ మార్గం ప్రకటిస్తూ శేషేంద్ర 'కవిసేన మానిఫెస్టో'ను వెలువరించారు. అయితే ఆ కవిసేన – కొందరి స్వచ్ఛంద అభిమాన పురస్సరంగా, ప్రభావశీలత్వంతో ఏర్పడిందే కానీ శేషేంద్ర తన నాయకత్వ లక్షణాలతో నిజంగా ఒక పెద్ద ముఠానేమీ తయారుచేసుకోలేదు.

"నేను ఘనీభవిస్తే ఒక నామరూపాత్మక దేహం–నేను ద్రవీభవిస్తే ఒక జ్ఞాపకాల ప్రవాహం' – శేషేంద్ర

కవిత్వానికి సామాజికస్పృహ, చైతన్యస్పృహ, విప్లవోద్దీవనం అనేవి మింగుడుపడినా, శేషేంద్ర తన కవితాభివ్యక్తితో కవిత్వానికి అనివార్యంగా హృదయవాదిగా ప్రకటించిన రసస్పృహ కొందరికి మింగుడుపడలేదు. అందుకే అటు సంప్రదాయ వాదులు, ఇటు విప్లవవాదులు ఎవ్వరూ మనఃస్ఫూర్తిగా అక్కున జేర్చుకోక, ఒక రకంగా ఒంటరిగానే సాహితీ ప్రస్థానం చేసినవాడాయన అనిపిస్తుంది. ఆయన 'కవిరాజసం' – దూరం నుండే కొందరిని ఆయనకు అభిమానులను చేసింది. ఆయనకు సన్నిహితంగా వెళ్ళినవారి సంఖ్య తెలుగువారిలో తక్కువే. అయితే ఆయనను దేశవిదేశాల్లో ఎరిగి, ఆయన రచనలను అభిమానించిన వారున్నారు. ఆధునిక మహాభారతం అనిపించుకున్న ' నా దేశం–నా ప్రజలు' నోబెల్ బహుమానికి నామినేట్ అవ్వడమే ఒక గొప్ప విశేషం. కేంద్ర సాహిత్య అకాడెమీ ఫెలోషిప్ గౌరవం లభించినా, కనీసం 'పద్మశ్రీ' గౌరవమైనా ఆయనకు రాలేదు. 'జ్ఞాన్‌పీఠ్' కూడా రావల్సి ఉండీ రానేలేదని ఆయన అసంతృప్తి పడినమాట నిజమే అయినా, ఆయన అటు విశ్వనాధ ఇటు శ్రీశ్రీ ఇద్దరి ప్రశంసలనూ అందుకున్న వాడే!

శేషజ్యోత్స్న, నరుడు–నక్షత్రాలు, సాహిత్యకౌముది, కాలరేఖ, రక్తరేఖ, మనోవిహంగం, నా రస్తా, పక్షులు, ఈ నగరం జాబిల్లి, మబ్బుల్లో దర్బారు, జనవంశం, నీరై పారిపోయింది, ప్రేమ లేఖలు.. ఇలా అనేక గ్రంథాలు ఆయన ప్రతిభావైశిష్ట్యానికి అక్షర సాక్ష్యాలు. 'కామోత్సవ్' అనే నవలను ఒక వారపత్రికలో సీరియల్‌గా రాసి, గొప్ప సంచలనం సృష్టించారు. అరిస్టోక్రటిక్ జీవితాల వెలుగు నీడలను నిర్మొహమాటంగా చిత్రించారందులో.

"నా తనువు ఎక్కడ అగ్నిలో కలుస్తుందో అక్కడ దేవీయ మధువు వర్షిస్తుంది. నేనిక్కడ కాందిశీకుణ్ణి. నన్ను తారల సుగంధం పిలుస్తోంది" – అంటాడు శేషేంద్ర

శేషేంద్ర తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, సంస్కృతం భాషలన్నింటిలో దిట్ట. ఆయన రచనలు ఇతర భాషల్లోకి అనువాదమైనట్లే, కొన్ని అనువాద రచనలు తాను కూడా చేశారు. ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనాలలో ఆయన తెలుగు అనువాదాలు మూలాలకే వన్నె పెట్టేవి. అలాగే గల్ఫ్ యుద్ధం సమయంలో రాసిన వ్యాసాలు, 'నీతులు చెప్పే అమెరికా–ఇదీ నీ చరిత్ర' అంటూ సామ్రాజ్యవాద వ్యతిరేకంగా రాసిన వ్యాసాలు శేషేంద్ర అంతర్జాతీయ రాజకీయాల అవగాహనకి గొప్ప తార్కాణాలు. 'ఎంతకాలం ఈ ఎండమావులు' అని వాటిని గ్రంథస్థం చేశారాయన.

ప్రకృతిలో మమేకమై, ప్రజల కోసం తపిస్తూ రాసిన రచనలే శేషేంద్రవి. ఆయన కవిత్వానికి ఒక సరికొత్త రంగు, రుచి, రూపులు ఇచ్చాడు. వివాదాలు చెలరేగినా, గుర్తింపులు తగినంతగా లేకున్నా తనదైన కవితా మార్గాన్ని రాజసంతో అనుసరించాడు. ఒక శ్రీశ్రీ, ఒక కృష్ణశాస్త్రి, ఒక తిలక్ లాగానే ఒక్కడే శేషేంద్ర అన్న ముద్రను తెలుగు సాహిత్య ప్రపంచంలో నెలకొల్పాడు. ✻

**శేషేంద్ర గురించి..**

❖ ఈ కవి యొక్క రచన పరమోత్తమ జాతికి చెందియున్నది ఇట్టి రచన చేయగలవారీ నాడు పట్టుమని పదిమంది యైనను లేరు.
–*విశ్వనాథ సత్యనారాయణ*

❖ వీరి రచనలో ఎక్కడ బట్టినా ధీరగంభీరశైలి కనిపిస్తుంది. రీతిని ఇంతగా సాధించినవారు అరుదు. –*పుట్టపర్తి నారాయణాచార్యులు.*

❖ మీ కవితలో మీరొక వరుసవేది కోసం వెతుకులాడుతున్న అన్వేషిగా కనిపిస్తారు.
– *శ్రీశ్రీ ఒక లేఖలో.*

❖ యుగకర్త గురజాడ తర్వాత తెలుగు సాహిత్యంలో ఆ యుగకర్తృత్వాన్ని ముందుకు ఒక మెట్టుపైకి తీసుకెళ్లిన ఖ్యాతి శేషేంద్రదిది. – *ఆర్.ఎస్.సుదర్శనం.*

**(ఆంధ్రభూమి వారపత్రిక 28.6.2007)**

# (50) సినీ కవి సినారె

'**నా**టకంలో వలె చిత్రసాహితిలోనూ మాటలూ, పాటలూ ఉంటాయి. హృద్య సంగీతమూ ఉంటుంది. పాటలలో కొన్ని కథాగతంగా ఉంటాయి. కొన్ని కథాగతంగా ఉంటూనే కవితా విహాయసాంచాలను స్పృశిస్తూంటాయి. ఉత్తమ కవితకు లక్ష్యంగా ఉంటాయి. వెండితెర మీద కవిత్వం తన రూపురేఖలనూ, బహిర్వేషాన్నీ మార్చుకుంటుందేమోగానీ చైతన్యవంతమైన తన అంతరాత్మను మాత్రం స్థిరంగా నిలుపుకుంటుంది. భావన రసరూపం దాల్చినప్పుడు అది దేశం, కాలం, మనిషి కల్పించిన ఎల్లలను దాటి సర్వమానవాంతస్సుల్లోకి ప్రవహిస్తుంది. ఈ సత్యం చిత్ర సాహితికి కూడా వర్తిస్తుంది. ఈ ప్రక్రియ సాధనలో ఉన్నత శిఖరాలధిరోహించిన వారిలో డాక్టర్. సి.నారాయణరెడ్డిగారు అగ్రేసరులని చెప్పడంలో అతిశయోక్తి లేదు'. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు. కీ॥శే॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారు 1976 లో మొట్టమొదటి సారిగా డా॥సి.నారాయణరెడ్డి గారి సినిమా పాటలు 125, 'పగలే వెన్నెల' పేరిట సంస్థ పక్షాన ప్రచురించినప్పుడు 'మా మాట'లో అన్న మాటలివి. బాపుగారి ముఖచిత్రంతో, బొమ్మలతో కూడిన పది ప్రకరణలతో ప్రణయవల్లరి, ప్రకృతి సుందరి, మువ్వల రవళి మోహన మురళి, నివాళి, వేదనాఝరి, సందేశలహరి, నవ్వుల పందిరి, లేతజాబిలి, జానపదమాధురి, విశ్వమంజరి అని వింగడిస్తూ ఒక తెలుగు సినీకవి సినీగీతాల సంకలనం వెలువడటం బహుశా అదే ప్రథమమేమో! ఆ గౌరవం దక్కింది డా॥ సినారె గారికే!

సినిమాలకు పాటలురాసి పేరు తెచ్చుకోవడం వేరు. కవిగా ప్రసిద్ధులై సినిమా పాటల ద్వారా మరింత ప్రాచుర్యం పొందడం వేరు. నారాయణరెడ్డిగారు సినిమాలకు పాటలు రాయకమునుపే కవిగా సుప్రసిద్ధులు. ముఖ్యంగా గేయకవిగా ఆయనకు బహుళ ప్రాచుర్యముంది. ఆకాశవాణి ద్వారా లలిత గేయాలూ, గేయ నాటికలూ, సంగీత రూపకాలూ ఎన్నో అప్పటికే ప్రచారమై జనబాహుళ్యంలో కవిగా గుర్తింపు పొందినారాయన. 1954-55 నాటికే తెలుగు సినీ ప్రముఖులతో పరిచయం

ఉన్నా, 'ప్రవేశిస్తే సింహద్వారం ద్వారానే ప్రవేశించాలి గదా' అని. తొలి చిత్రంలో అన్ని పాటలూ రాసే అవకాశం వస్తేనే దిగాలని ఉంది కనుక, ఎన్.టి.రామారావుగారి 'గులేబకావళి కథ'తో సినీకవిగా ఆరంగేట్రం చేశారు. 1960 మార్చి 10 న హైదరాబాద్ – మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వ్ చేసిన మొదటి తరగతి రైలు ప్రయాణం చేసి మద్రాస్ వెళ్లారు.

'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ' అన్న సాంద్ర కవితాస్పర్శగల ప్రణయ గీతంతో ప్రవేశించిన సినారె చిత్రరంగ హృదయాన్ని తాను దోచుకున్నారు. అది మొదలు నేటిదాకా వారి కలం నుండి జాలువారిన వైవిధ్యభరిత సినీ గీతాలు వేలల్లో వున్నాయి. జనం నాలుకల మీద, గుండెల్లోనూ ఉన్నాయి. 1961 నుంచి నేటి వరకు ఏ పదవులధిరోహించినా, ఎన్ని బిరుదులూ, సన్మానాలు పొందినా, సినీ పాటల రచయితగా తనదైన ముద్ర వేసుకున్నారు. 'గులేబకావళి కథ' తర్వాత భరణీ పిక్చర్స్ 'అనుబంధాలు' చిత్రంలో 'నా పేరు సెలయేరు, నన్నెవరూ ఆపలేరు' అని రాసినట్లుగా పాటల సెలయేరై ప్రవహిస్తూనే వచ్చారు.

స్వతహాగా గేయకవి కావటంతో సినీగేయాలు రాయడానికి ఆయనకు కష్టమేమీ కాలేదు. శేషేంద్ర వంటి కవి కేవలం ఒక్కపాటతో సినీకవిగా సరిపెట్టుకోవలసి వచ్చింది. కానీ అలలెత్తే భావాన్ని ఎలా కుదించి రాయాలో, కవిరాసిన గీతం ఏ రాగంలో, ఏ స్థాయిలో స్వరపర్చబడుతుందో సినారె బాగా అవగతం చేసుకున్నారు. తెలంగాణ జానపదం మట్టి, అధ్యయనం చేసిన తెలుగు సాహిత్య ప్రాచీన పురాణ ప్రబంధాదుల భాషా పాటవంను బట్టి, ఉర్దూఫారసీ వంటి అన్య భాషా పదాలు తట్టి, సినారే పాటలు చిత్రపరిశ్రమలో ఇతర కవులను ఒక దశలో వెనక్కు నెట్టి మరీ దూసుకెళ్ళాయి.

**'ఏమో ఏమో ఇది–నాకేమొ ఏమో అయినది**
**ఈ వేళలో నా గుండెలో ఏదో గుబులవుతున్నది'**

అని ఇతరులు గుబులు పడేలా పాటల రచనా పాటవంతో సినారే దూసుకెళ్లారు. ప్రణయాన్నీ, శృంగారాన్నీ, ప్రకృతి సౌందర్యాన్నీ, జీవన మధురిమలనూ వొలికించే పాటలు రాయడంలో ఆయనకు ఆయనేసాటి అనిపించుకున్నారు.

ఆయనకూ, నాటి ఇతర సినీ కవులకూ తేడా ఏమిటంటే, సినారే చలనచిత్రాల మీదనే ఆధారపడిన కవి కాదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆయనకు తనకు నచ్చిన ఆధ్యాపక వృత్తి ఉంది. పాట రచనను ఆయన ప్రవృత్తిగానే ఎంచుకున్నారుగానీ, తొందరపడి తన ఉద్యోగ మూలాలను వదిలేసుకోలేదు. 'పాటలు రాస్తారా–పాఠాలు చెబుతారా, ఏదో ఒకటి తేల్చుకోండి' అని విశ్వవిద్యాలయం అధికారులు ఆయనను నిలదీశారనీ, ఆయన అప్పుడూ పాఠాలపైనే మొగ్గు చూపారనీ కొందరనుకుంటుండగా విన్న సందర్భాలు ఉన్నాయి. కానీ, ఆయనను ఎవరూ దేనికీ ఆపలేరు. అలాంటి ఆపత్తు ఆయన తెచ్చుకోనూలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1970 దశకంలో ఎం.ఏ, ఆ తర్వాత ఎం.ఫిల్ తరగతుల్లో ఆయన వద్ద నేరుగా పాఠాలు నేర్చుకున్న అదృష్టం మాది. ఆయన తరగతిలో పాఠం చెబుతూ ఉంటే, సాహిత్యేతర తరగతుల విద్యార్థులు కూడా ఆసక్తిగా వచ్చి వినేవారు. తన వృత్తికి సంపూర్ణంగా న్యాయం చేస్తూనే, తన ప్రవృత్తి అయిన పాటల రచనను ప్రతిభావంతంగా కొనసాగించారు.

సారస్వత పరిషత్ ప్రాంగణంలో యువభారతీయులం, సంస్థాగత పనులు చేసుకుంటున్న రోజుల్లో, ఒకసారి ఆచార్య ఆత్రేయగారు వచ్చి మదరాసులో సి.నారాయణరెడ్డి గారు అలవోకగా ఆడుతూ పాడుతూ తన సినీ గీతాలను రాసి అందివ్వడం గురించి చెప్పినప్పుడు, ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి. సినీ కవిగా ఒక ఉదాత్త గౌరవాన్ని పొందిందీ, నిలబెట్టుకుందీ ఆయనే. శ్రీశ్రీవంటి కవిని సైతం సిగరెట్టుకీ, మందుకీ పాటలు రాయించుకోగల కవిగా ముద్రవేసిన పరిశ్రమ, సినిమా కవులలో జనందృష్టిలో ఒక ఉదాత్త గౌరవాన్ని ఇచ్చిన కవిగా సి.నారాయణరెడ్డిగారినే అనిపింపజేసిందంటే అతిశయోక్తి కాదు. బహుశా, అందువల్లనేనేమో, సినారే గీత రచనల్లో సాహిత్య విలువలూ, జానపద మధురిమలూ గోచరించినట్లుగా, డబ్బులుకోసం అతివేల శృంగారగీతాలు రాసారనే ముద్ర అతిగా ఆయనపై పడలేదు.

అది నిజంగా అరుదైన గౌరవం. అలాగని పామర జనరంజక గీతాలు ఆయన రాయలేదని కాదు.

నారాయణరెడ్డిగారు మొదటి నుంచీ మానవతావాది. ఆయన గేయాలనుంచి వచనకవిత్వంలోకి వచ్చాక చేసిన రచనలు అందుకు దాఖలాలు, కేంద్రసాహిత్య

అకాడమీ అవార్డు పొందిన 'మంటలూ – మానవుడు' గానీ, జ్ఞానపీఠపురస్కారం తెచ్చిపెట్టిన 'విశ్వంభర' గాని, నారాయణరెడ్డిగారి కవితాత్మను మనకు ప్రస్ఫుటీకరిస్తాయి. సినిమాలలో భక్తిగీతాలు రాసినా నారాయణరెడ్డిగారి ఆ పాటల్లోనూ, ఒక సేవానిరతి భావనలు, ద్యోతకమవుతుంటాయి. 'కథానాయిక మొల్ల' చిత్రంలో 'జగమే రామ మయం' పాటలో 'ఆ చిరునవ్వే అమృతపు జల్లు' అనడంలో ఆ మానవీయ ఉదాత్తభావనే ప్రతిఫలిస్తుంది. అంతేగాదు, పాట చివరిలో 'ఎవని ఏలుబడి ఇంటికొక్క గుడినిల్పెనో ఎవని రాజ్యమే రామరాజ్యమై వెలసెనో' అనడంలో ప్రజాభ్యుదయ భావనే ప్రతిఫలిస్తుంది. ప్రశ్నరూపకంగా, సంవాద రూపకంగా, ఒక్కోసారి పరోక్ష సంభావకంగా సినారే రాసిన గీతాలున్నాయి. 'చెల్లెలికాపురం' చిత్రంలో హీరో శోభన్‌బాబు పల్లెటూరి కవి. అచ్చం నారాయణరెడ్డిగారు కూడా తెలంగాణ మారుమూల పల్లె నుంచి వచ్చిన స్వచ్ఛమైన లలిత భావుకుడే. 'చరణకింకిణులు ఘల్లుఘల్లుమన' పాట ఆ చిత్రంలో ఎంత ప్రాచుర్యం పొందిందో 'సినారె' గీతరచనా ప్రతిభ ఎటువంటిదో ఆ పాట సుస్పష్టం చేస్తుంది.

నారాయణరెడ్డి గారిలోని అభ్యుదయ చింతన సమాజ సందేశగీతాలెన్నిటినో రచింపజేసింది. తెలుగు సమైక్యతను వాంఛించే ఎన్.టి.ఆర్ గారి 'తల్లా – పెళ్ళామా' చిత్రంలో 'తెలుగు జాతి మనది–నిండుగ వెలుగు జాతి మనది' అనే పాట నారాయణరెడ్డి గారు రాసిందే. 'ఇందులో నేను సమకాలీన వాస్తవికతను నిర్ద్వందంగా ఎత్తి చూపాను. అభిప్రాయ భేదాలున్నాయి. అసమానతలున్నాయి. అన్యాయాలు జరిగాయి. కాదనలేము. అంతమాత్రాన మూలరాష్ట్రానికే ముప్పు ఏర్పడడం వాంఛనీయం కాదు'. అప్పటి స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని విజ్ఞప్తి రూపకంగా చివరి చరణంలో నలుగురిలో మన జాతి పేరును నవ్వులపాలు చెయ్యొద్దు అని రాశానని 'పాటలో ఏముంది–నా మాటలో ఏముంది' గ్రంథంలో వివరించారాయన.

**'వచ్చిండన్నా వచ్చాడన్నా వరాల తెలుగు ఒకటేనన్నా'** అనేది భాషాసమైక్యతకు ఎప్పటికీ ఒక గుడి కట్టిన నుడియే!

సినారె పాటల ప్రాభవాన్ని ఉటంకించేందుకు ఒక పట్టిక రూపొందిస్తే అదే ఒక ఉద్గ్రంథం అవుతుంది. ఆయన రాసిన మంచి పాటలు ఉదహరించుకుంటూ వెళ్లాలంటే ఎప్పటికీ తరగవు. 'ఒసేయ్ రాములమ్మా!' టైటిల్ సాంగ్ సినారెగారు

రాసిందే. మొన్న మొన్న రఘుకుంచె సినారెగారు పాట తన కోసం రాయడంగా పులకించిపోవడమూ తెలుసు.

నారాయణరెడ్డిగారు నిరంతర కవి. కవిత్వమే ఆయన శ్వాస, ధ్యాస, ఏటికేడాదిగా తన జన్మదినాన్ని సరికొత్త కవితా సంకలనం ఆవిష్కరణతో జరుపుకుంటూ వస్తున్నది సినారెయే! మునుపటంత ఉధృతంగా ఆయన ఇప్పుడు సినిమాలకు పాటలను రాయడం లేకపోవచ్చు. కానీ కవిగా ఆయనెప్పటికీ విస్మృతులు కారు. ఆయన కవితా ప్రతిభకు సినిమా మాధ్యమం దోహదకారియే గానీ, అదే మూలాధారం కాదు. కానీ పాట మాటై నిలిచిపోవాలన్నది వారి తపన.

**'ఎన్ని తెన్నుల కైతకన్నె విహరించినను**
**పాటలోని నాదు ప్రాణాలు గలవందు'**

అన్నది 1963 లో ఆయనే. తన షష్టిపూర్తి ఉత్సవంలోనూ-

**'మాటకు దండంపెడతా పాటకు దండంపెడతా**
**మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా'** అన్నారాయన.

రకరకాల మాత్రాఛందోగతుల్లో, వివిధ వచనకవితా రీతుల్లో, ఎన్ని రచనలు వెలువరించినా, కవితారంగంలో పాటకు పెద్దపీట వేసి, సినీ గేయకవిగా ఆయన ఆర్జించిన కీర్తి వసివాడనిది. 'సినీకవి' అనగానే అందుకే ఎందరి కనులముందో కదలాడే రూపం సి.నారాయణరెడ్డి గారిదే. ✻

**(విశాలభారతి మాసపత్రిక జూలై' 2010)**

# (51) నార్ల చిరంజీవి
# అభ్యుదయ ప్రణయానికి కొమ్మలు రెమ్మలు

**మ**నిషి మనస్సును సులభంగా కదిపేది, కుదిపేది, ఎంతటివారినయినా ఏదోవేళ స్పృశించేది ప్రణయం. లలిత భావభరితమై హృదయస్పర్శతో రసానుభూతి నందించే కవితలో ప్రణయానికి ప్రత్యేకమైన స్థానం, ప్రాచుర్యం వున్నాయి.

నిజానికి ప్రజా ఉద్యమాల్లోంచి వచ్చిన కవి నార్ల చిరంజీవి. సమాజ స్వరూపాన్ని అర్థం చేసుకున్న మనిషి చిరంజీవి. 1946 లో 'విప్లవాత్మ' పేర చిరంజీవి గేయాలు పుస్తకరూపంలో వచ్చాయి. అప్పటికి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కూడా అచ్చుపుస్తక రూపాన్ని సంతరించుకోలేదు. నార్ల చిరంజీవి 1925 లో కృష్ణాజిల్లా కాటూరులో జన్మించారు. "మంచి గంధపు చెక్క మా ఊరు– ఆ ఊరు' అని మమత ప్రకటించారు. కవిగానేకాక చిరంజీవి వ్యక్తిగా సైతం ఉన్నతుడై మల్లెలాంటి మనసుతో, గులాబీల నవ్వుతో, నొప్పించక మసలే మనిసిగా జీవించాడు. ఛందశ్శాస్త్రమూ, వైద్యశాస్త్రమూ అభ్యసించినా సాహిత్యంలోనే సామర్థ్యం చేబూనాడు.

మొదట ఛందోబద్ధంగా 'బుద్ధ చరిత్ర' రచించాడు. ఛందస్సుమీద తిరుగుబాటుచేసి తన చేతులతోనే దాన్ని కాల్చివేసి సమాజ శ్రేయస్సుకై సమాజవాదం వైపు మరిలాడు. అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గ సభ్యునిగా కమ్యూనిజంపై విశ్వాసంతో ఆమరణాంతం అంటే 1971 వరకూ జీవించాడు.

నార్ల చిరంజీవికి బాల సాహిత్యకారునిగా ఎక్కువ పేరు వచ్చింది. ఆయన 'తెలుగుపూలు' లక్షలాది ప్రతులు అమ్ముడుపోయాయి. 'చిన్నారిలోకం' అంటూ ఆయన ఒక దినపత్రికలో నిర్వహించిన శీర్షిక సుప్రసిద్ధమై అలరించింది. చలనచిత్ర పరిశ్రమలో ప్రవేశించి పలు ప్రసిద్ధ చిత్రాలకు రచన చేశాడు చిరంజీవి. 1955 తరువాత నార్ల చిరంజీవి రాసిన వాటిలో 'భాగ్యనగరం' నాటకం ఒక మరపురాని గ్రంథంగా నిలిచింది. అలాగే చిరంజీవి అనగానే గుర్తొచ్చేది 'గోరంతదీపం' కూడా. అప్పుడే తెలుగు కవితలో ఒక కొత్త ప్రయోగంచేసి నార్ల చిరంజీవి కూర్చిన కావ్యం 'కొమ్మలు–రెమ్మలు'.

ఉర్దూలోని గజల్ ప్రక్రియ ప్రేరణగా స్వతంత్ర్యంగా చేసిన లలిత శృంగార రసవత్కావ్యం ఈ 'కొమ్మలు–రెమ్మలు'.

'అగ్నిమీళే పురోహితమ్
అనుచు ఋషులు వేడుకున్నారు
నిన్ను ఋగ్వీథినాడు
వలపు చిచ్చును కీర్తింపదలతు– నేడు
అగ్ని మీళే పురోహితమ్ అనియె నేను "

అంటూ ప్రణయజ్వాల యొక్క పవిత్రను, ప్రాముఖ్యతను కృత్యాదిలోనే ప్రస్తావిస్తాడు.

'దేవునకు చిక్కకిందాక తిరిగితిరిగి
చివర నీ వాలుచూపుల జిక్కినాను"

అంటూ దైవశక్తికన్న ప్రేమశక్తి అనివార్యమైనది, ఆకర్షణీయమైనది అని ధ్వనిస్తాడు. ఎంతటివారయినా వలపు అనుమాటలో ముందే వున్న 'వల' లో పడక తప్పదని–

'కన్బొమలు విడిచిన కామబాణము తాకి
సృష్టికర్త గుండె నష్టపడియె" అంటూ 'బ్రహ్మకైన పుట్టురిమ్మతెగులు' అన్న సామెతలోని వాస్తవాల రెమ్మ ఊపుతాడు.

"మెట్ట వేదాంతి జగమెల్ల మిథ్యయనేను
మెలతనడుము దక్క మరేది మిథ్యకాదు"

అని అసలు సిసలు మిథ్యలోని అందానికి పీఠం వేస్తాడు.

కలికి కన్నులు వెన్నెల కొలనులై కవి చిరంజీవి హృదయాన కవిత రగిలిందట. రగిలి వెలిగిన ఆ జ్వాల తరుణమన్మథుడెత్తు పతాక అనేలాగా పైకెగసిందట. ఆ పతాక నొసట అల్లుకున్న లత, రసికజనమనోభిరామ గీత – 'కొమ్మలు–రెమ్మలు' కావ్యం. 'రక్తశిలలపైన ముక్తినొందుట కన్న–కలికి సేవల నరకమ్మె వలతు' అని కవి తీర్మానం. అందుకే

"బ్రతుకునందేమి సాధించి వ్రాసితివన
ఏను వినిపింతు ప్రియురాలి మౌనగీతి"

అంటాడు. వేదాంతానికి, వలపుకు మధ్య బేరీజు వేసి వలపు ఘనతకే జేకొడతాడు కవి. దానికి కారణం ఏమిటయ్యా అని అడిగితే...

"పాశము విసరి గురితప్పవచ్చు యముడు
తరుణి విసరిన చూపులు తప్పబోవు

ముక్కుమూసి నీవు మోక్షము సాధింప
తరుణియూర్పుకేను ధన్యుడగుదు..

బ్రతుకు దుప్పటెంత పరచినచాలదు
ఇర్వురకును చోటు ఉర్వియుందె"

అంటాడు అందువల్లనే. "నలువకైనను సంభావములె దక్కు-రమణి నుతియించు కవితకే రక్తి ముక్తి' అని తన రమ్య రచనాహేతువును చమత్కార పారమ్యం చేస్తాడు.

ప్రణయ కవితలో సహజంగానే ప్రేయసీ అందచందాల ప్రత్యంశ వర్ణనలు వుంటాయి. అయితే నార్ల చిరంజీవి కవితలో ఆ వర్ణనల భావుకత 'ఆహా' అనిపించేదిగానే కనిపిస్తుంది కానీ వికటించిన శృంగారం కానీ, ద్వంద్వార్థాల ధోరణిగానీ కనిపించదు.

"చేయినడ్డు పెట్టి చిరునవ్వు దాయకు
కుమ్మరించి బదులు కోరుకొమ్ము" అంటాడు.

"కొత్త ప్రియునివోలె గోరాడ ముంగురులే
చెక్కిలి చెమరించె చెలియకప్పుడు"

అని చెక్కిలిపైకి జారిన ముంగురులు ప్రియుని స్పర్శగా ఆమెకి భాసించాయంటాడు. చందమామకు మచ్చవుందిగానీ చెలికిలేదు. కానీ ఆమె ముఖాన మచ్చలా కనిపించేది ఆమె అలకేనట!

"పిసరు మచ్చ లేనట్టి జాబిల్లి మొగము
అలిగి మచ్చదెచ్చుకొనకు చిలిపిదాన"

అని సలహా ఇస్తాడు. నార్ల చిరంజీవి ప్రణయ భావుకతలోని అందాలకు తార్కాణపు రెమ్మలు ఎన్నో ఉన్నాయి.

"ఈ నిశాగర్భమందేమి కానుపించు
కన్నెమల్లియ తొలిరేయి కలవరమ్ము"

"కనులు మూసి నీదు కాలి సవ్వడి వింటి
కనులు తెరచి చూడ కానరావు"
"పిచ్చివాడయనుచు పిలిచి కౌగిలినిచ్చు
కన్నె అమ్మవోలె కనుపించు"

అంటూ చెప్పడం అతనికే చెల్లింది. "వేయి సమరాల గెల్చిన వీరుడిపుడు – పడతి వెచ్చని కౌగిట బందియాయె" అని ప్రణయంలోని వీరత్వాన్ని రూపుకట్టిస్తాడు.

వలపుగీతాల 'కొమ్మలు–రెమ్మల్ని' చదివిన పాఠకుడు ఆ భావుకతకు, అందాలకు కట్టుబడి పోతాడు. అలాగని అవి కేవలం పైపైన గ్రోలే తీపి మిఠాయి రుచులే అనుకోకూడదు. గొప్ప ఆలోచనాధార అంతరాల్లోకి తొంగిచూసుకునే లోచూపును కూడా ఈ కావ్యగీతికలు ఎన్నో అందిస్తాయి.

"ఇన్ని కన్నీటి స్వప్నాలకేమి ఫలము
మంచు విడినట్లే గడియలో కరిగిపోవు"

"అమ్మ కడుపున దాగి నేడవతరించు
కొత్త ప్రాణికి స్వాగతమిత్తునేను"

"రచ్చనున్న వేళ రాజేంద్ర భోగితా
నెలవునున్న వేళ నిరుపయోగి"

"మెరుపుతీగె వెంట పరుగుతీసెనతడు
వాయగొట్టు పిడుగుపాటు మరచి"

"వలపుదారము త్రెంపి మరల కలిపిన
ముడులు తప్ప రానేరాదు మొదటిరూపు"

వంటి కవితా పాదద్వయాలు ఆలోచనాత్మకాలు. ప్రణయమే పలికినా కవి కలం సహజమైన సామాజిక చింతనను వీడిపోదు. అభ్యుదయ కవిగా సమాజాన్ని నిశితంగా అధ్యయనం చేసిన అతని అనుభవసంపత్తి సందేశరేఖగానో, సూక్తి రేఖగానో పలుచోట్ల ద్యోతకం అవుతూనే వుంటుంది. అంతస్తుల మధ్య తేడాలను, సమాజంలోని వెలుగునీడలను, వాస్తవ స్వరూపాలను నార్ల చిరంజీవి పలు విధాలుగా చిత్రించాడు.

"పూలసెజ్జల పవళించు పురుషుడిపుడు
తెరువు లెరుగడు మట్టి పాతరల మధ్య"

"కోటికొక్క లక్ష కొదవయ్యెనని ఏడ్చి
పూట బత్తెమీయ పోరువాడు"

"పంచదారకొరకు వాడేడ్చుచున్నాడు
ఉప్పులేక ఏడ్చుచుండె వీడు"

"ఆత్మవంచన నేర్చిన నేర్పరి అయ్యగారు
పరుల వంచింపడనుమాట వట్టికల్ల"

"ఒక శకారుడున్న కకావికలానాడు
పుడమి మ్రింగ కోట్లు పుట్టిరిపుడు"

"లోకవృత్త మొకదినాన నాకమైన
మరొక దినమున రౌరవ నరకమగును"

"వేరె స్వర్గనరకముల వెతుకనేల
నీ సుఖము దుఃఖముల యందె నిలిచెనోయి"

ఇలా అనేక రస గుళికలు ఈ కావ్యంనిండా పరుచుకుని పఠితను అలరిస్తాయి. "అవని కంటె పెద్దననుకుని గర్వించి–చెలియ గుండె కంటె చిన్ననైతి" అంటూ ప్రేమ వైశాల్యాన్ని ప్రకటించే కవి "మగువకెమ్మోవిలో దాగె మధుర కవిత– యింతి ముద్దులు చాలు నాకేల కవిత" అని అంటూ "కరుణధారల వర్షించి కడిగిపొమ్ము– పంకమందున్న జీవన వజ్రశిలను" అని జీవితాన్ని పునీతంచేసే ప్రణయారాధనతో ప్రార్థిస్తాడు. నార్ల చిరంజీవి 'కొమ్మలు–రెమ్మలు' స్పృశించిన ఏ పాఠకుడైనా ఏదో ఒక భావ సుమానికి బలీయంగా ఆకర్షితుడై ఆ అనుభూతి పరీమళానికి రసమంచితుడు కాక వుండలేడనడం అతిశయోక్తి కాదు. ఈనాటి తరానికి 'కొమ్మలు రెమ్మలు' పునర్ముద్రణతో లభించేట్లు చేయగలగడం అత్యంతావశ్యకతే. వ్యష్టినుంచి సమష్టివైపు పయనించడానికి ప్రణయ పథమే పాథేయమనిపిస్తుంది నార్ల చిరంజీవి 'కొమ్మలు రెమ్మలు'. ❋

**(ఆంధ్రభూమి సాహితి 23 నవంబరు 2009)**

# (52) సినారె స్మృతి వీచికలు

**ఆ**యన మాటకు వివశత్వం
ఆయన పాటకు పరవశత్వం

ఆయన వచనకవితకు వశులు అయిన వారికన్నా, గేయకవిత్వానికి పరవశులు అయినవారు కొల్లలు. సాహిత్యపు విలువలతో సినిమాపాటలు రాసి ప్రజల నాల్కల మీద నిలిచిన గొప్ప కవి – పండితపామరులను సమాంతరంగా మెప్పిస్తూ నిరంతర కవిగా మృత్యుపర్యంతం మనగలగడం గొప్ప విశేషం! తెలుగు కవితా ప్రపంచంలో 'గ్లామర్'తో వెలుగొందిన కవుల్లో అగ్రగణ్యుడాయన. అంతేకాదు పద్యం, గేయం, కథాకావ్యం, సంగీత రూపకం, కావ్యేతిహాసం, వచన కవిత, తెలుగు గజల్, పాట, చిత్రగీతం, వ్యాఖ్యాన రచన, వ్యాసం, పరిశోధన, నాటిక, చలనచిత్ర సంభాషణలు, సభావ్యాఖ్యానం, ఉపన్యాసం, విద్యాబోధన ఇలా అనేక ప్రక్రియల్లో ఆరితేరిన మేరు నగధీరుడాయన. డా.సింగిరెడ్డి నారాయణరెడ్డి– సినారెగా చిరముద్ర వేసుకున్న తెలుగుజాతి గర్వించదగిన కవి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులుగా, అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా, భాషా సాంస్కృతిక వ్యవహారాల శాఖ సలహాదారుగా, రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, రాజ్యసభ సభ్యులుగా ఆయనను విశిష్ట పదవులెన్నో వచ్చి వరించాయి. ఎన్నో గౌరవ డాక్టరేట్లను, కళాప్రపూర్ణను, భారత ప్రభుత్వంచే పద్మశ్రీ, పద్మభూషణ్ గౌరవాలను అందుకున్న తెలుగు కవి డా॥సి.నారాయణరెడ్డి గారేనేమో! హైదరాబాద్‌లో సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా వారి సాహితీ సేవలు అనుపమానం.

సి.నారాయణరెడ్డి గారు జీవించిన కాలంలోనే జీవించామన్న గొప్ప సంతృప్తితో బాటు – ఆయన దగ్గర విద్యార్థిగా పాఠాలు నేర్చుకోవడం, ఆయనతో బాటు అనేక కవి సమ్మేళనాల్లో యువకవిగా పాల్గొనడం, పలు సాహిత్య సభావేదికలను ఆయనతో

పంచుకోగలగడం, ఆకాశవాణిలో ఆయనచేత పలుకార్యక్రమాలను రూపొందింప చేయగల కార్యక్రమ నిర్వహణాధికారిని కాగలగడం ఒక గొప్ప భాగ్యంగానే సంభావిస్తాను.

డా॥సి.నారాయణరెడ్డి గారి సాహిత్యాన్ని గురించి విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫిల్, పీ.హెచ్‌డి పరిశోధనలు ఎన్నో సాగాయి. వారిసాహిత్య వరివస్య గూర్చి పలు గ్రంథాలు వెలువడ్డాయి. వారు రాసిన సినిమాపాటలతో రేడియో, టీవీలు, సభావేదికలు ఇప్పటికీ మార్మోగుతూనే వున్నాయి. ఆయన శిష్య ప్రశిష్యులు ఎందరో దేశవిదేశాల్లో విస్తరించి వున్నారు. అగణిత అభిమానుల సంగతి చెప్పనే అక్కర్లేదు.

సినారెతో మీ సుధామ స్మృతి వీచికల అభివ్యక్తికే పాలపిట్ట పుటల రెక్కల మాటున ఇలా ఒదుగుతున్నది. తన సృజనాత్మక శక్తితో, లయాత్మకతతో, ఆశు గుణంతో, గానశీలంతో మంత్రముగ్ధులను చేయగల సహజగుణం వారిసొంతం. 1953 లో 'నవ్వని పువ్వు' ఆయన తొలి గ్రంథం, గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, కరుణశ్రీ, జాషువా, శ్రీశ్రీ, ఆరుద్ర వంటి భావకవుల, అభ్యుదయ కవులను అధ్యయనం చేసిన సినారె గేయకవిత్వ రచనతో తనదైన విశిష్టమార్గాన్ని కవిత్వలోకంలో వేసుకున్నారు. కర్పూర వసంత రాయలు, నాగార్జునసాగరం, ఋతుచక్రం ఆయన గేయ కవితా ప్రౌఢిమకు నికషోఫలాలు.

నా పదమూడవ ఏట 1964 లో పుట్టినరోజుకి మా నాన్నగారు కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు గారు సి.నారాయణరెడ్డి గారి 'ఋతుచక్రం' కావ్యాన్ని నాకు కానుకగా ఇచ్చారు. పాఠశాల విద్యార్థిగా వున్న నాపై – ఋతువర్ణనలను తన జీవితానికే సమన్వయిస్తూ గేయకావ్యానికి పద్యకావ్య ప్రౌఢినీ, ప్రామాణికతనూ సంతరిస్తూ, అద్భుత నూతన పదబంధ కల్పనంతో ఆయన సంతరించిన ఆ 'ఋతుచక్రం' పఠనం తెలుగుభాషపై మక్కువను, కవిత్వంపట్ల అమితప్రేమను, రచనపట్ల ఆసక్తిని పాదుకొల్పింది. "మానవుని మనస్సులలో మరుగుపడిన ప్రవృత్తులీ మబ్బుల రూపములో వెలికుబ్బినట్లు కన్పించును" అన్న వర్షరుతు పంక్తి–

చిగురు చిగురున రాగ శీకరములొలికించి
ఆకునాకున మరకతాకృతి పలికించి

పూవుపూవున మధువు పుకిలింతలొనరించి
వచ్చె కుసుమాస్త్ర భాస్వంతము వసంతమ్ము"

అన్న వసంత ఋతుగేయం.. ఆ నాడే కంఠస్థమయ్యింది. అందులోని ఘట్టాలు ఎన్నో మననశీలాలుగా నిలచివున్నాయి. కోయిల కూతయే తప్ప అది కనబడక మామిడిచెట్టుపై రాళ్లు వేసి 'కనిపించదిదియేటి గడుసుప్రాణి యటంచు' అనుకుని 'ఓసి ఈ మామిళ్ళె కూసినవిరోరి అనుకుని పరుగుపెట్టితిమి' అంటూ ఆయన వెలార్చిన బాల్యమాధురి గుర్తువుంది. సంక్రాంతి భోగిమంటవేళ 'మంటకంత దగ్గరగా మసలవద్దె తల్లీ' యని ఎంత మొత్తుకున్నా గౌనుకు మంట అంటుకున్న పసికూతురి ఘటనావైనం గగుర్పొడిచింది. పొలంలో కావలికి వెళ్లి వడిసెల విసరగా తగిలిన కాపుపడుచు గురించి చెబుతూ

"నన్ను జూచెను తన్ను జూచెను
జొన్న చేనును కలయజూచెను
సిగ్గుతో చెమరించు మేనున
చిత్రమగు ముత్యాలు పూచెను"

అని ఆమెను వర్ణించిన సొబగు గుర్తుంది. అలాగే గ్రీష్మరుతువులో ఎండకు తాళలేక ఏ మునివాకిటకో పోయి తపస్సు చేసుకుంటానన్న కవిగారితో "పదుచుకన్నెలు నీరుపోసెడు పంచలో మీ తపమ్మేమిటి! చూడచూడ అది కొంగజపమును పోలియున్నది" అని జీవన సహచరి మేలమాడితే –

"ఎచట నేర్చెనొ నా కులాంగన
ఇంత వ్యంగ్య వచోవిలాసము
అయిన ఊరక పోవునా
నాతోని గల సహవాసదోషము"

అనడం గాఢంగా నాటుకున్న చమత్కార భావనం. 1967 లో యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థతో పరిచయం ఏర్పడి ఒకనాటి 'క్లుప్తగోష్ఠి' కార్యక్రమంలో ఉత్తమ వక్తగా ఎంపికై శ్రీశ్రీ 'మహాప్రస్థానం' పుస్తకం బహుమతిగా పొందడం ఒక గొప్ప మలుపు. 'నేరాస్తా' అంటూ నా తొలి కవిత నవ్యవాణి మాసపత్రికలో ఫిబ్రవరి 68 లో అచ్చుపడింది. 14.8.68 ఆంధ్రప్రభ వారపత్రిక జన్మదిన సంచికలో

డా॥సి.నారాయణరెడ్డి గారి కవిత, నా కవిత ఎదురెదురు పేజీలలో ప్రచురితమవడం ఏనుగెక్కినంత సంబరాన్ని కలిగించింది.

యువభారతి సంస్థ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 2, 1968 న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో యువభారతి సభ్యులు నలుగురి కవితా సంకలనంగా అధ్యక్షులైన ఇరివెంటి కృష్ణమూర్తి, చక్రవర్తి వేణుగోపాల్, వంగపల్లి విశ్వనాథం, అల్లంరాజు వెంకట్రావు (మీ సుధామ) ల 'వీచికలు' కవితా సంకలనం శ్రీ కాళోజీ నారాయణరావు గారి అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ సి.నారాయణరెడ్డి గారే ఆవిష్కరణ చేశారు. చిత్రకారునిగా ఆ సంకలనం ముఖచిత్రం నేను సంతరించినదే కావడంతో సభలో నారాయణరెడ్డిగారు ప్రసంగిస్తూ నా గురించి 'కవితలో బొమ్మ గీస్తాడు – బొమ్మలో కవిత రాస్తాడు' అని ప్రశంసించడం నా కవితా వ్యాసంగానికి ఎనలేని ప్రోత్సాహకమైంది. సి.నారాయణరెడ్డి గారితో సహకవిగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, నవ్య సాహితీ సమితి సంయుక్తంగా రవీంద్రభారతి కళాభవన్‌లో 1969 సెప్టెంబర్ 23 న సాయంకాలం చంద్రగ్రహంపై మానవుడు కాలుమోపిన సందర్భాన్ని పురస్కరించుకని 'చందమామ'పై కవిసమ్మేళనం నిర్వహించగా పాల్గొనడం తొలి తాజా స్మృతి. దేవులపల్లి రామానుజరావు గారు అధ్యక్షత వహించగా సినారె కవి సమ్మేళనం ప్రారంభించారు. శేషేంద్ర, దాశరథి, శశాంక, కప్పగంతుల, కేశవవంతుల, దివాకర్ల, బోయిభీమన్న, అరిపిరాల విశ్వం, కుందుర్తి, పోతుకూచి, జి.వి.సుబ్రహ్మణ్యం వంటి హేమాహేమీల సరసన నేను చదివిన 'చంద్రావలోకనం' అనే నా కవిత శ్రోతృజన ప్రశంసలందుకుంది. సినారె సంపాదక వర్గంలోని 'స్రవంతి' మాసపత్రికలో జనవరి 70 సంచికలో ఏడు పేజీల్లో ఆ కవిత ప్రచురితమైంది. అలాగే నా 19 వ ఏట 29 మార్చి 1970 లో కళాసాహితి నిర్వహించిన మొదటి యువ సాంస్కృతిక పోటీలలో సారస్వత పరిషత్ విద్యార్థిగా వక్తృత్వంలో మా కళాశాల టీమ్‌కూ, వ్యక్తిగతంగానూ కూడా బహుమతిని సినారె చేతుల మీదుగా మొదటిసారి అందుకున్నట్లు గుర్తు. సినారె, దివాకర్ల హితవరులుగా 1969 లో స్థాపితమైన 'ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం'కు నేను సహకార్యదర్శిగా వుండేవాడిని. వారి ఆశీస్సులతో అనేక సమావేశాలు చేసుకునే వాళ్లం.

అలాగే యువభారతి లహరి ఉపన్యాసాలకు సంస్థ సహకార్యదర్శిగా నేను, వారు అధ్యక్షులుగానో, ముఖ్య అతిథులుగానో రాగా స్వాగత వచనాలో, వందన సమర్పణలో నా వంతుగా చేయడం వుండేది. 'యువతకు ఆహ్లాద పతాక, నవ్య కవితా ప్రతీక, సాహితీరంగ అంతరంగాలను ఎదపొరలను ఆవిష్కరించినట్లు ఆవిష్కరించే విజ్ఞులు, రసజ్ఞులు డా॥సి.నారాయణరెడ్డి గారికి ...' అంటూ నేను చేసిన వందన సమర్పణకు కూడా ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్నంటినప్పుడు ఆయన పెదవులపైని దరహాసరేఖ ఎలా మర్చిపోగలను. తదాదిగా ఎన్ని కవిసమ్మేళనాలు, ఎన్ని సాహిత్యసభలు వారి చెంత ఎన్నెన్ని మధురస్మృతులు. ఒకసారి నా స్వాగత వచనాల్లో 'మనో పారిజాతాలు' అని ప్రయోగించగా, సభానంతరం దగ్గరగా పిలిచి 'మనః పారిజాతాలు' అనాలి అని సవరించడం గుర్తుంది.

1967 లో స్థాపించి సుమారు ఓ పది సంవత్సరాలు నా సంపాదకత్వంలో నేను వెలువరించిన 'యువమిత్ర' లిఖిత మాస పత్రికను ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల గ్రంథాలయంలో వుంచుతున్న సందర్భంగా ఆ లిఖితపత్రికపై అభిప్రాయాలు రాయడానికి పాఠకులకై ఆ సంచికలో వుంచిన పేజీలలో –

18.1.1974 న ఆయన స్వహస్తాలతో – "నేటి ముద్రిత పత్రికలు ముఖం చూసుకోదగిన అద్దం ఈ లిఖిత పత్రిక. ఇందులో వున్నవన్నీ చిత్ర శబ్దాలు. శబ్ద చిత్రాలు. 'హోనాకాలం' నా ప్రాణం తీసేసింది. సజీవ రచన. శేముషి+కృషి = సుధామ" అని రాశారు.

ఆంధ్రసారస్వతపరిషత్ ప్రాచ్యకళాశాలలో ఎం.ఓ.యల్ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎం.ఎ (తెలుగు) లో విద్యార్థిగా చేరాను. ఆపై ఎం.ఫిల్.చేశాను. సి.నారాయణరెడ్డి మాకు తరగతులు తీసుకునేవారు. 'విజయవిలాసం' కావ్యం బోధనాంశం. వరంగల్‌లోని నేటి సహృదయ గిరిజా మనోహర్‌బాబు, నేను – ఆయన దృష్టి మా వైపుండాలని మొదటి బెంచిలోనే కూర్చునేవారం. 'సవ్యసాచి నింద్రోపలరోచి జూచి తలయూచి, యులూచి రసోచితంబుగన్' అన్న పద్యపాదం అర్థం వివరిస్తూ

"చూశారా! ఆరు 'చి'లతో 'ఆర్చి' కట్టాడు చేమకూర కవి" అంటూ విద్యార్థులమైన మా వైపు చూసేవారు. ఆయన తరగతులు వినడానికి తెలుగుశాఖకు ఆవలి విద్యార్థులు

కూడా ఆసక్తిగా వచ్చి కూర్చునేవారు. అలాగే 1975 – 1977 రెండు సంవత్సరాలు నేను కరీంనగర్‌లో జూనియర్ తెలుగులెక్చరర్‌గా పనిచేసి తిరిగి ఎం.ఫిల్ పరిశోధనకు విశ్వవిద్యాలయంలో చేరినప్పుడు కూడా ఆయనకు విద్యార్థినే. మాకు సెమిస్టర్ తరగతులుండేవి. "పాటలు రాసుకుంటావో – పాఠాలు చెబుతావో తేల్చుకో" అని ఆయనను ఒక వి.సి. అన్నారనీ, సినిమా పాటల రచనకై తరుచుగా మద్రాసు వెడుతూ ఆయన తరగతులను అలక్ష్యం చేశారన్న మాట సరికాదు. నేరుగా మద్రాసు నుండి విమానం దిగి ఆయన పాఠం చెప్పడానికి వచ్చిన సందర్భాలున్నాయి. మేము ఎం.ఏ లో వుండగా ఒకసారి అలా నేరుగా తరగతికి వచ్చి ప్రయాణ బడలిక వల్ల తలనొప్పిగా వుండడంతో మమ్మల్నందరినీ 'కవిత్వమంటే కబుర్లు కావు' అనే అంశం ఇచ్చి ఏదో ఒకటి రాయమన్నారు. అని ఊరుకోలేదు. విద్యార్థులం మేం రాసిన ఆ రచనలన్నీ ఇంటికి పట్టుకెళ్లి చదివి మరునాడు తరగతిలో అందరికీ వారి రచనపై ఓ చక్కని విశ్లేషణగా వ్యాఖ్య రాసి మరీ ఇచ్చారు. 'కవిత్వాన్ని గురించి కవితాత్మకంగా చెప్పిన రచన' అని నా వ్యాసం మొదటి పుటపై రాశారు.

అసలు ఎం.ఫిల్‌లో నా పరిశోధనాంశంకు ప్రేరణ సి.నారాయణరెడ్డి గారే. సినారె 'మంటలు – మానవుడు' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిన సందర్భంగా నవోదయ సంస్థ పక్షాన డా॥జి.వి.సుబ్రహ్మణ్యంగారు ఒక సెమినార్ నిర్వహించి 'చైతన్యశిఖరం' పేర 1975 లో వ్యాస సంపుటి ప్రచురించారు. సెమినార్‌లో పాల్గొని నేను సమీక్షావ్యాసం రాసిన అంశం 'మంటలు–మానవుడులో ఇమేజరీ'. 'ఇమేజరీ' అనే ఆ భావచిత్రాలనే నా ఎం.ఫిల్ పరిశోధనకు 'అభ్యుదయ తెలుగు కవిత్వంలో భావచిత్రాలు' అని విస్తరింపచేసి ఎం.ఫిల్ పట్టా పొందాను. అందుకు సినారె యే ప్రేరణ. 1978 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం డా॥ సి.నారాయణరెడ్డి గారికి 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చినప్పుడు సితార సినీ వారపత్రికలో ఆయన గూర్చి రాసిన వ్యాసం చదివి సంతోషించి ఎంతగానో అభినందించారు.

తలచినకొద్దీ ఇలా ఊరే స్మృతులు ఎన్నని చెప్పేది. కుదించి మరికొన్ని మాత్రం చెప్పక తప్పదు. ఆకాశవాణిలో 1978 లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా చేరి ఆపై 1990 లో కార్యక్రమనిర్వహణాధికారిగా పదోన్నతి పొందాను. ఆకాశవాణి కవిసమ్మేళనాల్లో సినారె పాల్గొనకపోతే నిండుదనం ఎక్కడ? కార్యక్రమ

నిర్వహణాధికారిగా పదోన్నతిపై ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో పనిచేస్తున్నప్పుడు సినారె విజయవాడ రాగా విశ్వనాథ శతజయంతి సందర్భంగా వారి ప్రసంగం రికార్డు చేయడమూ, అలాగే వారితో మరోమారు ఒక ఇంటర్వ్యూ ప్రసారం చేయడమూ వారికీ బాగా గుర్తే! 1995 లో నేను హైదరాబాద్ ఆకాశవాణికి తిరిగి వచ్చి తెలుగు విభాగం కార్యక్రమాల నిర్వహణాధికారినయ్యాను. ప్రతియేటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి నిర్వహించే సర్వభాషా కవిసమ్మేళనంలో ఏదో ఒక భాష కవితకు విధిగా సినారె గారి తెలుగు కవితానువాదం మేము కోరడం, ఆయన అద్భుతంగా చేసి ఆయన రసవద్గళంలో రికార్డు చెయ్యడమూ ఆనవాయితీయే! కళాభవన్‌లోని వారిని స్వయంగా కలిసి, ఓ రెండు మూడు భాషల మూల కవితలు ఇంగ్లీష్, హిందీ అనువాదాలతో బాటు తీసుకువెడితే, తన హృదయానికి దగ్గరగా వుండేది ఒకటి ఎన్నుకుని అనువాదం చేసేవారు. ఏ సింధీ భాషదో, ఉర్దూ భాషదో గజల్ అయితే రానురాను ఆయనకు మరీ ఇష్టంగా ఉండేది.

అన్నింటికన్నా నాకు మరపురాని అనుభూతి – నా పదమూడవ ఏట వారి ఏ 'ఋతుచక్రం' కావ్యం చదివి పరవశించానో, అదే 'ఋతుచక్రం' కావ్యాన్ని ఆసాంతం నా ఆధ్వర్యంలో డా॥సి.నారాయణరెడ్డిగారి గళంలో కావ్యగానంగా రికార్డు చేసి ధారావాహికగా ప్రసారం చేసే అవకాశం లభించింది. ఏ ఆదివారమో రికార్డింగుకని ప్రత్యేకంగా వచ్చి ఆయన సమయం వెచ్చించిన సందర్భాలున్నాయి. అలాగే పరిషత్తు అధ్యక్షులుగా ఆయన యువకులకు రచనా శిక్షణా శిబిరాలు నిర్వహించినప్పుడు రేడియోరచన వంటి అంశాన్ని కూడా చేర్చి, నన్ను పిలిని ప్రసంగింపచేసేవారు.

ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ హైదరాబాద్ కేంద్రాన్ని సందర్శించడానికి వస్తున్నారని తెలిసిన ఒక సందర్భంలో నగరంలోని ప్రముఖులతో ఒక భేటీ ఏర్పరచాలన్న సంకల్పంతో అప్పటి మా హైదరాబాద్ ఆకాశవాణి డైరెక్టర్ శ్రీ వి.వి.శాస్త్రిగారు నన్ను డా॥సి.నారాయణరెడ్డి గారికి ఫోన్ చేసి రమ్మనమని చెప్పమన్నారు. నేను ఆయనకు ఫోన్ చేశాను. విషయం చెప్పగానే 'ఏం మాట్లాడుతున్నావ్ సుధామా!' అని ఫోన్ పెట్టేశారు. ఆయన గొంతులో ధ్వనించిన కాఠిన్యం నన్ను కంగారు పెట్టింది. ఓ అయిదు నిమిషాల తర్వాత మా టెలిఫోన్ ఆపరేటర్ 'డా॥సి.నారాయణరెడ్డి గారి నుండి మీకు ఫోన్ సార్' అంటూ కనెక్ట్ చేసింది. "సుధామా! నీకు తెలియదేమో చెబుతున్నా విను. నేను రాజ్యసభ సభ్యుడిని. మీ ఆకాశవాణి, దూరదర్శన్ అడ్వైజర్

కమిటీలో హితవరిని. నన్ను కలవాలంటే మీ డైరెక్టర్ జనరల్‌గారే నా వద్దకు రావాలి. ప్రొటోకాల్ అంటూ వుంటుంది” అంటూ, సౌమ్యంగా ఆయనే ఫోన్ చేసి వివరించడం ఎన్నటికీ మరచిపోలేను. మా డైరెక్టర్‌జనరల్ వచ్చినప్పుడు మా డైరెక్టర్ గారు ఆయనను తీసుకుని స్వయంగా సినారె గారి వద్దకు వెళ్లి కళాభవన్‌లో కొంత సమయం వెచ్చించడం జరిగింది.

అలాగే నారాయణరెడ్డి గారికి ఆకాశవాణి అంటే ఎంతో అభిమానం. రాజ్యసభలో స్వయంగా ‘అయామ్ బార్న్ ఇన్ ఆల్ ఇండియా రేడియో – యాజ్ ఎ పొయెట్’ అని ప్రకటించుకున్నారు. ఆయన ఆకాశవాణికి రాసిన లలిత గీతాలు, సంగీతరూపకాలు లెక్కకు మిక్కిలిగా వున్నాయి. ‘రామప్ప’ సంగీత రూపకం గొప్ప పేరు తెచ్చి పెట్టింది. అలాగే “ఈ నల్లని రాలలో ఏ కన్నులు దాగెనో ఈ బండల మాటున ఏ గుండెలు మ్రోగెనో” అనే ‘అమరశిల్పి జక్కన్న’ చిత్రంలోని పాట తొలుత ఆకాశవాణిలో లలితగీతంగా ప్రసారమై ప్రాచుర్యం పొందినదే. రేడియోలో పిల్లల కార్యక్రమాలకు  కూడా ఆయన ఆప్యాయంగా రచనలు చేసి ఇచ్చారు. నా శ్రీమతి ఎ.ఉషారాణి ఆకాశవాణిలో స్త్రీలు, పిల్లల కార్యక్రమ అధికారిగా వున్నప్పుడు ‘నా చిన్నప్పుడు’ శీర్షికన పెద్దల, పిల్లలతో సంభాషణగా కార్యక్రమం ధారావాహిక చేసినప్పుడు సినారె స్వయంగా స్టూడియోకి వచ్చి బాలానందం పిల్లలతో తన చిన్ననాటి ముచ్చట్లను పంచుకున్నారు.

కనీసం ఒక పాతిక వారాల పాటు ధారావాహికగా ఆయన సమగ్ర జీవిత కథను ఆయన నోటనే ప్రసారంచేయాలనుకున్నప్పుడు మొదట అంగీకరించారు గానీ తరువాత ఎందుకో వద్దన్నారు. కానయితే ఆర్కైవల్ రికార్డింగుగా ఓ నాలుగు గంటల సుదీర్ఘ జీవనపరిచయం కార్యక్రమం శ్రీ తిరుమల శ్రీనివాసాచార్య ఇంటర్వ్యూ చేయగా డా॥సి.నారాయణరెడ్డి గారితో చేసి ఆకాశవాణిలో భద్రపరచడం జరిగింది.

ఓ మారు స్టూడియోకి వచ్చినప్పుడు ‘ఎవరో ఒక లేడీ అనౌన్సర్ సాయంత్రం నాలుగు గంటలకి, రాత్రి ఎనిమిది గంటలకి అంటోంది. కికి అంటే బాగులేదు. నాలుగు గంటలకు, ఎనిమిది  గంటలకు అని కు, కు అనమను. కోయిలలా వినడానికి బాగుంటుంది’ అని సూచించారు. వయోభారం పై పడ్డాక కేవలం గత నాలుగైదు సంవత్సరాల నుండే జాతీయ కవి సమ్మేళనం  కవితానువాదాలకు వారు దూరంగా వున్నారు.

ఆకాశవాణి నుంచి 2008 లో నేను స్వచ్ఛంద పదవీ విరమణ చేశాక అనేక సాహిత్య సభలలో వారితో పాల్గొనే అవకాశాలు లభించాయి. నా అధ్యక్షతలో వారు ముఖ్య అతిథిగా వచ్చి పాల్గొన్న సమావేశాలున్నాయి. అలాగే ఒకేసారి వారు ఒకేరోజు  రెండు సభలలో పాల్గొనవలసి వుంటే, నేను  పాల్గొంటున్న సభ నుంచి నిష్క్రమించవలసిన  సమయంలో కూడా 'సుధామ రేడియోవాడు. ఎంత సేపు ప్రసంగించాలో, క్లుప్తంగా ఎలా మాట్లాడాలో తెలిసిన వాడు. తను మాట్లాడాక వెడతాను' అంటూ నా ప్రసంగం అయ్యేదాకా వుండి, విని వెళ్ళిన సందర్భాలు ఎలా మరువగలను. ఆయన ఆత్మీయత అలాంటిది!

గురజాడ 150 వ వర్ధంతి సందర్భంగా గత ఏడాది వేదగిరి కమ్యూనికేషన్స్ రాంబాబు చొరవతో శతాధిక కవుల కవితాసంకలనంగా నా సంపాదకత్వంలో 'అక్షర' కవితా సంకలనం ప్రచురణకు, గురజాడపై వారు గతంలో రాసిన కవిత చేర్చుకునేందుకు ఫోన్ చేయగా, అనుమతినిచ్చి సంకలనాన్ని అభినందించారు. సంకలన ప్రతిని త్యాగరాజగానసభలో  ఆయనకు స్వయంగా అందిస్తూ కృతజ్ఞతలు చెప్పినప్పుడు కారులో కూర్చుని ప్రతిని అందుకుంటూ 'అంత గట్టిగా చెప్పక్కర్లేదు. నాకేమీ  చెముడు లేదు' అని సున్నితంగా అనడమే ఆయనతో నా చివరి భాషణం అనుకుంటాను. ఆ తరువాత ఒకటి రెండు సభలలో ఆయనను చూశాను.

2017 జూన్ 15 శ్రీశ్రీ 34వ వర్ధంతి సందర్భంగా నంద్యాలలోని సూరన సాహితీ సమితి వారు 'ఆధునిక కవిత్వం – శ్రీశ్రీ' అనే అంశంపై 11 జూన్ ఆదివారం సాయంకాలం  నా ఉపన్యాసం ఏర్పాటు చేయగా వెళ్లి ప్రసంగించాను. 12 వ తేదీ సోమవారం ఇక బయలుదేరవలసి వుండగా వార్త దినపత్రిక వారు సినారె గురించి ముఖచిత్ర కథనం ఆదివారం సంచికకు రాయమని కోరుతూ ఫోన్ చేసినప్పుడే సినారె మరణవార్త గురించి తెలిసి దిగ్భ్రాంతి చెందాను. ఆ సాయంకాలం ఇల్లు చేరగానే చేసిన పని ఆంధ్రభూమి దినపత్రిక వారి అభ్యర్థన మేరకు మరునాటి సంచికలో ప్రచురణకై సినారెకు నివాళి వ్యాసం, ఆపై వార్తకు ముఖచిత్ర కథన వ్యాసం రాయడమే.

13 మంగళవారం ఉదయమే విహారిగారితో, నా శ్రీమతితో కలిసి ఉప్పలగూడ దగ్గర గల వారి గృహానికి వెళ్లి కీర్తిశేషులు డా॥సి.నారాయణరెడ్డిగారి

పార్థివ శరీరాన్ని దర్శించుకుని శోకతప్తహృదయుడినయ్యాను. సినారె పెద్ద కుమార్తె శ్రీమతి గంగ గారినే పలకరించి వేదన కొంత దించుకున్నాం.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖరరావు గారు ఒక పెద్ద కుమారునిలా, దివికేగిన మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి అంత్యక్రియలు మహాప్రస్థానంలో స్వయంగా దగ్గరుండి నిర్వర్తించిన చారిత్రక ఘట్టం మరునాడు టీవీ ఛానల్స్‌లో చూస్తూ ఆర్తితో కన్నీటి పర్యంతమయ్యాం.

సినారె మరణంతో ఒక శకం ముగిసినట్లయింది.

"ఇప్పటి నా దృశ్య జీవితం
కొన్నేళ్ళకు తెర మరుగైపోయినా
నేను జీవిస్తూనే వుంటాను
కాలమనే కావ్యంలో చెక్కిన అక్షర శిల్పంలా"
(కలిసి నడిచే కలం)

విశ్వంభరా కవికి ఇది సుధామయ స్మృతికిణాంకం! ✻

**(పాలపిట్ట మాసపత్రిక, జూలై' 2017)**

# (53) సాహితీ కంఠాభరణం సినారె

**నా**టికీ నేటికీ యువతకు ఆహ్లాద పతాక, నవ్య కవితా ప్రతీక, సాహితీ రంగ అంతరంగాలను ఎదపొరలను ఆవిష్కరించినట్లు ఆవిష్కరించగలిగే విజ్ఞులు, రసజ్ఞులు, అసమాన గేయకవితా ధురీణుడు, వచనకవితా వికాసలహరి డాక్టర్ సి.నారాయణరెడ్డి. 'సింగిరెడ్డి' ఇంటిపేరే గానీ కవిత్వపు సింగిడి సినారె. తెలుగు సాహిత్య మేరునగం. పాఠం చెప్పినా, పాట రాసినా విద్యారంగాన్ని, సినిమా రంగాన్నీ తనదైన ముద్రతో వైభవ ప్రాభవాలు కూర్చి 'భళారే సినారే' అనిపించుకున్న అజాత శత్రువు. సాహిత్యమే మూలకందంగా భారతదేశపు అత్యున్నత రాజ్యసభ సభ్యునిగా కూడా రాణించి, ఆ నిధులతో సాహిత్యపు పెన్నిధులను సమకూర్చిన వాడాయన. నేటి తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షునిగా ఆమరణాంతం, సాహిత్య భాషా సేవా పరాయణునిగా రాణకెక్కిన 'విశ్వంభర' కవి.

'ఆకాశవాణి'లో లలితగీతాలతో, సంగీతరూపకాలతో కవితలతో, ప్రసంగాలతో తొలినాళ్ల నుండి కవిగా వినుతికెక్కిన 'అయామ్ బార్న్ ఇన్ ఆల్ ఇండియా రేడియో యాజ్ ఎ పొయెట్' అని పార్లమెంటులో స్వయంగా ప్రకటించిన వారాయన. ఆయన చేత తమ పుస్తకం ఆవిష్కరింపచేసుకోవాలని తపించని యువకవి లేడంటే అతిశయోక్తి కాదు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఉపన్యాసకునిగా వందలాది మంది శిష్యులను తయారుచేసి, తెలుగు విశ్వవిద్యాలయానికి తాను ఉపకులపతిగా సేవలందించడమే కాక, ఎంతో మంది శిష్యులకు దిశానిర్దేశం చేశారు. ఆయన తరగతి గదిలో తెలుగు పాఠం చెబుతుంటే ఇతర శాఖల విద్యార్థులు కూడా వారి ఉపన్యాసం వినడానికి ఎగబడేవారు. హైదరాబాద్ సాహిత్య సాంస్కృతిక వికాసానికి మూలాధారనాడి సినారె సభలో ఉండాలని అభిలషించని సాహిత్యసంస్థ లేదు. అనునిత్యం ఒకటి, రెండు సభలకు విధిగా హాజరుకావలసిన గౌరవ ప్రపత్తుల విధాయకతను ఆయన పొందారు. తన జన్మదినం జూలై 29 అంటే చాలు ఒక కొత్త

కవితా సంకలనం తనది వెలువరించడమే అసలైన పుట్టినరోజుగా ఏటికేడాదిగా ఎదిగిన సాహిత్యపు 'జ్ఞానపీఠం' ఆయన.

సాధారణంగా విశ్వవిద్యాలయాల సిద్ధాంత గ్రంథాల్లో పరిశోధనలు చేసిన వారికి డాక్టరేట్ పట్టా రావడంతోనే మరుగున పడతారు. గానీ సి.నారాయణరెడ్డిగారికి డాక్టరేట్ సంతరించి పెట్టిన ఆయన సిద్ధాంత గ్రంథం 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయము-ప్రయోగములు' నేటికీ సాహిత్య విద్యార్థులకే కాదు, సాహిత్యాభిలాషులందరికీ కూడా పఠనీయమైన గ్రంథంగా నవనవోన్మేషంగా ఉంది.

**జన సమ్మోహనం..**

ఆయన మాట-పానుగంటి పరిభాషలో మనం మలుచుకుంటే 'మాటయన్న మాటయా-మాణిక్యముల మూట-మౌక్తికముల పేట-మకరంద ప్రవాహపు తేట. జిగికి జిగి, బిగికి బిగి, ఎదురెక్కునకెదురెక్కు-ఎన్ని వగలు-ఎన్ని హొయలు-ఎన్ని వన్నెలు-ఎన్ని ఒద్దికలు' అన్నట్లుగా ప్రాసలతో విలాసహాస వయ్యారాలతో భాషించే వ్యక్తి సినారె.

సినిమాపాటకు సాహిత్య గౌరవాన్ని నిలిపిన కవికలాల్లో ప్రథమ శ్రేణిలో పేర్కొనదగిన సినీ కవిగా రాణించాడాయన. 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని!' అని ఆయన పాటను సంభావించని శ్రోతంటూ లేడేమో! దాన వీర శూర కర్ణ చిత్రంలో 'చిత్రం భళారే విచిత్రం' అంటూ ప్రతినాయకుడైన మహాభారత విలన్ దుర్యోధనుడికి ప్రేమగీతం రాసి మెప్పించిన ప్రజ్ఞ ఆయనదే మరి!

పెద్ద మర్రిచెట్టు నీడలో పిల్ల మొక్కలు బతకవు అన్న మాటను పరాస్తం చేస్తూ, తాను ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎన్ని పదవులదిష్టించినా, పద్మభూషణ్ లాంటి అత్యున్నత ప్రభుత్వ గౌరవాలు బడసినా, కొత్తగా కలం పట్టిన కుర్రకవిలో లేశమైన ప్రతిభవున్నా గుర్తించి భుజం తట్టి ప్రోత్సహించి, అద్యతన భావిలో వారూ ఉత్తమ కవులు కావడానికి కొండంత అండగా ప్రోత్సహించిన సౌజన్యమూర్తి సినారె. ఎవరు ఏ పుస్తకం పంపించినా పోస్టుకార్డు మీదయినా సరే వెంటనే ప్రతిస్పందన రాసి పంపే గొప్ప లక్షణం ఆయన సొంతం.

ఆయన జీవించిన కాలంలో జీవించడం, ఆయన దగ్గర ఎం.ఏలో, ఎం.ఫిల్‌లో నేరుగా విద్యను శిష్యునిగా నేర్వగలగడం అదృష్టంగా గల నాబోంట్లు ఎందరెందరో! పదవ తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు ఈ సుధామ పుట్టినరోజు కానుకగా సినారె గారి 'ఋతుచక్రం' గేయ కావ్యాన్ని తండ్రిగారి నుంచి అందుకోవడం జరిగింది. ఆ తరువాతి కాలంలో 'ఆకాశవాణి' హైదరాబాద్ కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా సి.నారాయణరెడ్డిగారిని ఆహ్వానించి వారి గళంలో మొత్తం 'ఋతుచక్రం' కావ్యాన్ని రికార్డు చేయడం ఓ చిరంతన స్మృతి. యువభారతి సంస్థ ద్వారా కూడా వారితో అనుబంధం అధికం. ఇరివెంటి కృష్ణమూర్తి (సినారె సన్నిహిత మిత్రుడు), చక్రవర్తి వేణుగోపాల్, వంగపల్లి విశ్వనాథం గార్లతో బాటు నేనూ కూడి 'యువభారతి' నలుగురి సభ్యుల 'వీచికలు' కవితా సంకలనం నేను వేసిన ముఖ చిత్రంతోనే ఆయనచే ఆవిష్కృతమైనప్పుడు 1972 లోనే 'కవితలో బొమ్మ గీస్తాడు బొమ్మలో కవిత రాస్తాడు' అని ప్రశంసింపబడడం, అలాగే యువమిత్ర లిఖిత పత్రికను అనేక సంవత్సరాలు నా సంపాదకత్వంలో నిర్వహించినప్పుడు 18-1-1974 న ఆయన స్వహస్తాలతో- "నేటి ముద్రిత పత్రికలు ముఖం చూసుకోదగ్గ అద్దం ఈ లిఖిత పత్రిక. ఇందులో పున్నవన్ని శబ్ద చిత్రాలు, చిత్ర శబ్దాలు. 'వోనా కాలం' నా ప్రాణం తీసేసింది - సజీవ రచన. శేముషి+కృషి=సుధామ' అని ప్రశంసాక్షరాలు అందుకోవడం మరుపురానిది.

ఇప్పుడు వోనా కాలం ప్రవేశించిన తర్వాతనే ఆయన అశువులు బాయడం 'వోనాకాలం నా ప్రాణం తీసేసింది' అన్న అక్షరాలను అక్షర సత్యం మరోలా చేయడం నిజంగానే బాధాకరం. ఆయన ఆత్మీయతను, ఆదరణను పొందిన శిష్యగణంలో ఉండడం గొప్ప ఆనందదాయకం. నా తొలి కవితా సంకలనం 'అగ్నిసుధ' కు 1990 లో కలహంసి అవార్డును, అలాగే నా 'సం.సా.రా.లు' వ్యాస సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం 2004 లో ఆయన సమక్షంలోనే స్వీకరించడం జరిగింది. వారు ముఖ్య అతిథిగా వచ్చిన పలు సాహిత్య సభలకు అధ్యక్షత వహించే భాగ్యం కలిగింది.

అలాగే ఒకేరోజు రెండు సభల్లో ఆయన పాల్గొనవలసివున్నప్పుడు కూడా 'సుధామ మాట్లాడాక వెడతాను' అని ప్రేమగా, ఆత్మీయంగా ఆయన వ్యవహరించిన

సందర్భాలు ఎలా మరిచిపోయేది? ఏటా విడుదల చేసిన ఆయన 'కవితా సంకలనాన్ని' ఆయన సంతకంతో పోస్టులో అందుకున్న అదృష్టం సాగుతూనే వచ్చింది. పుస్తక సమీక్షలు పలు పత్రికల్లో చేసిన నేను, సినారె మనుమరాలు వరేణ్య ఆంగ్ల కవితలకు తాతగారు సినారె తెలుగు చేసిన కవిత్వ పుస్తకాన్ని సమీక్షించిన తీరుకు సినారె గారి పెద్ద అమ్మాయి శ్రీమతి గంగ ఫోన్ చేసి అభినందించిన సందర్భమూ గుర్తుంది. సినారె తెలుగువారి జ్ఞానపీఠం. విశ్వనాథ తరువాత దానినందుకున్న ఏకవీరుడాయనే! రావూరి భరద్వాజ ఆ తరువాత. ఇప్పుడు ముగ్గురు జ్ఞానపీఠులూ అస్తమించారు. వారి ముగ్గురితో సన్నిహితంగా సంచరించగలిగిన మధుర స్మృతి మిగిలింది. ఎందరో కవులు కావడానికి స్ఫూర్తి దాయకం అయిన కవికుల గురువు సినారె. తెలుగువైభవ ప్రాభవాలకు గొప్ప దారిదీపంగా నిలచిన మహనీయుడు సినారె. ఆయన కలం, గళం శాశ్వతంగా అస్తమించాయి. కానీ ఆయన కవిత్వ దీపం వెలుగుతూనే ఉంటుంది. ✻

**(ఆంధ్రభూమి 13 జూన్' 2017)**

# (54) సామాన్యుల 'మాన్యకవి' కుందుర్తి

ఇప్పుడు ఆయనను గురించి ఎందరు తలుచుకుంటున్నారంటే కచ్చితంగా చెప్పలేము!

వచన కవితను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్లింది ఆయనే. వచన కవితలో కథాకావ్యాలు రావాలని కలలుగన్నదీ ఆయనే. సామాన్యుడికి కూడా కవిత్వం అర్థంకావాలని తపించింది ఆయనే.

తెలుగు కవిత్వంలో ఆయనది తనదైన ముద్ర వుంది. సాహిత్య చరిత్రకారులు ఆయనకు నేడు ఇవ్వవలసినంత చోటు కల్పించారో లేదోగానీ, 'వచనకవితా పితామహుడు ' అనిపించుకున్నవాడాయనే. అయోమయం, పులుముడు, మార్మికత, సంక్లిష్టత ఏమీ లేకుండా హాయిగా మాటాడుకున్నంత పొయిటిక్‌గా, దాన్ని కవిత్వం కాక వచనం అనీ, అంత్య ప్రాసలకేళి అనీ కొందరు భావించినా, కొరుకుడుపడని కవిత్వం కన్నా- హాయిగా ఆస్వాదించగల వచన కవిత్వంలో - అది అందమైన వచనమే అన్పించినా 'నయమే' అని విశ్వసించి, తాను 'ఫ్రీవర్స్' మార్గంలో 'ఫ్రంట్'న నిలిచి ఎందరినో నడిపించినవాడాయన.

'తెలంగాణ' మీద 1949 లోనే కావ్యరచన చేసి, 1953 లో పూర్తిచేసి, కర్నూలులో వుండగానే పుస్తకరూపంలో వెలువరించి 'తెలంగాణ'కు తొలిసారి కావ్యత్వం సిద్ధింప చేసిందాయనే! అంతకుముందే తొలి అభ్యుదయ కవితా సంకలనం అనదగిన 'నయాగరా' ను ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి 1944 లో ప్రకటించిందీ, 'నయాగరా' కవులుగా 'ఫ్రీవర్స్ మానిఫెస్టో' ప్రచురించిందీ ఆయనే! ఆయనే - కుందుర్తి ఆంజనేయులు.

**"క్రమ క్రమాగత**
**చైతన్య ధనుష్ప్రాణులు ప్రజలు నేడు**
**సమాజ సమష్టి ప్రయోజన**
**నిశాదబాణులు ప్రజలు నేడు"**

అంటూ ప్రజాస్వామ్యానికీ, ప్రజా విజయాలకూ పెద్దపీట వేశాడాయన. సరళంగా, సుందరంగా, ఆలోచనాత్మకంగా వచన కవిత రాయవచ్చని నిరూపించి

– విశ్వనాథ, కరుణశ్రీవంటి వారిని సైతం మెప్పించి, వారుకూడా అలా ఒక్కటైనా రాసేలాచేసి, పత్రికల ద్వారా, అకాశవాణి ద్వారా 'ఫీవర్స్' కు ప్రాచుర్యం తేవడానికి ఆనాడు అవిరళ కృషి చేసింది కుందుర్తిగారే!

హైదరాబాద్ మలక్‌పేట్ కాలనీ ఎమ్.సి. 15 ఇంట్లో–ఇంటి ముందు వసారా గట్టుమీద కూచున్న ఆయన రూపం ఇప్పటికీ నా కళ్లకు కడుతుంది. విద్యార్థిగా ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాలలో చదువుతున్న నేను సరిగ్గా వారింటిముందు రోడ్డు వద్ద బస్టాండుకే వచ్చి బస్సెక్కేవాడిని. అలాంటప్పుడు పలుమార్లు వారి పలకరింపులకు నోచుకున్నవాడినే! 'కృష్ణా పత్రిక', 'ప్రజామత' లలో ఛందోబద్ధంగా పద్యాలు రాసే వాడిని నేనుకూడా. వచన కవితవైపు బలీయంగా ఆకర్షింపబడడానికి శ్రీశ్రీ ఆవహించి వున్న ఆ యవ్వన దశలో, కుందుర్తిగారూ ప్రేరకులే! ఇవాళ వివిధ పత్రికలలో వెయ్యికిపైగా పుస్తక సమీక్షలు చేశానంటే, మొదటిసారి ఆయన ఆ ఇంటి అరుగుమీదకే నన్ను పిలిచి, ఆయన సంపాదకత్వం వహిస్తున్న 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికలో మొదటిసారిగా 'చిత్రప్రకృతి' అనే పెద్దిబొట్ల రామచంద్రరావు కావ్యంపై గ్రంథసమీక్ష చేయవలసిందిగా పుస్తకం ఇచ్చి రాయించి, నవంబర్ 1970 సంచికలో ప్రచురించారు. 1967 లో తొలి కవిత రాసిన నేను, మూడేళ్లకే సమీక్షకునిగా మారానంటే నా చేత ఆ పని చేయించిన కుందుర్తిగారిదే ఆ క్రెడిట్. ఆయన ప్రోత్సాహాన్నందుకున్న వారెందరెందరో!

జంటనగరాల్లో ఆరోజుల్లో జరిగే కవిసమ్మేళనాల్లో యువకవులుగా శివారెడ్డి, నేను, గులాంయాసిన్, గంధంజోయల్ ప్రభృతులం దివాకర్ల, ఉత్పల, శేషేంద్ర, శశాంక, అరిపిరాల, ముదిగొండ వీరభద్ర శాస్త్రి, కుందుర్తి ప్రభృతులతో పాల్గొంటుండేవాళ్లం. కుందుర్తి గారు యువకవుల భుజం తట్టి ప్రశంసించేవారు.

1922 డిసెంబర్ 16 న గుంటూరు జిల్లా కోటవారిపాలెంలో పేద కుటుంబంలో ఒక్కడే అబ్బాయిగా జన్మించిన ఆయన ఎనిమిది నెలల వయసులోనే తండ్రిని పోగొట్టుకున్నారు. మాతామహస్థానం వినుకొండలో విద్యనేర్చే రోజుల్లో 13 ఏళ్ల కుర్రాడిగా మాధ్యమిక పాఠశాలలో తెలుగు పండితులు గుర్రం జాషువా 'ఫిరదౌసి'కి శ్రోత అయ్యారు. 1937 లో తొలి సారిగా పద్యరచన చేశారు. విజయవాడ రామమోహన గ్రంథాలయంలో నాడు జరిగిన జపాన్ వ్యతిరేక పద్య పఠనంలో కుందుర్తి తొలిసారి వేదిక ఎక్కారు! విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో విశ్వనాథగారి

ప్రభావంతో ప్రాచీన కావ్యాలు గాఢంగా చదివి, 'సౌప్తికం' అనే పద్యకావ్యం, రసధుని, అమావాస్య, నా ప్రేయసి వంటి భావకవితా రచనలు చేశారు. విద్యార్థి సంఘంలో పనిచేస్తూ కార్యదర్శి పదవికి ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకుడు మాకినేని బసవపున్నయ్యతో పోటీచేసి ఓడారు. గుంటూరు ఏ.సి.కాలేజ్‌లో 1941-43 లో బి.ఏ చదివారు. నర్సారావుపేటలో నవ్యసాహిత్య పరిషత్‌కు పోటీగా ఏల్చూరి ప్రభృత యువకులతో నవ్య కళాపరిషత్తు స్థాపించి, ఆ సాహితీ సంస్థ అధ్యక్షులయ్యారు. 1942 లో కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావాలకు లోనై, చివరి వరకూ ఆ భావజాలంతోనే కవితారంగంలో కృషి చేశారు! తెనాలి తాలూకా రేవేంద్రపాడులో ఒక రెసిడెన్షియల్ స్కూల్లో ఆంగ్లోపాధ్యాయునిగా, కొంతకాలం ప్రిన్సిపాల్‌గా చేసిన కుందుర్తి-1946-48 మధ్య గుంటూరు టుబాకో మార్కెట్‌లోనూ పనిచేశారు. 'ప్రజాశక్తి' పత్రికలో రచనలు చేశారు. 1956 లో గుంటూరు ఉద్యోగానికి రాజీనామా చేసి, కర్నూలులో రాష్ట్ర సమాచార శాఖలో అనువాదకులుగా చేరారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి హైదరాబాద్ రాజధాని కావడంతో హైదరాబాద్ తరలివచ్చారు. 1958 లో 'యుగే యుగే' కవితా సంకలనం వచ్చింది. 1967 లోనే 'ఫ్రీవర్స్ ఫ్రంట్' స్థాపన జరిగింది. 'నగరంలో వాన', 'నాలోని నాదాలు' ఆ ఏడే వెలువడి కుందుర్తిగారికి ఖ్యాతి తెచ్చాయి. 1969 లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి, 1970 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి పొందారు. 1975 లో ఆయనకు పెద్ద ఎత్తున సన్మానం జరిగింది. 'కుందుర్తి కృతులు' పేరిట వారి సర్వ కవితా సంకలనం, అభినందన సంచిక వెలువడ్డాయి. 1977 లో మచిలీపట్నం 'స్పందన సాహితి' కుందుర్తి పీఠికలు గ్రంథంగా వెలువరించింది. ఆయన కృతులపై హైదరాబాద్ శ్రీనివాస సాహితీ సమితి 'అడుగు జాడలు' సమీక్షావ్యాసాలు ప్రచురించింది. 1977 డిసెంబరులో ఉద్యోగ విరమణ చేసిన కుందుర్తి 1982 అక్టోబర్ 25 న ఆకస్మికంగా మరణించారు.

ఇవాళ 'సామాన్యుడి కోసం కవిత్వం', 'కవిత్వంలో సామాన్యుడు' అనే మాట ఏదివచ్చినా - ప్రథమంగా గుర్తు చేసుకోవలసిన అపురూప వ్యక్తి, కవీ 'కుందుర్తి ఆంజనేయులు'. వచన కవితా ప్రక్రియ వ్యాప్తికి 'కుందుర్తి' నాటిన విత్తులే ఈనాడు శాఖోపశాఖల మహావృక్షాలుగా ఎదుగుతున్నాయనాలి. ఆయన 'కవితాపథం' జనజీవన మమేకమయ్యే కవులకు అనుసరణీయం. *

**(నది వారం వారం వారపత్రిక 6 ఆగస్టు' 2010)**

# (55) నిర్భయ కవి రంధి సోమరాజు

ఆధునిక సంస్కృతి కారణంగా మనుష్యులమధ్య ఆత్మీయతలకూ, బాంధవ్యాలకూ, సహజంగా వుండవలసిన మానవసంబంధాలకూ వ్యవస్థ ఎలా దూరమైపోతుందో, డబ్బు, అధికారం సంఘజీవితంలో ఆత్మీయ వ్యక్తుల మధ్యనే ఎలాంటి మార్పు తెస్తుందో, హృదయాలే ఎలా కలుషితమైపోతాయో పంతొమ్మిది వందల యాభై ప్రాంతాలలోనే కవితలుగా వెలయించిన కవి రంధి సోమరాజు. అంతేకాదు! మొట్టమొదటిసారిగా కవిత్వాన్ని మాండలీకపు సొగసులతో నిర్మించిన కవి కూడా రంధి సోమరాజు. గోదావరి ప్రాంతపు పామరజనం యాసలో రమణీయ కవితను పలికినవాడు. అన్నిటికన్నా ముఖ్యంగా నిర్భయంగా, నిర్మొహమాటంగా తెలుగుకవిత్వాన్ని తాను నడిపిస్తున్నానన్న శ్రీశ్రీనే నిలదీసి ఎదగవలసింది కవులు కూడానని కుండబద్దలు కొట్టినట్లు కవిత్వంరాసి శ్రీశ్రీ వీరాభిమానుల చేత అణచివేయబడినవాడైనట్లయిన కవి రంధి సోమరాజు.

రంధి సోమరాజు అనే కవిని 'విరిగిన కల్చర్' తో సాహిత్య ప్రపంచమూ విస్మరించిందనిపిస్తుంది. మూడురోజుల సంక్రాంతి పండుగ పోతూపోతూ ఈ ఏడాది కవి రంధి సోమరాజును తీసుకుపోయింది. విశాఖపట్నంలో తను అస్తమించాడని శీలా వీర్రాజు ఫోన్‌చేసి చెప్పేకే తెలిసింది. నిజం చెప్పద్దూ! ఆయన బ్రతికున్నాడన్న విషయమూ కొన్నేళ్లుగా చాలామందికి తెలియదు. శారీరకంగా వున్నా మానసికంగా, బౌద్ధికంగా అయిదారేళ్లుగా ఆయన అస్వస్థతతో వున్నట్లే వున్నారు. తన అనంతమైన ఆలోచనల అగరువత్తులు వెదజల్లే సువాసనల నదీ జలాలలో పాఠకులు మానవతా తీరాలు చేరగలరని ఆశిస్తూ, వారి మన్ననలకు పాత్రుడను కాగలననే విశ్వాసంతో 1966 లో వచన కవితాసంపుటి 'విరిగిన కల్చర్' పుస్తకంగా వెలువరించారు. కవిగా, కథకుడిగా, నాటకకర్తగా, నవలాకారుడిగా ఆనాడు తెలుగు సారస్వత లోకంలో ఆయన ప్రసిద్ధుడూ, వివాదాస్పదుడు కూడాను. 'ఈ మనిషి ఈ లోకం', 'ఉన్నతాశయాలు', 'దేవుడైన మానవుడు', 'నేనేమి చేశాను' 'సోమరాజు కథలు'

మొదలైన కథా సంపుటాలు 'రతనాల తంద్రి' మొదలైన గేయ నాటికలూ, 'దు:ఖితులు', 'ఆదర్శాలు అవరోధాలు', 'సౌందర్యము సౌశీల్యము' మొదలైన నవలలూ, 'విరిగిన కల్చర్', 'ఎదగండి', 'బూర్జువా పెళ్ళికూతురు', 'పొద్దు'; 'సిన్నమ్మ వచ్చింది', 'రోజీ' వంటి వచన కవిత, కథాకావ్య సంపుటులూ వారి రచనల్లో కొన్ని.

ముఖ్యంగా 'పొద్దు' – మాండలికంలో వెలువడిన కవితా సంపుటిగా తొలిగా ఆయనకు పేరు తెచ్చింది. 'బూర్జువా పెళ్ళికూతురు' కథాకావ్యం. అలాగే 'రోజీ' కూడాను. ఆయన అక్షరాల వెనుక భావతీవ్రత చాలా బలీయమైనది. దానిని తట్టుకోవడం చాలామందికి అందునా సాటి కవులకు కష్టమైంది. 1970 లో శ్రీశ్రీకి షష్టిపూర్తి సన్మానం జరిగినప్పుడు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కాళోజీ అధ్యక్షతన జరిగిన ఫిబ్రవరి రెండో తేదీ కవిసమ్మేళనంలో రంధి సోమరాజు శ్రీశ్రీపై చదివిన కవిత పెద్ద దుమారమే రేపింది. పురిపండా వారు దానిని వైశాఖి పత్రికలో ప్రచురించారు. కవిత్వ ప్రపంచంలో అది 'పెద్ద పెద్ద కబుర్లు' అనే కవితగా పెద్ద పెద్ద ప్రకంపనలే రేపింది.

'అయ్యేల రాలెత్తిన కూలీలెవ్వరని / జాబితాలడిగావ్ / నువ్వు రాసి తగలేసినావేటి / నీ పుత్తకాల మీద / వోడు కంపోజు సేసినాడో / వోడు దిద్దినాడో / ఆ బక్కోల పేర్లు"

అని ప్రశ్నిస్తూ...

"పార్టీకిచ్చేయకుండా / సొంత బుక్కులచ్చేసుకుని / పద్దెనిమిది పేజీలే / పద్దెనిమిది పర్వాలన్నోడివి..." అని శ్రీశ్రీనే సూటిగా అన్నాడు.

"ఇడి ఇడిగా అంతా దొంగలం / మంది మీద మంచోలం"

అంటూ నినాదాలకీ నిజాయితీకీ గల అంతరాన్నీ, ఆవేశానికీ, ఆలోచనలకీ గల దూరాన్నీ, ఆలోచనకీ ఆచరణకీగల వైరుధ్యాన్నీ ఆత్మవిమర్శగా గమనించి గుర్తించవలసిన అవసరం చెప్పడానికే రంధి సోమరాజు 'పెద్ద పెద్ద కబుర్లు' రాసినా, 'ఎదగండి' అని ఘోషించినా. శ్రీశ్రీని ఈసడించే భావోద్ధృతిని, ధైర్య సాహసాలను కార్మిక కర్షక భాషలో, వారి నుడికార నైపుణ్యంతోనే సోమరాజు కవిత్వీకరించారు. రోణంకి, దాశరథి, కాళోజి, సినారె వంటి వారు కూడా దానికి స్పందించారు.

14.3.70 ని కాళోజీ రంధి సోమరాజుగారికి లేఖ రాస్తూ "... కవిగాడు ఏదో విప్లవానికి మార్గదర్శకుడని, తిరుగుబాటు దారులకు ముందువరుసలో వుండేవాడని పాఠకులు అనుకోవడం, జరిగిన ప్రతి తిరుగుబాటుకు 'నేనే కారకుణ్ణి, నాయకుణ్ణి' అని కవిగాడు అనుకోవడంలోనే వుంది చిక్కు. కవిగాడు కూడా సామాన్య మానవుడేనని వానికి ఏవో భయ సంకోచాలు, తెలివిమాలిన తికమకలూ వుంటాయని ఏదో కాస్త "MOODY" ఫెలో కావడం చేత భావన చేసే శక్తి పదాల పొందికచేసే ప్రతిభ కలిగి అప్పుడప్పుడేదో మాటల నగిషీలు చెక్కుతాడనీ, పనితనాన్ని బట్టే చదివినప్పుడు, విన్నప్పుడు కవిగాడి 'మూడే' పాఠకులను పూనుతుందని నా తలంపు. అంతేగాని ఏదో COMMITMENTS అయ్యి ఇజానికి కట్టుబడిపోవడం, ముఠాలకు ఆత్మార్పణ చేసుకోవడం జరిగితే కవిగాడు కూడా సామాన్యునికన్నా సామాన్యుడై అసలు కవితకే ముప్పు తెస్తాడు. ఎవడేది రాసినా రాసింది ప్రతిదీ మహాకావ్యం కాదు. ఏవో కొన్ని రచనలు వానిలో అక్కడక్కడ ఒకటీ అర పంక్తులు, కవిత రూపుదాలుస్తాయి. ఎవని సంగీతానికీ చింతకాయలు రాలవు. 'శాంతి.. శాంతి' అనీ, 'సత్యమేవజయతి' అనీ వేదకాలం నుంచి అఘోరిస్తూ వచ్చినా, శాంతి కోసం, సత్యం జయించడం కోసం, ఎందరో ఎన్నెన్నో కావ్యగానాలుచేస్తే జరిగిన శాంతిస్థాపన, విశ్వమానవ సౌభ్రాతృత్వము, సహజీవనము– సత్యానికి జయం ఎంతో, నేడు చంపు, నరుకు తిరుగుబడు అనే రచనలు తెచ్చే విప్లవాలు కూడా అంతే..." అని స్పష్టంగా అన్నారు.

రంధి సోమరాజు లాంటి వారి గొంతులు తప్పనిసరిగా గొప్ప నైతిక మానసిక బలాన్నిచ్చేవే. కానీ వాటిని నొక్కే ప్రయత్నాలూ జరగనే జరిగాయి. 'ఎదగండి' కవితా సంపుటి గురించి నార్ల వెంకటేశ్వరరావు గారు ఓ మాట అంటూ "మన జాతి ఎదగడం మానివేసింది. మీరు ఎదగమన్నా అది ఎదుగుతుందన్న నమ్మకం లేదు. కానీ మీ కొత్త కావ్య ప్రచురణతో కవిగారు మాత్రం నిస్సందేహంగా కొన్ని అంగుళాలు ఎదిగారు" అని ప్రశంసించారు. శ్రీశ్రీని ఎద్దేవా చేయడంలోని సబబును గ్రహించిన వారు ఆయన్ను అభినందించారు. జనసమూహాన్ని ఉద్దేశించి ఆవేశంతో కవులు వేదికలమీంచి పలకడం కాదు. జనంలోకి వెళ్లి జనమమేకమై వాళ్ళ కష్టసుఖాలు పంచుకోవాలని గుర్తించక తప్ప(లే)దు.

సంస్కృతీ వికృత రూపాలనూ, దిగుమతి చేసుకుంటున్న విష సంస్కృతినీ, 'దినమొలసోగ్గత్తె' లాంటి ఖండికల్లో రంధి సోమరాజు ఆనాడే ఖండించారు. సామ్రాజ్యవాద సంస్కృతినీ, ఆధిపత్యపు భావజాలాన్నీ ఆనాడే నిరసించారు.

"ఈ రస్యావోలు అమెరికావోలు / యిద్దరూ తోడు దొంగలు / పైకట్టా ఇడి ఇడిగా కాపడతారు / ఆడు జక్కుల్ని మేత్తే / ఈడు కుక్కల్ని మేత్తున్నాడు.

ఆల బలమూ తెలివీ సూసి / ఆల యెనక అడుగులేత్తున్నాం / సేతికందని ఆ సీరలు / నెత్తిమీద అమ్మోరునాగ కూసుని / నెత్తురు పిండేత్తున్నాయ్ / నీ బుర్రలో ఆరె తానాలు సేత్తున్నారు / నిన్ను వూరాతలకి తోలేత్తున్నారు / నీకు నీ పెజలాన్దమే లేదు."

అని ఆర్థిక సంస్కరణల పేరిట మన దేశంలో జరిగిన మార్పులకు ముందే కవిగా, ద్రష్టగా "పోకండొరే పోకండి ఎట్టా తోత్తే అట్టా పోకండి" అని ప్రమాద హెచ్చరికలు చేశాడు రంధి సోమరాజు.

"అసలు నరుక్కుంటే / యెప్పుడు నరుక్కోడమే / మడిసి జల్మెత్తంది / సంపుకోడానికేటి" అని హింసా నిరసనం చేశాడు. విరసం బలీయమౌతున్న ఆ కాలాన– "బుద్ధిగలోడోడుంటే / ఆడొక్కడూ య్యేటి సెయ్యాల / అందర్నీ సంపేసి / ఆడు పాంకొనేదేటి / తెలివున్నాడైతే / ఆల లచ్చనాలు సరిజేయాల" అని చాటిస్తూ "దొడ్డబుద్ధితో / అమ్మ నాగ అందర్నీ / కడుపు సల్లగా/ గుండె కద్దుకోవాల / అట్టా సేత్తే సొరగమే / యీ గడ్డ మీదుంటాది" అని ఖండితంగా చెప్పిన కవి రంధి సోమరాజు. గాలివాటుగా పోయినవాడు కాడు. ఏటికెదురీదిన నిర్భయశీలి.

'బూర్జువా పెళ్ళికూతురు' కథాకావ్యం కూడా అలాంటిదే. ఉన్నత విద్యావంతుడైన హరిజన యువకుడొకడు పై కులం అమ్మాయిని పెళ్ళి చేసుకుందామనుకుంటాడు. తరువాత అతనికే ఆ ఒప్పందం నుంచి బయటపడా లనిపిస్తుంది. తనకు వధువు కావలసిన ఆమెను బెదరగొట్టేందుకు తాను ఉద్యోగం వదిలేసి తనకులం వాళ్ల సేవకు జీవితం ధారపోయదలిచానంటాడు.

దాంతో ఆమె బెదిరిపోయి 'ఉద్యోగం లేకుంటే నువ్వు నాకొద్దు' అంటుంది. అతని ఎత్తు పారి అతడు తన కులపడుచు పైడమ్మను పెళ్లాడతాడు. ఇదీ కథ. ఇది అభ్యుదయ నిరోధకంగా విమర్శలందుకుంది.

'అలా తాత కంగిరేసు / బాబు కమ్మీనిట్టు / మనవడు నక్సలేటు' అంటూ రాజకీయ గోముఖ్యవ్యాఘ్రుత్వాన్ని తూర్పారబడతాడు.

'పొద్దు' కవితా సంపుటిలో మూడు పొద్దులనూ అద్భుతంగా మాండలీకంలో చిత్రించారు రంధి సోమరాజు.

"సల్లనిగాలి తాకిడికి / సుకంగ కరిగిపోతాది మబ్బు / గొప్పోలు అలా పేదల గుండెల్ని / కరిగిత్తే / నోకమంతా ఔద్దారే / దొకటే సేమంతి పువ్వు" అని సంభావించారు.

"రోజీ' ఒక సుందరమైన కావ్యం. కానీ భాషా ప్రయోగంలోని సంవిధానం కాక్‌టైల్ రూపమెత్తినట్లు కనిపిస్తుంది. వీధిలో ఎంగిలాకుల మధ్య దొరికిన, సినిమా స్టార్‌గా ఎదిగిన అదృష్టవంతురాలు రోజీ జీవిత కథనం ఇది. బెర్నార్డ్ షా పిగ్మ్యాలియన్ (మై ఫేర్ లేడీ) ప్రేరణ కాకపోవచ్చునేమోగానీ, తార జీవితపు తీరును మొరటును మొరటుగానే చిత్రించడం కనిపిస్తుంది. ఈ కావ్యానికి 'బాపు' చిత్రం లోపలి పేజీల్లో ఒక చిన్నసైజు పోస్టర్‌గా ఒక కవితా సంపుటికి వేయబడినదిగా అప్పట్లో ఒక సంచలనమే. బహుశా అలాంటి బొమ్మ నాటికీ నేటికీ అదేనేమో! మహాసౌందర్యరాశి అయిన తార 'రోజీ' కథనం అంతా సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు కలగాపులగంగా సాగినదే.

'ఆకలికి ఆకలి తీరినా / ఆకలిగా మిగిలిపోయే ఆకలేర యవ్వనం / రుచులు తెలియని ఆకలి తల్లికి / రుచులొక్కటే తెలిసిన డార్లింగ్ డాటర్ యవ్వనం"

అంటూ ఆమె మూర్తిని అందాల నింగి అంచుల వరకూ పెంచి, నగర జీవితంలోని అబద్ధపు మెరుగు, నటన అంతా ఫొటోజెనిక్ పద్ధతితో 'జూమ్‌ఇన్' చేసి చూపిన ఖండకావ్యం 'రోజీ'.

'సిమ్మన్న వచ్చింది' కథాకావ్యం కూడా అభ్యుదయకాల్పనిక వాస్తవికతా కావ్యం. రొమాంటిసిజమ్ కలిసిన సోషలిస్టు వాస్తవికత ఆ కథానాయిక పాత్ర. అమరావతి అనే ధనిక వర్గంలోని చిన్నమ్మ 'డీక్లాసు' కావడానికి ప్రయత్నించి మురికి పేటకు తన సేవను అంకితం చెయ్యడం ఇందులోని కథ. ఇలా డీ క్లాస్ అవుతున్నప్పుడు కొన్ని అపోహలు, అనుమానాలూ, అమానుషాలు జరగవచ్చు. అలా జరగడాన్నే కవి ఈ కావ్యంలో చిత్రించారు. అలా జరగకూడదనే హెచ్చరికనే ఎలుగెత్తి

ఘోషించారు. పగ, విద్వేషం చైతన్యలక్షణం కాదు. విప్లవ చైతన్యమంటే హింసా విద్వేషాలనే భాష్యం సరికాదు. క్షమ, ప్రేమ అంటే మానసిక స్తబ్ధత కాదు. నిజమైన సామాజిక చైతన్యం ప్రేమ ప్రాతిపదికగా, సృజనాత్మక సమాజ నిర్మాణంగా సాగుతుంది అని కవి భావన.

సామాజిక చైతన్యం పేరిట కవిత్వం వెర్రితలలు వేస్తోందని ఆనాడే ప్రతిఘటించి తనదైన స్వరాన్ని వినిపించిన కవి రంధి సోమరాజు. “రవ్వల దుద్దులు చేయించు/ ఆవిడ కళ్లల్లో నీవే నిలుస్తావు/ అల్లుడికి రేడియో కొనిపెట్టు/ కూతుర్ని ఎంచక్కా ఏలుకొంటాడు/ అప్పడాలు నేతిలో వేయించు/ నోటికి రుచిగా వుంటుంది/ కవిత్వాన్ని మాత్రం కొనకు తినకు/ అది ఉత్తమన్ను / వేలుపడితే చాలు తగుల్తుంది/ ఎవడిదో కన్ను” అంటాడు బాధగా.

రంధి సోమరాజుగారు రాజమండ్రిలోనే ఎక్కువ వున్నా తరువాత విశాఖకు తరలివెళ్లారు. మిత్రులతో ఏ కంపెనీ పెట్టారో అదే తెగనమ్ముకుని అందులోనే కొడుకును మామూలు ఉద్యోగిగా చూసారు. కొన్నాళ్లు ఓ ఐస్ ఫ్యాక్టరీ నడిపారు. శీలా వీర్రాజు వంటివారితో అతి సన్నిహిత మిత్రత్వం నెరిపారు. ఒకప్పుడు ఎంత కీర్తి పొందారో అంతగానూ రొష్టుపడ్డారు. ఆయన కవిత్వపు ‘రంధి’ ఆయనిదిగానే జీవించారు. చివరి రోజుల్లో ‘కొహెరన్స్’ కోల్పోయి మనుషుల్ని, బాగా తెలిసినవారిని కూడా గుర్తుపట్టలేకపోయేవారట. డెబ్భై ఏళ్లుపైబడి సాగించిన జీవయాత్ర చివరకు విశాఖలో పెద్ద పండుగ ముగియగానే ముగిసింది. విరిగినకల్చర్ సాహిత్య ప్రపంచంలో– విస్మృతకవిగా కనుమరుగయ్యారేమోగానీ, రంధి సోమరాజు కవిత్వంలోని గుండెసూటి నిజాయితీ, నిర్భీతి, గోదావరి మాండలీకానికి ప్రాణం పోసిన కవిత్వశైలి ఎప్పటికీ మాసిపోవు. ✻

**(ఆంధ్రభూమి దినపత్రిక సాహితి 20 ఫిబ్రవరి 2006)**

# (56) పాటనావ సాగిపోయింది

"...ఎగిరి ఎగిరి అలసిపోయి
దినాలు రెక్కలు ముడిచేవేళ
పాటనావలో కూచుని
నీ కనురెప్పల తెరచాపనెత్తి
నీ కళ్ళలో
అస్తమానం అస్తమించే
నల్లటి సూర్యబింబం కేసి
సాగిపోనీ"

అని 'పాటకత్తెకి' విన్నవించిన ఇస్మాయిల్ మృత్యుగానంలో నిశ్శబ్దంగా కలిసిపోయాడు. ఒకేరోజు ఆనంద విషాదనుభూతులు రెండింటికీ తావలము కావచ్చుననడానికి ఈ నవంబరు ఇరవై అయిదు ఒక స్మృతి. ఆ రోజే నా పుట్టిన రోజు. నాకు ఇష్టమైన ఒక కవి ఇస్మాయిల్ - రాత్రి వచ్చిన రహస్యపు వానలో కవితా నిశ్శబ్దంలో ఇంకిపోయిన రోజుకూడాను.

నేను ఎం.ఫిల్ పరిశోధన చేసిన భావచిత్ర వాదానికి కవిత్వంలో సృజనాత్మక ప్రతినిధి ఇస్మాయిల్ కావడం - ఆయన మీద నా ఇష్టానికి కొమ్మలూ రెమ్మలూ తొడిగిందనుకోవచ్చు. 1978 మార్చి చివర్లో అనుకుంటా ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'కవిత్వంలో ఆధునికత' గురించి ఇస్మాయిల్ వ్యాసం వచ్చింది. దానిమీద రమాపతి రాజు అనే ఒక పాఠకుడు 'లోకాభిప్రాయం'లో "ఇస్మాయిల్ గారు ఏది కవిత్వమని, ఏది కవిత్వంలో ఆధునికత అని మనకు సిఫారసు చేస్తున్నారో ఆ 'అల్లా'నే అడిగితే గాని తెలిసేట్టు లేదు" అని కడప నుంచి లేఖ రాసాడు. దానికి నేను ఆంధ్రజ్యోతి వారపత్రిక 14-4-1978 ఉగాది ప్రత్యేక సంచిక 'లోకాభిప్రాయం'లోనే కొంచెం పెద్ద సమాధానమే రాసాను. ఇస్మాయిల్ గారు నాకు దానిమీద వ్యక్తిగతంగా ఇన్‌ల్యాండ్ లెటర్ రాసారు. అప్పట్లో 'ఇమేజరీ' గురించి కొంత ఉత్తర ప్రత్యుత్తరాలు మా

మధ్యసాగడం మరచిపోలేని జ్ఞాపకం. ఎంత హాయిగా పలకరించేవారో ఉత్తరాల్లో.

కవిత్వంలో భాషా, భావాలకు సంబంధించి ఇస్మాయిల్ ఇమేజిస్టు కవులకు అతి సన్నిహితుడగా తోస్తాడు. 'పదచిత్రం' అనడం కన్నా 'ఇమేజ్'ను భావచిత్రం అనడమే ఎక్కువ బాగుంటుందన్నప్పుడు, ఆయన 'నిజమే! ఎజ్రాపౌండ్ నిర్వచనంలోని ఇంటలెక్చువల్, ఎమోషనల్ అన్న వాటికి భావసంబంధమే ప్రధానం' అని అంగీకరించడం గుర్తుంది. భావం చిత్రంగా మారడమే కవిత్వం. ఇమేజిజమ్ కవితా నిర్మాణ పద్ధతే అది.

''AN IMAGE IS THAT WHICH PRESENTS AN INTELLECTUAL AND EMOTIONAL COMPLEX IN AN INSTANT OF TIME" అంటాడు ఎజ్రాపౌండ్. భావచిత్రాలకీ, కవిత్వానుభవానికీ తేడా లేదంటాడు ఇస్మాయిల్. ఐంద్రియాకానుభవాల ద్వారా అతీంద్రియ విషయాలను బోధపరుచుకోవటం కవిత్వ ప్రత్యేక లక్షణం అంటూ ఇస్మాయిల్ 'కవిత్వంలో ఆధునికత' అంటూ 1978 లో రాసిన వ్యాసంలో స్పష్టంగా తన భావాలను అభివ్యక్తీకరించారు.

కవిత్వంలో థ్రిల్ కలిగించే కేంద్ర బిందువులు స్వీకరించడం, అనవసరమైన అలంకారాల్నీ, అచ్ఛాదనల్నీ పరిత్యజించడం, కవిత్వానుభూతి సారాన్ని మాత్రమే గ్రహించి కథ, వర్ణనలు వంటి వాటిని పరిహరించి క్లుప్తతను సాధించడం – అంటే అనుభవాన్ని అనుభవంగానే అందించే ప్రయత్నం చేయటం, భావచిత్రాలను ప్రయోగించటం–కవిత్వంలో ఆధునికత అన్న ఇస్మాయిల్ భావాన్ని కడప పాఠకుడు రమాపతి రాజు అందుకుని ఉండకపోవచ్చు.

వేగుంట మోహన ప్రసాద్ ఇస్మాయిల్‌ని ఎజ్రాపౌండ్‌తో జమకట్టాడు. లక్ష్మీనర్సయ్య IMAGERY IS THE PRIME MEAN BY WHICH THE TOTAL BEING AND IMPACT OF A POEM ARE GRASPED అన్న విలియం బ్లేక్ మాటకు ఇస్మాయిల్ కవితలు దాఖలాలే అన్నాడు.

కవి అనుభూతి సౌందర్యం నుంచి సహృదయునిలోనికి సౌందర్యానుభూతిని సృష్టించే శిల్పస్వరూపాల భావచిత్రశిల్పి ఇస్మాయిల్. కవి వ్యక్తం చేయదలచిన భావం తాలూకు ఆవేశాన్ని, మానసిక స్థితిని, ప్రకంపననీ అందివ్వగల భావ చిత్రాన్ని (IMAGE) నిర్మించగలగడం ఆ కవిత్వంలోని నిర్మాణ నైపుణ్యం. ఉదాహరణకి

ఇస్మాయిల్‌కు పేరు తెచ్చిన తొలినాళ్ళ 'మనిషీ మనిషీ' (చెట్టు నా ఆదర్శం) కవితలో కూడా ఈ ఇమేజిజం స్ఫుటంగానే కన్పిస్తుంది.

మనిషీ మనిషీ
ఎత్తుగా ఆకాశంలో
ఎగిరే డేగని చూడు
సరిహద్దుల్లేవు దానికి
గిరిగీసుకుని కూచోదు
భూచక్రాన్ని గుండ్రంగా
చూచుకాగ్రంపై తిప్పుతుంది
స్ఫుటంగా తీక్షణంగా వీక్షించే
సూర్య నేత్రం దాని ఆదర్శం.

మనిషీ మనిషీ
పిట్టలకు ఎగరటం నేర్పిన చెట్టుని చూడు
ఏ భాషలో పుష్పిస్తుందది?
ఊహలనీడల్లో మాపటివేళల్లో
ఊడల్లా కావలించుకునే ప్రియుల హస్తాలు
ఏ భాషలో తడుముకుంటాయి.

మనిషీ మనిషీ
పరిమళాల్లో ఈదే
చిరు ఆకాశాల్నీ చిట్టి పరిగల్నీ చూడు
ఆనందపు రంగులు
చైనా వియత్నాం జపాన్ పొలాల్లో ఎక్కడైనా అవే కద

మనిషీ మనిషీ
ఉప్పు ఏ భాషలోనైనా
ఉప్పగానే ఉంటుంది. (1-11-1971)

సూర్యనేత్రం, ఆకాశంలో ఎగిరే డేగా సంంకుచిత సరిహద్దుల్ని అధఃకరించే శక్తులకు భావ ప్రతిమలు. కవితలోని చివరి పంక్తి ఒక సూక్తిభావ చిత్రం కూడాను. స్వతంత్ర భావిచిత్రాలు మూడు రకాలు. (1) ప్రతీక లక్షణం (SYMBOLIC) (2) అన్యాపదేశ లక్షణం (ALLEGORICAL) (3) సూక్తి లక్షణం (EMBLEMATIC) అని అరిపిరాల విశ్వం పేర్కొన్న లక్షణాలు ఈ కవితలో సుస్పష్టాలు. నిజానికి ఇస్మాయిల్ 'మనిషీ మనిషీ' అనే ఈ కవితను క్షేత్ర ప్రచారశాఖ వారి కోసం రాసారు. అయితే ఆ ప్రచార లక్షణం కాక అస్థిరమైన అల్ప విషయాలపట్ల పట్టింపులు పూనటం అవివేకమనీ, అసంఖ్యాక ద్వంద్వాలు అందరికీ సమానమేనని చెబుతూ జాతీయ సమైక్యతకై లాంగ్వేజ్ ఇంటిగ్రెటీకై ఒక సమగ్ర యథార్థ స్వరూపాన్ని వ్యక్తీకరించడం విశేషం.

"తనని బాధిస్తున్న – ప్రపంచపు ముల్లుని – పీకిపారేసి – ఈ పిల్ల చకచకా – ఎటో నడిచిపోయింది" అంటూ ఓ కవితలో ఆత్మహత్యకు సంబంధించిన భౌతిక రూపాన్ని భావచిత్రమయం చేస్తాడు. 'పచ్చని చీకట్లో మంటేదో ఎర్రగా కదిలింది' అని చిలకలు వాలిన చెట్టుని గురించి అంటాడు. బావిని 'భూమి బుగ్గపై చల్లటి నవ్వు సొట్ట' అంటాడు. కపట ప్రేమకు మోసపోయిన వైనాన్ని "మెరిసే నీ – చిరునవ్వుల్నేరుకుందామని వచ్చాను– అరికాళ్ల నిండా– అరచేతుల్లోనూ – గుచ్చుకున్నాయి – పిచ్చివాణ్ణి– మెరిసేవన్నీ మెత్తటి వనుకున్నాను– పగిలిన నీ – పగటికలలని తెలీదు" అని అభివ్యక్తీకరిస్తాడు. భావ స్పందనను కలిగించడంలో ఇస్మాయిల్ దిట్ట. తోడుకున్న వారికి తోడుకున్నంత చందాన భావవ్యాఖ్యానం రసహృదయానుభూతి ననుసరించి ఉంటుంది. తనకు పేరుతెచ్చిన 'చెట్టు నా ఆదర్శం'లో పురుగు, పిట్టా, ఆకాశం, భూమిలతో చెట్టుని భావచిత్రీకరించడం కన్పిస్తుంది.

"తరుచాపము వీడిపోయి – గురి మరచిన బాణంలా –తిరుగాడును పిట్ట –ధరణి గుట్టు తెరవబోయి – బిరడాలో ఇస్క్రూలా– ఇరుక్కున్న పురుగు – పురుగు సగం, సగంపిట్ట – ధరను జొచ్చి, దివిని విచ్చి విరులు తాల్చు తరువు" అనడంలో జీవితంలోని సమతుల్యతనూ, స్వేచ్ఛనూ వృక్షపరంగా విశదీకరిస్తాడు.

ప్రకృతి పారవశ్యంతో తనలోకి తీసుకుని జీవితానందాన్ని ఇస్మాయిల్ కవిత్వీకరించినట్లు ఆధునికంగా మరొకరు చేయలేదు. దేహాలకూ దేశాలకూ కూడా

సాపత్యం చూస్తూ 'బుద్ధిగా ప్రేమించుకోక యుద్ధమెందుకు చేస్తారో - నా కర్థం కాదు" అన్న మానవతావాది తను. వజీర్ రహ్మాన్ ఇస్మాయిల్ చిన్న తమ్ముడు. తను పోయినప్పుడు "ఈ వరుస కింద నుండి మొదలైనట్టుంది. మనకి అట్టే దూరం లేదు" అన్నారట స్మైల్‌తో. ఆరోహణ క్రమంలోనే అన్నదమ్ములు అస్తమించారు. సుప్రభాతాల సంపదే ఘనంగా, కవిత్వమే తన ఇస్మాయిల్ దర్బారుగా భావించిన వాడాయన. జీవనానుభవ దార్శనికతను గాఢానుభూతి కవిత్వంగా భావచిత్రాలలో పొదిగి నిశ్శబ్దం చేతకూడా పలికించినవాడు ఇస్మాయిల్. మాయలులేని తాత్త్వికత ఇస్మాయిల్‌ది. అంత భావుకత, అంత మానవీయత ఆయన కవితకే చెల్లు! 'బందీని నేను-బందిఖానాని నేనే' అన్న ఇస్మాయిల్ డెబ్బై ఆరు కాలకవాటాలను తెరుచుకుని మృత్యువృక్షం మీద నుంచి రెండో ప్రతిపాదన లేకుండా హంసై ఎగిరిపోయాడు. 'చెట్టుకవి'గా ఆయన కవిత్వ పక్షుల గుండెల్లో గూడుకట్టుకునే వుంటాడు. ✻

**(ఆంధ్రభూమి దినపత్రిక సాహితి 1 డిసెంబర్' 2003)**

# (57) పరిణత ప్రయాణం 'నిషాదం'

Poets are never young, in one sense their delicate ear hears the far-off whispers of eternity, which coarser souls must travel towards for scores of years before their dull sense is touched by them. A moments insight is some times wonrth a life's experience

- OLIVER WENDELL HOLMER SR

**వ**యసు, అనుభవం పెరుగుతున్నకొద్దీ ఒక పరిపక్వతా, తాత్త్వికతా రూపు దిద్దాలి. ఏండ్లుగా కవిత్వం రాస్తున్నా గతానుగతికంగానే తోచే సీనియర్ కవులు కొందరైతే, క్రమక్రమాగత పరిణామాన్నీ, వికాసాన్నీ వెలార్చే కవులు కొందరు. నిజానికి రచయితకు వయస్సుతో, వృద్ధాప్యంతో నిమిత్తం లేదు. "పొయట్స్ ది ఫస్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఆఫ్ మ్యాన్‌కైండ్ బ్రాట్ ఆల్ థింగ్స్ టు ది ప్రాపర్ నేటివ్ యూజ్" అన్న విశ్వాసం వల్లే– పరిత్యలోకం కవిని ఒక ఉత్తాల స్థితిలో భావన చేసి గౌరవిస్తుంది. జీవితం సంక్లిష్టతలతో, సమస్యలతో కూడుకున్నది కనుక ఆ జీవితాన్ని చిత్రీకరించే కవిత్వంలోనూ ఆ సంక్లిష్టత అనివార్యం అన్నది కవికీ ఒక దశలో అర్ధవంతమైన ధోరణిగా చెలామణీ కావచ్చుగానీ, జీవితపు సోపానాల మధ్యభాగాలను దాటి, గడచిన అనుభవాలను నూతనం చేసుకుంటున్న వయస్సులోనూ, ఒక సారళ్యమూ, స్పష్టత గోచరం కాకపోతే– అందువల్ల తను పాఠకులకు అందడం, అందించడం మాటేమోగానీ, తనకు తానే అస్పష్టుడవుతాడు.

"కవిత ఓ వాచకం. ఈ వాచకం–చెప్తున్నట్లు కన్పిస్తున్న విషయానికంటే చెప్పని విషయమే ఎక్కువ. అసలు చెప్పాలనుకున్నదానికీ, చెప్తున్నట్లు కన్పిస్తున్నదానికీ, చాలా వ్యతిరిక్తత వుంటుంది. వాచకం పాఠకుడ్ని మోసం చేస్తుంది. పాఠకుడు స్వీకరించగలిగే ఒకే ఒక నిశ్చితార్థాన్ని భగ్నం చేస్తూ, ఏక కాలంలో అనేకానేక అర్థాల్ని సూచించగలదు. వచనం ద్వివచనం అవుతుంది. భాష ద్వైతం అవుతుంది. ఎన్నో అర్థాలు సూచించగల శక్తి వల్లనే వాచకానికి అసలు అర్థం అంటూ ఒకటి

నిశ్చితార్థంలో ఉండకపోవచ్చు. రచనలోనే తుడిపివేత రచన ఒకటి ఇమిడి ఉంటుంది...' అన్న 'కాన్సెప్ట్'ను గ్రహించిన 'మో' కవితావిర్భావం ముందు వెనుకలకు జరుగుతూంటుందనుకొంటానంటాడు ఇలా–

**ఊహ – వస్తువు – పరిచయం – అనుభవం**

**జ్ఞాపకం – అనుభవం – ఊహ – వస్తువు**

**సహజాతం – సమాజం**

**వ్యక్తి – గతం – వ్యక్తిగతం**

**అవ్యక్తం – వ్యక్తావ్యక్తం**

**వ్యక్తం = కవిత్వం**

అంటాడు. ముందు వెనుకల సంవిధానం ఎలా వున్నా, వ్యక్తం కవిత్వం అనేది నిర్వివాదమే! అయితే ఆ కవిత్వం పాఠకుని అనుభవ పరిధిలో ఆవిర్భావమయ్యే సంవిధానాన్ని కూడా, కవి గుర్తుంచుకోవాలి. ఆలంకారికులు 'రసము ఎన్నిష్ఠము' అని ప్రశ్నించి, అది 'సామాజిక నిష్ఠము' అన్నారు. వాసనారూపకంగా ప్రేక్షకుడిలో లేదా పఠితలో వున్న అనుభవ లోకాలను అనుభూతితో తెరిచి రసానంద సంధాయకమైనప్పుడే, కావ్య ప్రయోజనం అన్నారు. ఇక్కడ 'రసానందం' అన్న మాట కన్నా, శ్రీశ్రీ అన్న 'రసన'గా గ్రహించినా ఫరవాలేదు.

'మో' యే స్పష్టంగా అంటున్నాడు– "ఆధునిక కవి ఏకాకి. సమాజాన్నుంచి దూరుడైనాడు. సాంఘిక చైతన్యంలోకి ఇమడటంలో చివరికి మిగిలేదేమీ లేదు. లోబడిపోవటం మాత్రమే మిగుల్తుంది. స్వీయాత్మకీ, వస్త్వాత్మకీ మధ్య వుండే సెన్సిబిలిటీ, అనుబంధం డిసోసియేట్ అయిపోయింది. పురాణ ప్రతీకలు ఒక సమాజాన్ని మొత్తంగా బంధించి ఉంచేవి. వ్యక్తిగత చేతనను ఒక సాంఘిక సంస్కార చేతనగా మలిచేవి ఆ ప్రతీకలు. స్వీయాత్మకీ వస్త్వాత్మకీ వాటి ద్వారా అనుబంధమేర్పడేది" అని అంగీకరిస్తున్న కవి, ఇప్పుడా ప్రతీకలు ఏదో మత సంబంధులుగా, మనుషుల్ని విడదీసేవిగా సంభావించడం భావ్యం కాదు! ప్రతీకలకు పాత, కొత్త అనేదేమీ లేదు. "కవిత్వంలో సంకేతాల పాత్ర చిన్నదేమీ కాదు" కదా!

– అయితే చిక్కు ఎక్కడ వస్తుందంటే, వ్యక్తిగత చేతన సామూహిక చేతనలో విలీనం కానప్పుడే! కాదూ! సామూహిక చేతనోద్దీపకంగా వ్యక్తిగత చేతన సంలీనం కాలేనప్పుడే! 'మో' కవిత్వం అర్థం కాదు అనే మాట చాన్నాళ్లుగా వున్నదే! దానికి

కారణం– తను అనుభవ పరిధిలోని వైయక్తిక ప్రతీకలతో, సామూహిక ప్రపంచానికి అంతగా పరిచితి లేకపోవడమే.

"రచయిత ఒక్కడే. రచనకి పాఠకులు అనేకులు. అందువల్ల ఆధునిక రచన ఏకకాలంలో అందరు పాఠకులనీ సంతృప్తి పరచలేదు. పాఠకుడికి సాహిత్యంతో వున్న కనిష్ట, గరిష్ట సంబంధాలను బట్టే రచన అతనికి అందుతుంది. రచయితకీ పాఠకుడికీ మధ్య ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం అంటూ ఏదీ లేనప్పుడు రాజీ ప్రసక్తి అసలే ఉండదు. కొత్త సంకేతాలన్నీ ఆచార స్థాయికి ఇమిడే వరకు అర్థక్లిష్టత తప్పదు" అంటూ 'మో'–బాధ్యత పాఠకుడిదే గానీ, రచయిత స్థాయికి పాఠకుడు ఎదగాలని అనిపింపచేయడం 'కళ ప్రయోజనం' కోసం అన్నదానిని వదలి– మళ్లీ 'కళ కళ కోసమే' అని ప్రతిపాదించే స్థాయికి నెట్టబడుతోందనిపిస్తుంది ఉపరితల దర్శనం చేస్తే.

పరిచిత సంకేతాలు వాడక, కొత్త సంకేతాలు పరిచితిలోకి తేవడానికి రచయిత యత్నించడంలో తప్పులేదు! పాఠకుడి స్థాయిని, ఆలోచనల, అనుభవాల పరిధినీ, నిస్సందేహంగా రచయిత విశాలం చేయాలి. కానయితే – అందుకు పాఠకుడిని సమాయత్తం చేయాల్సిన బాధ్యత రచయితకు లేదంటే చేయగలిగిందేమీ లేదు. 'అన్నప్రాశననాడే అవకాయ' అన్నట్లుంటే కుదరదు. తొలుత తల్లిలా, తండ్రిలా కవులు ప్రాథమిక బోధకులు కూడా కావాలి మరి!

'మో' కవిత్వంలో వయసు, అనుభవం పెరిగిన కొద్దీ 'అన్వయక్లిష్టత' – సారళ్యం వైపునకు మరలడం, తాను చెప్పదలచిన విషయం గాఢానుభూతుల నిర్దుష్ట తాత్త్వికతలలోకి ఒదగడం, ఒక ఆరోగ్యదాయకమైన పరిణత ప్రయాణం! 'మో' కొత్త సంపుటి 'నిషాదం' అందుకు దాఖలాయే! అయితే పాఠకుడి కోసం తానేమీ రాజీ పడ్డాడనడం లేదు. క్లిష్టత నుండి అభివ్యక్తి సాంద్రతలోకి ఒక 'రహస్తంత్రి'లో 'బతికిన క్షణాల' నుండి 'నీడలూ–జాడలూ' దాటి, 'వెన్నెల నీడలే' పరచి, 'పునరపి'గా, 'కరచాలనం' చేయడం, 'సాధ్యభాష' 'నిషాదం'గా హృదయ సంగీత స్వరాలు కూర్చుకోవడం పఠితకు 'మో'ను ఏ 'మో' నుండి, 'కా'మో'సు నుంచి, ఆ'మో'దంలోకి 'మో'పుతోంది.

ఏమయినా తనదైన సూత్రం ఒకటి కవికి వుంటుంది.

"ఇంతకీ
ఏవడిగాను నేను

నను బంధించుకోటానికి
ఓ మువ్వల మొలతాడు
ఈ అంధవిశ్వంలో
మీకెవ్వరికీ దృశ్యం కారాదనే
ఎంతకీ ఏవన్నారు మీరు
శ్వాస మీద ధ్యాస
ఏ విశ్వాసం లేకనే
ఓంకారాదికం కాకనే
గ్రీక్ అండ్ లాటిన్
నిఘంటువుల్లోంచి
నిదానంగానైనా
నేర్చుకుంటున్నాను
.... ..... ....
.... ..... ....
ఏంట్రా ఏం చూపిస్తున్నానని
ఏం చెప్తున్నానని కాదు
ఆశ్వాసాంతాన
మొలసూత్రం తీసేస్తారెటూ"

అంటాడు 'కృష్ణబిలం'లో. చివరకు 'మొలసూత్రం' వుండదు. ఏ 'ప్రతీకా' వుండదు. నిదానంగా నేర్చుకున్నది 'ఓంకారాదికం' కాకపోతే, "ఊదా దీపం"లో లాగా...

'పొగిలి పొగిలి ఏడుస్తాం
మూడో నేత్రం లేదని అంతర్లీనంలో'

'చితి-చింత'తో మొదలిడిన కవికి, తన ప్రయాణం తెలుసు! చితి శరీరాన్ని కాలిస్తే, చింత మనస్సునే కాలుస్తుందనీ తెలుసు. "కవిత్వం భాష యొక్క భాష" అనే 'మో'కి, చివరకు ఆ "శ్వాస యొక్క శ్వాస" 'నిషాదం'లో, 'విషాదం'లో విలీనమవుతుందనీ తెలుసు. "కవి సత్యం మాట్లాడాలంటే పారడాక్స్‌ను జారిపోకుండా కాపాడుకోవాలి". 'మో'ని అధివాస్తవికంగా, అసంబద్ధంగా, అసామాజికంగా వ్యక్తివాద

కవిగానే నిలబెడుతూ, తనలో విశృంఖల భాషా, అభివ్యక్తి ప్రయోగాల ప్రయాణాన్నే ఇంతవరకూ చూపుతూ వచ్చిన ఆయన కవితాసంకలనాల 'వైయక్తిక మెటఫర్ల ఆట'– ఇప్పుడు వ్యంగ్యం, హేళన, నర్మగర్భం వంటి సామాన్యుడికి అందే భాషలోకి ప్రవహించి అదే సమయంలో తన కవిత్వ జీవనాదాన్నీ, కాంతినీ మాత్రం 'నిషాదం' విస్తృతపరచడం గమనించవచ్చు. 'మో' అర్థమైపోతున్నాడేమో!

'లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు' తనికెళ్ళ భరణి పేరిట ఇటీవల పుచ్చుకున్న 'మో' గ్రామర్‌నే కాదు, 'గ్లామర్'నూ పట్టుకోగలడు, తన కవిత్వంతో ఆకట్టుకోగలడు అన్నది విదితమే! 'అర్థం కానిది గొప్ప కవిత్వం' అనిపించడం 'మో' గొప్పతనం కాదు. కవిత్వం గొప్ప–అర్థం కానిదిగా కాక– సామాజిక, సాంస్కృతిక కోణాలను కూడా సంవేదనాశీలతతో ఈ సంపుటిలోని కవితల్లో మీటడం వింటాం! "తక్షణ ప్రతిస్పందనల నిరంతర వార్తా స్రవంతి" లా కవిత్వాన్ని చానెల్స్‌గా దిగజార్చక, అయినా 'నేరాన్ని వెదుక్కుంటూనే' మొదలై 'గోళ్లని రాళ్లతో కొట్టుకుంటూ' ముగుస్తాడు. రాతి సమాధిగతమయ్యాక కూడా గోళ్లు పెరుగుతూనే వుంటాయట. కవిత్వం కూడా గోరు లాంటిదే. దానికి మరణం లేదు. ఎంత తీసినా పెరుగుతూంటుంది. గోటిని శృంగారపు 'నఖక్షతమూ' చేయవచ్చు, హిరణ్యకశిపు గర్భం చీల్చి నరాలను మెడదాల్చే 'ఆయుధమూ' చేయవచ్చు. గోళ్లను అలంకరించుకోవడం కోసం 'ప్రకృతి' నెయిల్‌పాలిష్ 'ఆధునికత'తో వాడుతూంటుంది! గోటితోనే మీటే వాయిద్యం– వినీల స్వర్గ స్వప్నాలలో 'స్వర్ణ వినీలమే' కాదు, 'స్వర విలీనమూ' అవుతుంది. 'మో' నిషాదం తనదైన గొంతుయే!

ఆ గొంతు ఇప్పుడు మరింత స్పష్టంగా, సూటిగా–

"అసత్యమే నిత్యం– సర్వదా పుస్తకం" అని నిరూపిస్తూనే 'సత్యం శాశ్వతం' అని 'ప్రాణం', 'ఊయల'లూపుతుంది!

'ఆరోపించుకున్న లోపాలు' నుండి 'లోపలి సంభాషణ' 'దిద్దుకోవాలి మళ్లీ' అని తెలిసి, 'ఇంట్లోంచి ఒంట్లోకి' 'వెళ్లి రావాలోసారి' అని, 'కవుల భూగోళం'పై 'ఒక కానుక'గా 'అతి వాస్తవాలు' – 'మరో దారి'న చూపుతున్న 'మో'– 'ప్రత్యామ్నాయాలు' లేని కవి. 'చివరాఖరికి' అతను ఎప్పటికీ మోహన ప్రసాదమే! నేలమాళిగల అనంత సంపద ప్రసాదమే! ✻

**(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం 7 ఆగస్టు' 2019)**

# (58) మనోజ్ఞ సాహితీమూర్తి శశాంక

**శ**శాంక

ఆ పేరులోనే ఒక నిండుదనం, ఒక చల్లదనం, ఒక కాంతి.

అది ఆయన కలంపేరే కావచ్చు. కానీ ఆయనను చూస్తే వోలేటి సుబ్బారావు అనుకోవాలనిపించేది కాదు. వెన్నెల మనసు, వెన్నలాంటి మెత్తని పలుకు. ఎప్పుడూ సౌమ్యంగా, చిరుదరహాసంతో పలుకరించేవారు.

మొట్టమొదటి సారి ఆయనను హైదరాబాద్ మలక్‌పేట కాలనీలో మా ఇంటి కిందనే ఉండే కృష్ణశాస్త్రిగారి బంధువులు గాడేపల్లి సత్యశ్రీరాములుగారి ఇంట్లో చూసిన గుర్తు. ఆ తరువాత ఒక పెళ్లిలో. కృష్ణశాస్త్రిగారికి శశాంక గారే నన్ను పరిచయం చేశారు–'మంచికుర్రవాడు, కవిత్వమదీ రాస్తూంటాడు' అని. కృష్ణశాస్త్రిగారు తన చేతిలోని నోటింగ్ ప్యాడ్‌లో దానికి స్పందనగా 'మన పిచ్చివాడేనన్న మాట' అని రాయడం నాకింకా గుర్తే.

కఠినమైన కాలం ముందే తీసుకుపోయింది గానీ, లేకపోతే శశాంక కృష్ణశాస్త్రికి సాహిత్య రూపాంతరం అయ్యేవారు. గేయకవిత్వంలో శశాంకది ఒక విశిష్టమైన ముద్ర. ఆయన మాట, పాట రెండూ కూడా ఎప్పుడూ రససమంచితాలే. ఆయన కంఠం గంభీరమైనదేం కాదు. 'రవీంద్రనాథ్ ఠాగూర్ గొంతుకూడా ఇంతేనయా' అంటూండేవారు.

ఆ రోజుల్లో అద్భుతమైన సాహిత్యవాతావరణం ఉండేది. హేమాహేమీలైన సాహిత్యదిగ్దంతులుండేవారు. యువకులకు ప్రోత్సాహం ఇచ్చే నాటి పెద్దలలో శశాంక ప్రముఖులు. గుంటూరు శేషేంద్రశర్మ, అరిపిరాల విశ్వం, శశాంక వీరు మరీ సన్నిహిత సాహితీమిత్రులుగా గణింపబడేవారు. అరిపిరాల విశ్వంగారు ఇవాళ 'స్వామీ ఆనందఘన'గా గొప్ప తాత్త్విక, తాంత్రిక చింతనలో ఉన్నారు.

1969 సౌమ్య శంకరజయంతికి అరిపిరాల విశ్వం వెలువరించిన 'మనస్' కావ్యానికి పీఠిక రాసిన శశాంక విశ్వంలోని ఆ అంశను ఆ నాడే గుర్తించిన ద్రష్ట.

ఎక్కడో వెయ్యి సంద్రాల స్మృతులను కదల్చడానికి వచనకవితనే సాధనంగా స్వీకరించాడు అని అరిపిరాల గురించి పేర్కొంటూ శశాంక ఇలా అంటారు ఆ పీఠికలో–

"పోతే విప్లవాత్మకమైన వచన కవితను ఆశ్రయించిన అధునాతనులు అనాది పురుషుడైన పరమేశ్వరుని తమ కవితలో కీర్తించడానికి ఇష్టపడరు. నేడు పుంఖాను పుంఖంగా వస్తోన్న వచన కవితాఖండికల్లో నాగరిక జీవన చిత్రణమే ప్రధానవస్తువుగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఒక్క విశ్వం మాత్రమే ఇంతటి అధునాతన ప్రక్రియలోనూ అనాది సిద్ధమైన జగజ్జీవేశ్వర అనుభూతికి నిత్యనూతనమైన అభివ్యక్తిని కల్పించడానికి ప్రయత్నిస్తున్నాడు." అంటూ శశాంక విశ్వం మిస్టిక్‌పొయట్‌గా పరిణతి చెందిన వైనాన్ని 'అతడు ముందు భక్తుడు, తర్వాత కవి.' అని మనస్ పీఠికలో గుర్తించి చెప్పారు.

ఇరవై ముప్ఫైయేళ్ళుగా తెలుగు దేశంలో వస్తోన్న కవితా రీతులతోటీ, విశేషించి ఆయా మార్గాలలో ప్రముఖులైన కవులతోటీ, వారి వారి కవిత్వంతోటీ ఆ నాటికే శశాంకగారికి ప్రగాఢమైన పరిచయం. కనుకనే అప్పటికే విదేశీ కవితాసంకలనాల్లోనూ కవితలు రాసి ప్రసిద్ధులైన అరిపిరాల తన 'మనస్'కు శశాంక పీఠికనే కోరి 'దర్శన'గావించుకున్నారు.

ఆ నాడు ఆకాశవాణిలో శశాంక గారి గేయాలు విరివిగా ప్రసారం అయ్యేవి. కృష్ణశాస్త్రిగారి తర్వాత ఆ బాణీలో సంగీతరూపకాలను ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి అందించినది శశాంక. దాశరథి, సి.నారాయణరెడ్డి గారల సంగీత రూపకాలకు కూడా మంచి ప్రాచుర్యం ఉండేది. కానీ కృష్ణశాస్త్రిగారు ఘోస్ట్‌రైటర్‌గా పెట్టుకోదగినంత విజ్ఞానాన్ని 'శశాంక' పుణికి పుచ్చుకుంటూండేవారు.

వాహినీ వారి 'మల్లీశ్వరి' చిత్రకథ కూడా కృష్ణశాస్త్రిగారి క్రెడిట్‌లోనే పడింది గానీ, నిజానికి 'రాయలకరుణకృత్యము' పేర రేడియోలో ప్రసారమైన బుచ్చిబాబు గారి నాటిక దానికి మాతృక అని శశాంకగారే నాతో ఒకసారి అన్నారు. ఆ తరువాత బుచ్చిబాబు గారి శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మిగారు ఒక ఇంటర్వ్యూలో నాకా విషయాన్ని ధృవపరిచారు. అంతవరకూ చాలామందికి లాగానే నాకూ ఆ రహస్యం తెలీదు. గీతరచనలో శశాంక – ప్రణయము, భక్తి, దేశభక్తి ముప్పేటలుగా రక్తికట్టించారు. నానక్‌రామ్ భగవాన్‌దాస్ కళాశాలలో శశాంక తెలుగు అధ్యాపకులుగా

పనిచేస్తూండేవారు. అయినా ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం గౌరవాధ్యక్షులుగా హైదరాబాద్ న్యూసైన్స్ కాలేజీలో యువకవులూ, రచయితలతో ఎక్కువకాలం గడుపుతూండేవారు. శశాంక 'స్వరలహరి' పేరిట తన రచనలను పుస్తకంగా వెలువరించారు. ఆ రోజుల్లో శశాంక, అరిపిరాల విశ్వంగార్ల పుస్తకాల సైజు కూడా భిన్నంగా ఉండేది. పాలగుమ్మిగారు స్వరపరిచిన శశాంక గీతాలు, అలాగే చిత్తరంజన్ స్వరపరిచినవీ–ఔత్సాహిక గాయనీ గాయకులు ఎంతో ఇష్టంగా అందిపుచ్చుకునేవారు.

శశాంక గారితో మాకు గాఢమైన పరిచితికీ, అనుబంధానికీ హేతువు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘ స్థాపన. 1970 ఏప్రిల్ 7 ఉగాది రోజు హైదరాబాద్ విజయనగర్‌కాలనీ కమ్యూనిటీ హాలులో తాపీధర్మారావు గారి అధ్యక్షతన, శ్రీ దివాకర్ల వేంకటావధానిగారిచే ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతి అనుబంధకళాశాల విద్యార్థినీ విద్యార్థిరచయితల ఉత్సాహప్రోత్సాహాలతో సంఘం స్థాపించబడింది. సి.నారాయణరెడ్డి, బోయిభీమన్న, నార్ల చిరంజీవి, వానమామలై వరదాచార్య, రావూరి భరద్వాజ వంటివారంతా ఆ నాడు మమ్మల్ని ఆశీర్వదించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం శశాంకగారిని గౌరవాధ్యక్షులుగా పొంది, నెలనెలా సాహిత్య సమావేశాలతో రచనా వ్యాసంగంలో పరవళ్లు తొక్కింది. 'జ్యోత్స్న' పేరిట ప్రథమ వార్షిక సంచికను కూడా వెలువరించింది. నేనప్పుడు ఆంధ్రసారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాలలో బి.ఓ.యల్ మొదటి సంవత్సరం విద్యార్థిని. ఇంజినీరింగ్ బి.ఇ. ఫైనల్ విద్యార్థి అయిన అడపా రామారావు కార్యదర్శి. నేను సహాయకార్యదర్శిని. శశాంక గారు నెలనెలా సమావేశాలకు హాజరవుతూ విద్యార్థుల్లోని రచనాభినివేశాన్ని ఎంతగానో ప్రోత్సహించేవారు. మా పటాలం పేర్లు చెప్పాలంటే చేంతాడంతవుతుంది.

1971 లో అయిదవ అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు జరిగాయి. నాటి భారత రాష్ట్రపతి వి.వి.గిరి చీఫ్ ప్యాట్రన్‌గా జరిగిన ఆ సమావేశాలకు నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి రిసెప్షన్ కమిటీ చైర్మన్‌గా, నాటి విద్యామంత్రి పీ.వీ నరసింహారావుగారు సాహితీ సదస్సు ప్రారంభకులుగా వ్యవహరించారు. ఆ సభల కన్వీనర్స్‌లో ఒకనిగా, పుస్తక చిత్రకళా ప్రదర్శక కమిటీ, బోర్డింగ్ కమిటీ

సభ్యునిగా నేనూ పనిచేశాను. ఆ సందర్భంగా వెలువరించిన సావనీర్‌లో శశాంకగారు– 'విద్యార్థికవితారంగం: కొంతమంది విద్యార్థి కవులు' అనే వ్యాసం రాసిన సంగతి అది అచ్చయి వెలువడే దాకా తెలియనే తెలియదు.

ఆ వ్యాసం మాకు కొండంత బలం.

తాము కొత్తగా కవిత్వం రాస్తున్న పాతిక ముప్ఫైఏళ్ల క్రితం నాటి ఒకానొక ప్రముఖకవి 'ఇప్పుడేమి వచ్చె ఇంటింటి కవులయా' అంటూ ఓ ఆధునిక కావ్యావిష్కరణ సభలో సన్నాయి నొక్కులు నొక్కగా, యువకులైన తామంతా గర్హించిన విషయాన్ని ప్రస్తావిస్తూ శశాంక 'తొలిదశలో కవిత్వం వ్రాసేవారికి ప్రోత్సాహమే అందచెయ్యాలి కానీ విమర్శించి తూర్పారబట్టకూడదు' అని పెద్దలకు కూడా హితవు పలుకుతూ– "మహాకవి శ్రీశ్రీ ఛందో బందో బస్తులన్నీ చట్‌పట్‌మని త్రెంచి పారవేసిన తర్వాత నిజమే తెలుగుదేశంలో చాలామంది కవులే పుట్టుకువచ్చారు. ఒక రకంగా చూస్తే అంతర్జాతీయంగానే కవిత్వం ఈ నియమాలకూ, నిబంధనలకూ విడాకులిచ్చి స్వేచ్ఛగా జీవనం నెరపుతున్నది. అంతమాత్రం చేత ఆ కవిత్వానికి స్పందన తగ్గలేదు. పాతబడి పనికిరానిదై పోయిన కొన్ని లక్షణాలను నవ్యకవిత్వం వదిలిపెట్టినా, శక్తివంతమైన నేటి ప్రజా హృదయ స్పందనకు అవసరమైన సుగుణాలనేవో కొన్నింటిని సంతరించుకున్నదనే చెప్పాలి. వచన కవిత్వమనే ప్రక్రియ బాగావాడుకలోని వచ్చిన తర్వాత కవిత్వం వ్రాయడానికి జీవితాన్ని అధ్యయనం చేయాలి తప్ప, పాత ప్రబంధాల్ని తిరగవేయవల్సిన అవసరం కనిపించడం లేదు. భాష కోసం పాత పుస్తకాలు బాగా చదవాలని కొత్త కవిత్వం వ్రాసేవారికి పెద్దలు సలహాలు ఇవ్వడం కద్దు. ఇప్పుడు అలా కష్టపడి సంపాదించిన భాష కవిత్వంలో ప్రయోగిస్తే ఆ కవిత్వానికి గిరాకీ లేదు. అటువంటి భాషతో నిండిన కవిత్వాన్ని చదువుతోంటే, ఆ సభలో కూర్చున్న రసజ్ఞులు నీరసం వచ్చి ఒక్కొక్కరే లేచి వెళ్లిపోతారు. నేటి కవిత్వంలో ఆగి ఆలోచించి అర్థం చేసుకోవలసి వచ్చినమాట ఒక్కటి ప్రయోగించినా, ప్రతి పదార్థం తెలుసుకుని తాత్పర్యాన్ని గ్రహించి ఆనందించే పాఠకులు లేరు. నేటి కవితలో ఆ పాత స్ఫురణలో రచిస్తే ఆ కవిత్వం ఎంత గొప్పదైనా జనరంజకత్వాన్ని పొందలేకపోతున్నది.

భాషా విషయికంగానే కాక వస్తు స్వీకరణలోనూ నేటి కవిత్వంలో చాలా మార్పు వచ్చింది. ఎంత చించుకున్నా ఎవరికీ అర్థంకాని పరతత్వాన్ని గూర్చి కవిత

వ్రాయడం కన్నా, అందరికీ తెలిసిన సర్వసామాన్య విషయాలనే కవితా వస్తువులుగా స్వీకరించి కవి తన సందేశాన్ని అందచేయగలుగుతున్నాడు, రసజ్ఞులను ఆనందింప చేయగలుగుతున్నాడు." అంటారు ఆ వ్యాసంలో శశాంక. "కొంతమంది విద్యార్థికవులు" అనే ఆ వ్యాసంలో మొట్టమొదటిగా పేర్కొని శశాంక పరిశీలించింది. నా కవితనే. 'ట్లెరిన్ సంస్కారి' అనే శీర్షికన స్రవంతిలో ప్రచురింపబడిన నా కవితను తొలుతగా విశ్లేషించి 'నిజానికి సుధామ విద్యార్థిగా ఉండి కవిత్వం వ్రాస్తున్నాడు కనుక 'విద్యార్థి కవి' అని కర్మధారయసమాసం చేసి చెప్పవలసి వస్తోంది కానీ, కవిత్వ గుణాన్ని బట్టి అదృష్టం కలిసివస్తే అతడు నేడో రేపో మహాకవుల లిస్టులో చేరకపోడు" అని శశాంక ప్రశంసలు పొందడం – నాటికి నేటికీ నన్ను హర్షపులకాంకితుడిని చేసే అంశం. ఆయన చేత అక్షరబద్ధమైన ఆ మాటే ఆశీరక్షతగా నేడు సాహిత్యలోకంలో అంతో ఇంతో గుర్తింపుకు ప్రేరకశక్తి అయిందని అనుకుంటూంటాను. దేవరాజు మహారాజు, కపిల రామ్మోహనరావు, మురళీధరగౌడ్, వై.రామకృష్ణారావుల కవితలనూ, స్వాతి, చిత్రపుశాంత, రఘుశ్రీ, ఉమాకాంత్, పాండురంగమూర్తి, కడలి హనుమంతరావు, అడపా రామారావులనూ వ్యాసంలో పేర్కొని "–ఇలా ఎంతోమంది విద్యార్థులూ, విద్యార్థినులూ ఈ వేళ అత్యంత ఉత్సాహంతో కవిత్వం వ్రాస్తున్నారు. వాళ్ళ వెన్నో పద్యాలు నాకు లభ్యం కాక ఈ వ్యాసంలో ఉదహరించలేకపోతున్నాను. అలాగే ఈ ఉదాహరించిన కవులవే ఇంకా మంచి పద్యాలు ఉన్నాయి. అవీ నా దగ్గర లేవు. అందువల్ల అటువంటి మంచిపద్యాలూ ఇందులో పేర్కొనలేకపోయాను...

మొత్తం మీద ఈ వ్యాసంలో కొందరు విద్యార్థికవుల కవిత్వాన్ని వాచవిగా మాత్రమే రుచి చూపించడం జరిగింది. దీని సమగ్ర స్వరూపం తెలుసుకోవాలంటే ఒక చక్కని సంకలనమే ప్రచురించాలి" అంటూ అభినందించారు. శశాంకగారి ఆ వ్యాసం నాటి యువసాహితీ ప్రపంచానికీ ఒక గొప్ప టానిక్కు అయింది. బహుశా యువకవులను అంతగా పట్టించుకున్నది ఆ రోజుల్లో శశాంకయేనేమో! ఆధునిక కాలాన చేకూరి రామారావు వంటివారికి, బహిర్గతం కాని ప్రాతిపదికలు అక్కడే ఉండి ఉండవచ్చు.

చంద్రుడి మీద మానవుడు పాదం మోపిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నిర్వహించిన చందమామ కవి సమ్మేళనంలోనూ ఆ తరువాత తెలంగాణ

జిల్లాల్లో రాష్ట్ర కుటుంబసంక్షేమశాఖ నిర్వహించిన పలు కవిసమ్మేళనాల్లోనూ శశాంకగారితో కలిసి పాలుపంచుకున్న అనుభూతి ముఖ్యంగా మరుపురానిది. తప్పొప్పులు వివరిస్తూ ఎప్పుడైనా చేసే మందలింపులలోనూ మృదుత్వమే భాసించేది ఆయన మాటల్లో.

1974 లో నాకు బాబాయి వరుస అయ్యే ఆయుర్వేద వైద్యవిద్యార్థి 'నాని' (అల్లంరాజు ఉదయభాస్కర్) ని కలవడానికి విజయవాడ వెళ్లినప్పుడు మేమిద్దరం కలసి వీధిలో వెడుతుండగా ఒక కిళ్లీకొట్టు రేడియోలోంచి వచ్చిన ప్రాంతీయవార్తల్లో శశాంక మరణవార్తవిని నేనెలా స్థాణువునయ్యానో చెప్పేందుకు నాని కూడా లేడు. ఆ తర్వాత రెండేళ్లకే అతనూ మరణించాడు. "అమ్మా! నాన్నపోయినట్లు రేడియోలో చెప్పారే' అని చిన్నకుర్రవాడు అంటూంటే తట్టుకోలేకపోయాను" అని తన పర్యవేక్షణలో నన్ను ఆఖరి యం.ఫిల్. పరిశోధక విద్యార్థిగా స్వీకరించిన అరిపిరాల విశ్వంగారు ఒక సందర్భంలో నాతో అంటున్నప్పుడు శశాంక గురించి కంటనీరు ఆపుకోలేకపోవడం-చెరగని ఒక జ్ఞాపకం. అమృతోత్సవమూర్తి శశాంకకు అంతేవాసి సుధామ అక్షర నీరాజనం ఇది. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 4.2.2010)**

# (59) సాహిత్య స్నేహ సుగంధాల అద్దేపల్లి

**రా**మమోహనరావులు చాలామంది ఉండొచ్చు. కానీ తెలుగు సాహిత్యంలో – ఇంటిపేరు నిజంగానే నిలబెడుతూ, ఒక విమర్శక శిఖరంగా, సామ్రాజ్యవాద వ్యతిరేక కవితాస్వరంగా నిలబడింది 'అద్దేపల్లి రామమోహనరావు'. ఆయన తాత రామస్వామి పురోహితుడు. తల్లిదండ్రులు రాజరాజేశ్వరి, సుందరరావు. తండ్రి బందరు హిందూ కళాశాలలో ఓ మధ్యతరగతి గుమస్తాయే!

కృష్ణాజిల్లా బందరు (మచిలీపట్నం) సమీపంలోని చింతగుంట పాలెంలో– మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షతన లక్నోలో మొదటి అఖిల భారత అభ్యుదయ రచయితల మహాసభ జరిగిన 1936 వ సంవత్సరంలో అద్దేపల్లి సెప్టెంబర్ 6 న జన్మించాడు. ప్రాథమికవిద్య పుట్టిన ఊళ్ళోనే నేర్చి, అక్కడికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని హిందూ హైస్కూల్‌లో ఉన్నత పాఠశాల విద్య నేర్చాడు. బందరులో పెరిగి పెద్దవాడై, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. పూర్తిచేసి, మచిలీపట్నం హిందూ కళాశాలలోనే కొన్నాళ్ళు ట్యూటర్‌గా, ఆపై లెక్చరర్‌గా తరువాత కొంత కాలం నందిగామలో ఉద్యోగం చేసి, 1972 లో కాకినాడకు ఎం.ఎస్.ఎన్ ఛారిటీస్ కళాశాల లెక్చరర్‌గా వచ్చి, ఇక అక్కడే స్థిరపడిపోయాడు. కాకినాడతోనే ఎక్కువగా మమేకమైపోయాడు. అయితే కేంద్రస్థానం అదే అయినా – నిత్య సాహిత్య సంచారిగా, తెలుగునేల నాలుగుచెరగులా సాహిత్యసభలకు హాజరవుతూ, ఎందరో యువ కవులను ప్రోత్సహిస్తూ కవిగా, విమర్శకునిగా తనదైన ముద్రవేసుకున్నాడు. తన ఎనభై ఏండ్ల జీవన ప్రస్థానంలో అర్థశతాబ్ది కాలం సాహిత్యానికే అంకితమై, సమాజ హిత చింతనతో అభ్యుదయపథగామియై సాగాడు.

1950–60 ల్లో రచనకు శ్రీకారం చుట్టిన అద్దేపల్లికి 1965 లో ఆంధ్రప్రభలో శ్రీశ్రీ మహాప్రస్థానంపై విమర్శనాత్మక వ్యాసాలు ధారావాహికంగా రాసి, దానిని పుస్తకంగా వెలువరించడంతో విమర్శకునిగా పేరు వచ్చింది. ఒక కవి గురించి అలాంటి పుస్తకం రావడం స్వయంగా శ్రీశ్రీయే ఎగిరి గంతేసేలా చేసిన వ్యవహారం!

తనమీద వెలువడబోతున్న సాహిత్యవిమర్శనా గ్రంథానికి విశ్వనాథ సత్యనారాయణగారి చేత పీఠిక రాయించమని శ్రీశ్రీయే స్వయంగా కబురంపితే, అందుకోసం అద్దేపల్లి స్వయంగా విశ్వనాథను కలవడం, ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించడం, విశ్వనాథ పీఠిక లేకుండానే అద్దేపల్లి 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' గ్రంథం వెలువడడం జరిగాయి. తాను చదువుకున్న చదువు, అప్పటికి కవిత్వ విమర్శకు కొలమానాలుగా ఉన్న ఛందో అలంకారాల భిత్తికమీదే అద్దేపల్లి – శ్రీశ్రీ కవిత్వాన్ని విశ్లేషించాడు. అందుకే అందులో సంప్రదాయ విమర్శనా ధోరణులు కనిపించినవే గానీ, కమ్యూనిజం, మార్క్సిజం ఛాయల అవలోకనం  అభివ్యక్తం కాలేదు.

అద్దేపల్లి కన్న వయసులో అయిదు సంవత్సరాలు పెద్ద అయిన సి.నారాయణరెడ్డి గారు 1962 లో పీహెచ్‌డీ కోసం 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయము – ప్రయోగములు' అనే పరిశోధనను – ఉస్మానియా విశ్వవిద్యాలయంకు సమర్పించి, 1967 లో గ్రంథరూపంలో వెలువరించారు. శ్రీశ్రీని సంప్రదాయ పరిధిలోనే కాక ప్రయోగవాదిగా, శ్రీశ్రీపై ప్రభావితం చూపిన అంశాలను, అంతవరకూ సాగుతున్న కవిత్వధోరణులకు భిన్నంగా శ్రీశ్రీగారి అతినవ్య కవితాధోరణులను ఆయన వివరించారు. అది అద్దేపల్లికి తెలియదు. సినారె సిద్ధాంత గ్రంథం 1967 లో వచ్చింది. అద్దేపల్లి పుస్తకం 1968 లో అచ్చులో వెలువడింది. రా.రా (రాచమల్లు రామచంద్రారెడ్డి) తన 'సంవేదన' త్రైమాసిక పత్రికలో 'అద్దేపల్లి' పుస్తకాన్ని విమర్శించాడు. శ్రీశ్రీని చూడవలసిన ధోరణి అది కానే కాదన్నాడు. అద్దేపల్లికి సినారె పుస్తకం చూసే అవకాశం లేదు. అదీ కాక – కమ్యూనిజం, మార్క్సిజం అన్న కోణంలో కాక, శ్రీశ్రీ కవిత్వాన్ని అసలు ఎలా అర్థం చేసుకోవాలి అన్న ప్రాథమిక అవగాహనను అద్దేపల్లి కలిగించాడు. ఆ మాట కొస్తే శ్రీశ్రీయే తన మహాప్రస్థాన గీతాల గురించి తాను రాసిన కాలంలో అద్దేపల్లి విశ్లేషణలకు ఒదిగేలాగే ఉన్నాడు. శ్రీశ్రీ తన కవిత్వం మీద అద్దేపల్లి విశ్లేషణా గ్రంథానికి 'విశ్వనాథ' పీఠిక కావాలని కోరుకున్నదీ అందుకే ననుకోవచ్చు. 1980 లో శ్రీశ్రీ చేతిరాతతో లండన్‌లో గూటాల కృష్ణమూర్తిగారు వెలువరింపజేసిన 'మహాప్రస్థానం' ముద్రణ గ్రంథం 'నామాట'లో శ్రీశ్రీ యే స్వయంగా "ఇలాంటి రచనలను సామాజిక వాస్తవికత అంటారనీ, దీనికి వెనుక దన్నుగా 'మార్క్సిజం' అనే దార్శనికత ఒకటి ఉంటుందనీ అప్పటికి నాకు

తెలియదు" అని తానే చెప్పుకున్నాడు. 'దేశచరిత్ర'లోని 'ఇతరేతర శక్తులు లేస్తే...' అనే శ్రీశ్రీ ప్రయోగానికి – శ్రామిక శక్తి ప్రతీకగా రారా వ్యాఖ్యానించగా, 'తతిమ్మా' అనే మామూలు అర్థంలోనే శ్రీశ్రీ ఆ పదం వాడాడు అన్న అద్దేపల్లి భావనతో శ్రీశ్రీయే అంగీకరించాడు. అది ఒక చారిత్రక సందర్భం.

నిజానికి అద్దేపల్లి 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' గ్రంథం వల్లనే – శ్రీశ్రీ 'అందరివాడు'గా నిలబడగలిగాడని చెప్పాలి! ప్రాచీన సాహిత్య ప్రమాణాల దృష్ట్యా శ్రీశ్రీ మహాప్రస్థానంను ఉన్నత స్థాయిలో కూచోబెట్టింది అద్దేపల్లియే! విశ్వనాథ దానికి పీఠిక రాయకపోవడం మంచిదే అయ్యింది! లేకపోతే అద్దేపల్లి కూడా గతానుగతికమైన ఆ రాతకే పూర్తిగా కట్టివేయబడేవాడు. బహుశా ఆ మూసలోకే పోయేవాడు.

విమర్శకుడు కవి హృదయాన్ని పట్టుకోగలిగేవాడు కావడం ముఖ్యం అనీ, తనదైన రంగుటద్దాలలో మాత్రమే చూసి తీర్పులు చెప్పకూడదనీ అద్దేపల్లి అంటూండేవాడు. అద్దేపల్లి కవిగా పద్యం నుంచి వచన కవితకూ, అందునా అభ్యుదయం దిశకూ మరీ ముఖ్యంగా సామ్రాజ్యవాద వ్యతిరేకతకు బలమైన కంఠం ఇచ్చిన స్థాయికీ ఎదగడం, ప్రస్థానించడం ఒక ఎత్తయితే – విమర్శకునిగా మరీ కీర్తి తెచ్చుకున్నాడు. జాషువాపై, కుందుర్తిపై కూడా తాను విమర్శ గ్రంథాలు రాశాడు. మరీ ముఖ్యంగా విశేషంగా చెప్పుకోవాల్సింది అకడమిక్‌గా ఉన్నత దశలకు ఎదగడానికి పరిశోధనలు సాగుతుండే విద్యావ్యవస్థలో – లెక్చరర్‌గా రిటైరయ్యాక, తనకు అరవై ఏళ్ళ వయసు పైబడినప్పుడు 'అభ్యుదయ విప్లవ కవిత్వాలు – సిద్ధాంతాలు శిల్పరీతులు' అన్న పరిశోధన చేసి అద్దేపల్లి డాక్టరేట్ పట్టా పొందడం. నిజమైన సాహిత్యాధ్యయనం అంటే తనది. అదీ నిఖార్సయిన విమర్శక వైఖరి.

అద్దేపల్లి అన్ని విధాలా చలనశీలియే! మినీ కవిత్వాన్ని ప్రోత్సహించాడు. స్వయంగా గజల్ ప్రక్రియలో రచనలు చేసి గానం చేశాడు. తెలుగు కవిత్వంలో ఆధునికతను ఒడిసిపట్టుకున్నాడు. వందలాది యువకవులను ప్రోత్సహించి తన పీఠికలతో వారికి ప్రాచుర్యం కల్పించాడు. అనేక సాహిత్య సభలలో తన వక్తృత్వంతో, ప్రసంగాలతో ఆకట్టుకున్నాడు.

తొలినాళ్ళలో పద్య, గేయ ఫణుతుల్లో మధుజ్వాల, అంతర్జ్వాల వంటి కవితా సంకలనాలు వెలువరించినా 'గోదావరి నా ప్రతిబింబం'తో – తెలుగు కవిత్వ జలధిలో

తనదైన ప్రతిబింబం చూపడం మొదలు పెట్టాడు. బందరు సముద్రం – జీవధార 'గోదావరి'ని కవితా దాహార్తి తీరేలా పిడికిట పట్టాడు. రక్తసంధ్య, సంఘం శరణం గచ్ఛామి, వెదురు పువ్వు, అయినా ధైర్యంగానే, పొగ చూరిన ఆకాశం, కాలం మీద సంతకం, ఆకుపచ్చని సజీవ సముద్రం నా నేల– వంటి కవితా సంపుటులతో ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజ స్థితిగతులకు దర్పణం పడుతూ సామ్రాజ్యవాద ధిక్కారస్వరం వినిపిస్తూ నిబద్ధ కవిగా నిరూపించుకున్నాడు.

హిందూత్వం, అమెరికనిజాన్ని
నెత్తిన కిరీటంగా పెట్టుకుని
మైనారిటీ ద్వేషమొక్కటే హిందూత్వమని
విభిన్న ముఖాల మధ్య చెట్లు కూలగొట్టి
ఎడారుల్ని పరుస్తోంది
ఓ! హిందూత్వమా!
నువ్వు నిజానికి అమెరికనిజానివా!

అంటూ నేటి వర్తమాన స్థితిని ద్రష్టగా ముందే అక్షరీకరించినవాడు అద్దేపల్లి.

"ఒకప్పుడు కవిత్వాన్ని మాత్రమే ప్రేమించినప్పుడు గోదావరి నన్నయ్య పద్యాల్లా, శ్రీనాథుడి సీసాల్లా కనబడింది. ఇప్పుడు జీవితాన్ని కూడా అర్థం చేసుకున్నప్పుడు, దోవపొడుగునా పోరాటాల్ని దూసుకు పోతున్న పరమాణు ప్రవాహం కనిపిస్తోంది" అని చెప్పుకున్నాడు. "సమాజ పురోగమనానికి ఉపయుక్తమయ్యే కవితా రూపురేఖలేవైనా ఆహ్వానించదగ్గవే అన్నదే సామ్యవాద భావన"గా తలపోసి అనుసరించినవాడతను.

"పేదవారికి పెద్దవారికి భేదమికపై నశిస్తుందని
ఇంద్రజాలంలోన మునిగి ఎదురుతిరిగే దమ్ములేనప్పుడు
ఏమి చెయ్యాలేమి చెయ్యాలి
జనులార మీరు ఇందిరమ్మకు భజన చెయ్యాలి"

అని గొప్ప వ్యంగ్య వైభవంతో 1972 ప్రాంతాల్లోనే ధైర్యంగా పాటకట్టి వేదికలపై ఆలపించినవాడు అద్దేపల్లి. ప్రపంచీకరణ విష ఫలితాలను పసిగట్టి ఎప్పటికప్పుడు హెచ్చరిక కవితలల్లినవాడు. విమర్శకునిగా తన వైఖరి గణనీయమైనది. తిరుమల శ్రీనివాసాచార్య రుబాయీల ఉపలబ్ధి మీద అద్దేపల్లి అరుదైన గ్రంథం రాశాడు.

అద్దేపల్లి నా కంటే వయసులో పదిహేనేళ్ళు పెద్దవాడు. కానీ నేనంటే అమితమైన స్నేహాదరాలు చూపినవాడు. వయసుతో నిమిత్తం లేకుండా, అందరితో కలిసిపోయే భేషజాలు లేని సాహితీవేత్త తను. మా సాన్నిహిత్యం వయసు – పాతిక సంవత్సరాల పైబడిందే. పలు సాహిత్య సభలలో కలసి పాల్గొనడం ఒక ఎత్తయితే, తన గ్రంథావిష్కరణలకూ, తన అభినందన సభలకూ ఆత్మీయంగా నన్ను పలుమార్లు గౌరవస్థానంలో ఉంచి ఆనందించినవాడు.

నేనూ, అద్దేపల్లి పాల్గొన్నవాటిలో నాకు మొదటగా గుర్తొచ్చే సభ కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో 1992 లో మేలో 'తెలుగు నవల నాడు... నేడు... రేపు' అన్న రాష్ట్రస్థాయి సదస్సు చివరిరోజు పర్యావరణ పరిరక్షణ గూర్చి ముగింపు సభగా జరిగిన కవి సమ్మేళనం. దానికి తాను అధ్యక్షత వహించగా, నేను ముఖ్య అతిథిగా పాల్గొన్నాను. సాధారణంగా ఇలాంటి అంశాలజోలికి వెళ్ళి కవిత్వం రాయడం నామోషీగా భావించేవాళ్ళూ, అదేదో ప్రభుత్వ పథక ప్రచారంగా తలపోసేవారూ కవి సమూహాల్లో ఉండడం గురించి మేం మాట్లాడుకోవడం నాకు గుర్తుంది. ముక్కామల నాగభూషణం గారు ఆ రోజు మా ఇద్దరినీ ఎంతో ఆత్మీయంగా పలకరించడం మరిచిపోలేం. విజయవాడ అనగానే ఆ రోజుల్లోనే గవర్నర్ పేటలోని మోడరన్ కేఫ్ లాడ్జినే అద్దేపల్లి ఇష్టపడేవాడు ఎందుకో! మేం కలిసి ఒకే రూమ్ పంచుకున్న సందర్భాలూ ఉన్నాయి. చాలామంది కవులకు ఉండేవిగా చెప్పుకునే వ్యసనాలు తనకు బలీయంగా ఏమీ లేవు.

పొద్దున్నే ఒక చుట్ట మాత్రం కాల్చేవాడు. తను చుట్ట అంటిస్తే – నాకు మా తాతయ్యగారు (మా అమ్మగారి తండ్రి) గుర్తొచ్చేవారు. ఆ చుట్ట వాసనలో నాకు ఒక ఆత్మీయ పరిమళమే కనబడేది. ఆ విషయమే చెబితే – భళ్ళున నవ్వేసేవాడు. 'ఇది అయితే గానీ సజావుగా కాలకృత్యాలు సాగవు' అనేవాడు. తను రాసిన పద్యాల సంగతి తెలుసుగానీ, ఎప్పుడైనా మద్యం తాగాడేమో! అంతగా తెలియదు. అయితే దుర్వ్యసనంగా మారేంత చెడు అలవాట్లు తనకు లేవని మాత్రం నేననుకునేవాడిని.

2012 జూలైలో అద్దేపల్లి 'పొగచూరిన ఆకాశం' కవితా సంపుటి ఆంగ్లానువాదం 'ఐ నీడ్ ఎ లెటర్' ఆవిష్కరణ జరిగింది. అద్దేపల్లి శిష్యుడే కాకినాడకు చెందిన శొంఠి రమణ అనువదించాడు. సభ హైదరాబాద్‌లో కాబట్టి వచ్చేది తెలుగు

శ్రోతలే కాబట్టి తెలుగులోనే ప్రసంగించడానికి అద్దేపల్లి నన్నే కోరాడు. అంత ప్రేమ, గౌరవం. అంతకుముందు 2010 లో సుద్దాల హనుమంతు శతజయంతి వేడుకలు విజయవాడలో చేస్తూ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆంధ్రా ఆర్ట్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాఖ్య అద్దేపల్లికి సుద్దాల పేరిట కవితా పురస్కారాన్ని అందించినప్పుడు నేనే ముఖ్య అతిథిని ఆ సభకు. అద్దేపల్లి కవితా సంపుటి 'ఆకుపచ్చని సజీవ సముద్రం నా నేల'ని ఆ సభలో నేనే ఆవిష్కరించాను.

కవిత్వం ఒక నిరంతర యాత్ర
అక్షరం నీ గుండెల్లోని రక్తపాత్ర
నీ రక్తాన్నే అక్షరంగా మార్చుకోవడం మొదలెడతావు
రక్తంలో సమాజ ప్రతిబింబాల్ని
సముద్రీకరించుకుంటూ
అలల్ని అన్ని దిక్కులకూ పంచుతూ
నీ ఘోష నీలోనే అణిచేసుకుంటూ
జీవితంలో సమాంతరంగా పాటలల్లుకుంటూ పోతుంటావు (ఎడారి వసంతం)

అని రాసుకున్నాడు. ఆ సంపుటిలోని 'నీ బాంచెన్' అనే కవితలో "తలల పాదాల్నిండా మొలుస్తున్న డాలర్ రెక్కలు", "తలమీద అడుగులు పెట్టుకునే పరాధీనత మాత్రం అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ మేడిన్ ఇండియానే" అన్న పంక్తులు ఇప్పటికీ గుర్తే! జాతి తలమీద అంతర్జాతీయ పాదముద్రలు గురించి ఆర్తి చెందినవాడు.

కాకినాడలో సాహితీస్రవంతికి అధ్యక్షుడు అద్దేపల్లియే! ఖమ్మంలో సాహితీస్రవంతి 15 వ వార్షికోత్సవంకు 2014 సెప్టెంబర్‌లో తన పుట్టినరోజు అయిన వారం రోజులకే కలుసుకున్నాం. ఆ సభలో పాల్గొన్నాం. తనకు 80 సంవత్సరాలు పూర్తి అయిన గత ఏడాది 2015 లో విజయవాడలో ఎక్స్‌రే ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, నగర సాహిత్య సంస్థలు, పత్రికలు అద్దేపల్లికి పెద్ద ఎత్తున అభినందన సభ చేశాయి. శ్రీశ్రీ కవితా ప్రస్థానంపై మార్కాపురంకు చెందిన సాహితీ ప్రియబాంధవుడు కె.వి.రమణారెడ్డి పన్నెండుమందికి పైగా ప్రముఖులచే విశ్లేషణా వ్యాసాలు రాయించి పుస్తకంగా వెలువరించాడు. "కొందరిది ఈ ఊరు, కొందరిది ఆ ఊరు. అద్దేపల్లి చిరునామా తెలుగు నేల ఊరూరు" అంటూ 80 వసంతాల సంచార యోధుడికి జరిగిన

ఆ అభినందన సభకు నేనే ముఖ్యఅతిథిగా వెళ్ళడం అవిస్మరణీయ ఘట్టం. అదే ఆఖరుసారి ముఖస్థంగా కలుసుకోవడం అవుతుందని అనుకోలేదు.

గురజాడ శతవర్ధంతికి డా॥వేదగిరి రాంబాబు శతాధిక కవుల కవితలతో 'అక్షర' సంకలనం వేస్తూ సంపాదక బాధ్యతలు నాకు అప్పచెప్పినప్పుడు అద్దేపల్లికి కవిత పంపమని ఫోన్ చేశాను. అప్పటికే తన ఆరోగ్యం బాగులేదని తెలియదు. తనూ చెప్పలేదు. ఓ వారం తర్వాత మళ్లీ ఫోన్ చేస్తే కొంచెం నలతగా ఉంటోందన్నాడు కానీ అసలు సంగతి చెప్పలేదు. తన కవిత ఈ మెయిల్‌లో అందేలా వెంటనే పంపాడు.

2015 నవంబర్ 30 'అక్షర' ఆవిష్కరణ సభ జరిగింది. డిసెంబర్ మొదటివారంలో అనుకుంటా స్వయంగా తనకు సంకలనం ప్రతిని కొరియర్‌లో పంపించా. ఆ సంకలనం ముఖచిత్రం మీద వేసిన కవులలో 'బాలి' వేసిన తన చిత్రం కూడా ఉంది. పుస్తకం అందగానే అద్దేపల్లి సంతోషంగా ఫోన్ చేశాడు. తీరిగ్గా తను ఉత్తరం రాస్తానన్నాడు. కానీ అదేమీ జరగలేదు.

కొత్త సంవత్సరం 2016 రాగానే జనవరి 13 న సంప్రదాయపు ఉత్తరాయణ కాలంలోనే 80 ఏండ్ల కవిభీష్ముడు అద్దేపల్లి అస్తమించాడు. ప్రొస్టేట్ క్యాన్సర్ అనే అంపశయ్య మీద తానున్నట్లు తనకూ, తన కుటుంబం వారికి మాత్రమే తెలుసుననుకుంటా! తన మరణవార్త అంతులేని విషాదాన్ని కలిగించింది. కవిగా, విమర్శకునిగా అద్దేపల్లి గురించి సాహిత్య లోకానికి కొత్తగా చెప్పవలసిన పనిలేదు. ఎందరో యువకవులకు స్ఫూర్తి ప్రదాతగా, స్నేహపీఠికా కర్తగా 'అందరి బంధువయా' అన్నట్లుగా ప్రేమాస్పదుడైన వాడు అద్దేపల్లి. తనకు డాక్టరేట్ ప్రదానం అయ్యాక, ఆ తరువాత – ఆకాశవాణిలో హైదరాబాద్‌లో కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉంటూ నేను చేసిన రెండు ఇంటర్వ్యూలు, ఆ రికార్డులు నేను భద్రపరుచుకుని ఉంటే బాగుండేదనిపిస్తోంది. ఏమైనా తను లేడు. తేహినో దివాసాగతాః ✻

**(పాలపిట్ట జూన్–జూలై' 2016)**

# (60) అస్తమించిన అనుభూతిపూర్ణ జీవి

**ఆ**యన కవిత్వ అనుభూతితో పరిచయం కలిగిన పుష్కర కాలానికి కానీ ఆయన పరిచయం కలగలేదు. ఆకాశవాణిలో ప్రసార నిర్వహణాధికారిగా వున్న నాకు పదోన్నతితో కార్యక్రమ నిర్వహణాధికారిగా విజయవాడ కేంద్రానికి బదిలీ కావడంతో, 1991 లో ఉషశ్రీగారి స్థానంలో అక్కడ తెలుగు విభాగాన్ని నిర్వహించే బాధ్యతలు చేపట్టాను. అప్పటికి ఆయన విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో స్క్రిప్ట్‌రైటర్ పదవిలో ఉన్నారు. అప్పటి స్టేషన్ డైరెక్టర్ జి.కె.కులకర్ణి కన్నడిగులు. తెలుగు వారు కాదు. జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడంతోనే ఆయన "అయామ్ అలాటింగ్ సాంస్క్రిట్ అండ్ తెలుగు సెక్షన్స్ టు యు. శ్రీకాంతశర్మ విల్ అసిస్ట్ యూ." అనేసారు. కులకర్ణిగారికి స్ట్రిక్ట్ డైరెక్టర్ అనే పేరుంది. ఒకరిమాట అంత సులభంగా వినేరకం కూడా కాదు.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ స్క్రిప్ట్ రైటర్ ఉద్యోగంలో ఉన్నారు గానీ ఆయన ఎంతటి ప్రతిభామతి అయిన పండితుడో, కవియో నాకు తెలుసు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారి పుత్రుడిగానే కాదు అప్పటికే స్వయంగా కవి పండితునిగా పేరు ప్రతిష్ఠలార్జించిన గొప్ప గౌరవనీయ వ్యక్తి. అలాంటి వ్యక్తి నాకు సబార్డినేట్‌గా అసిస్ట్ చేయడమేమిటి? నేను కులకర్ణిగారితో ఆమాటే అని, ఆయనకు సంస్కృత విభాగాన్ని నిర్వహించే బాధ్యత పూర్తిగా అప్పచెప్పమనీ, అంతగా అయితే ఇంకేమైనా అదనపు బాధ్యత కూడా ఆయనే స్వతంత్రంగా నిర్వహించేలా చేయవచ్చనీ, తెలుగు విభాగం కార్యక్రమాల విస్తృతి కూడా ఎక్కువే కనుక నాకు ఆ విధంగా వెసులుబాటు కల్పించిన వారవుతారనీ అభ్యర్థించాను.

ఏ కళనున్నారో కులకర్ణిగారు నా అభ్యర్థనను మన్నించి సంస్కృత విభాగంతోబాటు ప్రతిరోజూ ఉదయం ప్రసారమయ్యే 'సూక్తిసుధ'ను శ్రీకాంతశర్మగారే రోజూ రాసి ప్రసారం చేయాలని స్వతంత్ర బాధ్యతలు అప్పచెప్పారు. నాకు విజయవాడ కేంద్రం, అక్కడి ప్రాసంగికులు కొత్తవారు కనుక శ్రీకాంతశర్మగారే ఎన్నో విలువైన సూచనలు

ఇస్తూండేవారు. ఆయన సెలవుపెడితే నేను, నేను సెలవుపెడితే ఆయనా మా కార్యక్రమాలను నిర్వహించేవారం. ఆయన ఏం చేసినా పద్ధతిగా ఉండేది. రోజూ సూక్తిసుధ రాసి ఆ స్క్రిప్ట్ మీద డైరెక్టర్ కులకర్ణిగారు సంతకం చేశాకనే రికార్డు చేసి కానీ సాయంత్రం వెళ్ళడానికి ఉండేది కాదు. ప్రతి స్క్రిప్ట్‌కూ రీడర్స్‌రిపోర్ట్ పెట్టి డైరెక్టర్ అంగీకార సంతకం తీసుకోవలసిందే!

శర్మగారి మీద ఎంత గౌరవం ఉన్నా కులకర్ణిగారు ఆయన రాసిన స్క్రిప్ట్‌ను ఎవరిచేతయినా చదివించుకుని మరీ సంతకం పెట్టేవారు. డైరెక్టర్ రూమ్ నుంచి ఆ స్క్రిప్ట్ ఎప్పుడు బయటకు వస్తుందా, ఎప్పుడు రికార్డు చేసి వెళ్ళాలా అని ఎన్నోమారులు ఆ రూమ్ ముందు శర్మగారు తచ్చాడటం కూడా నాకు తెలుసు. కానీ చిరునవ్వుతోనూ, సహనంతోనూ, నలుగురితో సరదాగా కబుర్లు చెబుతూనూ ఉండేవారే కానీ, ఏనాడూ ఉద్యోగ నిర్వహణలో బాధ్యతారహితంగా ఉండేవారు కాదు. ఉషశ్రీగారి అనార్కిజం వ్యవహారాన్ని భరించి తెలుగువిభాగం అసిస్ట్ చేసింది శ్రీకాంతశర్మగారు కనుకనే విజయవాడ వైభవ ప్రాభవాలకు ఆకాశవాణి ఉద్యోగిగా కూడా శర్మగారు ఓ ఐకాన్. నిజమే! స్క్రిప్ట్ రైటర్‌గా ఆయన కలం సృజించిన సృజనాత్మక రూపకాలు, నాటకాలు ఆకాశవాణి జాతీయ స్థాయిలో వరుసగా పదేండ్లకు పైగా అవార్డులు గెలుచుకున్నాయంటే అది ఆయనలోని సృజనాత్మక వైభవానికి ప్రతీక. హృదయధర్మంతో ఉద్యోగ ధర్మం నిర్వర్తించాడాయన. ఆ తరువాత కొద్దినెలలకే ఆయనకూ కార్యక్రమ నిర్వహణాధికారిగా పదోన్నతి లభించి ఆకాశవాణి నిజామాబాద్ కేంద్రానికి బదిలీ చేశారు.

కార్యక్రమ నిర్వహణాధికారులకు ఢిల్లీలోని ఆకాశవాణి శిక్షణా కేంద్రంలో నలభైరోజుల బేసిక్ ట్రైనింగ్ ఉండేది. ఆయనకూ పదోన్నతి వచ్చాకే ఢిల్లీ శిక్షణాకేంద్రంలో ఆ శిక్షణ మొదలుకావడంతో ఒకే బ్యాచ్‌లో నేను, శ్రీకాంతశర్మగారు, ప్రస్తుతం ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర సంచాలకులుగా ఉన్న కాకరపర్తి సత్యనారాయణ, ప్రస్తుతం రిటైరైపోయిన ఎం.బాబూరావు తెలుగు అధికారులుగా ఆ బ్యాచ్‌లో ఉన్నాం. 'ట్రైనింగ్ సెంటర్ హాస్టల్'లో ఉండి శర్మగారితో గడిపిన ఆ నలభై రోజుల కాలం జీవితంలో మేం ఎప్పటికీ మరచిపోలేనిది. ఎంత పాండిత్యం! ఎన్ని విషయాలు! ఎంతటి హాస్యచతురత! ఎంతటి స్నేహశీలత. అంత సాన్నిహిత్యంగా వారితో మెలిగి గ్రహించిన జ్ఞాన సంపద, అనుభూతి సంపద ఎంతో! అది అదృష్టం కాక మరేమిటి?

ఒక స్థాయి పదవిలోకి వచ్చాక ఉద్యోగంలో బాధ్యతలూ, బదిలీలు అన్నీ అనివార్యం! శ్రీకాంతశర్మగారు ఆంధ్రజ్యోతిలో పాత్రికేయునిగా 1969-76 మధ్య పనిచేసి 1976 లో ఆకాశవాణిలో స్క్రిప్ట్ ఎడిటర్‌గా చేరారు. ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా నిజామాబాద్‌లో ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి 1996 నాటికి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా వెళ్ళారు. ఇరవైఏళ్ళ కాలం పదవిలో ఉంటే గానీ స్వచ్ఛంద పదవీ విరమణ చేసినా పెన్షన్ లభించదు. శ్రీకాంతశర్మగారి పట్ల గౌరవం గల ఢిల్లీ స్థాయిలోని ఓ అధికారి సౌజన్యంతో ఇరవైఏళ్ళకు కొద్ది నెలలు తక్కువ పడిన అభ్యంతరాన్ని తొలగించి, ఆకాశవాణి రిటైర్మెంట్ బెనిఫిట్స్ శర్మగారికి అందచేయడం జరిగింది. అలా ఆయనకు ఆకాశవాణి జీవిత కాలపు పెన్షన్ లభించడం ఆయనకు దక్కిన గౌరవం!

ఆంధ్రప్రభ వారపత్రిక ఆయన హయాంలో పాఠకులను అగ్రగామిగా అలరించింది. ఎడిటోరియల్ పేజీలో ఆయన ప్రతివారం ఒక సంస్కృత శ్లోకాన్ని తాత్పర్య సహితంగా అందించడం, విలువైన ఆ శ్లోక సంపదను ఎందరో భద్రపరుచుకోవడం నేనెరుగుదును. సంస్కృతాంధ్రాలలో ఆయన గొప్ప పండితుడు. తండ్రి నుండి పుణికిపుచ్చుకున్న వారసత్వం మాత్రమే కాదు. ఆయన స్వయంకృషి, వ్యుత్పన్నత అనితరమైనవి. ఆయన పాత్రికేయుడు, సంపాదకుడు కూడా కావడం వల్ల ఏ ప్రక్రియలో ఆయన రచన చేసినా అది ఎంతో వైశిష్ట్యాన్ని సంతరించుకుని అలరించేది. నవల, కవిత్వం, గేయం, వ్యాసం, నాటకం, సంగీత రూపకం, యక్షగానం, సమీక్ష, పరిశోధన, సినిమాపాట, ఏది రాసినా ఆ ప్రక్రియలో తనదైన ప్రతిభాపాటవాలను, విలక్షణ సృజనశీలతను నిలుపుకున్నవాడాయన. “తేనెల తేటల మాటలతో మన దేశమాతనే కొలిచెదమా” అన్న దేశభక్తి గేయం తెలుగునాట ఎంత ప్రాచుర్యం పొంది జనం నాల్కలపై నడయాడిందో అందరికీ తెలుసు. అది రాసినది ఇంద్రగంటి శ్రీకాంతశర్మయే! అనుభూతి గీతాలు, శిలామురళి, ఏకాంత కోకిల, నిశ్శబ్దం-గమ్యం వంటి కవితా సంపుటులు, పొగడపూలు పేరిట ఆయన లలిత గీతాల సంకలనం, అలాగే తూర్పున వాలిన సూర్యుడు, క్షణికం వంటి నవలలు, శ్రీపాద పారిజాతం, కిరాతార్జునీయం, శ్రీ ఆండాళ్ కళ్యాణం, గంగావతరణం వంటి యక్షగానాలు, అవతార సమాప్తి, మహర్షి, ప్రస్థానం వంటి నాటకాలు ఆయన

బహుముఖీన ప్రతిభాదర్పణాలు. ఆయన సినిమాల్లోనే కుదురుకుపోదల్చుకోలేదు గానీ సినీ గీత రచయితగానూ ఆయన అందించిన పాటలు సాహిత్యవిలువలతో వాసికెక్కినవే. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన 'నెలవంక' చిత్రంలో అన్ని పాటలూ ఆయన రాసినవే! రెండు జెళ్ళసీత, పుత్తడిబొమ్మ, రావుగోపాలరావు, తన తనయుడు సినీ దర్శకుడు అయిన ఇంద్రగంటి మోహనకృష్ణ 'సమ్మోహనం'వంటి చిత్రాలకు ఆయన రాసిన పాటలు సినీకవిగా ఆయన విలక్షణతను, విన్నాణాన్నీ విపులీకరించేవే. 'ఆ పాటలన్నీ నేనే పాడాను. అది నా అదృష్టం' అని సినీ నేపథ్య గాయకులు బాలసుబ్రహ్మణ్యం ఆనందపడుతూంటారు.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ 1944 మే 29 న తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో ప్రసిద్ధ కవి, పండితులు శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, వెంకటరత్నం దంపతులకు నలుగురు సంతానంలో మూడవవారిగా జన్మించారు. ఆయనకు ఇంద్రగంటి భానుమూర్తి, ఇంద్రగంటి సుబ్బరాయశాస్త్రి అన్నలు కాగా చెల్లెలు సత్యవాణి. చిన్నతనం నుండే సాహిత్యం, సంగీతాల పట్ల శర్మగారికి మక్కువ ఎక్కువ. ఎం.ఏ.తెలుగు పట్టభద్రులయ్యారు. సంస్కృతంలో కూడా నిష్ణాతులయ్యారు. బాలగంగాధర్ తిలక్, ఇస్మాయిల్ వంటివారి సరసన చేర్చదగిన అనుభూతివాద కవిగా కవిత్వంలో తనదైన ముద్రవేశారు. పద్యం, గేయం, వచన కవిత, పాట అలా ఏ కవిత్వ ప్రక్రియలో రాసినా నిజంగా ఆయన భావం, భాగ్యం అనుపమానమైనవి. ఇంద్రగంటి జానకీబాల ఆయన ధర్మపత్ని. ప్రేమించి పెళ్ళాడారు. ఆమె కూడా మంచి కథా, నవలా రచయిత్రిగా, గాయనిగా వన్నెకెక్కినవారు. అలా ఆ సాహిత్య దంపతులకు మోహనకృష్ణ కుమారుడు, కిరణ్మయి కుమార్తె. మోహనకృష్ణ ఇంద్రగంటి సినిమా దర్శకునిగా నేడు రాణిస్తున్నారు. కిరణ్మయి డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మాణం చేశారు. బెంగళూరులో భర్త బలరాంతో బాటు నివసిస్తూ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కవిత్వానికి మాత్రమే శ్రీకాంతశర్మ అంకితమైతే బాగుండేదనీ, ఆయన పాట కూడా కవిత్వాన్ని కప్పేసిందనీ ఆయన మిత్రుడు, సహోద్యోగి పన్నాల సుబ్రహ్మణ్య భట్టు మేలమాడుతుంటాడు గానీ నిజానికి ఆయన పాండిత్యం, జ్ఞాన సంపద విస్తారమైనవి. ఆయన సమగ్ర సాహిత్యం రెండు బృహత్సంపుటాలుగా వెలువరించారు.

ఇటీవలనే 'ఇంటిపేరు ఇంద్రగంటి' అని తమ ఆత్మకథను ప్రచురించారు. ఆంధ్రభూమి దినపత్రికలో అనేక సమీక్షలు, అలాగే 'పరిపరి పరిచయాలు' పేరిట తమకు పరిచితమైన ఎందరో సాహితీమూర్తులను గురించి ధారావాహికగా రాసి ప్రచురించారు. 'సంచలనమ్' అని ఆయన ఆంధ్రప్రభలో వెలయించిన కాలమ్, అలాగే 'తెలుగు కవుల అపరాధాలు' అనే వ్యాసాలు ఆయన విమర్శనాపటిమకు, గొప్ప అధ్యయన శీలతకు నిదర్శనాలు. జాతీయస్థాయిలో ఆకాశవాణి ద్వారా అనేక అవార్డులు, ఫ్రీవర్స్‌ఫ్రంట్ అవార్డు, శిఖామణి పురస్కారం వంటివి ఎన్నో లభించినా నిజానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం మాత్రమే కాదు, పద్మశ్రీ స్థాయి పురస్కారానికి సైతం ఆయన సమర్థుడు. కానీ ఏనాడూ ఆయనకు పురస్కారాల గురించీ, గుర్తింపుల గురించీ వెంపర్లాట లేదు. తన కృషిని తాను సాగిస్తూపోవడమే, నిరంతర రచయితగా, అధ్యయనశీలిగా సాగడమే ఆయన చేసిన పని. ముద్రారాక్షసం మీద విపుల పరిశోధన చేస్తున్నవారు.

గత అక్టోబర్‌లో శిఖామణి ఆయనకు జీవన సాఫల్య పురస్కారం అందించిన సందర్భంగా యానాంలో చాన్నాళ్ళకు ఆయనతో రోజంతా గడిపే అవకాశం లభించింది. ఆయన పాఠశాల మిత్రుడు ఇంద్రగంటి హనుమంతరావు, నేను, శర్మగారు గడిపిన ఆ క్షణాలే గుర్తున్నాయి. డి.కామేశ్వరిగారి 'గీతోపదేశం' పుస్తకావిష్కరణ సభలోనే చివరగా ఆయనను చూసింది. అంతకుముందు ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనం 2019 లో అనువాద కవులుగా హైదరాబాద్ కేంద్రంలో కలుసుకున్నాం.

ఆయనతో ముడిపడిన జ్ఞాపకాలు ఎన్నెన్నో! నా శ్రీమతి అల్లంరాజు ఉషారాణి మా వివాహానికి ముందు ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ప్రసార నిర్వహణాధికారిగానూ, ఆ తరువాత మేం ఇద్దరం విజయవాడలో కార్యక్రమ నిర్వహణాధికారులుగా పనిచేస్తున్న కాలంలోనూ మాపై అపార వాత్సల్యాన్ని, అభిమానాన్నీ చూపిన సహృదయ స్నేహశీలి ఆయన. ఆయనతో కబుర్లాడడం అంటే గొప్ప ఉత్సాహంగా ఉండేది. సాహిత్య సాంస్కృతిక విషయాలనేకం ఆయన కబుర్లలో అందుకునేవారం. ఎప్పుడూ చిరునవ్వుతోనే తనమీద తానే జోకులేసుకునేలా కూడా వ్యవహరించేవారాయన. ఆయనలో మంచి నటుడున్నాడు. పాండురంగ, రామం

అనబడే ఎస్.బి.శ్రీరామమూర్తి, కృష్ణమోహన్ ఆకాశవాణిలో ఆయనకు అత్యంత సన్నిహితులు. ఆయన స్నేహం ఎవరికయినా అపురూపవరమే!

హైదరాబాద్ నేరేడ్‌మెట్ ఆర్.కె.పురం జి.కె కాలనీ సాహితీ రెసిడెన్సీలోని ఆయన స్వగృహంలో ఆయనతో ముచ్చటించే అవకాశమే లేకపోయింది. ఎన్నోమార్లు ఆయన ఆహ్వానించినా ఆ ఇంటికి వెళ్లడం కుదరనే లేదు. ఆఖరికి ఆయన పార్థివ శరీరాన్ని ఈ జూలై 25 గురువారం అక్కడే సందర్శించుకోవడం మనసును కలచివేస్తోంది. సాహిత్యలోకపు ఒక 'ఐకాన్', తరలిపోయిన 'ఇంద్ర'జాలపు కవి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ❋

**(ఆంధ్రభూమి దినపత్రిక 29 జూలై' 2019)**

# (61) మరువకూడని బంగారి మామ

**జా**నపదగీతాలు వేరు, జానపద బాణీల్లో రాసిన గీతాలు వేరు. జానపద గీతాల కర్తృత్వం తెలియదు. మౌఖికంగా ఒకరినుంచి ఒకరికి పరివ్యాప్తిలోకి వచ్చినవి. కానీ ఆ బాణీలు తీసుకుని కవులు, రచయితలు రాసినవి ఇవాళ జానపద గీతాలుగా ఎక్కువగా చలామణీ అయిపోతున్నాయి. జనం గుండెలకు పట్టిచ్చే సహజ సిద్ధమైన బాణీలు కావడం వల్ల వాటిల్లో కూర్చిన కవుల పాటలకు కూడా గాయకులనోట ప్రసిద్ధి లభిస్తోంది. జానపద గీతంగా అలా ప్రసిద్ధమైన గీతం అంటే ముందుగా గుర్తొచ్చేది కొనకళ్ళ వెంకటరత్నం రాసిన 'మొక్కజొన్న తోటలో' అనేదే. నాటి నుంచి నేటిదాకా ఆ గీతానికి గల ప్రశస్తి తగ్గలేదు సరికదా, ఇప్పటికీ ఈతరం గాయకులకీ మంచి ఊపుగా పాడేందుకు, ప్రశంసలందేందుకు కారణంగా నిలుస్తూనే ఉంది. నిజానికి పాటలోని శృంగార భావన అమలినమే. ఒక స్వేచ్ఛా ప్రణయ భావన దాగున్న గీతమది. గది నాలుగ్గోడల మధ్య కాకుండా పెనిమిటి అయిన మామయ్యతో వలపును ముసిరిన సీకట్లలో తోటలో పంచుకోవాలనే స్వేచ్ఛా ప్రణయిని తపన అది. వరుస అయిన వాడితో వలపేగానీ అదేమీ వివాహేతర సంబంధంగా భావించనక్కరలేదు. కానీ ఎవరి భావన ఏదయినా ఆ గీతం అద్భుత జానపద ప్రణయ గీతంగా స్థిరపడింది. కొనకళ్ళ వెంకటరత్నం కీర్తి దీధితులకు నిజానికి ఈ ఒక్కపాటే చాలు. తనదే 'రావోయి బంగారిమామా! నీతోటి రహస్య మొకటున్నదోయీ' అనే బంగారిమామ గీతం ఘంటసాల గళాన వెలిగి మరీ అజరామరమయింది. బంగారిమామ పాటలు అంటూ కొనకళ్ల రాసిన పాటలు గ్రంథరూపంలో మునుపే వచ్చాయి. ఇటీవలి కాలంలో బంగారిమామ పాటలు సి.డి.గా కూడా వచ్చాయని వేదగిరి రాంబాబు చెప్పాడు. కొందరికి ఎందుకో నచ్చదు గానీ రాంబాబు కథను భుజాన వేసుకుని ఎప్పటి నుంచో చేస్తున్న సేవ చూస్తుంటే నిజంగానే వీడికేమయినా పిచ్చా అనిపిస్తుంది. ఇప్పుడు తెలుగు కథ శతజయంతి అంటూ మొదలైన హడావుడికి ఎంతో ముందుగానే కథా ప్రక్రియ గురించి రాంబాబు ఎంతగానో పట్టించుకున్నాడు.

ఏటేటా పత్రికల్లో వచ్చిన కథలపై సమీక్షలు చేయించి కొన్నేళ్లు వరుసగా సంకలనాలు వేశాడు. వేదగిరి కమ్యూనికేషన్స్ పేర కథాసదస్సులు చేశాడు. ఎవరూ ఇటీవల పట్టించుకోవడం లేదని విహారి వాపోయిన మధ్యతరగతికథల గురించి వేదగిరి రాంబాబు పట్టించుకోవడం వల్లనే కాబోలు ఉద్యమాలు, వాదాలు, ఇజాల గురించి మాత్రమే సీరియస్‌గా పట్టించుకునే వారికి కొందరికి రాంబాబు గిట్టకపోయి ఉండవచ్చు. కానీ తను కథ గురించీ, కథా ప్రక్రియ గురించీ అప్పటికీ ఇప్పటికీ తన పరిధుల్లో, తన ఆలోచనల మేరకు ఒక కదలిక కోసం కృషి చేస్తూనే ఉన్నాడు. కొందరు కేవలం ఒక ప్రక్రియకే కట్టుబడిన సాహితీ సృజనకారులు కారు. వారిలో అనంత వైవిధ్యం తొంగిచూస్తూంటుంది. చాసో కథకుడే కానీ కవితలు రాశాడు. మనకు ఆని ఉండకపోవచ్చు. శ్రీశ్రీ కవియే. కానీ కథలు రాశాడు. శ్రీశ్రీని కథకునిగా గుర్తించడానికి ఆయనకున్న స్టేచర్ వల్ల ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. మొక్కజొన్న తోటలో, రావోయి బంగారిమామ పాటలతో కవిగా ప్రసిద్ధుడైన కొనకళ్ల వెంకటరత్నం కూడా ప్రాథమికంగా కథకుడే. మొన్న రాంబాబు ఫోన్ చేసి రేపు ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో జరుపుతున్న సభ గురించి చెప్పాడు. అప్పుడే తెలిసింది మనం మరచిన బంగారిమామ – కొనకళ్ళ వెంకటరత్నం శతజయంతి సంవత్సరం సెప్టెంబర్ రెండుతో ముగుస్తోందని. కథకునిగా శ్రీశ్రీని, కొనకళ్లను గురించి కూడా రేపు ఆదివారం సభలో మాట్లాడనున్నారని 'తెలుగుకథ నేడు – రేపు' అని రచయితలు చర్చించుకుందామనీ అన్నాడు. కవులసభలకు కథకులు, కథకుల సభలకు కవులు వెళ్లకపోవడం, నాటకాల వాళ్లంటే వారు వేరని అనుకోవడం వైమనస్య ధోరణి కాకపోయినా, ఉదాసీనవైఖరి. అది ఈనాడు ప్రబలంగా కనబడడం ఓ శోచనీయం. సాహిత్యసృజన ఏదయినా ప్రక్రియాభేదం లేకుండా కవులూ, కథకులూ, కళాకారులూ అందరూ ఒకటే అనే సమష్టి భావన లేకపోవడం వల్లే కొందరి సభలు వెలవెల బోతూ ఉంటాయి. సినిమా పాటలున్న సభలకు వెళ్లినట్లు లలిత గీతాల సభలకు వెళ్లరు. సాహిత్య సభల సంగతి సరే సరి! కేంద్ర సాహిత్య అకాడమీ అంత, ప్రతిష్ఠాత్మక సంస్థ నగరంలో తెలుగు విశ్వవిద్యాలయంలోనో, త్యాగరాజ గానసభలోనో కార్యక్రమం పెడితే సగం కుర్చీలు కూడా నిండని సన్నివేశాలున్నాయి. రాంబాబు

పెట్టే సభకు ఎందరు వస్తారు అన్నది అలావుంచితే కవి కథకుల గురించి, అందునా కొనకళ్ల శతజయంతి జరపడం అన్నది అభినందించాల్సిన సంగతి మరి!

కొనకళ్ళ వెంకటరత్నం 1909 సెప్టెంబర్ రెండున తాడేపల్లిగూడెం దగ్గర పెంటపాడు గ్రామంలో పుట్టారు. ఏలూరులో ఉద్యోగం చేశాడు. అదీ పోలీసు డిపార్ట్‌మెంట్‌లో గుమస్తాగిరీ లాంటిదే. భారతి వంటి ఆనాటి సాహిత్య పత్రికలలో కథలు రాశాడు. ఆరు కథలతో 'కథాకళి' అనే సంపుటి, పదిహేను కథలతో, 'కొనకళ్ళ కథలు' అనే గ్రంథాన్ని ప్రచురించాడు. ఏమయినా 'మొక్కజొన్న తోటలో...' అన్న ఒక్కపాటతో ఓ తరాన్ని గెలుచుకున్న శతజయంతి సాహితీమూర్తి కొనకళ్ళ వెంకటరత్నం అవిస్మరణీయ బంగారి మామయే. ✻

**(ఆంధ్రప్రభ దినపత్రిక 16 జూలై'2019)**

# (62) సాహితీభీష్ముని కవిత్వభావరథం

**అ**ర్ధరూపాయి పోస్టల్‌స్టాంపు బిళ్ళలకు హస్తసాముద్రికం నుండి, అఖిల భారత రచయితల మహాసభల వరకూ వైవిధ్యభరితమైన కార్యనిర్వహణా సామర్థ్యాన్ని వెలార్చిన సఫల జీవన సాహితీభీష్ముడు కీర్తిశేషులు డా॥పోతుకూచి సాంబశివరావు. తొంభైఏళ్ళ పైబడిన ప్రాయంలోనూ కృష్ణభక్తి యే జీవ రసాయనంగా నిత్య సాహిత్య యాత్రికునిగా, విశ్వసాహితి సంస్థా నిర్వహణకు సమంకితమై సాగిన విశిష్ట వ్యక్తిత్వం వారిది.

నవల, కథ, వ్యాసం, పద్యం, గేయం, వచనకవిత, నాటిక వంటి వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఎన్నో రచనలు వెలార్చిన ప్రజ్ఞవారిది. కథా, నవలా రచయితగా ఎంత పేరు గడించారో, సాహిత్య సంస్థా నిర్వాహకునిగా ఎన్ని సేవలందించారో అగణితం. జ్యోతిషం, వాస్తులో అభినివేశంతో బాటు – ఒక సాహితీవేత్తగానూ, పత్రికా సంపాదకునిగానే కాక, ముదిమి కాలాన ఒక ఆధ్యాత్మిక వేత్తగానూ ఎందరికో స్ఫూర్తిదాయక వ్యక్తిత్వంతో రాణకెక్కిన వారాయన.

పోతుకూచి వారికి కవిత్వం అంటే చాలా ఇష్టం. అందునా సంఘ శ్రేయోభిలాష, హాస్యం, వ్యంగ్యం అంటే మరీ ఇష్టం. పద్యం, గేయ, వచనకవిత మూడింటినీ వెలార్చిన లేఖిని వారిది. అంతేకాదు 'చుక్కలు' పేరిట ఓ మినీ కవితాప్రక్రియకు అంకురార్పణ చేసిన ప్రయోగశీలి కూడాను. గీత పద్యాలలో 'పోతుకూచి మాట పొల్లుబోదు' అనే మకుటంతో వారు రాసిన శతకపద్యాలు 'పోతుకూచీయం'గా వెలువడ్డాయి. అలాగే వారి పాటల రచనాపాటవానికి అద్దంపట్టిన గీతావళి 1967 లోనే 'అనురాగం అనురాగం' పేరిట వెలువడింది. తొలి కవితా సంపుటి 'రాసిసిరా' కాగా 'సాంబశివానందలహరి' అనే ఉత్పలమాల శతకం కూడా వెలువరించారని తెలుస్తోంది. 1976 లో 'శిఖరాలు' కవిత సంపుటి, 1984 లో 'చైతన్య కిరణాలు' కవితాసంపుటి, ఆయన రూపకల్పన చేసిన మినీకవితలు 'చుక్కలు' 2004 లో వెలువడ్డాయి. ఇవి కాక జ్వాల, అగ్నినాదాలు అనే సంపుటాలు కూడా వెలువరించారని తెలుస్తోంది కానీ వీటిలో కొన్ని అలభ్యాలుగానే ఉన్నాయి. నిజానికి కథకునిగా,

నవలా రచయితగా, విశ్వసాహితి సంపాదకునిగా, సంస్థ నిర్వహకునిగా, ఒక లాయర్‌గా వచ్చినంత పేరు కవిగా ఆయన ఆర్జించకపోయినా, ఆయన మౌలికంగా భావుకుడు. దైనందిన జీవితానుభవాలనుంచి మనిషిపట్ల, సమాజంపట్ల, మానవీయ విలువల పట్ల ఆయనకున్న విశ్వాసాల నుంచి రూపుదిద్దుకున్నవే ఆయన కవితలు. భాషాడంబరాలు, ప్రయోగాల పేర మార్మికత, గూఢత వంటివేమీ లేని నిరలంకార పంక్తులు వారి కవిత్వ రచనలు.

"వచన కవిత ఉదయించాక వెలిగిన కవులను పదిరెట్లు కవితాఉద్యమం పెంచింది. అయితే ఏ కవీ తన ప్రత్యేకతనీ శైలినీ నిలుపుకోలేకపోవడం నేటి కవితారీతుల ప్రత్యేకత" అని 1984 జూలైలో వెలువరించిన 'చైతన్య కిరణాలు' కవితా సంపుటికి 'ఉషారాగం' అనే ముందు మాటలో పేర్కొన్న సాంబశివరావుగారు-

"ఎవరు ఉద్యమం చేపట్టి కొత్తదారులు కనుక్కుంటారో వారు చరిత్రలో నిలిచిపోతారు. నేడు ఆలోచనకు కార్యాచరణ కూడా ముఖ్యం. లేనిదే రాణింపు సాధ్యంకాదు. విప్లవకవులు ఈ కవితాఉద్యమంలో కార్యాచరణ కూడా ప్రారంభించారు. అయినా ప్రవాహంలాంటి జనం మధ్య ఆ రచనలు ముద్ర వేసుకోలేకపోతున్నాయి. అందువల్ల సమన్వయ దృక్పథంతో, కవితా విలువలు దృష్టిలో పెట్టుకొని సాహిత్య వ్యాసంగం సాగాలి... ధనదాహం, కీర్తిదాహం పెరిగిపోయిన భజనకవుల యుగం అంతరిస్తే కానీ కొత్తతరం కొత్త చైతన్యంతో రావడం కష్టం" అంటూ అంతకుముందు వెలువరించిన అయిదు కవితా సంపుటాలకు భిన్నంగా సరికొత్త కవితా కథనం అంటూ 'చైతన్య కిరణాలు' వెలువరించారు. సాహితీచైతన్య బిరుదాంకితులైన పోతుకూచి ఈ సంపుటిని శ్రీశ్రీశ్రీ విమలానందభారతి గారికి అంకితం చేయడం విశేషం. 1979-84 మధ్య రాసిన కవితలు ఇవన్నీ. ఇందులో ఉన్నవన్నీ కూడా చాలాభాగం చిన్న చిన్న ఖండికలే. వీటిల్లో కూడా ఆయన సహజ హాస్య, వ్యంగ్యాలు చోటు చేసుకునే కనిపిస్తాయి 'కవి సమ్మేళనం లేనిదే - పెళ్ళిలో భోగం మేళం లేని లోటు భర్తీ కాదు' అంటూ 'గుర్తింపు' కవితలో హేళన చేస్తారు. అలాగే 'నిర్వచనాలు' అనే ఖండికలో

కవి శిరోమణి
శిరస్సు మీద మణిగల కవి

సర్పసమానము
విషంకక్కు కుత్సిత కవి

మాటకారి
మాటలు క్యారీ చేయువాడు
పితూరీదారు

ప్రభుత్వ పశు ఆస్పత్రి
ప్రభుత్వ పశువులచే
నడుపబడు ఆస్పత్రి

హౌసింగు బోర్డు ఇళ్ళు
హౌసింగువారు బోర్డుల వంటి వాటితో
కట్టిన ఇళ్ళు

గ్రంథాలయము
గ్రంథములను లయము చేయునది
గ్రంథములను పాఠకుల ద్వారా నాశనము చేయునది

అంటూ వ్యాఖ్యానించి ఎకసెక్కం చేస్తారు. అలాగే 'సర్వమత సామరస్యం' అనే ఖండికలో

హిందూ మతంలో
పెళ్లాడాక
ప్రేమించనక్కరలేదు
క్రైస్తవ మతంలో
ప్రేమించుకున్నాక
పెండ్లి చేసుకోనక్కరలేదు
ముస్లిం మతంలో
నలుగురిని పెళ్ళి చేసుకోవచ్చు
ఎవరినీ ప్రేమించనక్కరలేదు
తలాక్, తలాక్, తలాక్ అంటూ
తన్ని తరిమేయవచ్చు.

అంటూ లాయరై ఉండీ నిర్భయంగా రాస్తూ, ఏ మతంలోనయినా స్త్రీ అభిమతంకు ప్రాధాన్యం లేని దైన్యాన్ని విశదీకరించారు.

అలాగే 'తెలుగుజాతి సమాధి' అనే ఖండికలో "సంవత్సరం పొడవునా లేని – తెలుగు సంస్కృతి – ఉగాది నాడే మనకు కనిపిస్తుంది – ప్రకటనల్లో, సన్మానాల్లో, భజన కవితల్లో, భట్రాజు పొగడ్తల్లో – తెలుగు సంస్కృతి భజన సంస్కృతిగా మారినందుకు – ఉగాది క్రోధంతో రక్తాక్షిగా మారింది" అంటూ నిర్భీతిగా వెల్లడిస్తారు.

'చైతన్య కిరణాలు' పుస్తకానికి అట్టవెనుక పోతుకూచి వారి గురించి పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి పరిచయ వాక్యాలు రాస్తూ "సాహితీసేవ కోసం సంసార తాపత్రయాలకు గానీ, ఉద్యోగ తాపత్రయాలకు గానీ లొంగిపోకుండా స్వేచ్ఛగా ఉన్న వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అతడు పోతుకూచి సాంబశివరావు మాత్రమే అనవలసి రావడం సహజం. ప్రపంచ తెలుగు మహాసభలకు స్ఫూర్తినిచ్చిన అఖిల భారత తెలుగు రచయితల మహా సభల్ని నిర్వహించిన తొలి వ్యక్తి సాంబశివరావు. నలుగురికి సాయపడ్డాడేగానీ ఎవరికీ తలవంచలేదు. నలుగురిని కూడదీశాడేగానీ ఎవరి ముందూ ఆధిక్యత ప్రదర్శించుకోలేదు... జీవితంలో మోసగింపబడ్డాడేమో గానీ ఎవర్నీ మోసగించలేని మనిషి. హృదయవాది. అజాత శత్రువు. ఎవరికైనా ఆత్మీయుడు, అత్యంత సులభుడు.... సహకరించినవాణ్ణి, సహకరించనివాణ్ణి ఒకే తీరును చూడగల వ్యక్తి సాంబశివరావు ఒక్కడే" అన్న మాటలు యథార్థాలు.

తన గురించి ఎవరేమనుకున్నా దూషణ, భూషణ, తిరస్కారాలను ఒకేలా ఔదలదాల్చే సౌజన్యమూర్తి ఆయన. సమాచార ప్రసారశాఖలో పనిచేసిన ఎన్.వి.గోపాలశాస్త్రి (గోపాలచక్రవర్తి) ఒక కథ చెప్పేవారు. ఒకసారి ఇంద్రుడు మునులందరినీ కవిత్వం రాసుకురమ్మన్నాడట. అందరూ రాసుకువెళ్ళి విన్పించారట. ఒక ముని కవిత విని ఇంద్రుడు "ఫో!... తుక్కు... ఛీ!" అంటూ నిరసించాడట. ఆ మునియే పోతుకూచిగా పుట్టాడని ఆయన ఆటపట్టిస్తున్నారని తెలిసినా సాంబశివరావుగారు చిద్విలాసంగా నవ్వేసేవారు. గోపాల చక్రవర్తికి రచయితల సభల్లో సముచిత గౌరవాన్ని కల్పించారే కానీ పోతుకూచి ఎవరిపట్లా వైరిభావన చూపలేదు.

"ఆకాశంలో చుక్కలు దేని కది విడివిడిగా ఉంటూనే–చిరు చిరు వెలుగులు చిలకరించినట్టు, ముక్తకప్రాయంగా ఉన్న ఈ సూక్తులు సరళంగా సాగిపోతూ

చమత్కారభరితంగా రూపొందాయి. కంటికి కనిపించే, మనసుకు అనిపించే అంశాలెన్నిటినో ఈ సూక్తుల్లో పొదిగి చూపారు పోతుకూచి వారు. వీటిల్లో కొన్ని సరదాగా చదువుకునేవి ఉన్నాయి. కొన్ని మనన యోగ్యంగానూ ఉన్నాయి" అంటూ పోతుకూచి వారు రాసిన 'చుక్కలు' కవితా ప్రక్రియను జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, విశ్వంభరా కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి ప్రశంసించారు. 2004 లో పోతుకూచివారి 'చుక్కలు' ఒక సంపుటిగా వెలువడ్డాయి.

సాహితీ గమనంలో తమ చుక్కలు గురించి ఆ సంపుటిలో పోతుకూచి ప్రస్తావిస్తూ "హైకూలు, నానీలు, మినీ కవితలు, సౌదామినీ కవితలు వెలువడుతున్న ఈ రోజుల్లో చుక్కలకు ప్రత్యేకస్థానం ఉండగలదని నా ఆశ. మాత్రల్లోనూ, గణాల్లోనూ బంధించిన భావాలు సాహిత్య ఖైదీలుగా జీవిస్తున్నాయి. పేరులో నవ్యత, పదాలలో గారడీ ఒక్కటే కవిత్వానికి జీవం కాకూడదు. ప్రపంచంలో, సమాజంలో వస్తువైవిధ్యం ఆధారంగా హృదయాలను హత్తుకుని విద్యుత్తులా ప్రవహించే భావాలను ఈ కవితలలో పొందుపరిచాను. భావప్రధానమే కాకుండా సంస్కార ప్రధానంగా ఈ కవితా సూత్రాలు వెల్లివిరిసాయి. మధ్యలో వ్యంగ్యం హాస్యం కూడా. తీవ్రమైన ఆలోచనలే కవిత్వానికి ప్రాతిపదికలు కాకూడదు. హృదయాలను అలరించే సున్నిత హాస్యం, వ్యంగ్యం కూడా మనిషి మనస్సును సంస్కరిస్తుంది. రూపం ప్రధానంగానూ, భావం ప్రధానంగానూ అంతకుమించి సంస్కరణ ప్రధానంగానూ చుక్కలు రూపొందాయి. ఈ చుక్కల మిలమిలలు అంధకార బంధురమై అయోమయంలోకి జారిపోతున్న ఈ నవనాగరిక హైటెక్కు సమాజానికి హెచ్చరికలు కాగలవని నా ఆశ" అని పేర్కొన్నారు.

తరుణి, మద్యం, ధనం
తనువుకు ప్రేరకాలే
ఆత్మానందం అనుభవం
అనంత దివ్యోత్తేజం

దూరభార ప్రయాణాలు
యువతీ యువకుల ఆహ్లాదం
కదలలేని జ్ఞానవృద్ధులు
భృకుటి మార్గంలో స్వర్గం చూస్తారు

ఏ దేశం ఏగినా
ఏమున్నది గర్వకారణం
ప్రతిచోట భారతీయుని
పరాభవ సంస్కృతులే

ఆధునిక కాలంలో
అనంత జనాభా
ఎవరు ఎందుకు పుట్టారో
ఎవ్వరికీ తెలియదు

వివాహం జరిగితే
వింతయగు సంసారం
భార్యా పిల్లలూ
శాశ్వత దాసీ నౌకర్లు

ఆడది ఒక సాలెగూడు
మగపురుగుల బందీ నిలయం
మగాడు ఓ క్రూరమృగం
ఆడదాని మాంసం రుచిమరిగిన పులి

పోటీల్లో బహుమతులు రాలేదని
మాటజారి వదరకు
ప్రతినిత్యం మనిషి నుంచి
కళాఖండాలు ఉదయించవు

వేదనల అగ్నికీలల్లో
కాగి కాగి నిలిచావు

దహనమైనా భస్మం కావు
కరిగి గడ్డకట్టిన బంగారం నీవు

వంటి వైవిధ్యభరితమైన భావకళికలు ఈ 'చుక్కలు'లో అనేకం కనిపిస్తాయి. 1976 లో ఆయిన వెలువరించిన 'శిఖరాలు' కవితాసంపుటిలో ఆయన రాసిన వచన కవితలలో కవిసమ్మేళనాలలో ఆయన స్వయంగా వినిపించి అలరించినవి కూడా ఉన్నాయి. నెహ్రూ, ఇందిర, సంజీవయ్య వంటి వారిపై రాసిన కవితలు ఈ సంపుటిలో కానవస్తాయి. పర్వదినాల భిత్తికపై వెలార్చిన సామాజిక భావాల పంక్తులు వీటిల్లోని కవితల్లో ఉన్నాయి. వస్త్ర వ్యాపారవేత్త జూలూరి వీరేశలింగంగారికి వారి సప్తతి కానుకగా అంకితం చేసిన సంపుటి ఇది. అయితే ఆయన హృదయగత భావుకత 'ఎంతకాలమీ నిరీక్షణ' అనే కవితలో స్ఫుటంగా కానవస్తుంది–

ప్రేయసీ! ఎంతకాలమీ నిరీక్షణ
ఈ హిమాలయ శిఖర సాన్నిహిత్యంలో
కలిసిపోయిన గడువు తుదిసెకనుకై
వేచి ఉన్నాను ప్రేయసీ!
కాచి ఉన్నాను ప్రేయసీ!
ప్రేయసీ! ఎంతకాలమీ నిరీక్షణ
గతంతో నాకు నిమిత్తం లేదు
ప్రస్తుతం – నా ప్రస్తుతలక్ష్యం
ప్రస్తుతం నా దృష్టిలో గతం – చివర
గతం నాకు గండాలు, గడ్డల అడ్డువై ఉంటే
కనికరం లేకుండా వాటిని కదిలిస్తా కరిగిస్తా
నా విరహ ఉష్ణబాణాల కణకణ మంటలతో
ఆ సాన్నిహిత్య శిఖరం చేరడానికి
ఖడ్గం ఝుళిపిస్తా

అంటూ ఆర్తిని నవనవోన్మేషంగా అభివ్యక్తీకరిస్తాడు.

డా॥పోతుకూచి సాంబశివరావుగారు అవివాహితులుగానే ఉండిపోయారు. తొంభైరెండేళ్ళ ఒంటరి జీవితమే! అయితే దానికి కారణం ఏమిటో తెలియదు. అయితే ఆయన కవిత్వంలో ఆ భగ్నజీవితపు ఆనవాళ్ళు కనబడతాయి. ఆయన మోసపోయారో,

తిరస్కృతులయ్యారో, లేక అటుగా సంస్పందన లేని భగ్నతకు లోనయ్యారో తెలియదు గానీ స్త్రీపట్ల ఆయన అనురాగం అను రాగం ఉదాత్తమైనది. బహుశా ఆయన ప్రేమ త్యాగం కోరుకుందేమో తెలియదు. ఆ 'అప్రాప్తమనోహరి' మాత్రం ఆయన తలపుల్లో వెన్నంటి సహజీవనం చేసిందనే అన్పిస్తుంది. కృష్ణభక్తి తత్పరుడయిన ఆయన ఎందరో మహిళా కవయిత్రుల, రచయిత్రుల అభిమానాన్ని, గౌరవాన్ని అందుకున్నవారే! ఎందరినో ప్రోత్సహించి సాహిత్య క్షేత్రంలో ప్రఖ్యాతులను చేసిన వారాయన.

1967 జూలైలో వెలువడిన వారి గీతావళి 'అనురాగం అను రాగం' అనే కవితాసంపుటి. ఇందులోనివన్నీ గేయకవితలు. ఈ పాటల పుస్తకానికి ప్రముఖ ఆకాశవాణి సంగీతదర్శకులు పాలగుమ్మి విశ్వనాథంగారు ముందుమాట సంతరించారు.

"వల్లమాలిన పారిశ్రామికమైన అభివృద్ధి కారణంగా హృదయ సంబంధమైన కళలన్నీ నీరసపడుతున్నట్టే పదమూ, పాటా కూడా తయారై లోకంలో చలామణి అవుతున్నాయినేడు.

POETRY IS MUSIC IN WORDS
AND MUSIC IS POETRY IN SOUND

అని అనుభవజ్ఞులు అంటారు. నాకీ మాటలు పరమసత్యాలుగా తోస్తాయి. పాటలోని ప్రతిమాటా కవి అనుభవంలో పండినదై గుండె గొంతుకలోన కొట్లాడి బయటపడినదైనప్పుడు ఆ పాటలో సహజంగానే సజీవమైన సంగీతం ఉండి తీరుతుంది. అట్టి రచనలలో ఎంత గొప్ప కవిత్వం ఉంటుందో అంత గొప్ప సంగీతమూ ఉంటుంది" అంటారు పాలగుమ్మివారు. సుమారు నలభై గీతాలున్న ఈ సంపుటిని పోతుకూచివారు–

నా మదిలో
నదిలా
ప్రవహించే
ఆవేదనకు
అంకితం

–అన్నారు.

ఆ వేదన ప్రేయసీ గతమైనది అనడానికి ఋజువు 'మదిలో నది' అనే తొలి కవితలోనే తెలుస్తుంది.

నా మదిలో ప్రేయసి
ఒక నదిలా ఉన్నది
వింధ్య సాత్పురాకొండల మధ్య
వెల్లువైనదిలా ఉన్నది

అని మొదలవుతుంది ఆ కవిత. ఈ గ్రంథానికి 'నా రాగం' అనే పేర తన మాటను రాస్తూ పోతుకూచి సాంబశివరావుగారు అందులో ప్రస్తావించిన తమ భావ పరంపరలు అనేకం వారి ప్రణయోర్మిని వ్యక్తపరిచేవిగా కానవస్తున్నాయి.

"వ్యక్తిలో వినూత్న చైతన్యం కలిగించే అనురాగం లభించడం చాలా అదృష్టం. అనురాగ లక్ష్యం ఒక్క సుఖమే కాదు. బాధలోంచి మాధుర్యము, మాధుర్యం లోంచి మహదానందం కూడా అందించగల విశిష్టత రాగానికే ఉంది".

"విజయం పొందిన ప్రేమవాహిని కన్న విఫలమైన ప్రేమవాహిని అనుభూతులు, అనురాగాలు, ఆశలు అమరమైనవి. ఆ అమరత్వం పొందడానికి ఒక్క మధురానుభూతి చాలు. మనిషిలో మహితశక్తి నింపుతుంది."

"మనసులో ఆమె – అయినా గగన మేఘంలా ఎంత దూరమో! – కనులలో ఆమె – కాని నిగనిగల మిణుకుల్లా ఎక్కడో! – మలయానిలం ఒక రాయబారి – ఇదంతా రాత్రి కల – పగలు రాగానే ఉదయభానునే కారు మేఘం కమ్మింది! – అదే బాధ మిగిలింది... – నిరీక్షణల్లో క్షణాలు యుగాలూ ఎన్నిసార్లు మారాయో! – వేడి సుడిగాలులు – నిద్రలేని రాత్రులు – వేడి నిట్టూర్పులు – గమ్యంలేని జీవయాత్రలు కావా?"

"మాటల్లో పట్టింపులు మనసుభరించలేదు. నింగి నీలిమ నిండిన నీలి కన్నె ఆమె. దూరంగా బాధపడే ఆమె ఎదురుగా రాయిలా ఉంటుంది. బాధ భరించలేక చుక్కవేస్తే, చుక్కరింగుల్లో ఆమె! రైలుపరుగులో, భూదేవి తిరుగులో ఆమే! ఆ కన్నుల వెలుగు – ఆ సన్నని గొంతు నిత్యం వెంటాడుతాయి".

"ఎన్నో విజ్ఞప్తులు నావి. ఎన్నో బాధలకు బలి నేను. ఎందుకు ఆమె జ్ఞాపకాలు." ఇదంతా ఆయన తన ముందుమాటలో వెలార్చిన భావతరంగిణియే! నిజానికి ఇందులో కవిత్వం ఉంది. ఇక ఈ సంపుటిలోని ఖండికల్లో ఆయన ప్రణయ హృదయం పలుతావుల్లో ప్రస్ఫుటంగా పఠితలకుద్యోతకమౌతుంది.

మాటలాడని ఆమె పెదవులు
మాట చెప్పే ఆమె చూపులు
మాటి మాటికి దొలిచె గుండెల
మాట శిల్పములెన్నో చెక్కెను
ఆమె బాటనుపట్టి వచ్చి
ఆమె కనపడునన్న ఆశతో
ఆమె ఇచటకు వచ్చుననుచు
ఆమె కోసం వెతికి అలసితి (కెరటం రాయబారం)

నీ మదిని ఏముందో
నేడైన చెప్పవే
ఎంత కాలము ఈ
వలపు దాగుడుమూత (నవ్వేరాణి)

అగ్నిశిఖలను విసిరి
ఆవేదనల రగిల్చి
ఏ తీక్ష్ణశక్తికో
చేశావు ఆహుతిగ (మంత్రము)

ఉదయ కాంతుల నణచుకారు మేఘము వోలె
హృదిలోన ప్రేమంత మొదలంట కమిలింది (వలపు తలపు)

కథలు చెప్పి కలలు రేపి..
కల్ల ప్రేమ కులుక నేల
కనులు వెతికి వెతికి కన్నీటిలో కరిగిపోయె
మునుపు వలపు స్మృతులు
మలచి వేసె మదిని
భగ్న హృదయం బరువు రాగం
బ్రతుకు వీణియ పాడు వినుము (నిరీక్షణ)

మనసులో దాగున్న
మగువ కనపడదేమి
మమతలన్నీ మరచెనా
మనసునే మార్చుకొనెనా?        (వేడి సుడిగాలి)

నీ రూపు నీ చూపు
నీ హృదయం మరపురాదు
మరువలేను మరువలేను
మరణము నను తాకుదాక      (అన్వేషణ)

మదిని మరియొక లలనలేదు
మనసు సతము నీకు అర్పణ
మాటనమ్ముము మానినీ
మంచి నవ్వుల పలకరించు     (సరళ పరుషములు)

ఈ బ్రతుకు అతుకులే చితిమీదపేర్చి
ఇహమందు సుఖముంత ఆజ్యముగపోసి
ప్రేమాగ్ని తోడ పెనుమంట రగిలించి
వెచ్చని శ్వాసనై నీలోన నుంటి              (నీ బంటునేను)

ఇలా ప్రతి ఖండికలోనూ ఒక వేదనను, భగ్నతను, విరహాన్ని, పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తూ సాగుతుంది ఆయనకలం. "ఎచట కేగినావో – ఏల అరిగినావో – ఎవరితో చెప్పకే – ఏ తోడులేకుండ – ఎచటకేగినావో – ఏల అరిగినావో" అని అంటూ ఆవేదన చెందుతూ ఒక త్యాగమూర్తిగా త్యజించి, ఒంటరిగా మిగిలిపోయారనిపిస్తుంది. ఆ వేదనే, ప్రేయసి పట్ల ఆరాధనే తదనంతర కాలంలో బహుశా కృష్ణభక్తిగా పరివర్తితమైందేమో అనిపిస్తుంది. ఆయన సాంబశివుడు కనుకనే ఆ విరహ గరళాన్ని దిగమ్రింగి లోకానికి విశ్వసాహితీ సుధలను పంచి పెట్టారు. ఈ మీ వ్యాసకర్త సుధామ బాల్య యౌవ్వన దశల్లో రచనా వ్యాసంగానికి ఎంతో ప్రోత్సాహం ఇచ్చి, వారు నడిపిన 'విశ్వరచన' మాసపత్రికలో కార్టూన్లు, కథలకు బొమ్మలు,

పత్రికకు ముఖచిత్రాలు కూడా వేయించి ప్రోత్సహించారు. పలు కవిసమ్మేళనాల్లో పాల్గొన జేశారు. పత్రికలో సంపాదకీయ పుటలో నా చేత గీయించిన వారి క్యారికేచర్‌ను వేస్తూండేవారు. వారు మా నాన్నగారు కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావుగారికి బాల్యమిత్రులు కూడా. వారిద్దరూ కలసి నాటకాలలో నటించేవారట! 'ఆత్మార్పణం' అనే నాటకాన్ని మహాత్మాగాంధీ గారి ముందు ప్రదర్శించారట! ఈ విషయాన్ని ఆయనే చెప్పారు. అలాగే అయిదవ అఖిలభారత రచయితల మహాసభలకు ఒక కన్వీనర్‌గా నిలిపి, నా చేత సావనీర్‌కు ఒక వ్యాసం రాయించి, సభల సందర్భంగా వెలువరించిన ఓ గ్రంథానికి నా చేత ముఖచిత్రం కూడా సంతరింప చేశారు. ఇక వారితో పంచుకున్న సాహిత్య వేదికల సంగతి సరేసరి! అదే ప్రేమ, అదే వాత్సల్యం! ఎప్పుడూ. నేను ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా తెలుగు విభాగం అధిపతిగా జాతీయ కవిసమ్మేళనానికి పలుమార్లు వారిచేత వివిధ భాషా కవితానువాదాలు చేయించి ప్రసారం చేయించినందుకు ఆయన మురిసిపోవడం ఓ చిరంతన స్మృతి!

కవిగా పోతుకూచి ప్రధానంగా భావుకుడు. హాస్య వ్యంగ్య అభివ్యక్తి తత్పరుడు. అందరికీ అర్థమయ్యే వచనాన్ని ఆశ్రయించి తన కవితాత్మను కవి సమ్మేళనాలలో, పత్రికలలో వెలయించిన రస పిపాసి. సామాజిక స్పృహతోనే ఒక మానవీయ ప్రపంచాన్ని కలగంటూ కలం సారించిన సాహిత్యోప జీవి. ఎందరినో ప్రోత్సహించిన సంస్థాగత కార్యకర్త. ఆ సాహితీ భీష్మునికి వందనం! స్మృతిచందనం. *

**(డా॥పోతుకూచి సాహితీ సమాలోచనం గ్రంథం నుండి ఆగస్టు 27, 2018)**

# 63 (వి)ద్వానా శాస్త్రి హాస్య(సం)విధానం

**తె**లుగు అధ్యాపకులకు సహజంగానే కొంత హాస్యప్రియత్వం ఉంటుందని అందరూ అనుకునే మాటే. సినిమాల పుణ్యమా అని వారు అపహాస్యం పాలవుతున్నారు గానీ, నిజానికి సమాజంలో ఒకనాడు భాషపట్ల మమకారం, పట్టు, సాహిత్యంపట్ల అభిరుచి, సంభాషణాచాతుర్యం ఇవన్నీ విద్యార్థుల్లో కలిగించిన వారు వారే. మునిమాణిక్యం వంటి హాస్య రచయితలు అధ్యాపక వృత్తిలోంచి ఎదిగినవారే.

డాక్టర్ ద్వానా శాస్త్రి అమలాపురం కళాశాలలో ఆచార్యునిగా పనిచేసి రిటైరయినవాడు. ఇప్పటికీ వివిధ ప్రభుత్వోద్యోగ పరీక్షలకు, సివిల్స్‌కు హాజరయ్యే అభ్యర్థులకు –తెలుగు ఐచ్ఛికంగా తీసుకుంటే పాఠాలు చెప్పి మంచి ఫలితాలు సాధించుకునేందుకు తర్ఫీదునిస్తున్న మాస్టారు. 'ద్వానా మా'స్టారు' అనుకునే అభిమాన శిష్యులూ ఉన్నారు. స్వచ్ఛందంగా పదవీవిరమణ చేసి స్వేచ్ఛగా ఇంకా అధ్యాపక వృత్తి సాగిస్తూనే ఉన్నాడు. అసలు ద్వానాను చూడగానే నవ్వువస్తుంది. తన మాటతీరు, వేగం, చిరుకోపం అన్నీ ప్లెజెంట్‌గానే ఉంటాయి. తను చేసే గ్రంథసమీక్షల్లో కూడా వేసే చురకలు – సున్నిత హాస్యంతో వుండడం వల్లనే ఆ రచయితలకు కోపం రాకుండా, ద్వానా మాటను లక్ష్యపెట్టేలా చేస్తాయి. నిర్మొహమాటంగా, అనుకున్నది అనుకున్నట్లు చెపుతూనే –ఆ చెప్పే తీరులో హాస్యం, వ్యంగ్యం రంగరించి మాట్లాడడం తన అలవాటు. అందుకే సభావేదికలపై తను మాట్లాడుతున్నప్పుడు దేనికో ఒకందుకు సభాసదులు నవ్వక పోరు. ఆ హాస్యప్రియత్వమే నిజానికి ద్వానా చేత 'సాహిత్యనానీలు' రాయించింది. ప్రతిభామతులలోని విలక్షణ పార్శ్వాన్ని పట్టుకుని సరదాగా చెప్పినట్లుగా అవి అందుకే అనిపిస్తాయి, కనిపిస్తాయి.

ఏది తండ్రీ
నిన్న చూపిన
జ్వాలా ముఖమ్
అంతా గతం గతమ్

అబ్బూరి ఛాయ
పడని రచయిత్రి
ఇప్పుడు
జి.కె. భావయిత్రి

ఇలా ఆ సాహితీవేత్తల వ్యక్తిత్వాల మీద, వర్తమానాల మీద తన వ్యాఖ్యలను సంతరించిన తీరు గ్రహించి ఆనందించాల్సిందే.

అభ్యుదయ
రంగాచార్యకేముంది?
వేదాల 'పర్సు' వేదిని
పట్టుకున్నాడు.

నగ్నాక్షరాలను ఎన్నిచెక్కినా
మళ్ళీ మళ్ళీ
ఆ కొయ్య గుర్రమే
అమ్మనికి!

అనడంలోని శ్లేషల్లో –గడుసుదనపు విమర్శనా హాస్యం ప్రతిఫలించడం చూస్తాం. అలాగే 'ద్వానా' కవితల్లో 'పురుష వేదమ్' నిజానికి భార్యా బాధితుల సంఘం వ్యవహారాన్ని ముసుగువేసి చెప్పడమే. అయితే చివరకు మళ్ళీ... 'ఆ కొంటె నవ్వు నవ్వేదీ నువ్వే' అనడంలో –మునిమాణిక్యం దాంపత్య సరసశృంగారంలా ముగించడం హాస్యగత పార్శ్వమే. ఎన్నికల కమిషనర్‌గా శేషన్ పదవీవిరమణ సందర్భంగా 'కురుక్షేత్రవీరుడు' అని రాతరాస్తూ – "పడగ ఎప్పుడూ ఎత్తి పెట్టుకోనక్కరలేదు –వేళాపాళా లేకుండా నాలుకని జాడించనక్కరలేదు. యముడిక్కూడా 'సం' యమనం కావాలి కదా!" – అనడం నియంతకే నీతులు చెప్పేసాహసం వంటిదే. అలాగే సి.నా.రె మెచ్చినట్లుగానే అవ్యక్త ప్రేలాపనలను అత్యాధునిక కవితాభివ్యక్తులనే కవులను ఆటపట్టిస్తూ – ద్వానా రాసిన కవిత 'నూతిలో పర్వతాన్ని' అధిక్షేపహాస్యానికి నిజంగా ఓ మచ్చుతునక. అలాగే 'స్వాతంత్ర్యం ఉవాచ'లో –

పిరికితనం ఎరగనివాడు వీరుడు కాలేడు
స్కామిజం ఎరగనివాడు మంత్రికాలేడు
డబ్బులొచ్చే పదవిని డబ్బుతోనే సంపాదించాలి

అని హాస్యపు చురకలు వేస్తాడు

తాను రాసిన విమర్శనా వ్యాసాల్లో కూడా 'ద్వానాంతరంగం'లో – 'సొంతడబ్బా' 'తక్కువేమీ కాదు', 'నన్ను గుర్తించడంలేదు', 'బిరుదుల వ్యామోహం ఎందుకో', 'వాదించలేని వారే తిడతారు'. 'ఏ సాహిత్యసభ చూసినా ఏమున్నది గర్వకారణం', 'నేటి తెలుగు భాష ఏ దిశలో ఏ దశలో', వంటి వ్యాసాల్లో సీరియస్ విషయాలను కూడా వివరించి చెప్పడంలో లలిత హాస్య ఫణితిని గుర్తించగలం. అలా రాయడం నిజంగా తన విలక్షణ ప్రజ్ఞే.

అలాగే తాను శ్రమకోర్చి –సేకరించి, సంకలించి ప్రచురించిన 'సాహిత్య కబుర్లు'లో ప్రముఖుల హాస్యప్రియత్వాన్ని అభివ్యక్తంచేసే ఘట్టాలను చేర్చడం –తనకు హాస్యంపై గల మమకారం వల్లనే. టెంకిపాట, కుడిసి కుకుండనిస్తర, దాసువారి 'బ్రాహ్మణ' పద్యాలు, కాఫీ పురాణం, సాహిత్య వ్యాపార ప్రకటనలు, తిట్టుకవిగా శ్రీశ్రీ, కరుణశ్రీ వ్యంగ్యాస్త్రం మొదలైన అందులోని కబుర్లు హాస్యం ఎంత కమనీయమైనదో విశదపరిచేవిగా ఉన్నాయి. కాలక్షేపానికే కాక సాహిత్యనిక్షేపం లాంటి కబుర్లవి.

'ఎ జోక్ ఈజ్ ఎ జోక్ ఈజ్ ఎ జోక్ ఈజ్ ఎ జోక్' అన్నట్లు –కొన్ని పునరుక్తులుగా దొర్లినా, ద్వానా చెప్పే హాస్యగత అంశాలు ముఖ్యంగా సభావేదికల మీద – ఎక్కడికక్కడ శ్రోతలు మారుతూంటారు కాబట్టి నవ్వులు పండుతూనే ఉంటాయి మళ్ళీ మళ్ళీ.

ఇవన్నీ ఒక ఎత్తు. ద్వానా శాస్త్రి సరికొత్తగా సంతరించిన తన 'హాస్య రచనలు' ఒక ఎత్తు. తాను తన రచనాకృషిలో భాగంగా చేసిన హాస్యగత అంశాలను –రెండు పదులకుపైగా ఈ సంకలనంలో సంపుటీకరించాడు. తన కవిత 'నూతిలో పర్వతాన్నై నవ్వుతాను' ద్వానా కవితల నుండి ఇందులోనూ చేర్చాడు.

ఈ హాస్య రచనల్లో తను ప్రధానంగా రాజకీయాలు, సాహిత్యం ఈ రెండింటినీ లక్ష్యంగా చేసుకున్నాడు. విశ్వనాథ శైలికి పేరడీగా ఇందులో మూడు ఖండికలున్నాయి. ఎన్నికల గురించీ, ఆరుద్ర గురించీ పూర్తినిడివి ఖండికలు కాగా –"జ్ఞానపీఠంపై ప్రముఖులు: ఒక ప్యారడీ"లో సి.నారాయణరెడ్డి గారికి జ్ఞానపీఠం వచ్చిన సందర్భంగా కలిగిన ప్రకంపనలను –విశ్వనాథతో మొదలుపెట్టి, శ్రీశ్రీ, శేషేంద్ర, మునిమాణిక్యంల ఒరవడిలో పేరడీగా చిత్రీకరించాడు. సి.నా.రె.పై అపార గౌరవం ఉండీ, హాస్యంగా ఇలాంటి రచన చేయడం విశేషం! ఎందుకంటే ఒక కవిపై –అదీ సినారెపై నానీల

గ్రంథం రాసిన ఘనత ద్వానాదే మరి. అలాగే పేరడీ ప్రక్రియలోనే 'లేజీ విద్యార్థి' –రాయప్రోలు ఏ దేశమేగినా బాణీలో రాసింది. ప్రశ్నపత్రాలు కూర్చే స్వీయ అనుభవంతో 'ఎన్నికల ప్రశ్నపత్రం' 'మితప్రశ్న పత్రం' కూర్చిన తీరు –నిజంగానే నవ్వు తెప్పిస్తుంది. అయితే వీటిల్లోని వ్యంగ్యం గ్రహిస్తే, ద్వానా సమాజహిత చింతనాభిలాష తెలుస్తుంది. 'కరెంట్‌పై ఉచిత సలహాలు' –'విద్యుత్ కోత వర్ధిల్లాలి' అనే రెండు ఖండికలూ విద్యుత్ గురించి రాసిన హాస్య రచనలే అయినా హాస్యాన్ని కూడా భిన్న కోణాల్లో ఎలా పండించవచ్చో చక్కగా నిరూపించాడు.

'అసెంబ్లీ స్వగతం', 'బ్యాలట్ పేపర్ స్వగతం' రాజకీయాలపై ఎక్కుపెట్టిన హాస్యశరాలే. 'అందరూ కవులే' –కవిత్వం గురించీ, 'పీహెచ్‌డీ ప్రహసనం' –సిద్ధాంత వ్యాసాల గురించీ, ద్వానా తనకున్న అభిప్రాయాలను వ్యంగ్యంగా, చమత్కారంగా హాస్యభరితం చేశాడు.

ఇవన్నీ పగలబడి నవ్వేరచనలు కాకపోవచ్చు. మునిమాణిక్యంలా, ముళ్ళపూడిలా మనకు ఆనకపోవచ్చు. కానీ ద్వానా తన హాస్యంలో కూడా ఒక ప్రయోజనాన్ని ఆశించినవాడు. ఒక విమర్శకుడు ద్వానాలో ప్రధానంగా సమీక్షకునిగా దర్శనమిస్తుంటాడు కనుక, తన హాస్యరచనల్లోనూ ఒక సంస్కరణవైఖరి, ఒక వ్యంగ్య వైభవం, ఒక చమత్కారిదారి కనిపిస్తూంటాయి. సీరియస్ విషయాలను అంత సీరియస్‌గా చెబితే పాఠకులు అందుకోకుండా పారిపోతారేమోనని –సరదాగా చెప్పడం తనకిష్టం. తన మాటలయినా, పాఠాలయినా, వ్యాసాలయినా అందుకే ముఖం గంటుపెట్టుకున్న –పరమగాంభీర్యపు సీరియస్ దనంతో ఉండక, నవ్వుతూ నవ్వుతూనే, నవ్విస్తూ నవ్విస్తూనే – మనసులోకి ఇంకే ప్రయత్నం చేస్తాయి. సీరియస్‌గా పట్టించుకోవాల్సిన చోట కూడా – అలవోకగా తేల్చిపారవేసే సంవిధానం తనపట్ల ఎవరైనా చూపినా, తనకు వచ్చే కోపం కూడా అందుకే –చివరకు మనసు తేలికచేసే హాస్యంగానే పరిణమించి, ద్వానాని తిట్టుకునేవారు సైతం –తననే మళ్లీ ఆత్మీయంగా ఆదరించేలా తాను ఉంటాడు. తనది బహుముఖీన సాహితీ ప్రతిభ. 'విద్వానా' శాస్త్రి అనేలా కనిపిస్తాడు. (గిట్టనివారు అధ్వానాశాస్త్రి అనుకున్నా పట్టించుకోడు) ద్వాదశి నాగేశ్వరశాస్త్రి లోని హాస్య చంద్రకళలు సంపూర్ణ పౌర్ణమి కాకున్నా –'ద్వాదశి' గొప్ప తిథే. ద్వానా పాఠక హృదయాలకు సదా ఆత్మీయ అతిథే. ✱

**(ఆంధ్రప్రభ దినపత్రిక 15 జూన్' 2008)**

(64)

# ఆబాలగోపాల సాహిత్య కరుణారస సింధువు

'ఏకో రసః కరుణ ఏవ' అన్న భవభూతి వాక్యం భరద్వాజ రచనలకూ ప్రతీకగా నిలుస్తుంది. పేదరికం, ఆకలి, అవమానం, బాధ, దుఃఖం అనే పంచాంగాలను పట్టుకుని 'జీవనసమరాన్నే' తపోనిష్టం చేసిన ఋషితుల్యుడాయన. 'నానృషిః కురుతే కావ్యం' అన్నట్లుగా ఆయన రచనలన్నిటికీ ఆయన వ్యక్తిత్వమూ, జీవితమే కారణం. అర్ధాంగి కాంతమ్మ మరణం ఆయనచేత తెలుగు సాహిత్యంలో అజరామరమైన స్మృతి సాహిత్యాన్ని వెలయింపచేసింది. ఒక ప్రేయసి కోసం ప్రియుడు పడే విరహవేదన కాదు, ఒక దేవత కోసం భక్తుడు పడే తపన, ఆరాధన, అన్వేషణ 'నాలోని నీవు', 'అంతరంగిణి', 'ఐతరేయం', 'అయినా ఒక ఏకాంతం' 'ఒకింత వేకువ కోసం' అనే ఆ స్మృతి పంచకంలో రసభరితంగా రూపుదాల్చాయి. "గత శతాబ్దిలోని గణనీయ తెలుగు రచయితల్లో డా.భరద్వాజ గారిది భద్రస్థానం. ఆయన కథలు, నవలలు ఒక ఎత్తు. వచనాకృతిలో రచించిన స్మృతి కవిత్వం ఒక ఎత్తు. "రవీంద్రుడు తెలుగు నేర్చుకుని, రావూరి స్మృతి కవితలను చదివితే "ఎప్పుడు రాశానబ్బా ఇది" అని అబ్బురపోవడంలో ఆశ్చర్యం లేదు. అంతటి రసవంతమైన ఆర్ద్రతా నిధులవి" అని డా.సి.నారాయణరెడ్డి గారు వాటిని వస్తువు, భావం, అభివ్యక్తి ముప్పేటలుగా అల్లుకున్న ముక్తాహారాలుగా ప్రశంసించారు. పదిహేడు నవలలు, ముప్ఫైఏడు కథానికా సంపుటాలు, వందల కథలు, వ్యాసాలు, నాటకాలు, బాలల కోసం ప్రత్యేకంగా కథలు, నవలలతో బాటు సుగమ విజ్ఞానశాస్త్ర గ్రంథాలు నలభైకి పైగా రచించిన భరద్వాజ గారికి ఎనలేని కీర్తి తెచ్చి పెట్టిన గ్రంథం 'పాకుడురాళ్ళు' అనే నవల. సినిమా రంగంలోని తెర వెనుక విషాదగాథలను, కన్నీటి కాసారాలను 'మంజరి' అనే పాత్ర ద్వారా సజీవచిత్రణం చేసిన నవలకే జ్ఞానపీఠం గౌరవం దక్కడం కరుణకే కలికితురాయి.

1927 జులై 5 వ తేదీ రావూరి కోటయ్య, మల్లికాంబలకు జన్మించిన శరభాచారియే రావూరి భరద్వాజ. దుర్భర దారిద్ర్యం వెంటనుండి 1942 నాటికే

భరద్వాజ చదువు 8 వ తరగతిలోనే ఆగిపోయింది. ఆత్మాభిమానం మెండుగా గల భరద్వాజ 1945-46 లో తండ్రితో విభేదించి దాదాపు రోడ్డున పడ్డారు. జానెడు పొట్టకోసం ఆకలితీరే మార్గం వెతుక్కుంటూ వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, పచారీకొట్లో పొట్లాలు కట్టే కుర్రాడిగా, కాఫీ హోటల్లో కప్పులు కడిగి, పొగాకు బారన్‌లో బొగ్గు వేసే కూలీగా, కలప అడితిలో రంపంలాగేందుకు, కమ్మరి దగ్గర తిత్తులూది సమ్మెట వేసేందుకు, మిల్లులో ఆయిల్‌మెన్ కూలీగా, పేపర్‌బాయ్‌గా, ప్రూఫ్ రీడర్‌గా, కంపోజిటర్‌గా, పత్రికా రిపోర్టర్‌గా ఆయన చేయని ఉద్యోగం లేదు.

తెనాలిలో, ఆ తరువాత మద్రాసులో రకరకాల పనులు చేసిన భరద్వాజ గోపీచంద్ కారణంగా అప్పటి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావుగారి సహాయంతో 1959 నవంబరు 25 న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో 180 రూపాయల జీతానికి గ్రామస్తుల కార్యక్రమ విభాగంలో స్క్రిప్ట్‌రైటర్‌గా చేరారు. డిగ్రీలేని కారణంగా ప్రతిభ ఉన్నా ఆదరణ లేక ఎన్నో అవమానాలూ పడ్డారు. 1975 మే నెలలో గుజ్రాల్ కేంద్ర సమాచార శాఖామంత్రిగా ఉన్నప్పుడు ప్రొడ్యూసర్‌గా నియమితులయ్యారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర వైభవ ప్రాభవాలకు దోహదపడిన భరద్వాజగారు తనకు నీడనిచ్చి తిండిపెట్టిన సంస్థ పట్ల సదా కృతజ్ఞతాబద్ధంగా ఉన్నారు. రేడియోలో 'గాంధీమార్గం' ఆయన చదువుతుంటే గాంధీగారు తెలుగు మాట్లాడితే ఇలానే ఉంటుందనిపించుకున్నారు. బాలానందం, బాలవినోదం, బాలవిహార్ చిన్నపిల్లల కార్యక్రమాలను న్యాయపతి రాఘవరావు (రేడియో అన్నయ్య) తరువాత కొంతకాలం భరద్వాజగారే నిర్వహించారు. నిజంగా ఆయనది పసిపిల్లల హృదయం కాబట్టి చిన్నారులను అలరించారు. 27 ఏళ్లు ఆకాశవాణికి తన సేవ లందించిన ఆయన తెలుగు విభాగం ప్రొడ్యూసర్‌గా రిటైరయ్యారు. ఆయన రూపొందించిన కార్యక్రమాలు సృజనాత్మకతకు దర్పణాలు. ఆయన గళం శ్రోతలను రేడియో ముందు కట్టిపడవేసేది. ఎందరెందరో కవులను, రచయితలను, సాహితీవేత్తలను రేడియో కార్యక్రమాలతో ప్రోత్సహించారు. 'జాతీయజ్యోతి' పేర స్వాతంత్ర్య సమరయోధుల గళాలెన్నింటినో ధ్వని ముద్రితం చేసి భద్రపరిచారు.

బాలసాహితీవేత్తగా రావూరి భరద్వాజగారిని ప్రత్యేకించి చెప్పుకోవాలి. పలుపత్రికల్లో బాలల కోసం శీర్షికలు నిర్వహించారు. కథలు, నవలలు, విజ్ఞానం,

సైన్స్ ఫిక్షన్ వంటి బాలగ్రంథాలు యాభైకిపైగా ప్రచురితమయ్యాయి. పిల్లల కోసం ఆయన రాసిన తొలికథ 'మణిమందిరం'. మాయలు, మంత్రాలు, రెక్కల గుర్రాలు వంటి ఫాంటసీల నుండి విజ్ఞాన, తాత్విక విషయాలు తెలిపే బాలసాహిత్యం వెలువరించారు. నిప్పుకథ, నీటికథ, గాలికథ, బొగ్గుకథ, రబ్బరు కథ, మనిషి కథ ఇలా ఆయన రాసినవెన్నో. కుటుంబసభ్యుల ముచ్చట్లు తీరులో 'విను వీధిలో వింతలు' రాశారు. భరద్వాజ గారు రాసిన 'బంగారు కుందేలు' అనే బాల సాహిత్య గ్రంథం కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ ప్రచురణల విభాగం ప్రచురించింది. ప్రబోధాత్మక మానవీయ సందేశాల కథలవి. ఆ గ్రంథానికి ముఖపత్రం, లోపలి చిత్రాలు ఈ వ్యాసకర్త అయిన 'సుధామ' చిత్రించినవే. ఆకాశవాణిలో రావూరి భరద్వాజగారు ప్రొడ్యూసర్‌గా ఉండగా ఆయనకు సహాయకునిగా పని చేసి అనంతరకాలంలో ఆ తెలుగు విభాగానికి కార్యక్రమ నిర్వహణాధికారి 'సుధామ' కావడం తన అదృష్టమే మరి!

వ్యక్తిగా భరద్వాజగారు మానవతావాది. ఆయన చేసిన సహాయసహకారాలతో ఎందరో అథోజగత్సహోదరులూ ఉన్నతి చెందారు. 'కరుణ కదలి కారిన నీరు కాబట్టే కన్నీరు అంటారనుకుంటాను' అన్నట్లు ఆయన చలించిపోయే సందర్భాలు అనేకం. ఆకలి, అవమానం, అమానవీయం ఎరుగని సమాజం గురించే ఆయన కల. అందుకే ఆయన కలం. 'భరద్వాజ జీవితం – సాహిత్యం'పై త్రిపురనేని సుబ్బారావు 1987 లో ఓ గ్రంథం రాశారు. అక్టోబర్ 2000 లో పట్నాల సుధాకర్ 'స్మృతి సాహిత్యంలో ఈ శతాబ్ది గొప్పరచయిత డాక్టర్ రావూరి భరద్వాజ' అనే గ్రంథం వెలువరించారు. 1999 జూలై 'యోజన' పత్రికను భరద్వాజ ముఖచిత్రంతో, ఆయనపై వ్యాసంతో సుధాకర్ ప్రచురించడం అప్పట్లో ఒక సంచలనమే! "ఉత్తమ సాహిత్యానికి జ్ఞానపీఠం, నోబెల్ బహుమతుల్లాంటి అవార్డులే కొలబద్దలయితే ఆ అవార్డు లందుకునేందుకు కావలసిన అర్హతలను మించిన ఉత్తమ సాహిత్యాన్ని భరద్వాజ మనకు అందించారు" అని పట్నాల సుధాకర్ తన గ్రంథంలో పేర్కొన్నమాట అక్షరసత్యం. డా.రావూరి భరద్వాజగారికి 'జ్ఞానపీఠ్' లభించడం తెలుగు సాహిత్యానికే జిలుగు వెలుగు. బాలసాహిత్యం కూడా కేరింతలతో పకపకలాడుతున్న అపూర్వ సందర్భం. ✻

**(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం 28 ఏప్రిల్'2013)**

# (65) కమనీయ కథన శిల్పి పెద్దిభొట్ల

"ఏకో రసః కరుణ ఏవ" – అని తన కథల ద్వారా పఠితలలో ఆర్ద్రతను, భావానుభూతులను ఉద్దీపింపచేసే కథా 'భవభూతి' – పెద్దిభొట్ల సుబ్బరామయ్య. ఆయన కథ చదివి 'అనుకంప' పొందని పాఠకుడుండడు. నిజానికి ఒక మంచికథ యొక్క సంస్కార సంబంధమైన లక్ష్యం అదే కావచ్చునన్నది ఆయన గాఢ విశ్వాసం కూడాను. ఆయన కథల్లో అత్యధికం ఆద్యంత విషాదభరితాలే కావచ్చు గాక! ఆ కథల్లో సంఘటనలూ, సందర్భాలూ కంటే పాత్రలే ప్రధానంగా పాఠకులను పట్టుకు వెంటనంటి ఉంటుంటాయి కూడాను. చదివే పాఠకుల గుండెల్ని పిండేయడమూ, కంటతడి పెట్టించడమూ తన శిల్ప రహస్యంగా ఆయన పనిగట్టుకుని నిర్మించినవాడు కాదు.

ఆయన కథలేవీ నేలవిడిచి సాము చేయవు. ఉన్నదున్నట్టుగా కాకపోవచ్చు గానీ ఆయనే చెప్పుకున్నట్టు ఆయన కథల్లో చాలా మటుకు సొంత అనుభవాలే, పరిచిత వ్యక్తులే ప్రాతిపదికలుగా దీపిస్తూ ఉంటాయి. ఏ అనుభవాన్నీ యథాతథంగా కథగా మార్చడం సాధ్యం కానట్లే, స్వీయానుభవమే ప్రతి కథకీ పునాదిగా సమకూర్చడం సాధ్యం కాదు అంటారాయన. పెద్దిభొట్ల వారి కథలన్నీ అధిక శాతం మధ్యతరగతి కథలే. మధ్యతరగతి జీవితాలను చిత్రించడంలో ఆయనది అసమాన ప్రతిభ. ఆయన కథలు జీవితంపట్ల గౌరవాన్నే కాక మహత్తరమైన బాధ్యతను కూడా నిర్వర్తించే అభ్యుదయస్పృహ కలిగినవి. జీవితాన్ని వాస్తవిక సహజ కోణాల్లో దర్శించి, విమర్శనాత్మకంగా విశ్లేషించి, కథనాన్ని కమనీయంగా శిల్పీకరించే రచయిత ఆయన. తెలుగు కథానికను సుసంపన్నం చేసిన అగ్రగామి కథకుల్లో ఆయనదొక విశిష్టత. అయిదు దశాబ్దాలకుపైగా కథారచన చేస్తున్న పెద్దిభొట్ల సుబ్బరామయ్య 1938 డిసెంబర్ 15 న గుంటూరులో జన్మించారు. ఆయన రాసిన మొదటి కథ 'చక్రనేమి' 1959 లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో బాపు వేసిన బొమ్మతో అచ్చయ్యింది. 'భారతి'లో ఆ రోజుల్లో దానిని పునః ప్రచురించడం ఓ విశేషం.

ఏ మానవుడికీ అన్నీ తెలియవు. కొన్ని కొన్ని చిన్న చిన్న విషయాలే తెలియవు అనేందుకు దర్పణంగా పెద్దిభొట్ల వారు రాసిన 'ఇంగువ' కథ వర్ణనలూ, హంగులూ ఆర్భాటాలూ లేక సాదాసీదాగా సాగిన కథే అయినా ఒక అవిస్మరణీయ కథనం. ఇంతకూ ఆ కథలోని ఓ పాత్రకు ఇంగువ అంటే ఏమిటో తెలుసుకోవాలన్నది తపన. అది ఏ పదార్థం? చెట్టునుంచి వస్తుందా? ఏదయినా రసాయినిక పదార్థమా? లేక ఒక రకం రాయివంటిదా? అదీగాక ఏదన్నా జంతువుకు సంబంధించిందా? అన్న విషయం తెలుసుకోవాలన్న ఆరాటం. పదహారేళ్ళ ప్రాయం నుండీ ఆ సందేహం తనతోబాటు పెరుగుతూనే వచ్చింది. చివరకు ఆ సందేహం తీరకుండానే మరణిస్తాడు. 'ఇంగువ' కథ చదివాక పాఠకుడు కూడా 'ఇంతకీ కథలో ఇంగువ అంటే ఏమిటో చెప్పనే లేదు' అనుకుంటే "అట్లా ఇంగువ అంటే ఏమిటో చెబితే ఆయన పెద్దిభొట్ల సుబ్బరామయ్య ఎందుకవుతాడు? విశ్వనాథ అయి ఉండేవాడు" అన్న కీ.శే. విశ్వనాథ పావనిశాస్త్రి మాటే ప్రత్యుత్తరం మరి.

పెద్దిభొట్ల వారి కథల్లో బహుళ ప్రచారం పొందిన కథల్లో 'నీళ్ళు' ఒకటి. నీటి కరువు ప్రాంతం నుండి ఒక విద్యార్థి పుష్కలంగా నీరున్న తావుకి వెళ్ళాక విచిత్రంగా ప్రవర్తించి ఆ ప్రాంత ప్రజలను తన్మయ పరచిన కథ అది. నీరు మనిషి ప్రవర్తనాతీరుకు నిర్ణాయకశక్తి కావడాన్ని ఆ కథలో అద్భుతంగా చిత్రించారు. అలాగే 'దగ్ధగీతం' మరో గొప్ప కథ. ఆర్థిక సంబంధాలే మానవ సంబంధాలను శాసించే వికృతిని అప్పట్లోనే బలీయంగా రాసిన కథ. గొప్ప గాయని అయిన పంకజవల్లిని సేతురామన్ ప్రేమిస్తాడు. కానీ ఆమె రవిని పెళ్లాడుతుంది. రవి ఆమెను డబ్బు సంపాదించే యంత్రంగా మాత్రమే చూస్తూ, తన సుఖాల కోసం మరో స్త్రీతో సంబంధం పెట్టుకుంటాడు. పంకజవల్లికి గొంతు క్యాన్సర్ రావడంతో కొంత డబ్బిచ్చి ఆమెను వదిలివెళ్లిపోతాడు. పంకజవల్లి మరణించగా సేతురామన్ దహనక్రియలు చేస్తాడు. సహజ ప్రేమబంధాలను ధనసంబంధాలు ఎలా దోపిడీ చేస్తాయో తెలిపే కథ అది. అలాగే 'ముసురు' కథానికలో పరాయి స్త్రీ ఇంట్లో ఉంటే కామసంబంధాలు తప్ప ఆ స్త్రీ పురుషుల మధ్య మరో సంబంధం ఊహించలేని సమాజ కుసంస్కారాన్ని చిత్రించారు. పెద్దిభొట్ల వారి కథలలో విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల వాతావరణం బాగా కనబడుతుంది. అలాగే పాత్రలకు ఆయన కథల్లో ఎంత విశిష్టత ఉందో

ప్రకృతికి–ముఖ్యంగా మబ్బులు, ఎండ, వానలకు అంత ప్రాముఖ్యం ఉంది. వర్షం అయినా ఎండ అయినా ఆ వాతావరణ పరిస్థితిని తన కథలకు భిత్తికగా వాడుకోవడంలో కథకుడి నైపుణ్యం ఎన్నదగింది. "బలిసిన ఏనుగులన్నీ ఒకచోట చేరినట్టు జలార్ద్రమైన మబ్బులన్నీ ఒకచోట చేరి కురుస్తాం కురుస్తామని గర్జిస్తున్నాయి" అని కథకు ప్రారంభంగా ఎత్తుకోవడం వంటి విన్నాణాలు చూస్తాము. సుబ్బరామయ్యగారు ఇంతవరకూ రాసిన కథలు ఓ రెండు మూడు వందలు కావచ్చు. కానీ వాటిల్లో విస్మరించలేని వెంటాడేకథలు అనేకం. నీళ్ళు, చీకటి, ముసురు, నిప్పుకోడి, పూర్ణాహుతి, గాలి, అలజడి, సతీసావిత్రి, శుక్రవారం, దుర్దినం, దగ్ధగీతం, కొళందవేలు బొమ్మ చిలిపితనం, చింపిరి, చిలకహంస, పీట, తాతిగాడి చొక్కా, కళ్ళజోడు, కోదండంగారి కల, కోరిక, ఏస్‌రన్నర్ ఇలా ఎన్నో.. క్రీడాంశ నేపథ్యంగా మంచి కథలు రాసిన ఘనత పెద్దిభొట్ల వారిదే. ప్రపంచ ఛాంపియన్‌గా ఖ్యాతిపొందిన గ్రామ పహిల్వాన్ తన చివరి దినాల్లో ఆకలి బాధతో అస్తమించాడని తెలిసి రాసిన కథ 'నిప్పుకోడి'. 'ఏస్‌రన్నర్' కథ అలా క్రీడాకారుని దుర్భర స్థితిని చెప్పేదే. ఏ యండమూరో 'దవడ కండరం బిగుసుకుంది' అని ప్రయోగించడం వేరు. పెద్దిభొట్ల వారి కథల్లో 'వేళ్ళు విరుచుకోవడం' అనే చేష్ట పాత్రపోషణకు ఒడుపుగా వాడుకున్న కథలు కొన్ని కనిపిస్తాయి. ఆ పాత్రల మానసిక స్థితి చిత్రణకు ఆ చేష్టను ఆయన ఎంత బాగా ఉపయుక్తం చేసిందీ కథాకథనంలో మనం గ్రహించగలుగుతాం. పెద్దిభొట్ల కథలు పాఠకుల ముందు ఆవిష్కరించే ప్రపంచం అంతరంగాన్ని స్పృశించి, ఉద్రూతలూపి, ఆర్ద్రతతో సంచలింపచేసి, అనుభవ గాఢతను అందించి, జీవితపు వాస్తవిక పార్శ్వాలనే విశేషీకరించి చూపేవిగా ఉంటాయి. ఒక విషాద అనుభవ సంబంధితమై, ఆ అనుభవం పాత్రలు, ఉపమలు, ప్రతీకల ద్వారా చిత్రింపచేస్తూ 'అనుకంప' రేకెత్తించేవిగా ఉంటుంటాయి. మధ్యతరగతి బ్రతుకుల వివిధ పార్శ్వాల విషాద ఛాయలన్నీ ఆయన కథల్లో తారట్లాడుతూ వారి బ్రతుకు ఖాళీలను సృజనాత్మకంగా పూరించుకునే చైతన్యోద్దీపకాలుగా భాసిస్తుంటాయి. ఆయన కథల గురించి నలుగురూ పలికిన మాటల్లోని యథార్థాలను పాఠకులే గ్రహించగలుగుతారు. జీవన బీభత్సాన్ని అసాధారణంగా చిత్రించిన కథాశిల్పి పెద్దిభొట్ల అని పురాణం సుబ్రహ్మణ్యశర్మ కొనియాడారు. జీవితంలోని విషాదాన్ని తప్ప ఉత్సవ వైభవం కేసి కన్నెత్తి చూడని కథారచయిత సుబ్బరామయ్య అని భమిడిపాటి

జగన్నాథరావు ప్రశంసించారు. దళిత బ్రాహ్మణుల చరిత్రకారుడు అని 'మో' విశ్లేషిస్తే, బాల్యం పారేసుకున్న భవభూతిభ్రాత అని పెద్దిభొట్లను కప్పగంతుల మల్లికార్జునరావు ప్రశంసిస్తారు.

"కరుణ జీవలక్షణమన్నది నా నమ్మకం. అందులో కూడా గాఢమైన దైనమిజం ఉందని నేను భావిస్తాను. అలాంటి కథలు నేను చాలా కోపంతో రాస్తానని చెబితే బహుశా మీరు నమ్మరు. మన సమాజం మహా క్రూరమైనది. మతం, కులం, వర్గం, జెండర్ – ఏది తీసుకుని చూసినా ఆ విషయం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. రోడ్డు మీద అడుగుపెట్టిన దగ్గర్నుంచీ అడుగడుగునా మన సామాజిక జీవనంలోని క్రూరత్వం సెవంటీ ఎం.ఎంలో కనిపిస్తూనే ఉంటుంది. మన మానవ సంబంధాలు బహుబలహీనమైనవి. వాటికి సొంత రంగూ రుచీ వాసనా ఉండడం అరుదు. ఇలాంటి జీవితాన్ని ద్వేషించకుండా ఉండేవాళ్ల మానసిక ఆరోగ్యం మీద నాకు నమ్మకం లేదు. రచయితగా ఇలాంటి పరిస్థితికి – అసహాయతకి స్పందించకుండా ఎలా ఉండగలమో ఊహాతీతం. అది ఆగ్రహం కాక మరోలా ఎలా ఉండగలదు? అయితే కరుణ రసాన్ని వాహికగా చేసుకుని నేను నా ఆగ్రహాన్ని ప్రకటిస్తాను. అది వాచ్యంగా ఉండకపోవడం దాని బలహీనత కాదు బలమే అనుకుంటాను. అలాంటి కథలవల్ల పాఠకుడికి ఒక్కోసారి శోకం ముప్పిరిగొనే అవకాశం ముమ్మాటికీ ఉంది. కానీ అది అతగాడిని నిష్క్రియాపరత్వం వైపో, మెట్టవేదాంతం వైపో తీసుకెళ్తుందని మాత్రం నేను అనుకోవడం లేదు" అంటారాయన. భావతీవ్రతతో కదిలిపోయినప్పుడు మాత్రమే కథలు రాసే పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు అయిదు దశాబ్దాలకుపైగా తెలుగు కథకు సమకూర్చిన వైభవ ప్రాభవాలకు గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం తెలుగు సాహిత్య ప్రపంచానికి ముదావహమైన విషయం. డెబ్భై అయిదేళ్ల ఈ అవిశ్రాంత సాహిత్యపథికుడు తెలుగువారు గర్వించదగిన ఉత్తమ కథారచయిత. జీవితంలోని కశ్మలాన్నీ, కల్మషాన్నీ కడుక్కుని, అమానవీయ సాంఘికాంశాలను విదుల్చుకుని, జీవితాన్ని అర్థం చేసుకుని జీవనం సాగించడానికీ, జీవితం మీద విమర్శ పెడుతూనే జీవితం మీద ఆశ కలిగించుకోవడానికీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు దారిదీపాలు. ✱

**(ఆంధ్రభూమి దినపత్రిక సాహితి 27 డిసెంబర్' 2012)**

(66)

# సంపెంగలూ - సన్నజాజుల సాహితీమూర్తి అవసరాల

ఆయన వృత్తిరీత్యా ఆంగ్లోపన్యాసకుడిగా పనిచేశాడు కానీ, అభిమాన మంతా- ప్రవృత్తిరీత్యా తెలుగు రచనల మీదే. అందునా - హాస్య చమత్కారాలంటే మక్కువ ఎక్కువ. బాల సాహిత్యం నుంచి ప్రారంభించి, కథా, నవలా సాహిత్యం వరకూ ఎనభై ఏళ్ల తన జీవితకాలంలో అరవై ఏళ్లు అవిరళ సాహిత్య వ్యాసంగం సాగిస్తూనే వచ్చాడు. హంస ఎగిరిపోవడానికి ముందూ- 'హంస్ ఇండియా'లో మంగళవారం తెలుగుతీపినే ఇంగ్లీషు ముక్కల్లో కాలమ్‌గా 'కలం' సారించాడు. విశాఖపట్నం అనగానే గుర్తొచ్చే సాహితీమూర్తుల్లో విశిష్టుడాయన. ఆయనే అవసరాల రామకృష్ణారావు. అక్టోబర్ 29 న హైదరాబాద్‌లో కన్నూ, పెన్నూ మూసిన కథావసరాల కమనీయ సాహితీ సృజనమూర్తి.

1947 జూలైలో చందమామ పిల్లల మాసపత్రికలో 'పొట్టి పిచ్చుక' కథ అంటూ తొలికథ రాసిన ఈ సన్నని పొట్టి రచయిత గట్టిపిండంగా తెలుగు సాహిత్యంలో పాదుకుని తన చివరికథ 'విశ్వాసం'నూ ఈ డిసెంబర్ 2011 చందమామలోనే వెలయించడం విచిత్రమే మరి! చందమామలాగా చల్లని వెన్నెలనూ హృదయాహ్లాద చిరు ఉష్ణాన్నీ తన రచనలన్నింటా వెదజల్లినవాడు. 1931 లో జన్మించిన అవసరాల రామకృష్ణారావు ఉద్యోగరీత్యా చాలాకాలం ఒరిస్సాలో ఉన్నారు. ఆ తరువాత విశాఖకు తరలారు. బరంపురం కల్లికోట కళాశాలలో, భవానీపట్నంలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేసిన అవసరాల తాను సృజనశీలిగా ఉండడం మాత్రమే కాదు- ఎందరిచేతో కలంపట్టించి సాహిత్య అవసరాలను తీర్చేలా చేశారు. బరంపురంలో 1971 లో 'వికాసం' స్థాపనకు మూలాధారనాడి ఆయనే. 'అరసం, విరసంలు ఏవయినా కావలసింది మటుకు అందరికీ వికాసం' అంటూండేవారాయన ఆరోజుల్లోనే. ఆయన బరంపురం నుంచి బదిలీ మీద వెళ్లాకే వికాసం ప్రథమ వార్షికోత్సవం జరిగితే రాలేకపోయినందుకు ప్రాణమంతా అక్కడే ఉందంటూ పాట రాసి దేవరాజు రవికి

పంపితే వాళ్లావిడ సీత దానికి రాగం కట్టి సభలో పాడిందట. రష్యా నుంచి వెనక్కి స్వదేశం వచ్చిన ఉప్పల లక్ష్మణరావు గారు అప్పుడు వికాసం అధ్యక్షులుగా అవసరాల కాంక్షను అభ్యుదయ పథనిర్దేశం చేశారు.

"నేను నా లైబ్రరీలో పెట్టుకునే మొదటి పుస్తకం రావిశాస్త్రి ఆరు సారా కథలయితే ఆ తరువాత పెట్టుకునే పుస్తకం ఏదయినా ఉందంటే అది అవసరాల రామకృష్ణారావు రాసిన 'అయిదురకాల ఆత్మహత్యలు' కథాసంపుటి" అంటాడు ప్రముఖ చిత్రకారుడు చంద్ర. బాలసాహిత్యంలో అవసరాల చేసిన కృషి అనుపమానమైనది కాబట్టే బాలసాహిత్య పరిషత్తు చొక్కాపు, దాసరి 'వెంకటరమణ' ద్వయం నవంబర్ 13 న ఆయనకు ఆత్మీయ సంస్మరణ సభను హైదరాబాదులో నిర్వహించడం జరిగింది. రచన శాయి, కె.ఎల్.ప్రసాద్, అద్దంకి శ్రీనివాస్, జెన్నీ, డాక్టర్ కె.బి.లక్ష్మి, మారేమండ సీతారామయ్య, అక్కిరాజు జనార్దనరావు, దేవరాజు రవి, చంద్ర, సుధామ ప్రభృతులు అవసరాల రామకృష్ణారావుగారి ఏకైక కుమారుడు అవసరాల జగన్నాథరావు దంపతులతో బాటుగా దివంగత అవసరాల వారి జ్ఞాపకాలను కలబోసుకున్నారు. విశాఖ సంగతి చెప్పనే అక్కర్లేదు. తమ నగరానికే ప్రతిష్ట తెచ్చిన సాహితీమూర్తులలో ఒకరిని కోల్పోయినందుకు వారి గుండె సముద్రమైంది.

'జార్జి ఆర్వెల్' మీద ఆంగ్లంలో పీహెచ్‌డీ చేసిన అవసరాల వారు ఇంగ్లీషు కొరకరాని కొయ్య ఏమీ కాదని పిల్లలకు పండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా 'అంగ్రేజీ మేడీజీ' రచించారు. బాలసాహిత్యంలో కథలు, పాటలు ఎన్నో రాశారు. ముఖ్యంగా 'కేటు-డూప్లికేటు', 'గణిత విశారద' ఎందరినో ప్రభావితం చేసిన బాలసాహిత్య రచనలు.

తెలుగు కథారచయితగా, నవలాకారుడిగా, అనువాదకునిగా, సమీక్షకునిగా ఆయన తనదైన శైలితో రాణించారు. 'పేకముక్కలు', 'సంపెంగలూ-సన్నజాజులూ', 'అది ప్రశ్న ఇది జవాబు', 'సహజీవన సౌభాగ్యం', 'హెడ్‌మిస్ట్రెస్ హేమలత', 'మేం చేసిన తప్పులు మీరూ చేస్తారా', 'రామచిలుక', 'అమ్మకానికో అబ్బాయి', 'అడుగడుగో మామయ్య ఆ వెనుక మేరీ' వంటి ఆయన రచనలన్నీ తెలుగు పాఠకులను అలరించాయి. బరంపురంలో యువకులచేత కథలు రాయించి 'మనం మనం బరంపురం' అనే పేరుతో కథాసంపుటి వేయించింది ఆయనే. విశాఖలో అవసరాల,

భరాగో, యం.రామకోటి 'రామత్రయం'గా ప్రసిద్ధిగాంచారని మరో 'రామ' నామాంకితుడు 'రామతీర్థ' అంటాడు.

వికాసం వార్షికోత్సవం సభకు సి.నారాయణరెడ్డి గారు వెళ్లారు. అవసరాల రాసి పంపిన పాటలో 'ప్రతి నిమిషం పనిచేసే పంచదార ఫ్యాక్టరీ' అని సినారేను ప్రశంసించారుగానీ నిజానికి అవసరాల కృషి కూడా అలా అనవద్యంగానే సాగినా ఆయన ఎప్పుడూ ఆర్భాటాలకు ఆరాటపడినవాడు కాదు.

"వినయం నీదయితే
విజయం నీదేరా
సహనం నీదయితే
సకలం నీదేరా"

అని విశాఖ ఆకాశవాణికి రాసిన ఒక పాటలో అన్నట్లు మాటలో, మన్ననలో మర్యాదామప్పితాలతో బాటు సునిశిత చమత్కారాలు, సూటి వ్యంగ్యాలూ గుప్పించే సంభాషణా చతురునిగా రాణించాడాయన. భార్య శారద అనారోగ్యంగా ఉన్నా ఆవిడకు సేవలు చేస్తూనే తన సాహితీవ్యాసంగాన్ని సాగించారాయన.

హైదరాబాద్‌లో భార్యకు ఒక సర్జరీ నిమిత్తం వచ్చినప్పుడు ఆమె భయపడుతూంటే 'సర్జనులు అందరూ దుర్జనులు కాదు. ఏం భయంలేదు' అని అట్టి పరిస్థితిలోనూ సరసంగా ధైర్యం చెప్పిన స్థిత ప్రజ్ఞుడాయన. చివర్లో హైదరాబాద్‌లో ఆసుపత్రిలో చేరే ముందూ దేవరాజు రవితో "గుండెలో ఏవో రెండు చిల్లులున్నాయట. అవి డాక్టర్లచేత పూడ్చేయడానికి – వద్దులేరా అన్నా మా అబ్బాయి తీసుకువచ్చాడు. డాక్టర్లు పూడ్చేయలేకపోతే మా వాడు పూడ్చేస్తాడు అంతేగా!" అని నవ్వుతూ అన్నారట. కష్టకాలంలోనూ పెదవుల మీద హాసరేఖ, మాటలో గిలిగింత రేఖ వీడని నిబ్బరపు మనిషాయన. 'లవ్వుకు ఏజ్ బారేమిటి రంగనాయకీ' అన్న ఖుషీవలత్వం.

అవసరాల వారికి ఛాందసం లేదుగానీ ఛందస్సు అంటే ఇష్టం. కమనీయమైన పద్యాలు కూడా గేయాలు పాటలతో పాటు రచించారు. అందంగా కందాలు చెప్పారు. నేను ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉన్నప్పుడు ఏదో పనిమీద విజయవాడ వచ్చి కలిసి అడగగానే కాదనకుండా ఓ కథ రాసి రేడియోలో వినిపించారు. 'ఇండియా టుడే' తెలుగు పత్రికలో తనదైన శైలిలో ఆయన

చేసిన పుస్తక సమీక్షల్లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం పొందిన సుధామ 'సం.సా.రా.లు' గ్రంథం కూడా ఉంది.

అవసరాల వారి కథలు మానవజీవన పార్శ్వాలనెన్నింటినో గాఢంగా స్పృశించుతూ పాఠకులను అలరించాయి. రిటైరయ్యాక కూడా కొన్నాళ్లు విశాఖ శ్రీచైతన్య ఐఐటీకి ఆంగ్లంలో కోచింగ్ ఇచ్చారు. ఆయన పుస్తకాలు అచ్చువేస్తామంటూ ముందుకొచ్చిన వారెందరో ఉన్నారు. అచ్చువేసిన పుస్తకం అమ్ముడుకాగా వచ్చిన ప్రతిపైసా ఒక అనాథ శరణాలయానికి ఇస్తానన్న వదాన్యుడి చేతనే తన కథా సంపుటి 'ఆస్థిపంజరం' అచ్చుకు అంగీకరించారట ఆయన.

"గొప్ప గొప్ప ఘనులనైన
కుప్ప కూల్చి కుదిపేందుకు
రెప్పపాటు సందుచాలు
చుప్పనాతి కాలానికి"

అని అవసరాల రామకృష్ణారావుగారే రాసినట్లు, అవసరాల అసాహిత్యోధృతి అగుపడుతున్న కాలాన అవసరాల వారి మరణం విశాఖ సాహిత్య ప్రపంచానికే కాదు తెలుగు సాహిత్యానికి ముఖ్యంగా బాలసాహిత్యానికీ, కథాసాహిత్యానికీ ఒక పూడ్చలేని వెలితియే. ✻

**(ఆంధ్రభూమి మాసపత్రిక డిసెంబరు' 2011)**

## 67

# సాహిత్య క్షేత్రాన తెలుగు కథానికా రథసారథి!

**న**వలలోనూ కథ ఉంటుంది. నాటకంలోనూ ఓ కథ ఉంటుంది. సినిమాలోనూ కథ ఉంటుంది. అందువల్ల ప్రక్రియాపరంగా కథ అనకుండా 'కథానిక' అనడమే సరియైనది అంటూ 'కథానికా జీవి'గా తన జీవితాన్ని ఆ ప్రక్రియ అభివృద్ధికి, వ్యాప్తికి, కథానికా రచయితల అభ్యున్నతికి అంకితం చేసినవాడు కీ.శే.వేదగిరి రాంబాబు. తాను స్వయంగా రచయిత. రాసిన వాటిని మానవీయ భావనలతో ప్రజాహిత చింతనతో రాశాడు. నేరస్తులనబడే ఖైదీల వాస్తవిక జీవితాలను, చాకిరీలతో మగ్గే పాపం పసివాళ్ల బతుకువెతలను, 'పరోపకారార్థ మిదం శరీరం' అన్న భావనకు ప్రోది కల్పించే అవయవదాన కథలను, అనారోగ్యంతో కునారిల్లుతున్నా, చివరి దశలోనూ తెలుగుభాష గురించిన ఉనికిపట్ల ఆర్తితో భాషోద్యమ కథలను రాంబాబు రాశాడు. నిజానికి రాంబాబు 'కథానిక'ను ఒక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళినవాడు. ఉభయ తెలుగురాష్ట్రాల అన్ని జిల్లాల్లోనూ కథ గురించిన సదస్సులను నిర్వహించాడు. ఎక్కడెక్కడి కథానిక రచయితలనూ జిల్లాలవారీగా ఏకీకృతం చేసి వారిచేత కథలు రాయించాడు. కథానికా సదస్సుల విశేషాలన్నింటినీ గ్రంథస్థం చేశాడు. కథానికా వికాసానికి ఒక కాపుకాచిన తను – ఆర్థికంగా సంపన్నుడేమీ కాదు. నెలసరి నికరాదాయపు స్థిరమైన ఉన్నతోద్యోగికూడా కాదు. అయినా ఎటువంటి వ్యాపార ధోరణులూ లేక ఆ ప్రక్రియకు, ఆ ప్రక్రియను నమ్ముకున్న రచయితలకు సాహిత్యరంగంలో అపారమైన సేవ చేశాడు. రాయడం మానేసిన సీనియర్ రచయితల చేత కూడా మళ్లీ కలం పట్టించి కథానికలు వెలయింపచేసి గ్రంథస్థం చేసిన ఖ్యాతి తనదే. అలాగే 'కొత్తకథ' కొత్త రచయితల చేత వారిని ప్రోత్సహిస్తూ వెలయించాడు. అలాంటి కథానికా బృహత్సంకలనాలెన్నో! అంతేకాదు, బుచ్చిబాబు పేర అవార్డు నెలకొల్పి ప్రదానం చేస్తూ ఆ స్వీకర్త రచయితల కథల సంపుటులను ప్రచురించిన ఘనత తనదే.

ఏటా పత్రికలలో... అవి దిన, వార, మాసపత్రికలు ఏవయినా కావచ్చు. వాటిల్లో వేలాది కథలు ప్రచురితమౌతుంటాయి. 'తెలుగు కథానికా సమీక్ష' పేరిట ఏటేటా కొన్నేండ్లు ప్రతి పత్రికలో వచ్చిన కథలన్నింటినీ ప్రముఖులచే సమీక్షింపచేసి ఆ వ్యాసాలతో పుస్తకాలను ప్రచురించింది తానే. 'శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్'ను నెలకొల్పి తద్వారా ఎందరో రచయిత(త్రు)లను ప్రోత్సహించాడు. అక్టోబర్ 14 తన జన్మదినాన్ని 'కథానికతో ఒక సాయంత్రం' పేర జరుపుకున్నాడు. కథకులకు అవార్డులు ప్రదానం చేశాడు. తాను ఇచ్చాడు. ప్రతిభావంతులకు ఇప్పించాడు. తొలుత ఆంధ్రభూమి వారపత్రికలో సహాయ సంపాదకునిగా కొన్నాళ్లు పనిచేసి, ఓ మాట పట్టింపుతో ఆ ఉద్యోగం వదిలేశాడు. ఆ తరువాత ఆకాశవాణి, దూరదర్శన్‌లలో క్యాజువల్ పద్ధతిలోనూ పనిచేస్తూ తన రచనావ్యాసంగాన్నీ, సాహితీ సేవలనూ కొనసాగించాడు. స్థిరమైనఉద్యోగం లేక ఒక ఫ్రీలాన్సర్‌గా దాదాపు మూడుదశాబ్దాలుగా ఎలా సాగుతోందో అతని జీవిక అని అచ్చెరవు కలుగుతూనే ఉండేది. కుటుంబ బాధ్యతలు నిర్వర్తించుకుంటూనే కథానికా వికాసానికి అంకితమై ఎంతెంత తిరిగాడో! వేదగిరి రాంబాబు ధర్మపత్ని శ్రీమతి పెమ్మరాజు సంధ్యారాణి నిజంగా ఒక మహా ఇల్లాలుగా భర్తకు చేదోడు వాదోడుగా నిలచి ఎన్నెన్ని కష్టాలు భరించిందో! రాంబాబులో ఆవేశం ఉంది. ఓ పట్టుదల, ఓ మొండితనం ఉంది. అనుకున్నది సాధించే నేర్పు ఉంది. నలుగురిని కూడగట్టగల చొరవ ఉంది. అదే సమయంలో నచ్చని వాటిని, వారిని నిర్భయంగా విమర్శించే మాటదురుసూ ఉండేది. అయితే అతని మనసు నిష్కల్మషం. అది సదా స్నేహపాత్రం. అతనిలోని గొప్ప వదాన్యతాగుణం కూడా అందరూ ఎరుగనిదికావచ్చు. గురజాడ, గిడుగు, శ్రీపాద, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు అసలు ఆ మాటకొస్తే కథానికా దీపధారులైన పెద్దలు అనగానే అతనికి ఎక్కడలేని పూనకం వస్తుంది.

విజయనగరంలో శిథిలమౌతున్న గురజాడ ఇంటికి మరమ్మతులు చేయించి ఆ గ్రంథాలయానికి పూర్వవైభవం తెచ్చి గురజాడ జయంతులు, వర్ధంతులు ఘనంగా చేయించి 'గురజాడ సమగ్ర సాహిత్యం' ఈ తరానికి మళ్లీ అందుబాటులోకి తేవడంలో రాంబాబు కృషి అపారం. అలాగే గిడుగువారి రచనలను, ఆయన రాసిన సవర భాషా వ్యాకరణాన్నీ పునర్ముద్రింప చేసిన ఘనతా తనదే. శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి

విగ్రహం నెలకొల్ప చేశాడు. తాను సంపాదకునిగా అనేక కథానికా సంకలనాలు తెచ్చాడు. టీవీ రంగంలో కాలిడి అనేక డాక్యుమెంటరీలు తీశాడు. 'జైలు గోడల వెనుక', 'పాపం పసివాళ్లు' వంటి ప్రయోజనాత్మక చిత్రాలతో రాష్ట్ర ప్రభుత్వంచే మూడుసార్లు 'నంది' అవార్డులు పొందాడు.

డాక్టర్ వేదగిరి రాంబాబు అంటే కొందరు నిజంగా తను వైద్యుడు అనుకునేలా వైద్యరంగానికీ సేవలందించాడు. 'నిమ్స్'లో ఓ.ఎస్.డి.గా, ఆపై గ్లోబల్ హాస్పిటల్స్‌లో పి.ఆర్.ఓ.గా తను చేసిన సేవలు, వైద్యపరమైన రచనలతో ఒక అవేర్‌నెస్ కల్పించిన వైఖరి అనుపమానమైనవి. 'మన ఆరోగ్యం' పత్రికకు గౌరవ సంపాదకునిగా వైద్యపరమైన ఉపయుక్త రచనలకు ఓ దిశానిర్దేశం చేశాడు. ఆకాశవాణిలో 'యువవాణి' రోజుల నుంచీ పరిచయం. గురజాడ 150 వ వర్ధంతి సందర్భంగా తాను 'కథానికాజీవి' అయి ఉండీ శతాధిక కవుల కవితలతో 'అక్షర' పేర ఓ కవితాసంకలనానికి సమకట్టి 'సుధామా! నువ్వే సంపాదకునిగా ఈ సంకలనం చేసిపెట్టాలి' అని కోరి, నిజంగా ఒక చారిత్రక సందర్భాన్ని కవితామయం చేసిన ఘనతా తనదే! ఆ సంకలనం 'వేదగిరి కమ్యూనికేషన్స్' కవితాభిమానులకు అందించిన విశేషకానుకే! ఆదివిష్ణు, వీరాజీ, విహారి, యర్రంశెట్టిశాయి వంటి వారిని గురుభావంతో గౌరవించుతూ ఎందరో యువ కథకులను ప్రోత్సహించి, వెన్నుతట్టి వారి అభ్యున్నతికి దోహదపడిన రాంబాబు పేరిట బహుమతికథల రచయిత సింహప్రసాద్ అభిమానంతో ఒక అవార్డును నెలకొల్పి రాంబాబు ఉండగానే ప్రారంభించడం రాంబాబు పట్ల ఎందరికో గల గౌరవానికి ఒక మంచి సూచిక. ఈ ఏడాది జనవరిలోనే ప్రతిష్ఠాత్మక అ.జో.వి.భొ. కందాళై పురస్కారాన్ని రాంబాబుకు ప్రకటించారు. అనారోగ్య కారణంగా తాను స్వయంగా అందుకోలేకున్నా రాంబాబు కృషిపై ఒక సమగ్రసదస్సు, సాయంత్రం బహుమతి ప్రదానం గుంటూరులో జరిగాయి. ఆ తర్వాత సంస్థ ప్రతినిధులు స్వయంగా ఇంటికి వచ్చి రాంబాబుకు పురస్కార ప్రదానం చేశారు. గత కొన్ని నెలలుగా మంచానపడినా అనారోగ్యం శరీరానికే గానీ మనసుకు కాదని వ్యవహరించి చివరకు ఆగస్టు 18 రాత్రి అస్తమించాడు. కథానికా ప్రపంచానికి కంటతడి మిగిల్చాడు. ✻

**(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం 26 ఆగస్టు 2018)**

# (68) వి'చారి'స్తేనాకవి...

"దియె జల్‌తేహై - ఫూల్ ఖిల్‌తే హై
మగర్ బడీ ముష్కిల్‌సే - దునియామె దోస్త్ మిల్‌తే హై"

స్నేహానికి నిలువెత్తు మనిషి రంగాచారి. మా స్నేహం సమవయస్కత వల్ల వచ్చింది కూడా కాదు. నా కన్నా రంగాచారి పదేళ్లు పెద్దవాడు. రంగాచారికన్నా మా జగన్నాథరావుగారు పదేళ్లు పెద్ద. ముగ్గురికీ వయసులో దశాబ్దం దశాబ్దం తేడా ఉన్నా, మేం మంచి మిత్రులమయ్యాం. ఆంధ్రసారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాల విద్యార్థులుగా బి.ఓ.ఎల్ కంబైన్డ్ స్టడీ చేశాం. 'లహరి' అనే సంస్థ స్థాపించి, కళాశాలలోనే సాహిత్యాభిరుచితో సమావేశాలు జరిపాం.

నాకు రంగాచారి కుటుంబ స్నేహితునిగా మారిపోయాడు. ఒకరినొకరు చూసుకోకుండా, కలవకుండా, పలకరించుకోకుండా ఉండలేకపోయే వాళ్లం. ఒక్కోసారి నిజానికి మా మధ్య కబుర్లు కూడా ఏం ఉండేవి కావు. ఊరికే అలా పరస్పరం కూచున్నా- స్నేహతరంగాలు పరివ్యాప్తమౌతూనే ఉండేవి. మాది ఏనాడూ ఆర్థిక సంబంధం కాదు. కేవలం హార్దిక సంబంధమే. ఎవరి జీవనవిధానం వారిదే అయినా, ఎవరి వ్యావృత్తులు వారివే అయినా, కలుసుకునేది వారానికో పది రోజులుకో ఒకసారిగా రానురాను పరిణమించినా, ఏ పరిస్థితులూ, సంఘటనలూ బలీయమైన మా స్నేహానికి అవరోధాలు కాలేదు.

చారీ, నేనూ కలిసి ఎం.ఫిల్ కూడా చేశాం. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో సెమిస్టర్ క్లాసులు మమ్మల్ని మరింత దరిచేర్చాయి. నా కవిత్వం తనకు ఇష్టం. తన కథలు నాకు ఇష్టం. తన కథ ఆంధ్రప్రభలో అరవై, డెబ్భయ్యో దశకంలోనే బాపువేసిన బొమ్మతో వచ్చిందని తెలిసి నేను మొదటిసారి తనను అబ్బురంగా, ఆరాధనగా చూశాను. రైల్వే ఉద్యోగిగా తను ఆ శాఖకు సంబంధించిన గ్యాంగ్‌మెన్, ట్రాలీమెన్ వంటివారి జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని కథలు రాయడం నాకు మరీ నచ్చింది. రంగాచారికి చలం, బుచ్చిబాబు ఇష్టమైన కథకులు, వారెలాగ కవితా హృదయం కలవారో మా రంగాచారి అలా కవిహృదయం కలవాడు.

భావుకత్వం, సౌందర్య ఆరాధనం, మానవీయ విలువల పట్ల ప్రేమతో బాటు సమాజహిత చింతన, సంస్కారభావాలు కలవాడు. సాదాసీదా జీవనం నుండే వ్యష్టినుండి సమష్టి భావనలు పండించినవాడు. ఎప్పుడూ పదిమంది కోసం నిలిచినవాడు. తనూ కవిత్వం రాశాడు. అది కొద్దిగానే కావచ్చు. తన కథల్లోనూ ఆ కవిత్వపు పరీమళాలు అక్కడక్కడా గాఢంగా తాకుతూనే ఉంటాయి. తన అభిప్రాయాల్లో, వాటి అభివ్యక్తిలో అతనికో నిక్కచ్చితనం ఉండేది. ఎవరినీ నొప్పించడం తన ఉద్దేశం కాకపోయినా, ఎదుటివారి మెరమెచ్చుల కోసం లేని కబుర్లు చెప్పడం తనకు పడదు.

రచనకూ జీవితానికీ పొంతనలేని వారినే ఎక్కువ చూస్తుంటాం. కానీ తన రచనలలో అభిలషించిన సంస్కారభావాలనే, జీవితంలోనూ అనుష్ఠించిన అరుదైన వ్యక్తిత్వం తనది. 'స్త్రీ' గురించి అతని ఆలోచనలూ, వారి స్వేచ్ఛ గురించిన అతని తపనా, వారి వేదనామయ జీవితాలపట్ల అతని ఆర్తీ వట్టి రాతకోతలకు పరిమితమైనవి కావు. స్త్రీ బాగా చదువుకోవాలనీ, ఆర్థికంగా నిలద్రొక్కుకు జీవించగలగాలనీ అతను గాఢంగా నమ్మాడు. అందుకే నలుగురు పిల్లల తల్లి అయినా, రంగాచారి – తన శ్రీమతి –లలిత చదువును ప్రోత్సహించాడు. వారి బంధువర్గంలో అంతా ఆమె 'జయమ్మ', లలితాదేవిగా – చదువు సంధ్యల్లో, సాహిత్యాభిరుచుల్లో, సహజీవన గమనంలో రంగాచారి 'జయమ్మే' ఆమె. వాళ్లిద్దరి జంటా వాగర్థాల సమాహారం వంటిదే. ఆడపిల్లలు శ్రీదేవి, శ్రీరంజని, శ్రీమతి ముగ్గురూ కూడా తల్లిదండ్రులిచ్చిన స్వేచ్ఛా వాతావరణంలో ఎదిగినవారే. తమకు నచ్చిన భర్తలనే ఎన్నుకున్నారు. కొన్ని విషయాలు తన అభీష్టానికి వ్యతిరేకమే అయినా, మనసు నొచ్చుకున్నా, వాళ్ల ఆనందమే మేలు అనుకున్నాడు. మొదట వ్యతిరేకించినా కులాంతరం చేసుకున్న శ్రీరంజని తన కాళ్లమీద తాను ఆర్థికంగా నిలబడేలా ఆమె చదువు సంధ్యలకూ, కుటుంబ శ్రేయస్సుకూ కష్టపడ్డాడు. చిన్నక్క బాటలోనే చిన్నపిల్ల శ్రీమతి గడపదాటడాన్ని తానే జీర్ణించుకున్నాడు కానీ, తనను తాను వివేచించుకోడానికీ, విమర్శించుకోడానికీ పూనుకొన్నాడు గానీ, ఆడపిల్లలను బంధుమిత్ర బృందంలో ఏమీ అనలేదు. అననీయలేదు. తండ్రిగా వగచినా, ఒక సంస్కారిగా, రచయితగా నిలద్రొక్కుకుని నిబ్బరించాడు. కుమారుడు శ్రీవత్సకు తన అభీష్టం మేరకు వివాహంచేసి ఆనందపడ్డాడు.

చిక్కులు, చీకాకులు ఎన్ని ఎదురయినా, చిడిముడిపాట్లు ఎన్ని వచ్చినా, చిరునవ్వును వదులుకోలేదు. చిరంతన స్నేహాలను మాయనీయ లేదు. ఆప్యాయపు పలకరింపులు, ఆతిథ్యపు మర్యాదలు ఆమరణాంతం అలానే నిలుపుకున్నాడు.

ఆ భార్యాభర్తలు ఎందరికో అబ్బురపు వ్యక్తులే. ప్రేమాస్పదమూర్తులే. ఆ జంట కలివిడిగానే ఉండేది ఎప్పుడూ. కలిసి చేసిన తీర్థయాత్రలే ప్రేమయాత్రలు కూడాను. ఎవరి వ్యక్తిత్వాలు వారికి ఉన్నాయి. పరస్పర అభిరుచులను గౌరవించుకుంటూ, ఎవరి స్నేహబృందమైనా కుటుంబ బాంధవ్యంలో కలిసిపోయేటంత స్నేహశీలతతో వ్యవహరించిన వారు వాళ్లు.

అన్ని కథలూ, వెతలూ నీలోనే పుడుతున్నాయి
నీలోనే నశిస్తున్నాయి
నిన్ను కోరుకోవడం దుఃఖాన్ని కౌగిలించడం
పానశాలలో దూరి మధుపానం చేయలేదనడం
నీలో దుఃఖాన్ని చూడలేదనడం
ఐనా నీలోనే ఇమిడి ఉన్నది
నన్ను మత్తెక్కించే మధువంతా

అదే 'నా భామ లహరి' అంటాడు రంగాచారి 1971 యువభారతి వార్షిక సంచికలోని 'నా భామలహరి' అనే కవితలో. స్త్రీ గురించి స్థిరమైన అభ్యుదయ భావజాలం ఉన్నందువల్లనే – ఆధునిక స్త్రీని తెలుగు నవలల్లో దర్శించే అధ్యయనం చేసి తాను 'తెలుగు నవల – ఆధునిక స్త్రీ' అనే విషయంపై డాక్టరేట్ పట్టా పొందాడు. 'తెలుగు కథానిక – బుచ్చిబాబు' గురించి అంతకు ముందే యం.ఫిల్ చేశాడు. సిద్ధాంతవ్యాసాలు రాసేప్పుడు మా ఇరువురి సబ్జెక్ట్స్ వేరయినా పరస్పరం చర్చించి, కలిసి లైబ్రరీలకు తిరిగి, ఒకచోట కలిసి కూచుని రాసుకుంటూండే వాళ్లం. సిద్ధాంత గ్రంథం శుద్ధప్రతి రాయడంలో తనకు సహకరించడం నాకు ఆనందంగా ఉండేది.

జంటనగరాల సాహితీ సాంస్కృతిక సంస్థలలో ఒకప్పుడు గుణాత్మకమైన విశిష్ట కృషి చేసిన – 'యువభారతి' సాహితీ సంస్థ కార్యక్రమాలు కూడా మమ్మల్ని దగ్గర చేర్చాయి. 1973 లో యువభారతీయుల కవితా కొలిమిలో కాగినా ఎప్పుడూ సుఖజీవన ఆశావాదిగానే ప్రకాశించేవాడు తను. ఆ స్పందనలే వాటిల్లో ప్రతిఫలిస్తాయి.

"చీకటీ, అసంతృప్తి నిరాశానిస్పృహల్లో
విరజిమ్మిన కనుసన్నల్లోని కన్నీరూ
అన్నీ నాకు వరాలే...
చీకటి విలువే వెలుగును వెతుక్కోమంటుంది"

అంటాడు 'అసంతృప్తిని ఆహ్వానిస్తాను' అనే కవితలో, అందులోనే అంటాడు ఒకచోట–

“కోరిక లీడేరితే జీవించడంలో సజావైన మజాలేదు
వర్షించిన జలధరం పగిది
చెదిరిపోతుంది జీవిత పరిధి
దొరికీ దొరకని సంపదలు
కలిగీ కలగని సాక్షాత్కారం
మిగిలీ మిగలని సంతృప్తి
మనిషి మనుగడ కడలిలో
కోరికల మంధరంతో మధించగా పుట్టిన
మణులు, మాణిక్యాలు
కౌస్తుభాలు, ఉచ్చైశ్రవాలు” అంటాడు. అసంతృప్తిలోనే సంతృప్తి నన్వేషించడం వల్ల ఒకనాటికి అసలు అసంతృప్తులనేవే మిగలవంటాడు. ‘బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్’ అన్నట్లుగా, ‘వేదనలోనే పుట్టెను వేదమ్ములు నాదమ్ములు’ అన్నట్లుగా, ఈ అభివ్యక్తి – నిజానికి వ్యక్తి నిరాశది కాదు. సుఖదుఃఖాతీతమైన, లౌకికితను అధిగమించిన, ఒక స్థితప్రజ్ఞత్వానికి సంబంధించింది. అందుకే నుదుట నామం తీర్చి, నిత్యం విష్ణునామ ధ్యానం చేసి, పూజచేసి, ఆస్తికత్వపు భావనలకు ప్రోది చేసినా, అంతరంగాన సమాజహిత చింతనయైన అభ్యుదయ భావధారను నిలుపుకోగలిగాడు. మతాన్నీ, మానవీయ అభిమతాన్నీ సమన్వయించగలిగాడు మా రంగాచారి.

రాజకీయాలకు విద్యార్థులు శలభమౌతున్న సంఘటనలకూ, కుహనా ఉద్యమాలకు వారు ఎరగా మారుతున్న స్థితిగతులకు రంగాచారి చలించాడు. వేర్పాటు ఉద్యమాల అలజడులు విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న ఘటనలను తిలకించాడు.

“ఏలిన వాడెవడైనా గేలిచేసింది నిన్నే
...........
నీ భవితవ్యాన్ని పణంగా పెట్టి
నిన్ను వాడుకున్నారే దప్ప నీ గతి పట్టించుకున్న వాడెవడు?”
అని ‘తస్మాత్ జాగ్రత్త’ అని విద్యార్థిని హెచ్చరించి –
“నీవు నిజంగా శబ్ద వాచ్యుడవు కావాలి
చరిత్ర చర్వితచర్వణం కాకూడదు”

అని ప్రబోధిస్తాడు. తాను నిరంతర విద్యార్థిగా మెలిగినవాడు రంగాచారి. చదువుకు వయసుతో నిమిత్తంలేదని నిరూపించుతూ, డిగ్రీలను 'జిగ్రీ' కృషితో సాధించుకున్న వాడు. చదువుకున్న ప్రాచ్యవిద్యకు సంబంధించిన ఆచార్యత్వం లభించకపోయినా, బీఈడీ కళాశాలలో విద్యార్థులకు గణిత విద్యను అగణిత శ్రద్ధతో ఉత్సాహంతో బోధించాడు.

స్నేహమూ, ప్రేమా అతని కేంద్ర బిందువులు.

విద్యా, సాహిత్యమూ విస్తరించిన వలయాలు.

వృత్తి అంకెలతోనూ, ప్రవృత్తి అక్షరాలతోనూ ముడిపడినవాడు.

"నేను గమ్యాన్ని చేరానో లేదో కాని
నా సందేశాన్ని నీదాకా చేరవేయగలిగితే
వాటి ఉనికే ధన్యమౌతుంది
నా జీవితమూ ముగుస్తుంది"

అంటాడు 'నా గమ్యం' అనే కవితలో. తన కనుకొలకుల కన్నీటిచుక్కల ప్రాతిపదికల గురించి–

"నా ఆఖరి క్షణంలోని నీ సమాగమంలోనైనా
నిన్ను చేరానన్న సుషుప్త్యవస్థలో
నన్ను నేను ఆదమరిచి
నీ ప్రేమ సామ్రాజ్యపు పొలిమేరలలో
జోగాడుతుంటాను. నన్ను కోపగించకు! విసిగించకు!" అంటాడు తన భావుకత్వ హృదయసంబంధ బాంధవ్య బంధనాల గురించి.

"నీకు తెలుసామరి
నా గమ్యం నీవేనని
నా సర్వస్వం నీవేనని!!!"

అని అనే రంగాచారి జీవిత సర్వస్వం – లలిత కళారాధనమైన హర్షశ్రీవత్సయుతమైన విద్యాశ్రీదేవి సంగీత సాహిత్య శ్రీరంజనం. స్నేహమతి, ప్రణయవతి, సుశ్రీమతి – అతని జీవనగతి. వ్యక్తిగా రంగాచారి మరపురాని మనిషి.

'నీ స్నేహం ఇక రాదుమరీ...' అని తలచినప్పుడల్లా నా కనులు అశ్రుపూరితాలౌతాయి. *

**('హృదయవాసి' జ్ఞాపకాలు గ్రంథం నుండి ఫిబ్రవరి 2003)**

## (69) 'జర్నలిజం' అపురూప: డా॥కె.బి.లక్ష్మి

**తె**లుగు పత్రికా పాఠకులకు, ఆకాశవాణి శ్రోతలకు, టీవీ వీక్షకులకు, సాహిత్య సాంస్కృతికసభల ప్రేక్షకులకు సుపరిచితులై.. 'ఏ' గ్రేడ్ సాధికారిక వనితగా, సృజనశీలిగా పురోగమిస్తున్న కె.బి.లక్ష్మిగారిలో లక్ష్మీకళేకాదు, సృజనసరస్వతీ ఉంది.

బహుముఖీనంగా విస్తరించిన ఈ ప్రతిభాశాలి అరవై రెండేళ్ల క్రితం కనకదుర్గ, ఉప్పులూరి భాస్కర సుబ్రహ్మణ్యం దంపతుల పెద్దకుమార్తెగా అనకాపల్లిలో జన్మించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగులో యం.ఏ.పట్టానీ, తరువాత ఐ.వి.ఎస్. అచ్యుతవల్లి నవలలపై డాక్టర్ ఎన్.గోపిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టానీ పొందారు. హిందీలో విశారద, రష్యన్ భాషలో సీనియర్ డిప్లమో సాధించిన లక్ష్మి ఎం.ఏ. ఇంగ్లీష్, జర్నలిజం పోస్ట్‌గ్రాడ్యుయేట్ మాత్రమే కాదు, న్యూఢిల్లీ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్‌యూనివర్సిటీ నుండి క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్ కోర్సునూ, అనంతరం బైబిల్ కోర్సునూ పూర్తిచేశారు.

ఈ డిగ్రీలన్నీ ఒకెత్తైతే – ఆమె సాహిత్య సృజనశక్తి మరోఎత్తు. ప్రముఖ సాహితీ సంస్థ 'యువభారతి' తో తనకున్న అనుబంధంతో రచనా, వక్తృత్వాల్లో రాణించి మహిళావిభాగం సారథిగా కొనసాగుతూ యువభారతి లో క్రియాశీల కార్యకర్తగా సేవలందిస్తూ వచ్చిన లక్ష్మికి – ఆ సంస్థ సహసభ్యుడైన కె.వి.కామేశ్వరరావు గారు జీవిత సహచరులయ్యారు.

ఆకాశవాణిలో కాజువల్ అనౌన్సర్‌గా, యాంకర్‌గా, పరిచయకర్తగా, స్క్రిప్ట్‌రైటర్‌గా, టీవీ ప్రెజెంటర్‌గా – శ్రోతల, వీక్షకుల మన్ననలు పొందిన లక్ష్మి కొన్నాళ్ళు సైన్స్ టీచర్‌గా, మరికొన్నాళ్ళు తాత్కాలిక ప్రాతిపదికన కాలేజీ లెక్చరర్‌గా, కొంతకాలం ఆంధ్రాబ్యాంక్ ఉద్యోగిగా తమ సేవలందించారు.

యువభారతివారి 'నందిని' మాసపత్రిక కీ – అనంతరం ప్రతిష్ఠాత్మక ఈనాడు గ్రూప్‌వారి విపుల, చతుర మాసపత్రికలకూ సంపాదకురాలిగా వ్యవహరించి, పదేళ్ళక్రితం ఉద్యోగవిరమణ చేశారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా సభ్యురాలిగా సేవలందించి, వెటరన్ జర్నలిస్టు సంఘంలో ఏకైక మహిళాజర్నలిస్టుగా వినుతికెక్కిన లక్ష్మి – ప్రస్తుతం వయోధిక పాత్రికేయ సంస్థ కార్యవర్గ సభ్యురాలిగానూ, ప్రెస్‌క్లబ్‌లో శాశ్వత సభ్యురాలిగానూ కొనసాగుతున్నారు.

గమనం, వీక్షణం అనే రెండు కవితా సంపుటాలు వెలువరించి కవయిత్రిగా తన ప్రత్యేకతను నిలుపుకున్న లక్ష్మి 'మనసున మనసై', 'జూకామల్లి' కథా సంపుటాలను వెలువరించి కథారచయిత్రిగా సైతం తనదైన కీర్తిని ఖాతాలో వేసుకున్నారు.

కె.బి.లక్ష్మి గొప్ప స్నేహశీలి. అందుకే తమ ఇంటికి 'స్నేహ నికుంజ్' అని నామకరణం చేశారు. ఆత్మీయత, అనురాగంతో పాటు చక్కటి హాస్య చతుర భాషణం చేయగల ప్రత్యేకత లక్ష్మిగారిది.

ప్రముఖ హాస్యరచయిత మునిమాణిక్యం నరసింహారావుగారిపై 'సీపీ బ్రౌన్ అకాడమీ' కోసం మోనోగ్రాఫ్‌నీ – తనదైన లలిత సుకుమార హృదయంతో బాలగంగాధర్ తిలక్‌పై మరో మోనోగ్రాఫ్ నీ రచించారు.

'మనసున మనసై' కథలు హిందీ, కన్నడ, తమిళ, ఒరియా, ఆంగ్ల భాషల్లోకి అనువదించబడ్డాయి. వీరి లఘుకవితలను గోవిందరాజు రామకృష్ణారావుగారు 'స్నాప్ షాట్స్' పేర ఆంగ్లంలోకి అనువదించారు.

ప్రకృతి, పుస్తకాలు, స్నేహాలు, సంగీతం, సినిమాలు, పాటలు, నాటకాలు, పర్యటనలు తనకి ఇష్టమైనవని చెప్పే లక్ష్మి – 'అందరి బంధువయా' అన్న చందాన ఎందరికో ఆత్మీయురాలయ్యారు.

భారతదేశంలో అనేక ప్రాంతాలను భర్తతో కలిసి విస్తృతంగా పర్యటించిన లక్ష్మి రచయిత్రిగా, జర్నలిస్టుగా ఎన్నో విదేశీపర్యటనల్లో పాల్గొన్నారు. మలేషియా ప్రభుత్వ ఆహ్వానంపై కంట్రీగెస్ట్‌గా పర్యటించి, అంతర్జాతీయ పాత్రికేయుల సభలో పాల్గొని అభినందనలు అందుకున్నారు. అటుపిమ్మట ఓ నాలుగేళ్ల అనంతరం చైనాని సందర్శించి, ఆ జనాకర్షణ ముద్రతో విశిష్ట వక్తగా మరోమారు మలేషియా పర్యటించి వచ్చారు.

ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, కలకత్తాలాంటి నగరాల్లో నిర్వహించిన అనేక జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని, పత్ర సమర్పణలు చేశారు.

కలం, గళం రెండింటిలోనూ సవ్యసాచి లక్ష్మి. సాహిత్య సాంస్కృతిక సభలకు వ్యాఖ్యాతగా తన గళాన్ని అందిస్తూనే - ఎన్నో పత్రికల్లో వివిధ సమస్యలపై కాలమిస్టుగా తన కలాన్ని సంధించారు.

వివిధ వేదికలపై వ్యాఖ్యాతగా సభలను నిర్వహించిన అనుభవం లక్ష్మిగారిది. కవిసమ్మేళనాల్లో తనదైన ముద్రతో ప్రేక్షకాదరణనూ, తెలంగాణ పలుకుబడులతో కవితాపఠనం చేసి ప్రేక్షకుల హర్షధ్వానాలు పొందారు.

హైదరాబాదు నగర సాహితీ సభలను తన వ్యాఖ్యానంతో నేటికీ అలరిస్తున్న నిత్యచైతన్య సాహితీవేత్త, విదుషీమణి అయిన మహిళ కె.బి.లక్ష్మి.

ఆకాశవాణిలోనూ, దూరదర్శన్‌లోనూ లక్ష్మి నిర్వహించిన ఎన్నో పరిచయ కార్యక్రమాలకు, యాంకరింగ్‌కి శ్రోతలు, ప్రేక్షకుల నుండి విశేష ఆదరణ లభించింది.

శ్రీశ్రీ మరణించినపుడు దూరదర్శన్‌లో గంటకు పైగా సుధామ గారితో కలిసి లైవ్‌ప్రోగ్రామ్ నిర్వహించటం తనకు మరపురాని అంశంగా అభివర్ణించే లక్ష్మి డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో అకడమిక్ కౌన్సిలర్‌గా డిగ్రీ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

వివిధ పత్రికల్లో పాఠక జనరంజకంగా ఎన్నో కాలమ్స్ నిర్వహించిన ప్రత్యేకత డా॥ కె.బి.లక్ష్మిగారిది. 'చినుకు' మాసపత్రికలో 'కవి - కథకులు' అనే కాలమ్, 'తెలుగు విద్యార్థి' మాసపత్రికలో 'కుంచె - కథలు' అనే కాలమ్, 'చేతన' మాసపత్రికలో 'ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యనవలలు' కాలమ్ ఏకకాలంలో నిర్వహిస్తున్నారు.

కొందరికి అభిజాత్యంగా తోచినా - ఎనలేని ఆత్మ విశ్వాసంతో, నిర్భీతితో, సమాజహిత చింతనాభిలాషతో జర్నలిజంలో ముందుకు దూసుకెళ్ళిన ఘనకీర్తి లక్ష్మిగారిది.

తన ప్రతిభా పాటవాలకి గుర్తింపుగా - ఆమె దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు, తురగా కృష్ణమోహన్ అవార్డు, కమలాకర మెమోరియల్ అవార్డు, ప్రజ్ఞాభారతి సత్కారం,

యువ కళావాహిని అవార్డు, వంశీ ఇంటర్నేషనల్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, జ్యేష్ఠ లిటరరీ అవార్డు, నార్లవారి జర్నలిజం అవార్డు, కృష్ణశాస్త్రి అవార్డు, వసుమతీ మాధవ పురస్కారం, మునిమాణిక్యం నరసింహారావుగారి పురస్కారం, శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి పురస్కారం, ఉంగుటూరి శ్రీలక్ష్మి మాతృదేవోభవ వంటి పురస్కారాలు అందుకున్నారు.

స్త్రీ ఎప్పటికీ ఒంటరి కాదంటూ – బహుముఖీనమైన కృషితో సమాజాన్ని జాగృతం చేస్తూ.. ఇప్పటికీ నూతనోత్తేజంతో జీవితం గడుపుతోన్న ఈ ధీర వనిత – ‘అపురూప అవార్డు’ అందుకుంటున్న వేళ – శుభాభినందనలు! ✻

**(అపురూప అవార్డు సంచిక’ 2016)**

(70)

# సృజనలోకస్ఫూర్తి
# శ్రీ పి. ఆర్. రామచంద్రరావు

**భా**రతీయ చిత్ర, కళా, సాంస్కృతిక వైభవాన్ని అంతర్జాతీయంగా తన ఉపన్యాసాలతో, గ్రంథరచనతో, డాక్యుమెంటరీ నిర్మాణంతో చాటిచెప్పిన విశిష్ట వ్యక్తి. ఆయన వాక్ప్రౌఢిమ, రచనాదక్షత, నిర్మాణకౌశలం దేశవిదేశాల ప్రముఖులచే, సంస్థలచే, పత్రికలచే కొనియాడబడినాయి. ఆయన అచ్చమైన తెలుగువాడు. ఆయన పూర్తిపేరు– పైడిమఱ్ఱి రాజా రామచంద్రరావు.

1912 జూలై 24 న కడపజిల్లా నందలూరులో శ్రీ పైడిమఱ్ఱి నరసింగరావు, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించిన రామచంద్రరావు ఆంగ్లభాషా సాహిత్యాలలో, ఎకనమిక్స్‌లో, చరిత్ర, రాజనీతిశాస్త్రాలలో మాస్టర్ డిగ్రీ పొందిన వారు. 1932 లో మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి 'దిలార్డ్ పెంట్‌లాండ్' బహుమతిని ఆంగ్ల సాహిత్యానికి అందుకున్నారు. 1934 లో మచిలీపట్టణం హిందూకళాశాల ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేశారు. అప్పుడే బొంబాయిలో – 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' ఎడ్యుకేషన్ ఎడిటర్‌గా నియమితులై, బొంబాయి ఇండియన్ ఉమెన్స్ యూనివర్సిటీలో పార్ట్‌టైమ్ ప్రొఫెసర్‌గా కూడా పనిచేశారు. లండన్ నుంచి వెలువడే 'ది టైమ్స్ ఎడ్యుకేషనల్ సప్లిమెంట్'కు భారతీయ విలేఖరిగా పనిచేశారు.

న్యాయశాస్త్రంలో కూడా పట్టభద్రులు కావడంతో అప్పుడాయన న్యాయవాద వృత్తివైపు క్రమంగా మొగ్గు చూపారు. పలు హైకోర్టుల్లోనే కాక 1943 లో సుప్రీంకోర్టు న్యాయవాదిగా మారి, ప్రభుత్వరంగ సంస్థలకై కేంద్రప్రభుత్వపు న్యాయసలహాదారుగా, భారతదేశంలోని సుమారు 60 దాకా ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థలకు న్యాయకోవిదునిగా పనిచేశారు. ఆయన వాదనాపటిమకు, న్యాయశాస్త్ర పాండిత్య ప్రతిభకు మేధావులనిపించుకున్న న్యాయమూర్తులే అబ్బురపడేవారు. పారిశ్రామిక శాంతి నెలకొనేందుకు అనేక సమస్యాత్మక సంస్థలకు ఆయన న్యాయమార్గం చూపించారు. భారతదేశంలో జర్మన్ రాయబార కార్యాలయానికి రామచంద్రరావుగారే

న్యాయసలహాదారు. రాజ్యాంగబద్ధమైన శాసనాలు, చట్టాలు, ధర్మాలు, సూత్రాల గురించి రాజనీతి శాస్త్ర విషయాలపై, అలాగే ప్రభుత్వ పాలనా వ్యవహారాలపై కేంబ్రిడ్జి హార్వర్డ్ యూనివర్సిటీ, బోస్టన్ యూనివర్సిటీ, ఫిలడెల్ఫియా టెంపుల్ యూనివర్సిటీ, ఏథెన్స్‌లోని జార్జియా యూనివర్సిటీ, అరిజోనా స్టేట్ యూనివర్సిటీ – టెంపె, లఫైట్టి ది పర్డ్యూ యూనివర్సిటీ, వాషింగ్‌టన్‌లోని కేథలిక్ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా మరియు అమెరికన్ యూనివర్సిటీ, సెయింట్ లూయిస్ వాషింగ్‌టన్ యూనివర్సిటీలలో ఆయన చేసిన ప్రసంగాలు ప్రముఖుల ప్రశంసలను అందుకున్నాయి.

నిజానికి ఆయన తొలి విదేశీ ప్రసంగాలు జూన్ 1949 లో డబ్లిన్ ట్రినిటీ కళాశాలలో, అదే ఏడాది జూలైలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మ్యూజియంలో ఇచ్చినా, 1964 నుండి 1972 వరకు ఇంగ్లాండ్, రష్యా, డెన్మార్క్, జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్, శ్రీలంక మొదలైన దేశాలలో ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి 87 విశ్వవిద్యాలయాల్లో, ఇతర ప్రముఖ సంస్థలలో ప్రసంగించి వాగ్మివతంసులుగా ఖ్యాతిగాంచారు.

వృత్తిరీత్యా ప్రముఖ న్యాయవాది అయినా ఆయన దేశవిదేశాలలో చేసిన ప్రసంగాలు వట్టి వృత్తిపరమైనవి కావు. భారతీయ సాంస్కృతిక కళారాయబారి అన్నట్లుగా రామచంద్రరావుగారు చేసిన ప్రసంగాలలో అధికశాతం భారతీయ చిత్ర, శిల్ప, చారిత్రక కళా వైభవాలకు చెందినవే కావడం విశేషం. ఆధునిక భారతీయ చిత్రకళ, నాగార్జున కొండ, అలంపూర్, భువనేశ్వర్, ఆంధ్రశిల్పం వంటి అంశాలపై గ్రంథరచన మాత్రమే కాదు, ఆయా అంశాలనెన్నింటినో కూలంకషంగా అధ్యయనం చేసి, భారతీయ కళా వైభవాన్ని తన అనర్గళ వచోనైపుణితో విశ్లేషణతో ఆయావేదికలపై నుండి రసవత్తరంగా ప్రసంగించి ప్రేక్షకులను ఉర్రూతలూపారు. వృత్తి ప్రసంగాలనే కాదు ప్రవృత్తి జనితమైన కళా సాంస్కృతిక వికాస విషయాలను రామచంద్రరావుగారివలె వన్నెవాసి గల ఆంగ్లభాషలో మరొకరు వినిపించజాలరని సంభావించిన విదేశీ ప్రముఖులెందరో ఉన్నారు.

ప్రపంచపు నాలుగు చెరగుల ప్రాంతాల అసంఖ్యాక ప్రఖ్యాత వేదికల నుండి రామచంద్రరావుగారు ప్రసంగించారు.

సమాజంపై, సాంఘిక వ్యవస్థపై కళల ప్రభావం, వాటిపాత్ర వంటి అంశాలపై రామచంద్రరావుగారి విశ్లేషణలు, అభిప్రాయాలు, సాధికారిక ప్రకటనలు, సూచనలు, వారి అధ్యయనశీలత గ్రహించి భారతీయ కళావ్యాఖ్యాతగా ఆయనకు దేశవిదేశాలు అభినందన నీరాజనాలందించాయి.

భారత మాజీ రాష్ట్రపతి డా॥ఎస్.రాధాకృష్ణన్, నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, న్యూయార్క్ దిసాటర్‌డే రివ్యూ సంపాదకులు నార్మన్ కజిన్స్ – రామచంద్రరావుగారి 'ది ఆర్ట్ ఆఫ్ నాగార్జున కొండ' ఒక తలమానికమైన రచనగా కొనియాడారు. ది న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ పారిస్ పత్రిక ఆ గ్రంథాన్ని కళా చరిత్రలోనే ఒక విశిష్టమైన కృషిగా పేర్కొంది. ఏ గ్రంథరచన చేసినా విషయ నేపథ్యాన్ని, చారిత్రకతను, మత, సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, మథించి కూర్చి రచించడం ఆయన అలవాటు. ఇంగ్లాండ్, యునైటెడ్ స్టేట్స్, నెదర్లాండ్స్, శ్రీలంక, ఇండోనేషియా, వియత్నాంలలోని మ్యూజియాలను అక్కడ ప్రదర్శితమైన భారతీయ కళాకృతులను అవలోధనం చేశారు.

ప్రముఖ కళా విమర్శకులుగా, చారిత్రకునిగా ఆయన రాసిన గ్రంథాలన్నీ వారి ప్రజ్ఞాప్రాభవాలకు గొప్పదాఖలాలు. 'ఆంధ్రశిల్పం', 'భువనేశ్వర్' గ్రంథాలను భారతీయ దేవాలయ శిల్పసంపదపై సాధికారిక రచనలుగా 'దిహిందూ', 'దక్కన్‌హెరాల్డ్' వంటి పత్రికలన్నీ అభివర్ణించాయి.

శ్రీ రామచంద్రరావుగారు స్వయంగా ఛాయాచిత్ర గ్రాహకులు. ఫోటోగ్రాఫర్‌గా ఆయన తీసిన వేలాదిచిత్రాలు ఆయా చిత్ర, శిల్ప, ప్రాంత, వస్తు అందాలను, సాన్నిహిత్యాన్ని, ప్రత్యంశ వివరణతో గాఢంగా కనులకు కట్టిస్తాయి. 'అలంపూర్'పై గ్రంథం గురించి బొంబాయి 'ది సండేస్టాండర్డ్' పత్రిక గొప్పగా ప్రశంసించింది. కలకత్తా 'అమృత్‌బజార్ పత్రిక' రామచంద్రరావుగారి కళాత్మక దృష్టికి పరిశోధనాపాటవానికి ప్రశంసలందించింది.

'మోడరన్ ఇండియన్ పెయింటింగ్,' 'ది ఆర్ట్ ఆఫ్ నాగార్జునకొడ' (1956 లో రాష్ట్రపతి పురస్కారం పొందింది) 'అలంపూర్', 'భువనేశ్వర్', 'కాంటెంపరరీ ఇండియన్ ఆర్ట్', 'ఆంధ్రాశిల్పం', 'అమరావతి' వంటి గ్రంథాలేకాక 'ది డికే ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్', 'ఇండియన్ ఎలక్షన్ లా' వంటి గ్రంథాలు కూడా ఆయన రాశారు.

ఆయన వ్యక్తిగత అనుభవాలు, జ్ఞాపకాలు, ప్రముఖులతో పరిచయాల సంపుటి 'ది ఫస్ట్ పర్సన్ సింగ్యులర్' మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సరోజినీనాయుడు, సుభాష్‌చంద్రబోస్, విన్‌స్టన్ చర్చిల్, చౌఎన్‌లై, జయప్రకాష్‌నారాయణ్, రామమనోహర్‌లోహియా, వి.కె.కృష్ణమీనన్ వంటి రాజకీయ ప్రముఖులతో, రమణమహర్షి, జిడ్డు కృష్ణమూర్తి, చంద్రశేఖర సరస్వతి వంటి ఆధ్యాత్మిక చింతనా పరులతో రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులతో తమ పరిచయాలను ఆ గ్రంథంలో వివరించారు. పఠితలకు సంభ్రమానందాలను కలిగించే సన్నివేశాలవి.

'విఖ్యాత కళా విమర్శకునిగా' న్యూఢిల్లీ లలితకళా అకాడమీ జాతీయఅవార్డుతో సత్కరించింది.

హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆయనకు లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డును అందించింది. 2004 లో ఇండియన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సత్కారం పొందారు. బీబీసీ, రేడియో మాస్కో, రేడియో కొలోగ్నె, రేడియో ఇటాలియానా, ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్స్ ఆఫ్ సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్, రేడియో సిలోన్ ద్వారా కూడా ఆయన ప్రసంగాలు ప్రసారమయ్యాయి.

వక్తగా, రచయితగా ఎంత ఖ్యాతిగాంచారో అంతకు మిక్కిలి ప్రసిద్ధి ఆయనకు డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాతగా, దర్శకునిగా లభించింది. దూరదర్శన్ ప్రసారభారతి ఆయన చిత్రాలను 'ఔట్‌స్టాండింగ్' ప్రమాణాలతో కూడినవిగా గుర్తించింది.

'ది రివర్ కృష్ణ', 'ది హెరిటేజ్ ఆఫ్ ది అంపైర్ ఆఫ్ విజయనగర' 'దిస్ప్లెండర్ ఆఫ్ ఆంధ్రా ఆర్ట్', 'ఔట్‌స్టాండింగ్ మాన్యుమెంట్స్ ఆఫ్ ఆంధ్రదేశ', 'నాగార్జునకొండ', 'అమరావతి', 'శ్రీశైలం', 'శ్రీకాళహస్తి', 'భద్రాచలం', 'సింహాచలం', 'అలంపూర్'పై ఆయన డాక్యుమెంటరీలకు విశేషమైన గుర్తింపు లభించింది. దేశ విదేశీయ ప్రముఖుల, పత్రికల ప్రశంసాభినందనలు లభించాయి. వాగ్గేయకారులపై, నాట్య కళారీతులపై, కొందరు కవి ప్రముఖులపై, ఆంధ్రదేశపు బౌద్ధ శిల్ప సంపదపై, గోదావరి నదిపై ఆయన డాక్యుమెంటరీ నిర్మాణాలను కొనసాగించారు.

'ది రివర్‌కృష్ణ' డాక్యుమెంటరీని లండన్, సౌత్ ఆంప్టన్ ఫ్రాన్స్, యు.కె, యు.ఎస్.ఎ, కెనడా, జర్మనీ, సిడ్నీ వంటి విదేశీ ప్రసారమాధ్యమాలు, పలు టెలివిజన్ చానల్స్ కనులకింపైన కడుసుందరమైన, ఎంతో ఆసక్తిదాయకమైన, బహుధా

ఆకర్షణీయమైన, గొప్ప దృశ్యరచనగా, రసబంధురమైనది, సహజసుందరమైనదిగా ఒక దృశ్యాత్మక కావ్యంగా, అతిచక్కని కూర్పుగా, దర్శకత్వ ప్రతిభగల గొప్ప నిర్మాణంగా, ఫొటోగ్రఫీ, సంగీతం ప్రభావోపేతమైనవిగా వర్ణించి ప్రశంసించాయి. ఈ ప్రశంసావాక్యాలు ఆయన డాక్యుమెంటరీ చిత్రాలకన్నింటికీ వర్తించేవే.

ఎంత మహోన్నతంగా ఎదిగినా నిరాడంబరంగా ఒదిగి ఉండే నైజం వారిది. పలు విశ్వవిద్యాలయాలు గౌరవడాక్టరేట్లు ఇవ్వచూపినా ఆ పేపర్ డాక్టరేట్‌లపై మోజు చూపని చిత్తం ఆయనది. కానీ నిజానికి ప్రభుత్వం ఇటువంటి వ్యక్తులకు మహోన్నతమైన పద్మ సత్కారాన్ని ఇవ్వాలని నరేంద్రలూథర్ 'దిహిందూ'లో ఆయన గురించి రాస్తూ పేర్కొన్నారు. వయసు రీత్యా తొంభై అయిదవ పడిలోనూ రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేసిన నిరంతర మేధోమయమూర్తి ఆయన. 95 వ పడిలో కూడా 'కవిపంచకము' పేర తిక్కన, శ్రీనాథుడు, పోతన, వేమన, గురజాడలపై సరికొత్తగా ఓ గ్రంథాన్ని కూర్చి రచించారాయన. యువతకు సాహిత్యాభిలాషను కలిగించే జనరంజకమైన ఆ రచన పాఠ్యగ్రంథంగా పెట్టదగిన రచన. ఆయన ఒక నడిచే మ్యూజియంగా, చారిత్రక సత్యాలు సాంస్కృతిక విశేషాలు ఆయన నుండి గ్రహించవలసినవి ఎన్నో ఉండేవి. భారతీయ కళా సాంస్కృతిక వైభవాన్ని దృశ్య మనోహరంగా ప్రపంచ పరివ్యాప్తం చేసే లక్ష్యమే ఆయన చిత్రాలది. మన దేశ మహోన్నత సాంస్కృతిక సంపదను అర్థంచేసుకుని, ఆస్వాదించి, అధ్యయనం చేసి నలుగురికీ అందించేవే ఆయన గ్రంథరచనలు. తెలుగు వారు గర్వించదగిన సాంస్కృతిక వటవృక్షం శ్రీ పైడిమఱ్ఱి రామచంద్రరావు. ఆయనతో పరిచయం, ఆయన తీసిన కొన్ని డాక్యుమెంటరీలకు తెలుగులో నా గళంతో వ్యాఖ్యానం అందించడం అవిస్మరణీయాలు.

2007 మార్చి ఒకటవ తేదీ గురువారం మధ్యాహ్నం ఆ వటవృక్షం కూలిపోయింది. ఆయన శాశ్వతంగా కన్నుమూశారు. కానీ పైడిమఱ్ఱి రాజారామచంద్రరావు సృజనశీలత్వం, కృషి, కీర్తి, స్ఫూర్తి అజరామరాలు. *

**(నది వారం వారం 13 ఆగస్టు' 2010)**

# (71) "పోయినోళ్ళందరూ మంచోళ్ళు, ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపిగురుతులు"

'**గుం**డె మంటలారిపే చన్నీళ్ళ కన్నీళ్ళ'ను కురిసేపాట–
విరహం విషాదమై జాలువారే పాట–
మరుపురాని, మరువలేని తీపి బాధల జ్ఞాపకాలకు గూడు కట్టేపాట–
భగ్నహృదయం తపిస్తూ తపిస్తూ కన్నీటి సెగలమీద తడి ఆరబెట్టుకునే పాట–
నిశ్శబ్ద, నిశ్చలన, నిర్వేద జీవన సంగీతాన్ని మ్రోయించే పాట–
మనిషి, మనసు, మమత పల్లవిగా మహోన్నతంగా పరిఢవిల్లే పాట–
అవును – అది ఆత్రేయ పాట.
ఆత్రేయ మన 'సుకవి', 'మనసుకవి'.

నలభై సంవత్సరాలకు పైగా హృదయాన్ని పట్టి కుదిపే పాటలతో తెలుగువారి గుండెల్లో కరుణరస వాహినులను పొంగించిన ఆచార్య ఆత్రేయ ఇకలేరు. 'మనసుగతి ఇంతే మనిషి బ్రతుకింతే, మనసున్న మనిషికీ సుఖము లేదంతే' అన్న కఠోర సత్యాన్ని కాచి వడబోసిన కవి, 'మనసులేని దేవుడు మనిషికెందుకు మనసిచ్చాడు. మనసు మనసును వంచన చేస్తే కనులకెందుకు నీరిచ్చాడు' అని ప్రశ్నించిన కవి, 'మనసు మూగదే కానీ బాసున్నది దానికి' అని మనసు భాషను ఆపోసనపట్టిన కవి, 'మౌనమె నీ భాష ఓ మూగమనసా, తలపులు ఎన్నెన్నో కలలుగ కంటావు. కల్లలు కాగానే కన్నీరవుతావు' అని ప్రవచించిన కవి, 'నా మనసే పిచ్చిముండా' అని మనసు దువ్విన కవి, అలా ఒక్క 'మనసు' అన్నదాని మీదనే మాటల్లో పాటల్లో అనంత వైవిధ్యాన్ని ఆ మనసు అంతరాంతర లోతుల్ని స్పృశిస్తూ ప్రదర్శించిన కవి – ఆచార్య ఆత్రేయ సెప్టెంబర్ 13 వ తేదీ రాత్రి 'తీపిగురుతుగా' మాత్రమే మిగులుతూ తరలివెళ్ళిపోయాడు. శాశ్వతంగా కనుమరుగయ్యాడు.

కిళాంబి నరసింహాచార్యులు అంటే ఎవరికీ తెలియకపోవచ్చు. 'ఆత్రేయ' అన్న మూడక్షరాల శక్తి పుట్టినప్పటి పేరది. ఆచార్య ఆత్రేయగా తన పదిహేనవ

ఏటనుండే గుర్తింపు పొందుతూ వచ్చాడాయన. తెలుగు సాంఘిక నాటకరంగాన్ని గురజాడ అడుగుజాడల్లోంచి మలుపు తిప్పి, ఒక కొత్త టానిక్ ఇచ్చిన ప్రతిభాశాలి ఆత్రేయ. మధ్యతరగతి జీవనాడిని గ్రహించి రోగగ్రస్త సమాజానికి చికిత్సామార్గం ఆలోచించిన ప్రజ్ఞాశాలి ఆయన. సమాజంలో ఆలోచనాపరుల దృక్పథంలో గొప్ప మార్పు తెచ్చిన ఆత్రేయ నాటకాలు 'ఎన్.జి.ఓ', 'పరివర్తన', 'భయం', 'కప్పలు', 'ఈనాడు' వంటివి. ఆంగ్లానుసరణలు వంటివి ఆత్రేయ కొన్ని చేసిన మాట యధార్థమే అయినా, తెలుగు వాడిని, వేడిని చూపుతూ నాటికీ నేటికీ మధ్య తరగతి జీవి బ్రతుక్కి నిలుపుటద్దంగా భాసించేలా నిలిచే నాటకం "ఎన్.జి.ఓ."

'ఈనాడు' నాటకం ఆత్రేయ గాంధీజీ హత్యకు ముందే రాశారు. ఆ నాటకంలో ఒక మతోన్మాది విసిరిన కత్తి తగిలి గాంధీజీ పటం భళ్ళుమని పగిలి నేలకూలుతుంది. గాంధీజీ ఓ మతోన్మాది చేతుల్లోనే హత్య గావింపబడటం తదనంతరం చరిత్రలో జరిగిన ఘోరం. దాన్ని ఆత్రేయ ముందుగానే క్రాంతిదర్శిగా ఊహించాడనిపిస్తుంది. ఆత్రేయ నాటకాలన్నింటిలో శాంతి అంతస్సూత్రంగా కనిపిస్తుందికానీ, స్వాతంత్ర్యం తరువాత గాంధీ సూత్రాలకు పట్టిన దుర్గతి చూసిన ఆత్రేయ 'ఎవరుదొంగ', 'అంత్యార్పణ' వంటి శక్తివంతమైన నాటకాలు రచించాడు. అవన్నీ ఎదురుతిరిగిన భావాలే.

సంభాషణలు ఎక్కువ లేకుండానే, దృశ్యకల్పనలు గావించి భావాన్ని బలంగా చూపడం ఆత్రేయ కలంలోని గొప్పదనం. నాటకరంగం పునాదిగా వేసుకుని సినిమాకు తరలివచ్చిన ఆత్రేయలో అందుకే సంభాషణల్లో గానీ, పాటల్లోగానీ అంతక్లుప్తత, గాఢత కనిపిస్తాయి. ఆత్రేయ స్వయంగా నటుడు కూడాను. 1955 లో 'అంత్యార్పణ' నాటికలో 'జగన్నాథం' పాత్ర ఆయనేవేశారు. జి.వరలక్ష్మి అందులో భారతమ్మగా నటించింది. ఆత్రేయ నటనాశక్తి. దర్శకత్వ ప్రతిభ ఆనాడే వేన్నోళ్ళ కీర్తింపబడ్డాయి.

ప్రజానాట్యమండలి ప్రాభవం తగ్గి, అభ్యుదయోద్యమ శక్తి కొంత వెనకబడటంతో చాలామంది లాగానే ఆత్రేయ కూడా జీవనభృతికోసం సినిమారంగం వైపు మళ్లారు. సినిమాలో ఆయన కుదుట పడటానికి ఎంతగా శ్రమించారో చాలామందికి తెలియదు. ఆకలి – రంగూ రుచీ వాసనా అంతగా తెలిసిన మనిషి కనుకే, కన్నీళ్ళు, కష్టాలు, మనసు బాధలు పలికించడంతో బాటు, అభ్యుదయ స్పృహను కూడా నిలుపుకోగలిగారు. ఆత్రేయ సినిమారంగంలో తనదైన వ్యక్తిత్వం తోనే నిలిచారు. సినిమారంగంలో

కూరుకుపోయిన తను-నాటక రంగానికి ఏం చెయ్యలేకపోతున్నాననీ, ఏదైనా చెయ్యాలనీ చివరివరకూ బాధపడుతూనే ఉండే వారు.

"ఆత్రేయ పాటలు రాయక ప్రొడ్యూసర్లనూ, రాసి ప్రేక్షకులనూ ఏడిపిస్తారనే" మాట చెలామణిలో ఉండేది. "నిజాన్ని నిజమని చెబితే స్వీకరించే పరిస్థితి పరిశ్రమలో లేదు. ఉదాహరణకి నా విషయమే చెబుతాను. ఆత్రేయతో పాట రాయించాలంటే ఆలస్యం చేస్తాడని అంటారు. అయితే ఆలస్యం ఎందుకవుతోందని అర్థం చేసుకోలేరు. నాకూ మనసుంది. మనసుకు పట్టే పాటలే రాస్తాను. కానీ మనసును చంపుకుని రాయలేను. అందువల్లనే నేను పాట రాయడానికి ఆలస్యమవుతుంది. వేగంగా పాటలు రాస్తే విన్నవారు కూడా వేగంగానే మరచిపోతారు' అనేవారాయన.

'పాట రాయాలంటే సన్నివేశం, సన్నివేశంలో పాత్రల స్వభావం బాగా గుర్తుంచుకోవడం అవసరం' అనేవారాయన. పాటరాసిన తర్వాతే బాణీలను కనిపెట్టగలగాలనీ, అర్థవంతమైన పదజాలం, సన్నివేశం, కథాగమనం పాటల్లో ప్రతిబింబించినప్పుడే జన హృదయాల్లో ముద్ర వేసుకుంటాయనీ ఆయన దృఢమైన అభిప్రాయం.

"అల్పాక్షరముల అనల్పార్థ రచన" అన్నమాట ఆత్రేయ రచనకు వర్తించినంతగా మరివేరు కలానికి సాధ్యం కాదనిపింపజేస్తాడు. మామూలు మాట్లాడుకునే మాటలనే పాటలుగా మలిచే అపూర్వ సృజన అతనిది. పాటల్లో ఆ వచనగుణమే ఆయనను జనహృదయాధిపతిని చేసిందేమో! తక్కువ పదాలలో ఎక్కువభావం నింపి స్పందింపజేయగల లక్షణం ఆత్రేయది. 1921 మే ఏడవతేదీన నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట దగ్గరున్న మంగళంపాడు గ్రామంలో జన్మించిన ఆత్రేయ పదిహేనవ ఏట ఛందోబద్ధ పద్యాలు రాయడం ప్రారంభించినా- వివేకానంద, టాల్‌స్టాయ్ రచనల ప్రభావంతో మార్పుకు లోనయ్యాడు. రచన ఆయన కొక తపస్సుగా మారింది. రచన మంచినీళ్ళ ప్రాయంగా చేసే లక్షణం కాదాయనిది. మనసులోకి రాయదలుచుకున్నది ఒకంతట రాదు. ధ్యానముద్రతో కొట్టివేతలు, తుడుపులూ, మార్పులూ, అవసరంలేనంత కచ్చితంగా, రాయదలిచింది డిక్టేట్ చేయగల ప్రతిభ ఆయనిది. సామాన్యుడుని సింహాసనాధిష్టుణ్ణి చేసి వాడి కన్నీళ్ళకు, స్వేదానికి, రక్తానికి తన గీతాలతో కావ్యత్వం, అమరత్వం సిద్ధింపజేశాడాయన.

1940 ప్రాంతాల్లోనే క్విట్‌ఇండియా ఉద్యమ ప్రభావంతో స్వాతంత్ర్య సమరంలోకి నేరుగా దూకి 1942 లో చిత్తూరు జైలులో తొమ్మిది నెలలు గడిపిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆత్రేయ అన్న సంగతి కొందరికి తెలియకపోవచ్చు. 'వెలుగునీడలు' చిత్రంలో ఆయన మాటలు, పాటలు గమనిస్తే ఆయన దృక్పథం స్పష్టంగా తెలుస్తుంది. సినిమాకథను రూపొందించడంలో గానీ, సంభాషణలను రచించడంలో గానీ, పాటలు రచించడంలో గానీ, 'ఆత్రేయత' అనేది ఒక ప్రత్యేక ముద్ర.

'ఆదర్శం', ఆ తరువాత 'వాగ్దానం' చిత్రాలు ఆయన స్వయంగా తెలుగువారికి అందించిన కానుకలు. 'వాగ్దానం' చిత్రం తీసి అందులో సాటి రచయితల పాటలు ప్రవేశపెట్టిన వితరణశీలి ఆయన. దాశరథి పాటగానీ, శ్రీశ్రీ రాసిన హరికథ పాటగానీ 'వాగ్దానం'లో ఎంత పాపులర్ అయినవో జనాలకు తెలుసు.

ఎవరు నటించినా, ఎవరు దర్శకత్వం వహించినా ఆత్రేయ మాటలు పాటలతోనే విజయవంతమైన చిత్రాలు ఎన్నో ఉన్నాయి. వెలుగునీడలు, మంచిమనసులు, మూగమనసులు, తోడికోడళ్ళు, బడిపంతులు, ఆరాధన, ప్రేమ్‌నగర్, దసరాబుల్లోడు, వంటి చిత్రాల విజయం ఆత్రేయ హస్తవాసివల్లే అనడంలో సందేహించనవసరంలేదు. పాత్రల్నీ, కథనీ మించిన అతికే సంభాషణల రచన చేయగల దక్షత ఆయనిది. మాటలు పన్నడంలోని ఆత్రేయ విన్నాణం గొప్పది.

వెలుగు నీడలు చిత్రంలో పాటకోసం కల్పించిన ఓ సన్నివేశం ఉంది, కానీ నాయికా నాయకులు షికారుకెళ్ళే ఆ సన్నివేశంలో కృతకత్వం కనబడనీయని సంభాషణలు రాశారాయన.

"ఏదీ నీ చెయ్యి"

"ఏం జోస్యం జెబుతారా"

"కాదు నిజం చెబుతాను"

ఇక్కడ జోస్యం మీద నమ్మకంలేనిది పాత్రకు కాక రచయితకే అయినా అక్కడ జోస్యం గురించి తన అభిప్రాయం చెప్పి - ధనవంతులు వంటినిండా నగలతో ఆడంబరంగా ఉంటారనీ, నాయిక చెయ్యి చిన్న రిస్టువాచీతో చూడముచ్చటగా ఉందనీ చెబుతాడు ఆత్రేయ.

అక్కడ కష్టజీవుల గురించి చెబుతూ సామ్యవాదాన్ని సూచించే పాటవుంది. శృంగార వైరాగ్యాల మధ్య ఆ సన్నివేశంలో ఆ పాట అతకదు. కానీ ఆత్రేయ చాకచక్యంగా రాసిన ఆ మాటలు ముచ్చటగా అతికి సన్నివేశాన్నీ, పాత్రలనీ అసహజత నుంచి రక్షిస్తాయి. ఇలా సంభాషణల్లో ఆత్రేయ చాకచక్యం ఎన్ని చిత్రాల్లోనో పరిశీలించుకోవచ్చు. సినిమా సమష్టికృషి అనేమాట నిజమే అయినా, ఆత్రేయ మాటలు రాసిన సినిమాలు ఆయన రచన వల్లే జీవం పోసుకుని రాణించాయని చెప్పడానికి సందేహించనక్కరలేదు.

సోషలిస్టు భావాలకు అద్దంపట్టే తోడికోడళ్ళు చిత్రంలోని "కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడిదానా – బుగ్గమీద గులాబీరంగు ఎలా వచ్చెనో చెప్పగలవా" అనే పాట శ్రీశ్రీది అని భ్రమపడేవాళ్ళు ఎందరో ఉన్నారు. కానీ అది ఆచార్య ఆత్రేయది. దానిమీద విశ్లేషిస్తూ పెద్ద వ్యాసాలు రాసిన వారున్నారు. "చాకిరొకరిది సౌఖ్యమొకరిది సాగదింక తెలుసుకో" అని ఆ పాటలోనే సమసమాజ భావనను బలీయంగా చెప్పాడు ఆత్రేయ. 'మండే గుండెలు' వంటి చిత్రంలో కూడా ఓ పాటలో ప్రాస్తావికవశాత్తు సైతం 'కాసే చెట్టును కాచే వాడికే కాయలు దక్కాలి' అంటూనే 'కన్నెబెట్టును గట్టుకు చేర్చిన కాళ్ళకు మొక్కాలి' అని శృంగారాన్ని ప్రస్తావిస్తాడు.

పాటల్లో ఆత్రేయ పాటలు గుండెలోతులంటకుండా పైపైన తేలిపోయేవి చాలా తక్కువ. 'మాను మ్రాకును కాను రాయరప్పను కానూ మామూలు మడిసిని నేనూ' (మూగమనసులు) అన్నా, 'ముద్ద బంతిపూవులో మూగకళ్ళ ఊసులో' పలికినా, 'శిలలపై శిల్పాలు చెక్కినారు మనవాళ్ళు సృష్టికే అందాలు తెచ్చినారు' (మంచిమనసులు) అని చరిత్రను స్మరించినా, "ఎందుకో సిగ్గెందుకో ఇంతలోనే అమ్మాయికి ఇంత సిగ్గు ఎందుకో" అంటూనే, 'ఈ పగలు రేయిగా రేయి వెన్నెలలాగా మారినదేమి చెలీ' (సిరిసంపదలు) అన్నా, 'చలి చలి చలి వెచ్చని చలి' (ఆస్తిపరులు) అన్నా, 'వెన్నెలకేలా నాపై కోపం' (కానిస్టేబుల్ కూతురు) అన్నా, 'చిలకమ్మ పలికింది చిగురాకుగొంతుతో' (సుపుత్రుడు) అన్నా, 'నేలమీద జాబిలి' (రాజారమేష్) అన్నా, 'చెంగావి రంగుచీర కట్టుకున్న చిన్నది' (బంగారు బాబు) అంటూ జిమ్మదియ్య పాటలు రాసినా, 'పరువమా చిలిపి పరుగు తీయకు' అని మౌనగీతాలు రాసినా, 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం' అంటూ మొన్న మొన్న కూడా భగ్నహృదయ 'అభినందన'నే చిత్రించినా,

అలాగే ‘మనసొక మధుకలశం పగిలేవరకే’ అని ‘నీరాజనం’ అర్పించినా, ఆత్రేయ ముద్ర ప్రతిపాటలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బొమ్మలపెళ్ళి, బంగారు సంకెళ్ళు, కీలుబొమ్మలు, అర్ధాంగి, పాపం పసివాడు, పాలమనసులు, మురళీకృష్ణ, మరో చరిత్ర, అంతులేని కథ, అగ్నిపుష్పాలు, మౌనగీతం, బంగారుకలలు, బంగారుబాబు, మూగప్రేమ, కోకిలమ్మ, ఆస్తిపరులు, కన్నెమనసులు, గుప్పెడుమనసు, అభినందన, నీరాజనం ఇలా ఎన్ని సినిమాపేర్లు చెప్పి వాటిల్లో ఆత్రేయ రాసిన పాటలు పరిశీలించండి అని చెప్పడం! ఆయన ప్రతిపాటా ఒక జీవనగీతం, మానవానుభూతుల నుండి చిప్పిల్లిన రసగంగ. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మొన్న మే నెలలో ఆత్రేయకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవం సంపాదించుకుంది.

ప్రేయసీ ప్రియుల అనురాగాన్ని చిత్రించినా, ప్రియునిదో, ప్రియురాలిదో హృదయ భగ్నతనో, విరహాన్నో విరచించినా, అన్నా చెల్లెళ్ళ ఆత్మీయతలను రాసినా, పిల్లల మనోభావాల్ని వెల్లడించినా, మానవీయ సంబంధాలను వేటినైనా, అందునా కలలతో, కన్నీళ్ళతో, జ్ఞాపకాలతో ఆవరించుకున్న వాటిని అత్యద్భుతంగా రాసి స్పందింపజేసే లక్షణం ఆత్రేయ కలానికే దక్కింది. ఆయన వీణపాటల్లో ‘మ్రోగునా ఈ వీణ’ (మురళీకృష్ణ), ‘పాడమని నన్నడగవలెనా’, ‘పాడమని నన్నడుగ తగునా’ (డాక్టర్ చక్రవర్తి) విలక్షణమైనవి. సాహిత్యంలో ఆణిముత్యాలుగా నిలిచినవి. రెండర్థాల పాటలకు శ్రీకారం చుట్టి ‘కిక్’ ఇచ్చిన ఘనతా ఆయనకు ఉంది. ‘చిటపట చినుకులు పడుతూ ఉంటే’ అంటూ ఆత్మబలంలో రాసి కిక్ ఇస్తే, ‘చినుకు చినుకు పడుతూ ఉంటే తడిసి తడిసి ముద్దవుతుంటే’ అంటూ ఇప్పుడూ అంత కిక్ ఇచ్చే సమర్థతను ఆ వానపాటనే చూపగల ఘనత ఆయనది. “చిట్టి అమ్మలు చిన్నినాన్నలు మన ఇద్దరికే తెలుసునీ మమతలూ” (ఆస్తిపరులు), “జిలిబిలి పలుకుల చెల్లెళ్ళూ చిలిపితనాల తమ్ముళ్ళూ చదవాలి, మీరెదగాలి, చక్కని మనుషులుగా” (మూగప్రేమ), “ఒకటీ ఒకటీ ఒకటి మానవులంతా ఒకటి” (ఆలుమగలు) వంటి పాటలు పిల్లల పట్ల అనురాగాన్ని ఆత్మీయతను చూపుతూ సందేశం సంకలించిన గీతాలు.

ఇలా ఎన్నని చెప్పేది ఆయన పాటలు. ఆయన పాటలే మిగిలాయి. ఆయన మాటలే మిగిలాయి. “మంచితనానికీ తావేలేదు. మనిషిగ బతికే వీలు లేదు” అనా ఆయన వెళ్లిపోయింది? “మరచిన మమతొకటీ మరీ మరీ పిలిచినదీ ఒక తీయని

పరితాపమై” అనా ఆయన వెళ్లిపోయింది? “నిరుపేద కెందుకో వలపూ – కలవారి ఆటకే గెలుపు – మృతినైన మాయనీ తలపు” అనా ఆయన వెళ్లిపోయింది? “మరుపే తెలియని నా హృదయం – తెలిసీ వలచుట తొలినేరం – అందుకె ఈ గాయం – గాయాన్నయిన మాననీవు– హృదయాన్నయిన వీడిపోవు– కాలం నాకు సాయంరాదు– మరణం నన్ను చేరనీదు” అనా ఆయన వెళ్ళిపోయింది? “ఆ చీకటిలో కలిసిపోయి, నా రేపటిని మరిచేపోయి, మానాలి నీ ధ్యానము– కావాలి నే శూన్యము” అనా వెళ్ళిపోయింది.

ఏమో! కానీ “పోనివ్వం పోనివ్వం పోతానంటే దారివ్వం” అని మనం అనలేకపోయాం, “ఇచ్చాడమ్మా ఒకటే బ్రతుకు – బ్రతకాలమ్మా తుదివరకూ – మానుకు ఉన్నది చిగురించడమూ మనిషికి లేదు మళ్ళీ జన్మము” అని ఆయన అన్నందుకు మనం ఆయనకు కన్నీళ్ళ నీరాజనంతో ఇలా అంటాం. ఆయనను తలుస్తూ ఉంటాం.

అవును మరి. “పోయినోళ్ళందరూ మంచోళ్ళు. ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపిగురుతులు”. ✱

**(ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధం 24 సెప్టెంబరు’ 1989)**

## (72) దివికేగిన 'పాటమాలి'

"ఎదలోని సొదలా – ఎలదేటి రొదలా – కదిలేటి నదిలా – కలల వరదలా– చలిత లలిత పదకలిత కవితలెద – సరిగమ పలికించగా – స్వర మధురిమ లొలికించగా" వేలాది పాటలతో అఖిలాంధ్ర ప్రేక్షకుల ఎడదలను దోచుకున్న సినీగేయ కవి వేటూరి సుందరరామమూర్తి. చిత్రాలయ మందిరానికి పాటలగోపురం ఆయన. గోపుర శిఖరమూ కూలిపోతుందని కన్నులముందే జరిగిన దుర్ఘటనను జీర్ణించుకోక తప్పనట్లే, వేణువై భువనానికి వచ్చిన ఆ పాటల పదకర్త – గాలియై పోయి, గగన పథానికి జ్ఞాపకాల పరిమళాలు వదిలి ఎగసిపోయాడు.

కృష్ణా జిల్లా పెదకళ్ళేపల్లిలో 1936 జనవరి 29 న జన్మించిన వేటూరి ప్రముఖ కవి, పరిశోధకులు వేటూరి ప్రభాకరశాస్త్రి సోదరుడి కుమారులు. మద్రాసు గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, విజయవాడ ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్ ప్రభుత్వ కళాశాలలో బియ్యే చదివారు. తొలుత నటుడవ్వాలని మద్రాసు మెట్టినా, మళ్ళీ రచన వైపు దృష్టిసారించి, జర్నలిస్టుగా జీవితం ప్రారంభించారు. 'ముక్త్యాల రాజా' సిఫార్సుమీద వేటూరి తొలుత ఆంధ్రప్రభలో ఉపసంపాదకుడిగా చేరి, 1956 నుంచి పదహారేళ్ళు జర్నలిజంలో ఉన్నారు. ఆంధ్రప్రభ వారపత్రికకు సినిమా ఎడిటర్‌గా కూడా పనిచేశారు. 1969 లో ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి 'సిరికాకుళం చిన్నది' అనే సంగీతరూపకం వేటూరి రచనగా ప్రసారమై, ఎందరినో ఆకట్టుకుంది. అదే – సినీరంగంలో పాటల కవిగా పాదం మోపేందుకు ఒక రకంగా 'పాస్‌పోర్ట్' అయింది ఆయనకు.

నాటి అగ్రనటులు ఎన్టీఆర్ ప్రోత్సాహంతో.. 'దీక్ష' చిత్రం కోసం 'నిన్నరాతిరి కలలో' అనే పాట రాసినా, అది రికార్డు కాక, అనంతరం కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఓ సీత కథ'లో 'భారత నారీ చరితము మధుర కథా భరితము' అనే పాటే తొలిపాటగా రికార్డు అయింది! పాటల రచయితగా చిత్రరంగప్రవేశం చేసిన మూడేళ్ళ వ్యవధిలోనే యావత్ చిత్రసీమనూ ముగ్ధుల్ని చేసే పాటలతో, తన కలం బలం

నిరూపించుకున్నారు. 'శంకరాభరణం'.. కావ్య గౌరవంతో అలరారే పాటలతో - పండితుల తలలూపించగా, 'అడవిరాముడు' జనం ఈలలు వేసే కమర్షియల్ పాటలతో పామరుల హృదయాలను దోచుకుంది. వేటూరి కలానికి ఆబాలగోపాలాన్ని అలరించే, అద్భుత పద భావ మాంత్రికశక్తి ఉందని సుందరంగా నిరూపితమైంది!

శ్రీశ్రీ తరువాత తెలుగు సినిమా పాటకు జాతీయ గౌరవాన్ని తెచ్చిపెట్టింది వేటూరి రాసిన "రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే" (మాతృదేవోభవ) అనే పాటే. వివిధ భావాభివ్యక్తులతో - శాఖోపశాఖలుగా పాటలను విస్తరింప చేసిన మహా వటవృక్షం ఆయన. మల్లాది, ఆత్రేయ వంటి దిగ్గంతులను మరపించిన అద్భుత రచనం ఆయనది! సిరిసిరిమువ్వ, సీతామాలక్ష్మి, సాగరసంగమం... కె.విశ్వనాథుని చిత్రాల నాదాలను ఝుమ్మనిపింప చేసిన పాటమాలి వేటూరి. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే 'నంది' పురస్కారాల్ని తన పాటల రచనకు ఎనిమిదిసార్లు అందుకున్నారాయన. 1977లో 'పంతులమ్మ' చిత్రంలో 'మానసవీణా మధుగీతం' అనే పాటకు తొలి నంది నడిచి రాగా, ఆ తరువాత శంకరాభరణం, కాంచనగంగ, ప్రతిఘటన, చంటి, సుందరాకాండ, రాజేశ్వరి కల్యాణం, గోదావరి-చిత్ర గీతాలకు నంది బహుమతులందుకున్నారు వేటూరివారు.

సంప్రదాయ కవిత రాసినా, జానపద గీతం అల్లినా, అన్నిటా తన ప్రతిభను చూపిన మేటి గీతరచయిత ఆయన. సినిమాపాటకు సాహిత్య గౌరవాన్ని నిలిపిన పండితకవిగానూ, మామూలు మాటలే పాటగా కట్టి పాటకజనాన్ని సైతం ఉర్రూతలూపిన 'మాస్' కవిగానూ ఆయన కీర్తిగడించారు. ఎనిమిది వేలకు పైగా పాటలు రాసిన వేటూరి-75 వ ఏట సైతం 'వరుడు' చిత్రం కోసం అయిదు రోజుల పెళ్ళి పాటను, మణిరత్నం 'రావణ్' (విలన్) చిత్రం కోసం, 'సింహా' చిత్రం కోసం పాటల రచన సాగిస్తూనే వచ్చారు. బహుశా 'రావణ్' తెలుగు వెర్షన్ చిత్రమే - ఆయన మొత్తం పాటలు రాసిన చివరిచిత్రం అనవచ్చు.

సీతామహాలక్ష్మి ఆయన అర్ధాంగి. ఆయనకు ముగ్గురు కుమారులు. పెద్దబ్బాయి రవికి కూడా ఆయన పాటల రచనా సుగంధమబ్బింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వ విద్యాలయం వేటూరికి గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. 'ఫిలింఫేర్' నుంచి ఇటీవలే 'లైఫ్‌టైం ఎఛీవ్‌మెంట్' అవార్డు పొందారు. 22 మే శనివారం రాత్రి

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్‌లో ఆయన తుది శ్వాస విడిచారు. యావత్తు చిత్రప్రపంచమూ, శ్రోతృజన లోకమూ రాలిపోయిన రాగరంజితాత్మకు నివాళులర్పించింది.

"నీవులేవు నీ పాట వుంది" అని పదే పదే తలుచుకునేలా ఆయన రాసిన పాటలు శాశ్వతంగా గుండెగుడిలో నినదిస్తూనే ఉంటాయి.

"ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక
ఏ దారెటుపోతుందో ఎవరినీ అడగక"

అనే గొప్ప తాత్వికతనూ, 'నరుని బ్రతుకునటన – ఈశ్వరుని తలపు ఘటన – ఆ రెంటి నట్టనడుమ నీకెందుకింత తపన' వంటి రీతిలోనూ వైవిధ్య భరితంగా ఆవిష్కరించడం ఆయనకే తగును! "అ అంటే అమలాపురం... ఆ అంటే ఆహాపురం" అని మాస్ మసాలా పాటతో గంగవెర్రులెత్తించిందీ ఆయనే! 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్నీతి లోకంలో..' అనే పాటలో 'మర్మస్థానం కాదది నీ జన్మస్థానం. మానవతకు మోక్షమిచ్చు పుణ్యక్షేత్రం' అంటూ ప్రతిఘటనలో మహిళా ఆత్మగౌరవానికి అద్భుత పతాకనెత్తింది ఆయనే! మణిరత్నం తన సినిమాలన్నింటికీ తెలుగుపాటలు వేటూరి చేతనే రాయించుకున్నారు. ఆయన పాటల 'పస', 'పసందు' అలాంటివి.

వేటూరి 'హాసం' పత్రికలో ధారావాహికగా 'కొమ్మ కొమ్మకో సన్నాయి' పేరున పలువురు తెలుగు సినీరంగ ప్రముఖులతో తన అనుబంధాన్నీ, తన పాటలు కొన్నింటి విశేషాలనూ వివరించే వ్యాసాలు రాశారు. 'వేటూరి సాహితీ సమితి' ప్రచురణగా అది ముద్రితమైంది. హైదరాబాద్‌లో స్థిరపడినా ఆయనకు సొంత ఇల్లు ఏర్పడలేదు. తెలుగు భాషా, సాహిత్యాల పట్ల ఆయనకున్న 'మక్కువ', 'పట్టు' చాలా ఎక్కువ. తెలుగుకు ప్రాచీన హెూదా ఇవ్వలేదనే నిరసనతోనే ఆయన తనకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని వెనుతిరిగి ఇచ్చారు. "అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానమె సోపానంగా.." పాటల పుష్పాలతో చిత్ర సరస్వతిని అర్చించారాయన! కళాసౌందర్య సృజన, ఉదాత్త సామాజిక స్పృహ, మానవీయ విలువల మహోదారత ముప్పేటలుగా అల్లుకున్న పాటల రచనా పటిమ వేటూరివారిది! శబ్ద రహస్యం తెలిసిన వాడు. అర్థ గాంభీర్యం ఎరిగినవాడు.

వేటూరి సినీరంగంలో ఎన్టీఆర్, విశ్వనాథ్, రాఘవేంద్రరావులు తనకుచేయూతనిచ్చిన త్రిమూర్తులుగా సదా తలుచుకునేవారు. ఆయన తొలిపాటకు సరిగమలు పెండ్యాల కూర్చగా, తొలిసినిమా పాటకు కె.వి.మహదేవన్ సంగీతం సమకూర్చారు. ఇచ్చిన ట్యూన్‌కి భావాన్ని చక్కగా అనుసంధానం చేసే పాటలు రాయడంలో సీనియర్ సముద్రాల ప్రథమగణ్యుడనే వేటూరివారు, తానూ అదే పథంలో అద్భుత రచనలు చేసి చూపించారు. మల్లాది, ఆత్రేయ, కణ్ణదాసన్, పింగళి అంటే వేటూరికి అపార గౌరవాభిమానాలు. వేటూరిగారి షష్టిపూర్తికి మద్రాసు విజయగార్డెన్స్‌లో నలభై అయిదుమంది ఆర్కెస్ట్రా బృందం "హ్యాపీ బర్త్‌డే' వాయించారు. పూలదండలు ఫలాలు సమర్పించి కవిగారికి వందనాలు చేసుకున్నారు. అందరికీ ఆయనతో విందుభోజనం జరిగింది. సహజంగా భోజన ప్రియులైన వేటూరి తన పాటలతో కూడా షడ్రసోపేతమైన విందులారగింప చేసినవారే!

"తెలుగు సినీ గీతాల క్షేత్రంలో వేటూరి చేయని వ్యవసాయం లేదు. తీయని ఫలసాయం లేదు" అన్న మాట యథార్థం. తానే ఒక వటవృక్షంలా ఎదిగిన 'పాటమాలి' ఆయన. సినిమా పాటకు సాహిత్యగౌరవాన్నీ, సాదాసీదా వినోదాన్నీ కూడా, తన కలానికి రెండంచులుగా రాసి సంతరించి, తన పాటలు తెలుగు జాతి జనులు పాడుకునే అవిస్మరణీయ గీతాలుగా గుండెల్లో విడిచి, పరమయోగి హంసలా దివికేగిన ఆ మహనీయుడికి ఆంధ్రభూమి ఘన నివాళి ఘటించింది. ✻

**(ఆంధ్రభూమి వారపత్రిక 17 జూన్' 2010)**

# (73) గాయకులు "రామకృష్ణ" స్మృతిలో

**వి**స్సంరాజు రామకృష్ణ – సినీ నేపథ్య గాయకుడు కావడానికి ముందే అపర ఘంటసాల అని పిలుచుకునేలా పాడుతుండేవాడు. మనిషి అందగాడు కూడాను. తనను మొదట మా కాలేజీ రోజుల్లోనే చూశాను. 1965 లో నేను హెచ్ఎస్సి పాసయ్యాక పీయూసీ కోర్సులో వివేకవర్ధని కళాశాలలో చేరాను. రామకృష్ణ మాకు సీనియర్. తనప్పుడు బీఎస్సీ ఫస్టియర్ అన్నట్లు గుర్తు. పీయూసీలో నేనూ సైన్స్ స్టూడెంట్‌నే. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ చదివినవాణ్ణే. వానపాములు, కప్పలు డిసెక్ట్ చేసినవాణ్ణే.

రామకృష్ణ తరచూ ల్యాబ్‌లో ఎదురుపడుతూ ఉండేవాడు కూడాను. తను సీనియర్ కావటంతో పెద్ద పరిచయం లేదు. పీయూసీలో నాతో చదువుకున్న మరి ఇద్దరు మంచి స్నేహితులుండేవారు నాకు. ఒకరు లంకా రాధాకృష్ణమూర్తి. తను ఇప్పుడు పెద్ద డాక్టర్. ప్రముఖ సినీనటుడు ధూళిపాళకు మా రాధాకృష్ణమూర్తి మేనల్లుడు. మా వాడికీ నాటకాల మోజు జాస్తి. దుర్యోధన ఏకపాత్రాభినయం చేసేవాడు. మరో మిత్రుడు మందరపు నాగేశ్వరరావు. వాళ్ళ నాన్నగారు మందరపు వెంకటేశ్వరరావు గారు ఆ రోజుల్లో గొప్ప రచయిత. భారతి వంటి పత్రికలలో కథలు వచ్చేవి కూడా. 'వనలక్ష్మి' అనే ఆయన కథల సంపుటి అప్పటికే వెలువరించారు. సహజంగా సాహిత్యాభిమానినైన నాకు మిత్రుడు ఇచ్చిన ఆ పుస్తకం గొప్ప బహుమతి.

హెచ్ఎస్సీ వరకు మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో చదివి, అందునా తెలుగు మాధ్యమంలో చదివి, ఒక్కసారిగా వివేకవర్ధని కళాశాలలో పీయూసీ ఆంగ్ల మాధ్యమం అయ్యేసరికి ముందు బెంబేలెత్తింది. అప్పట్లో పీయూసీలోనూ తెలుగు ఒక పాఠ్యాంశంగా ఉండేది. ఆ తెలుగు పీరియడ్ అంటే మాకు ప్రాణం లేచొచ్చేది. నిడదవోలు సర్వేశ్వరరావు గారు మాకు తెలుగు లెక్చరర్. అద్భుతంగా పాఠాలు చెప్పేవారు. పానుగంటి వారి స్వభాష అప్పుడు చదువుకున్నదే. ఆయన పాఠం చెప్పటంతో మనస్సులో ముద్రించుకు పోయింది. రామకృష్ణ అంటే సర్వేశ్వరరావు గారికి మంచి అభిమానం ఉండేది. అప్పటికే తానుగాయకుడుగా ఘంటసాల పాటలు పాడుతుండేవాడు. ఆకాశవాణిలో

లలితగీతాలు కూడా పాడాడు. బీఎస్సీ చేసినా రామకృష్ణ గాయకుడిగానే తను స్థిరపడి రాణించాలని అనుకునేవాడు.

నాకు బాగా గుర్తు. వివేకవర్ధని కళాశాల వార్షికోత్సవం 1965-66 లో జరిగినప్పుడు కాలేజీ ఆవరణలోనే స్టేజీవేసి చేశారు. ఆ వార్షికోత్సవ వేడుకల్లో రామకృష్ణ పాడాడు. ఒక కోరస్‌సాంగ్ కోసం తన వెనుక గొంతుకలిపిన వాళ్లలో నేనూ ఉన్నాను. అదే మా సాన్నిహిత్యానికి గుర్తు. ఆ పాట కూడా అప్పటి పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో ఒక దేశభక్తి గీతం. ప్రేమించి చూడు చిత్రంలో ముళ్ళపూడి వెంకటరమణ రాసిన పాటలా 'మేడమీద మేడకట్టి ..... బుచ్చబ్బాయి పనికావాలోయ్'- వరసలో రాసిన పేరడీ గీతం. "ఆయూబ్‌ఖాన్ పారిపోవాలోయ్" అని కోరస్‌లో మేమంతా అరుస్తాం. ఆ పాట సర్వేశ్వరరావుగారే రాసిచ్చారని నాకు గుర్తు. ఏమైనా రామకృష్ణ లీడ్ చేయగా ఆ దేశభక్తి గీతంలో వెనుక గొంతు కలిపిన వారిలో నేనూ ఉన్నాను. మా మిత్రుడు, ధూళిపాళ మేనల్లుడు అయిన రాధాకృష్ణమూర్తి నాటి వార్షికోత్సవ వేదికమీద దుర్యోధన ఏకపాత్రాభినయం కూడా చేశాడు.

నేను పీయూసీ పూర్తిచేయనే లేదు. కెమిస్ట్రీ పరీక్షలో తప్పడంతో లెక్కలు, సైన్స్ లేని విద్యయే చదువుతానని ఇంట్లో హఠం చేసి తెలుగు మీద అభిమానంతో ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాలలో డిప్.ఓ.ఎల్ (డిప్లమో ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్) విద్యకు మారిపోయాను. అలా రామకృష్ణ బీఎస్సీ చదువు మానిన కాలేజీ నేనూ విడిచిపెట్టాను. మా పరిచయం కూడా అంతగా పెరగలేదు.

1972 లో విచిత్రబంధం సినిమాలో 'వయసే ఒక పూలతోట' అనే పాటతో సినీ నేపథ్యగాయకుడిగా రామకృష్ణ రంగప్రవేశం చేశాడు. ఘంటసాల పాటలు పాడుతూ పెరిగిన రామకృష్ణగళం కూడా ఆయనకు దగ్గరగా ఉండేది. ప్రముఖ సినీ నేపథ్య గాయకురాలు సుశీలకు రామకృష్ణ అక్క కొడుకు. అంటే సుశీల తనకు పిన్ని అవుతుంది. సుశీల రికమండేషన్ వల్లనే రామకృష్ణ సినిమా గాయకుడిగా అయ్యాడని ఆరోజుల్లో అనుకునేవారు.

అక్క కొడుకు కాబట్టి ఆవిడే పట్టుబట్టి సినిమాల్లోకి తీసుకువచ్చిందనీ, సంగీత దర్శకులతో ఒప్పందం చేసుకుందనీ అనుకున్న వారూ ఉన్నారు. కానీ సుశీల గారే ఒక సందర్భంలో స్వయంగా వివరించినట్లు రమేష్ నాయుడు ఎవరి ద్వారానో రామకృష్ణ గురించి విని, 'మీ అక్క కొడుకట గదా! పాడించేదా?' అని సుశీలను అడిగారట. ఆవిడ సరేనన్నారు. అలా విచిత్రబంధంలో రమేష్‌నాయుడు సంగీత

దర్శకత్వంలో రామకృష్ణ తన పిన్ని సుశీలతో, 'వయసే ఒక పూలతోట' అనే తొలిపాట రికార్డు చేశాడు. అయితే పంపిణీదారులు రామకృష్ణ పాట తీసేయమంటున్నారని నిర్మాత సుశీల గారితో అంటే, "కొత్త గాయకుడు గదా నిరుత్సాహపడిపోతాడు, మరొకసారి ఆలోచించండి" అన్న సుశీల సలహా విని రామకృష్ణ పాట ఉంచేయడం, అది గొప్ప హిట్ కావడం జరిగింది. ఘంటసాల తర్వాత పెద్దపెద్ద నిర్మాతలు రామకృష్ణను ఎంతగానో ప్రోత్సహించారు.

భక్తతుకారాం సమయంలో ఘంటసాల గారికి బాగా అనారోగ్యం కలిగింది. దాంతో ఆదినారాయణరావుగారు, అంజలీదేవి రామకృష్ణ చేత పట్టుబట్టి పాడించారు. అది గొప్ప హిట్ అయింది. స్వయానా పిన్ని కాబట్టి మద్రాస్‌లో రామకృష్ణ సుశీల గారింట్లో ఉండేవాడు. దాంతో సుశీల రామకృష్ణను సిఫారసు చేస్తుందనీ, తనతో అయితేనే పాడతానన్నారనీ ప్రచారం చేసినవారూ ఉన్నారు.

కానీ రామకృష్ణ గాత్ర మాధుర్యం వల్లనే తనకు ఘంటసాల గళమే అలవాటు పడిందనుకున్న అక్కినేని, ఎన్‌టీఆర్, శోభన్‌బాబు, కృష్ణంరాజు లాంటి హీరోలంతా కూడా రామకృష్ణ చేత పాడించుకున్నారు. సంగీతదర్శకులు ప్రోత్సహించారు. ఘంటసాలకు ఏకలవ్య శిష్యుడైన రామకృష్ణ ఆయనతోపాటు అల్లూరి సీతారామరాజు చిత్రంలో 'తెలుగువీర లేవరా...' అనే పాటపాడి ఎంత ఉప్పొంగిపోయాడో, అమెరికాలో ఘంటసాల కచేరీలకు మూడుసార్లు ఆయనతో పాటు రామకృష్ణ వెళ్ళి మరో ఘంటసాల అని ప్రేక్షకజన నీరాజనాలందుకున్నారు.

1976 లో రామకృష్ణ గాయని జ్యోతి ఖన్నాను వివాహమాడారు. అలా తాను జ్యోతి రామకృష్ణ అయింది. 1978 లో నేను ఆకాశవాణిలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ (డ్యూటీ ఆఫీసర్ – డీవో) గా చేరాను. ఆకాశవాణిలో అవసరార్థం పాటలు రాసేవాణ్ణి. పి.వి.సాయిబాబా, నల్లూరి సుధీర్‌కుమార్ రేడియోలో లలిత గీతాలకు సంగీత దర్శకత్వం వహిస్తూ ఉండేవారు. 1982 లో దూరదర్శన్ వైభవం మొదలయ్యింది. నల్లూరి సుధీర్ కుమార్ దూరదర్శన్ కోసం నాచేత కొన్ని పాటలు రాయించుకున్నాడు. అందులో తనూ, మంజులా ఉదయ్‌కుమార్ కొన్ని పాటలు పాడగా, నేను వ్రాసిన 'కృష్ణా, గోపీ కృష్ణా' అనే పాట శ్రీ నల్లూరి సుధీర్ కుమార్ సంగీత దర్శకత్వంలో సోలోగా రామకృష్ణ భార్య అయిన జ్యోతి రామకృష్ణ పాడింది. ఆ పాట ఎన్నోమార్లు దూరదర్శన్‌లో ఆవిడ గళాన పునః ప్రసారమైంది. రామకృష్ణ నాకు కాలేజీలో సీనియర్ అని చెప్పుకోవడం నాకెంతో సంతోషం కలిగించే విషయమే.

చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలివస్తున్న సమయంలో తన కొడుకు సాయి చరణ్ చదువు కోసం రామకృష్ణ తన మకాం హైదరాబాద్‌కు మార్చారు. అయితే మ్యూజిక్ స్టూడియోలు అవీ ఎక్కువగా మద్రాసులో ఉండేవి. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం మద్రాసులోనే అందుబాటులో ఉండడం వంటి కారణాలతో పాటు – రామకృష్ణకు ఎందుకో తర్వాత తర్వాత అవకాశాలు తగ్గి, తగిన ప్రోత్సాహం లభించలేదు. వందలాది చిత్రాల్లో పాడకపోయినా రామకృష్ణ వందలాది సినీ గీతాలు, 5000 వరకు వివిధ పాటలూ పాడాడు. తాను పాడిన సినిమా పాటలెన్నో గొప్ప హిట్ అయ్యాయి. అందాలరాముడు, భక్త తుకారాం, శారద, కృష్ణవేణి, అల్లూరి సీతారామరాజు, చక్రవాకం, బలిపీఠం, ముత్యాలముగ్గు, భక్తకన్నప్ప, మహాకవి క్షేత్రయ్య, చక్రధారి, దాన వీర శూర కర్ణ, కరుణామయుడు వంటి విజయవంతమైన చిత్రాలకు నేపథ్య గాయకునిగా రామకృష్ణ గళం ప్రాణప్రతిష్ఠ చేసింది.

తాతామనవడు చిత్రంలోని 'అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం', భక్త తుకారాంలోని 'పాండురంగ నామం పరమ పుణ్యధామం', ముత్యాల ముగ్గులోని 'ఏదో ఏదో అన్నది ఈ మసక వెలుతురు', భక్త కన్నప్పలోని 'శివశివ శంకర', 'అమరదీపం' చిత్రంలోని 'నా జీవన సంధ్యా సమయంలో' వంటి పాటలు వైవిధ్యభరితమైన రామకృష్ణ గళ మాధుర్యానికి అశేష ప్రాచుర్యానికి కొన్ని 'మెచ్చు'తునకలు వంటివి. రామకృష్ణ – అనంతరం టి.వి.సీరియల్స్ వైపు మొగ్గి నటించాడు. కొడుకు సాయికిరణ్ 'నువ్వే కావాలి' చిత్రంలో నటించి పేరు తెచ్చుకున్నందుకు పొంగిపోయారు. రామకృష్ణ పిల్లలు ఇద్దరూ లేఖ, సాయికిరణ్ మంచి పిల్లలుగా రాణిస్తూనే ఉన్నారు. ఒక విధంగా పోటీ ప్రపంచంలో రామకృష్ణ అలసిపోయాడు కూడాను.

ఆగస్టు 20, 1947 లో విస్సంరాజు రంగసాయి, రత్నం దంపతులకు జన్మించిన రామకృష్ణ చివర్లో క్యాన్సర్‌తో ఓ పది నెలలు పోరాడి 2015, జూలై 16 తెల్లవారు ఝామున 67 ఏండ్లు నిండుతున్నప్పుడు శాశ్వతంగా కన్నుమూశాడు. తను పాడిన పాటలు శాశ్వతాలు. కాలేజీరోజుల్లో తను నాకు సీనియర్‌గాను, తనతో ఒక పాటకు గొంతు కలిపానన్న మధురస్మృతికి గాను చిరస్మరణీయుడు నాకు విస్సంరాజు రామకృష్ణ. ❋

**(మనజ్యోతి ప్రత్యేకసంచిక' 2019)**

# (74) తెలుగు బొమ్మ తెల్లబోయింది!

**చి**త్తరువు గోడను చేరింది.

గోడ చిత్తరువును దరి చేర్చుకుంది.

ఎటొచ్చీ మనకే ఇప్పుడు గోడా లేదు, చిత్తరువూ లేదు.

ఆరుబయట పడ్డాం! వ్యంగ్య చిత్రం, రేఖాచిత్రం, కథాచిత్రం, వర్ణచిత్రం, చలనచిత్రం, తెలుగు జీవన చిత్రం – 'ఆరూ' ఇప్పుడు 'ఇల్లు' లేనివయ్యాయి. నిజమే! 'నది నావను దోచుకుపోయింది. ఏరు బావురుమంటోంది' విధి 'బాపు'ను తీసుకుపోయింది. వీధి పాలైన 'తెలుగుతనం' బావురుమంటోంది.

బాపు అనే రెండక్షరాలు–

తెలుగు చిత్రకళా జగతిలో, చలనచిత్ర ప్రపంచంలో మాసిపోని వన్నె వాసిగల సువర్ణాక్షరాలు... స్నేహపరిమళాలతో భాసించే రమణీయాక్షరాలు, స్త్రీల అందానికి 'బాపుబొమ్మ' ఒక కొలమానం అయింది. గుండ్రటి తెలుగు లిపికి వంపుసొంపుల వయ్యారాలద్ది, 'బాపుఫాంట్' అందమైన అక్షరమయ్యింది. వ్యంగ్యంగా గీతలు గీసి బాపు నవ్వించాడు. రేఖలను – కవులు, రచయితల భావాలను పొందికగా ప్రతిఫలించే అద్భుత దృశ్య రచనలుగా చేశాడు. ఆ దృశ్యరచనా సామర్థ్యంతోనే, తన 'కెమెరాకన్నుతో' దర్శకుడై, చలనచిత్రాలను ప్రేక్షక హృదయాలలో నిలిపాడు. 'బాపుబొమ్మ' అనే ఉపమానం లేకపోతే– తెలుగు అమ్మాయిలు ఎప్పుడో పూర్తిగా పరాయీకరణమై పోయేవారేమో! అమ్మాయిల సంగతేకాదు, అసలు తెలుగుతనానికి బాపుకట్టిన 'ఫ్రేమ్'ల వల్లనే, 'అందం' ఇనుమడించింది. "మడిసన్నాక కాసింత కళాపోషణ ఉండాలని", "ఆకాశంలో మర్డరు జరిగినట్టు, సూర్యుడు నెత్తుటిగడ్డలా ఉన్నట్టు" దుర్మార్గపు విలనీలో కూడా, సౌందర్య 'దిదృక్ష' వెలార్చిన వైవిధ్యం ఆయనది. 'చాక్ పౌడర్'తో గంగావతరణాన్ని విదేశీయులు సైతం విభ్రమంచెందేలా సెల్యులాయిడ్ పాఠాలు చెప్పిన గురువాతడు. చిన్నపిల్లలకు తెలుగుపాఠాలు ఆకర్షణీయమైన ఆడియో, వీడియోలుగా అందించి, భాషపై మమకారాన్ని పెంచినవాడు. బాపుకు సాటి ఎవడు?

దేవుడిని ఎవరూ చూడలేదు. కానీ రాముడూ, కృష్ణుడే కాదు, ఓ లక్ష్మీ, సరస్వతే కాదు, ముక్కోటి దేవతలనూ ఇలానే ఉంటారని విశ్వసించి, పూజామందిరాల్లో ప్రతిష్ఠించుకుని, గుండె గుడిలో నిలుపుకుని పూజించేలా, అందరికీ ఆ దేవతామూర్తుల రూపాలను తన గీతల్లో మలచి సాక్షాత్కరింపచేసింది 'బాపు'. తనకన్నా అందమైన రూపం లేదనే – మనిషి దేవుడిని కూడా తనలా గీసుకున్నాడని బాపు బొమ్మ చూశాకే తెలిసివచ్చింది!

'తక్కువేమి మనకు.. బాపు ఒక్కడుండు వరకూ' అని ముళ్ళపూడి వెంకటరమణ పోయాక, తెలుగు పాఠకుడు, ప్రేక్షకుడూ అనుకున్నా, 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అని నిరూపించిన బాపురమణ ద్వయం– 'ఒకరు భువిలో–మరొకరు..దివిలో' అన్న ఎడబాటును భరించలేకనే కాబోలు, తమ మధ్య ఉన్న వయస్సు వ్యవధానం లోపుగానే మళ్ళీ ఏకమయ్యారు. బాపు మరణంలో రమణమయ్యాడు. రమణ మరణంతో గోడలేని చిత్తరువునయ్యానని వగచిన బాపు, సహచరుడు పోయిన ఏడాదికే జీవిత భాగస్వామి సహచరి 'భాగ్యవతి' కూడా మరణించడంతో, 'అభాగ్యోపజీవి'గా ఉండలేకనే – గుండెకుంచె మూసి వెళ్లిపోయాడు.

తెలుగు పత్రికలకు తన కార్టూన్లతో, బొమ్మలతో, ఎన్నెన్నో పుస్తకాలకు తన అక్షరాలతో, రంగుల ముఖ చిత్రాలతో, సినిమాలకు తన దర్శకత్వంతో – ప్రాణప్రతిష్ఠ చేసి, వాటి ఉనికికీ, మనిషికీ ఆధారమైనవాడు బాపు. వృత్తిలో, జీవనప్రవృత్తిలో బాపు నిగర్వి. ఆర్భాటాలు, గుర్తింపుల ఆరాటాలు అంటూ ఏనాడూ వెంపర్లాడినవాడు కాదు. 'నిను వినా నాకెవ్వరూ..' అని 'ఇహం'లో రమణనూ, అహరహం అంతరంగ'పరం'లో రాముడినీ నమ్ముకుని జీవించినవాడు బాపు.

రమణ రాత, బాపు గీత అవిభాజ్యాలు. తన కలంతో రమణ సృజించిన బుడుగు, రాధాగోపాళం, సీగానపెసూనాంబ, అప్పుల అప్పారావు, పక్కింటి పిన్నిగారి మొగుడు వంటి పాత్రలకు, 'బాపు' తన కుంచెతో ప్రాణం పోసి, తెలుగువారి జనజీవన స్రవంతిలో మరపురాని మనుషులుగా చేసేశాడు. గిరీశాన్ని గురజాడ సృష్టించినా, బాపు – రమణలు కలసి వ్యవస్థలోని గిరీశం సంస్కృతిని విస్తరించి చూపించారు. మధ్యతరగతి మందహాసాలకు ఆవాసాలు, వాసాలు నిలిపారు. తెలుగు పాఠకులకు

పఠనీయ 'జ్యోతి'ని వెలిగించిందీ, పెట్టుబడికి కట్టుకథకి పుట్టిన విషపుత్రికలనుకున్న పత్రికలనయినా 'అమృతతుల్యంగా' మార్చిందీ వారే!

బాపు బొమ్మ ఒకనిధి. తెలుగుల పెన్నిధి.

'బాల'లో కవ్వం చిలికే బొమ్మతో ప్రారంభించి, జీవనామృతసారమైన బ్రతుకులో రామాయణాన్ని 'శ్రీరామరాజ్యం' చలనచిత్ర దర్శకత్వం వరకూ మథించి, కార్టూనిస్టుగా, చిత్రకారునిగా, క్యారికేచరిస్టుగా, చలనచిత్ర దర్శకునిగా, 'బాపు' తెలుగువారి గుండెల్లో చెరగని చిరునామా అయ్యాడు. గీసిన గీతలో, తీసిన తీతలో తెలుగుతనానికి సంపూర్ణత్వం సిద్ధింపచేసిన స్రష్ట అనిపించుకున్నాడు. తెలుగుతనానికి ఇన్నాళ్ళూ ఓ కాపుకాసినవాడు బాపు. బంగారు పళ్ళేనికయినా గోడచేరుపు అవసరం అన్నట్లు బ్రతుక్కి హాస్యం అవసరం అని ఆ పరమౌషధాన్ని పంచిపెట్టినవాడు బాపు. రామాయణం అంటే రాముడు నడిచిన దారి. ఎన్నికష్టనష్టాలు, నిందలు ఎదురయినా ధర్మబద్ధమైన జీవనం గడపాలనీ, పురుషోత్తమునిగా రాముడే బ్రతుకుకి ఆదర్శం అనీ నమ్మినవాడు బాపు. పౌరాణికాలుగానే కాదు సాంఘికంగానూ రామాయణాన్నే 'ముత్యాలముగ్గు'గా తెలుగువారి బ్రతుకు వాకిట వేసినది బాపూయే! 'స్నేహం' గొప్పదనాన్నీ, దాంపత్యధర్మపు 'పెళ్ళిపుస్తకం'నీ అందించింది బాపు దర్శకత్వమే.

ఆయన అసలు పేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ. కానీ దేశ స్వాతంత్ర్యం అనగానే మహాత్ముడు 'బాపు'జీ గుర్తొచ్చినట్లు, తెలుగుతనం అనగానే మన ఆప్తుడు 'బాపు'యే గుర్తొస్తాడు. 1933 డిసెంబర్ 15న పుట్టి-2014 ఆగస్టు 31న అస్తమించిన 'బాపు' - జీవించింది ఎనభైఏళ్ళయినా, చిత్రకళా జగత్తులో 'బాపుశకం' అనదగ్గ కాలాన్ని అజరామరం చేసిన చిరంజీవి. గోదావరిమీద సర్ ఆర్థర్‌కాటన్ బ్రిడ్జి కడితే, గోదావరి అందాలతో ప్రేక్షక హృదయాలకు వంతెన వేసిన బుద్ధిమంతుడైన అందాలరాముడు - తనను తాను 'రాంబంటు'గా అభివర్ణించుకునే బాపు.

బాపు గీసిన కార్టూన్లు, రేఖాచిత్రాలు, వర్ణచిత్రాలు యాభైవేలకు పై చిలుకే ఉన్నాయి. యాభైఒక్క చలన చిత్రాలు తన దర్శకత్వపు ప్రతిభతో నిర్మించబడి ఉన్నాయి. బ్రతికిఉండగా పొందిన అవార్డులు రివార్డులు ఎన్నివున్నా 'పద్మశ్రీ' యుతుడే అయినా, 'బాపు'నీ, తెలుగువారికి బాపురమణల ద్వయం అందించిన కళాత్మక నిధులనీ,

పెన్నిధులనీ గుర్తించి వారి సేవలను అందుకున్నందుకు వారిని చిరస్మరణీయం చేస్తూ ఆంధ్రభూమిపై గోదావరి తీరాన వారి విగ్రహాలను, ఆంధ్ర రాజధానిలో ప్రపంచస్థాయి కళాత్మక ఆడిటోరియంను వారి పేరునా నెలకొల్పుతామని నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించడం సంతోషదాయకం.

అశేషమైన తెలుగువారి గుండెల్లో ఇప్పటికే సుప్రతిష్ఠితమైన స్నేహమూర్తులు బాపురమణలు. తెలుగు అక్షరానికీ, తెలుగు బొమ్మకీ ప్రాణప్రతిష్ఠ చేసిన బాపు భౌతికంగాఅస్తమించారేమోగానీ, తన మరణంతో కనులు గోదావరులైన లక్షలాది తెలుగువారి గుండె కొండల్లోంచి నిత్యసూర్యోదయంగా వర్ణచిత్ర శోభితమై ఉదయిస్తూనే ఉంటారు. తెలుగు వెలుగున్నంత వరకూ బాపు రామనామంలా చిరస్మరణీయమే!

'ఆస్థ' అంటే శ్రద్ధ, ఆదరము, మన్నన, ఆలంబనము, ఆపేక్ష అని అర్థం. బాపు తెలుగువారికి 'ఆస్థ'. అందువల్ల బాపు అస్తమించలేదు. ఆస్థమించాడు. అస్తమించిన బాపు అనద్దు. సభక్తికంగా 'ఆస్థమించిన బాపు' అందాం. అదే మన నివాళి. ✻

**(ఆంధ్రభూమి వారపత్రిక 25 సెప్టెంబర్' 2014)**

# 75 బాపు.. ఓ ఉత్తరం!

**స**త్తిరాజు లక్ష్మీనారాయణ అంటే చాలా మందికి తెలియకపోవచ్చు. 'బాపు' అంటే టక్కున గుర్తుపట్టేస్తారు. అదేంటో! అసలు..'పేరు' వచ్చిన చాలామందికి, 'అసలు పేరు' మరుగున పడిన సందర్భాలు ఇలానే ఉంటుంటాయ్!

'బాపు' అంటే ఓ కార్టూనిస్టు, ఓ చిత్రకారుడు, ఓ సినిమా దర్శకుడు, వీటన్నింటికీ ముందు – 'గొప్ప' అనే విశేషణం చేర్చాలి! ఎందుకంటే తనేం చిన్నాచితకా పనులు చేయలేదు. తెలుగుకే వెలుగు తెచ్చాడు. తెలుగు 'వర్ణమాల'ను తన చేతిరాతతో సుస్థిరం చేసి 'లిపి'కారుడయ్యాడు. బాపు గురించి కొత్తగా చెప్పేదేముంది? అంటే – ఆయన ఎప్పటికీ తన బొమ్మల ద్వారా, సినిమాల ద్వారా 'కొత్త'గానే కనిపిస్తాడు మరి! ఆయనలో బోలెడు 'ఏంగిల్స్' ఉన్నాయి; ప్రతిభ విషయానికి వస్తే. మార్క్స్ – ఏంగెల్స్ నచ్చే కొందరికి, ఆయన నచ్చకపోవచ్చు. కానీ బాపు – శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కవితలకు బొమ్మలు వేశాడు. రావిశాస్త్రి కథలకూ బొమ్మలు వేశాడు. దిగంబర కవుల సంపుటికీ ముఖచిత్రం గీశాడు. ఆయనకు రాముడు అంటే ఇష్టం! రామాయణం అంటే ఇష్టం! ఆ రామాయణం కథలనే 'సోషలైజ్' చేసి, సినిమాలు తీశాడు అని 'క్రిటికే' వారూ ఉన్నారు. 'రామాయణ విషవృక్షం' అని రంగనాయకమ్మగారు రాసి, ఆ పుస్తకానికి ముఖచిత్రం వేయమని – డబ్బిస్తూ, ముందుగా చెక్కు పంపించినా, దాని వెనుక 'శ్రీరామ.. శ్రీరామ..' అంటూ రాసి, వెనక్కు పంపేసి, బొమ్మ వేయలేదు బాపు. 'నిధి చాల సుఖమా! రాముని సన్నిధి చాలా సుఖమా' అని పాడుకుంటే రాముని సన్నిధినే ఆంజనేయుడిలాగానే, ఉండాలని కోరుకుంటాడాయన. తన కార్టూన్ల పుస్తకం మీద తనను తాను 'కోతి'లా చిత్రించుకోగలగడం అందుకే ఆయనకే చెల్లింది!

బాపు వ్యక్తిత్వంలోని కోణాలు ముళ్లపూడి వెంకటరమణ అనే వెంకట్రావుకే బాగా తెలుసు. వాళ్లిద్దరినీ 'స్నేహం' అనేదానికి 'ఐకాన్'గా చేసుకున్నారు తెలుగువారు. 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అని నమ్మి, అయినా 'స్నేహం' అనే సినిమా తీశారు వాళ్లు. బాపు డిసెంబర్ 15, 1933 లో పుట్టారు. మూడువందల అరవై

అయిదు రోజుల సంవత్సరంలో ఇంకో పదహారు రోజులు మాత్రమే ఉండగా పుట్టారు కనకేమో, బాగా 'మితభాషి' అయ్యారు. ముళ్లపూడి జూన్ 28, 1931 లో పుట్టారు కనుక మాటలు రాయడం, మాట్లాడడం అంతా తానే! అయితే ఆయనా 'అధిక ప్రసంగి' ఎప్పుడూ కాలేదు. వారి జమలిక వాడని ధవళమల్లిక!

బాపు–లాయర్ చదువులు చదివారు గానీ, ఆ వృత్తి చేపట్టలేదు, మాట్లాడితే సూటిగా, సుత్తి లేకుండా మాటాడతారు మరి! 'సాక్షి' సినిమాను మైసూరు డిస్ట్రిబ్యూటర్లకు అమ్మే సందర్భంలో ఓ ఉదంతం జరిగిందట! భక్తవత్సల, సురేంద్ర, ఆ డిస్ట్రిబ్యూటర్లు. 'బెంగళూరు వస్తే ఎగ్రిమెంట్ చేసి చెక్కిస్తాం' అన్నారు. వీళ్లు బెంగళూరులో శారదా మూవీస్‌కు బాపు సొంతకారులో వెళ్లారు. ఉడ్‌లాండ్స్‌లో దిగి ఫోన్ చేసి వెళ్లారు. సురేంద్రగారు ఎగ్రిమెంట్లు రెడీ చేశారు. రిలీజ్ నాటి నుండి అయిదేళ్లు శారదా మూవీస్ బెంగుళూరుకు లీజుకిస్తున్నట్టు. ఆ తర్వాత వారు ప్రింట్లు వాపసు ఇచ్చేట్టుగా ఒప్పందం. లీగల్ పార్ట్‌నర్స్ సంతకాలు పెట్టారు. ఇక భక్తవత్సలంగారు ఎగ్రిమెంటు మీద సంతకం పెడుతూంటే – అంతవరకు తలవంచుకు కూర్చున్న బాపు 'సార్! వన్ మినిట్' అన్నాడు. ఆయన సంతకం ఆపి చూశారు. 'మా పిక్చరు కొనే ముందు ఇంకోసారి ఆలోచించండి' అన్నాట్ట బాపు. భక్తగారు ఆశ్చర్యంగా, మిగతా పార్ట్‌నర్స్ అయోమయంగా చూశారు. 'ఈ పిక్చర్ రాసింది రమణగారు. తీసింది నేను. ఆయన పని ఆయన బాగానే చేశాడు గానీ, డైరెక్టర్‌గా నాకు తృప్తిగా లేదు. టెక్నికల్‌గా కొన్ని లోపాలున్నాయి. దిద్దడానికి టైము లేదు, డబ్బూలేదు. మీకు వార్నింగివ్వడం నా కనీస ధర్మం. ఆపైన మీ ఇష్టం" అన్నాడు బాపు. 'ఐమీన్ వాటై సెడ్' అంటూ లేచి గది బయటకు వెళ్లిపోయాడు. తలుపు తీస్తూ ఆగి 'అయామ్ నాటె ఫూల్. బట్ చెప్పడం నా ధర్మం తరువాత మీ ఇష్టం' అని తలుపు లాగేశాడు. కానీ భక్తవత్సలం సంతకం పెట్టేశారు రమణను ఖంగారుపడద్దు అని.

'బాయ్! ది హైట్ ఆఫ్ హానెస్టీ అండ్ హ్యూమన్ – అండ్ అర్రగెన్స్ ఆల్ ఎట్‌ది సేమ్‌టైమ్' అన్నారు భక్తవత్సలం. అదీ బాపు! బాపు బీకాం, బీఎల్ గానీ – ఆ రూటు వదిలేశారు. బిజినెస్ ధ్యాసలేదు. అంతా ముళ్ళపూడి చూసుకోవాల్సిందే! అందుకే ముళ్లపూడి పోయాక – 'నన్ను గోడలేని చిత్తరువును చేసిన వెంకట్రావు' అని స్నేహితుడి

గురించి వాపోయాడు. బాపు గురించి 'కోతికొమ్మచ్చి'లో ముళ్లపూడి బోలెడు విషయాలు రాశారు. అవిభక్తకవలల కథనం వంటిదది.

బాపు బొమ్మలు వేయడమే కాదు. మాటలు.. అంటే ఎక్కువ సన్నిహితుల మధ్యేగానీ, ఎందుకో ఎన్నో సందర్భాల్లో 'ఉత్తర రచన' చేశాడు బాపు. బాపు రాసిన ఉత్తరాలు ఫ్రేం కట్టించుకుని దాచుకున్న వాళ్లున్నారు. ఆయన అందమైన అక్షరాలే కాదు, ఆయన 'ఆత్మీయతా' అంత అందమైనది. అది ఉత్తరాల్లో తొణికిసలాడేది. రచన శాయి, బాపు గారు ఎందరికో రాసిన ఉత్తరాలను వారివారి సౌజన్యంతో సంపాదించి, నెలనెలా భాగాలుగా ప్రచురించి, బాపు ఉత్కృష్ట రచనను – తొమ్మిది రచన సంచికల 'నవ రత్నమాలిక'గా కూడా సంతరించారు! పదమూడు వందల ఎనభై ఎనిమిది పుటలలో బాపు అభిమానులకు, ఆత్మీయులకు రాసిన నవరసభరితమైన ఉత్తరాలు, మునుపెక్కడా కనిపించని బాపురేఖాచిత్రాలు, వర్ణచిత్రాలు, అలాగే బాపు గూర్చిన స్మరణీయ కబుర్లు 550 రూపాయల ఆ 'నవరత్న మాలిక'లో కూర్చారు. అదో అపురూప నిధి.

బాపుగారి ఉత్తరాల్లో ఆయన హాస్య ప్రియత్వం, అభిమానం, నిరాడంబరత, నిక్కచ్చితనం అన్నీ ద్యోతకమవుతాయి. ఆయన ఎంత స్నేహశీలో అర్థమవుతుంది. అంతెందుకు? ఒక్క బి.వి.ఎస్.రామారావు అనే 'సీతారావుడు'కు ఆయన రాసిన ఉత్తరాలు చూడాలి! సినిమా కబుర్లూ, కాకరకాయలూ అందులో బోలెడు. అలాగే చనువులూ, సెటైర్లూ కూడాను. ఓ ఉత్తరం చివర్లో ఇలా ఉంటుంది–

'– వెంకట్రావు పెళ్లి బహుశా జనవరి 26 ప్రాంతాల్లో ఉండచ్చు. ఇంకా తేలలేదు. మరి మా జ్యోతి యాన్యువల్ ఫంక్షన్ కూడా ఆ ప్రాంతాల్లోనే ఉంటుంది. తవఁరు తప్పక దయచేయాలి మరి. మళ్లీ మినిష్టరొస్తున్నాడూ, వాడొస్తున్నాడూ, వీడొస్తున్నాడూ, రాలీ, ఫిలిప్సూ అంటే కుదర్దు మరి. గాన గ్రహించ ప్రార్థన.

చి.సత్యకళకి జోళ్లు కొన్నావా?
ఎస్పీగారి పెరట్లో దాక్కున్న ఆవు ఈనిందా
పాము కుబుసం విడిచిందా?
నీ కెమెరా కులాసాగా ఉందా?
అదీ విషయము

బాపు 4.1.64

నీ న్యూఇయర్ గ్రీటింగ్స్ శుభలేఖ అందింది. ఎవడక్కడ నీకు సెలక్ట్ చేసింది. దొమ్మరి రాస్కెల్.

ఇలా సాగుతూంటాయి కొన్ని బాపు ఉత్తరాలు.

–ఎంతటి వారి ముందయినా 'వినమ్రం' కాగలగడం బాపుగారి ప్రత్యేకత. తన బొమ్మల గొప్పదనాన్ని తానెప్పుడూ చెప్పుకోరు. 'బొమ్మ బాగా కుదిరింది' అనుకునేవారు గానీ, 'బాగా వేశాను' అని ఎప్పుడూ అనుకునేవారు కాదు. ఎవరైనా తమ పుస్తకానికి బొమ్మవేసి పెట్టమని అడిగినప్పుడు ఆ రచన కూలంకషంగా చదివి, ఆ రచన ఆత్మను పట్టుకుని, అలవోకగా చిత్రరచన చేయడం బాపుగారి అలవాటుగా ఉండేది. అయినా కొన్ని సందర్భాలలో అడిగిన వారికి అసంతృప్తి కలిగితే అలాంటి సందర్భాలలో ఓపిగ్గా ఒకటికి రెండుసార్లు మరో బొమ్మ ప్రయత్నించడం, వారిని సంతృప్తి పరచడం బాపుగారికే చెల్లింది. అంతేకాదు! కొన్ని రచనలకు బొమ్మలు వేయడం తన అదృష్టం అనుకునేవారు ఆయన.

"బ్నిం గారు – 'మిసెస్ అండర్‌స్టాండింగ్' అని 88 లో రాసిన కొన్ని దాంపత్య రహస్యాలు పుస్తకంగా వేస్తున్నారు. చాలా చాలా బావున్నాయి. తయారవగానే చూద్దురుగాని. ఎందుకు రాస్తున్నానంటే దానికి బొమ్మలు వేసే అదృష్టం నాకు లభించింది కనుక" అని మరొకరికి రాసే లేఖల్లో పేర్కొనగల సౌశీల్యం ఆయనిది.

గత 2011లో (NATS) సంబరాలకు అతిథులుగా బాపు రమణలకు ఆహ్వానం అందింది. కానీ ఫిబ్రవరిలోనే ముళ్లపూడి అస్తమించారు. 18.6.11 న శ్రీ మధుగారికి, శిరీషగారికి అమెరికాకు లేఖ రాస్తూ బాపుగారు అందులో ఇలా రాశారు–

'బాపు రమణ వస్తున్నారని మీరంతా ఎంత ఎదురుచూస్తున్నారో తెలుసుకుంటూనే ఉన్నాం.

రమణగారు ఆ పండక్కి ఏమి రాసి తీసికెళ్లాలా అని ఆలోచిస్తూ ఉండేవారు. మీలాంటి మంచి మిత్రుల మధ్య కొంత సమయం గడపవచ్చని ఎంతో ముచ్చటపడ్డాం.

కానీ రాముడి ఆదేశం మరోలా ఉంది.

గోడలేని చిత్తరువులా నన్ను మిగిల్చేశాడు. నిజానికి నేను సున్నాలాటి వాడిని. రమణగారు ఒకటిగానీ, తొమ్మిదంకెలాగా గానీ నా పక్కన ఉంటేనే నాకు విలువ.

అలాంటిది నేనొక్కడినే రాగలనా!

మార్కండేయుణ్ణి రక్షిస్తూ శివుడు యముణ్ణి ఎడంకాలితో తన్ని తరిమేశాడట. నీ సగభాగం నేను కదా - అదీ ఎడం వైపు - అందువల్ల ఆ క్రెడిట్ నాదే అని అమ్మవారు పేచీ పెట్టిందట. అమ్మవారితో పోల్చుకుంటున్నందుకు క్షమించండి గానీ అలాగే నేను మాత్రం వద్దామనే సాహసించాను.

డాక్టర్ రాముడు వద్దన్నాడు.

అనారోగ్యకారణం అని అందామనుకున్నా గానీ అపశబ్దం సహించని రమణగారు పైనించి కోప్పడతారని ఆరోగ్యకారణం – తెలుగులో 'హెల్త్ రీజన్స్' వల్ల రాలేకపోతున్నానని మనవి చేసుకుంటున్నాను.

రమణగారు అప్పగించిన 'శ్రీరామ రాజ్యం' పూర్తి చేస్తున్నాను. ప్రతి మాటలోనూ ప్రతి షాటులోనూ మేమిద్దరం చర్చించుకున్న జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆయన ప్రేరణతోనే పనిచేస్తున్నా ఇది ఒంటిచక్రం నడక.

స్నేహం అంటే అవతలివాడి అవలక్షణాలను భరించడం అనేవారు రమణగారు. అలాగే నా ప్రయత్నం భరించాలని ఆశిస్తున్నాను.

అక్కడి నుంచి రమణగారూ ఇక్కడ నించి నేనూ మీకు శుభాకాంక్షలు అందిస్తూ ఉంటాము. మేము ఎల్లప్పుడూ మీ మంచి హృదయాలలో ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాము. మీరు సత్సంకల్పంతో నిర్వహిస్తున్న NATS సభలు దిగ్విజయంగా జరగాలని మనసా కోరుకుంటున్నా.

నేను లేనప్పుడు ఎవరైనా సంతకాలు అడిగితే Authorised Forgery అని రాసి నా సంతకం కూడా పెట్టే రమణగారిని గుర్తుచేసుకుంటూ–

18.6.11 –మీ బాపు రమణ

అలా ఇద్దరొకటిగా బ్రతికిన ఇలలోని స్నేహానికి, ఈ తరానికి ఆదర్శంగా నిలిచినవారు బాపు రమణ. ఎవరిని తలుచుకున్నా అనివార్యంగా మరొకరిని స్మరించక తప్పదు. దానిని అర్ధనారీశ్వరత్వంగా 'శివం'గా సంభావించవచ్చును.

ఈ బాపు, రమణలకు ఇప్పటికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేసారని వాపోతున్న తరమూ తయారైపోతోంది! బాపు కన్నా గొప్ప చిత్రకారులు ఉండచ్చు. రావచ్చు. కానీ బాపుగారిలా నిలిచిపోగల చిత్రకారులు బాపుగారే! ఆయన నిజమైన 'గీతా'కారుడు.

తెలుగు అక్షరం, తెలుగు హాస్యం, తెలుగు బొమ్మ, తెలుగు సినిమా, తెలుగు స్నేహం బాపువల్ల వెలుగు వెలిగింది. ముళ్లపూడి వెళ్లిపోయాక గోడలేని చిత్తరువు నయ్యాడన్నాడు గానీ బాపు, బాపు వెళ్లిపోయాక ఇంక ఆ గోడా లేదు. ఆ చిత్తరువూ లేదు. కలాలు కుంచెలు కంప్యూటర్‌మౌస్ జీర్ణించుకున్న వర్తమానంలో బాపు శకం ముగిసింది గానీ, ఆయన ఇచ్చిన నిధులు, స్మృతిశకలాలు శాశ్వతాలు. వారసులకు జేజేలు! బాపుకు జేజేలు! ❋

**(ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం 11.12.2016)**

# (76) విద్వత్ సంపాదక 'ఆంధ్రీ'మయ మూర్తి

అక్షరామృత ఛందస్సుందరమైన 'ఆంధ్ర పురాణ' కర్తగా, మాధుర్యధురీణ కావ్యకవితా నిత్యోత్సవ శ్రీ కళాధాములు నూర్గురి అమృతగాథా జ్యోతులనీనే 'ఆంధ్ర రచయితలు' గ్రంథ రచయితగా, ఆంధ్ర సాహితీ సామ్రాజ్య కవిత్వ 'మధుకోశము'గా కీర్తిగాంచిన మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు విద్వత్సంపాదక 'ఆంధ్రీ'మయమూర్తి. ఒక కవి, పండితుడు, ఒక సారస్వత పత్రిక సంపాదకునిగా రాణ్మహేంద్రవరము రాకముందే గ్రామం పల్లిపాలెంలో ఆయన రాణకెక్కారు.

తెలుగు సాహిత్యచరిత్ర వైభవప్రాభవాలకు కేవలం మహనీయవ్యక్తులే కాదు, స్థల, కాలాదులు కూడా వారి ఉనికిపట్టులుగా సంస్మరణీయాలే, సంస్తవనీయాలే! అలా మధునాపంతులువారు ఆంధ్రపురాణం రచించిన పల్లిపాలెము– 'ఆంధ్రి' సారస్వత మాసపత్రిక ఆవిర్భావ కార్యస్థలిగా కూడా భాసించింది. నిజానికి గ్రామాలలో విద్యావ్యాప్తి కలిగించాలనే సంకల్పంతోనే, తమ గ్రామంలో, చుట్టుపట్లనున్న పల్లెటూళ్ళలో–ఆంధ్ర భాషావ్యాప్తికి పాఠశాల నెలకొల్పి బాలబాలికలకు సంస్కృతాంధ్రాలు బోధించడానికీ, అనుబంధంగా ఒక గ్రంథాలయం స్థాపించి గ్రంథాలనూ, వార్తాపత్రికలనూ ఉచితంగా పఠించే అవకాశం, ప్రోత్సాహం కల్పించడంకోసమూ బహుధాన్య సంవత్సరంలో 1938 లో అప్పటి కాకినాడ తాలూకా పల్లిపాలెం గ్రామంలో మధునాపంతులవారు 'ఆంధ్ర కుటీరం' స్థాపించడం ఒక ఉజ్జ్వల వైభవ ఘట్టం.

విద్యాబోధన, గ్రంథాలయం, విద్యార్థులకు, గ్రామస్తులకు వివిధ విషయములు బోధపడుటకు సభలు జరిపి, ఉపన్యాసములిప్పించడం, నీతి, మత, సాంఘికాచారాదులను గురించి కథలు, కావ్యములను ప్రచురించి భాషాజ్ఞానాభివృద్ధికి సహాయపడటం, క్రమంగా ఒక చిన్న పత్రిక నెలకొల్పి తద్వారా కూడా విద్యాప్రచారం చేయాలన్న మహోద్దేశ్యములతో 'ఆంధ్ర కుటీరం' స్థాపించబడింది. సంకల్పించిన విధంగానే కొందరు వదాన్యుల సహకారంతో పాఠశాల, గ్రంథాలయం ఏర్పడి

అభివృద్ధి చెందసాగాయి. పాఠశాలలో ప్రతిదినం ఉదయం 'ఆంధ్రీప్రార్థన'తో ప్రారంభించి, సాయంకాలం ప్రార్థన, మంగళ గీతాదులతో ముగించే సంప్రదాయం, అలాగే పెద్దతరగతి విద్యార్థులు చిన్నతరగతుల వారికి పాఠాలు చెప్పడం అనే పద్ధతి పరికల్పనం చేశారు. వ్యాసరచన, ఉపన్యాస శిక్షణ, పత్రికాపఠనం వంటి అలవాట్లు పిల్లలకు కలిగించారు. నూలు వడకించటం, వృత్తివిద్యలకు పూనుకోవడం అనే గ్రామాభివృద్ధి పనులకు కూడా సంకల్పం చేశారు.

'ఆంధ్ర కుటీరం' ద్వారా మధునాపంతులవారి ఈ ఆశయ తత్పరత, సేవాసరణి నాటి పిఠాపురం సంస్థానంలో విద్వత్కవిగా వుండిన శతావధాని ఓలేటి వేంకటరామశాస్త్రిగారిని ఎంతగానో ఆకట్టుకుంది. వారి జన్మస్థలం 'పల్లిపాలెం' కావడంవలన తమ గ్రామంపట్ల అభిమానంతోనూ, మధునాపంతుల వారిపట్ల వాత్సల్యంతోనూ 'ఆంధ్ర కుటీరం'కు అండగా నిలవడమేకాక 'ఆంధ్రి' పత్రికా ప్రచురణకు ప్రోత్సహించి ఆలంబనమై నిలిచారు.

1939 జనవరి 'ఆంధ్రి' ప్రథమ సంచిక మచ్చునకై ప్రకటింపబడింది. ఆపై 1939 ఏప్రిల్ ప్రమాది నామ సంవత్సరం వైశాఖం నుండి, 'ఆంధ్రి' మాస పత్రికగా మూడు సంవత్సరాలపాటు పత్రికాప్రపంచంలో తనదైన ముద్రతో తెలుగు సారస్వత సేవలో మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి సంపాదకత్వంలో చిరస్మరణీయ చరిత్ర సృష్టించుకుంది. పంతొమ్మిదేళ్ళ వయస్సులో సంపాదకునిగా రాణించిన ఘనత మధునాపంతుల వారిదే. 1938 నాటికే ఆయన 'తోరణం' కావ్య సంపుటి వెలువడింది. 'ఆంధ్రి' పత్రికా సంపాదకత్వం వహించిన మూడు సంవత్సరాలూ, వెలువడిన ముప్పై ఆరు సంచికల కాలంలోనూ ఆయన దానికే అంకితమైపోయిన 'ఆంధ్రీ'మయమూర్తి. 'ఆంధ్రి' నిజముగా అప్పుడు తెలుగునేలకు చేసిన సేవ అమూల్యమైనది. 'ఆంధ్రి' వెలువడిన నాటికి తెలుగువారికి తమదైన రాష్ట్రం లేదు. ఏర్పడగలదన్న ఆశకూడా పొడచూపక గ్రాంథిక, వ్యావహారిక భాషావాదాల నడుమ పెద్ద గుంజాటనలు సాగుతున్న రోజులు అవి. గ్రాంథిక ఆంధ్రము తెలిసి, విశిష్ట ప్రయోజనమునకై వ్యావహారికమును ఆదరించేవారూ, గ్రాంథికం మొగమెరుగక వ్యావహారికం పట్టుకుని ఊగులాడేవారు కవి పండితులలో నాటికే వున్నారు. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, గిడుగు, శ్రీపాద, విశ్వనాథ గ్రాంథికంలో మహోన్నత విశారదులై వ్యావహారికాన్ని ఆదరించినవారే! అలాంటి శక్తిసామర్థ్యాలు లేని వ్యావహారిక రచయితలూ వుండేవారు.

పూర్వాంధ్ర మహాకవుల కావ్యాలతోటీ, భాషతోనూ వున్న సంబంధం తెగిపోకూడదనీ, భాషావైశిష్ట్యం నిలిచి వుండాలనీ 'ఆంధ్రి' మహత్త్వ పటుత్వ సంపదను నిలబెట్టాలనే పట్టుదలతోనే మధునాపంతులవారు పత్రికా నిర్వహణం చేశారు. వారి విద్వత్సంపాదక మూర్తిమత్వాన్ని పునశ్చరణ చేసుకోవడం ఈ శతజయంతి సమాపన సందర్భంలో ఔచితీమంతం.

ఒక సాహిత్య పత్రిక నిర్వహించడం నాటికీ నేటికీ కత్తిమీద సాములాంటిదే! అందునా ఒక స్థిరమైన ఆశయంతో, సంకల్పంతో నిర్వహించడం, పత్రికా సంపాదకుడు స్వయంగా కవీ, రచయిత అయివుండి సాటి రచయితలనూ, కవులనూ నిష్పాక్షికంగా, నిజాయితీగా సమాదరించటం, ప్రసిద్ధులను గౌరవించడం, కొత్తవారిని ప్రోత్సహించడం అలవోక విషయమేమీకాదు. సంపాదకునిగా మధునాపంతులవారు అనుసరించిన బాట ఒక ఒజ్జబంతి వంటిదే! 'ఆంధ్రి' పత్రికా విశేషాలు, విశిష్ఠతలు కొన్నింటిని ఈతరం పాఠకులు అందుకోవాలనే ఈ రచనోద్దేశ్యం.

మధునాపంతులవారు 'ఆంధ్రి' పత్రికలో పల్లిపాలెము గ్రామ చరిత్రను ఓలేటి వేంకటరామశాస్త్రిగారి ద్వారా వెలయించారు. వేంకట రామకృష్ణ కవులుగా పేరొందిన మేనత్త మేనమామల పిల్లల్లో కృష్ణకవిగారు ముందే దివంగతులయ్యారు. ఓలేటి వెంకట రామశాస్త్రిగారు కూడా పిఠాపురం ఆస్థాన కవులుగానే ప్రసిద్ధి కెక్కినవారు. వారే 'ఆంధ్రి'కి సర్వాధ్యక్షులు. పిఠాపురం మహారాజావారి ఆదరణపొందిన వీరు శ్రీ చర్ల నారాయణశాస్త్రి గురువుగా చెప్పుకున్నారు. చెళ్ళపిళ్ళవారు తనను శిష్యుడనడం కూడా నచ్చక ఆ విషయంలో నాడు వాదులాడుకున్న సందర్భాలు కూడా వున్నాయని శ్రీపాద కృష్ణమూర్తిగారు పేర్కొన్నారు.

మధునాపంతుల వారిపట్ల అపార ప్రేమాభిమానాలుగల ఓలేటి వెంకట రామశాస్త్రిగారి – పిఠాపురంలోని శ్రీ విద్వజ్జన మనోరంజని ముద్రాక్షరశాలలోనే 'ఆంధ్రి' పత్రిక ప్రచురణ జరిగేది. 'ఆంధ్రి'కి అభిరక్షక ప్రభువులుగా శ్రీ పిఠాపురం మహారాజావారు, జయపురం మహారాజావారు, పిఠాపురం యువరాజావారు, వేంకటాద్రి అప్పారావుగారు, మంత్రిప్రగడ భుజంగరావుగారు, చెలికాని సీతారామచంద్ర మధునందనరావు గారు పేర్కొనబడేవారు. సహాయ సంపాదకులుగా కొన్ని సంచికలలో విద్వాన్ పాలెపు వేంకటరత్నముగారిని పేర్కొన్నారు.

'ఆంధ్రి'ని తమ రచనలతో అలంకరించిన ప్రముఖులలో జయపురం సంస్థానాధీశులు విక్రమదేవవర్మ గారితో సహా నాటి ప్రముఖ కవి పండితులుగా

పేరొందిన కుప్పా ఆంజనేయశాస్త్రి, కుందూరి ఈశ్వరదత్తు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి, చెఱుకుపల్లి జమదగ్నిశర్మ, జాషువా, కూచినరసింహం పంతులు, చిలుకూరి పాపయ్యశాస్త్రి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, జయంతి రామయ్య, గోనుగుంట పున్నయ్య, నండూరి బంగారయ్య, జమ్మలమడక మాధవరామశర్మ, ఆకొండి రామమూర్తి, కొండూరి వీరరాఘవాచార్యులు, దివాకర్ల వేంకటావధాని, ఓలేటి వెంకటరామశాస్త్రి, ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు, పాలెపు వెంకటరత్నం, పన్యాల వేంకట రంగనాథరావు, ద్విభాష్యం వేంకట రమణయ్య, వసంతరావు వేంకటరావు, నిడదవోలు వేంకటరావు, పులివర్తి శరభాచార్యులు, వేలూరి శిరామశాస్త్రి, తుమ్మల సీతారామమూర్తిచౌదరి, కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రి, ద్విభాష్యం వేంకటరావు, అల్లమరాజు సోమకవి, అల్లంరాజు రంగనాయకులు వంటి వారు ఎందరోవున్నారు. సంపాదకులు అయివుండీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు 'తెలుగుబిడ్డడు' అనే కలంపేరుతో ఆంధ్రాభిమానోద్దీపక కవితలను అద్భుత ఛందస్సుందర పద్యాలుగా రాసేవారు. 'ఆంధ్రాభ్యర్చనము' పేరున తెలుగు మహనీయులపై ప్రత్యేక పద్యాలను 'ఆంధ్రి'లో రాశారు.

అంతేకాదు! 'ఆంధ్ర రచయితలు' గురించిన వ్యాసాలు 'ఆంధ్రి'లోనే రాయడం ప్రారంభించారు. ఈ వ్యాసపరంపరే ఆ తరువాత 'ఆంధ్ర రచయితలు' సంపుటాలుగా విస్తరించి అనేక ముద్రణలు పొందింది. ''ఆంధ్రదేశమున సుప్రసిద్ధులైన యధునాతన రచయితల సంక్షిప్త చరిత్రాంశములకు 'ఆంధ్రి' మాస మాసము నవకాశము కల్పింపనున్నది'' అని పేర్కొంటూ మొదటగా జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారి గురించి ఏప్రిల్ 1939 సంచికలో ఈ వ్యాసపరంపర మొదలయింది. ఆ పరంపరలో వరుసగా విశ్వనాథ, చిలుకూరి నారాయణరావు, పానుగంటి, చిలకమర్తి, వేలూరి శివరామశాస్త్రి, వేదం వెంకటరాయశాస్త్రి, జయంతి రామయ్య పంతులు, వేంకట రామకృష్ణ కవులు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, చిలుకూరి వీరభద్రరావు, వడ్డాది సుబ్బారాయుడు, తిరుపతి వెంకట కవులు గురించి 'ఆంధ్రి'లోనే రాశారు. మరొక విశేషం ఏమిటంటే ఈ ఆంధ్ర రచయితలు శీర్షికనే 'ప్రభుప్రకరణము' అంటూ ప్రత్యేకంగా నాటి సంస్థానాధిపతులుగా వుండి సాహిత్య రచనలుచేసిన ఏలూరు జమీందారు, 'మంజువాణి' అనే పత్రికను సైతం నిర్వహించిన శ్రీ రాజా మంత్రిప్రగడ భుజంగరావుగారి గురించి, జయపురం సంస్థానాధీశులైన మహారాజా

శ్రీ విక్రమదేవవర్మ బహద్దురువారు గురించి, పిఠాపురం మహారాజా శ్రీ రావు వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరువారు గురించి, ఉయ్యూరు మహారాజా వేంకటాద్రి అప్పారావు బహద్దూరువారి గురించి, పిఠాపురం యువరాజాఅయిన రావువేంకటకుమార మహీపతి గంగాధర రామారావు బహద్దూరు వారి గురించి ఇలా వరుసగా వ్యాసపరంపరలు రాసారు. అభిరక్షక ప్రభువులుగా 'ఆంధ్రి' కి పేర్కొనబడినవారే వీరంతా. అలాగే కపిలేశ్వరపురం మహారాజా శ్రీ బులుసు బుచ్చి సర్వారాయుడు జమీందారువారు కూడా 'ఆంధ్రి'ని సమాదరించారు.

యుద్ధదినాలలో కూడా 'ఆంధ్రి' పత్రికను నడిపిన ఘనత మధునాపంతుల వారిది.

'ఆంధ్రి' పత్రికలోని మరొక ప్రత్యేకత ఏమిటంటే–పత్రికలో ప్రచురితమైన రచయితల ప్రతి రచనపైనా ఎక్కడికక్కడే సంపాదకుడి వ్యాఖ్య సంతరించబడటం. నిజంగా ఇదొక సాహసమే! కానీ మధునాపంతుల వారు చేసి చూపారు. ప్రశంసిస్తే రచయితలు పరవశిస్తారు. నిజమే! కానీ ఏమాత్రం లొసుగులు, నెరసులు ఎత్తిచూపినా రచయితలు సహించడం కష్టం. కానీ రచనలోని బాగోగులు తెలిసేదెలా? మధునాపంతులవారు పంతొమ్మిదేళ్ళ ప్రాయపు సంపాదకుడై వుండీ తనకంటే పెద్దలయినా, చిన్నలయినా రచయితల రచనలమీద చేసిన వ్యాఖ్యలు నిజాయితీతోనూ, మృదువుగానూ వుండేవి. ఈ వ్యాఖ్యా పద్ధతిని 'భారతి' వంటి పత్రిక కూడా ఒకప్పుడు చేబూని, సమర్థవంతంగా చేయలేక, రచయితలు కొందరి తిరుగుబాటుతో సంపాదకులైన వారి పదవికే ముప్పుతెచ్చుకొందిట! మధునాపంతులవారికి విజయవంతంగా రచయితల సహకారం లభించడం విశేషం. అయితే తరువాతి చివరి సంచికలలో రచన క్రింద కాక, ఆ సంచికలోని రచనల గురించి ఓ సంపాదకీయ వ్యాఖ్యలతోకూడిన రచనగా శాస్త్రిగారు సంతరించారు.

మహారాజా విక్రమదేవవర్మగారి రచన అయినా, చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి రచన అయినా మధునాపంతులవారు సంపాదకునిగా తన వ్యాఖ్యను వెలువరించడం అదే నిష్ఠతోచేశారు. ఎక్కడా మోమాటపడలేదు. తాము రాసిన దానికి భిన్నంగా సముచితములైన సమాధానాలు పంపినా ప్రచురిస్తామనీ, ఈ విశిష్ట పద్ధతి అభిజనాంగీకృతంకాకపోతే విరమిస్తామని నాల్గవ సంచిక నివేదనములో పేర్కొన్నారు కూడాను.

‘ఆంధ్రి’ ఆగస్టు 1939 సంచికలో ‘పయనపు జెలికాఁడు’ అనే శ్రీ విక్రమదేవవర్మగారి రచనపై మధునాపంతులవారి వ్యాఖ్య ఇలా సాగుతుంది.

“శ్రీశ్రీశ్రీ జయపురాధీశ్వరులు శ్రీ విక్రమదేవవర్మ మహారాజుగారు ఆంధ్రి యెడల దమకుఁగలిగిన యకారణ కారుణికత్వాభిమానాతిశయములచే నీ వ్యాసము నిందుఁ బ్రకటింపఁబంపినందులకు మా ‘ఆంధ్రి’ వారికనేక ధన్యవాదములు సమర్పించుచున్నది. పురాతనాధునాతన పద్ధతులను మేళవించి సలక్షణమైన గ్రాంథిక భాషలో సరస భావభరితముగ సహృదయ హృదయాను రంజకముగా వ్రాయబడిన ఈ వ్యాసరాజమన్నివిధముల నాంధ్రి నుజ్జీవింపఁజేయుచున్నదని చాటుటకు సంశయములేదు. శ్రీ మహారాజుగారి గ్రాంథిక వచనరచనా కౌశలమును సహజ భాషాభిమానము నీ వ్యాసము వేయివిధముల వెల్లడించుచున్నది. ఇట్టి విద్వత్ప్రభువుల యాదరాభిమానములు బడయఁగలిగినప్పుడే కదా సలక్షణాంధ్రికి మరల సంపూర్ణవికాసము సమకూరుట?

శ్రీవారి యాజ్ఞానుసార మీ వ్యాసము సాధ్యమైనంతవఱకు యథామాతృకనుగనే- అర్ధానుస్వారములు శకట రేఫములు మఱికొన్ని భాషాచిహ్నములు మున్నగువానితో- ముద్రించితిమి. పో-కాని; -ఏగు, చక్కగా, చెలరేగు, పులుగు, ఇద్దరము, గుండా-కౌఁగలి, శవసత్కారము, పాషాండా, తిరుగా మున్నగు పదముల యందు లేఖన ప్రమాదవశమునఁ విడువబడిన యర్ధానుస్వార శకటరేఫాదులను సవరించుటకుఁగూడ సాహసించలేనందులకు క్షంతవ్యులము-ఆం॥సం॥.

దీనినిబట్టి ఒక రచయిత పంపిన రచనను యథాతథంగానే ప్రచురించి దానిలోని గుణదోషాలను సంపాదకునిగా మధునాపంతులవారు వ్యాఖ్యానించేవారని గ్రహించవచ్చు. అలాగే తిరుపతి వేంకటకవులలోని సుప్రసిద్ధ విద్వత్కవి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి ‘కాలదుస్థితి’ అనే రచనను అక్టోబర్ 1939 సంచికలో ప్రచురించి మధునాపంతుల సంపాదకునిగా ఇలా వ్యాఖ్యానించారు-

“చేయి వణఁకుచున్న యత్యంత వార్ధక స్థితియందుండియు “ఆంధ్రి” యందలి అవ్యాజానురాగాతిశయమున నీ పద్యవ్యాసమును వ్రాసి పంపిన శ్రీ శాస్త్రుల గారికి “ఆంధ్రి” యభివాదము లొనర్చుచున్నది. శ్రీ శాస్త్రులుగారు జగమెఱిఁగిన బ్రాహ్మణులు. ‘ఆంధ్రి’ వారి కవిత్వమును గుఱించి యేమి వ్రాయఁగలదు?

ఈ పద్యములయందచటనచటఁ బద్య కవిత్వమున ‘పాదావసానముల యందేకాక పాదమధ్యమున నున్న వాక్యావసానాదుల యందుఁగూడ సంధి

చేయకున్నను దోషంబులే'దని సూచించుటకుఁగాఁబోలు సంధి నియమములు పాటింపఁబడలేదు. ఇది శాస్త్రులవారు కొంతవఱకు భాషాసంస్కార విషయమున నొకయడుగు ముందునకు వైచుఁచున్నట్లు తోఁచుచున్నది. కాని, యీ వ్యాసమునందు హరిజన దేవాలయ ప్రవేశాది సంఘసంస్కారముల విషయమై మాత్రము పూర్తిగా వెనుకంజ వైచినట్లే కనుపట్టుచున్నది. ఇది సంఘసంస్కార పరాయణులైన దేశీయ మహాజనులకెట్లుండునో? శ్రీ శాస్త్రులుగారు 'శాస్త్రంబన్న జంకన్వలెన్' అనుచున్నారు. శబ్దశాస్త్రంబన్ననో? –

– ఆంπసంπ"

ఈ వ్యాఖ్య నిజానికి కొండతో ఢీకొన్న చందమే అయినా, మధునాపంతులవారి సంపాదక ప్రతిభకూ, తిరుగులేని భాషావిషయిక నిశ్చయ భావశబలతకూ తార్కాణం అనక తప్పదు. చెళ్ళపిళ్ళవారి పైనే చెణుకువేయడం విశేషమే మరి!

'ఆంధ్రి' పత్రికలో జైనుల్ అబ్ ఉద్దీన్, అహ్మద్ షరీఫ్, ఉమర్ అలీషా వంటి కవుల రచనలు కూడా ప్రచురించారు మధునాపంతులవారు. అక్టోబర్, 1939 సంచికలో మహమ్మద్ జైనుల్ ఆబెదీన్ 'దేవా' అనే పద్యకవితను ప్రచురించారు. "పద్యములన్నియు సర్వమత సమ్మతములై భగవద్భక్తి బంధురములై భావభరితములై యొప్పుచున్నవి. వ్యాసకర్త మహమ్మదీయ మతస్థుఁడై యుండియు నాంధ్ర కవిత్వమున నిట్టి పరిశ్రమచేయుట 'ఆంధ్రి'కెంతయు నభినందనీయముగాదా? –ఆంπసంπ" అని సంపాదక వ్యాఖ్యతో ప్రశంసించారు.

'ఆంధ్రి'లో వైవిధ్యభరితమైన రచనలు ప్రచురితమయ్యాయి. "భారతీయ శాస్త్రములు–శాస్త్రజ్ఞులు" అనే కామఋషి సత్యనారాయణరావుగారి సైన్స్ రచన (జూలై '39), 'వాఙ్మయము–దేశాభ్యుదయము' అనే శ్రీ జటావల్లభుల పురుషోత్తంగారి రచన (మే '1941), అలాగే 'ఏగు' ధాతువు గురించి శ్రీ విక్రమదేవవర్మగారి వ్యాకరణాంశ రచన (ఫిబ్రవరి '1940) 'కళలు–కావ్యకళ' గూర్చి శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారి రచన (మార్చి '1940) ఇలా పలు విశేష రచనలు కానవస్తాయి.

'ఆంధ్రి'కి సర్వాధ్యక్షులుగా పేర్కొనబడిన పిఠాపురం సంస్థాన కవీశ్వరులు శ్రీ ఓలేటి వేంకటరామశాస్త్రి గారు 1939, డిసెంబర్ మూడవ తేదీన పరమపదించారు. జనవరి, 1940 'ఆంధ్రి' వారి సంస్మరణ ప్రత్యేకసంచికగా మధునాపంతులవారు వెలయించి ప్రముఖుల నివాళి రచనలను అందించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి

నివాళి రచన కూడా 'ఆంధ్రి'లో కానవస్తుంది. ఆంధ్ర భాషాభివర్థినీ సంఘం–మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో తాపీ ధర్మారావుగారి అధ్యక్షతన నిర్వహించిన ఓ సభలో 1938, ఆగస్టు 19 న ఓలేటి వేంకట రామశాస్త్రిగారు చేసిన 'మాతృభాషాసేవ' అనే ఉపన్యాసాన్ని 'ఆంధ్రి' ఆ తరువాత సంచికల్లో ధారావాహికగా ప్రచురించింది. వేంకటరామశాస్త్రిగారి కుమారులు ఓలేటి వెంకట చలపతిరావుగారు 'ఆంధ్రి' ప్రచురణను తమ వి.ఎమ్.ఆర్.ప్రెస్‌లోనే కొనసాగించారు.

'ఆంధ్రి'లో కనబడే ఏకైక కవయిత్రి శ్రీమతి ఉభయ భారతి. ఫిబ్రవరి '1941 సంచికలో 'బొమ్మరిల్లు' అనే కవితాఖండిక ప్రచురితమైంది. అది పెట్టుడు పేరేమో అని వేరొక సందర్భంలో సంపాదకులే వ్యాఖ్యానించడమూ కానవస్తుంది. 'ఆంధ్రి'లో కాకినాడ పి.ఆర్.కళాశాలలో జరిగిన ఆంధ్రాభ్యుదయోత్సవాల గురించిన నివేదికా, అలాగే సంపాదకులు మధునాపంతులవారే స్వయంగా చేసిన కొన్ని పుస్తక సమీక్షలూ పేర్కొనదగినవి. సూర్యారాయాంధ్ర నిఘంటువు నిర్మాణంలో 'ఆంధ్రీ'మయమూర్తి పాత్ర కూడా వుంది. 1940 జనవరి 1 న పానుగంటి లక్ష్మీనరసింహారావు, 9 ఫిబ్రవరి 1941 న జయంతి రామయ్య పంతులుగారు కాలధర్మం చెందినపుడు 'ఆంధ్రి'లో మధునాపంతులవారు సంపాదకులుగా నివాళి ఘటించారు.

'ఆంధ్రి'కి నాటి మహామహులైన ఎందరెందరో సాహితీదిగ్దంతులు ప్రశంసలందించారు. అభిమానించారు. తమ రచనలతో పరిపుష్టంచేశారు. నవ్యభావ ప్రభావంతో వెలయు గ్రామ వాతావరణంలో 'ఆంధ్రి' ఉదయించింది. విశ్వనాథవారు మధునాపంతుల వారికి లేఖరాస్తూ " మీరు స్థాపించిన ఆంధ్రీకుటీరము వంటివి ప్రతి పల్లెటూరున వెలసిననాఁడు భాషకు విముక్తి. రసజ్ఞత మీ యూరిలో వెదచల్లుట మీ బాధ్యత. మీరు తలపెట్టిన పనికి నా అభినందనములు, నా సానుభూతియు" అని కొనియాడారు. పల్లిపాలెము కేంద్రంగావున్న 'ఆంధ్రీ' కార్యాలయ చిరునామా 1941లో పిఠాపురంకు మారింది. ముప్పైఆరు సంచికలతోనే 'ఆంధ్రి' పత్రిక ముద్రణ ముగిసిపోయింది. తదనంతర కాలంలో మధునాపంతులవారు రాజమండ్రికి తరలిపోయారు.

కవిగా, రచయితగా తనదైన రచనలతో 'ఆంధ్ర కల్హణ'గా, 'సాహితీ సమ్రాట్ట్'గా ఖ్యాతిపొందారు. 1968 లో 'ఆంధ్ర పురాణము'కు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు

లభించింది. 1982 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ'తో గౌరవించింది. రత్నపాంచాలిక (1943), షడ్దర్శనసంగ్రహం (1942), సూర్యసప్తతి (1943), ధన్వంతరి చరిత్ర (1945), రత్నావళి (1947), ఆంధ్ర రచయితలు (1950), బోధివృక్షం (1951), ఆంధ్ర పురాణం (1954), చరిత్ర ధన్యులు (1955), కళ్యాణతార (1956), స్వప్నవాసవదత్త (1956), శ్రీ ఖడ్గం (1968), తెలుగులో రామాయణాలు (1975), చైత్రరథం (1976), సదాశివ పంచశత (1977), కేళాకూళి, జీవనరేఖలు–సాహితీ రేఖలు, మధుజీవనము, మధుకోశము, మధునాపంతుల సాహిత్యవ్యాసాలు, ప్రసంగతరంగిణి వంటి అమూల్య గ్రంథాలను తెలుగుజాతికి అందించిన మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు అమలాపురం తాలూకా ఐలెండ్‌పోలవరంలో 1920 మార్చి 5 న ప్రభవించి, 1992 నవంబర్ 7 న రాజమండ్రిలో కాలధర్మం చెందారు. ఆ శతజయంతి సాహితీమూర్తికి వినమ్ర నివాళులు. ✻

**(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 2 మార్చి'2020)**




# సుధామ పరిచయం

| | | |
|---|---|---|
| **అసలు పేరు** | : | **అల్లంరాజు వెంకటరావు** |
| **జననం** | : | 25-11-1951 విశాఖ జిల్లా అనకాపల్లి పట్టణంలో |
| **తల్లిదండ్రులు** | : | కీ॥శే॥ అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మ<br>కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు |
| **విద్యాభ్యాసం** | : | ఒకటో తరగతి నుండి ఎం.ఓ.యల్, ఎం.ఫిల్ వరకు హైదరాబాద్‌లోనే. కేశవ మెమోరియల్ పాఠశాల, మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల, వివేకవర్ధనీ కళాశాల, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల్లో. |

**వృత్తి ఉద్యోగాలు** : 1975–1977 బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల కరీంనగర్ తెలుగు లెక్చరర్‌గా.

1978లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధ భారతి) ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా చేరిక.

1990 లో ప్రోగ్రామ్ ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతి, విజయవాడ, వరంగల్, హైదరాబాద్ కేంద్రాలలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసి, 2008 లో ఆకాశవాణి వివిధ భారతి వాణిజ్యప్రసార విభాగం నుండి స్వచ్ఛంద పదవీ విరమణ, అనంతరం బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఏ (తెలుగు) ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ కౌన్సిలర్‌గా కొన్నాళ్లున్నారు.

**అభిరుచులు** : కవిగా, సమీక్షకునిగా, రచయితగా, కార్టూనిస్టుగా, చిత్రకారునిగా, సినీ విశ్లేషకునిగా, కాలమిస్టుగా, వక్తగా, పదబంధ ప్రహేళికల వంటి వివిధ పజిల్స్ నిర్మాతగా, సాహితీవేత్తగా తెలుగు పాఠకలోకానికి, సాహితీలోకానికి పరిచితులు. రేడియో'వాడి'గా శ్రోతలకు పరిచితులు.

**ముద్రిత గ్రంథాలు** : **<u>కవితా సంపుటాలు</u>**

అగ్నిసుధ – 1990

మనసు పావనగంగ – 2010

చిత్రగ్రంథి – 2011

కవికాలమ్ – 2011

**<u>వ్యాస సంపుటాలు</u>**

సందర్భ – 2020

కాలం వెంట కలం – 2020

**<u>కాలమ్ వ్యాసాలు :</u>**

(ఆంధ్రభూమి, మన తెలంగాణ, విజయక్రాంతి దినపత్రికల కాలమిస్ట్‌గా వెలువరించినవి)

సం.సా.రా.లు – 2001 (సంస్కృతి–సాహిత్యం–రాజకీయాలు)

మన తెలంగాణ (సుధామయోక్తి) – 2018
వ‘సుధా(స)మ’యం – 2019

<u>**ఇతరాలు**</u>
పూతరేకులు (జోక్స్‌బాక్స్) – 2012
రామాయణ పథం (ప్రశ్నోత్తరమాలిక–పజిల్స్) 2018
భూమిక (సుధామ పీఠికలు–ముందుమాటలు) 2018
మాటాట (గళ్ళ నుడికట్టు) – 2019
తెలుగు సొగసులు (విద్యార్థి యువతకై పరిచయవ్యాసాలు)
యువభారతి ప్రచురణ – 2020

**అవార్డులు, సన్మానాలు** : ‘అగ్నిసుధ’ సంపుటానికి కలహంసి, ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, ‘సం.సా.రా.లు’ గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం 2014 సాహితీ పురస్కారం, వంశీ ఇంటర్నేషనల్, జోత్స్నకళాపీఠం, తేజఆర్ట్స్ కవితాపురస్కారం, మునిమాణిక్యం హాస్యనిధి పురస్కారం, నోరి నరసింహశాస్త్రి ఛారిటబుల్ ట్రస్ట్, దివాకర్ల సాహిత్య పీఠం వారి ఆచార్య దివాకర్ల వేంకటావధాని సాహిత్య పురస్కారం, ఆచార్య తిరుమల స్మారక సాహిత్య పురస్కారం, పింగళి జగన్నాథరావు స్మృతిసాహిత్య పురస్కారం, తురగా కృష్ణమోహనరావ్ హాస్య పురస్కారం, తిరుమల శ్రీనివాసాచార్య, స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం, నవ్య సాహితీసమితి ఉగాది భాషాసేవా పురస్కారం, చేతన మాసపత్రిక, సృజనప్రియ మాసపత్రికల వార్షిక సన్మాన పురస్కారం, లేఖిని సంస్థ పురస్కారం, పోలవరం వెంకట సుబ్బమ్మ సాహితీ పురస్కారం, నెల్లూరు శ్రీమతి గుర్రాల రమణమ్మ సాహితీపురస్కారం, యువ కళావాహిని వారి శ్రీ వివేకానంద సాహిత్య ప్రతిభా పురస్కారం, ఖర్గపూర్, బెంగళూర్ తెలుగు సాహితీ సంస్థలచే, ప్రపంచ తెలుగు మహాసభలు, తానా, ఆటా హైదరాబాద్ సభల్లో, అ.జో.వి.భొ, కందాళై ఫౌండేషన్ ప్రతిభా పురస్కార సభలో, కృష్ణా జిల్లా రచయితల సంఘం వారి సన్మానాలు మొదలైనవి.

**1983లోనే ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి తెలుగు కవిగా ఎంపికయి జాతీయకవిగా పేరొందారు.**

**ప్రస్తుతం** : యువభారతి సంస్థ ప్రచురణల ప్రధాన సంపాదకులు.

'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్' మాసపత్రికలో 'సీ'నియర్ కబుర్లు' కాలమ్ నిర్వహణ. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా ప్రస్థానం.

**జీవన సహచరి** : శ్రీమతి అల్లంరాజు (సూకూరు) ఉషారాణి

**కుమారుడు** : చి॥ అల్లంరాజు స్నేహిత్

**కోడలు** : చి॥సౌ॥ అల్లంరాజు (దువ్వూరి) లక్ష్మీస్రవంతి.

Sandarbha (Vyaasa Samputi)

***by Sudhama***



# సుధామ ముద్రిత గ్రంథాలు








































